# శ్రీ నిత్యానందస్వామి శ్రీ ప్రకాశనందస్వామి వార్ల మధ్య జరిగిన వార్తాలాపము

## (ఆంధ్రానువాదము)



## ద్వితీయ భాగము

కాపీలు కావలసిన వారు
వీరికి వ్రాయండి:
శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్
గొలగమూడి (పోస్ట్)
(వయా)సర్వేపల్లి
నెల్లూరు జిల్లా, ఆం.ప్ర.
524321

# విషయ సూచిక

i

**ఇరువదవ ప్రసంగము** **966**

సంతుల లక్షణము 967
సంసార మోహమునుండి విముక్తి నొందు మార్గము 969
బుద్ధభగవానుని చరిత్రము 970
మానవుని కర్తవ్యము 983
ప్రపంచము స్వార్థముతో కూడినది 984
యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి చెప్పిన మాటలు 991
బాల్యసంస్కారముల విలువ 1004
రాణీ మదాలస దృష్టాంతము 1005
తరతి శోకమాత్మవిత్ 1007
ఋణత్రయమపాకృత్య మనో మోక్షే నివేశయేత్ 1009
శాస్త్రాధ్యయనము 1013
ప్రాణులయందు దయ 1017
రంతి దేవుని కథ 1018
**ఇరువదొకటవ ప్రసంగము 1031**

# విషయ సూచిక


మోహ బుద్ధి పోయినచో దుమ్ము రాజభవనము
సమానముగా తోచును 1032

త్యాగమూర్తి మస్తరామ్ మహారాజావారు 1034

మస్తరామ్ మహరాజ్ గారి వినోదము 1035

మస్తరామ్ మహారాజ్ నిష్కామి 1037

సన్యాసికిగాని బ్రాహ్మణునకుగాని ప్రతిగ్రహము
నిషిద్ధము 1038

విద్వాంసులగు సన్యాసుల విపరీత-ఆచరణము 1043

ఆచార్యులకు ధనము నిషిద్ధము 1045

శంకరాచార్య భగవత్పాదుల ఆచరణము
సన్యాసులకు గౌరవము నిచ్చునది 1046

సత్పురుషుల సాత్త్విక సంపదకును, రాజుల రాజస
సంపదకును మధ్య కల భేదము 1049

అతి పరిచయము వలన అగౌరవము 1052

జ్ఞానమును పొందు శ్రద్ధావంతుడగు జిజ్ఞాసువు 1054

జ్ఞాన భేదములు 1055

రజోగుణముచే అనర్థకరమగు లోభము పుట్టును
1059

ప్రమాదము మృత్యువు వంటిది 1060

| | |
|---|---|
| మోహము మద్యము వంటిది | 1062 |
| అజ్ఞానము సర్వదుఃఖములకును కారణము | 1065 |
| మాయ సర్వభక్షిణి | 1067 |
| పంచదశియందలి మనన లక్షణము | 1075 |
| నిదిధ్యాసనము | 1078 |
| ఆత్మా వారే ద్రష్టవ్యః | 1080 |
| పుణ్యపావనుల వృత్తాంతము | 1085 |
| మహాత్ముల హృదయము | 1105 |
| **ఇరువది రెండవ ప్రసంగము** | **1109** |

# విషయ సూచిక


| | |
|---|---|
| శ్రీ ప్రకాశానంద స్వామివారి వినోదము | 1110 |
| గృహస్థాశ్రమ ప్రాధాన్యము | 1112 |
| ద్వైతాద్వైతముల వినోదము | 1121 |
| ప్రచారములో ఉన్న మతములు | 1123 |
| పాండిత్య దురభిమానము | 1126 |
| సచ్చిదానంద రూపము | 1129 |
| సత్య స్వరూపమగు పరబ్రహ్మము | 1131 |
| అభేదమును బోధించు శ్రుతులు | 1131 |
| అద్వైతము రాజమార్గము | 1133 |
| దైవసంపదను పొందుటచే ముక్తి కలుగును | 1153 |
| ఏడు అజ్ఞాన భూమికలు | 1163 |
| ఏడు జ్ఞాన భూమికలు | 1167 |
| తరతి శోకమాత్మవిత్ | 1169 |
| **ఇరువది మూడవ ప్రసంగము** | **1180** |

మలిన వాసనా భేదములు 1182
లోక వాసన 1183
శాస్త్ర వాసన 1186
దేహవాసన 1190
దేహవాసనా నివృత్తికి ఉపాయము 1193
తత్త్వజ్ఞానము, వాసనాక్షయము
అన్యోన్యాశ్రయములు 1197
తత్త్వజ్ఞానము, మనోనాశము, వాసనాక్షయము- ఈ
మూడును ఒకే సమయమున సిద్ధించును 1212
భర్తృహరి మహారాజుగారి ఆదర్శ త్యాగము
పింగళామహాదేవి ఆదర్శ పాతివ్రత్యము 1237
సంస్కృతి అను ప్రపంచ జాలము సంకల్పముచే
జనించినది. 1244
సద్గతిని సహగమనము చేయు వనిత పొందునా?
వైధవ్యముతో జీవితము గడపునది పొందునా? 1247
మీరాబాయి పరమాత్మయందు గల భర్తృభావము
1249
గౌరాంగుడు ఉచ్ఛిష్టాన్నమును ప్రేమతో భుజించెను
1256

## విషయ సూచిక

ఇరువది నాలుగవ ప్రసంగము 1276

జీవిత నిర్వహణ సాధనమునకును
అంతఃకరణమునకును గల సంబంధము 1280
రెండవరకపు వృత్తి 1284
చేసినది అనుభవించవలెను 1287
నిష్కామ కర్మచే కూడ అంతఃకరణము శుద్ధిని
పొందును 1291
ఆరు నిత్య కర్మల వలనను కలుగు ఫలము 1293
అతిథి సత్కారము 1298
సంధ్యా వందన విధి 1300
సదాచారము ఆవశ్యకము 1302
అహింసా స్వరూపము 1306
హింస 1308
సత్యము 1311
శౌచము 1316
క్షాన్త్యా శుధ్యన్తి విద్వాంసః 1317
దానేనాఽకార్యకారిణః 1318
ప్రచ్ఛన్న పాపా జాప్యేన 1319
దయ 1320
ఆస్తికత్వము 1323

# విషయ సూచిక


| | |
|---|---|
| సత్సాంగత్యము | 1325 |
| పశ్చాతాపమునకు కారణములు | 1326 |
| జీవ స్వభావము | 1331 |
| **ఇరువది ఐదవ ప్రసంగము** | **1343** |
| గృహస్థాశ్రమము | 1343 |
| అకులీనమగు కులము | 1348 |
| భార్య భర్తల ఆదర్శము | 1354 |
| భార్యా భర్తల ధర్మము | 1357 |
| బాలికలకు చెప్పదగిన చదువు | 1369 |
| శుశ్రూషా బ్రహ్మచారిణామ్ | 1392 |
| **ఇరువది ఆఱవ ప్రసంగము** | **1402** |

దేవుని అస్థిత్వము 1402
సృష్టి కర్త ఉండవలెను 1404
సృష్టికార్యమును చేసినవాడు సర్వజ్ఞుడును, సర్వశక్తి
మంతుడును అగు చైతన్య స్వరూపుడు 1405
వైజ్ఞానికుల దృష్టిలో జగత్తుకు ఉపాదాన కారణము
పరమాణువు 1405
మధ్యవర్తియగు తటస్థ స్వభావము 1406
సమిష్టి స్వభావరూపుడు సృష్టికర్త 1407
“సత్” అను నియామక స్వభావమే ఆ సృష్టికర్త 1409
సచ్చిదానంద స్వరూపమును, సర్వస్వభావ
నియామకమును అగు స్వభావమే పరమేశ్వరుడు
1410
సృష్టి అను కార్యమునకు కర్త ఉండవలెను 1411
అనుమాన ప్రమాణము చే కూడ దేవుడు ఋజువు అగును
1413
అయోజనత్వము 1414
ధృతి మత్త్వము 1415
ఈశ్వరప్రోక్తమగు వేదముచే కూడ దేవుడు ఋజువు
చేయబడును 1416

# విషయ సూచిక


జీవుని అస్తిత్వము 1418

నచికేతుని ప్రశ్న – మృత్యువు తరువాత ఆత్మ ఏమగును? 1419

జీవ తత్వజ్ఞానము కడు సూక్ష్మము 1420

ఆత్మ తత్త్వము అపూర్వము 1421

చైతన్యరహితమగు దేహము పుట్టుట 1423

జీవుని స్వరూపము 1433

జీవాత్మ అతి సూక్ష్మము 1433

అతి సూక్ష్మగు జీవుని సామర్థ్యము 1434

జనక యాజ్ఞవల్క్యుల కథ 1436

స్వప్నావస్థ యందు కూడ ఆత్మ జ్యోతి రూపమున ప్రేరేపించును 1441

ఈ లోకము నందు పరలోకము నందును కూడ ఆత్మ స్వయం జ్యోతియగు ప్రేరకము 1443

విమోక్షము ఎట్లు కలుగును 1452

ఆత్మ నిత్య శుద్ధ, బుద్ధ, ముక్తము 1453

ఆత్మ నిర్లిప్తము 1457

సర్వాత్మ భావము ఆత్మ యొక్క పరమ లోకము 1462

**ఇరువది ఏడవ ప్రసంగము 1471**

# వార్తాలాపము


దేవుని స్వరూపము 1471

సగుణ బ్రహ్మము 1471

నిర్గుణ బ్రహ్మము 1475

నిర్గుణబ్రహ్మము సచ్చిదానంద స్వరూపము 1476

"సత్" మొదలగు పదముల సార్ధక్యము 1478

వాచార మ్భణం వికారో నామధేయం మృత్తికే త్యేవ సత్యమ్ 1480

ఇది అంతయు దేవునిచే నిండియున్నది 1481

నిర్గుణ బ్రహ్మము పర బ్రహ్మము 1483

మనో వాగ్విషయము కాని నిర్గుణబ్రహ్మము 1486

నిర్గుణ బ్రహ్మము ఉపాసనచే లభించును 1486

నిర్గుణ బ్రహ్మముయొక్క అభేదోపాసనము లేక అహంగ్రహ ధ్యానము 1488

ప్రణవముద్వారా అభేదోపాసనము 1489

ప్రణవాభేదముగా చేయబడు నిర్గుణ బ్రహ్మ చింతనము 1490

పంచాయతనోపాసన ప్రతీకోపాసన 1492

వేదోక్త మగు ఆధ్యాత్మ, అధిదేవోపాసనలు 1494

పురాణోక్తమగు ప్రతీకోపాసన 1495

## విషయ సూచిక


జనుల బుద్ధి స్థూలమగుటకు కారణము ఏమి? 1496

విజ్ఞాన బుద్ధికిని ఆధ్యాత్మ విద్యా బుద్ధికిని భేదము కలదు 1497

జనుల బుద్ధి స్థూలత్వమును పొందుటకు కారణము 1498

యావత్ జీవేద్ అగ్నిహోత్రం జుహ్యాత్ 1503

అభిరుచి ననుసరించి ఉపాసన 1504

సగుణ నిర్గుణ బ్రహ్మోపాసనాధికారము 1516

ప్రేమ లేని ప్రతీకోపాసన నిరర్థకము 1519

ప్రేమచే అంతఃకరణము సత్త్వ ప్రధానమగును 1520

వస్తు వివేకముచే వైరాగ్యము కలుగును 1521

సిద్ధార్థుని వివేకము 1522

వైరాగ్యము 1524

తపము 1526

**ఇరువది ఎనిమిదవ ప్రసంగము 1528**

జ్ఞానమును పొందుటకు గురువు అవసరము 1528
సత్యోపదేశము 1542
ఆచార్య లక్షణము 1551
యజ్ఞోపవీత రహస్యము 1561
జపించదగిన శ్రేష్ఠ మంత్రము 1572
ప్రణవ మంత్రాధికారము 1573
సోఽహమ్ 1574
“సోఽహమ్” జప విధి 1575
బ్రహ్మ స్థితి యందున్న వానికి భయమెందుకు? 1580
సంతుల లక్షణము 1582
**ఇరువది తొమ్మిదవ ప్రసంగము 1585**

# విషయ సూచిక

ఒకని పై శ్రద్ధ యుంచి కర్తవ్యములను
నిర్వహింపుము 1585
సరిగా తెలిసికొనుట అనగా నేమి ? 1589
మహాత్ముల శీలము 1592
రామ్ జీ భాయి భాగవతము చదివి వైరాగ్యమును
పొందెను 1595
పవిత్రత 1597
తనను దర్శించుట యందలి మహత్త్వము 1605
ఆత్మను వివరముగా తెలిసికొనవలెను 1606
ఆత్మవిద్య తెలిసికొనగోరిన అసురులు 1607
ఆత్మ అనగా బ్రహ్మము యొక్క యథార్థ స్వరూపము
1609
మిథ్యా భాషిత్వ దోషమును పొందకుండ 'అవును'
అనిన దాని యందలి 'అవును' ను నేర్పు పద్ధతి 1611
ఉదశరావము నందు ఆత్మను చూడుడు 1615
అనాత్మ నుండి ఆత్మ నిశ్చయమును తప్పించు యుక్తి
1617
సాత్విక వృత్తి కల వారి తెలివి 1621
ప్రతి బంధ నివృత్తికి బ్రహ్మచర్యము 1626

స్వప్నాత్మ బ్రహ్మము కాదు 1627
సుషుప్త్యాత్మ బ్రహ్మము కాదు 1630
బ్రహ్మ విద్యా ప్రాప్తికి 101 సంవత్సరములు
బ్రహ్మచర్యమును ఆచరించవలెను 1632
101 సంవత్సరములు అనగా అర్థము 1633
ఆత్మకు భోగాధిష్ఠానమగు శరీరము 1640
వసుదేవ పరాయణులగు వైష్ణవులు 1643
సంతోష మహాత్మ్యము 1646
సంతోష లక్షణము 1646
కామమును బలహీనపరచు నుపాయము 1652
ధర్మ వాసనను పెంచుట 1653
తృష్ణ లేని నిర్ధనత్వము 1654
నిర్ధనుని మహత్వము 1655
భక్తికి త్యాగము ఆవశ్యకము 1658
జ్ఞానమునకు భక్తి వైరాగ్యములు కావలెను 1658
శరీర రక్షణమునకు మూడు పదార్థములు ముఖ్యము 1661
శరీర స్వరూపము 1664
వైరాగ్యమును పొందుటకు సాధనములు 1666

# విషయ సూచిక


**ముప్పదియవ ప్రసంగము 1672**

సహవాసముచే యథార్థము గ్రహించనగును 1674

వైరాగ్య భేదములు 1683

జీవేశ్వరాఽద్వైతము 1688

తత్త్వోపదేశముచే జ్ఞానోపలబ్ధి 1699

ఏకాంత మహాత్మ్యము 1706

సాంగత్యముచే కలుగు లాభములు 1717

దంభముతో కూడిన వైరాగ్యమును, తపమును 1723

దృష్టి మూడు రకములు 1732

**ముప్పది యొకటవ ప్రసంగము 1754**

సన్యాసులు పూర్వము-ఇప్పుడు 1754

బుద్ధ భగవానుడు 1758

అధికారమునను సరించి వస్తువును గ్రహించవలెను 1763

మహాపుణ్యాత్ములగు రాజులకు మాత్రమే మృత్యువు 1777

స్వామివారి నిష్కామత్వము 1805

నిష్కామియగు ఫజల్ 1806

**ముప్పది రెండవ ప్రసంగము 1814**

జీవ బ్రహ్మైక్య భేదము 1814
సామాన్యులకు సులభమగునది భక్తి 1819
గౌణి 1821
నవ విధ భక్తులు 1825
రాజస విగ్రహము 1832
గీతా పండితుని ఆస్తిక్యబుద్ధి 1837
ఫకీరుని ఆస్తిక్య బుద్ధి 1842
క్రీస్తు ఆస్తిక్య బుద్ధి 1847
సర్వాత్మ భావ విచారము 1849
భేద బుద్ధి మహా పాపము 1852
అర్థము లేని మత భేదములు 1854
బుద్ధిమంతుడగు ధర్మాత్మునికి ధనము ఉన్నచో 1875
ఔదార్యముచే కలుగు లాభములు 1877
కృపణత్వమునకు కారణములు, 1881
ధనము అను సర్పమును ఆడించుటకు5
మంత్రములు 1882
**ముప్పది మూడవ ప్రసంగము 1885**

# విషయ సూచిక

లోక ప్రమాణము 1887
లోసమాన్యుడగు భక్తుడు 1889
సత్యమే ధర్మము 1891
శ్రోతలలో భేదములు 1896
ఉపదేశములను వినుటలో నేడు కన్పించు గ్రుడ్డి నమ్మకము 1902
అనాదియగు సంస్కారము- విషయ వాంఛల ప్రాబల్యము 1907
అవిద్యా భేదములు 1910
మోహమును జయించిన వైరాగ్యము జనించును 1914
వైరాగ్య భేదములు 1916
సత్త్వ గుణ భేదములు 1919
యోగ ప్రాప్తి 1919
అహం గ్రహోపాసన 1920
సమాధి భేదములు 1922
యోగమును సాధించుటలో అభ్యంతరకరములగు 1924
యోగాభ్యాసము నిరంతరము చేయవలెను 1929

సగుణ నిర్గుణ బ్రహ్మ ధ్యానము 1931

సరియగు అభ్యాస పద్ధతి 1933

మోక్షమను కోటను జయించు పద్ధతి 1934

**ముప్పది నాలుగవ ప్రసంగము 1948**

# విషయ సూచిక


వ్యసనము – బానిసత్వము 1948

అసుర గుణములు 1949

అసుర గుణ పరంపర 1952

దంభముచే ధర్మము చెడును 1968

ధర్మ భంగముతోపాటు వ్రతభంగము 1969

కలి కాలపు తత్త్వ వేత్తలు 1970

వ్రత భంగము 1974

మదాంధుని ప్రవర్తన 1979

అసుర సంపద 1982

కామ త్యాగముచే బ్రహ్మ సిద్ధి 1985

కామమును నశింపజేయు ఉపాయము 1989

పదార్థముల యందలి రమణీయ బుద్ధిని త్యజించుట 1990

విషయ పదార్థములు అనర్థమును కలుగజేయును 1992

శాస్త్రవిధి నిషేధములను అనుసరించి ప్రవర్తించవలెను 1993

శ్రేయః ప్రేయములు 1997

**ముప్పది ఐదవ ప్రసంగము 2002**

జీవన్ముక్తుని విదేహముక్తి 2004

(ఓం శాన్తిః, శాన్తిః, శాన్తిః) 2014

**ఉప సంహారము 2015**

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః|| 2032

ఓం శాంతిః శాంతిః శాంతిః|| 2033

ఓం

## శ్రీ నిత్యానంద స్వామి, శ్రీ ప్రకాశానంద స్వామి వార్ల మధ్య జరిగిన వార్తాలాపము

# ఇరువదవ ప్రసంగము

శ్రీ ప్రకాశానంద స్వామివారు, మోహన్ భాయి, కాళాభాయీ, లల్లుభాయి మొదలగు వారందరు జూనాగడ్ లో నుండిరి. అచ్చట నుండి వారు పీఠడియా వెళ్ళి శ్రీ నిత్యానంద స్వామివారిని కలసికొనిరి. కుశల ప్రశ్నల తర్వాత శ్రీ నిత్యానంద స్వామివారు కాళాభాయిని అడిగిరి. "సుఖముగా నున్నారా?" కాళాభాయి చెప్పెను:- "తమ దయ వలన సుఖముగానే ఉన్నాను. మూడు నాల్గురోజులనుండి మనస్సులో ఇచ్చటికి రావలయునని తోచినది. కాని బద్ధకముచే రాలేక పోయితిని. కాని నేడు శ్రీ ప్రకాశానంద స్వామి వారు వచ్చుచున్నందున వారిని వెంబడించితిని." శ్రీనిత్యానందుల వారు

పలికిరి.

"మీ శరీరము వార్ధక్యమును పొందినది. మూడు, నాలుగు మైళ్ళు దూరము ఉన్నది. అందుచే వచ్చుట కష్టము."

కాళా:-"కష్టమే కానిండు. కాని సంతులతో సమాగమము అక్కడ ఎట్లు దొరుకును?"

## సంతుల లక్షణము

స్వా.ని. :- "ఊపజే సమావే సంత్. జాకు ఉపజే నహి సో తో భగవంత్..." రాగద్వేషాదులు మనస్సునందు ఉత్పన్నమయినను వానిని శమింప జేసికొనువారు సంతులు. రాగ ద్వేషాదులు జనించనే జనించనివారు భగవంతుడు మాత్రమే." ఇంకను నాయందు రాగ ద్వేషాదులు శమింపజేసికొను శక్తి లేదు. ముందుమాట ఏమి చెప్పను?.

స్వా. ప్ర.:-సంతులు ఎల్ల వేళలయందును మేము సంతులమని వాదించరు. ఈ విషయమున తుకారాము వాక్యములు వినవచ్చును.

"ఈ 'సంతు' అను పెద్ద బిరుదు నాకు శోభించదు. నాకు అది ఎరువు సొమ్మే. నేను మీ అందరి చరణములయందలి రజముతోను సమానుడను. సంతులగు మీ చరణములయందలి పాదరక్షను. నాకు నా శరీరము నశ్వరమను సంగతి తెలియదు. ఇతరులను చూచి భజన చేయుచున్నాను. క్షర మేదియో, అక్షర మేదియో కూడ నాకు తెలియదు. మహాశూన్యము అసలే తెలియదు. ఆత్మానాత్మ వివేకము లేదు. తుకారాము అంటే ఏమిటి? ఏమియును కాదు. తమ చరణములయందు నా తలను ఉంచు అధికారము నాకు ఉన్నదని మాత్రము నేను ఎరుగుదును. కావున 'సంతు' అను పేరుతో నన్ను అలంకరించవద్దు నేను దానికి అర్హుడను కాను."

భోజనాదుల అనంతరము రాత్రి అందరును కూర్చునియుండ డా||లల్లూ భాయి స్వామి శ్రీ ప్రకాశానందుల వారిని ప్రశ్నించెను.

"సంసార మోహము నుండి

బయటపడుటకు ప్రయత్నించుచునే ఉన్నాను. అయినను విముక్తి కలుగుట లేదు. ఎట్లు మోహజాలము నుండి బయటకు రాగలరు?”

## సంసార మోహమునుండి విముక్తి నొందు మార్గము

ప్రకాశానంద స్వామివారు నిత్యానంద స్వామివారితో పలికిరి. “తమరే సెలవివ్వండి. నేను కూడా వినవలెనని కుతూహలముతో నున్నాను.

శ్రీ నిత్యానంద స్వామి వారు పలికెను:-

భగవానుడు గీతయందు సూచించెను:-

***ఇన్ద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవ చ / జన్మమృత్యు జరావ్యాధి దుఃఖదోషాను దర్శనమ్//***

“ఇంద్రియార్థములయందు వైరాగ్యము, అహంకారము లేకపోవుట జన్మ, జరా, మృత్యు, వ్యాధి, దుఃఖములను గురించి తరచు విచారము

సలుపుట- వీనిచే ఆవిద్యాబంధము నుండి ముక్తి కలుగును. బుద్ధభగవానుడు ఇట్లు జన్మ, జరా, వ్యాధి, మృత్యువు మొదలగు వానిని చూచి విచారించి మోహజాలమునుండి విడబడి మహత్తమమగు పదవిని పొందెను.

# బుద్ధభగవానుని చరిత్రము

బుద్ధ భగవానుడు క్రీస్తుకు 600 సం|| దాదాపు పూర్వము కపిలవస్తు నగరమున శుద్ధోధనుడను రాజునకు జన్మించెను. శుద్ధోదనునకు ఇద్దరు రాణులు. ఒకామె పేరు మాయాదేవి. రెండవ ఆమె పేరు గౌతమి. ఇరువురును అంజనుడను శాక్యుని కుమార్తెలు. మాయాదేవి ప్రసూతి సమయం సమీపించినందున పుట్టింటికి వెళ్ళుచుండగా మార్గమధ్యమునందలి 'లుంబి' వనమున పుత్రుడు

జన్మించెను. అతడే తరువాత బుద్ధభగవానుడను పేరుతో ప్రసిద్ధి పొందెను. ఆరంభమున ఆతనికి సిద్ధార్థుడను పేరు పెట్టిరి. శుద్ధోదనుడు కుమారుడు జన్మించెనను సంగతి తెలిసి, భార్యాబిడ్డలను ఇంటికి రప్పించి ఆతని జాతక చక్రమును వేయించెను. ఆ రాజ్యమున ఏడుగురు విద్వాంసులగు జ్యోతిష్కులు ఉండిరి. వారందరును "ఈ బిడ్డ మహాచక్రవర్తి అయిన అవును లేదా సన్యాసి అయి జగత్తును ఉద్ధరించనైన ఉద్ధరించును." అని చెప్పిరి. అసితుడను ఋషి చెప్పెను:-- "ఇతడు జగత్తును ఉద్ధరించును." రాజు కుమారుని విలాసజీవితమునకు అలవాటుపరచుటకు నిశ్చయంచెను. కుమారుడు ఉండుటకు శీతకాలమునకును, వర్షా కాలమునకును, వేసవికాలమునకును ఉపకరించు మూడు మేడలు కట్టించెను. ఋతువులను అనుసరించి అతడు ఆ మేడలలో ఉండవలెను. అంతియె కాని అతను బయటకు వెళ్లవలసిన అవసరము కలుగకూడదు.

ఈ ఏర్పాట్లువలన వనితల గాన వాద్యములలో సదా నిమగ్నుడయి రోజులు గడపెడివాడు.

కపిలవస్తునగరమున ప్రతి సంవత్సరము "ప్రమంగళోత్సవము" (భూవ్యవసాయారంభ మహోత్సవము) జరిగెడిది. రాణి సిద్ధార్థునితో కూడ వైభవముతో పొలములోనికి వెళ్లెను. అచ్చట ఒక జంబూ వృక్షముక్రింద సిద్ధార్థుడు ధ్యానస్థుడయ్యెను. రాజునకు ఈ సంగతి తెలిసి అక్కడకు వెళ్ళెను. సిద్ధార్థుడు ధ్యానమునుండి లేచిన తర్వాత ప్రేమతో తండ్రిని ఆలింగనము చేసికొనెను. అసితుని వాక్యములు సత్యము కానున్నవి అను అనుమానము తండ్రికి కలిగెను. కొన్ని రోజుల తర్వాత తండ్రి అతనికి యశోధర అను రూపవతియగు కన్యతో వివాహము చేసెను. సిద్ధార్థునకు ఆమె యందు మిక్కుటమగు ప్రేమ ఉండెను. వారికి ఒక కుమారుడు కలిగెను. ఆ బాలునికి 'రాహులు'-డను పేరు పెట్టిరి. సిద్ధార్థునికి బాధపడువాడు ఎవడును

కన్పించకుండ తండ్రి ఎంతయో జాగ్రత్త తీసికొనెను. ఆ వైభవోపేతమగు భవనములయందు నిత్యము ఉండుటకు సిద్ధార్థునకు విసుగుపుట్టి నగరమునందు సంచారము చేయుటకు తండ్రిగారి అనుమతి కోరెను. రాజు వెంటనే నగరమును అలంకరించమని ఆజ్ఞాపించెను. వీధులు కలియుచోట్ల గాన, వాద్యాదులు జరుపుటకు ఆజ్ఞలను ఇచ్చెను. ఎల్లచోట్లను ఆనందోత్సవములే కాని దుఃఖించువాడు నగరములో రాకుమారుని కండ్లపడరాదని విధించెను. సిద్ధార్థుడు రథము నందు కూర్చొని ఛన్నుడగు సారథితో బయలుదేరెను. ఆతడు నగరమునందంతట విలాస వైభవములనే చూచెను. అంతట నగరము బైటకు రథమును పోనిమ్మని ఛన్నునకు ఆజ్ఞాపించెను. నగరమును దాటుట తోడనే వార్ధక్యముతో నడుము వంగిపోయి కర్ర సహాయముతో మెల్ల మెల్లగా నడుచుచున్న వ్యక్తిని చూచెను. శరీరము శుష్కించి పోయెను. చర్మము

ముడుతలు పడిపోయెను. తల నెరసిపోయెను. సిద్ధార్థుడు ఛన్నుని ప్రశ్నించెను. "ఆ వెఱ్ఱి మనుష్యుడు అట్లు ఏల నడచుచున్నాడు?" "ఆ మనుష్యుడు వృద్ధుడయ్యెను. కావున అట్లు నడచుచున్నాడు. మానవులు ఎల్లరును రోజులు గడచిన కొలదియు అటులనే వృద్ధులగుదురు. వార్ధక్యముచే అశక్తులగుదురు." అని ఛన్నుడు బదులు చెప్పెను. సిద్ధార్థుడు దుఃఖించెను. అచటి నుండియే భవనమునకు మరలిపోయెను. కొన్ని రోజుల తరువాత మరల ఉద్యానములో తిరుగుటకు బయలుదేరెను. అచ్చట ఒక వ్యాధిగ్రస్థుని చూచి ఛన్నుని ప్రశ్నించెను. "ఈ మానవుడు వృద్ధుడు కాకపోయినను అశక్తుడుగా నున్నాడు. ఇందుకు కారణమేమి? అతని ముఖము తేజోహీనముగా నున్నది. ఎన్నియో ఉపవాసములు చేసినట్లు కన్పించుచున్నాడు."

ఛన్నుడు పలికెను. "ఇతడు వ్యాధిగ్రస్తుడు. వ్యాధి ఆక్రమించిన తరువాత అది మానవునకు

చేయు హానికి ఒక నియమము లేదు."

సిద్ధార్థుడు అచటనుండియే రథమును వెనుకకు మరలించెను. ఆతడు పలికెను:- "నేటి వరకు నాకు యౌవనమదము కలదు. నేటితో అది పోయినది. ఇక నాకు ఉద్యాన క్రీడలయందు ప్రీతి లేదు." మరల కొన్ని రోజుల తరువాత సంచారము చేయుచు సిద్ధార్థుడు ఒక శవమును చూచెను. ఆ వెనుక ఏడ్చుచు మొత్తుకొనుచు వెళ్ళు జనులను కూడ ఆతడు చూచెను. ఆతడు ఛన్నుని అడిగెను. "ఆ కోలాహల మేమి? అతనిని ఆ మనుష్యులు అట్లు ఎందుకు తీసికొని వెళ్ళుతున్నారు?"

ఛన్నుడు పలికెను:- "ఒక మనుష్యుని ప్రాణములు పోయినవి. ఆతని శవమును శ్మశానములో దహనము చేయుటకు తీసికొని వెళ్ళుచున్నారు. ఆతడు తిరిగి రాడు. కావున ఆతని బంధువులు, మిత్రులు మొదలగువారు అందరు దుఃఖించుచున్నారు. అందరును వెనుకముందులో ఈ దశను పొందుదురు."

సిద్ధార్థుడు రథమును వెనుకకు త్రిప్పించి భవనమునకు వచ్చెను. కాని చూచిన దృశ్యము అతని మనస్సున నాటు కొనిపోయెను. అటు తరువాత ఆతనికి విలాసముల యందు కోరిక పోయెను. పూర్తిగా ఏకాంతమును సేవించెను. సిద్ధార్థుడు ఇట్లు ఆలోచించెను.

వార్ధక్యమును గురించి ఆలోచించినచో తారుణ్యము నశించి పోవుచున్నది. వ్యాధిని గురించి ఆలోచించినచో బలమదము అణగిపోవుచున్నది. మృత్యువును గురించి ఆలోచించినచో ఆయుర్మదము నిర్మూలమగుచున్నది. ప్రపంచమునందలి మనుష్యులు నిర్జల ప్రదేశము నందలి మత్స్యములవలె తృష్ణతో గిలగిల కొట్టుకొనుచున్నారు. ఒకరిని మరియొకరు ఈర్ష్యతో చూచుచున్నారు. ఒకరిని మరొకరు ద్వేషించుచున్నారు. నాకున్న ఈ మదములు నశించుటతో నాకు ప్రపంచములో నుండు

యోగ్యత పోయినది. సిద్ధార్థుని మనస్సు మొట్ట మొదట సుఖములకు దూరమయ్యెను. మరియొక మారు ఉద్యానవనమున తిరుగుచుండగా కాషాయ వస్త్రమును ధరించిన ఒక శాంతమూర్తి కాన్పించెను. ఆతని గురించి అడుగగా ఛన్నుడు ఇట్లు చెప్పెను:- "అతడు ప్రపంచమును త్యజించెను. అతనిని భిక్షువు అందురు. అతడు ప్రాపంచిక దుఃఖములనుండి ముక్తిని పొందెను. అందుచే అతని ముఖము ప్రశాంతముగా నున్నది."

సిద్ధార్థుడు రథమునందు ఆసీనుడయి వెనుకకు మరలెను. రథము నెమ్మది నెమ్మదిగా నడచుచుండెను. ఆ సమయమున 'కృశగౌతమి' అను యువతి తన గుమ్మము వద్ద కూర్చునియుండెను. ఆమె రాకుమారుని చూచి పల్కెను. ఇట్టి కుమారుని కన్న తల్లిదండ్రులు అదృష్టవంతులు. ఇట్టి భర్త కలిగిన భార్యకూడ అదృష్టవంతురాలు. ఆ మాటలు సిద్ధార్థునకు వినిపించెను. ఆతడు తలచెను. "ఆ యువతి

మాటలు తప్పు. కామ, క్రోధ, మోహములను త్రేతాగ్నులు ఆరిపోయినవాడే యథార్థముగా అదృష్టవంతుడు. అతడే సుఖించును. నేడే నేను గృహమును పరిత్యజించి ఆత్యంతిక సుఖమును పొందు మార్గమును అన్వేషించి జనులకు ఎరుక పరచవలెను. ఆ యువతి ఆత్యంతిక సుఖమును జ్ఞాపకము చేసినది. అందుచే అమె నాకు గురువు వంటిది. కావున ఆమెను గురు దక్షిణము ఇవ్వవలెను." అట్లు తలచి ఆమెకు కంఠహారమును కానుకగా పంపెను. జరా, వ్యాధి, మృత్యువు మొదలగు దుఃఖములనుండి నుండి ముక్తిని పొందుటకు దారాపుత్రాదులును, దాసదాసీజనులును బంధముగా తోచినవి. ఈ బాధ అతనిని వేధించుచుండెను. భవనమునకు చేరుసరికి అతనిని వారవనితలు సమీపించిరి. వారి నృత్యానందములో సిద్ధార్థుడు నిద్రించెను. వారవనితలుకూడ నిద్రించిరి. అర్ధరాత్రి వేళ సిద్ధార్థుడు మేల్కొ నెను. శయ్యపై కూర్చుని

అలోచింపసాగెను. సిద్ధార్థుని హృదయమును జన్మ, మృత్యు, జరా వ్యాధుల ఆలోచనలు వేధించెను. అతని దృష్టి నాట్య కత్తెలవైపు వెళ్లెను. ఒకతె నిద్రలో పలవరించుచుండెను. మరియొకతె నోటి నుండి చొంగ కార్చుచుండెను. ఇంకొకతె పటపట కొరుకుచుండెను. మరియొకతెకు వస్త్రము శరీరముపై ఎటు ఉన్నదో అను ధ్యాసయే లేకుండెను."దేవ భామినుల వలె కన్పించు స్త్రీల నిజస్వరూపము ఇదియా" అని సిద్ధార్థుడు అనుకొనెను. నిద్ర ఒక చిన్నమృత్యువు. మృత్యువు తరువాత జరుగు పరిస్థితులను నిద్ర తెలుపును. "ఓ సౌందర్యమా! నీవు ఎంత క్షణభంగురమైన దానవు? ఇది నాకు స్పష్టముగా తోచుచున్నది. ఇంక నీవు నన్ను మోహములో చిక్కించుకొన లేవు."

సిద్ధార్థుడు శయ్యనుండి లేచి గుమ్మము చెంతకు వెళ్ళెను. తన విశ్వసనీయుడగు ఛన్నుని లేపి"కంథకము" అను అశ్వమును సిద్ధము చేయుమని ఆజ్ఞాపించెను. గుర్రము సిద్ధము

అయిన వెంటనే సిద్ధార్థుడు క్రిందికి దిగెను. ఇంతలో ఆతనికి యశోధర సంగతి జ్ఞాపకము వచ్చెను. అంతః పురములోనికి వెళ్ళి చూచెను. యశోధర, కుమారుడు ఇద్దరును నిద్రించుచుండిరి. వారిని మేల్కొల్పవలెనని తలచెను. మరల అ ఆలోచనను అణచి వేసి అంతఃపురము విడచి వెళ్ళిపోవుట యుక్తమని తోచెను. “నాకు జన్మము, జర, మృత్యువు, శోకము- ఈ నాలుగింటి నుండి ముక్తిని పొందుటకు, వలయు మార్గము తెలిసినచో యశోధరకును, కుమారునకును శుభము అగును. వారి మోహమున చిక్కుపడినచో మోక్షమార్గమున పెద్ద విఘ్నము కలుగును.” ఇట్లు ఆలోచించి ఆతడు అంతఃపురమునుండి బైటకు వచ్చెను. గురుపూర్ణిమ, అర్ధరాత్రి. అశ్వము మిక్కిలి బలము కలది. తానును, ఛన్నుడును అశ్వమును ఆరోహించిరి. అశ్వము వాయు వేగంతో పరుగెత్తెను. వారు మూడు

రాజ్యములను దాటి “అనోమా” నదీ మైదానమునకు చేరెను. సిద్ధార్థుడు అశ్వమును దిగి ఛన్నునకు అలంకారములు ఇచ్చి వెనుకకు మరలమని చెప్పెను. ఛన్నుడు చాల దుఃఖించెను. కాని సిద్ధార్థుడు ఆతనిని ఓదార్చి తండ్రికి ఇట్లు కబురు పంపెను.“రాజ్యము అను నశ్వర సుఖము తమ కుమారునకు సంతృప్తిని కలిగించలేదు. ఆతడు శాశ్వత సుఖమును అన్వేషించుటకు రాజభవనమును త్యజించెను. ఆ సుఖము లభించిన తరువాత తమ దర్శనమునకు తిరిగివచ్చును.” రాజభవనము విడచినప్పుడు ఆతని వయస్సు 28 సంవత్సరములు. సన్యాసము తీసికొనిన తరువాత ఏడు సంవత్సరములు ఆతడు అనేక ప్రదేశములయందుండి అనేక విధములగు సాధనలు చేసెను. అవి ఆతని సంతృప్తిపరచలేదు. ఆ రోజులలో వ్యాప్తి లోనున్న ఆత్యంతిక సుఖమార్గములు ఆతనికి సుఖము కల్గించునవిగా తోచనందున తాను స్వయముగా ఆత్యంతిక సుఖమార్గమును అన్వేషించసాగెను. అందు

సఫలడై యశస్సును పొందెను. ఆ కాలపు మార్గములను దగ్గర పెట్టి పరీక్షించి చూచిన ఆతని మార్గము మధ్యేమార్గముగా తోచెను. అందుకే ఆతడు తన మార్గమును మధ్యమ మార్గము అని ప్రచారము చేసెను. అతడు ద్వైతము, అద్వైతము, మాయ, బ్రహ్మము మొదలగు వానిని గురించి ఉపదేశించలేదు.

ఆతని ఉపదేశసారము ఈ క్రిందనీయబడుచున్నది :-

1. దుఃఖము కలదు. 2. దుఃఖమునకు కారణము కలదు. 3.దుఃఖమును పోగొట్టవలెను 4. దుఃఖమును పోగొట్టుటకు మార్గము కలదు. ఈ నాలుగును సత్యములు. అతడు దుఃఖమును పోగొట్టుటకు అష్టాంగమార్గములు చెప్పెను. 1. సమ్యక్దృష్టి. 2.సమ్యక్సంకల్పం 3.సమ్యక్ వాణి 4.సమ్యక్ కర్మ 5. సమ్యక్ ఆజీవిక 6 సమ్యక్

వ్యాయామము. 7.సమ్యక్ స్మృతి 8. సమ్యక్ సమాధి.

సిద్ధార్థుడు బుద్ధ భగవానుడు పేరుతో ప్రసిద్ధి పొందెను. బుద్ధభగవానునివలె జన్మ, జరా, వ్యాధి, మృత్యు శోకములను గురించి తరుచు విచారము చేసినచో సంసార పాశము నుండి విముక్తిని పొందవచ్చును.

## మానవుని కర్తవ్యము

డా|| లల్లూభాయి:- స్త్రీ పుత్రాదులను త్యజించుట అధర్మము కాదా?

స్వా. ప్ర. :-- మనుస్మృతి యందు చెప్పబడినది.

***వృద్ధౌతు మాతాపితరౌ భార్యా సాధ్వీ సుతః శిశుః|***
***అప్యకార్యశతం కృత్యా భర్త వ్యా మనుర బ్రవీత్ ||***

వృద్ధులగు తల్లిదండ్రులు, పతివ్రతయగు భార్య, శైశవా వస్థముందు ఉన్న కుమారుడు

వీరిని నూరు చెడుపనులు చేసి అయినను పోషించవలెను అని మనువు చెప్పెను."చెడు పనులు చేసి కుటుంబమును పెంచమని మాత్రము మనువు ఉద్దేశ్యము కాదు. వారిని పెంచుట కర్తవ్యము అనునది స్పష్టీకరించుటకు మాత్రమే "అకార్య" శబ్దమును ప్రయోగించెను.

కుటుంబ పోషణమునకు వలయు సాధనసంపత్తి ఉన్నవాడు సన్యసించినచో తప్పులేదు. కాని కుటుంబము పెంచు శక్తిలేక సన్యసించుట దోషము. పై మూడింటిలోను ఏ ఒక్క కారణము ఉన్నను సన్యసించరాదు.

## ప్రపంచము స్వార్థముతో కూడినది

స్వా. ప్ర. :-విచారించి చూచిన ప్రపంచమున ఎవరికి ఎవరును లేరు. స్వార్థము కొరకు అందరును ఏడ్చెదరు. ఈ దృష్టాంతము వినుడు.

# ఇరువదవ ప్రసంగము

23 సం|| ల యువకుడు ఒకడు ప్రతిరోజు సంతుసమాగమమునకు అరణ్యములో నివసించుచున్న మహాత్ముని వద్దకు వెళ్ళుచుండెడివాడు. ప్రతి దినము సాయంకాలమయిన తరువాత మహాత్ముని ఇంటికి వెళ్ళ ననుమతించమని ప్రార్థించెడివాడు. మహాత్ముడు సెలవిచ్చెడివాడు. ఒకరోజున మహాత్ముడు ఆతనిని ప్రశ్నించెను. "నీవు ప్రతిరోజు సాయంకాలము చీకటిపడిన తరువాత ఎందుకు వెళ్లిపోవుచున్నావు?"

ఆ యువకుడు చెప్పెను. " రాత్రిపూట సమయమునకు ఇంటికి వెళ్ళక పోయినచో ఇంటిలోని వారందరు చింతించెదరు." ఇది విని ఆ మహాత్ముడు నవ్వుచు ఇట్లనెను:-"నీ కొరకు చింతించుటకు నీవు ఏమైన చిన్న పిల్ల వాడవా!" ఆ యువకుడు బదులు చెప్పెను. "నా తల్లిదండ్రులును, భార్య మొదలగు కుటుంబములోని వారందరును నాయందు మిక్కిలి ప్రేమ కలవారు. కావుననే నేను ఆలస్యము

చేసినచో కంగారు పడెదరు.” అంతట మహాత్ముడు చెప్పెను:- “సోదరా! ప్రపంచమున ఎవరికి ఎవరును లేరు.” ఆయువకుడు ఇట్లనెను:- “ఆ విషయము ఇతర ప్రదేశముల యందు సత్యము. కాని నాయందు మాత్రము కాదు.”

మహా:- పరీక్షించెదవా?.

యువ:- చిత్తము.

మహాత్ముడు ఆ యువకునకు ఒక మాత్ర ఇచ్చి పలికెను:- “ఈ మాత్ర వేసికొనినచో చూచువారికి ఆ వ్యక్తి చనిపోయినా డనిపించును. కాని మాత్ర మింగిన వాని శరీరస్థితి యందు మార్పు ఏమియు ఉండదు. ఈ మాత్ర సహాయమున ఇంటికి వెళ్ళినంతనే ఇంటిలోని వారి హృదయమును పరీక్షించుము.”

యువకుడు ఇంటికి వెళ్లి మాత్ర సహాయమున ఇంటిలోని వారిని పరీక్షించెను.

ఇంటిలోని వారందరు చాల కంగారుపడి

తల్లిదండ్రులు, భార్య అతని శయ్య దగ్గర కూర్చొని ఆతడు చచ్చిపోయినాడను భావముతో హాహారవములు చేయుచు ఏడ్వసాగిరి. యువకుడు ఇది అంతయు చూచుచునే ఉండెను. కొంతసేపైన తరువాత అతి నీరసముతో నున్నట్లు పలికెను.

"నా గురువుగారు అరణ్యములో నున్నారు. వారిని పిలవండి. వారు నా వ్యాధిని నిర్మూలించు ఉపాయమును ఎరుగుదురు."

ఆ మాటలు విని వారు శరవేగముతో పరుగెత్తి గురువు గారిని తీసికొనివచ్చిరి. ఆయన మొదట వారు అనుకొనినట్లుగనే ఆయువకుని పరీక్షించినట్లు నటించి ఈతని పరిస్థితి జీవించునట్లు లేదు. రోగము ఏమియు లేదు. భూతము ఆవహించినది అని చెప్పెను. ఆ మాటలు విని ఏకధారగా ఏడ్చుచు వారు పలికిరి. "ఇతడు బ్రతికినచో మేము చనిపోయినను మేలే" అనిరి. అట్టి మాటలు చెప్పుచు వారు ఆ మహాత్ముని పాదములను పట్టుకొని "స్వామీ,

తమరు సర్వసమర్థులు. ఏదోవిధముగా ఈయువకుడు జీవించునట్లు చేయు”దని ప్రార్థించిరి. ఆమాటలు వినిన తరువాత ఆ మహాత్ముడు వారినందరను ఓదార్చి “మీరందరు శాంతించుడు. నేను ఏదో విధముగా యువకుని బ్రతికించెదను. ఒక గ్లాసుడు నీళ్ళు తీసికొని రండు” అని ఆజ్ఞాపించెను. వారు నీరు తీసికొని వచ్చిరి. ఆ నీటిగ్లాసును మహాత్ముడు ఏడుమారులు ఆయువకునికి దిగ దుడిచెను. అనంతరము ఇట్లు పలికెను “ఇంక భయము లేదు. ఈ జలమును మీలో ఏ ఒకడైన త్రాగినచో ఈతడు జీవించును. ఏలనన ఈ భూతము చాల దిట్టమయినది. ప్రాణికి బదులు ప్రాణిని కోరును. కావున ఎవడు ఇతడు జీవించి తీరవలెననుకొనుచున్నాడో వాడు తన ప్రాణముపై ఆశ వదలుకొని ఈ నీటిని త్రాగవలెను.”

అంతట తల్లి పలికెను: “నలుగురు అయిదుగురు పసిపిల్లల తల్లిని. నేను

చనిపోయినచో వారు బ్రతుకుట ఎట్లు?"

భార్య ఇట్లనెను:"నా తల్లికి ఒక్కతినే కూతురు. నేను చనిపోయినచో మా అమ్మ ఎట్లు జీవించి ఉండగలదు?"

తండ్రి చెప్పెను:-"నేను చనిపోయినచో సంపాదించువాడెవడు? ఈ చిన్న వాళ్ళకు, పెద్ద వాళ్ళకు కడుపునిండ అన్నము ఎట్లు దొరుకును?"

ఇట్లు చావును తప్పించుకొనుటకు అందరును తమకు తోచిన విధముగా ఉపాయములను వెదకిరి. అటు తరువాత అందరితోను ఆ మహాత్ముడు చెప్పెను:-"మీరు చాల సేపటి నుంచి దుఃఖించుట చూచి నేను ఈ చికిత్సను కనిపెట్టితిని. అంతా ఆలోచించకుండ ఎందుకు మీరు మరణమును కోరిరి!"

"స్వామి, దుఃఖాతిరేకమున వెనుక ముందులు ఆలోచించకుండ మేము మూర్ఖత్వముతో మాట్లాడితిమి. మేమందరము

పామరులము. కావున మేము చచ్చుటకు సిద్ధమయితిమి. తమరు మహాయోగి పుంగవులు. తమ శరీరం పరోపకారము కొరకు వినియోగించబడును. కావున తామే ఈ జలమును త్రాగి మా బాలుని ప్రాణమును రక్షించినచో మహాపుణ్యము కలుగును. దానితోపాటు మా అందరిని బ్రతికించిన వారగుదురు. ప్రవాహజీవులమగు మేము మరి ఏమి చేయగలము? తమకు సమాధిని నిర్మించెదము. సంతర్పణలు చేసెదము. తమ నామధేయము స్థిరముగా నుండటకు మాకు చేతనైనంత ఎక్కువ ధనమును వ్యయపరిచెదము.”

అంతట మహాత్ముడు ఆ యువకుని సంబోధించి ఇట్లనెను:-“ఇదిగో చూచావా, అబ్బాయీ! నీ కుటుంబములోని వారికి నీయందు ఎంత అంతులేని ప్రేమ ఉన్నదో!” ఆ యువకుడు పూర్ణ సంస్కారి. జరిగిన సంగతులతో అతనికి

పూర్వజ్ఞానము కలిగి సంసారమును విడనాడెను. అతడు గురువును అనుగమించెను.

"యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్" అని శృతి చెప్పుచున్నది. "ఏ రోజున వైరాగ్యము కలిగిన ఆ రోజుననే సన్యాసము తీసుకొనవలెను."

తాత్పర్యమేమన ప్రపంచమునందలి జనులెల్లరును తమ స్వార్థము కొరకే ఒకరితో మరియొకరు సంబంధము ఉంచుకొనెదరు. ప్రతి ఒక్కడును స్వార్థపరుడే. కావున జగమంతయు స్వార్థభూయిష్టమే.

స్వా. ని. :- ఈ భావము బృహదారణ్యకము నందు కూడ వెల్లడించబడినది.

## యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి చెప్పిన మాటలు

యాజ్ఞవల్క్యునకు మైత్రేయి, కాత్యాయని అను ఇద్దరు భార్యలు ఉండిరి. వారిలో మైత్రేయి

బ్రహ్మవాదిని. కాత్యాయనికి గార్హస్థ్యమున ప్రేమ యుండెను. ఋషి సన్యాసము తీసికొనుటకు ముందు తన ఆస్తిని ఇరువురకును పంచి ఇయ్యదలచి భార్యలను ఇరువురును పిలచెను. మొదట మైత్రేయితో ఇట్లనెను:- "మైత్రేయీ! నేను సన్యాసము తీసుకొనదలచి యున్నాను. మీ ఇరువురకును కష్టము కలుగకుండుటకు నా ధనమంతయు మీకు పంచుచున్నాను."

మైత్రేయి పలికెను.

స్వామీ! ధనముతో నిండిన ఈ భూమినంతను తీసికొనినను నేను మృత్యువును దాటి అమృతత్త్వమును పొందగలనా? అమృతత్త్వమును పొందు అవకాశము నాకు ఉన్నచో ఆస్తిని విభాగము చేసి యిచ్చుట ఉచితమే."

యాజ్ఞ: - ఓమైత్రేయీ! ధనికులు రథవాహనాదులతో మిక్కిలి ఆనందమును పొందెదరు. అటులనే నీవు కూడ దరిద్రుల కంటె

ఎక్కువ సుఖముగా జీవించవచ్చును. ఇంతియె ఉపయోగము. ఇంతకుమించి మోక్షము కలుగునని ఆశపడుట వ్యర్థము.

మైత్రేయి:-

***యేనాహం నామృతా స్యాం కిమహం తేన కుర్యామ్ /***
***యదేవ భగవాన్వేద, తదేవ మే బ్రూహీతి//***

"అమరత్వమును అందించలేని ధనము నాకు ఎందుకు? ఓ ప్రభూ మోక్ష సాధనము తెలిసినచో అది చెప్పుడు."

అప్పుడు యాజ్ఞవల్క మహర్షి తన భార్యయగు మైత్రేయికి మోక్షసాధనమగు జ్ఞానమును ఉపదేశించుట ఆరంభించెను.

"ఓ మైత్రేయీ! లౌకిక సాధనములు పశువులు, గృహము, బిడ్డలు, భార్య మొదలగునవి అన్నియు ఎంతయో ప్రియముగా తోచును కదా! అవి అన్నియు తనకు సుఖము కలుగజేయుటకు ఉపయోగపడుచున్నందుననే

ప్రియముగా తోచును. ఈ లౌకిక సాధనముల ప్రియత్వము గౌణము.

**ఆత్మా వై ప్రేయసాం ప్రేయః |**

"ప్రియాతి ప్రియమైనది ఆత్మయే"

**సహోవాచ న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవత్యాత్మ నస్తు కామాయ పతిః ప్రియో భవతి, న వా అరే జాయాయాః కామాయ జాయా ప్రియాభవత్యాత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి, నవా అరే పుత్రాణాం కామాయ పుత్రాః ప్రియా భవన్తి ఆత్మనస్తు కామాయ పుత్రాః ప్రియా భవ న్తి, న వా అరే విత్తస్య కామాయ విత్తం ప్రియం భవ త్యాత్మనస్తు కామాయ విత్తం ప్రియం భవతి;.... న వా అరే సర్వస్య కామాయ సర్వం ప్రియం భవతి ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి|**

"పతిపై సతికి అధికమగు ప్రేమ యుండును. కాని ఆ ప్రేమ భర్త యొక్క కోరికలను పూరించుటకు కాదు. తన కామములను

పూరించు కొనుటకు మాత్రమే. అటులనే భర్తకు భార్య మిక్కిలి ఇష్టము. కాని ఆ ప్రేమకూడ భార్య కోరికలను తీర్చుటకు కాదు. తన కోరికలను తీర్చుకొనుటకే. అటులనే తల్లిదండ్రులు బిడ్డలను మిక్కిలి ప్రేమింతురు. ఆ ప్రేమవారి కోర్కెలను దీర్చుటకు కాదు. తల్లిదండ్రుల కోర్కెలను తీర్చుటకు మాత్రమే. ధనమును ప్రేమించుట కూడ ధనమునందలి ప్రేమచే కాదు. తనకొరకే. ఇంక మిగిలిన వస్తువుల సంగతి ఏమి చెప్పవలెను? ఈ సమస్త ప్రపంచమును ఆ ప్రపంచము కొరకు ప్రియము కాదు. తన కోరికలను తీర్చుకొనుటకు మాత్రమే ప్రియమైనది." అని యాజ్ఞవల్క్యుడు పలికెను.

ఈ విషయమున ఒక ప్రసంగము కలదు.

నేను క్రీ|| శ|| 1911 వ సం||న హృషీకేశము వెళ్ళితిని. ఆరోజులలో అచ్చటి సాధువులును, సన్యాసులును ప్రత్యక్షముగా చూచిన సంగతులన్నియు చెప్పెడివారు. ఈ ప్రసంగము అప్పుడిది.

గంగానది ఎదుట విశాలమగు ఇసుక మైదానము, అందు చివర అరణ్యము కలదు. వేసవి కాలమున అరణ్యము నుండి మధ్యాహ్నం పదకొండు గంటల తరువాత కోతులగుంపు నదియందలి నీరు త్రాగుటకు వచ్చెడివి. నీళ్ళు త్రాగి గంతులు వేసెడివి. వానిలో కొన్ని నదీతీరము నందలి ఇసుక కాలుటకు ముందుగనే అరణ్యములోనికి వెళ్లి పోయెడివి. కొన్ని మాత్రము ఇసుక బాగుగా కాలు సమయమున, అరణ్యము లోనికి బయలు దేరెడివి. కొంచెం దూరము వెళ్లిన తరువాత ఇసుకవేడికి కాళ్ళు కాలుటచే తమ పిల్లలను క్రింద పడవేసి వానిపైన కూర్చొనెడివి. వేడికి పిల్ల వెంటనే చచ్చెడిది. దానిని కొంచెము దూరము ఈడ్చుకొనిపోయి మరల కాళ్లు కాలగనే దానిపై కూర్చొనెడివి. ఇట్లు ఆ వేడి ఇసుకను దాటి పిల్లను పార వేసి అరణ్యములోనికి వెళ్లిపోయెడివి. ప్రాణులందరికంటెను కోతికి తన బిడ్డ యందు ఎక్కువ ప్రేమ ఉండునని చెప్పెదరు. కానీ ఆ

కోతులే తమ ప్రాణరక్షణార్థ ము ఇట్లు చేసెడివి.

స్వా. ప్ర. :- ఒక ప్రదేశమున గ్రామము బైట ఒక సన్యాసి ఉండెడివాడు. ఆయనకు ఒక శిష్యుడు కలడు. సంధ్యాసమయమున గ్రామీణలు ఆయన దగ్గరకు సత్సంగము కొరకు వచ్చెడివారు. వారందరును అరటి పండ్లు, అత్తి పండ్లు(ఏపుల్సు) మొదలగు ఫలములను చాల తెచ్చెడివారు. ఒక రోజున స్వామివారు తన శిష్యుడితో నిట్లనిరి:- "ఈ పండ్లు అన్నిటిని తీసుకొని వెళ్ళి ముక్కలు కోసి, పళ్ళెములో పెట్టి తీసి కొనిరమ్ము." గురువునాజ్ఞ ననుసరించి శిష్యుడు పండ్ల ముక్కలతో పళ్ళెమును తెచ్చెను.

"గురుదేవా! మొదట ఎవరికి ఈ ముక్కలు ఇవ్వవలెను" అని ప్రశ్నించెను. గురువు చెప్పెను. "నీకు ఎవరు మిక్కిలి ప్రియమైన వారో వారికి ఇమ్ము."

ఆతనికి గురువు మిక్కిలి ప్రియమైన వాడు కనుక గురువుగారికి ప్రథమమున ముక్కలను

ఇచ్చునని అచ్చటనున్న వారు తలచిరి. కాని శిష్యుడు పళ్లెములోనుంచి పట్టెడు ముక్కలు తీసి తన నోటిలో వేసికొనెను.

జనులు అడిగిరి:- “అదేమి? గురువుగారిని విడచి మొదట నీవు ముక్కలను తీసికొనుచున్నావు. ఇది ఎక్కడి మర్యాద?”

ఆ శిష్యుడు బదులు చెప్పెను :- “ఎవరు నీకు ఎక్కువ ఇష్టమో వారికి ఇమ్ము అని గురువుగారు నాతో చెప్పిరి. అందరి కంటే నాకు నాయందే ఎక్కువ ప్రేమ కలదు. నా తరువాత గురువుగారు. అందుచే మొదటనే నేను తినుచున్నాను. ” (అందరు నవ్విరి).

ఈవిధముగా బృహదారణ్యకమునందు “ఆత్మా వై ప్రేయసాం ప్రేయః” అని చెప్పబడినది అన్ని విధముల నిజము.

తరువాత యాజ్ఞవల్క్యుడు ఇట్లుకూడ చెప్పెను.

మైత్రేయీ! ఈ విధముగా సమస్త

ప్రపంచమును తన కొరకు మాత్రమే ప్రియమైనది.

***ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయ్యాఽత్మనో వా అరే దర్శనేన శ్రవణేన మత్యా విజ్ఞానేనేదగ్ం సర్వం విదితమ్ /***

ఓ మైత్రేయి! ఆత్మనే సరిగా చూడవలెను. ఆత్మజ్ఞానము కలుగుటయే గొప్ప పురుషార్థము. ఆత్మను గురించియే ఆచార్యుల ద్వారాను, శాస్త్రముల ద్వారాను శ్రవణము చేయవలెను. ఆత్మనే మననము చేయవలెను. ఆత్మనే నిదిధ్యాసనము చేయవలెను. ఆత్మశ్రవణాదుల చేతనే ఈ సమస్తము తెలియనగును.

ఇట్లు బృహదారణ్యకమ నందలి రెండవ అధ్యాయము, నాల్గవ బ్రాహ్మణములో ప్రశ్నోత్తరరూపమున ఆత్మవస్తువును బాగుగా ప్రతిపాదించి, ఆత్మభిన్నమగు శక్తిని అంగీకరించు వానిని నిందించెను.

***"సర్వం తం పరాదాద్ యోఽన్యత్రాత్మనః సర్వం వేద/"***

ప్రపంచము అంతయు, ఆత్మవ్యతిరిక్తమగు జగత్తు కలదను వానిని నిందించును అని చెప్పెను. కావున

***"ఇదం బ్రహ్మేదం క్షత్రమిమే లోకా ఇమే దేవా ఇమే వేదాః ఇమాని భూతానీ దగ్ంసర్వం యదయమాత్మా"***

ఈ బ్రహ్మక్షత్రియులు, ఈ లోకములు, ఈ దేవతలు, ఈ వేదములు, ఈ భూతములు ఇవి అన్నియు ఆత్మ స్వరూపమే అని చెప్పెను.

ఇవి అన్నియు బ్రహ్మమునందు అధ్యస్తమగుటచే అధిష్ఠాన భూతమగు బ్రహ్మము సాక్షాత్కరించగనే మిథ్యయును, అధ్యస్తమును అగు జగత్తు బాధించబడి ఈ ప్రపంచము అంతయు బ్రహ్మ స్వరూపముగా ఆత్మస్వరూపముగా భాసించును.

ఈ సందర్భమున మైత్రేయి ప్రశ్నించెను. "ప్రభూ! సమస్త జగత్తును ఆత్మస్వరూపము అయినచో ఆత్మస్వరూపముగా తెలియబడక

జగత్స్వరూపముగా ఎందుకు తెలియబడుచున్నది? ఆత్మస్వరూపజ్ఞానము ఎందుకు కలుగుటలేదు?”

యాజ్ఞవల్క్యుడు దుందుభి, శంఖము, వీణా మున్నగువాని నాదములు, వాని ఆఘూత శబ్దములు- వీని దృష్టాంతము నిచ్చి వివరించెను. నగారా వాయించబడినప్పుడు దాని శబ్దముతో బాటు ఇతర ధ్వని కూడ గ్రహించబడును. ఆఘూతశబ్దము, నాదము వేరు వేరుగా వినబడుట లేదు. నగారావాద్యముతో బాటు ఆఘూత శబ్దము కూడ గ్రహించబడుచున్నది. అటులనే శ్రవణమననాది సాధనములతో ఆత్మజ్ఞానము కలిగినప్పుడు, జగత్తు అనెడు వివర్తమునకు అధిష్ఠానము ఆత్మ అగుటచే రజ్జు సాక్షాత్కారమయినప్పుడు సర్ప జ్ఞానము కలుగనట్లు, అధిష్ఠాన తత్త్వసాక్షాత్కారమయినంతనే జగత్తు బాధించబడి, ఆత్మయే శుద్ధముగా భాసించును. జ్వలించుచున్న అగ్ని నుండి నలువైపులకును

అంగారధూమాదులు వ్యాపించును.

**"ఏవం వా అరేऽస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతద్య దృగ్వేదో యజుర్వేద.... " ఇత్యాది/**

అటులనే ఈ బ్రహ్మస్వరూపమగు ఆత్మనుండి నిశ్వాసన్యాయమున ఋగ్వేదయజుర్వేదాదులు ఉద్భవించినవి.

ఆకాశమునుండి పడుచున్న జలమునకు గంతవ్యము సముద్రము. గంధాది సర్వవిషయములకును గంతవ్యము నాసికాది ఇంద్రియములు. అటులనే జగత్తు అంతకును లయస్థానము బ్రహ్మము.

"యత్ర హి ద్వైతమివ భవతి తదితర ఇతరం జిఘ్రతి...పశ్యతి... శృణోతి " ఇత్యాది|

ద్వైతము భాసించినప్పుడు- పరమాత్మ స్వరూపము ఒకటే అయినను భిన్న ప్రతీతి కలిగించినదిగ భాసించును. అప్పుడు దృశ్యమును ద్రష్ట వేరు వేరుగా చూచును, వాసన

చూచును, వినును.

***యత్ర త్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం జిఘ్రేత్ కేన కం పశ్యేత్।***

ఆ బ్రహ్మజ్ఞుడు, సమస్త ప్రపంచము ఆత్మస్వరూపముగా భాసించునప్పుడు దృశ్య, ద్రష్టృ భేదమును అనుభవించడు. ఇక ఏ సాధనముతో దేనిని ఆఘ్రాణించును? దేనితో దేనిని చూచును?

***యేనేదం సర్వం విజానాతి తం కేన విజానీయాత్, విజ్ఞాతార మరే కేన విజానీయాత్ ।***

దేని ద్వారా ఇదంతయు తెలిసికొనబడునో అది దేనిచే తెలిసికొనబడును? దేని ద్వారాను తెలిసికొనబడదు. జ్ఞాత ఏ సాధనములచే తెలిసికొనబడును? వేని చేతను కాదు. అనగా అనుభవైకవేద్యము. ఏ సాధనముల చేతను తెలిసికొనబడుదు కదా!

యాజ్ఞవల్క్యుడు చెప్పిన ఈ ఉపదేశముచే మైత్రేయి పరమ పురుషార్థరూపమగు బ్రహ్మజ్ఞానమును పొందినది. అవిద్యాకృతమగు మోహము నివృత్తిని పొందినది. ఆమె యథార్థ సుఖమును అనుభవించినది.

## బాల్యసంస్కారముల విలువ

స్వామి ప్రకాశానందులవారు రాజకోట వెళ్ళుటకు బయలు దేరిరి. అంతట శ్రీ పీఠడియా రాజావారు భిక్ష స్వీకరించిన తరువాత వెళ్ళవలసినదని ప్రార్థించిరి. భిక్షా సమయమున మోహన భాయి శ్రీ రాజా వారితో ఇట్లు విన్నవించెను. స్వామి శ్రీ నిత్యానందుల వారు చాల కాలము నుండి రాజకోట దయచేయలేదు. తమరు అనుమతించినచో మేము వారిని కూడ తీసికొని వెళ్ళెదము. శ్రీ రాజావారు పలికిరి. "మేము రేపు శ్రీ నిత్యానందులవారిని తీసికొనివచ్చెదము." ఆ విధముగనే స్వామివారు, శ్రీ రాజావారు, వైద్య గోపాలజీ భాయి ముగ్గురును

వచ్చిరి. ఆ సమయమున శ్రీ నిత్యానందులవారిని దర్శించుటకు కొందరు భక్తులు వచ్చియుండిరి. ఆ భక్తులతోపాటు కొందరు 6, 7 సంవత్సరముల బాలకులుకూడ వచ్చి స్వామివారికి సాష్టాంగ నమస్కారములు చేయుచుండిరి. అది కాంచి స్వామి శ్రీ ప్రకాశానందులవారు పలికిరి:- "ఈ బాలురు పెద్దవారిని అనుకరించుచున్నారు. బాల్యమునందు కలుగు సంస్కారములు పెద్దతనములో కలుగవు."

## రాణీ మదాలస దృష్టాంతము

మదాలస ఋతుధ్వజుడను రాజును వివాహము చేసికొనెను. ఆ వివాహ సమయమున "పుట్టిన బాలునిపై అధికారము నాది" అని షరతు పెట్టెను. రాజు ఆ షరతును అంగీకరించెను. రాణి మదాలస తనకు కలిగిన పుత్రులకు అందరకు ఆత్మజ్ఞానము ఉపదేశించెడిది. ఊయలలో పిల్లలను పరుండ బెట్టి ఊపు సమయమున కూడ జ్ఞానమునకు సంబంధించిన పాటలు పాడెడిది.

ఆత్మజ్ఞానిని యగు మాతమదాలస తన పుత్రులకు ఆత్మానాత్మ వివేకమును ప్రతిపాదించెడిది. ఆత్మ స్వరూపమును వివరించుచు ఆమె ఇట్లు చెప్పెడిది.

***“శుద్ధోఽసి బుద్ధోఽసి నిరఞ్జనోఽసి సంసారమాయావరివర్జితోఽసి/***
***సంసార స్వప్నం త్యజ మోహనిద్రాం మదాలసా వాక్యమువాచ పుత్రమ్//”***

“ఓ కుమారుడా! నీవు శుద్ధుడవు , జన్మ మరణాది షడ్వికారములును లేని వాడవు. నీవు బుద్ధుడవు- జ్ఞానస్వరూపుడవు. నీవు స్థూల, సూక్ష్మ కారణ శరీరములను నీ ప్రకాశముచే ప్రకాశింపజేయుచున్నావు. నీవు నిరంజనుడవు. రాగద్వేషాది దోషములు లేనివాడు. సంసారమాయా రహితుడవు. సంసారము స్వప్నము వంటిది. ఎండమావులవలె ప్రతీతి మాత్రమే. కావుననే మోహమను నిద్రను త్యజించుము. దేహమునందు ఆత్మబుద్ధిని

త్యజించుము. దేహమునకు సంబంధించిన దారా, పుత్ర, ధన, గృహముల యందు మమత్వము అనెడు మోహనిద్రను త్యజించి నీ జన్మస్వరూపము పరికించుము."

ఓ కుమారుడా! నీవు సత్, చిత్, ఆనందరూపుడవు. ఈ నీ శరీరము పంచభూతములచే తయారయినది. శరీరమునెడు దేవాలయమునందు శుద్ధుడును, ఆత్మరూపుడును అగు దేవుడు కలడు. నీవు ఎందుకు ఏడ్చుచున్నావు?

## తరతి శోకమాత్మవిత్

ఆత్మను తెలిసికొనిన వాడు శోకమును తరించును. నీవు ఆనంద స్వరూపుడవు. శోకము, మోహము అంతఃకరణ ధర్మములు. ఇది నీ ధర్మము కాదు. నీవు అన్ని విధములగు దోషములు లేని చైతన్య స్వరూపుడవును, నిత్య సిద్ధుడవును అగు ఆత్మ స్వరూపుడవు. కావున ఓకుమారా! నీవు మోహనిద్రనుండి మేల్కొనుము.

ఇట్లు బ్రహ్మవాదిని అయిన మహారాణి మదాలస తన కుమారులకు ఆత్మబోధ చేయుచుండెను. కుమారుల దోషరహితమగు పవిత్ర హృదయముల యందు మాతృదేవియొక్క ఉపదేశములు సరిగ నాటుకొనుచుండెడివి. ఒక్కొక్క కుమారుడే సంసారము సారము లేదని తలచి, విరక్తిని పొంది, సంసారమును త్యజించి, రాజ్యమును విడచి, ఆత్మసాక్షాత్కారమును పొందుటకు ఏకాంతమున ఆత్మవిచారము చేయు నుద్దేశ్యముతో అరణ్యమునకు వెళ్ళెడివాడు. ఇదంతయును చూచి ఋతుధ్వజమహారాజు మదాలసతో ఏకాంతమున ఇట్లు పలికెను:- “అందరు పిల్లలను రాజ్యము విడచి, విరక్తులయి వెళ్లునట్లు చేయుచున్నావు. ఈ రాజ్యమును పాలించువాడు ఎవ్వడు? దేవతల కార్యములను నిర్వహించువాడు ఎవడు?

# ఋణత్రయమపాకృత్య మనో మోక్షే నివేశయేత్

దేవఋణము, ఋషి ఋణము, పితృఋణము- అను మూడు ఋణములను మనుష్యుడు తీర్చవలెను. యజ్ఞము వేదాధ్యయనము చేసి, సంతానము కని మనుష్యుడు ఈ మూడు ఋణములనుండియు ముక్తిని పొందవలెను. ఇది శాస్త్ర సంప్రదాయము. ఇది కూడ నిర్మూలింపబడుచున్నది.

ఇట్లు భర్త చెప్పిన మాటలు విని ఆమె అలర్కుడను పేరుగల తన నాలుగవ కుమారునకు గృహస్థాశ్రమమును పవిత్రముగా పాలించ నుపదేశించెను. రాజధర్మముకూడ నుపదేశించెను. తన కుమారుడు చివరివరకు సంసారమున ఆసక్తి కలిగియున్నచో యోగ్యుడు కాడని ఆమె తలచెను. మహారాజుగారి కోరిక ప్రకారము రాజ్యమును నిర్వహించిన తరువాత ఆ కుమారుడు ముక్తిని పొందవలెనని అనుకొనెను.

ఇట్లు మనస్సునందు తలచి ఆమె బంగారు తావీదును ఒక దానిని చేయించి అందు ఉపదేశ పత్రమును ఉంచి దానిని మూసివేసెను. దానిని తన కుమారునకు ఒసగి "కుమారా! నీకు మిక్కిలి ఆపద కలిగినప్పుడు ఈ తావేదును తెరచి దానియందు వ్రాయబడిన విధముగా చేయుము. అట్లు సంచరించినచో నీ కష్టములన్నియు తీరును."

అనంతరము తన తల్లి ఉపదేశించిన విధముగా ఆ రాజకుమారుడు రాజ్యము చేసెను. రాజ్యనిర్వహణమునందు అతనికి శ్రద్ధ కలిగెను. ఇది చూచి విరక్తిని పొందిన సుబాహుడు మొదలగు ముప్వురు సోదరులును ఇట్లు తలచిరి.

"మనము సంసారబంధము నుండి ముక్తిని పొందితిమి. కాని సోదరుడు మాత్రము సంసారమున నిమగ్నుడయి యున్నాడు. ఇది యుక్తము కాదు. ఆతనిని సంసార బంధమునుండి ముక్తిని పొందించుట మన

కర్తవ్యము.

సవ్యమార్గమున సవ్యంగా ఉపదేశించినచో ఆతనికి నమ్మకము కలుగదు. ఏదైన కఠినమగు విపత్తు కలిగినచో సంసారము దుఃఖమయమని అతనికి తోచును. అప్పుడు ఉపదేశము బోధపడును. ఈ ఆలోచనతో సుబాహుడు అలర్కుని శత్రువగు కాశీ రాజు సహాయముతో అలర్కుని రాజ్యముపై దండెత్తెను. సుబాహుడు రాజ్యమును ముట్టడించి కబురు పంపెను. “నీకు బతికి ఉండవలెనను కోరిక యున్నచో రాజ్యమును మాకు ఇచ్చి వేయుము.”

అలర్కుడు అతనికి కబురు పంపెను. “రాజ్యము కావలసినచో యుద్ధము చేసి జయించుము. క్షత్రియుడు అడిగినంత మాత్రమున రాజ్యము ఇవ్వడు. అడుగుట క్షత్రియ ధర్మము కాదు. క్షత్రియుడు యుద్ధముచేసి రాజ్యమును కలుపుకొనవలెను. ”

అలర్కుని సమాధానము విని సుబాహుడు

ఆతని రాజ్యము నందలి కొన్ని కోటలను వశపరచుకొనెను. అంతట అలర్కుడు కంగారు పడి ఈ విపత్తునుండి బయటపడుటకు మాతృశ్రీ ఒసంగిన బంగారు తావేదును తెరచెను. దానియందలి పత్రము తనకు హితమును కలుగ జేయు వాక్యములను చదివెను. ఈ వాక్యములను చదువుట తోడనే అనిత్యమును, నశ్వరమును అగు ఈ సంసారముపై అతని హృదయమున వైరాగ్యము కలిగెను. తన తండ్రిగారి రాజ్యము సుబాహునకు ఇచ్చి పరమ తత్త్వమును పొందుటకు ఆత్మవిచారము చేయుటకై ఏకాంతప్రదేశమగు వనములోనికి వెళ్ళవలెనని ఆలోచించెను.

అప్పుడు సోదరుడగు సుబాహుడు చెప్పెను:-"నాకు రాజ్యముతో పనిలేదు. నేను నీకు ఈ సంసారము నుండి విముక్తి నిచ్చుటకే ఇట్లు చేసితిని. నేను నీకు సోదరుడను. భ్రాతృసంబంధమున నాఉపదేశములచే

అవసరమైనంత ప్రయోజనము నీకు సిద్ధించదు. కావున ఉపదేశమును పొందుటకు దత్తాత్రేయుల వారి వద్దకు వెళ్ళుము." ఆ వాక్యములను అనుసరించి అలర్కుడు తన కుమారుడునకు రాజ్యము నిచ్చి దత్తాత్రేయులవారిని శరణు జొచ్చెను. గురువులు దత్తాత్రేయులవారి ఉపదేశముచే ఆతనికి ఆత్మ లాభము కలిగెను. మోక్షమును పొంది ఆతడు తన మానవజన్మమును సార్ధకము చేసికొనెను.

## శాస్త్రాధ్యయనము

అనంతరము ఇద్దరు, ముగ్గురు పెద్ద పిల్లలు వచ్చి నమస్కరించి కూర్చొనిరి. స్వామి శ్రీనిత్యానందుల వారు బాలుల వినయము, వివేకమును చూచి ఇట్లు అడిగెను-"మీరు ఏమి చదువు కొనుచున్నారు?"

ఒకడు ఐదవ తరగతి, ఒకడు ఆరవ తరగతి, మరియొక్కడు మెట్రిక్ అని ఈ విధముగా వారు చదువునది వివరించిరి. స్వామివారు మరల

ప్రశ్నించిరి. “రెండవ భాష ఏమి చదువుచున్నారు?” ఒకడు పర్షియన్, ఒకడు ఫ్రెంచి, మరియొకడు సంస్కృతము అని సమాధానము చెప్పెను. ఆ సమాధానములు విని స్వామివారి ఇట్లు చెప్పిరి. మీరు సంస్కృతము తీసికొనుట చాల మంచిది. ఏలనన, సంస్కృతము చదివినచో ధర్మ గ్రంథములు చదువుటకు వీలుపడును. ఇది ధర్మము, ఇది అధర్మము అనునవి బోధపడును.

స్వా. ప్ర. :-స్వామివారు చెప్పినది నిజము. ఈ కథ వినుడు. జగత్తును వశపరచకొను భూతముల గుంపు ఒకటి ఉండెను. వారికి ఒక రాజు ఉండెను. ఒకనాడు ఆ రాజునకు ప్రతి భూతము తాము చేయు పనులను వివరించెను. వారిలో ఒక భూతము చెప్పెను. నేను యుక్తితో బడికి వెళ్ళు పిల్లవాని పుస్తకములు నూతిలో పడ వేయించితిని. ఇది విని భూతముల రాజు ఆతడు చాల మంచిపని చేసెనని స్తుతించెను.

అంతట ఇతర భూతములకు ఈర్ష్య కలిగి అడిగిరి. "మేము అన్ని గొప్ప పనులు చేసినను మీరు మమ్ము గౌరవించ లేదు. ఏల?" రాజు చెప్పెను. "అటులనా?"

ఇట్లు పలికి అన్ని భూతములను తోడ్కొని పోయెను.

ఒక గ్రామమున అంధుడును, శ్రద్ధా సమన్వితుడును అగు చదువు రాని భక్తుడు ఉండెను. అతని వద్దకు దేవదూత వేషము ధరించి వెళ్లెను. ఆతడు భక్తునితో చెప్పెను. ప్రభువు నీ భక్తికి సంతోషించి వైకుంఠమునకు పిలిచెను. ఇది విని భక్తుడు మిక్కిలి సంతోషించి వెళ్ళుటకు సిద్ధమయ్యెను. భూత రాజు అతని కండ్లకు గుడ్డకట్టి బైటకు తీసికొని వచ్చెను. ఆతనిని గాడిదపై కూర్చుండబెట్టి నిండు బజారులో విడచి వెళ్ళెను. జనులు ఆతనిని చూచి నవ్వసాగిరి. తరువాత అతనిని గాడిద పై నుండి దింపిరి. అతని కండ్ల నుంచి గుడ్డవిప్పి అట్లు జరుగుటకు కల కారణము అడిగిరి. భక్తుడు తన పరిస్థితిని

చెప్పి వివరించెను. జనులు, భక్తులు హేళన చేయుచు చెప్పిరి. భగవానుడు చాల మంచి వాహనమునే పంపెను. అనంతరము ఆ భూతాధిపతి అన్ని భూతములను ఒక విద్వాంసుని వద్దకు తీసికొని వెళ్ళెను. ఆతనితో నిట్లనెను. “నిన్ను భగవానుడు వైకుంఠమునకు పిలచెను.” అతడు ఆలోచించెను.“నేను సంధ్యాది షట్కర్మలునైనను విధిపూర్వకముగా నాచరించుట లేదే. నన్ను భగవానుడు వైకుంఠమునకు పిలచుట ఎట్లు? ఇది భూతగణము అయి ఉండవచ్చును.” ఇట్లు తలచి ఆతడు మంతోచ్చారణము చేసి ఆ భూతములపై నీటిని చల్లెను. అచ్చటి నుండి వారు పరుగెత్తిరి. పరుగెత్తుచు భూతరాజు చెప్పెను. “చూచితిరా! ఇక్కడ మన పాచిక ఎట్లు పారలేదో!”

తాత్పర్యమేమన, నిజమగు ధర్మమార్గము కొద్దియో గొప్పయో శాస్త్రములను చదివిననే తెలియును. ఇతరుడు చెప్పి నందున తెలియదు.

శాస్త్రజ్ఞానము లేని నరుడు అంధుడని చెప్పబడును. ఇట్టి అంధులను గ్రుడ్డినమ్మకము కలవారిని నిశాచరులు మోసము చేయుదురు. కావున శాస్త్రాధ్యయనము నేత్రము వంటిది.

**సర్వస్య లోచనం శాస్త్రం యస్య నాస్త్యంధ ఏవ సః/**

"శాస్త్రజ్ఞానము అనెడు కళ్ళు లేనివాడు గుడ్డివాడే."

# ప్రాణులయందు దయ

తరువాత శంకర భాయి అను సంగీత విద్వాంసుడు భజన చేసెను. రాజావారు శంకరభాయికి పది రూపాయిలు ఇవ్వబోయిరి. కాని శంకరభాయి తీసికొనలేదు. ఆతడు చెప్పెను.

"నేను సత్సంగమునకు వచ్చితిని. నేను పీఠడియా వచ్చినప్పుడు ఇవ్వండి." రాజావారు తీసికొనమని పట్టుబట్టుటచే శంకరభాయి శ్రీ నిత్యానందస్వామి వారితో చెప్పెను." నేను

దర్శనమునకు వచ్చితిని. నేను ధనము తీసికొనుట యుక్త ము కాదు.” శ్రీ నిత్యానంద స్వామివారు పలికిరి. “మీకు సంగీతవిద్వాంసులనెడు భావముతో ఇచ్చుట లేదు. బ్రాహ్మణులని ఇచ్చుచున్నారు. రాజావారు దయార్థ్రహృదయులు. వారు అందరకును ఇచ్చెదరు.”

అంతట శ్రీ ప్రకాశానంద స్వామి వారు ఇట్లనిరి. “రాజులు దయార్ద్రహృదయులగుటలో ఆశ్చర్యమేమియు లేదు. దయాహీనులయిన ఆశ్చర్యపడవలెను. కాని ఇప్పుడు దయ తక్కువగా కన్పించుటచే దయాళువు అను శబ్దము ఆశ్చర్యకరముగా కనిపించుచున్నది. పూర్వము ప్రతి రాజును దయ కలిగియుండెడివాడు. వారిలో రంతిదేవుడు దయామూర్తియే.

# రంతి దేవుని కథ

స్వా. ని. :- రంతి దేవుని ఆఖ్యానము మీరు చెప్పండి.

స్వా. ప్ర. :- నాకు పూర్తిగా జ్ఞాపకము లేదు.

స్వా. ని. :- మీకు జ్ఞాపకము ఉన్నంత వరకు మాత్రమే చెప్పండి.

స్వా. ప్ర. :-పసిబిడ్డ పలికిన వచ్చీ రాని మాటలే తల్లిదండ్రులకు ఆనందదాయక మగునట్లు శ్రీస్వామివారికి నేను చెప్పెడి తప్పులతడకలే సంతోషము కలిగించును. శ్రీమద్భాగవతమున భరత వంశజుడగు రంతిదేవుని కథ చెప్పబడినది.

ఆ రోజులలో పెద్ద కరువు వచ్చెను. అందుచే రంతిదేవుడు తన సర్వస్వము ప్రజలకు ఇచ్చివేసెను. తరువాత తనకు దొరకినదెల్ల తాను ఉపవాసము ఉండి బీదలకు పంచి ఇచ్చెడివాడు. ఇట్లు ఆతడు ఒకమారు 48 రోజులవరకు ఆహార పానీయములను ముట్టలేదు. ఒకరోజున ఆతడు భుజించ కూర్చొనియుండగా ఒక బ్రాహ్మణుడు అతిథి రూపమున వచ్చెను. అందరియందును భగవానుని చూచు ఆ రాజు ఆతనికి ఆతిథ్యము

ఇచ్చి తాను మిగిలినది తినుటకు కూర్చుండెను. ఇంతలో ఒక శూద్రుడు వచ్చెను. దేవునిగా భావించి అతనికి కూడ ఆతిథ్యము ఇచ్చెను. ఆ అతిథి వెళ్లిన తరువాత కుక్కతో మరియొక అతిథి వచ్చెను. ఆతడు పలికెను:- "ఓ రాజా, నేనును, ఈ కుక్కయును ఆకలితో నున్నాము. మాకు ఆతిథ్యము ఇమ్ము." ఉదార హృదయుడగు రాజు మిగిలిన అన్నమునంతను ఎంతయో ప్రేమతో వారికి పెట్టి కుక్క-యజమానికి నమస్కరించెను. ఇక ఒక మానవుడు త్రాగుటకు సరిపడు జలము మాత్రమే మిగిలియుండెను. ఇంతలో ఒక చండాలుడు వచ్చి చెప్పెను. "నేను నీచుడను. నాకు త్రాగుటకు నీరు ఇవ్వండి." అంతట ధర్మాతుడగు ఆ రాజు అమృతోపమములగు ఈ వాక్యములను పలికెను.

***న కామయేఽహం గతిమీశ్వరాత్ప***
***రామష్టర్ధియుక్తామపునర్భవం చ।***

***ఆర్తిం ప్రపద్యేఽఖిలదేహభాజామన్తఃస్థితో యేన భవన్త్యదుఃఖాః//***

"నేను దేవుని అష్టసిద్ధులతో కూడిన ఐశ్వర్యమును, మోక్షమును కూడ కోరుట లేదు. అందరి ప్రాణులయందును ఉండి అందరి బాధలను అనుభవించవలెననియు, వారి దుఃఖములను పోగొట్టగలిగి యుండవలెననియు మాత్రమే కోరుచున్నాను."

ఇట్లు పలికి తనకు బాధ కలుగుచున్నను దయాస్వభావముచే జలమును చండాలునకు అర్పించెను. పరమేశ్వరుడు సంతృప్తిని పొంది రంతిదేవునకు మోక్షమును లభింపజేసెను.

అప్పుడు శ్రీ నిత్యానందస్వామివారు శంకర భాయికి చెప్పిరి:-

మీరు రూపాయిలు తీసికొనండి. రాజావారు కదా ఇచ్చునది. నేను ఇచ్చుట లేదు. నేను దరిద్రుడను.

స్వా. ప్ర :- ***దారిద్ర్యస్య పరామూర్తి ర్యాఞ్ఛా***

***న ధనశూన్యతా |***
***అపి కౌపీనవాన్ శంభుస్తథాపి పరమేశ్వరః //***

"దారిద్యమునకు ప్రతిబింబము యాచన. ధనము లేకుండ ఉండుట కాదు. శంకర భగవానుడు కౌపీనమును ధరించినను పరమేశ్వరుడే. శంకరభగవానుడు దిగంబరుడయి శ్మశానములో కూర్చొని ఉండును. అయినను కోరికలతో ఎవడు ఆయనను ప్రార్థించినను వానిని పూర్తి చేయును. తమరు ప్రభువును కూడ ఏమియు యాచించరు. ఇక తమరు దరిద్రులని ఎట్లు చెప్పగలరు?

వైద్యగోపాల:— రాజు యాచకునియందు యందు ప్రసన్నుడయి ఏమైన కోరమని చెప్పినచో పనికిరాని పదార్థములను కోరక భూములు, నగలు మొదలగునవి అడుగునట్లుగనే శంకరుడు ప్రత్యక్షమయి మమ్ము ఏమైన కోరమని చెప్పినచో మాయికపదార్థములగు సిద్ధులను కోరక అట్టి

దాతను అడుగుటకు తగిన జ్ఞానమునే కోరెదము.

రాజావారు:- మేము అడుగవలసినచో మా ఒక్కరిని గురించియే అడుగము. మా స్నేహితులు, కుటుంబము, నౌకరులు, ప్రజలు అందరికొరకును అడిగెదము. మా ఒక్కరి కొరకు మాత్రమే అడిగినచో స్వార్థపరుల మనిపించుకొనెదము.

స్వా. ప్ర.:-: ఒక రాజు ఉండెను. ఆయన గొప్ప శివభక్తుడు. శంకరుడు ఆతనియందు ప్రసన్నుడయి వరము కోరుకొనమని చెప్పెను. రాజు బ్రహ్మమును పొందవలెనని కోరెను. ఫలాన ప్రదేశమున ఉన్న పర్వతము చెంతకు, ఫలాన సమయమున నీవు వచ్చినచో నీకు బ్రహ్మసాక్షాత్కారము చేయించెదను అనెను. రాజు పలికెను:- నా కోరిక నా ఒక్కని కొరకు మాత్రమే కాదు. నా ప్రజలందరికిని బ్రహ్మసాక్షాత్కారము చేయించవలెనని కోరుచున్నాను. భగవానుడు పలికెను:- "అది సాధ్యము కాదు." మిక్కిలి ప్రార్థించిన తరువాత శంకరభగవానుడు రాజుతో చెప్పెను. ప్రజలనుకూడ తీసికొని ముందు చెప్పిన

ప్రదేశమునకు రమ్ము.

రాజు ప్రజలందరకు సిద్ధము అవవలెనని ఆజ్ఞాపించెను. ఈ లోపున శంకరుడు వారు వచ్చు మార్గమున గోళాకారమగు వలయములతో కూడిన ఒక కోష్ఠమును కల్పించెను. దానియందు మొదటి వలయము నందు రాగి నాణెములు ఉండెను. దానిలోనుండి రెండవవలయములోనికి ప్రవేశించుచో వెండినాణెములు ఉండెను. ఇటులనే ప్రతివలయమునందును ప్రారంభమున బంగారము, వజ్రములు, మాణిక్యములు, మౌక్తికములు మొదలగునవి ఉండెను. మధ్యనున్న వలయమున శంకరపరమాత్ముడు తానొక్కడు కూర్చొనెను. రాజును, ఆతని ప్రజలునుగోళాకార వలయములందు ప్రవేశించిరి. ప్రజలు, కూలీలు తమకు ఇష్టము వచ్చినట్లు రాగి నాణెములను తీసికొని తృప్తి పొంది వెనుకకు మరలిరి. మరికొందరు వెండితో సంతోషించిరి. మరికొందరు నౌకరులు వర్తకులును,

అధికారులును బంగారము తీసికొని వెనుకకు మరలిరి.

రాజకుటుంబీకులు, దివాను, మిగిలిన శ్రీమంతులు మొదలగు వారందరు రత్న మాణిక్యములతో వెనుకకు మరలిరి. రాజు మాత్రమే శివుని చెంతకు వెళ్ళెను. శంకరుడు అడిగిన. “ప్రజలు ఏరి?”

రాజు:- తమరు కల్పించిన మాయకు లోనయి అందరును వెనుకకు వెళ్ళిపోయిరి. నేను మాత్రము కృపాపాత్రుడనయి ఇచ్చుటకు వచ్చితిని.

శంకర :- నేను మొదటనే చెప్పితిని. వారి అందరకును బ్రహ్మము లభించుట శక్యము కాదు. యోగ్యతను అనుసరించి జనులందరకు ఆయా వస్తువులు లభించును.

అంతట వైద్యరాజు శ్రీ నిత్యానందుల వారితో చెప్పెను. రాజావారు అన్నము, వస్త్రములు, గోవులు, భూమి మొదలగునవి

అన్నియు ఇవ్వగలరు. తమరు అభయము ఇచ్చుచున్నారు. అభయదానము అన్ని దానములకంటెను శ్రేష్ఠమని శాస్త్రముల యందు వ్రాయబడియున్నది.

స్వా. ప్ర. :-

***న గో ప్రదానం న మహీ ప్రధానం న చాన్న దానం హి తథా ప్రదానమ్/***
***యథా వదన్తీహ బుధాః ప్రధానం సర్వప్రదా నేష్వభయ ప్రదానమ్ //***

"గోదానము, భూదానము, అన్న దానము మున్నగు దానములలో అభయ ప్రదానము మించిన దానము ఇంకొకటి లేదు."

స్మృతులలో కూడ నిట్లున్నది.

***అభయం సర్వ భూతేభ్యో దత్వా సన్యాస మాచరేత్/***

సన్యాసము నాల్గురకములు. కుటీచక సన్యాసము, బహూదక సన్యాసము, హంస సన్యాసము, పరమహంస సన్యాసము. –ఈ

నాల్గు రకములలో ఏ రకపు సన్యాసము తీసికొనదలచినను ప్రాణులన్నిటికి అభయమును ఇచ్చి సన్యాసమును తీసికొనవలెను. అభయము కాయికముగను, వాచికముగను, మానసికముగను కూడ ఈయవలెను. మనోవాక్కాయములచే ఏ ప్రాణిని దుఃఖింప జేయకూడదు. పురుగులు మొదలగు వాటిని హింసించకుండుట కాయికమగు అభయము. శరీరముతో ఎవరిని హింసించరాదు. చెట్లకొమ్మలు మొదలగు వానిని విరచుట కూడ కాయికమగు హింసయే.

వినువానికి దుఃఖముకలుగు కటు వచనములు పలుకుట వాచికమగు హింస అనబడును. ఏ ప్రాణి యందును ఉద్రేకముతో ప్రవర్తించ రాదు. సత్యము, శ్రోతల మనస్సులను సంతోషింప చేయునట్లు మధుర వాక్కులను పలుకవలెను. అవి పరిణామము నందు వినిన వానికి సుఖమును కలుగ జేయు యథార్థ వాక్యములు అయి ఉండవలెను. ఇది వాచికమగు

అభయము.

ఎవరిని గురించియు చెడు ఆలోచనలు యుండరాదు. అందరి గురించియు శుభమునే కోరవలెను. ఇది మానసికమగు అభయము.

***యో దత్త్వా సర్వభూతేభ్యః ప్రవ్రజత్యభయం గృహాత్ |***
***తస్య తేజోమయా లోకా భవన్తి బ్రహ్మ వాదినః||***

"ఎవరు ప్రతి ప్రాణికిని అభయమును ఇచ్చి తన ఇంటినుండి సన్యాసమును తీసికొని బయటకు వెళ్ళునో ఆ నరునకు తేజోమయములగు లోకములు లభించును."

ఇట్లు సన్యాసి అందరకును అభయమును ఇచ్చును. సామాన్య జనులకు ఆ సన్యాసి బ్రహ్మవిద్యయును, బ్రహ్మవిద్యా సాధనములను ఇచ్చును.

***ద్వే విద్యే వేదితవ్యే ఇతి హస్మ యద్బ్రహ్మ విదో వదన్తి పరా చాపరా చ (ముండక.)***

# ఇరువదవ ప్రసంగము

తెలిసికొనవలసిన విద్యలు రెండు అని బ్రహ్మజ్ఞానులు చెప్పుదురు. 1. పర. 2. అపర

***తత్రాపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదో ఽధర్వవేదః శిక్షా***
***కల్పో వ్యాకరణం నిరుక్తం ఛందో జ్యౌతిషమతి, అథ పరా యయా తదక్షర మధిగమ్యతే |***

వానియందు ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వవేదము, శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందము, జ్యోతిషము ఇవి అపరవిద్య అనబడును. అక్షర బ్రహ్మమును ప్రాప్తింప జేయునది పరవిద్య. అక్షరబ్రహ్మమును తెలిసికొనిన వానికి భయము కలుగదు.

***ఆనన్దం బ్రహ్మణో విద్వాన్ న బిభేతి కుతశ్చన|***

ఈ ఆనంద స్వరూపుడగు బ్రహ్మమును తన ఆత్మరూపునిగా తెలిసికొనిన విద్వాంసుడు దేనినుండియును భయపడడు. ఆతడు అభయదానము కూడ ఇచ్చుటకు సమర్థుడు.

అంతట రాజావారు ప్రశ్నించిరి :- తిరిగి తమ దర్శనము ఎప్పుడు?

స్వా.ప్ర. :- ఎవరి దర్శనము చేసినచో దరిజేరగలరో వారి దర్శనము చేయుడు. మావంటి వారి దర్శనము శవదర్శనము వంటిది.

రాజా :- ఆ దర్శనము చేయించువారు కూడ తమరే.

స్వా. ప్ర. :—వారి దర్శనమునకు ఏ కోరికయును ఉండదు. కావున ఆయన స్వసంవేద్యుడు.

అటు తరువాత రాజావారు, స్వామి శ్రీ నిత్యానందుల వారు మొదలగు వారందరు వెళ్లిపోయిరి.

ఓం

# ఇరువదొకటవ ప్రసంగము

ఒకప్పుడు స్వామి శ్రీ ప్రకాశానందులవారు జేతపురము చేరుకొనిరి. అంతట వారు ఆ సంగతి శ్రీ నిత్యానంద స్వామివారికి ఉత్తరము ద్వారా తెలిపిరి. ఉత్తరము ఇట్లుండెను. "నడచు శక్తి లేదు. బండి అద్దెకు డబ్బు లేదు. కావున దయయుంచి జేతపురమున దర్శనము ఇవ్వండి." ఈ వార్త తెలిసికొని శ్రీనిత్యానందులవారు జేతపురము బయలు దేరిరి. వారితో కూడ వైద్య రాజగోపాలజీ భాయి కూడ వచ్చిరి. వారు వెళ్ళుసరికి స్వామి శ్రీ ప్రకాశానందులవారు జమ్ కానా క్లబ్బు బైట నేల దుమ్ములో కూర్చొనిరి. ఇది చూచి గోపాలజీ భాయి పలికెను :- "స్వామి తమరు దుమ్ములో కూర్చొని ఉన్నారా?" అట్లని వచ్చిన అందరితో బాటు తాము కూడ ఆ దుమ్ములోనే కూర్చునిరి.

# మోహ బుద్ధి పోయినచో దుమ్ము రాజభవనము సమానముగా తోచును

ఈ ప్రసంగమున శ్రీ నిత్యానందస్వామి వారు ఈ దృష్టాంతమును చెప్పిరి.

ఒక సమయమున ఒక నవాబు ఏనుగుపై కూర్చుని వెళ్లుచుండెను. అదే మార్గమున త్రోవలో ఒక ఫకీరు కూర్చొనియుండెను. అతనిని చూచి సేనాధిపతిపలికెను ”మా నవాబుగారు వచ్చుచున్నారు. తమరు లేవండి.”

ఫకీరు :— ఆయన ఏనుగు నవాబుగారు అయితే నేను ధూళి నవాబును.

సేనాధిపతి :- "స్వామీ! అదేమి అట్లు చెప్పుచున్నారు? వారికి పెద్ద ధనాగారం కలదు. తమ వద్ద ఏమి కలదు?”

ఫకీరు :- “వారు ప్రజలను ముష్టి అడుగు కొనెదరు. అందుచే అంత ధనము వారి దగ్గరకు చేరినది. నేను ముష్టి ఏమైన

అడుగుకొనుచున్నానా?

సేనా :- వారికి పెద్ద సేన ఉన్నది. తమకేమైన ఉన్నదా?

ఫకీరు :- వారికి శత్రుభయము కలదు. అందుచే వారు సైన్యమును పెంచిరి. నాకేమి భయము?

సేనా :- వారికి దివాను మొదలగు పెద్ద పెద్ద ఉద్యోగస్థులు కలరు.

ఫకీరు :—వారికి తెలివి లేదు. అందుచే నౌకరులను పెట్టుకొనుచున్నారు. నాకేమైన బుద్ధి లేదా?

ఇంతలో నవాబుగారు అచ్చటికి వచ్చిరి. ఇదేమి గొడవ అని అడిగెను.

సేనా :- "ఈ ఫకీరు త్రోవలో కూర్చొని ఉన్నాడు. చెప్పినను లేచుట లేదు. అడ్డదిడ్డముగా సమాధానము చెప్పుచున్నాడు."

నవాబుగారు ఏనుగు నుండి క్రిందికి దిగిరి. ఆయన కాళ్ళ మీద పడి వినయముతో వారిని

ఏనుగుపై కూర్చుండ బెట్టుకొని తీసికొని వెళ్లిరి.

స్వామివారు దుమ్ములో కూర్చొనిరి. మాయిక పదార్థముల యందు మోహబుద్ధి నివృత్తి పొందిన వారికి రాజభవనము, దుమ్ము రెండును సమానమే.

# త్యాగమూర్తి మస్తరామ్ మహారాజావారు

వైద్య రాజ :- త్యాగమూర్తి యగు మస్తరామ్ మహారాజ్ గారు కూడ ఏ చెట్టు కిందనో దుమ్ములో పడి ఉండెడివారు.

స్వా. ప్ర: : మస్తరామ్ స్వామివారితో నన్ను పోల్చవద్దు. వారు మహా త్యాగులు.

శ్రీనిత్యానందులవారు ప్రకాశానందులవారిని అడిగిరి. తమరు అసలు మస్తరామ్ వారిని చూచితిరా?

స్వా. ప్ర.:- విక్రమశకము 1957 (క్రీ||శ|| 1901) నేను జామ్ నగర్ వెళ్లితిని. ఇప్పుడు

అచ్చట ఒక ద్రావిడస్వామి ఉండిరి. ఇచ్చట ఒక మహాత్ములు ఉన్నారు. వారి దర్శనము చేయ తమకు ఉద్దేశ్యము కలదా? అని వారు నన్ను ప్రశ్నించారు. అప్పుడు వారును నేనును కలసి మస్తరామ్ వారిని చూచుటకు వెళ్ళితిమి.

## మస్తరామ్ మహరాజ్ గారి వినోదము

ఆ సమయమున సంభాషణలో ద్రావిడస్వామి మస్తరాము గారితో చెప్పెను. “నేను ఉన్న చోట శిథిలమయిన నూయి ఒకటి కలదు. అందు స్నానము చేయుటకు వీలుపడదు. అందుచే నేను నది దగ్గరకు చాల దూరము వెళ్ళి స్నానము చేయవలసి వచ్చుచున్నది. మీకు రాజులతో పరిచయము కలదు. ఒక వెయ్యి రూపాయలు ధర్మము చేయించినచో నూతిని జీర్ణోద్ధరణము చేయించుకొనెదను.

మస్తరాముగారు ఈ సమాధానము చెప్పిరి.

“నేను ధర్మకార్యము కొరకు ఇప్పించగలననుకొండి. అది బాగుచేయబడిన తరువాత ఏ అత్తయు, కోడలు అయినా పోరాడుకొని కోడలు వచ్చి నూతిలో పడినచో మీకును, నాకును పాపము. అట్టి పనులు ఏల చేయవలెను?”

స్వా. ని. :- మస్తరాముగారి మాట వినోదముతోనే నిండి యుండెడిది. ఒకప్పుడు ఒక భక్తుడు ఆయన వద్దకు వెళ్ళి కోరెను.

స్వామీ! మేము దేవునకు ఒక మందిరము కట్టించనున్నాము. తమను తఖ్తసింగ్ మహారాజు గారితో మాకు సహాయము చేసి ఆ వ్యయము భరించమని చెప్పండి.”

మస్తరామ్ గారు ప్రశ్నించెను:_ "నీ దేవుడు గొప్ప వాడా? తఖ్త సింగ్ గొప్ప వాడా? గొప్ప వాడు దేవుడు కదా! గొప్ప వాడు తక్కువవాని వద్దకు వెళ్ళి ముష్టెత్తుట తగునా! నీ దేవుని మందిరమున కూర్చుండ బెట్టవలెనను కోరిక

యున్నచో నీవు ఆయన వద్దకే వెళ్ళి అడుగుము. ఆయన ఇచ్చిన డబ్బుతో మందిరము కట్టించుము.”

## మస్తరామ్ మహారాజ్ నిష్కామి

మస్తరామ్ మహారాజ్ గారి వద్ద భావనగరాధిపతి తఖ్తసింగ్ గారు ఒక పవిత్ర దివసమున నాలుగైదు వేల రొఖ్ఖము ఉంచెను. అది చూచి స్వామివారు అడిగిరి. “ఈ రూపాయలు ఎందుకు ఉంచిరి?”

మహా:- “తమ కొరకు కాదు. తమకు యోగ్యులని తోచిన బీద వారికి ఇది పంచి పెట్టండి.”

“మీ దగ్గర నుంచి ధనము తీసికొని నేను ఇతరులకు పంచిపెట్టవలెనా? నేను మీ నౌకరునా?” అని మస్తరాముగారు అనిరి.

స్వా.ప్ర. :- వారు చెప్పినది నిజమే. ఇతరుల వద్ద నుంచి డబ్బు తీసుకొని పంచిపెట్టుట సన్యాసికి నిషిద్ధము.

# సన్యాసికిగాని బ్రాహ్మణునకుగాని ప్రతిగ్రహము నిషిద్ధము

***ప్రతిగ్రహం న గృహ్ణీయాత్ నైవ చాన్యం ప్రదాపయేత్ |***
***ప్రేరయేద్వా తథా భిక్షుః స్వప్నేఽపి న కదాచన||***
***(నారద పరివ్రాజకోపనిషత్)***

"భిక్షువునకు ప్రతిగ్రహము కూడదు. తాను ఇతరులకు ఏమియును ఇప్పించరాదు. అటులనే స్వప్నమునందుకూడ ఇతరుని ఇవ్వమని ప్రేరేపించరాదు."

స్వా. ని. :- మనువు బ్రాహ్మణునికి అధ్యయనము, అధ్యాపనము, యజనము, యాజనము, దానము, ప్రతిగ్రహము అను ఆరు కర్మలు చేయుటకు అధికారము ఇచ్చిరి. అయినా, తాము ప్రతిగ్రహమును నిషేధించుట సమంజసమే. ఏలనన-

***ప్రతి గ్రహ సమర్థోఽపి ప్రసఙ్గం తత్ర వర్జయేత్/***
***ప్రతి గ్రహేణ హ్యస్యాశు బ్రాహ్మం తేజః ప్రశామ్యతి//***

"ప్రతిగ్రహమునకు సామర్థ్యము ఉన్నను ఆ ప్రసంగమును విసర్జించవలెను. ఏలనన, బ్రాహ్మణుని బ్రహ్మ తేజము ప్రతిగ్రహముచే నశించును." ఈ దృష్టాంతముచే ఆ సంగతి బోధపడును.

వాయుపురాణము నందలి రేవాఖండమున ఈ కథ యున్నది.

ధూమసేనుడను ఒక రాజు కలడు. అతడు సూర్యగ్రహణం సమీపించినంతనే ఒక బంగారు రథమును తయారు చేయంచెను. అశ్వములను స్వర్ణ భూషణములతో అలంకరించి నర్మదాతీరమునందలి కపిలాసంగమమునకు వచ్చి ముద్గలుడను ఉంఛవృత్తిశీలుడైన ఋషిని ఇట్లు ప్రార్థించెను-

"ఈ భూషణములతో కూడిన రథమును స్వీకరించుడు." కాని ముద్గలఋషి స్వీకరించుటకు ఇష్టపడలేదు. అంతట రాజు తన నౌకరులను పిలచి చుట్టుపక్కలనున్న గ్రామములలో ప్రతిగ్రహము చేయుటకు సామర్థ్యముకల బ్రాహ్మణుని తీసికొని రమ్మని పంపెను. నౌకరులు ఎంత శ్రమపడినను ఎవరును రాలేదు. రాజు ఎంతయో ఖేదముతో పలికెను.

"ఏమి, ఈ ప్రదేశమున ఈ దానము స్వీకరించి నన్ను తరింపజేయు బ్రాహ్మణులు లేనే లేరా?"

ఈ మాటలు విని గాలవఋషి పలికెను."నీయందలి అనుగ్రహముచే నేను ఈ సంసార సాగరము నుండి నిన్ను ఉద్ధరించెదను."

ఆ కపిలాసంగమమున ఉన్న బ్రాహ్మణులెల్లరును ఆతనిని ఆ ప్రతిగ్రహమును చేయవలదని చెప్పిరి. అయినను గాలవఋషి దానిని ప్రతిగ్రహించెను. తోడనే అతని తేజము,

తపము, కీర్తి సర్వము నశించెను. ఆతని శరీరము నల్లబడెను. వెంటనే ఆతడు చనిపోయెను. కొలది కాలమయిన తరువాత ఆతడు రాజు గారి గుర్రముగా జన్మించి ఎంతయో శ్రమపడెను.

ఒకప్పుడు ధూమ్రసేనుడు ఆ గుర్రముపై కూర్చొని వేటకు వెళ్ళెను. ఒక అడవి పందిని వెంటాడు సమయమున ఆ గుర్రము నదిలో దిగబడి మునిగి పోయెను. గుర్రము నుండి దివ్య స్వరూపముతో గాలవ ఋషి బయటకు వచ్చెను. ఆతడు పలికెను:-

రాజా! నీ వద్ద ప్రతిగ్రహము చేసినందున నీ గుర్రముగా జన్మించి నీకు వాహనముగా నుంటిని. వాహనరూపమున నేను ఎంతయో కష్టమును పొందితిని. నీవు కూడ నన్ను ఎంతయో బాధించితివి.

***దావాగ్నినా తు యద్దగ్ధం పునరేవ ప్రరోహతి।***
***ప్రతిగ్రహేణ యో దగ్ధః స నారోహతి కర్హిచిత్॥***

“అరణ్యము దావాగ్నిచే దగ్ధమయినను మరల పెరుగును కాని ప్రతిగ్రహముచే దగ్ధమయిన నరుడు తిరిగి ఔన్నత్యమును పొందడు.”

ఇట్లు చెప్పి తేజఃస్వరూపముతో అంతర్ధానమయ్యెను.

మనువు మొదలగు వారు స్మృతులయందు ప్రతిపాదించినను ప్రతిగ్రహమును నిషేధించుటకు కూడ కారణము కలదు. ప్రతిగ్రహము బ్రహ్మవిద్యకు విఘ్నమును కలుగ జేయును. అందుకే శాస్త్రజ్ఞులు ఆపద్ధర్మముగా దానికి అంగీకరించిరి.

***అధ్యాపనం యాజనం చ విశుద్ధాచ్చ ప్రతి గ్రహః/***
***విప్రస్య జీవికా ప్రోక్తా తత్రాన్యాత్వాపది స్మృతా //***

“అధ్యాపనము, యాజనము, పరిశుద్ధహృదయుని వద్దనుండి ప్రతిగ్రహమును

విప్రుని జీవనోపాయములని చెప్ప బడినవి. వానిలో చివరిది ఆపద్ధర్మము.”

వైద్య :— ఇచ్చుటికి వచ్చు సన్యాసులలో కొందరు విద్వాంసులు కూడ ఉందురు. అయినను వారు ద్రవ్యమును కోరెదరు.

## విద్వాంసులగు సన్యాసుల విపరీత-ఆచరణము

స్వా.ప్ర. :- ఇతరులు కొంచెము తప్పు చేసిన అంత పాడు కాదు. కాని విద్వాంసులే శాస్త్ర మర్యాదను ఉల్లంఘించినచో వారికి కలుగు అధఃపతనము శివ పురాణమున చెప్పబడినది.

***సాక్షరా విపరీతాశ్చ రాక్షసాస్త ఇతి స్మృతాః/***
***తస్మాద్వై విపరీతం చ కర్మ నైవాచరేద్యతిః//***

సాక్షరులు విపరీతముగా సంచరించిన రాక్షసులు అని చెప్పబడుదురు. ('సాక్షరా' అను పదమును విపరీతంగా ఉచ్చరించినచో రాక్షసా అగును.) కావున యతులు విపరీతాచరణము

చేయుట కూడదు.

ఈ రోజుల్లో ఈ నడవడిక అనేక చోట్ల కనిపించుచున్నది.

విద్వాంసులు విపరీతముగా సంచరించుటచే చాల హీనస్థితికి దిగజారి పోవుదురు. వారు మొదట యతి ధర్మమును విడనాడి రాగబుద్ధిచే ద్రవ్యమును సంపాదించి శాస్త్రవిరుద్ధంగా మఠములను కట్టించెదరు. వాటిని నిర్వహించుటకు అనేక కపటోపాయముల ద్వారా జాగీర్లు మొదలగునవి చేర్చుదురు.

జాగీర్లు సంపాదించిన తరువాత వాటిని నిర్వహించుటకు శిష్యుల సంఖ్య పెంచవలసివచ్చును. తమ పనులకు అడ్డువచ్చిన వారి యందు ద్వేషము పెంచుకొనెదరు. వారిని కోర్టులకు ఎక్కించెదరు. ఇంకను అనేక విధములుగా బాధించెదరు. ఇంతటితో సంతోషించక కొందరు హత్యలు కూడ చేయించెదరు. ఈ చర్యల పరిణామముగా వారి

శిష్యులు వారు ఎప్పుడు పరమపదించెదరా అని ఎదురు చూచెదరు. విషాదులచే గురువులను చంపించుట కూడ కలదు. ఇట్లు దైవ స్వభావమును త్యజించి రాగముచే అసురులయి, అసుర స్వభావము నుండి ద్వేషముచే రాక్షసులగుదురు.

## ఆచార్యులకు ధనము నిషిద్ధము

వైద్య :- సామాన్యులగు సన్యాసులు ధనమును తీసికొనరాదు. అది బాగుగనే ఉన్నది. ఆచార్యులకు ధనము నిషిద్ధము కాదు కదా!

స్వా.ప్ర. :-

***ఆచినోతి చ శాస్త్రార్థమాచారే స్థాపయత్యపి /***
***స్వయమాచరతే యస్మాదాచార్యస్తేన చోచ్యతే //***

"శాస్త్రార్థమును శాస్త్రాధ్యయనము ద్వారా తెలిసికొని తదనుసారముగా సంచరించువాడునై ఇతరుల చేతను ఆచరింప జేయువాడు ఆచార్యుడని చెప్పబడును."

యతి ధనమును స్వీకరించరాదని ధర్మశాస్త్రము చెప్పుచునే యున్నది. కనుక యతి ఆచార్యుడయిన తరువాత కూడ ధనమును గ్రహించనే కూడదు. ఏలనన, శాస్త్ర విరుద్ధముగా తాను సంచరించ రాదు. ఇతరులను సంచరించనీయ రాదు. ఆశ్రమమునకు తగిన పనులనే తాను చేయవలెను. ఇతరుల చేతను కూడ చేయించవలెను.

## శంకరాచార్య భగవత్పాదుల ఆచరణము సన్యాసులకు గౌరవము నిచ్చునది

వైద్యగోపా:- ఆదిశంకరులు కూడా కానుకలు, పూజ మొదలగునవి స్వీకరించెడివారేమో కదా!

స్వా. ప్ర :- ఒకమారు శంకర భగవత్పాదులు ఎల్లెడలను వేద ధర్మమును స్థాపించి కేరళ దేశమునకు విచ్చేసిరి. అంతవరకు అచ్చటి రాజు వారి దివ్యమగు కీర్తిని

వినియుండిరి. “ఆచార్యుల శరీరము మన దేశమునందలిది. ఇది దేశము యొక్క మహా భాగ్యము. ఏలనన, వారి నిష్కల్మషమగు కీర్తి భూమండలమున వ్యాపించినది.” ఈ భావముతో వారి పవిత్రదర్శనము చేయుటకై వెళ్ళి ఆయనను తన భవనములోనికి కొనిపోయెను. ఆయనను సింహాసనము పై కూర్చుండ బెట్టి పాదప్రక్షాళనాదులు చేసి, ఆరతి ఇచ్చి, నైవేద్యాదికములు ఉంచి, ఒక వేయి బంగారు నాణెములతో నిండిన పళ్ళెము వారి చరణముల చెంత నుంచెను.

ఆ స్వర్ణ శకలములతో నిండిన పళ్ళెమును చూచి ఆచార్యులు కేరళాధీశునితో పలికిరి. “ఓ రాజా! మీరు విద్వాంసులు. ధర్మమును ఎరుగుదురు. యతుల ధర్మము మీకు తెలియనిది కాదు. ఈ కానుకలను పుచ్చుకొని అధర్మమున ప్రవర్తించుటచే నేను పతితుడనగుదును. ”

ఇట్లు యతి ధర్మమును ఉపదేశించి ద్రవ్యమును స్వీకరించకుండ వెళ్లిపోయిరి. శంకర

భగవత్పాదులు అంత సమర్థులయినను సన్యాసధర్మమునకు విపరీతముగా సంచరించ లేదు.

వైద్య:- ఆ రోజులలో ఆదిశంకరాచార్యులు ఏనుగులు, గుఱ్రములు, కూడా జనులను, సమస్తమును కలిగి యుండెడివారు కదా! అది ద్రవ్యము లేనిదే ఎట్లు జరుగును?

స్వా.ప్ర.:- ఆది శంకరులకు ఏనుగులు, గుఱ్రములు ఉన్నవని వారి చరిత్రముల యందు లేదు. సత్పురుషులెవరును ఆ విషయమును స్థిరపరచలేదు. ఆయన భిక్షాటనము చేసి భుజించెడివారనియు, చెట్టు క్రింద పరుండెడివారనియు దక్షిణమున నేటికిని అందరు చెప్పుదురు.

వైద్య:- శంకరులు నాలుగు మఠములను నిర్మించిరి కదా!

స్వా.ప్ర.:- మఠములను ఆయన కట్టించలేదు. నాలుగు దిక్కులయందు ధర్మమును

రక్షించుటకు నలుగురు శిష్యులను ఉంచెను. అందుచే భగవత్ స్వరూపులైన ఆచార్యులు ఆశ్రమ విరుద్ధమగు కృత్యములను వేనిని చేయలేదని చెప్పవచ్చును.

వైద్య:- ఆచార్యులు ఏనుగులు, గుర్రములు, ఛత్ర చామరాదులు కలిగి ఉన్నచో ప్రజలు ముగ్ధులగుదురు కాదా!

# సత్పురుషుల సాత్త్విక సంపదకును, రాజుల రాజస సంపదకును మధ్య కల భేదము

సత్పురుషుల మహిమ వారి యోగ బలము చేతనే కాననగును. ఏలనన, సత్పురుషులు సత్త్వగుణ ప్రధానులయి ఉందురు. రాజులు ఏనుగులు, గుర్రములు మొదలగు వాటిని తమ ఐశ్వర్యమును శోభింప జేయుటకు ఉంచెదరు.

కాని ఎవరును సద్భావముతో అంతఃకరణ పూర్వకముగా ఆదరించరు. రాజులు తమ రాజ్యమునందలి దివాను, నౌకరులు, ప్రజలు మొదలగువారిపై అధికారము చలాయించెదరు. కాని వారందరును ధర్మమును యథార్థముగా పాలించు సత్పురుషుని ఆజ్ఞలను పాలించునట్లు రాజు గారి ఆజ్ఞలను పాలించరు. రాజు గారి ఆజ్ఞలను ప్రజలు వారి హయాము ఉన్నంత కాలమే పాటించెదరు. కాని ధర్మ గురువుల ఆజ్ఞానుసారము ఆచంద్ర తారార్కము సంచరించెదరు.

రాజులు తమ రాజ్యమునంతను నిర్వహించుటకు అనేకమంది నౌకరులను పెట్టుకొనెదరు. కాని సజ్జనులకు ఒక పైస అయిన ఖర్చు చేయనవసరము లేదు.

సజ్జనులు వెళ్ళిన ప్రతిచోటయును వేల కొలది, లక్షల కొలది జనులు వారి ఆజ్ఞలను పాలించెదరు. వారి సేవ చేయుటకు

సంసిద్ధులగుదురు. జగత్పరమగు సంపద సత్పురుషుల సంపదయే.

పూర్వము వశిష్ఠ, వామదేవ, భృగు, ఆంగీరసాది సజ్జనుల చరణధూళిచే సార్వభౌమ కిరీటములు పవిత్రమయ్యెను. రాజుల ఔన్నత్యము వారి అధికార కాలము నందు మాత్రమే, అదియును వారి రాజ్యముల యందు మాత్రమే ఉండును. సాత్త్విక పరిపాలనము చేయు సజ్జనుల ఆజ్ఞలు వారి తరువాత వేల కొలది సంవత్సరముల వరకును పాలించబడును. నేడు కూడ వేదధర్మ ప్రతిపాదకులగు వ్యాసవశిష్ఠాదుల ఆజ్ఞలను మన్నించుటకు లక్షలు, కోట్లు జనులు సంసిద్ధులయి ఉన్నారు. వేలకొలది సంవత్సరములకు పూర్వము జన్మించిన సజ్జనుల ఆజ్ఞలను నేటికిని శ్రద్ధా భక్తి సమన్వితముగ గౌరవించుచున్నారు. అటులనే మహాత్ములగు బుద్ధుడు, క్రీస్తు, జరధుస్త మొదలగువారి పేరుపై లక్షల కొలది, కోట్లకొలది జనులు ప్రాణములను అర్పించుటకు సిద్ధముగా నున్నారు. ఈ జగత్తు

యొక్క నిజమగు సామ్రాజ్యము సత్పురుషులదియే. ఈ సామ్రాజ్యమును రక్షించుటకు ఒక్క సిపాయి కూడ అక్కరలేదు.

దైవ సంపద కల జిజ్ఞాసువులు దృష్టిలోనే జగత్తునందలి ఏనుగులు, గుర్రములు, రథములు, పాలకీలు మొదలిగునవి మాయిక సంపదగా లెక్కించబడును. అవి పిల్లలు ఆడుకొను ఆటబొమ్మల వంటివి. ఇక శ్రోత్రియులును, బ్రహ్మనిష్ఠులును, పూజ్యచరణులును, భగవత్స్వరూపులును అగు ఆచార్యుల సంగతి చెప్పవలసిన పని ఏమి?

## అతి పరిచయము వలన అగౌరవము

ఇట్లు స్వామివారితో సంభాషణ జరుగుచుండెను. ఆ సంభాషణలో వైద్యరాజు అడిగెను. "జ్ఞానమునకు సాధనము ఏమి?"

శ్రీ ప్రకాశానంద స్వామివారు సమాధానము చెప్పిరి. మీరు స్వామి వారి వద్ద ఎప్పుడును ఉందురు. నన్ను ఎందుకు

అడుగుచున్నారు?

వైద్య రాజ :— స్వామివారును, తమరును ఒకటే అని తలచుచున్నాను.

స్వా. ప్ర. :- ఇద్దరును ఒకటి అనుకొనినచో స్వామివారినే అడగండి.

స్వా. ని. :— నిత్యము సమీపమున ఉండు వారియందు శ్రద్ధ ఉండదు. అందుచే తమరే చెప్పండి.

వైద్య :- స్వామి వారును, తమరును ఒకటే అని తలచుచున్నాను.

స్వా.ప్ర. :-

***సన్నికర్షోపి మర్త్యానాం అనాదరణకారణమ్ /***
***గాఙ్గం హిత్వా యథాన్యామ్భః త త్రత్యో యాతి శుద్ధయే//***

"ఎల్లప్పుడును కలిసియుండుట కేవలము అనాదరమునకు కారణము. పవిత్రమగు గంగాజలమును విడచి గంగా సమీపమున ఉండు మనుష్యులు పారిశుద్ధ్యమునకు నూతుల వద్దకును

వెళ్ళెదరు". అటులనే సత్పురుషుల వద్ద ఎల్లప్పుడును ఉండువారు సత్పురుషులను గౌరవించలేరు.

# జ్ఞానమును పొందు శ్రద్ధావంతుడగు జిజ్ఞాసువు

శ్రద్ధ ఉన్నచో ఒకని వద్ద నుండియే జ్ఞానము లభించును. శ్రద్ధ లేకపోయినచో ఎంతమంది సాధువుల చెంతకును, సన్యాసుల చెంతకును వెళ్లిన జ్ఞానము లభించదు. మనుష్యులు వారి వద్దకు వెళ్ళినను, వారు జవాబులు చెప్పినను ఆచరణమునందు వానిని చూపించవలెనను సరియగు కోరిక కలుగదు.

స్వా. ని.:- వైద్యరాజు అట్టివారు కారు. తేనెటీగ అన్ని పూవులనుండియు రసమును గ్రహించి తేనెను తయారు చేయునట్లుగనే జిజ్ఞాసువుకూడ వేరు వేరు ప్రదేశములయందు అడిగి జ్ఞానమును సమీకరించును. కావున తాము

వైద్యరాజుకు సమాధానము చెప్పవలసియున్నది.

సా.ప్ర. :- నేనేమి చెప్పను? భగవానుడే గీత యందు చెప్పెను.

**సత్త్వాత్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ/**
**ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞాన మేవ చ//**

"సత్త్వ గుణముచే జ్ఞానము కలుగును. రజోగుణముచే లోభము కలుగును. తమోగుణముచే ప్రమాద, మోహములు కలుగును. అజ్ఞానము కూడా దాని చేతనే కలుగును." ఇట్లు జ్ఞానోత్పత్తికిముఖ్య సాధనము కూడ సత్త్వగుణమే.

## జ్ఞాన భేదములు

శాస్త్రమునందు స్మృతి, అనుభవము అను భేదములచే జ్ఞానము రెండు రకములు. సంస్కారమాత్ర జన్యమగు జ్ఞానము స్మృతి జ్ఞానమని చెప్పబడును. స్మృతిజ్ఞానము యథార్థ,

అయథార్థ భేదములచే రెండు రకములు. యథార్థ అనుభవ జన్యమగు సంస్కారముచే కలిగిన జ్ఞానము యథార్థస్మృతి జ్ఞానము అనెదరు. అయథార్థ అనుభవ జన్యము సంస్కారముచే కలిగిన జ్ఞానము అయథార్థ స్మృతిజ్ఞానము అనబడును.

అనుభవజ్ఞానము కూడ యథార్థ, అయథార్థ భేదములచే రెండు రకములు. యథార్థజ్ఞానము ప్రత్యక్ష, అనుమితి, ఉపమితి, శబ్ద, అర్థాపత్తి, అనుపలబ్ధి భేదములచే ఆరు రకములు. వాని ప్రమాణములు కూడ ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, శబ్ద, అర్థాపత్తి, అనుపలబ్ధి భేదములచే ఆరు రకములు. ఈ విధమగు ఆరు ప్రమాణముల ద్వారాను ఉత్పన్నమయిన జ్ఞానము యథార్థ జ్ఞానము లేక ప్రమాణము అనబడును. ప్రత్యక్ష జ్ఞానమునకు నేత్రములు, త్వక్, జిహ్వా, ఘ్రాణము, శ్రోత్రములు అను అయిదును కారణములు. ఈ అయిదు కారణముల చేతను

ఉత్పన్నమయిన జ్ఞానము ప్రత్యక్ష జ్ఞానము. అద్వైత సిద్ధాంతమున దానిని వృత్తిజ్ఞానము అనెదరు. అయథార్థజ్ఞానము సంశయము, విపర్యయము, తర్కము అని మూడు రకములు. ప్రత్యభిజ్ఞ అను మరియొక జ్ఞానము కలదు. అది ప్రమాత్మకము. ఇట్లు ఆరు విధములగు ప్రమ, రెండురకములగు స్మృతి, మూడురకములగు అయథార్థజ్ఞానము కలసి జ్ఞానము 11 రకములు. అందులో యథార్థజ్ఞానము సత్త్వముచే జనించును.

వేదాంతశాస్త్రమున జ్ఞానము రెండు రకములుగా చెప్పబడినది. 1.వృత్తి జ్ఞానము 2. స్వరూపజ్ఞానము. వృత్తి జ్ఞానము ఇంద్రియముల ద్వారాను, అంతఃకరణము ద్వారాను జన్మించును. అది అనిత్యము. స్వరూప జ్ఞానము ఆత్మజ్ఞాన మనబడును. అది నిత్యము.

ఆత్మ జ్ఞానమునకు అనగా స్వరూప జ్ఞానమునకు అసాధారణ కారణము "తత్త్వమస్యా"ది మహావాక్య విచారము.

సాధారణ కారణములు నిష్కామ కర్మాదులు. అంతఃకరణమున మల, విక్షేప, ఆవరణములు అను మూడు దోషములు ఉండును. నిష్కామకర్మచే మలదోషము పోవును. భగవదుపాసనచే విక్షేపదోషము నివృత్తిని చెందును. జ్ఞానముచే ఆవరణదోషము పోవును.

వివేకము, వైరాగ్యము, శమాదిషట్కము, ముముక్షుత్వము- ఈ నాలుగు సాధనములతోను కూడిన మనుష్యుడు వేదాంతశ్రవణమునకు అధికారి. శ్రవణము ప్రమాణమునందలి అసంభావనను పోగొట్టి వేదవాక్యముల తాత్పర్యము బ్రహ్మము నందు నిశ్చయించుటకు తోడ్పడును. మననము ప్రమేయము నందలి అసంభావనను పోగొట్టును. నిధిధ్యాసనము జీవబ్రహ్మముల భేదమును కలుగజేయు విపరీతజ్ఞానమును నివృత్తి నొందించి జీవబ్రహ్మముల అభేదమును గమనింప జేయును. ఈ దోషత్రయరహితుడగు ముముక్షువు

"తత్త్వమస్యా"ది మహావాక్యముల ద్వారా స్వరూప సాక్షాత్కారమును పొందగలడు ఆత్మ జ్ఞానరూపము. ఈ జ్ఞాన రూపమగు ఆత్మ నిత్యము, శుద్ధము, బుద్ధము, ముక్తము, ఆనందైక రసము, చిన్మూర్తి.

## రజోగుణముచే అనర్థకరమగు లోభము పుట్టును

రజోగుణముచే లోభము అను అనర్థకమగు దోషము పుట్టును. దాని స్వరూపమును గ్రంథకర్తలు అనేక విధములుగా వర్ణించిరి. పదార్థము యథా యోగ్యముగా లభించియుండ అవివేకము ద్వారా వేరు వేరు పదార్థములయందు అంతఃకరణము పొందు వృత్తి విశేషము లోభము. ఈ లోభి పదార్థ సంపాదనము నందు అవివేకముచే పుణ్య పాపములను పరీక్షించడు. అంతియే కాదు. సంపాదించిన పదార్థములను లోకకళ్యాణము కొరకు కాని, ఆత్మరక్షార్థము కాని వినియోగించడు. అప్రాప్త పదార్థములను

మాటిమాటికి కోరుచుండును. ఈ లోభము సకల అనర్థములకును ఆది కారణము.

***లోభాత్ క్రోధః ప్రభవతి క్రోధాద్ద్రోహః ప్రవర్తతే |***
***ద్రోహేణ నరకం యాతి శాస్త్రజ్ఞోఽపి విచక్షణః||***

"లోభముచే క్రోధము పుట్టును. క్రోధముచే ద్రోహము పుట్టును. ద్రోహముచే నరకము కలుగును. శాస్త్ర పండితుడయినను భూతద్రోహముచే నరకమును పొందును.

## ప్రమాదము మృత్యువు వంటిది

తమోగుణముచే ప్రమాదము (పొరబాటు), మోహము, అజ్ఞానము ఉత్పన్నమగును. బ్రహ్మప్రాప్తి కొరకు మనుష్యులకు ఆజ్ఞాపించబడిన శ్రుతి స్మృత్యాదుల వచనములను శ్రవణము చేసినను వానిని మరచి అన్యథా సంచరించుట ప్రమాదము. ఈ పొరపాటు ఏ విధముగను మంచిది కాదు. శ్రుతి ఏమి

చెప్పుచున్నదో చూడుడు.

***ప్రమాదో బ్రహ్మ విద్యాయాం న కర్తవ్యః కదాచన/***
***ప్రమాదో మృత్యురిత్యాహుః విద్యాయాం బ్రహ్మవాదినః//***

"బ్రహ్మ విద్యాభ్యాసము నందు ఎప్పుడు పొరపాటు తగదు. బ్రహవిద్యను సంపాదించుట యందలి పొరబాటు మృత్యువు అని బ్రహ్మజ్ఞులగు సత్పురుషులు చెప్పుదురు."

తన హితాహితములు తెలిసికొను బుద్ధి సామర్థ్యము లేకుండుట మోహము. మోహగ్రస్తుడగు నరుడు తన హితమేదియో, అహితమేదియో నిశ్చయించలేడు. మోక్షసాధనములగునవి హితములు. ప్రతిబంధకములగు మాయా కార్యములు అహితములు. హితాహితముల గ్రాహ్యత్వ త్యాజ్యత్వావివేకము మోహము. విషయము లన్నియును మాయా కార్యములు. అవి

దుఃఖమును గలిగించును. కావున అహితములు, వాని యందు వివేక రాహిత్యముతో ప్రయత్న పూర్వకముగ పురుషార్థము చేయుట మోహము.

## మోహము మద్యము వంటిది

భర్తృహరి సంచార సమయమున జగమునందలి జనులు సత్య పదార్థమును విడనాడి మాయ యందే మునిగి ఉండెడివారు. వారిని చూచి చెప్పెను:-

***ఆదిత్యస్య గతాగతై రహరహః సంక్షీయతే జీవితం***
***వ్యాపారైర్బహుకార్యభార గురుభిః కాలో న విజ్ఞాయతే /***
***దృష్ట్వా జన్మజరావిపత్తి మరణం త్రాసశ్చ నోత్పద్యతే***
***పీత్వా మోహమయీం ప్రమాద మదిరామున్మత్త భూతం జగత్//***

"సూర్యుని గమనాగమనములతో బాటు జీవితము క్షీణించును. వివిధములగు కార్యముల

భారముచే సమయము తెలియదు. జన్మము, వార్ధక్యము, ఆపదలు, మృత్యువు- వీనిని చూచుటచే ఏ మాత్రము బాధ కలుగదు. ఏలనన జగము మోహముతో కూడిన పొరబాటను మద్యమును పానము చేసినది. అందుచే తనను తాను మరచిపోయినది."

ఒక గ్రామమునందలి మాలపల్లెలో ఉత్సవము జరిగెను. వారు వంటకు నిప్పు వెలిగించిరి. జనులు భోజనము చేసి విశ్రమించు సమయమునకు అగ్నిహోత్రము మండిపోయి అరిపోయి యుండెను. అందు బూడిద మాత్రమే ఉండెను. సాయంకాలసమయమునకు అచ్చటికి భర్తృహరి వచ్చెను. చలి కాలపు రాత్రి. కప్పుకొనుటకు వెచ్చని వస్తువు ఏమియు లేదు. కావున ఆయన వెచ్చని బూడిదను పరచుకొని అచ్చటనే పరుండెను.

ప్రక్కనే ఒకడు కల్లు త్రాగి ఒడలు తెలియక పడియుండెను. అర్ధరాత్రి సమయమున ఆతని మత్తు తీరెను. కావున ఆతడు సమీపమున ఉన్న

తన ఇంటికి వెళ్లి తలుపు తట్టెను.

భార్య పలికెను:-- నీవు రోజును ఆలస్యముగా వచ్చుచున్నావు. కల్లు త్రాగుదువు. సంపాదన లేదు. ఈరోజు తలుపు తీయను. భర్తృహరి మహారాజు లేనిదే ఆయన రాణీలకు కాలము గడచినచో నాకు ఏల గడువదు. ఇట్లు తిరస్కార వాక్యములను వినినను ఆతడు రాత్రి అంతయు భార్యను తలుపు తీయమని బ్రతిమాలుచునే ఉండెను. చివర వరకు ఆమె తలుపు తీయలేదు. ఇది వినిన భర్తృహరి ఆలోచించెను. "ఓ మోహమా! నీవు ఎంత హీనమైన దానవు. స్త్రీ అంత స్థిరముగా నున్నను ఆ పురుషునిచే అంత బ్రతిమాలించుచున్నావు."

***పాషాణ ఖణ్డేష్వపి రత్నబుద్ధిః కాన్తేతి ధీః శోణిత మాంసపిణ్డే/***
***పఞ్చాత్మకే వర్ష్మణి చాత్మభానో జయత్యసౌ కాచనమో హలీలా/***

"పాషాణమునందు రత్నమను భావమును

కలిగించును. రక్త మాంసముల సమూహాము నందు మనోహరమగు రమణి అను భావము కలిగించును. పంచభూతాత్మకమైన శరీరము ఆత్మ అనిపించును. అనిర్వచనీయమగు ఈ మోహాము తన లీలచే జగమునంతను జయించుచున్నది."

## అజ్ఞానము సర్వదుఃఖములకును కారణము

అజ్ఞానము అనగా ప్రకాశరహితత్త్వము. తాను ప్రకాశరహితుడయి తన ఆశ్రయమును అప్రకాశితముగా చేయుట అజ్ఞానము. ఇంటి యందలి అంధకారము తాను ప్రకాశరహితముగా నుండి ఇంటియందలి పదార్థములను అన్నిటిని అప్రకాశితములుగా చేయును. అట్టిది అజ్ఞానము. కొన్నిచోట్ల అజ్ఞానము తాను అప్రకాశితముగా నుండి స్వాశ్రయమునందు అన్యపరిణామములు తెచ్చును. రజ్జూపహితమగు చేతనమునందుండు

అజ్ఞానము రజ్జూపహితమగు చేతనమును ఆచ్ఛాదించి సర్పరూపమగు పరిణామమును కలిగించును. అటులనే స్వస్వరూప విషయకమగు అజ్ఞానము సాక్ష్యాశ్రితమయి, సాక్షిని ఆవరించి ప్రపంచరూపమగు జగత్తుగా పరిణమింపజేయును. ఈ అజ్ఞానము "అహం అజ్ఞోఽస్మి" "నేను అజ్ఞానిని" "అహం న జానామి" "నాకు తెలియదు" అను ప్రతీతిచే ప్రతీయమాన మగును. ఈ అజ్ఞానము వాస్తవమునకు తుచ్ఛమైనది. దీని వాస్తవికమగు అస్తిత్వము లేదు. అనగా అధిష్ఠాన జ్ఞానము కలిగిన తరువాత దాని అస్తిత్వము ఉండదు. అయినను స్వాధిష్ఠాన సాక్షాత్కారమునకు పూర్వము ఈ అజ్ఞానము దుఃఖములన్నిటికిని కారణము. కావున సత్పురుషులను శరణుజొచ్చి సద్బోధ ద్వారా ఈ అజ్ఞానమును పోగొట్టుకొనవలెను.

***ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్ నిబోధత |***

***క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథస్తత్ కవయో వదన్తి//***

***(కఠోపనిషత్తు)***

" అజ్ఞానమను నిద్రలో కునికిపాట్లు పడు ఓ మానవులారా! మీరు లెండు, మేల్కొనుడు. శ్రేష్ఠుడగు సద్గురుని పొంది ఆత్మను తెలిసికొనుడు. ఖడ్గము యొక్క తీక్ష్ణమగు పదును వలె జ్ఞానము అత్యంత కఠినమయినది. కావుననే జ్ఞానులు జ్ఞానమార్గము అత్యంత దుర్గమమయినదని చెప్పుదురు."

## మాయ సర్వభక్షిణి

నలుడు భార్యయగు దమయంతిని అరణ్యమునందు ఒంటరిగా విడచి వెళ్లిపోయెను. అంత దమయంతి బిడారిజనుల గుంపుతో తన పుట్టింటి వైపు వెళ్ళుచుండెను. ఒక రాత్రి ఒక వృక్షము క్రింద వారందరు డేరావేసి నిద్రించిరి. దమయంతి మాత్రం భర్తృ వియోగ దుఃఖముతో కుమిలిపోవుచు మేల్కొని యుండెను. అంతలో

ఒక అడవి ఏనుగు మదోన్మత్తమై వచ్చిపడెను. ఇది గాంచి దమయంతి గుంపులోని జనులను మేల్కొలిపెను. " ఓ సోదరులారా! లెండు, లెండు!" ఆమె ఎంతయో గోల చేసెను. అయినను ఎవ్వరును మేల్కొనలేదు. అంతట అందరను ఏనుగ త్రొక్కివేసి వెళ్ళిపోయెను.

అదే విధముగా శ్రుతి బిగ్గరగా అరచి అరచి చెప్పుచున్నను మన వారు లేవరు. మాయ అందరను భక్షించి వేయును.

వైద్య:- మేల్కొ నుట అనగా నేమి?

స్వా.ప్ర. :- శ్రుతియందు "ఉత్తిష్ఠత, జాగ్రత" అను రెండు పదములు కలవు.

"ఉత్తిష్ఠ" అనగా లెమ్ము, బ్రహ్మమునకు అభిముఖుడవు అగుము. "జాగ్రత" అనగా మేల్కొనుము. అనగా "ఆవరణమును భేదించుము." జగమున నాలుగు రకముల మనుష్యులు ఉన్నారు. 1. పామరులు 2. విషయ పరాయణులు 3. జిజ్ఞాసువులు 4.జ్ఞానులు.

# ఇరువదొక్కటవ ప్రసంగము

1. పామరులు నాస్తికులు అగుటచే శ్రుతి ఆజ్ఞలను నమ్మరు. వారు రజస్తమోగుణ ప్రధానులగుటచే ఇహలోకమునందలి విషయ సుఖమే సత్యమని తలచెదరు.

2. విషయలోలురు రజోగుణ ప్రధానులు. వీరు పరలోక సుఖము శ్రేయస్కరమనుకొనెదరు.

3. జిజ్ఞాసువులు మిశ్ర సత్త్వగుణ ప్రధానులు. వీరు ఈ లోకము నందును, పరలోకము నందును లభించు సుఖములను త్యజించి మోక్ష సుఖమును కోరెదరు.

4. జ్ఞానులు ఆవరణభంగము కావించి మోక్ష సుఖమును పొంది యుందురు. పై శ్రుతి ఈ నాలుగు రకములలోను ఉన్న పామరులను గురించి కాని, జ్ఞానులను గురించి గాని ఆజ్ఞాపించుట లేదు. జిజ్ఞాసులను ఉద్దేశించి ఆజ్ఞాపించుచున్నది.

వైద్య:— ఆవరణ భంగమునకు సాధనమేమి?

స్వా. ప్ర. :- ఆ సాధనమును శ్రుతి స్పష్టముగనే చెప్పుచున్నది.

**శ్రోతవ్యో, మన్తవ్యో నిదిధ్యాసితవ్యః ।**

"ఆత్మ శ్రవణము చేయదగినది. మననము చేయదగినది. నిది ధ్యాసనము చేయదగినది." ఉపక్రమాది షడంగముల ద్వారా వేద శబ్దముల తాత్పర్యము అద్వితీయుడగు బ్రహ్మమునందే అను నిశ్చయమును పొంది వానిని తెలిసికొనుట శ్రవణము అనబడును. ఏ ప్రకరణమునందైనను వస్తు ప్రతిపాదనమునకు ఉపయోగ పడునవి ఉపక్రమోపసంహారములు. ఏ వస్తువు ప్రతిపాదించబడుచున్నదో దానిని పలుమారు తెలుపుట అభ్యాసము అనబడును. ఛాందోగ్యము ఆరవ అధ్యాయమున "తత్త్వమసి" అను అద్వితీయ బ్రహ్మము తొమ్మిది మారులు ప్రతిపాదించబడినది. ఏ ప్రకరణమునందు ఏ వస్తువు ఏ ప్రమాణముచే ప్రతిపాదించబడినదో ఆ ప్రమాణము కంటె (అనగా ప్రతిపాదించు

శబ్దప్రమాణము కంటె) అతిరిక్తమగు ప్రమాణాభావమును తెలుపుట అపూర్వత్వము. ఎట్లన ఛాందోగ్యము ఆరవ ప్రపాఠకమున ఉపనిషత్ప్రమాణముచే మాత్రము అద్వయబ్రహ్మము ప్రతిపాదించ బడినది. బ్రహ్మమును గ్రహించుటకు మరియొక ప్రమాణము అసమర్థమయినది అని తెలుపబడినది.

ఏ ప్రకరణమున ఏ వస్తువు యొక్క ఆత్మజ్ఞానము కాని, తదనుష్ఠానముకాని ప్రతిపాదించబడినదో, ఆ ప్రకరణమున ఆ ప్రతిపాదితమగు వస్తువు యొక్క ప్రయోజనము ఏదైన చెప్పబడిన అది దాని ఫలము అని చెప్పబడును.

ఛాందోగ్యము ఆరవ అధ్యాయము చూడుడు.

**"ఆచార్యవాన్ పురుషో వేద తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే"**

ఆచార్యుని ఉపాసించు బ్రహ్మమును తెలిసికొనుటకు వలయు సామర్థ్యమును పొందును. ఆ జ్ఞాని విముక్తి కలుగు వరకు నిరీక్షించు చుండును. అనగా ప్రారబ్ధము క్షయమును పొందు వరకు నిరీక్షించుచుండును. ప్రారబ్ధ క్షయమును పొందినంతనే బ్రహ్మమునందు లీనమగును. ఇట్లు అద్వితీయ బ్రహ్మజ్ఞానముచే బ్రహ్మప్రాప్తి అను పరమ ప్రయోజనము కలదు.

ఏ వస్తువు ప్రతిపాదించబడినదో దానిని ప్రశంసించుచు చెప్పు పదములు అర్థవాదములు అనబడును.

ఉదా:— ఉద్దాలకుడు శ్వేతకేతునితో చెప్పెను.

***"ఉత తమాదేశ మప్రాక్ష్యో యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మత మవిజ్ఞాతం విజ్ఞాతం భవతి."***

" ఓ కుమారా! దేనిని శ్రవణము చేయుటచే

శ్రవణ విషయము కానిది కూడ శ్రవణ విషయమగునో, మనన విషయము కానిది కూడ మనన విషయము అగునో, బుద్ధి విషయము కానిది కూడ బుద్ధి విషయము అగునో, అనగా తెలియనగునో ఆ ఆత్మతత్త్వమును తెలిసికొనుటకు నీవు గురువుచెంత జిజ్ఞాసను వ్యక్తపరచితివా?" అని అద్వితీయ బ్రహ్మమును ప్రశంసించెను.

ఏ ప్రకరణమున ఏ వస్తువును ప్రతిపాదించవలెనో, ఆ ప్రకరణమున ఆ వస్తువునే ప్రతిపాదించుటకు చెప్పిన యుక్తి ఉపపత్తి అనబడును.

***"యథా సౌమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్***
***వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్// చాందోగ్య. 6. అ.***

ఓ సౌమ్యుడా! మృత్పిండజ్ఞానము కలుగుటతోడనే, మృణ్మయ పాత్రల జ్ఞానము కలుగును. మట్టితో చేయబడిన కుండ మొదలగు వికారములును, నామములును, రూపమును,

సంజ్ఞను బోధించుటకు మాత్రమే. నిజమునకు మట్టి ఒక్కటియే" అని తోచును. అటులనే సాంసారిక పదార్థములన్నియును అద్వితీయ వస్తుప్రతిపాదకములగు యుక్తులనియే తెలియనగును. నిజమునకు అద్వితీయ బ్రహ్మము తప్ప వేరొక వస్తువు లేదు.

ఇట్లు ఆరు లింగముల చేతను ఉపనిషదాదుల ద్వారా బ్రహ్మమునకు సంబంధించిన సర్వ ప్రమాణములును, సంశయములును అంతరించు వరకును చేయు అభ్యాసము శ్రవణము. ఈ శ్రవణము గురూపదిష్టమగు శాస్త్రము ద్వారా జరుగును.

## మననము

శ్రవణము చేసిన అద్వితీయ బ్రహ్మము అను అర్థమును శ్రుత్యను కూలములగు అనుమానాది యుక్తుల ద్వారా చింతించుట మననము. ఆవు మేత మేసిన తరువాత ఏ చెట్టునీడనైన కూర్చుని నెమరు వేసి తృప్తిని

పొందును. అటులనే వేదాంతశాస్త్రమును శ్రవణము చేసిన తరువాత ఏకాంతమున కూర్చొని దానిని మనము చేయుటచే దృఢముగా బోధపడును.

## పంచదశియందలి మనన లక్షణము

***యుక్త్యా సంభావిత తత్త్వానుసంధానం మననం తు తత్/***

"యుక్తుల ద్వారా గురువు వద్ద శ్రవణము చేసిన అభిప్రాయము సంభవము అను నిశ్చయమును పొందుట మననము."

శ్వేతకేతునకు ఆతని తండ్రి "తత్త్వమసి" అని తొమ్మిది మారులు ఉపదేశించెను. "జీవుడు బ్రహ్మము" అను ఉపదేశము ఎన్ని మారులు శ్రుతి చెప్పినను "జీవుడు బ్రహ్మము" అను జ్ఞానము మననాభావమున వ్యవహారపరుడును అనధికారియునగు జీవునకు కలుగదు. కావున జీవ బ్రహ్మైక్య జ్ఞానమును సంపాదించుటకు సార భూతమగు "తత్త్వమసి" యందలి 'తత్ , త్వమ్'

శబ్దముల శబ్దార్థము నందు భాగ త్యాగ లక్షణ ద్వారా జీవబ్రహ్మ భేదమును నిశ్చయించ కలదు.

"తత్" శబ్దమునకు వాచ్యార్థము ఈశ్వరుడు, సర్వజ్ఞత్వాది ధర్మ విశిష్టుడు.

"త్వమ్" శబ్దమునకు వాచ్యార్థము జీవుడు, అల్పజ్ఞత్వాది ధర్మవిశిష్టుడు.

సర్వజ్ఞత్వ, అల్పజ్ఞత్వములు రెండును విరుద్ధ ధర్మములు. కానీ ఉపనిషదాదులను అభ్యసించినవారికి ఆ ధర్మములు ఉపాధి మాత్రములే ననియు, ఉపహిత జీవ చైతన్యమును, ఈశ్వర చైతన్యమును ఒకే చిదేక రసమగు బ్రహ్మము అని తెలియును. ఇట్లు 'జీవుడు బ్రహ్మము' అను నిశ్చయమునకు సాధకుడు వచ్చును. అంతే కాదు. ఒకే ఆకాశము ఘటము, పటము అను వేరు వేరు ఉపాధులను పొందుటచే ఘటాకాశ పటాకాశాది రూపమున స్థూలముగా ప్రతీతమగును.

అటులనే ఒకే బ్రహ్మము అను చైతన్యము

అవిద్య లేక మాయ యొక్క వేరు వేరు ఉపాధుల ద్వారా జీవరూపమున అల్పజ్ఞుడు గాను, ఈశ్వర రూపమున సర్వజ్ఞుడుగాను ప్రతీతుడగును. ఈ యుక్తులు నేను “శుద్ధస్వరూపుడను” అను అభేదనిశ్చయమును చేయుటకు ఉపకరించును. అభేద నిశ్చయమునకు ఇట్టి యుక్తులను ఉపయోగించుట మననము.

ఈ కారణముచే ఏ యుక్తుల ద్వారా భేదజ్ఞానము పెరుగునో అవి కుతర్కము అనిపించుకొనును. మననము అనిపించుకొనదు.

బ్రహ్మవిద్యను సంపాదించవలెనను కోరిక కలవాని యందు వినయము, మాహాత్మ్యజ్ఞానము, శ్రద్ధ, బ్రహ్మచర్యాదులును ఉండవలెను. ఆ గుణములు లేకపోయినచో బ్రహ్మవిద్యను సంపాదించుటకు ప్రయత్నించినవారు కుతర్కమునకు లోనగుదురు. మననము నందు యుక్తులను ఉపయోగించవలెను. కాని విరోచనుడు ఉపయోగించినట్టివి మాత్రము కారాదు.

# నిదిధ్యాసనము

విజాతీయవృత్తులను తిరస్కరించుటతో బాటు సజాతీయ వృత్తులను ప్రవహింపజేయుట నిదిధ్యాసనము.

“నేను సత్తును, చిత్తును, ఆనందమును, కూటస్థుడను, అక్రియుడను, అజరుడను, అమరుడను, పూర్ణుడను, నిత్యుడను, శుద్ధుడను, బుద్ధుడును, ముక్త స్వరూపుడు నగు ఆత్మను." - ఇట్టి జ్ఞానరూపమగు ప్రవాహము సజాతీయ వృత్తి ప్రవాహము.

“నేను బ్రాహ్మణాది నాలుగు వర్ణములకును చెందిన వాడను కాను. బ్రహ్మచర్యాది నాలుగు ఆశ్రమములును నేను కాదు. పురుష, స్త్రీ, బాలాది భేదములు నావి కావు” - ఇట్టి జ్ఞానరూపమగు వృత్తుల ప్రవాహము విజాతీయ ప్రత్యయ తిరస్కారము. నిదిధ్యాసనము జ్ఞానమునకు సాక్షాత్కారణము. అది పరిపాకమును పొందనిదే అవిద్యాక్షయము జరుగదు.

***"నిదిధ్యాసన శూన్యస్య నాస్త్య విద్యాపరిక్షయః।***

నిదిధ్యాసన రహితుడయిన వానికి అవిద్య నశించదు. ఈ రోజులలో శ్రవణ, మననములు చేయుట కలదు. గురువు వద్ద శాస్త్ర శ్రవణము చేయుదురు. మననముతో ఎల్లప్పుడును శాస్త్రావలోకనము చేసి కంఠస్థము కూడ చేయుదురు. కాని ఏకాంతమున కూర్చొని ఎవడును నిదిధ్యాసనము చేయనంత వరకు బ్రహ్మసాక్షాత్కారము కలుగదు.

***శ్రుతేః శత గుణం విద్యాన్మననం మననాదపి। నిదిధ్యాసం లక్ష గుణం అనన్తం నిర్వికల్పకమ్ ॥ (వివేక చూడామణి)।***

"వేదాంత శ్రవణముకంటె బ్రహ్మముయొక్క మననము నూరు రెట్లు గొప్పది. మననము కంటెను బ్రహ్మము యొక్క దృఢధ్యాసము లక్షరెట్లు ఫలము కలది. నిర్వికల్ప సమాధి అంతకంటే అనంతమగు ఫలమును ఇచ్చును." నిర్వికల్ప సమాధి ద్వారా జ్ఞానము కలుగును.

జ్ఞానముచే అన్ని రకములగు దుఃఖములును నివృత్తి చెందును. కావుననే శ్రుతి చెప్పుచున్నది.

**ఆత్మా వారే ద్రష్టవ్యః**

ఓ మైత్రేయీ, ఆత్మ దర్శించదగినది.

వైద్య:— చాలా రోజుల నుండి నేను వాక్సంయమము కొంచెముగా ఉంచుకొనుచున్నాను. చిత్తమును అంతర్ముఖముగా చేసికొనుటకు ప్రయత్నించుచున్నాను. అయినను ఇంత వరకును చిత్తము అంతర్ముఖము అగుట లేదు.

స్వా.ప్ర.:- చాలా మంచిది. ఇప్పుడు చిత్తము అంతర్ముఖము కాకపోయినను భయము లేదు. నీవు మార్గమున ఉన్నావు. నీ అభ్యాసానుక్రమము శ్రుతిని అనుసరించి ఉన్నది. ఆ విధముగా సతతము అభ్యసించినచో చిత్తము అంతర్ముఖము అగును.

***యచ్ఛేద్వాఙ్మనసి ప్రాజ్ఞస్త ద్యచ్ఛేత్ జ్ఞానమాత్మని /***

**జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్తద్యచ్ఛేచ్ఛాన్త ఆత్మని//**

"వివేకియగు నరుడు వాణిని మనస్సు నందు లయము చేయవలెను. ఆ మనస్సును ప్రకాశరూపమగు బుద్ధియందు లయము చేయవలెను. బుద్ధిని మహత్స్వరూపమగు ఆత్మయందు లయము చేయవలెను. దానిని శాంతమగు ఆత్మయందు లయము చేయవలెను."

లౌకికములును, వైదికములును అగు శబ్దములను ఉచ్చరించుటకు హేతువులగు వాగాది ఇంద్రియములను అధికారియగు పురుషుడు మనస్సు నందు లయము చేయవలెను. వాగాది ఇంద్రియముల వ్యాపారములను అన్నిటిని త్యజించి మనోవ్యాపారమునందు మాత్రమే తాను స్థితిని పొందవలెను. వాక్కును జయించిన తరువాత సంకల్పవికల్పాత్మకమగు మనస్సును విజ్ఞానము నందు - బుద్ధియందు లయము చేయవలెను. "నేను మనుష్యుడను, నేను బ్రాహ్మణుడను" అను

విశేషాహంకారమునకు పేరు జ్ఞానాత్మ.” అధికారి ఈ జ్ఞానాత్మరూపమున స్థితిని పొందవలెను. అనంతరము విశేషాహంకారమును మహత్స్వరూపమున లయము చేయవలెను. అనగా నేను మనుష్యరూపమున ఉన్నాను, బ్రాహ్మణ రూపమున ఉన్నాను అను విధమున అహంకారమును త్యజించి అస్మితారూపమున శేషించి ఉండవలెను.

అహంకారము యొక్క సూక్ష్మావస్థయే “అస్మిత”. ఈ అస్మితయే మహత్తత్వము. ఇదియే సూక్ష్మాహంకారము అని కూడ చెప్పబడును.

అస్మితా రూపమగు మహదాత్మను ఏకరస చైతన్యరూపమగు శాంత ఆత్మయందు లయము చేయవలెను. అస్మితను మాత్రము త్యజించి కేవల చైతన్య రూపముతో మాత్రమే ఉండవలెను.

ఈ ప్రకారము చైతన్యమగు ఆత్మయందు చిత్తమును అన్ని విధముల లయము చేయుట నిరోధ సమాధి.

1.వాక్ నిరోధము 2. నిర్మనస్కత్వము, 3. అహంకార రాహిత్యము 4. మహత్తత్త్వ రాహిత్యము అనునవి నాలుగు దశలు.

ఇచ్చట అహంకార రాహిత్యము అనగా విశేషాహంకార రాహిత్యము, మహత్తత్త్వ రాహిత్యము అనగా సామాన్య అహంకార రాహిత్యము అని తెలిసికొనవలెను.

1. గోవులు, అశ్వములు మొదలగు జంతువుల యందు మానవునికి ఉన్నట్లు వాగింద్రియము లేదు. అటులనే వాగింద్రియము ఉన్నను దాని వ్యాపారములు స్వాభావికముగా అభావమును పొందుట వాక్ నిరోధము అను మొదటి దశ.

2. పుట్టుక నుండియు మూగయును, చెముడును కల బాలుర యందు మనోవ్యాపారములు స్వాభావికముగా అభావమును పొందును. అటులనే వాక్, శ్రోత్రాదులు, మనస్సు ఉండినను మానవుని

మనోవ్యాపారములు స్వాభావికముగా అభావమును పొందుట నిర్మనస్కత్వము అను రెండవదశ.

3. తంద్రావస్థయందు అనగా నిద్రారంభమునందు అహంకారము ఉండును. కాని విశేషాహంకారము ఉండదు. ఏలనన ఆ స్థితి యందు "నేను ఉన్నాను" అను ప్రతీతి కలుగును. కాని నేను ఫలానా వాని కుమారుడను, ఫలానాజాతికి చెందిన వాడను- ఇటువంటి విశేష ప్రతీతి కలుగదు. తంద్రావస్థయందు ఉన్నంతవరకు సామాన్య అహంకారమే యుండును. అటులనే తంద్రావస్థను పొందకపోయినను విశేషాహంకారమును పొందకపోయినచో అహంకార రాహిత్యము అను మూడవ దశ అని తెలిసికొనవలెను.

4. సుషుప్తి యందు సామాన్యాహంకారము ఉండదు. ఏలనన ఆ సమయమున "నేను" అను ప్రతీతి కూడ కలుగదు. అటులనే సుషుప్తి

లేకపోయినను కలుగు సామాన్యాహంకారనివృత్తి మహత్తత్వరాహిత్యమను నాలుగవ దశ.

వైద్య: – నేను పూర్వము కొంచెము ఎక్కువగానే అభ్యాసము చేసెడివాడను. అంతలో యువకుడైన నా కుమారుడు చనిపోవుటచే పుత్రశోకముచే అభ్యాసమునకు అంతరాయము కలిగినది. నేను పుత్ర శోకమను లోతగు నూతిలో పడిపోతిని. ఇప్పుడు ఇంకా కొంచెము నయమే.

స్వా.ప్ర.:- తల్లి, తండ్రి, భార్య, పుత్రులు మొదలగు వారి వియోగము జగమున నీ ఒక్కడికే కాదు. అనేకులకు కలిగినది. యోగ వాసిష్ఠమునందు ఈ విషయమున ఒక ఆఖ్యానము కలదు.

## పుణ్యపావనుల వృత్తాంతము

జంబూద్వీపమున మహేంద్ర పర్వతము పై నున్న ప్రవాహతీరమున దీర్ఘతముడను ముని తన భార్యతో కూడ నివసించుచుండెను. అతనికి ఇరువురు బిడ్డలు. పెద్దవాడు జ్ఞాని. వాని పేరు

పుణ్యుడు. చిన్నవాడు కొంతవరకు అజ్ఞాని. వాని పేరు పావనుడు. ముని వార్ధక్యమున దేహత్యాగము చేసెను. భార్య కూడ తనయోగ శక్తి శరీరమును త్యజించి స్వామిని కలిసెను.

పావనుడు తల్లిదండ్రుల వియోగముచే మిక్కిలి దుఃఖించసాగెను. పుణ్యుడు ఆతని వద్దకు వచ్చి ఓదార్చెను. “అబ్బాయీ, పావనుడా! ఎందుకు ఏడ్చుచున్నావు? నీ తల్లిదండ్రులు ఆత్మపదమును పొందిరి. స్వస్వరూపమును పొందిరి. వారికి ఉత్తమోత్తమమగు పదవి లభించినది. నీవు దుఃఖించుటకు ఇందు కారణము ఏమి కలదు? శోకించరాని దాని కొరకు నీవు ఏల శోకించుచున్నావు? నీవు ఎవరకును కుమారుడవు కావు. ఎవరును నీకు తల్లిదండ్రులు కారు. నీకు ఇంతవరకు ఎందరో తల్లిదండ్రులు అయిపోయిరి. నీవు ఎందరకో కుమారుడు అయితివి. ఋతువు ననుసరించి వృక్షములకు కాయలు కాచి పండ్లు పండి రాలిపోవునట్లు జననమరణములు

జరుగుచుండును. నీవు ఈజన్మమందలి నీ తల్లిదండ్రుల కొరకు శోకించుచున్నావు. కాని గడచిన జన్మలయందు అసంఖ్యాకులగు తల్లిదండ్రులు అయిపోయిరి కదా! వారి కొరకు ఏల దుఃఖించుట లేదు? ఓ మహాభాగుడా! నీకు దృశ్యమానమగు ఈ ప్రపంచము జాగృతమయిన భ్రమ. పరమార్థ దృష్టిని చూచిన జగత్తు లేదు. మిత్రులు ఎవరును లేరు. శత్రువులు ఎవరును లేరు. ఎండమావులు ఏవియో పెద్ద నది వలె కన్పించును. వాని యందు ఒక నీటి బిందువయినను ఉండదు. అటులనే జగత్తు అను వస్తువు ఏదియును లేదు. పరమార్థ దృష్టిని విచారించినచో ఈ కన్పించిన దంతయు భ్రాంతి యనియు, మాయా దృష్టిచే మాటిమాటికి ఉత్పన్న మగుచు నశించుచు ఉండును అనియు నీకు తెలియును. ఈ జగము అంతయు నీ సంకల్పముచే జన్మించినది. ఇందు సత్పదార్థము ఏమియును లేదు. నీకు స్ఫురించిన భావములే భాసించును. ప్రపంచమును గురించి ఎట్టి

కల్పనలు చేయుదువో అట్లే అది నీకు కన్పట్టును. పత్నీ భావము కలిగిన చోట పత్ని భాసించును. పుత్రభావము కలిగిన చోట పుత్రుడు భాసించును. బంధుభావముతో బంధువు, మాతాపితరుల భావనచే మాతా పితరులు కన్పట్టును. ఇట్లు ఇదంతయును భావనాధీనమగు ప్రపంచము అగుటచే బంధువులు ఎవరును లేరు. శత్రువులు ఎవరును లేరు. సర్వ కాలముల యందును ఒకే సర్వాత్మ ఉన్నది. యోగదృష్టితో చూచినచో పూర్వము అనేక పర్యాయములు నీవు పశు, పక్షి, జలచరాది అనేక యోనుల యందు జన్మించితివనియు, ఆ సమయమున నీకు ఎందరో బంధుమిత్రాదులు ఉండిరనియు తోచును. ఇప్పుడు నీవు వారి అందరును గురించియు విచారించుట లేదు. ఏలనన ఇప్పుడు నీకు చాల కాలమగుటచే వారి జ్ఞాపకము లేదు. ఓ సోదరా, నీ వాసనను అనుసరించి నీవు జన్మించితివి. నేను కూడ ఇటులనే అనేక జన్మలను పొందితిని.

అజ్ఞానులే దేహేంద్రియాదుల గుణములతో తాద్రూప్యమును పొందుదురు. సుఖదుఃఖములను అనుభవించెదరు. జ్ఞాని దేహేంద్రియముల కర్మలను చేయుచున్నను కర్త కాదు. దర్పణము నందు ప్రతిబింబము పడినను దర్పణము సంతోషమును కాని, దుఃఖమును కాని పొందనట్లుగనే జ్ఞానికి రాగ ద్వేషములు కలుగవు. తన స్వరూపమునందు నిమగ్నుడయి ఉండును. అటులనే నీవు మిథ్యయగు దేహభావమును త్యజించి నిత్య, శుద్ధ, శాంత, పరమానంద స్వరూపమునందు స్థితిని పొందుము. నీవు పరబ్రహ్మ స్వరూపము అయి ఉన్నావు."

ఇట్లు పుణ్యుడు బోధించిన తదుపరి పావనునకు తన స్వరూపజ్ఞానము కలిగెను. తల్లిదండ్రుల వియోగముచే కలిగిన శోకము నివృత్తిని పొందెను. ఈ విధముగా ఇరువురు సోదరులును ఎల్లప్పుడును ఆనందముతో నుండి ప్రారబ్ధ కర్మము క్షీణించిన తరువాత నూనె లేని దీపము నిర్వాణము పొందునట్లు విదేహముక్తిని

పొందిరి.

స్వా. ని.:- స్వామివారు చెప్పిన సంగతి నిజము. దేహము నందు ఆ ధ్యాస ఉన్నంత వరకు- అనగా “నేనే శరీరమును” అను భ్రాంతి ఉన్నంత వరకు దారాపుత్రాదుల యందు మమత్వబుద్ధి యుండును. అందుచే అనేక రకములగు దుఃఖములు అనుభవించవలసివచ్చును.

ఈ విషయమున పద్మపురాణమున ఒక కథ కలదు.

పూర్వము తుంగభద్రా నదీ తీరమున ఆత్మదేవుడు అను బ్రాహ్మణుడు కలడు. ఆతనికి ధుంధులి అను పేరుగల పేచీకోరు భార్య ఉండెను. ఆయనకు సంతానము లేనందున దానధర్మాదులయందు తనకున్న ధనములో అర్ధభాగము ఖర్చుపెట్టెను. అయినను పుత్రుడు కాని, పుత్రికకాని కలుగ లేదు. అపుడు ఆత్మదేవుడు విరక్తి కలిగి ఇంటిని విడచి

వనమునకు పోయెను. మధ్యాహ్న కాలమున దాహము వేసి నందున ఒక చెరువు వద్దకు వెళ్లెను. ఆతడు జలమును ద్రావి చెట్టునీడను రెండు ఘడియలు కూర్చొనెను. అంతలో ఒక సన్యాసి ఆ మార్గమున వచ్చెను. ఆత్మదేవుడు ఆతనిని కాంచి పాదములంటి నమస్కరించెను. ఎంతయో దుఃఖముతో నిట్టూర్పు విడచుచు నిలబడి యుండెను. అట్లు బ్రాహ్మణుడు ఏడ్చుట చూచి సన్యాసి ఆతని దుఃఖమునకు కారణము అడిగెను. అంతట ఆత్మదేవుడు తన సంతాన హీనత్వమునకు చెందిన కథనంతయు వివరించెను. ఇది వినినంతనే సన్యాసికి మిక్కిలి దయ కలిగెను. తన యోగ బలముచే ఆతడు బ్రాహ్మణుని లలాటమున వ్రాయబడిన లిపిని చదివెను. అందు“నీకు ఏడుజన్మముల వరకును సంతానము లేదు” అను సంగతి ఉండెను. అది చదివి సన్యాసి బ్రాహ్మణునితో నిట్లు చెప్పెను. “ఇప్పుడు నీవు పుత్రేచ్ఛను త్యజించుము. అందు సుఖము లేదు. సగరుడు, అంగ రాజు మొదలగు

రాజులు సంతానముచే దుఃఖమును పొందిరి. కావున నీవు పుత్రేచ్ఛను విడనాడుము.” ఇట్లు బ్రాహ్మణునకు ఎంత తెలియజెప్పినను ఆతడు శాంతించ లేదు. మాటిమాటికి సంతతిని ప్రసాదించుడని సన్యాసిని కోరెను. “వరమునీయనిచో తమ చరణములయందు ప్రాణత్యాగము చేసెదనని" చెప్పెను. బ్రాహ్మణుని ఈ పట్టుదల చూచి సన్యాసి ఒక ఫలము నిచ్చి చెప్పెను. “ఈ ఫలము నీ భార్య తిని ఫలాన వ్రతములను ఆచరించినచో సంతానము కలుగును.”

బ్రాహ్మణుడు సన్యాసికి నమస్కరించి, ఫలమును తీసికొని, సంతోషముతో ఇంటికి వచ్చి, వృత్తాంతము నంతయు భార్యకు చెప్పి, ఫలమునిచ్చి ఇది తినుమని చెప్పెను. భార్య బ్రాహ్మణుని ఎదుట అటులనే అని సమాధానము చెప్పెను. కాని తరవాత గర్భధారణముచే కలుగు ప్రసవపీడను గురించి ఆలోచించి ఎన్నియో

కుతర్కములను చేసి, తన ఆవునకు దానిని తినిపించెను. తనకు సీమంతము చేసికొని తన సోదరి కుమారుని రహస్యముగా తీసికొనివచ్చి తనకు కుమారుడు పుట్టెనని నటించెను. తనకు కుమారుడు పుట్టుటచే ఆత్మదేవుడు ఎంతయో సంతోషించి ఆ కుమారుని పేరు ధుంధుకారి అని పెట్టెను. తరువాత ఫలమును తినిన ఆవునకు పుత్రుడు కలిగెను. అందరును ఆశ్చర్యపడిరి. ఆ కుమారుని కర్ణములు ఆవు చెవులవలె పొడవుగా నుండుటచే గోకర్ణుడని ఆతనికి పేరు పెట్టిరి. ఎంతయో దుఃఖముతో కృంగి పోవు ఆత్మ దేవుడు తనకు పుట్టిన ఇరువురు కుమారులను చూచుకొని మురిసిపోయెడివాడు. రోజులు గడచినవి. ఇద్దరు యువకులయిరి. గోకర్ణుడు మహా పండితుడు జ్ఞానియును అయ్యెను. ధుంధుకారి మహా కపటియు, మహాఖలుడును అయ్యెను. అందుచే ఆతడు తన తండ్రి ఆస్తినంతను చెడ్డవారి స్నేహముతో నశింపజేసెను. తండ్రియగు ఆత్మ దేవుడు దరిద్రుడయి, ఎన్నియో కష్టములకు

లోనయి చాల దుఃఖించెను. అతడు ఆత్మహత్య చేసికొనుటకు తలపడెను. ఆ సమయమున గోకర్ణుడు తండ్రితో పలికెను. తండ్రీ! ఈ ప్రపంచము పూర్తిగా సారహీనమైనది. దుఃఖరూపము. మిక్కిలి మోహమును ఉద్భవింప జేయును. కుమారుడెవడు? ధనమెవరిది? ఈ ప్రపంచముపై స్నేహమును కలిగియుండెడి వాడే ఎప్పుడును దహించుకొని పోవుచుండును. చక్రవర్తి కాని, ఇంద్రునకు కాని ఏమియు సుఖమనునది లేదు. సుఖము విరక్తిని పొంది ఏకాంతమున జీవించు మునికి మాత్రమే కలుగును. నీవు అజ్ఞానమును త్యజించుము. ఈ శరీరము నశ్వరము. కావున సర్వస్వమును త్యజించి వనమునకు పొమ్ము. అంతేకాదు ఓ తండ్రీ!

***దేహేఽస్థిమాంసరుధిరేఽభిమతిం త్యజ త్వం***
***జాయాసుతాదిషు సదా మమతాం విముఞ్చ।***
***పశ్యానిశం జగదిదం క్షణభఙ్గనిష్ఠం***

***వైరాగ్యరాగరసికో భవ భక్తి నిష్ఠః//***

"ఈ ఎముకలు, మాంసము, రుధిరము కల శరీరమునందు నీవు అహంబుద్ధిని త్యజించుము. స్త్రీపుత్రాదులందు మమత్వమును ఎల్లప్పుడును విడనాడుము. ఈ జగత్తు క్షణభంగురమేనని ఎల్లప్పుడును నమ్ముము. వైరాగ్యము నందు రసమును గ్రహించి భక్తి యందు నిష్ఠ కలిగియుండుము."

***ధర్మం భజస్వ సతతం త్యజ లోకధర్మా౯***
***సేవస్వ సాధుపురుషాన్ జహి కామతృష్ణామ్ /***
***అన్యస్య దోషగుణచిన్తనమాశు ముక్త్వా***
***సేవాకథార సమహో నితరాం పిబ త్వమ్//***

నీవు నిరంతరమును ధర్మమును సేవించుము. లోకాచారమును త్యజించుము. సత్పురుషులను సేవించుము. కామతృష్ణను విడనాడుము. పరుల గుణదోషములను విచారించుటకు పూనుకొనకుము. త్వరగా భగవానుని సేవారసమును, కథారసమును పూర్తిగా దానము చేయుము."

ఈ విధముగా జ్ఞాని అగు తన కుమారుడు చెప్పిన మాటలు విని ఆత్మ దేవుడు స్థిరబుద్ధిని పొంది గృహ త్యాగము చేసెను. అతడు వనమును ప్రవేశించి మిగిలిన ఆయుర్దాయమును భగవచ్చింతనము నందు గడపి మోక్షపదమును పొందెను.

ఈ ప్రసంగము జరుగుచుండగనే ప్రేమజీభాయి అచటకు వచ్చెను. ఆయన ఏజన్సీలో ఉద్యోగము చేసి పింఛను తీసికొనుచుండిరి. వారు అచ్చటికి వచ్చి స్వామి నిత్యానందుల వారికి నమస్కరించి పలికెను. "నేను ఈమధ్యనే ఉద్యోగము చేయుచున్నాను. అందుచే పనియుండి ముందు రాలేకపోతిని. క్షమించుడు. స్వాములను ఇరువురును చూచు అదృష్టము కలిగినది. ఇది మహాభాగ్యము."

స్వా. ని.:- మీరు మేనేజరు ఉద్యోగాలు చేయుచున్నారని విన్నాను.

ప్రేమ:— ఏమి చేయను! బహు

కుటుంబీకుడను. అందుచే ఉద్యోగము చేయవలసి వచ్చుచున్నది.

స్వా. ప్ర.:- (దీర్ఘ పరిచయ ముండుటచే వినోదమునకు) అనగా జీతము కొరకు మాత్రమే ఉద్యోగము చేయుట లేదన్న మాట. నౌకరులు, వాహనములు మొదలగు అధికారమును ప్రకటించు సాధనముల కొరకు ఉద్యోగము చేయుచున్నారు. పరమాత్ముడు విముక్తిని ఇచ్చి జీవితము గడపికొను సాధనమును ఇచ్చినను మరల బానిసత్వమునకు తయారయిరి. ఈ విషయమున దక్షిణ దేశమునందలి దృష్టాంతమును ఒక దానిని వినుడు.

ఒక రాజ్యము ఒక దివాను కలదు. రాజునకు ఒక రోజు  రాత్రి రెండు గంటలకు ఆతని సలహా అవసరమయ్యెను. అందుచే దివానును తీసికొని రమ్మని ఇద్దరు మనుష్యులను కాగడాలతో దివాను బంగళాకు పంపెను. దివాను దర్బారులోనికి వెళ్ళు మార్గమున ఇద్దరు కట్టెలు అమ్ముకొనువాండ్రు గుడిసె బయట పరుండి

యుండిరి. దివానును కాగడాల వెలుతురులో గుర్తు పట్టి ఒకడు పలికెను. అదుగో దివాను గారు వెళ్ళుచున్నారు. వెంటనే ప్రక్కను పరుండిన రెండవ వాడు పలికెను. "ఈ దివాను మూర్ఖుడు". నిశ్శబ్దముగానున్న రాత్రి యగుటచే ఆ మాటలు దివాను చెవిని పడెను. ఆయన తన మనుష్యుని ఆ మాటలు పలికిన వారి పేర్లు మొదలగు వివరములు తెలిసికొని రమ్మని పంపెను.

అనంతరము రాజు గారి వద్దకు వెళ్ళి ఆయనకు సలహా చెప్పి తన బంగళాకు తిరిగి వచ్చి నిద్రించెను. రెండవరోజున ఆ కట్టెలవాండ్రను ఇద్దరిని పిలచుకు రమ్మని నౌకరునకు ఆజ్ఞాపించెను. దివాను ఏమి శిక్ష విధించునో అని వారు భయపడిరి. వణకుచు వారు దివాను వద్దకు వెళ్ళిరి. రెండవవానితో దివాను పలికెను "నిన్ను శిక్షించను. నీవు నన్ను మూర్ఖుడవని ఏల అంటివో తెలుపుము." వాడు పలికెను:- "బాబూ! నేను కట్టెలు అమ్ముకొని

బ్రతుకుదును. ఉదయము 5 గంటలకు లేచి అడవిలోనికి వెళ్ళి కట్టెల మోపును తీసికొని వచ్చెదను. వానిని అమ్మి రోజుకు 5, 6 అణాలు సంపాదించుకొనెదను. మధ్యాహ్నము పదిగంటలతో నేను నా పనికి స్వస్తి చెప్పుదును. తరువాత నున్న సమయమంతయు విశ్రాంతి తీసికొనెదను. రాత్రి నాకు ఎవడైన నూరు రూపాయలు ఇచ్చెదనన్నను బయటకు వెళ్ళను. ఏలనన, రాత్రి సమయము అలసిన శరీరమునకు విశ్రాంతి నివ్వవలెను. తమరు రాత్రి సమయమున రాజుగారి సన్నిధికి వెళ్ళుచుండుట చూచిన నాకు తోచెను. తమరు రెండు వేల రూపాయలు జీతము తీసికొనెదరు. ఇంత గొప్పవారు అయినను ఇదేమి బానిసత్వము! రాత్రి కూడ విశ్రాంతి లేదు. ఈ ఆలోచనలతో పాటు నా నోటినుండి “మూర్ఖుడు” అను మాట వచ్చెను. నన్ను క్షమించుడు.” దివానుగారు పలికిరి:- “నీ మాటలు నిజము. నీవు నాకు గురువువు.” అట్లు పలికి వెంటనే ఆయన రాజునకు తన రాజీనామా వ్రాసి పంపెను.

రాజు తనంతట తానే వచ్చి నచ్చ జెప్పెను. కాని దివాను తన నిశ్చయమునందు స్థిరముగా నుండెను. "ఇంక బానిసత్వము చేయలేను." అనెను. ఈ విధముగా దివాను రాజీనామా నిచ్చెను.

ఒక విద్వాంసుడు పలికెను.

**సేవయా ధనమిచ్ఛద్భిః సేవ కైః పశ్య యత్కృతమ్/**
**స్వాతన్త్ర్యం యచ్ఛరీరస్య మూఢైస్తదపి హారితమ్ //**

సేవ చేసి ధనమును కోరు సేవకుల బ్రతుకు చూడండి. సేవకులకు శరీరస్వాతంత్ర్యము అయినను లేదు."

ప్రేమజీ :— నేను రాజ్యములో ఇంత కాలమువరకు ఉద్యోగము చేసెదనని నిర్ణయము చేసికొంటిని. ఇప్పుడు ఎట్లు విడవగలను? సమయము పూర్తి అయిన తర్వాత క్రొత్త ఉపాధిని పెంచుకొనను.

స్వా.ప్ర.:- విడిపించుకొనుట ఏమిటి? వేరొక పెద్ద రాజ్యమేది అయిన ఎక్కువ జీతము ఇచ్చి అధికారము చలాయించనిచ్చినచో అక్కడికి వెళ్ళెదరు. ఇది ముసలమ్మ కథ వలె ఉన్నది. పూర్వము ముసలమ్మ ఒక ఆమె కలదు. ఆమెకు చిన్నతనము నుండియు గోబిలు అనిన చాల సరదా. ప్రతి నవరాత్రి యందును ఎన్నియోమార్లు గోబిలు పాడించెడిది. పెద్దది అయి కొడుకులు, కోడండ్రు ఇంటికి వచ్చిన తరువాత కూడ ఆమెకు గోబిలునందు ప్రేమ తగ్గలేదు. పెద్దదయి విధవగా జీవితము గడుపుచున్నను గోబిలు విని వారితో కలసి తాను కూడ పాడుచుండెడిది. ఒకమారు నవరాత్రికి ఆమె తన కుమారునితో గోబిలు చూచుటకు వెళ్ళెదనని చెప్పెను. కుమారుడు "అమ్మా, నీవు గోబిలు చూచుటకు వెళ్ళరాదు. ఈ వయస్సు గోబిలు చూడతగినది కాదు. వినుచు వినుచు నీవు కూడ వారితో కలసి పాడుటకు మొదలు పెట్టిన మా గౌరవము పోవును. అందరును నవ్వుదురు." ముసలమ్మ పలికెను.

“నేను శాంతముగా కూర్చొని గోబిలు చూచెదను. నేను ఏమియు చేయను. మాట్లాడనుకూడను. నేను కోడలుతో కూడా వెళ్ళెదను,” ఇట్లు చెప్పి ఆమె కోడలుతో గోబిలు చూచుటకు వెళ్ళెను. కొంచెము సేపు గోబిలు వినుటతో ఆమె తన్మయురాలయ్యెను. ముసలమ్మ శ్రుతి కలిపి పాడుచు నాట్యము చేయసాగెను. కోడలు చేయి పట్టుకొని లాగినను వెనుకకు రాలేదు. “ఉండలేక పోవుచున్నాను” అని అంతకంతకు ముసలమ్మ ఆ గోబిలు పాడు వారితో శ్రుతి కలిపెను.

ప్రేమజీభాయి కూడ ఆ ముసలమ్మ వంటివాడే. మీరు కూడ శ్రుతికలిపి నాట్యము చేయుదురు. మిమ్ములను నమ్ము వారు ఎవరు?

స్వా. ని.:- తమరు అనుచున్నారు కనుక ప్రేమజీభాయి నవ్వుచున్నారు. లేనిచో వారిస్వభావము చాల కఠోరమైనది. ఎవరును వారి ఎదుటకు రాలేరు.

స్వా. ప్ర.:- నాకేమీ భయము. నేను నిజము

చెప్పుచున్నాను. నాకు ఆయన ఇచ్చిన భూములు ఏమైన తీసికొనెదరా!

ప్రేమజీ :- స్వామివారికి నా యందు దయ. అందుచే వారు నా హితమును కోరి చెప్పెదరు.

స్వా. ప్ర.:- బొంబాయిలో మోతీలాల్ దలపత్ రామ్ అను నా స్నేహితుడు సొలిసిటరు ఒకడుండెను. ఆయన సదాచారియు నిష్ఠాగరిష్ఠుడు. ఆయనకు తన వృత్తి నుండి తప్పుకొనవలెనను కోరిక తన 46వ సంవత్సరమున కలిగెను. అది విని ఆయన భార్య, పుత్రుడు చాల కోపించిరి. నాకు తెలిసి నేను వారికి "ఇంకను కొంచెము కాలము గడుపుట మంచిది" అని ఉత్తరము వ్రాసితిని. ఆయన ఉత్తరమునకు జవాబు ఇవ్వలేదు. కాని నేను బొంబాయి వెళ్లినప్పుడు ఇట్లు చెప్పెను. "ఉత్తరమునకు "కాదు" అని సమాధానము వ్రాసినచో తమ మాటను తిరస్కరించినట్లగును. కాని నా మనస్సు నివృత్తి చెందుటకు దృఢముగా నిశ్చయించుకొనినది." అంతట నేను వారిని "మీ

జీవితము గడపుకొనుటకు సాధనములు కలవా" అని అడిగితిని. ఆయన సమాధానము చెప్పెను. "బ్రతుకుటకు ఉన్నది. విలాసమునకు లేదు. జీవితమంతయు ఎట్లు వ్యర్థము చేయుదును. నా శ్రేయము కొరకు ప్రయత్నించవలదా!" ఈ మాటలు విని నేను ఊరకొంటిని. అనంతరమున 'ఊరణ'లోని ఒక తోటలో చిన్న ఆశ్రమమువంటి ఇంటిలో ఉండెడివాడు. నిరంతరము ధ్యానపరాయణుడయి పరమార్థ చింతనమునందు కాలక్షేపము చేసెడివాడు.

ప్రపంచమున అట్టి జనులు లేరని కాదు. తక్కువగా నుందురు. స్వామి శ్రీ నిత్యానందులవారు ఇది విని ఎంతయో సంతసించిరి. "మరల కలియుట ఎప్పుడు" అని అడిగిరి. శ్రీ స్వామి ప్రకాశానందుల వారు సమాధానము చెప్పిరి. కొద్దిరోజుల తర్వాత తప్పక వచ్చెదను. అనంతరము స్వామి శ్రీనిత్యానందులవారు పీఠడియా వెళ్ళుటకు

నిశ్చయించిరి. శ్రీప్రకాశానందులవారిని విడచి వెళ్ళుట అనిన శ్రీ నిత్యానందుల వారికి ఎట్లుండునో వారి ముఖముద్ర నుండి వెల్లడి అగుచుండెను. వారి హృదయము ఎంతయో దుఃఖించుచుండెను.

వైద్య :- తమ వియోగమనిన స్వామివారికి ఎంతయో కష్టము. స్వామివారి హృదయము చాల కోమలమయినది.

## మహాత్ముల హృదయము

స్వా. ప్ర. :- స్వామివారి హృదయము కోమలమయినదే. అంతియే కాదు. కఠోరమయినది కూడను. మహాత్ముల హృదయములు అట్లే ఉండును. చాకలి యొక్క నిందా వాక్యములను వినిన తోడనే శ్రీ రామచంద్రులు సీతను అడవిలోనికి పంపెను. అచట జనులకు సీతను మరల రాజ్యములోనికి తీసికొని వచ్చుట యుక్తమని తోచెను. వారు రాముని అశ్వమేధ యాగము చేయమని

ప్రార్థించిరి. భార్య లేనిదే ఆ యజ్ఞము చేయబడదు. యజ్ఞము చేయుటకు నిశ్చయించినచో సీతను పిలిపించనైన పిలిపించవలెను, లేదా మరియొక వివాహమైనను చేసుకొనవలెను. రామచంద్రుడు యజ్ఞము చేయుటకు అంగీకరించెను.

ఈ సంగతి వాల్మీకి మహర్షికి తెలిపెను. “రాముడు అశ్వమేధము చేయును. అందుకు మరియొక వివాహము చేసికొనును. ఇది చాల దుఃఖించవలసిన సంగతి” అని ఆయన సీతతో చెప్పెను. కాని ఆమె నమ్మలేదు. “నా అంతరాత్మ విశ్వసించుట లేదు. ఆయన చేసికొనరు” అనెను. అశ్వమేధమును ఆరంభిచు తరుణమున వశిష్ఠుడు చెప్పెను. “సీతను పిలిపింపుము, లేదా మరియొక వివాహమునైన చేసికొనుము. లేనిచో యజ్ఞము చేయుటకు వీలుపడదు.” రాముడు పలికెను. “రెండవ పెండ్లి చేసికొనినచో ఏకపత్నీ వ్రతమునకు భంగము కలుగును. సీతను పిలువ

పంపినచో జనులు నవ్వెదరు. స్వర్ణ సీతను చేయించి యజ్ఞమును చేసెదను." ఈ మాటలు వాల్మీకికి తెలిసి సీతతో పలికెను. "ఎంతయో సంతోషము. రాముడు రెండవ పెండ్లి చేసికొనుట లేదు. స్వర్ణసీతతో యజ్ఞము చేయుటకు నిశ్చయించు కొనెను." ఈ విషయమున చెప్పబడినది.

***వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి।***
***లోకోత్తరాణాం చేతాంసి కో ను విజ్ఞాతుమర్హతి ॥***

"ఉత్తమ చిత్తము కల మహాత్ముల హృదయములు వజ్రము కంటే కఠినముగా నుండును. పుష్పము కంటె కోమలముగా నుండును. వానిని తెలుసుకొన సమర్థుడు ఎవడు?"

చాకలి మాటలు విని సీతను విడచివేయు కాఠిన్యమును ఆ హృదయము పొంది యుండెను. రెండవ పెండ్లి చేసికొనినచో సీత దుఃఖించునను భావముతో స్వర్ణ సీతను చేయించి సీతను

బాధించలేదు. ఆయన హృదయము అంత కోమలమయినది. ఇట్లే స్వామివారి హృదయము దీనులను చూచి కరగిపోవును. కాని వైరాగ్యమును పాలించుటలో ఎంత కఠోరమో చెప్పలేము. అటు తరువాత శ్రీ నిత్యానందులు మొదలగువారు పీఠడియా బయలుదేరిరి.

ఓం

# ఇరువది రెండవ ప్రసంగము

ఆ రోజులలో శ్రీ ప్రకాశానంద స్వామి వారు గోండాలులో నుండిరి. అక్కడ స్వామి వారిని దర్శించుటకు రాజకోటనుండి మోహన్ భాయి, శాస్త్రి రేవా శంకర్ భాయి మొదలగువారు వచ్చిరి. చందు భాయి కూడ సమీపముననే కూర్చొనియుండిరి. ఆ సమయమున పీఠడియా ప్రసంగము వచ్చెను. చందు భాయి శ్రీ నిత్యానంద స్వామి వారిని దర్శించవలెను కుతూహలమును వ్యక్తపరచెను. అంతట అందరును శ్రీ ప్రకాశానందుల వారిని కూడ తీసికొని పీఠడియా వెళ్ళిరి. శ్రీ నిత్యానందుల వారి కోరిక ప్రకారము శ్రీ ప్రకాశానంద స్వామివారు అందరిని పరిచయము చేసిరి. శాస్త్రి గారిని గురించి ఇట్లు పలికిరి. " శాస్త్రిగారు మహా విద్వాంసులు. రాజకోట యందలి రాజ కుమార

కళాశాలలో ఉద్యోగము చేసిరి. ప్రస్తుతము సంస్కృత కళాశాలలో అధ్యాపకులు.” శాస్త్రి గారు చెప్పిరి. “నాకు నైష్ఠిక బ్రహ్మచర్యమున కాలము గడపవలెనని కోరిక యుండెడిది. ఆ యుద్దేశ్యముతో నేను వారణాసికి వెళ్ళిపోతిని. మన దేశమునకు తిరిగి రాలేదు. కాని నా సోదరి కాశీకి వచ్చి గృహస్థాశ్రమమును తీసికొనమని చాల పట్టు పట్టినది. ఆమె నన్ను ఇంటికి తీసికొని వచ్చినది. శ్రీ ప్రకాశానంద స్వామివారు కూడ నా సోదరి చెప్పిన మీదట గృహస్థాశ్రమమునకు నన్ను ప్రోత్సహించిరి. అంతట నేను స్వామివారిని ప్రశ్నించితిని. “తమరు నన్ను గృహస్థాశ్రమమునకు తొందర చేయుచున్నారు కదా! తమరు గృహస్థాశ్రమమును తీసికొనకుండ సన్యసించుటకు కారణ మేమి ?”

# శ్రీ ప్రకాశానంద స్వామివారి వినోదము

స్వా. ప్ర:- అదే నేను సన్యసించి చింతించుచున్నాను. నేను డబ్బు పుచ్చుకొనకూడదు. అడిగి కొనిన మధుకరము దొరకదు. దగ్గర డబ్బు లేదు. బట్టలు లేవు. చలిలో ఉండవలసి వచ్చుచున్నది. హృషీ కేశమున జబ్బుపడినప్పుడు చాల బాధ పడితిని. నా పరిస్థితి కుక్క పరిస్థితితో సమానముగా నుండెను. పూర్తిగా వైరాగ్యము కలిగిననే సన్యసించుము.

***విరక్తః ప్రవ్రజేద్ధీమాౕ సరక్తస్తు గృహే వ సేత్ /***
***సరక్తో నరకం యాతి ప్రవ్రజన్ హి ద్విజాధమః //***

"బుద్ధిమంతుడు ద్విజుడు వైరాగ్యము పొందిన మీదటనే సన్యసించవలెను. సంసారమునందు రాగము ఉన్నచో గృహస్థాశ్రమము నందు ఉండుటయే మంచిది. రాగము కలవాడు సన్యసించినచో ఆ అధమునకు నరకము కలుగును." కావుననే నేను శాస్త్రి గారికి

గృహస్థాశ్రమమును స్వీకరించుడని సలహా చెప్పితిని.

శాస్త్రి:- శ్రీ ప్రకాశానంద స్వామివారు ఆవిధముగా తెలియ జెప్పిన మీదట నేను గృహస్థాశ్రమమును స్వీకరించితిని. ఇప్పుడు మొహం మొత్తినది. పిల్లలను పెంచుటకొరకు ఈ జంజాటములో పడవలసి వచ్చుచున్నది.

స్వా.ని.:-గృహస్థాశ్రమమును స్వీకరించుటలో తప్పు ఏమియు లేదు. గృహస్థాశ్రమము నందు ఉండియే పురుషార్థమును సిద్ధింప జేసికొనవలెనని జరుగగలదు. కోటయందు ఉండి పోట్లాడుటచే రక్షణ ఉండును కదా! మైదానములోనికి వచ్చి యుద్ధము చేయుట విపత్కరము, అటులనే గృహస్థాశ్రమమున ఉండి జ్ఞానమును సంపాదించుటయందు రక్షణ యుండును.

# గృహస్థాశ్రమ ప్రాధాన్యము

వేదములు, ఉపనిషత్తులు, స్మృతులు,

ధర్మశాస్త్రములు అన్నియు గృహస్థాశ్రమము యొక్క ఉపయోగమును తెలిపినవి. తైత్తిరీయ శిక్షయందు ఆచార్యుడు శిష్యునకు ఉపదేశించెను.

***"ఆచార్యాయ ప్రియం ధన మాహృత్య ప్రజాతన్తుం మా వ్యవచ్ఛేత్సీః"***

"ఆచార్యులకు గురు దక్షిణగా కోరిన ధనము నిచ్చి, సంతోష పరచి, వారి ఆజ్ఞానుసారము గృహస్థాశ్రమమును తీసుకొనవలెను. అంతేకాని నైష్ఠిక బ్రహ్మచారిగా గురు గృహమున ఉండి ప్రజాతంతువును ఉచ్ఛేదము చేయకుము."

మను భగవానుడు గృహస్థాశ్రమము నందు మిక్కిలి విలువను కనపరచెను.

***ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశ యేత్/***
***అన పాకృత్య మోక్షం తు సేవమానో ప్రజత్యధః //***

"మూడు ఋణములను తీర్చిన మీదట మనస్సును మోక్షము నందు వినియోగించవలెను. ఋణములను దీర్చకుండ మోక్షమును సేవించేవాడు అధః పతితుడగును."

***అనధీత్య ద్విజో వేదాన నుత్పాద్య తథాత్మజాన్ /***
***అనిష్ట్వా చైవ యజ్ఞైశ్చ మోక్షమిచ్ఛన్ పతత్యధః //***

"ఏ ద్విజుడైనను (బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు) వేదములను చదువనిదే, పుత్రులను కననిదే, యజ్ఞాదులచే దేవతలను సంతృప్తి పొందించనిదే మోక్షమును కోరువాడు అధఃపతితు డగును."

***యథా వాయుం సమాశ్రిత్య వర్త న్తే సర్వజన్తవః/***
***తథా గృహస్థ మాశ్రిత్య వర్తన్తే సర్వ ఆశ్రమాః//***

"ప్రాణులన్నియును వాయువును

ఆశ్రయించి జీవించును. అటులనే ఆశ్రమములన్నియు గృహస్థాశ్రమము ఆశ్రయించి జీవించును."

***యథా నదీనదాః సర్వే సముద్రే యాన్తి సంస్థితిమ్ /***
***తథై వా శ్రమిణః సర్వే గృహస్థే యాన్తి సంస్థితిమ్//***

"నదులు, నదములు అన్నియును సముద్రములోకి వెళ్ళి ఆగును. అటులనే అన్ని ఆశ్రమముల వారును గృహస్థాశ్రమమును ఆశ్రయించెదరు."

శ్రీ మద్భాగవతమున కూడ కశ్యపుడు దితితో చెప్పెను:

***తస్యాః కామం న కః కుర్యాత్ సిద్ధిః త్రై వర్గికీ యతః/***

" భార్య సాహచర్యముచే ధర్మ, అర్థ, కామములను మూడు పురుషార్థములు సిద్ధించును. అట్టి భార్యను ఎవడు కోరడు?"

***సర్వాశ్రమానువాసాయ స్వాశ్రమేణ కలత్రవాన్/***
***వ్యసనార్ణవ మత్యేతి జలయానై ర్వథార్ణవమ్//***

"అన్ని యాశ్రమములకు అండయగుటకు గృహస్థాశ్రమమున భార్యను చేబట్టి, నౌక సహాయమున సముద్రమును దాటునట్లు, దుఃఖ సాగరమును దాటును."

***యామాహురాత్మనో హ్యర్థం శ్రేయస్కామస్య మానిని/***
***యస్యాం స్వధుర మధ్య స్య పుమాంశ్చరతి నిస్పృహః//***

"ఓ సుందరీ! భార్య తన శరీరములో అర్ధ భాగమని కల్యాణమును కోరువాడు అనుకొనును. ఆమెయందు గృహ భారమును ఉంచి పురుషుడు నిశ్చింతగా సంచరించును."

యామాశ్రిత్యేన్ద్రియారాతీన్ దుర్జయానిత రాశ్రమైః|
వయం జయేమ హేలాభిః దస్యూన్ దుర్గ

పతిర్యథా||

"కోట కల రాజు శత్రువులను తేలికగా జయించును. అటులనే బ్రహ్మచర్య సన్యాసాది ఇతర ఆశ్రమముల ద్వారా జయించలేని ఇంద్రియములనెడు శత్రువులను మనము ఒక భార్య సహకారముచే సులభంగా జయించెదము." అనగా గృహస్థాశ్రమమున భార్య కోటవంటిది. అటు ఇంద్రియములను అదుపులో నుంచు కొనవలెననిన ఆ ఆశ్రమమే కావలెను.

బృహదారణ్యకము నందలి పంచాగ్ని విద్యయందు కూడా చెప్పబడినది

***తద్యథా పంచమ్యా మాహుతావాపః పురుషవచసో భవన్తి //***

ఈవిధముగా పంచమ ఆహుతి యందు సహకరించిన అధికారి పురుష రూపమును పొందును. అచ్చటనే "**యోషా వాఽగ్నిర్గౌతమ**" "ఓ గౌతమా! స్త్రీ పంచమాగ్ని"అని చెప్పబడినది.

ఈవిధముగా స్త్రీని 5వ అగ్ని గా పరిగణించిరి. ఆశ్రమములలో కెల్ల గృహస్థాశ్రమమును అజేయమగు కోట అనియు, అన్ని ఆశ్రమములకును ఆధారమనియు వర్ణించిరి. జనకుడు, వశిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు వీరందరును గృహస్థాశ్రమము నందు ఉండియే ఉత్తమ జ్ఞానమును పొందిరి. ఇట్టి దృష్టాంతములు అనేకము కలవు. వివేక వైరాగ్యములు లేనిదే సన్యాసమును తీసికొని సన్యాసాశ్రమమును పాడుచేయు సన్యాసుల కంటెను, లేక అట్టి నైష్ఠిక బ్రహ్మచారుల కంటెను ఈ గృహస్థాశ్రమములోని వారు ఎంతయో మంచివారు. కావున మీకు శ్రీ స్వామి ప్రకాశానందుల వారు గృహస్థాశ్రమమును తీసికొనమని చెప్పి యున్నచో శాస్త్ర దృష్టిని తగిన సలహాయే చెప్పిరి. అంతేకాక అధ్యయన, అధ్యాపనములు బ్రాహ్మణ ధర్మములు. ప్రాచీన కాలమున వేతనము తీసికొనకుండగనే ఆచార్యులు అధ్యాపనము

చేసెడివారు. కాని ఇప్పుడు అట్లు జరుగుట లేదు, అందుకే జీతము తీసికొనినను ఈ బ్రాహ్మణ వృత్తి ఉత్తమము. సరే, మరియొక ప్రవచనము నేదైన చేసెదరా? లేదా?

శాస్త్రి:-- జనుల కోరిక ప్రకారము పంచనాథము నందు (శివాలయమునందు) గీతాదుల ప్రవచనము చేయుచుందును.

మహాభారతమునందు చెప్పబడినది కదా!

***యుగాన్తే సమను ప్రాప్తే వృథైవ బ్రహ్మ వాదినః/***

ద్వాపర యుగాన్తము అయిన తరువాత అనగా కలియుగము నందు అనుభవము లేనిదే అనేకమంది వ్యర్థముగా చేయుదురు."

అదే విధముగ నేను కూడ నాలుగు అక్షరములు చదువుకొని అనుభవము లేకుండా అధిక ప్రసంగము చేయుదును.

స్వా.ని. :-అందులో దోషము ఏమి ఉన్నది? శ్రవణము చేసిన విషయమున మనన నిది

ధ్యాసనములు జరుగును కదా! వారికి శ్రవణము చేయించుట ఉత్తమమగు కార్యము, దైవ ప్రకృతికల ప్రవక్తలు ప్రవచించు సమయమున గీతయందలి "**ఇన్ద్రియార్థేషు వైరాగ్యమ్**" అను వచనమును వివరించుచు తమయందు వైరాగ్యము లేనిచో చెప్పుటకు సంకోచించెదరు. అనంతరము వైరాగ్యాది దైవసంపదను సంపాదించెదరు. అసుర సంపదకల ప్రవక్తలు ఎట్లు తోచిన అట్లు మాట్లాడెదరు. మనస్సుకు ఏమియు మార్పును రానీయరు. పైగా విషయ లంపటులు కూడ నగుదురు. ఇట్లు ప్రవచనమునందు లాభ నష్టములు రెండును కలవు. ఈసంగతి తెలిసికొని ప్రవచనాలు చేయవలెను.

అటు తరువాత శ్రీ నిత్యానంద స్వామి వారు శ్రీ ప్రకాశానంద స్వామివారిని ప్రశ్నించిరి. పూర్వము మీరు రెండు కఱ్ఱలు దగ్గర నుంచు కొనెడివారు కదా! ఇప్పుడు ఒక కఱ్ఱయే ఎందుకు

ఉంచుకొనుచున్నారు?

# ద్వైతాద్వైతముల వినోదము

స్వా. ప.:- మూడు సంవత్సరాలకు పూర్వము రాజకోటకు నారాయణ పరమహంస అని పేరుగల ఒక చాల గొప్ప మహాత్ముడు వచ్చెను. ఆయన దర్శనమునకు నేను వెళ్ళితిని. వారు మిక్కిలి విరక్తి కలవారుగా కన్పట్టిరి. తరువాత వారి జాడ తెలియలేదు. రెండు సంవత్సరముల తరువాత 'చాందోద' నుండి 'కరనాలి' వెళ్లు చుంటిని. నాతో నున్న వారు "హనుమంతేశ్వరము నందు గొప్ప మహా పురుషుడు ఒకరు కలరు. వారి దర్శనమునకు మీరు అక్కడకు వచ్చెదరా?" అని అడిగిరి. నేను కూడ వారి వెంట వెళ్ళితిని. వారు పంచకేశములను ధరించియుండుటచే నేను వారిని గుర్తించ లేకపోయితిని. కాని వారు నన్ను గుర్తించిరి. ఆసమయమున వారు మౌనమును

అవలంబించి యుండిరి. వారు వ్రాసి నన్ను ప్రశ్నించిరి. "మిమ్ము రాజు కోటలో చూడలేదా?" దీనితో పాటు వారు పరిచయమునకు సంబంధించి కొన్ని సంగతులను కూడ జ్ఞాపకము చేసిరి. "తమకు అన్నియును జ్ఞాపకము ఉన్నవే" అని నేనంటిని. "దొంగతనంగా ఇక్కడ కూర్చొని ఉన్నారా?" అంటిని. కాని వారు సంజ్ఞతో తెలిపిరి. "మీరు  నన్ను గుర్తుపట్ట లేదు. నేను మిమ్ము గుర్తు పట్టితిని. కావున మీరు దొంగ." నా దగ్గర రెండు కర్రలు చూచి సంజ్ఞతో ప్రశ్నించిరి. "రెండు ఏల నుంచుకొనిరి?" నేను చెప్పితిని. "ఇంకను నాకు ద్వైత భావము పోలేదు. అందుకే రెండు కర్రలు ఉంచుకొని యున్నాను. ఆయన నా దగ్గర నున్న కర్రలలో నుండి ఒక దానిని తాను తీసుకొని రెండవ దానికి నాకు ఇచ్చి సంజ్ఞతో ఒక పేరును చూపించి చెప్పిరి. "ఇప్పుడు అద్వైతము కుదిరినదా!" నేను ప్రశ్నించితిని, "నాకు అద్వైతోపదేశము నిచ్చుచున్నారా?" అంతట

వారు నమస్కరించి సంజ్ఞ చేసిరి. “కాదు, కాదు.” అప్పటి నుంచియు ఒకటే ఉంచుకొనుచున్నాను.

స్వామి శ్రీ నిత్యానందుల వారు శాస్త్రిగారిని ప్రశ్నించిరి.“ ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము మొదలగు పేర్లతో ప్రచారములో నున్న మతములలో ఏ మతము నిజమైనది?

# ప్రచారములో ఉన్న మతములు

శాస్త్రి:- అధికారులను దృష్టిలో నుంచికొని ఆలోచించిన అన్ని మతములును నిజమైనవే.

జగమునందలి మానవులందరికిని నిశ్రేయసము సిద్ధించుటకొరకు అకారణ హితేచ్ఛువగు వ్యాసమహర్షి ఇట్లు వక్కాణించెను.

***“అథాతో బ్రహ్మ జిజ్ఞాసా ”***

ఇట్లు ప్రతిజ్ఞ చేసి వ్యాస భగవానుడు బ్రహ్మ నిరూపణము కొరకు అనగా ఆత్మ నిరూపణము కొరకు సూత్రములను రచించెను. ఆ సూత్ర

సముదాయము వేదాంత దర్శన మనబడును. ఆ సూత్రములు చాల సంక్షిప్తముగను, గూఢార్థము కలవి గను ఉన్నవి. ఆ సూత్రములయందు చతుర్వేద ప్రతిపాద్యము బ్రహ్మము అనునది సాధించబడినది. ద్వైత, విశిష్టాద్వైత, శుద్దాద్వైత, కేవలాద్వైతములను నాల్గింటిని ప్రతిపాదించిన ఆచార్యులు పై సూత్రములను ఆధారముగా చేసికొనియే తమ తమ సిద్ధాంతములను ప్రతిపాదించారు. ద్వైత సంప్రదాయ ప్రవర్తకులగు ఆచార్యులు మధ్వ శ్రీ ఆనంద తీర్థులు. వారు జీవ, బ్రహ్మముల వాస్తవిక భేదమును అంగీకరించిరి.

విశిష్టాద్వైత ప్రవర్తకులు శ్రీ రామానుజాచార్యులు. వారు జీవ, ఈశ్వరులకు శరీర, శరీర సంబంధము కలదని- అనగా అవినాభావ సంబంధము కలదని విశదీకరించిరి. “శరీరమునకు జీవుడు ఉన్నట్లుగనే పరమాత్ముడు ఉన్నాడు” అని “తత్త్వమసి" పదమునకు వారు అర్థము చెప్పిరి.  ఈ కారణము చేతనే అద్వైత

పదము విశిష్టాద్వైత శబ్దము నందున్నను వారు అద్వైత వాదులు కారు.

శుద్ధాద్వైత ప్రవర్తకులు వల్లభాచార్యులు. అయన జీవుని అణు- పరమాణు రూపమున అంగీకరించి పరమాత్ముని అంశముగా స్వీకరించిరి. కాని వాస్తవిక ఐక్యము ఉండుట కతమున అంశాంశీ భావమునకు తావు లేదు. కావున ఈ మతము నిజమునకు ద్వైతము నందు లీనమగు చున్నది.

అద్వైత సంప్రదాయము శ్రుతి సిద్ధాంతము. దీని ప్రవర్తకులు శ్రీ శంకరాచార్యుల వారు. తమ భాష్య త్రయము నందు జీవ బ్రహ్మలకు ఐక్యమును ప్రతిపాదించిరి.

పైన చెప్పిన నాలుగు అభిప్రాయములును కాక నీలకంఠ భాష్యాది వివిధ సిద్ధాంత ప్రతిపాదకములగు అనేక భాష్యములు ఈ సూత్రములపై వ్రాయబడినవి. అవి దేశ పరిస్థితుల

యందలి పరివర్తనములతో బాటు వేర్వేరు అధికారులకొరకు, వేర్వేరు దేశములయందు వేర్వేరు కాలములయందు ఉపయోగించబడినవి. అయినను వేదాంతముయొక్క అంతిమ ధ్యేయము ఒక్కటే అనునది నిశ్చితాభిప్రాయము.

పరస్పర విరుద్ధములగు అనేక మతములను బాదరాయణుడు తన 550 సూత్రముల ద్వారా ఎట్లు ప్రతి పాదించును? అయితే బ్రహ్మ సూత్ర ప్రతిపాద్యమేమి? వేదాంతము నందలి (ఉపనిషత్తుల యొక్కయు మంత్రములు యొక్కయు) అర్థమును నిర్ణయించుటయే తెలియనగు వేదాంత ప్రతిపాధ్యము ఏమి అనునదియే బ్రహ్మ సూత్రములు నిశ్చయించవలెను కదా! అందుచే “తత్త్వమసి” ప్రకరణమును కొంత విచారించెదము.

# పాండిత్య దురభిమానము

సామవేదీయ ఛాందోగ్యోపనిషత్తునందలి ఆరవ అధ్యాయములో ఒక కథ ఉన్నది.

ఉద్ధాలకుడు ( లేక ఆరుణి) అను పేరుగల ఒక ఋషికి శ్వేత కేతుడను చపలుడగు కుమారుడు ఉండెను, కుమారుని తండ్రి గురు గృహమునకు అధ్యయనమునకై పంపెను. ఆరోజులలో 8 సంవత్సరముల బాలుడే గురు కులమునకు వెళ్ళెడివాడు. కాని శ్వేత కేతుడు 12 సంవత్సరముల వరకును గురు గృహమునకు వెళ్ళుటకు సిద్ధమవలేదు. ఆతని చపలత్వము స్వేచ్ఛా జీవితముగా మారుచుండెను. ఇది చూచి 12 వ సంవత్సరమున పంపవలసి వచ్చెను. ఆతడు 12 సంవత్సరములు గురుగృహమున అధ్యయనము చేసి మరలివచ్చెను. ఆ కారణముచే అతనికి “నేనే విద్వాంసుడను” అను గర్వము కలిగెను. నా తండ్రిగారి యందును ఇతరుల యందును, నాకున్నంత విద్య లేదు. వారికి నేను ఏల నమస్కరించవలెను? ఈ ఉద్దేశ్యముతో వచ్చి నంతనే వినయ వివేకములు లేక ఏ విధమయిన మర్యాదలను పాటించలేదు. తండ్రికి వందనమైన చేయలేదు. ఆ కారణముచే తండ్రికి చాలా ఖేదము

కలిగి ఆ కుమారునికి గల గర్వము పోగొట్టి సదాచారములను నేర్పు ఉద్దేశముతో ప్రశ్నించెను.

***తం హ పితో వాచ శ్వేతకేతో యన్ను సౌమ్యేదం మహామనా ఆనూచాన మానీ స్తబ్ధోఽస్యుత తమాదేశ మప్రాక్ష్యో యేనా శ్రుతం శ్రుతం భవతీత్యాది.***

"ఓ శ్వేతకేతూ! ఓ సౌమ్యుడా! నీవు విద్యాగర్వముచే వినయ హీనుడవయితివి. ఏ విషయమును తెలిసికొనుటచే ఈ లోకమున శ్రవణ విషయము కాని పదార్థము కూడ శ్రవణము చేయబడినదిగా ఏర్పడునో అట్టి విషయమును గురువుగారిని ప్రశ్నించి వారి యుపదేశము ద్వారా గ్రహించితివా?" అని తండ్రి ఉద్దాలకుడు అడిగెను.

అంతట శ్వేత కేతువు ప్రశ్నించెను.

***"కథం ను భగవః స అదే శో భవతి " ఇతి/***

"పూజ్యుడవగు ఓ తండ్రీ! అట్టి పదార్థము

ఏమైన కలదా? ఏ ఒక పదార్థమును తెలిసికొని నంత మాత్రమున సర్వ పదార్థములను తెలిసికొనుటకు వీలగునో అట్టి వస్తువేమైన కలదా?”

## సచ్చిదానంద రూపము

తండ్రి చెప్పెను.

***యథా సౌమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్***
***వాచార మ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం ఏవం సౌమ్య స ఆదేశో భవతీతి/***

“ఓ కుమారా మట్టి యొక్క వికారములగు కుండ, కడవ మొదలగువానియందు ఉపాదాన కారణమగు మృత్పిండము తెలిసినచో మృద్వికారములగు పాత్రములన్నిటి జ్ఞానమును కలుగునట్లు గనే సత్, చిత్, ఆనంద స్వరూపమగు ఒక తత్త్వమును మాత్రమే తెలిసికొనినచో ఆసత్ (కాలత్రయాబాధితము) చిత్ (చైతన్య రూపము)

ఆనంద (ప్రియము) రూపముతో కూడిన పదార్థములన్నియును తమంతట తామే తెలియును. ఓ కుమారా! ఇది ఆదేశ జ్ఞానము- అనగా గురు పరంపర ద్వారా లభ్యమగు జ్ఞానము."

ఈ విధముగా శ్వేత కేతునకు అనేక దృష్టాంతములతో తత్త్వజ్ఞాన యోగ్యతయు, జిజ్ఞాసయు కలిగించుటకు ఉద్దాలకుడు ఉపదేశించెను. అనంతరము చెప్పెను.

***" స య ఏషోఽణిమైెత దాత్మ్య మిదం సర్వం తత్ సత్యం స ఆత్మ తత్త్వమసి శ్వేతకేతో"***

"అదియే అణు రూపములో నున్న ఆత్మ. ఈ సమస్త ప్రపంచం దాని స్వరూపమే. అది సత్య రూపమగు పరబ్రహ్మము. ఓ శ్వేత కేతూ! అది నీ స్వరూపమే. నీవు కూడ ఆ రూపమే.

ఇట్లు శ్వేత కేతునకు దృష్టాంతముల ద్వారా ఈ అభిప్రాయమును 9 మార్లు ఉపదేశించెను. వానినుండి ఒక దృష్టాంతము తీసికొనుడు.

## సత్య స్వరూపమగు పరబ్రహ్మము

నదులు అనేక దిశలనుండి వెలువడి సముద్రములో కలియును. అవి సముద్ర రూపమును పొందును. అనంతరము వానికి నేను ఫలానా నదిని అను ద్వైత బుద్ధి యుండదు. అటులనే ఈ ప్రజలందరును సత్పదార్థము నుండియే ఆవిర్భవించిరి. తాము సద్రూపులు అని వారికి తెలియదు. సత్ పదార్థం నుండియే జన్మించితి మనియును ఎరుగరు. వ్యాఘ్ర, సింహ, వరాహాది రూపములు కూడ సద్రూపములే. సద్రూపము అగు సూక్ష్మ కారణ బ్రహ్మముయొక్క కల్పితాంశము నందు వ్యాఘ్రాదులు ఆవిర్భవించినవి. కారణ రూపమగు సూక్ష్మ ఆత్మ అదియే. దాని స్వరూపమే ఈ సమస్త ప్రపంచమును. అదియే సత్య స్వరూపమగు పరబ్రహ్మము. ఆ సత్య స్వరూపమగు పర బ్రహ్మమే నీ స్వరూపము, అది నీవు.

## అభేదమును బోధించు శ్రుతులు

శ్రుతులు స్పష్టముగా ప్రకటించుచున్నను అధికారి భేదముచే ఆచార్యులు తమతమ సంప్రదాయములయందు ద్వైతమునకు వాటిని అనువర్తింపజేసిరి. ఆయా సంప్రదాయముల ఆచార్యులు ఇతర మతములను ఖండించి తమ మతమే వేద సమ్మత మయినది అని జగమును నమ్మించ ప్రయత్నించిరి. అయినను సూక్ష్మ బుద్ధితో-

***"తం స్వాచ్ఛరీరాత్ ప్రవృహేన్ముఞ్జాదివే షీకాం ధైర్యేణ."***

"ముంజగడ్డి నుండి ఈనెను తీయుటకు చాల శ్రద్ధ వహించవలెను. అటులనే తన దేహం కంటే ఆత్మను వేరుగా తెలిసికొనుటకు ప్రయత్నించవలెను. -"తత్త్వమస్యాది మహా వాక్యములను వినిన తరువాత మనన నిది ధ్యాసనములు చేయవలెను. అంతట తననే తన స్వరూపమగు శుద్ధ బ్రహ్మ స్వరూపముగా భావించును.

# అద్వైతము రాజమార్గము

ఒకటి తప్ప మరి ఏ అంకెయును వాస్తవిక మయినది కాదు. మిగిలినవి అన్నియు సాపేక్షములగుటచే కల్పితములు. ఏకత్వము ఎల్ల కాలముల యందును అకల్పితము. రెండు పుస్తకములున్న ద్విత్వ బుద్ధి కలుగును. కాని “ఇది ఒక పుస్తకము, ఇది ఒక పుస్తకము.” అను ఏకత్వ బుద్ధి ప్రత్యేకముగా ప్రతి పుస్తకము నందును ఉండుటచేతనే ఆ ద్విత్వ బుద్ధి కలుగును. ఇట్లు ద్విత్వము అపేక్షా బుద్ధి జన్యమును, ఏకత్వ బుద్ధ్యధీనమును అయియున్నది. ఏకత్వము అన్యోన్యాపేక్షము. ఎట్లన, ధాన్యపు గింజల రాశి ఒకటైనను అందు కణ కణ సాపేక్షముచే అనేక కణములు ఉండును. ఇది ఒక వడ్లగింజల రాశి అనునది అనపేక్ష మగు ఏకత్వ బుద్ధి. ఇదేవిధముగా అన్య నిరపేక్షమగు ఏకత్వమునందు ఆపేక్షా బుద్ధి జన్యములగు ద్వైత, విశిష్టాద్వైత, శుద్ధాద్వైతములను

కల్పనలకు వీలు పడినది అట్లు చేసినను కేవలము అద్వైత బ్రహ్మమునందు ఏ విధమగు వికృతియును సంభవించదు. పర్వతము పైకి వెళ్ళు వారిలో కొందరికి కష్టమైనను దగ్గర త్రోవ నచ్చును. కొందరికి చుట్టు అయినను కష్టము లేని త్రోవ నచ్చును. అటులనే బుద్ధి భేదముచే వేరు వేరు అధికారులకు ఆచార్యులు వేరువేరు మతాలు ప్రవచించిరి. కాని రాజమార్గము అద్వైత మనునది నిర్వివాదము.

శాస్త్రము చెప్పుచున్నది.

చతుర్థో రాజయోగః స్యాత్ తద్ద్విధాభావ వర్జితః|

“నాలుగు యోగముల యందును ద్వైత బావ రహితమయినది రాజయోగము.”

క్రమముగా అద్వైత ప్రతిపాదక ములుగు ఋగ్యజుస్సామాధర్వ వేదములందలి మహావాక్యములు విచారించుడు.

# ఇరువది రెండవ ప్రసంగము

***ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, అయమాత్మా బ్రహ్మ.***

ఈ నాలుగు మహావాక్యములు పరమాత్మ అనబడు శుద్ధ బ్రహ్మమునకును జీవునకును అభేదమును బోధించును. కాని మానవునకు భూత, భావి, వర్తమానము లనబడు మూడు రకముల ప్రతి బంధములలోను ఏది మిగిలియున్నను తత్త్వజ్ఞానము యొక్క అపరోక్ష(ప్రత్యక్ష) అనుభూతి జరుగదు.

వార్తిక కారులు చెప్పిరి.

***కుతస్తద్ జ్ఞాన మితి చేత్ తద్ధి బన్ధ పరిక్షయాత్ /***
***అసావపి చ భూతో వా భావీ వా వర్తతేఽథవా//***

ఈ అపరోక్ష జ్ఞానము ఎట్లు కలుగును? అని అడిగినచో దానికి సమాధానముగా బంధనాశముచే కలుగును. అని చెప్పవలెను. ఈ బంధము భూతము, భావి, వర్తమానము అని

మూడు విధములు.

ఈ ప్రతిబంధకములు, వాటి నివృత్తికి ఉపాయములు అనునవి శ్రీ విద్యారణ్య స్వామివారి పంచదశి జ్ఞాన దీప ప్రకరణమున చెప్పబడినవి.

భూత ప్రతి బంధము:- స్త్రీ ధనాదుల వియోగము భూత ప్రతి బంధము, సన్యాసికి భూత కాలమందలి భార్యయందు ప్రేమ అనెడు ప్రతి బంధముచే గురువు ఉపదేశించినను తత్త్వజ్ఞానము కలుగ లేదు, ఈవిషయమున క్రింది కథ ప్రపంచమున ప్రసిద్ధి చెందినది.

ఒక రాజు ఒక మహాత్ముని వద్ద దీక్షను పొంది సన్యసించెను. ఆతనికి వివేకము, వైరాగ్యము అపరిమితముగ నుండెను. గురువుగారు అవి తెలిసికొనియే ఆతనికి సన్యాస దీక్ష నిచ్చెను. అనంతరము గురువు తత్త్వోపదేశము చేయ మొదలిడెను. ఎన్నియో రోజులు తత్త్వోపదేశము చేసినను శిష్యునకు

జ్ఞానము కలుగ లేదు. శ్రవణ, మనన, నిదిధ్యాసనముల యందు ఆయనకు తన రాణి యందలి ప్రేమ ప్రతిబంధక మాయెను. ఆ కారణముచే అతనికి తత్త్వజ్ఞానము కలుగ లేదు. గురువు సమర్థుడగు యోగి. ఆతనికి తత్త్వజ్ఞానము కలుగకుండుటకు గల కారణము తెలిసికొని అంతవరకును తాను ఉపదేశించుచున్న క్రమము నందు మార్పు తెచ్చెను. రాణితో ఆ శిష్యుడు జరిపిన భౌతిక, వ్యావహారిక సంబంధము నాధారముగా తీసికొని ఉపదేశించెను. అంతట పూర్ణజ్ఞానము కలిగెను. గురువు రాణికి శిష్యునకును గల ప్రేమను దృష్టాంతముగా తీసికొని శిష్యునకు తత్త్వోపదేశము చేసినంతనే ప్రతి బంధము నశించి తత్త్వజ్ఞానము పూర్తిగా కలిగెను.

భావి ప్రతి బంధము: శ్రుతి యందు వామ దేవుని దృష్టాంతమున ఈ భావిప్రతి బంధము ప్రస్తావించబడినది. వామదేవుని ఆగామి ప్రతిబంధము గర్భధారణ మాత్రమున పోయినది.

***గర్భ ఏవ ప్రతి పేదే వామదేవోఽహం మనుర భవం సూర్యశ్చ।***

వామ దేవునకు గర్భము నందుండగనే జ్ఞానము కలిగెను. " నేను మనువును, నేను సూర్యుడను" అను సర్వాత్మభానము ఆతనికి కలిగెను. గర్భధారణ మాత్రముననే ఆ భావిప్రతిబంధము పోయి అతనికి తత్త్వజ్ఞానము కలిగెను. భరతుని ప్రతిబంధము మూడు జన్మల యందు క్షయమును పొందె ననునది భాగవతాదుల యందు ప్రసిద్ధమే.

***ఆగామీ ప్రతిబన్ధశ్చ వామదేవే సమీరితః।***
***ఏకేన జన్మనా క్షీణో భరతస్య త్రిజన్మభిః॥***

"ఆగామి ప్రతిబంధము వామ దేవునకు ఒక జన్మములోను, భరతునకు మూడు జన్మలలోను క్షయము నొందెను."

ఈ ఆగామి ప్రతిబంధము అనగా భావిప్రతిబంధము. జన్మాంతరమునకు హేతు భూతమగు ప్రారబ్ధావశేషము. అది

అనుభవించనిదే క్షీణించదు. దృఢమగు శ్రవణాదుల ద్వారా అది ఒకటి రెండు జన్మములయందు క్షీణించును. లేనిచో అనేక జన్మలను ఎత్తవలసి వచ్చును. ఉదాహరణమునకు వామదేవుని ప్రారబ్ధము ఒక జన్మమునందు క్షీణించెను. ఒక జన్మ అయినను పొంది తీరవలసి వచ్చెననునది నిస్సంశయము. కర్మమును అనుభవించనిదే ప్రారబ్ధము నశించదు. అదే విధముగా భరతునకు మూడు జన్మల అనంతరము ప్రారబ్ధము క్షయమును పొందెను.

భరతుడు మూడు జన్మలను పొందుటకు గల కారణము సాంఖ్య సూత్రముల యందు ఉన్నది.

***"అసాధనానుచిన్తనం బన్ధాయ భరతవత్"***

వివేక జ్ఞానమునకు ఆంతరంగిక సాధనము లేనిదే ధర్మము నయినను సాధకుడు చింతన చేయరాదు. ఈవిషయమున భాగవతమునందు క్రింది విధముగా ఒక ఆఖ్యాయిక కలదు.

భరత మహారాజు రాజ్య భారమును విడనాడి అరణ్యమున తపము చేయుచుండెను. ఆయన ఒకరోజు గండకీ నదిలో స్నానము చేయుటకు వెళ్ళెను. అప్పుడే పుట్టిన లేడి పిల్ల ఒకటి జల ప్రవాహమున కొట్టుకొని పోవుట ఆయన చూచెను. ఆయన దానిని నీటినుండి బయటకు తీసి పాలుపోసి పెంచెను. ఆ లేడి పిల్లపై ఆయనకు కల మక్కువ అపరిమితము, ధ్యానము చేయుటకు కూర్చొనినచో లేడిపిల్ల ఏమయినదో అని చింతించెడివాడు. ఏదైన క్రూర జంతువు ఎత్తుకొనిపోయె నేమో అని భయపడెడివాడు. ఈవిధముగా ధ్యాన భంగము కలుగ సాగెను. ఆ చిన్న పిల్ల అంతకంతకు పెరిగి చివరకు లేళ్ళ గుంపులో కలసి పోయెను. అవసాన సమయమున భరతునకు లేడి విచారము తప్ప లేదు, ఆ దుఃఖముతోనే ఆతడు మరణించెను.

ఉత్తర జన్మమునందు భరతుడు లేడి గర్భమున జన్మించెను. హరిక్షేత్రమున పులస్త్య,

పులహా మునుల ఆశ్రమములయందు కథా కాలక్షేపములు జరిగినప్పుడు ఈ హరిణము అచ్చటకు వెళ్ళి శాంత చిత్తముతో కథాశ్రవణము చేయుచుండెను. దానికి ఇతర జీవులతో సంసర్గము లేదు. శుష్క తృణమును, లతాదులను భక్షించి కాలము గడపు చుండెను. అట్లు కథ వినుచుండ “నా ప్రారబ్ధము ఎట్లు పూర్తి అగును. ” అను చింతయే హరిణమును వేధించుచుండెను. ఆ ప్రకారము హరిణము దేహమును విసర్జించెను.

అనంతర జన్మమున ఆంగీరస వంశీయుడగు ఒక బ్రాహ్మణ ఇంట జన్మించెను. ఈ బ్రాహ్మణ కుమారుని రూపమున ఉన్న భరతుని శరీరము బాగుగా బలిసి యుండెను. ఆ బాహ్మణ కుమారుడు ఎవరితోనూ మాట్లాడడు. మూఢునివలె కూర్చొని యుండెడివాడు. ఈ మూర్ఖుడు ఏ పనికిని ఉపయోగించనందున బలసిన శరీరము ఉండుటచే పొలము పనియందు నియోగించబడెను. ఇట్లుండ ఒక రోజున రహుగణుడను రాజు పాలకీలో కూర్చొని

గురువును వెతకుటకు వెళ్లు చుండెను. పాలకీని మోయు వారలు అలసి యుండుటచే బలిష్ఠుడగు ఈ భరతుని లాగికొని వెళ్లి మోయమనిరి. భరతుడు పాలకి మోయుచు కాలి క్రింద ఏ జీవియును పడి చనిపోకుండుటకై గెంతుచు నడువ సాగెను. ఇతర బోయీలు ఆతనితో కలసి నడువకుండుటచే రాజునకు కుదుపు తగిలెను. ఆతడు అడిగెను. " పాలికీ ఊగుటకు కారణ మేమి? "ఇతర బోయీలు పలికిరి. "ప్రభూ, ఈ క్రొత్త వాడు ఇప్పుడే మోతకు వచ్చినాడు. అందుకే త్వరగా నడచుట లేదు." రాజు క్రొత్త వానిని అడిగెను. "ఏమి నీవు చిక్కియున్నవా?" జడ భరతుడు వెంటనే సమాధానము చెప్పెను. "కృశించుటయును, పుష్టిని పొందుటయు శరీర ధర్మము. నా స్వరూపము యొక్క ధర్మము కాదు." ఈమాటలు విని రాజు వెంటనే క్రిందికి దిగెను. ఈతడు ఎవడో తత్త్వవేత్త అని తెలిసికొని జడభరతునకు నమస్కరించెను.

వర్తమాన ప్రతి బంధము నాల్గు రకములు, 1 విషయాసక్తి. 2 ప్రజ్ఞా మాంద్యము 3 కుతర్కము 4. విపర్యయదురాగ్రహము.

విషయాసక్తి అనగా భోగము లందలి కోరిక. ఇవి ఈ కాలమున చాలమంది జనుల యందు కానవచ్చుచున్నది. మానవుడు ఈ విషయాసక్తిచే యథార్థమగు ఆత్మానుభవము దూరమయి బంధము నందు చిక్కుపడును.

***కురఙ్గమాతఙ్గపతఙ్గభృఙ్గమీనాః హతాః పఞ్చభిరేవ పఞ్చ/***
***ఏకః ప్రమాదీ స కథం న హన్యతే యః సేవతే పఞ్చభిరేవ పఞ్చ//***

" లేడి, ఏనుగు, మిడత, తుమ్మెద, చేప- ఈ ఐదును వరుసగా శ్రోత్ర, త్వక్, చక్షుః, ఘ్రాణ, రసనేంద్రియముల విషయములందు ఆసక్తిచే నాశనమును చెందుచున్నవి. అనగా ఏ కేంద్రియాపరాధము చేతనే అవి నాశనము నొందుచున్నవి. ఇక మనుష్యుడు పంచేంద్రియాపరాధములకు గురియై

పంచేంద్రియార్థములను సేవించినచో ఏల నశించదు? తప్పక నశించును.”

ప్రజ్ఞామాంద్యము :- జడ బుద్ధి. ఇది కూడా ఒక వర్తమాన ప్రతి బంధమే, తెలిసికొను శక్తియే లేనపుడు తత్త్వోపదేశము ఎట్లు జరుగును?

కుతర్కం:- తలక్రిందుగా వాదించు అలవాటు. ఈ జగ మంతయు జడము. కావున అది జడమగు కారణము నుండియే ఉద్భవించి తీరవలెను. ఎర్రని దారముతో నేయబడిన బట్ట ఎరగనే ఉండును. పచ్చని దారముతో నేయబడినచో పచ్చగనే యుండును. ఈ జగము జడమే. కావున ఇది అంతయు జడ కారణము నుండియే ఉద్భవించి యుండవలెను. ఇట్టి కుతర్కముచే వేదాంతమునందు చెప్ప బడిన ఆత్మ బ్రహ్మైక్యము అసంభవమగును.

విపర్యయదురాగ్రహము:- విపరీతమగు భావమునందు మిక్కిలి పట్టుదల. ఇది ఒక పెద్ద ప్రతి బంధము. ఈ ప్రతి బంధముచే “నేను జన్న

మరణములు కలవాడను. నాయందు రాగాది దోషములు కలవు. జగ ద్వ్యవహారములయందు చిక్కు పడియున్నాను, అల్పశక్తి కల జీవుడను అనుమాట నిజమే. శ్రుతియందు చెప్ప బడిన తత్త్వమస్యాది మహా వాక్యముల ద్వారా చెప్పబడు ఈ తత్త్వ భావమంతయు అసత్యము.” అను విపరీత భావము కలుగును. ఈ విధమగు ప్రతిబంధము నుండి విముక్తిని పొందిన తదుపరి తాను బ్రహ్మ స్వరూపమును ప్రత్యక్షముగా అనుభవించును.

ఈ బంధములన్నిటి నుండియు నివృత్తిని చెందుటకు పంచదశి కారులు చెప్పుచున్నారు.

***శమాద్యైః శ్రవణాద్యైః చ తత్ర తత్రోచితైః క్షయమ్।***
***నీతేఽస్మిన్ ప్రతి బన్ధే హి స్వస్య బ్రహ్మత్వమశ్నుతే॥***

“ఆయా ప్రతిబంధముల నివృత్తి కి ఆవశ్యకములగు శమదమాదుల ద్వారాను, శ్రవణాదుల ద్వారాను, ప్రతి బంధములు

క్షయమును పొందిన పిమ్మట స్వస్వరూపమగు బ్రహ్మత్వము యొక్క ఆనందము అనుభూత మగును.” నాలుగు మహా వాక్యాలు అర్థము జీవ బ్రహ్మ ఐక్యము. కావున “తత్త్వమసి" ఇత్యాది మహావాక్యములచే పరోక్షజ్ఞానము కలుగును. మనన, నిదిధ్యాసనములు చేసిన పిదప ప్రతిబంధము లన్నియు నివృత్తిని పొంది సాధకునకు కాలాంతరమున “అహం బ్రహ్మాస్మి” మొదలగు వాక్యములచే ప్రత్యక్ష బ్రహ్మానుభవము అగును. ఆతడు జీవన్ముక్తుడగును. ఈ జీవన్ముక్తుని తృప్తిని శబ్దములతో వర్ణించుట అశక్యము. అనుభవము అయిన వారే వస్తువు యొక్క యథార్థ తత్త్వమును తెలిసికొనగలరు. అది వర్ణించుటకు శక్యము కాదు.

ప్రత్యక్షానుభూతములగు పదార్థముల అసాధారణ ధర్మములు శబ్దములచే వర్ణించబడవు. పాలు, వెన్న, మిఠాయి మొదలగు వస్తువుల మాధుర్యమును సరస్వతి కూడ శబ్దముచే వర్ణించ

లేదు; అనుభవము ద్వారా ప్రత్యక్షమగు భేదమును స్ఫురింపజేయలేదు. అన్నిటి యందును మాధుర్యము ఉన్నను, ఒక దానియందు ఉన్న మాధుర్యమునకును, మరియొక దానిలో నున్న మాధుర్యమునకును కల భేదము నాలుక మీద వేసిన కాని స్పష్టముగా తెలియదు. అట్లు తప్ప మరియొక విధముగా వాని భేదము ఇతరులకు తెలుపలేము. ఈ ప్రత్యక్ష ఇంద్రియానుభవమును ఆధారముగా జేసికొని విచారించినచో స్థూల పదార్థములలో ఒక ఇంద్రియము వలన కలుగు జ్ఞానము మరియొక ఇంద్రియమువలన కలుగదు. ఆ జ్ఞానము ఆ ఇంద్రియ విషయము కాదు. ఇక సూక్ష్మాతిసూక్ష్మమగు ఆత్మ విషయకమగు అనుభవమును వాణి ఎట్లు వర్ణించగలదు? ఆ కారణముచే అఖంధ ఏకత్వ ప్రకారమగు నీవు, నేను అది అను భేదము లేని వాక్యార్థ బోధ భాగ త్యాగ లక్షణా వృత్తిచే నగునని "పంచదశి" కారులు మహావాక్య వివేక ప్రకరణమున చెప్పిరి.

ఋగ్వేదము నందలి ఐతరేయారణ్యకము

నందు "ప్రజ్ఞానం బ్రహ్మ" అను వాక్యము కలదు. వ్యక్తి నేత్రేందియముల ద్వారా బయల్పడిన అంతఃకరణ వృత్త్యుపహితమగు చైతన్యము ద్వారా దర్శన విషయములగు రూపాదులను దర్శించును. కర్ణేంద్రియము ద్వారా బయల్పడిన అంతఃకరణ వృత్త్యుపహితమగు చైతన్యము ద్వారా శబ్దమును శ్రవణము చేయును, ఘ్రాణము ద్వారా బయల్పడిన అంతఃకరణ వృత్త్యుపహితమగు చైతన్యము ద్వారా గంధమును గ్రహించును. రసనేంద్రియము ద్వారా బయల్పడిన అంతఃకరణ వృత్త్యుపహితమగు చైతన్యముద్వారా స్వాదు, అస్వాదు రసములను తెలిసికొనును. ఇట్లు వేర్వేరు ఇంద్రియముల ద్వారా బయల్పడిన అంతఃకరణ వృత్త్యుపహిత మగు చైతన్యముద్వారా ఆయా పనులు చేయును ఆ చైతన్యమే "ప్రజ్ఞానం బ్రహ్మ" అను మహావాక్యము నందలి "ప్రజ్ఞాన" శబ్దమునకు వాచ్యము.

# ఇరువది రెండవ ప్రసంగము

బ్రహ్మ, ఇంద్ర, దేవ, మనుష్య, పశ్వాదుల యందు ఒక వ్యాపి చైతన్యము కలదు. అది బ్రహ్మ శబ్ద వాచ్యము. అనగా నా యందుకూడ ప్రజ్ఞాన రూపమగు బ్రహ్మము కలదు. ప్రజ్ఞాన బ్రహ్మ రూపమే నేను అనునది బ్రహ్మ శబ్దమునకు భావము. ఆ అర్థమునే "అహం బ్రహ్మోస్మి" కూడా తెలుపును. పరి పూర్ణుడగు పరమాత్మ దేశ, కాల, వస్త్వతీతుడు. ఆతడు ఈ మాయాకల్పిత జాగృతియందు శమ దమాది సాధన సంపత్తి సహాయమున విద్యా సంపాదనమునకు తగిన శ్రవణాది అనుష్టానము కల ఈ మనుష్య శరీరమునందు బుద్ధిచే దర్శనీయ మగు సూక్ష్మ శరీరమునందు సాక్షీభూతమయి, అధికారిగా నుండి, దర్శనీయుడగుటచే లక్షణా ద్వారా "అహం" శబ్దవాచ్యు డగుచున్నాడు.

స్వతఃపరిపూర్ణుడగు పరమాత్మ ఈ మహా వాక్యము నందు బ్రహ్మశబ్దము ద్వారా వర్ణించబడెను. ఈ వాక్యము నందలి "అస్మి" పదముచే రెండు పదములకును

సమానాధికరణ్యము కలదు. కావున రెండింటికిని ఏకత్వము సిద్ధించి జీవ బ్రహ్మైకత్వము బోధ్యమయి నేను స్వయముగా ఈశ్వరస్వరూపుడనే అను యథార్థ సాక్షాత్ జ్ఞానము కలుగును.

సామవేదము ఛాందోగ్యోపనిషత్తునందు కల “తత్త్వ మసి” మహావాక్యము యొక్క అర్థం ఇది :-

ఛాందోగ్యము నందలి ఉపక్రమమునందు తెలిపిన “**సదేవ సౌమ్యేద మగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయమ్**” ఓ సౌమ్యుడగు శ్వేత కేతూ! సృష్టికి పూర్వం ఇదంతయును సద్రూపమును, అద్వితీయమును అగు ఒక పదార్థమే. స్వస్వరూపాంతర్గత సజాతీయ విజాతీయ భేద రహితమును, నామరూపాది రహితమును అగు ఈ ప్రతిపాదితమగు సద్వస్తువు ఇప్పుడును అనగా సృష్ట్యనంతరము కూడ యథాప్రకారముగనే ఉన్నది. ఈ విషయము

"తత్త్వమసి" వాక్యము నందలి 'తత్' పదముచే తెలిసి కొనబడును.

ఇక త్వం పదార్థము.

శ్రవణ, మననాదుల ద్వారా మహావాక్యానుభూతిని పొంద వలెనని కోరికగల శ్రోతకు దేహేంద్రియపరమయి, దేహేంద్రియో పలక్షితమగు స్థూల, సూక్ష్మ, కారణ, శరీరం సాక్షిత్వము ద్వారా శరీర త్రయ విలక్షణమగు చైతన్యమే "త్వం" పదము యొక్క లక్ష్యార్థము.

"అసి" అను పదముచే కలుగు "తత్", "త్వం" పదముల సామానాధికరణ్యము ద్వారా ఏకీకృతమగు పదార్థద్వయైక్య జ్ఞానము శిష్యునకు కలుగ జేయబడును. ఈ విధముగా ప్రమాణసిద్ధమగు ఐక్యమును ముముక్షువులు అనుభవించెదరు.

ఇక అధర్వవేదము నందలి "అయమాత్మా బ్రహ్మ" అను మహా వాక్యము యొక్క అర్థము వివరించబడును.

'అయం' పదముచే స్వప్రకాశమగు అపరోక్షత్వము గ్రహించబడును. ఘటాది పదార్ధములు అపరోక్షములు. అనగా ప్రత్యక్షములు. అయినను జడములు. పరప్రకాశ్యములు. స్వప్రకాశ్యములు కావు.

పుణ్య, పాప రూపములగు ధర్మము లన్నియు పరోక్షములే కావున వీని అన్నిటికంటెను విలక్షణమగు వస్తువు స్వప్రకాశమును ప్రత్యక్షమును కూడను. దానిని 'అయం' శబ్దముచే గ్రహించనగును. "ఆత్మా" శబ్దము ద్వారా అహంకారము నుండి దేహము వరకు గల సాక్షిని లేక అధిష్టానమగు ప్రత్యగాత్మను గ్రహించవలెను.

ఈ కన్పట్టు సమస్త ప్రపంచం యొక్క తత్త్వమును వాక్యము నందు కల "బ్రహ్మ" పదముచే చెప్పబడినది. అనగా స్వప్రకాశము బ్రహ్మస్వరూపమగు తత్త్వమే. ఇది ఈ మహావాక్యమునకు అర్ధము.

ఈ విధముగా ఈ మహా వాక్యముల అర్థమును అనుసంధానము చేసికొని మనన, నిదిధ్యాసనములు చేయుటచే ప్రత్యక్ష ఆత్మానుభవము అగును.

అనంతరము రేవాశంకరశాస్త్రి స్వామి శ్రీ ప్రకాశానందుల వారితో నిట్లనిరి:- తమరు ఈవిషయమును విశేషముగా నెరుగుదురు. తమ అభిప్రాయమేమి?

## దైవసంపదను పొందుటచే ముక్తి కలుగును

స్వా. ప్ర.:- ఆచార్యుల మతములన్నియు అధికారి భేదముచే యుక్తములే. కనిష్ఠుడగు మందాధికారికి ద్వైతము తగినది. మధ్యమాధికారికి విశిష్టాద్వైతము యోగ్యమైనది. ఉత్తమాధికారికి అద్వైతము గ్రహించదగినది. ద్వైతాద్వైత విశిష్టాద్వైతములయందు దేనిని అవలంబించినను మత మతాంతరముల వివాదములయందు చిక్కువడి, ఖండన

మండనములు చేయుచు, యథార్థ వస్తువునకు అనగా పరమాత్మునకు సంబంధించిన జ్ఞానమును పొంది సత్య ధ్యేయమును చేరుటకు ప్రయాస పడక పోయినచో నిరర్థకము. ఏ మతమైనను అవలంబించుడు. అన్ని మతముల అభిప్రాయము కూడ రాగ ద్వేషాదులను నిర్మూలించి, భక్తి, వైరాగ్యములను పొందిన ఒకే పరమాత్ముని పొందుటయే. నదులన్నియును సముద్రమున చేరునట్లు ఒకే పరమాత్ముని పొందుటయే సర్వ మతముల యొక్కయు ఆశయము. ఈ ఆశయముతో నేను ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతములను అన్ని మతములును కూడ అపదార్థ ప్రతి పాదితములగుటచే త్యాజ్యములని తలచితిని. ద్వైత సాపేక్షము అద్వైతము. అద్వైత సాపేక్షము ద్వైతము. ఈ రెండును వాస్తవిక రూపమున కల్పితములే. మతమతాంతరముల గందర గోళములో రాగ ద్వేషములు కలుగును. అష్టావక్ర గీతయందు చెప్పబడినది.

# ఇరువది రెండవ ప్రసంగము

***నానా మతం మహర్షీణాం, సాధూనాం యోగినాం తథా |***
***దృష్ట్వా నిర్వేద మాపన్నః కో న శామ్యతి మానవః||***

"మహర్షుల మతములు అనేకములు. సాధువులకును, యోగులకును వేర్వేరు మతములు కలవు. వానిని చూచిన తదుపరి వాని భేదములపై వైరాగ్యము కలిగిన ఏమానవుడు శాంతిని పొందడు?"

మతమతాంతరములను గురించి అలర్కుని దృష్టాంతము కలదు. మదాలస నాల్గవ కుమారుడు అలర్కుడు. తల్లి ఇచ్చిన తావీదునుండి చదివిన ఉపదేశముచే వైరాగ్యమును పొందెను. అతడు తన పెద్దన్నగారగు సుబాహుని వద్దకు వెళ్ళి ప్రార్థించెను. "నాకు బ్రహ్మవిద్యను ఉపదేశించుడు." ఆతడు చెప్పెను. "నీవు దత్తాత్రేయ గురువుల వారి వద్దకు వెళ్ళుము. ఆయన నిష్పక్ష పాతి, నేను నీ సోదరుడను. నేను

ఇచ్చిన ఉపదేశము బోధపడదు.” అలర్కుడు వెంటనే దత్తాత్రేయుల వారిని వెదకుటకు బయలు దేరెను. ఒక బంగారు ఉంగరమును వ్రేలునకు ధరించి గురునన్వేషించుటకు బయలు వెడలెను. ఆయనను తెలిసి కొనుటకు ప్రముఖ వ్యక్తులను ఇట్లు ప్రశ్నించెను. “ఈ ఉంగరము దేనితో చేయబడినది?”' బంగారముతో చేయబడెనని వారు చెప్పెడి వారు. అలర్కుడు “ కాదు ఇత్తడిది.” అని పలికెను. మరియొకనికి “వెండిది” అని చెప్పెను. ఇట్లు అందరకును వారు చెప్పిన సమాధానములను అంగీకరించక వేర్వేరు ప్రతి సమాధానములు చెప్పెను. అంతట వారు “వేరొక చోటికి పొమ్ము. నీకు మతి లేదు” అని చెప్పెడి వారు. చివరకు అలర్కుడు దత్తాత్రేయుల వారి వద్దకు వచ్చెను. వారిని కూడ “ఈ ఉంగరము దేనితో చేయబడిన” దని అడిగెను. ఆయన సమాధానము చెప్పెను. “బంగారు ఉంగరము.”

అలర్కుడు:-. "కాదు. వెండిది."

దత్తాత్రేయుడు మరల చెప్పెను:-'అవును'

అలర్కుడు పలికెను:-'కాదు, ఇత్తడిది'.

దత్తాత్రేయుడు:-"అవును."

అలర్కుడు ఆ విధముగా ఎన్ని మార్లు వ్యతిరేకముగా చెప్పినను దత్తాత్రేయులు "నిజమే" అనెను. ఈ సమాధానములచే "ఆయన దత్తాత్రేయులే " అని తెలిసికొనెను. అలర్కుడు ఒక్క మారుగా, వారి కాళ్ళపై బడి పలికెను. "ప్రభూ, నేను ఎన్ని మారులు వంకర సమాధానములు చెప్పినను తమరు నిజమనియే చెప్పిరి. అందుకు కారణ మేమి?" దత్తాత్రేయుల వారు పలికిరి. "నీవు వేరు వేరు ధాతువుల పేర్లు పలికితివి. అందుచేతనే నేను ప్రతి సమాధానమునకును నిజము, నిజము అని చెప్పితిని. ఏలనన నా దృష్టియందు వెండి, బంగారము, ఇత్తడి మొదలగు ధాతువు లన్నియు పార్థివములే. ఆ కారణము చేతనే నేను ప్రతి

మారును "అది నిజమే" అని చెప్పితిని.

ఈ దృష్టాంతముచే మతమతాంతరముల లక్ష్యమగు జ్ఞానము ఒకటే అని తేలుచున్నది.

స్వా. ని. :-దత్తాత్రేయులు ఇట్లు పలికిరి.

***బోధ విబోధైః సతతం యుక్తో ద్వైతాద్వైతైః కథమిహ ముక్తః|***
***సహజో విరజాః కథమిహ యోగీ శుద్ధ నిరఞ్జన సమరస భోగీ||***

"పరోక్ష, అపరోక్ష జ్ఞానములతో కూడిన వాడు ద్వైతాద్వైత ముక్తుడని ఎట్లు చెప్ప బడును? ఏలనన ఆతడు ద్వైత, అద్వైతములకు రెంటికిని పరుడు. ఆతడు సహజముగా త్రిగుణాతీతుడు. అతడు యోగి ఎట్లు అనబడును? ఆతడు శుద్ధ నిర్లిప్త సమరస ఆనందమును అనుభవించును."

స్వామివారు చెప్పినది నిజము. మతమతాంతరములను త్యాజ్యముగా నంగీకరించి వదలివేయుట యుక్తము. ప్రతి

వాడును జ్ఞానమును సంపాదించుట అను పురుషార్థమును చేయుటయే కర్తవ్యముగా నెరుంగవలెను.

చందు భాయి ప్రశ్నించెను.

"జ్ఞానము యొక్క వాస్తవిక స్వరూపమేమి?"

స్వా. ని.:-జ్ఞానము రెండు రకములు. పరోక్షము. అపరోక్షము. "బ్రహ్మము కలదు." అను జ్ఞానము పరోక్ష జ్ఞానము. బ్రహ్మసాక్షాత్కారము అపరోక్ష జ్ఞానము. కాని స్థితి భేదము ననుసరించి జ్ఞానికోటిని నాలుగు విధములుగా విభజించవచ్చును. యోగ వాశిష్ఠమున ఏడు జ్ఞాన భూమికలు వివరించబడినవి. అందులో మొదటి మూడును సాధనావస్థకు సంబంధించినవి. మిగిలిన నాల్గును సిద్ధావస్థకు సంబంధించినవి. ఈవిధముగనే అజ్ఞాన భూమికలు కూడ ఏడు కలవు.

చందూ:- ఈవిషయమున నేను ఏమియును చదవలేదు. తమరు దయయుంచి వివరించుడు.

స్వా.ని.:- ఈ విషయమున శ్రీ రామచంద్రుల వారు వశిష్ఠులను ప్రశ్నించిరి.

***"కీ దృశ్యో భగవాన్యోగ భూమికాః సప్త సిద్ధిదాః|***
***సమాసేనేతి మే బ్రూహి సర్వ తత్త్వ విదాం వరః||"***

"ఓ తత్త్వ వేత్తలలో శ్రేష్ఠుడా! సిద్ధిని ఇచ్చు ఏడు భూమికలును ఏవి? నాకు సంక్షేపముగా చెప్పుడు."

వశిష్ట:- ఓ రామా! అజ్ఞాన భూమికలు ఏడు. అటులనే జ్ఞాన భూమికలు కూడా ఏడు. వాని అవాంతర భేదములు అనేకములు, సహజమగు ప్రవృత్తిమయ జీవితము, విషయ భోగములయందు అంతులేని తృష్ణ యనెడు రసావేశము. ఈ రెండును అజ్ఞాన భూమికకు

అసాధారణ కారణము- సాధన చతుష్టయ సహితముగా శ్రవణ, మనన, నిదిధ్యాసనముల యందు ప్రవృత్తియు, తీవ్రమగు మోక్షేచ్ఛయను రసావేశము జ్ఞాన భూమికకు అసాధారణ కారణము. అధిష్ఠానమగు బ్రహ్మము యొక్క ఉత్కర్షకు అధీనమయిన తన అస్తిత్వోపలబ్ధి రెండు భూమికలకును సాధారణ కారణము. ఈ కారణములచే రెండు రకములగు భూమికలును తమతమ విషయములయందు దృఢముగా నుండును. అజ్ఞాన భూమికలు ప్రపంచమునందు దుఃఖమను ఫలమును కలుగజేయును. జ్ఞానభూమికలు సంసార భ్రమణ నివృత్తితో బాటు పరమానంద ప్రాప్తి అనెడు ఉత్తమ ఫలమును కలుగ జేయును.

ఓ రాముడా! మొదట ఏడు రకముల అజ్ఞాన భూమికలును వినుము:-

స్వస్వరూపస్థితి జ్ఞానము. దాని ఫలము ముక్తి. స్వస్వరూపస్థితి నుండి చ్యుతిని పొందుట అజ్ఞానము అనబడును. దేహాదుల యందు

అహంకార, మమకారములు దాని ఫలము. సంతులగు జనులు శుద్ధ సన్మార్గ సంవిద్రూపమగు స్వస్వరూపము నుండి అనగా నిజ స్వరూప జ్ఞానము నుండి చలించరు. వారియందు రాగద్వేషములు ప్రవేశించవు. ఆ రాగ ద్వేష భావముచే వారి యందు అజ్ఞానము కూడా ప్రవేశించ లేదు. ఒక విషయమునుండి చిత్తము మరలిన తరువాత నున్న మధ్య కాలము నందలి మనన రహితమగు స్థితియే స్వస్వరూపస్థితి. అందు సర్వ సంకల్పములును శాంతించును. అది నిశ్చలతయను ఘనస్థితి. అది నిద్రా, జడత్వ రహితము. నిద్ర స్వరూప స్థితి అనిపించుకొనదు. ఏలనన నిద్ర అవస్థా విశేషము. అటులనే మూర్ఛ యందు జడత్వము ఉండుటచే అది కూడ స్వరూప స్థితి అనిపించుకొనదు. “అహం” నశించి భేదము శమించి, స్వప్రకాశము చిత్తమున స్ఫురించిన ఆ స్థితిని మహాపురుషులు స్వరూప స్థితి యందురు. ఆ చైతన్య రూపమగు ప్రత్యగాత్మ

యందే అజ్ఞానము ఆరోపితము. ఆ అజ్ఞానముయొక్క ఏడు భూమికలును నీవు వినుము.

## ఏడు అజ్ఞాన భూమికలు

1. బీజజాగ్రత్తు, 2. జాగ్రత్తు, 3. మహాజాగ్రత్తు, 4. జాగ్రత్స్వప్నము, 5. స్వప్నము, 6. స్వప్నజాగ్రత్తు, 7. సుషుప్తి అను ఏడు రకములగు ఈ మోహము అజ్ఞానము, ఒక దానితో మరియొకటి కలియుటచే ఇది అనేక రకములగును.

1. బీజ జాగ్రత్తు :- దీని లక్షణమును వివరించెదను. సృష్ట్యాది యందు మాయాబలమున నామరహితమును, నిర్మలమును అగు చిదాభాసము కల రూపము ఆవిర్భవించెను. అది భవిష్యమున ప్రాణధారణాది క్రియలు అను ఉపాధి ద్వారా చిత్తము, జీవము

మొదలగు పేర్లను పొందెను. అది జాగ్రదవస్థకు బీజము. కానీ అది "బీజ జాగ్రత్తు" అనబడును. అది సంవిత్తు యొక్క నూతనావస్థ.

2. జాగ్రత్తు :- బీజ జాగ్రత్స్థితికి అనంతరము 'ఈ స్థూల దేహమే నేను, ఈ స్థూల శరీరమునకు సంబంధించిన భోగ్య పదార్థములు నావి' అనునట్టి పూర్వము లేని అచల ప్రత్యయము (జ్ఞానము) 'జాగ్రత్తు' అనబడును.

3. మహా జాగ్రత్తు :-స్థూల శరీరము నేను, భోగ్య పదార్థములు నావి అని పూర్వజన్మమున ఉద్భవించి, అభ్యాసముచే వృద్ధిని పొందిన ప్రత్యయము (జ్ఞానము) 'మహాజాగ్రత్తు' అనబడును.

4. జాగ్రత్ స్వప్నము :- అభ్యాస రహితమగుచు, దృఢమయిన సంకల్పము మాత్రమే స్వరూపముగా కల జాగ్రత్స్థితి యందలి మనో రాజ్యము (మనోరథములు) 'జాగ్రత్స్వప్నము' అనబడును. ద్విచంద్రప్రతీతి,

ముత్యపుచిప్ప యందు రజత భావము, మృగతృష్ణా భ్రాంతి మొదలగునవి కూడ జాగ్రత్ స్వప్న భేదములే. అభ్యాసముచే జాగ్రదవస్థ యందు స్వప్న సదృశమగు వ్యవహారము జరుగుటచే జాగ్రత్ స్వప్నము అనబడును.

5. స్వప్నము:- ఇది అనేక విధములు. నిద్రా మధ్యమందు కాని, అంతమునందు కాని, మిథ్యా పదార్థములు స్వల్ప కాలము ప్రతీయమానములయి (కన్పట్టి) అనంతరము అదృశ్యములయి పిదప అవి సత్య పదార్థములు కావనియు, మిథ్యాభాసము లనియు ప్రత్యయము కలుగుట "స్వప్నము" అనబడును.

6. స్వప్న జాగ్రత్తు :- చిర కాలము జాగ్రదభావముచే అవికసితమును, మహచ్ఛరీర యుక్తమును, దృఢాభిమానముచే గాని చిరకాలస్థాయి కల్పనచేత (హరిశ్చంద్రున కొక రాత్రి 12 సంవత్సరములుగ తోచినట్లు) గాని జాగ్రద్రూపముగ వృద్ధినొందినదియు, మహాజాగ్రత్స్థితిని

బడసినట్టిదియు నగు స్వప్నము ‘స్వప్న జాగ్రత్తు’ అనబడును.

7. సుషుప్తి :- వెనుకటి ఆరు భూమికలును కర్మ భూమికలు. ఏలనన అందు కర్మ ఫలము అనుభవించబడును. పూర్వ జన్మ కర్మము నుంచి అనుభవించిన తదుపరి నశించి, రెండవ కర్మ ఫలము నిచ్చుటకు అభిముఖముగా నుండనప్పుడు ఆ రెంటికి మధ్య నుండు సూక్ష్మమును, స్థూలమును అగు సర్వ ప్రపంచమును లయమును పొందినందున దానికి కారణమగు అజ్ఞానము మాత్రమే శేషించుటచే అజ్ఞానోపాధికల జీవుని భావిదుఃఖకారణమగు వాసనా సహితమయిన జడ సమమగు స్థితి ‘సుషుప్తి’ అనబడును.

ఈ సుషుప్తియందు తృణము, లోష్టము, పర్వతము, శిలాది సర్వ పదార్థములు పరమాణుత్వమును పొందును.

ఓ రామా! ఈవిధముగా అజ్ఞానము యొక్క

ఏడు దశలును వివరించితిని. సముద్రము నందలి సుడిగుండమున నౌక పడినట్లు ఏడు అజ్ఞాన భూమికలయందును జీవుడు ఒక మోహమునుండి మరియొక మోహమును పొందుచునే యుండును. ఈ ఏడు భూమికలును నానా వికార సంయుతములు. జీవుని జన్మమరణ రూపమగు సంసారచక్రము నందు భ్రమింప జేయును. ఈ ఏడు అజ్ఞాన భూమికలను పరిత్యజించ వలెను. అనంతరము ముందు చెప్పబడు జ్ఞాన భూమికలను విచారించినచో విశుద్ధమగు ప్రత్యగాత్మ యొక్క అపరోక్ష జ్ఞానము కలుగును. అంతట నీవు వెనుక చెప్పిన అజ్ఞాన భూమికల నుండి ముక్తిని పొందగలవు.

## ఏడు జ్ఞాన భూమికలు

***ఇమాం సప్త పదాం జ్ఞాన భూమిమాకర్ణయానఘ/***
***నానయా జ్ఞాతయా భూయో మోహపఙ్కే నిమజ్జసి//***

ఓ పాపరహితుడగు రాముడా! జ్ఞానముయొక్క ఏడు భూమికలును వినుము. అభ్యాస క్రమమున ఈ ఏడు భూమికలను అనుభవించిన తదుపరి నీవు మోహపంకిలమున దిగపడవు. ఈ ఏడు జ్ఞాన భూమికలును తప్పక తెలుసు కొనవలెను. ఏలనన వానిచే పరమ పురుషార్థము సిద్ధించును. అఖండ స్వరూప వృత్తిచే ఆరూఢమయిన బ్రహ్మము అజ్ఞాన నివర్తక మగుటచే జ్ఞానమన బడును. కావున ఈ ఏడు భూమికలును జ్ఞాన భూమికలు అనబడును. ఆ బ్రహ్మము ఏడు భూమికలకును పరుడు. సత్యావబోధము మోక్షము. రెండును మోక్షమునకు పారిభాషిక పదములు. ముక్తుడయిన జీవుడు మరల ఈ జగమున జన్మించుట కాని, మృతుడగుట కాని జరుగదు.

1. శుభేచ్ఛ, 2. సువిచారణ, 3. తనుమానస, 4, సత్త్వాపత్తి. 5. అసంసక్తి, 6. పదార్థ భావిని, 7. తుర్యగ అని జ్ఞానభూమికలు

7. ఈ జ్ఞాన భూమికలను సమముగా అభ్యసించుటచే అధికారియగు నరుడు పరబ్రహ్మమును పొందును. ఆ ఆత్మ స్వరూపమును పొందిన జనుడు శోకించడు.

## తరతి శోకమాత్మవిత్

1. శుభేచ్ఛ:—"నేను ఇంత ఆయుర్దాయమును జడత్వముతో వ్యర్థముగా ఏల పాడు చేయవలెను? ఇక మేల్కొని తప్పిన మార్గం నుండి మరలి సరియగు మార్గమున నడచెదను. ఈ సంసార మోహము అనెడు జంజాటమును పరిత్యజించి నా ఆత్మ కళ్యాణము కొరకు శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠుడును అగు గురువును శరణుజొచ్చి మోక్ష శాస్త్రమును అభ్యసించి వారి ఉపదేశానుసారము ఆత్మవిచారము చేయుదును. ఈ విధమగు సాధన చతుష్టయ సంపత్తితో కూడిన ఇచ్ఛ శుభేచ్ఛ. నిషిద్ధ కర్మలను పరిత్యజించి, ఫలాసక్తి రహితమగు, విహిత కర్మాచరణము ద్వారా అంతఃకరణ పారిశుద్ధ్యమును పొంది,

వివేక వైరాగ్యములు, షట్ సంపత్తి, ముముక్షుత్వము అను సాధన చతుష్టయమును సంపాదించి, ముక్తియే పరిణామముగా కలిగి శ్రవణాదులయందు ప్రవర్తింప జేయు ఉపాధికల ఆత్మసాక్షాత్కారము కొరకు కలుగు ఉత్కటమగు అభిలాష 'శుభేచ్ఛ' అన బడును. ఇది జ్ఞానమునకు ప్రథమ భూమిక.

2. సువిచారణ:- తీవ్ర వైరాగ్యమును అభ్యసించుటతో బాటు వేదాంత శాస్త్రముల శ్రవణ, మననములయందు ప్రవృత్తిని పొంది శ్రద్ధగా సద్గురుని సేవించుట, నిర్జన ప్రదేశ నివాసము, భిక్షా భోజనము మొదలగు యతి ధర్మములయందు ప్రవృత్తి, సద్గురూపదిష్టములగు వాక్యములను మోక్ష శాస్త్రమును తరచు విచారము చేయుట 'సువిచారణ' అనబడును. ఇది జ్ఞానమునకు రెండవ భూమిక.

3. తనుమానస:- శుభేచ్ఛతోను, సువిచారణతోను కూడిన శ్రవణ, మనన

నిదిధ్యాసములచే శబ్దాదిపర్యంతము అనాసక్తితో కూడిన సవికల్ప సమాధియందు అభ్యాసము ద్వారా బుద్ధి సూక్ష్మత్వమును పొందును. ఇది 'తనుమానస' అను మూడవ జ్ఞాన భూమిక.

4. సత్త్వా పత్తి :- మందు చెప్ప బడిన మూడు భూమికల యందును అభ్యాసముచే బాహ్య పదార్థముల యందు కల రాగ సంస్కారము నిర్మూలమగును. మనస్సు విషయ వాసననుండి విరక్తిని పొంది శాంతించును. మాయ, మాయా కార్యములు, అవస్థాత్రయము లేని కేవల శుద్ధ సన్మాత్ర, చిన్మాత్ర, ఆనంద ఘన ఆత్మయందు త్రిపుటిని లయ మొందించి సాక్షాత్కార పర్యంతము ఉండుట అనగా నిర్వికల్ప సమాధి రూపమగు స్థితి సత్త్వాపత్తి అనునది నాలుగవ జ్ఞాన భూమిక. ఈ భూమిక యందలి జనుడు బ్రహ్మవిదు డనబడును.

5. అసంసక్తి :- వెనుకటి నాలుగు భూమికల అభ్యాసము చేతను బాహ్య, అభ్యంతర ఆకారములతోను, వాని సంస్కారములతోను

చిత్తమునకు సంస్కారములతోను చిత్తమునకు సంసర్గము ఉండదు. సమాధి పరిపాక మను ఫలము కలుగును. ఈ దశయందు చిత్తమునందు పరమానందము కలుగును. నిత్య, అపరోక్ష, బ్రహ్మత్వ బావ సాక్షాత్కారము అను చమత్కారము జరుగును. ఇది 'అసంసక్తి' అను 5వ జ్ఞాన భూమిక. ఇందు అవిద్యకును, అవిద్యాకార్యములకును సంబంధము లేదు. కావున దాని పేరు 'అసంసక్తి' అని వచ్చినది. ఈ ఐదవ భూమిక యందున్న వాడు బ్రహ్మ వేత్తలలో శ్రేష్ఠుడు.

6. పదార్థ భావిని:-పైన చెప్ప బడిన 5 భూమికలను అభ్యసించుటచే స్వాత్మారామత్వము ద్వారా కలుగు బాహ్య అభ్యంతర పదార్థముల దృఢమగు అప్రతీతి ' 'పదార్థ భావిని' అను భూమిక. ఇందు అన్యుల ప్రేరణచే పదార్థ భావము కలుగును. వారి వలననే శరీర నిర్వహణము జరుగును. ఇది ఆరవ భూమిక.

ఈ భూమిక యందున్న వాడు బ్రహ్మవిద్వరీయను డనబడును.

7. తుర్యగ:- పై భూమికలను చిర కాలము అభ్యసించుట చేతను జాగ్రదాది అవస్థాత్రయము నుండి ముక్తిని పొందును. బ్రహ్మమును అఖండ ఆత్మ రూపమున తెలిసికొనును. ఆ భూమిక 'తుర్యగ' అనబడును. ఈ ఏడవ భూమిక యందలి నరుడు బ్రహ్మ విద్వరిష్ఠు డనబడును. ఈ తురియావస్థ జీవన్ముక్తావస్థ అనికూడ చెప్ప బడును. తురీయాతీతము బ్రహ్మము. ఇది విదేహముక్తి యొక్క విషయము. కావున భూమికారూపమున అది లెక్కించబడదు.

ఓ రామా! ఈ ఏడు భూమికలను పొందిన మహాభాగుడు ఆత్మారాముడు. ఆ మహాత్ముడు పరమపదమును పొందును.

పై ఏడు భూమికలయందును మొదటి మూడును సాధనకోటికి చెందినవి. మిగిలినవి నాలుగును సిద్ధావస్థకు సంబంధించినవి. ఈ

నాలుగు భూమికలును జ్ఞానికి కలుగు విదేహముక్తియు సమానమే. కాని జీవన్ముక్తునికి మాత్రము అంతకంతకు శరీరాభాసము తగ్గిపోవును. పిదప ఉన్మత్తావస్థను పొందును. నాల్గవ భూమిక వరకు ఉపదేశాది వ్యవహారములు పూర్తిగా ఆచరించగలడు. పంచమ భూమికయందు మాత్రము ఉన్మత్తావస్థను పొందును. ఒక్కొక్కప్పుడు అధికారియగు పురుషుని ఉత్తమ ప్రారబ్ధముచే శుక జడ భరతాదుల వలె ఉపదేశించిన ఉపదేశించ వచ్చును కూడను. అరవ భూమిక యందు మాత్రము నడచుట, మాట్లాడుట, చూచుట మొదలగు క్రియలు అన్నియు ఆగిపోవును. ఈ స్థితి యందలి ఒక మహాత్ముని కుంభకోణమునందు (మద్రాసు రాష్ట్రము నందలి గ్రామము) చూచితిని. ఆయనకు మాట్లాడుట, నడచుట, చూచుట మొదలగు క్రియలు అన్నియు ఆగిపోయెను. నేత్రములు కూడ కదలుట లేదు.

కదలెడివి కావు. ఎవరైన వచ్చి రెండు మూడు చంచాలు కాఫీ కంఠములో పోసిన ఒకప్పుడు కంఠము దిగెడిది. మరియొకప్పుడు దిగెడిది కాదు. జనులు ఆయనకు ఒక ఆశ్రమమును నిర్మించిరి. కర్రలతో ఒక పడక కుర్చీని నిర్మించి అందు పరుండ బెట్టిరి. పూలమాలలు మొదలగునవి వేసి దేవునివలె ఆయనను పూజించి హారతులు ఇచ్చెడి వారు. సంవత్ 1954 సం॥లో (అనగా క్రీస్తుశకము 1897 వ సంవత్సరము నేను వారి దర్శనము చేసితిని. ఆసమయమున అచ్చటి వృద్ధులు ఆయనను 38 సంవత్సరములనుండి అదే విధముగ చూచుచున్నామని చెప్పిరి. అనంతరము ఐదారు సంవత్సరముల తరువాత ఆయన శరీరము త్యజించెను. ఇది ఆరవ భూమిక. ఏడవ భూమిక యందు శరీరము 11 రోజులు మాత్రమే నిలచును అని మహాత్ముల నోట వింటిని.

ఇదంతయును శాస్త్రములయందు వ్రాయబడి ఉన్నది. అది చెప్పితిని. నేను ఇంకను

మొదటి భూమిక యందుకూడ లేను. నోటితో మాత్రము బ్రహ్మమును గురించి మాట్లాడుచున్నాను.

***అనుభూతిం వినా మూఢో వృథా బ్రహ్మణి మోదతే |***
***ప్రతిబిమ్బిత శాఖాగ్ర ఫలాస్వాద న మోదవత్ //***

కొమ్మ చివర నున్న పండ్లు నీటిలో ప్రతిబింబించినప్పుడు చూచి తిని నంత సంతోషమును పొందునట్లు మూర్ఖులు అనుభవము లేనిదే పర బ్రహ్మమునందు ఆనందమును పొందితిమని చెప్పెదరు. అది వ్యర్థము. జలాశయము యొక్క తటమున కల వృక్షముల ఫలములు జలమున ప్రతిబింబించును. ఛాయను చూచి నీటిలో నున్న చేపలు వానిని తినుటకు పరుగిడును. వాని రుచియొక్క మిథ్యానుభవమును పొందును. అటులనే అజ్ఞానులు శాస్త్రము ద్వారానో,

శ్రవణము ద్వారానో, గురువు ద్వారానో తెలిసికొనినంత మాత్రమున అనుభూతిని పొందకుండ “ నేను బ్రహ్మమును, సాక్షిని” అని పలికి సంతోషించెదరు. అటులనే నేను కూడా బ్రహ్మ శబ్దమును నోటితో పలికి సంతోషించుచున్నాను. ఈవిషయమున తుకారాము తన అభంగు నందు వ్రాసెను.

“ఇతరులకు బ్రహ్మజ్ఞానమును ఉపదేశించుచు, తాము అనుభవించక ఉండు వారి ముఖముపై ఉమ్మి వేయుచున్నాను. వారి వైఖరిని వ్యర్థముగా కష్ట పెట్టుచున్నారు. కొందరు ద్రవ్యాదులు లభించును అను కోరికతో గ్రంథములను చదువుదురు. బ్రహ్మముపై బుద్ధిని పోనిచ్చెదరు. ఇదంతయు మోసము. అక్కడ పాండురంగడు శ్రీరంగము ఎక్కడ?

"శాంతి, క్షమ, దయ అను అలంకారములతో నీ శరీరమును, మనస్సును అలంకరించుము. నారాయణుని భజించుము. కామాది షట్ శత్రువులను జయించుము. అంతట

నీవే పరబ్రహ్మము అగుదువు. బ్రహ్మజ్ఞానపు మాటలు పలుకుటచే ఎవడును బ్రహ్మము అవలేడు. ఇనుప గుగ్గిళ్ళు సమలవలెను. అప్పుడే బ్రహ్మ పదమున నృత్యము చేయగలడు. అబద్దపు సాక్ష్యము చెప్పువాడు ధనలోభముచే అసలు సంగతి ఎరుగకయే సాక్ష్యము చెప్పును. అనుభవము లేని వాడు చేయు బ్రహ్మ నిరూపణమునకును, అబద్ధపు సాక్ష్యమునకును భేదము లేదు. ఈ బ్రహ్మజ్ఞానము నిజమని ఎవడు ఒప్పుకొనును? చిత్తమునందు ఆత్మబోధయను దృఢమగు పాదము నిలువనంతవరకు శబ్దాది యుక్తుల ద్వారా ఎవరు ఎన్ని విధముల నీ ఎదుట బ్రహ్మజ్ఞానమును ప్రతిపాదించినను నీకు దానివలన బ్రహ్మానుభవము కలుగదు. ఆత్మానుభూతి లేనిదే పైపైన శబ్దజాలముతో కూడిన ప్రతిపాదన మిథ్యామాత్రమే. ఇట్లు చేసినచో శబ్దజాలమును సంపాదించుటకు చేసిన పరిశ్రమ విరామ కాలమున ఎందుకును పనికి

రాదు. “నేను బ్రహ్మము” అని నీవు జనుల ఎదుట పలుకుచు తిరుగుచున్నావు. కాని అంతఃకరణమునందు విషయసుఖమును అనుభవించవలెనను భావము బలముగా నున్నది. అది నీవు ఆలోచించితివా! ఓ మహానుభావా! నీవు దప్పిక గొనియున్నావు. పైగా అమృతము ఎంతయో తియ్యగా నుండును అని వర్ణించుచు ఇతరుల ఎదుట తిరుగుచున్నావు. నీయందలి తృష్ణాగ్ని జ్వలించుట శాంతించినప్పుడు నీవు నిరంతరము కేవల బ్రహ్మ స్వరూపుడవు అను జ్ఞానము నీకు కలుగును.”

ప్రకాశానంద స్వామివారి సంగతి వేరు. కాని మనమందరము అట్టి బ్రహ్మజ్ఞానులమే.

ॐ

# ఇరువది మూడవ ప్రసంగము

చందూభాయి, శాస్త్రిజీ! రేవాశంకరభాయీ! ఇరువురు గోండలు, రాజకోట మొదలగు చోట్ల వెళ్లిపోయిరి. స్వామి శ్రీ ప్రకాశానందుల వారు పీరడియాలోనే ఉండిరి. ఆ రాత్రి స్వామి శ్రీ నిత్యానందుల వారు, ప్రకాశానందులవారు, వైద్యరాజు మొదలగువారు కూర్చుని యుండిరి. వైద్యరాజు ప్రశ్నించెను.

వైద్య:- "నేను చాలా రోజులనుండి వేదాంత శ్రవణం చేయుచున్నాను. కాని జ్ఞానము కలుగుట లేదు. కారణ మేమి?"

స్వా.ప్ర. :-(స్వా. ని. వారితో) తమరు దయయుంచి సెలవివ్వండి. నేను కూడ తమ శ్రీముఖమునుండి వినగోరుచున్నాను

# వాసనా భేదములు : శుద్ధ వాసన, మలిన వాసన.

స్వా. ని. :-"***న శ్రవణ మాత్రాత్ తత్సిద్ధిరనాది వాసనాయా బలవత్త్వాత్***|"

"వాసన అనాది కాలము నుండి బలవత్తరముగా నుండుటచే శ్రవణ మాత్రమున జ్ఞానము సిద్ధించదు" అని సాంఖ్య సూత్రములు చెప్పుచున్నవి."

వాసనా లక్షణమును వసిష్ఠులు చెప్పిరి.

***"దృఢ భావనయా త్యక్త పూర్వా పర విచారణమ్/***
***యదా దానం పదార్థ స్య వాసనా సా ప్రకీర్తితా//"***

"దృఢ భావముతో పూర్వాపరములను విచారించకుండ పదార్థములను గ్రహించుట వాసన."

వాసన రెండు రకములు: 1. మలిన వాసన.

2. శుద్ధ వాసన. మలిన వాసనను వశిష్ఠుడు ఇట్లు వర్ణించిరి.

**అజ్ఞాన సు ఘనాకారా ఘనాహంకార శాలినీ/**
**పునర్జన్మ కరీ ప్రోక్తా మలినా వాసనా బుధైః//**

“బ్రహ్మ స్వరూపమును ఆవరించు అజ్ఞానముతో దట్టమైన ఆకారము కలదియును, ఘనమగు అహంకారముతో నిండినదియును అగు వాసనను మలిన వాసన అనెదరు. ఈ మలిన వాసన ద్వారా మనుష్యునకు పునర్జన్మ కలుగును.”

## మలిన వాసనా భేదములు

జన్మనిచ్చు వాసన భేదములు అనంతములు. అయినను శాస్త్రములలోని మలిన వాసన మూడు రకములు. 1. లోక వాసన, 2. శాస్త్ర వాసన, 3. దేహ వాసన.

ఈ మూడు వాసనలలోను ఏ ఒక్క వాసన ఉన్నను ఆ వాసనా ప్రతి బంధ కారణముచే యథార్థమగు ఆత్మజ్ఞానము కలుగదు.

# లోక వాసన

"జనులందరు నన్ను స్తుతించు పనులనే నేను చేయవలెను, వారి నిందను నేను పొందరాదు." అను పట్టుదలను కలిగియుండుట లోకవాసన. ఈ లోకవాసనను నూరు జన్మము లెత్తినను పూర్తిచేసి కొనలేము. కావున ఇతరుల నిందాస్తుతులను లెక్క పెట్టకుండ అధికారియగు నరుడు సమ భావమును పొంది యుండి తన హితమును కోరవలెను. ఈ విషయమున ఈ దృష్టాంతము చెప్పదగినది.

ఒక గ్రామమున ఒక వ్యాపారి యుండెను. అతడు పప్పు దినుసులు అమ్మెడి వాడు. వడ్డీ వ్యాపారము కూడ కలదు. జనులందరు అతనిని భక్తుడు అని పిలచెడి వారు. ఈ భక్తుడు చాల నమ్మకమైన వాడు. అతని వద్దనే అందరును తమకు కావలసిన సామాన్లన్నియు తీసికొనెడివారు. అతని వ్యాపారం చాల మిక్కుటముగా సాగెడిది. ఆ గ్రామము నందలి

ఒకానొక వ్యక్తి వ్యాపారము చేయుటకు ఇతర దేశములకు వెళ్ళెను, భర్త లేని రోజులలో భార్య ఈ భక్తుని దుకాణము మీదనే సరకులు అన్నియును తీసికొనెడిది. కొన్ని రోజుల తరువాత ఆతడు ఇతర దేశము నుండి తాను సంపాదించిన ద్రవ్యముతో ఇంటికి వచ్చెను. అతను తనతో ఒక వేయి కాసులు కూడ తీసికొని వచ్చి యుండెను. వాని నాణ్యమును విలువ కట్టించుటకు ఆతడు మన భక్తుని వద్దకు తీసికొని వచ్చెను. భక్తుడు లెక్క పెట్టి అందులో రెండు కాసులు తక్కువ అని చెప్పెను.

పర దేశమునుండి వచ్చిన వ్యక్తి పలికెను. నేను వెయ్యి కాసులు తెచ్చితిని. తక్కువ ఎట్లుండును? ఇట్లని అతడు కోపముతో భక్తుని డబ్బు పెట్టెను లాగి చొక్కా వెతికెను. ఆ పెట్టెలో రెండు కాసులు ఉండెను. అంతట అతడు బిగ్గరగా అరచి చెప్ప సాగెను. “దొంగ, దొంగ. ” ఆతడు అందరను ప్రోగుచేసి ఆలోచించకుండ ఆ భక్తుని

తిట్టుచు ఇట్లు చెప్పసాగెను. “చూడండయ్యా! భక్తాగ్రేసరుడట! భక్తులంటే ఇల్లాగ ఉండవలెను.” గ్రామమంతా తెలిసి పోయెను. ఇంతలో ఈ వార్త పర దేశమునుండి వచ్చినవాని భార్యకు తెలిసెను. ఆమె ఒక నౌకరు ద్వారా ఇట్లు కబురు పంపెను. “ఆ భక్తుడు దొంగ కాడు. మీరు లేనప్పుడు ఇంటికి కావలసిన సామానులన్నియు మేము ఆతనివద్ద తీసికొంటిమి. వారికి డబ్బు ఇవ్వవలసియుండెను. కావున మీరు తెచ్చిన వెయ్యి కాసులలో నుండి రెండు కేసులు అతనికి ఇచ్చితిమి. ఇది వినినతోడనే ఆతనికి చాల పశ్చాత్తాపము కలిగెను. ఆతడు భక్తుని క్షమించమని ప్రార్థించెను. అంతవరకు తిట్టుచున్న ఇతరులు కూడా భక్తుని స్తుతించసాగిరి. భక్తుడు భక్తుడే అనిరి.

జనులు ఇటులనే ఆలోచించకుండ మాట్లాడెదరు. వెనుక ముందులు చూడకుండ నిందించెదరు.

భక్తుడు దుకాణమునుండి క్రిందికి దిగి

చేతులలోనికి దుమ్ము తీసికొని ఇట్లు పలికెను. "నన్ను పొగడిన వారి తలపై ఈ దుమ్ము పోయుచున్నాను. నన్ను నిందించిన వారి తలపై ఈ దుమ్ము పోయు చున్నాను."

శాస్త్రములు కూడ చెప్పుచున్నవి.

***విద్యతే న ఖలు కశ్చిదుపాయః సర్వలోక (పరి) తోషకరో యః/***
***సర్వథా స్వహిత మాచరణీయం కిం కరిష్యతి జనో బహుజల్పః//***

"ప్రజలందరి చేతను స్తుతిని పొందు ఉపాయము ఈలోకము నందలి ఏ శాస్త్రము నందును లేదు. అధికారియగు వాడు లోక వాసనను త్యజించి, సర్వవిధముల తనకు హితము కలుగునట్లు సంచరించవలెను. జనుల నిందాస్తుతుల యందు శ్రద్ధను చూపరాదు. ఈ లోకులు చేయు నిందాస్తుతులచే లాభ నష్టములు కలుగవు."

## శాస్త్ర వాసన

# ఇరువది మూడవ ప్రసంగము

అనేక శాస్త్రములను అధ్యయనము చేయవలెను వాసన శాస్త్ర వాసన. ఇది మూడు రకములు:- 1. పాఠ వ్యసనము, 2. బహు శాస్త్ర వ్యసనము, 3. అనుష్ఠాన వ్యసనము.

1. శాస్త్రములన్నియు చదివి పూర్తి చేయాలని కోరిక పాఠ వ్యసనమను వాసన. ఆ విధముగా ఎవరును చేయలేరు. అందు చేతనే అది మలిన వాసన. భరద్వాజుడు మూడు పురుషాంతరములు (75 సంవత్సరములు) అధ్యయనము చేసినను శాస్త్రములు పూర్తి అవలేదు. ఇంద్రుడు అతనికి మరియొక రూపాంతరము (25 సంవత్సరములు) సమయము ఇచ్చెదనని ఆశ పెట్టెను. భరద్వాజుడు ఆ 25 సంవత్సరములలోను కూడ వేదాధ్యయనము చేయుటకు ప్రయత్నించెను. కాని శాస్త్రాధ్యయనము పూర్తి కాలేదు. ఈ సంగతి ఇంద్రుడు భరద్వాజునకు తెలుపగా నాతడు అధ్యయనమును త్యజించి ఇంద్రుని ఉపదేశముచే సగుణ బ్రహ్మోపాసనమును ఆరంభించెను.

కావున నే విద్వాంసులు చెప్పిరి.

***అనన్త శాస్త్రం బహు వేదితవ్య మల్పశ్చ కాలో బహవశ్చ విఘ్నాః//***
***యత్సారభూతం తదుపాసితవ్యం హంసో యథాక్షీరమివామ్బుమిశ్రమ్//***

శాస్త్రములు అనంతములు. శాస్త్ర ప్రతిపాదితములుగు అర్థములు కూడ అనంతములు. పదార్థ జ్ఞానము అల్ప కాలమున కలుగదు. కాని మానవాయుర్దాయము చాల తక్కువ. ఈ చిన్న ఆయుర్దాయము నందు రోగాదులు అనేక విఘ్నములు కలుగును. ఇట్లు విఘ్నములతో కూడిన చిన్న ఆయుర్దాయము ద్వారా సర్వ శాస్త్రములను అధ్యయనము చేయుట అసంభవము. కావున హంస నీరు కలసిన పాలనుండి క్షీరమును మాత్రమే గ్రహించినట్లు అధికారి సర్వశాస్త్ర సార భూతమగు పరమాత్ముని యథార్థ జ్ఞానమును అర్థమును గ్రహించవలెను.

2. అభ్యాసము కొరకు అనేక విధములగు

శాస్త్రములను వెతుకుట బహు శాస్త్ర వ్యసనము. ఈ వ్యసనము దూర్వాసుని యందు ఉండెను. దూర్వాసుడు అనేక శాస్త్రముల భారముతో శంకరుని నమస్కరించుటకు వెళ్ళుచుండెను. నారదుడు సభలో అందరియెదుట ఆతడు బరువు మోయు గాడిదతో సమానుడని పలికెను. దూర్వాసునకు క్రోధము వచ్చి ఆ భారము అంతయు క్షీరసముద్రమున పారవేసెను. అటు తరువాత అతడు శంకరుని దర్శించెను. శంకరుడు ఆతనికి ఆత్మ విద్యోపదేశము చేసెను. కావున అనేక రకములగు గ్రంథములను సంగ్రహించుట అనెడు మలిన వాసనను కూడ ముముక్షువు త్యజించవలెను.

3. వేదశాస్త్రముల యందు విధించబడిన కర్మానుష్ఠానమందే ఆయుష్యమంతయును గడపుట అనుష్ఠాన వ్యసనము అనబడును. ఈ అనుష్ఠాన వ్యసనము నిదాఘుడను రాజుయందు ఉండెను. ఋభుడను ముని ఆతనికి ఎంతైనను నచ్చ చెప్పెను. అయినను ఆతడు కర్మలయందు

శ్రద్ధ అను జడత్వమును విడనాడ లేదు. దాశూరుడు అనే వానికి తన కర్మానుష్టానమునకు వలయు పవిత్ర ప్రదేశము భూమియందు ఎంత వెదకినను ఎక్కడ దొరక లేదు. ఈ కర్మవాసన పునర్జన్మకు కారణము. కావున మలినమైనది. శాస్త్రవాసన కూడ దర్పాదులకు కారణమగుటచే పరమార్ధతత్త్వము తెలిసికొను నంతవరకు మాత్రమే శాస్త్రాధ్యయనము ఆచరణీయము.

## దేహవాసన

1. దేహాత్మత్వము 2. గుణాధానము 3. దోషాపనయనము అని భ్రాంతి భేదమున దేహవాసన మూడు రకములు.

1. దేహమునందు ఆత్మత బుద్ధిని దృఢపరచి దానినే పోషించుచుండుట దేహాత్మత్వము. “విరోచనునకు ప్రజాపతి పరమార్ధతత్త్వమును ఉపదేశించెను. అయినను ఆతడు తన చిత్తము నందలి దోషముచే దేహము నందే ఆత్మ భావమును స్థిరపరచి

అసురులందరకును దేహమే ఆత్మ అని బోధించెను." అని ఛాందోగ్యోపనిషత్తు నందు ఉన్నది. ఈనాడు విరోచన మతానుయాయులు చాలమంది కానవగుదురు. తమ శరీరమును పోషించుట యందు తత్పరులయి, భక్ష్యాభక్ష్యములను, గమ్యాగమ్యములను విచారించకుండ కేశ రచనాదుల ద్వారా విచిత్రములగు వేషములను వేసికొని విలాసములను అనుభవించువారు అందరును విరోచన మతావలంబులే.

అది సరియగు మతము కాదు. ఏలనన; "ఆత్మ అనగా జీవాత్మ దేహము కంటె భిన్నమైనది." అనునది జ్ఞానుల అనుభవము. ఈ శరీరము మలమూత్రాదులతో నిండియున్నది. క్షణభంగురము, కావున ఒక రోజున విసరివేయవలసినదే. అయినను దానిని అందముగాను, బలముగాను ఉంచుటకు రకరకములగు ఔషధములను ఉపయోగించెదరు. దేహమునకు క్షణికములుగు విలాస వైభవములు

కలుగ జేయుటకు ద్రవ్యాది సాధనములను సంపాదించుటకై నీతి, అవినీతి, న్యాయము, అన్యాయము అనునవి కూడ విచారించుట కనబడుట లేదు. ఎవరికైనను దుఃఖము కలిగినను లక్ష్యము చేయక ధనమును సంపాదించిన కాని క్షుద్రములగు వైభవములు అనుభవించ లేక పోవుచున్నాము కదా! కావున మృత్యువు లేని ఆత్మను పొందుటకు ఎంత గొప్ప పురుషార్థము చేయవలెనో యోచింపుడు.

2. గుణాధానము రెండు రకములు. 1. లౌకికము 2. వైదికము.

కోమలమగు కంఠముతో గానము చేయుటకను, వేదాదులను చదువుటకును కంఠమును బాగుచేసికొనుటకు ఔషధాదులను సేవించుచుందురు. అటులనే శరీరమునకు పుష్టికర ఔషధములను సేవించుట, ఆహారమును తినుట, సౌందర్యముకొరకు సుగంధ తైలములను పట్టించుట, సుందర వస్త్రాది భూషణములను

ధరించుట, సువాసనకల అత్తరులు, సెంట్లు మొదలగువాటిని ఉపయోగించుట ఇవి అన్నియు లౌకికములగు గుణాధానములు. పుణ్యముకొరకు గంగాస్నానాదులు చేయుట, సాలిగ్రామాదులు సంపాదించుట మొదలగునవి వైదిక గుణాధానములు.

3. దోషాపనయనము అనగా దోషములను పోగొట్టుట కూడ లౌకికము, వైదికము అని రెండు రకములు. చికిత్సా శాస్త్రమున చెప్ప బడిన ఔషధముల ద్వారా శరీరమునందలి దోషములను పోగొట్టుట లౌకికము. శౌచ, ఆచమనాదుల ద్వారా పవిత్రమగుట వైదికము.

ఈ దేహవాసన జ్ఞాన ప్రతి బంధకము. కావున ముముక్షువు దీనికి దూరముగా నుండవలెను.

## దేహవాసనా నివృత్తికి ఉపాయము

ఈవిషయమున శంకరభగవత్పాదులు చెప్పిరి.

***సంసార బన్ధ విచ్ఛిత్త్యై తద్ద్వయం ప్రద హేద్యతిః/***
***వాసనా వృద్ధి రేతాభ్యాం చిన్తయా క్రియయా బహిః//***

"సంసారము (జన్మ మరణ రూప సంసారము) అను బంధమును నశింప జేయుటకు విషయ చింతన, విషయ ప్రవృత్తి. ఈ రెంటిని సాధకుడు దహించి వేయవలెను. విషయ చింతన, విషయ ప్రవృత్తి ఈ రెండింటితోను వాసన వృద్ధి పొందును."

ఎట్లన, మీ వద్ద ఒక గుఱ్ఱపు బండి ఉన్నచో రెండు గుఱ్ఱపు బండ్లు కావలెనని తలచుట విషయ చింతన. ఆ ప్రకారము రెంటిని సంపాదించి దానియందు కూర్చొనుట బాహ్య క్రియ. ఈ బాహ్య క్రియయే విషయ భోగము. దానితోనే వాసన వృద్ధి పొందును. కావున పై మూడింటిని

ఏదో విధముగా నశింపజేయవలెను.

***తాభ్యాం ప్రవర్ధమాన సా సూతే సంసృతిమాత్మనః /***
***త్రయాణాం చ క్షయోపాయః సర్వావస్థాసు సర్వదా//***

"ఈ రెండును పెరిగినకొలదియు వాసన ఆత్మను జనన మరణములనెడు సంసారముతో చేర్చును. ఈ దేహవాసనలు మూడింటిని నశింపజేయుటకు సర్వకాల సర్వావస్థలయందు ప్రయత్నించవలెను."

పాముకు పాలు త్రాగించిన కొలదియు దాని విషము పెరుగును. అటులనే విషయములయందు ప్రవర్తించిన కొలదియు దేహవాసన పెరుగును. "దేహమే నేను" అను భావము దృఢపడును. కావున ఈ దేహ వాసనను పరిత్యజించుటతో బాటు శుభ వాసనను అనుష్టించవలెను.

***సర్వత్ర సర్వతః సర్వం బ్రహ్మమాత్రావ లోక నైః/***

**సద్భావ వాసనాదార్ఢ్యాత్త్రితయం లయమశ్నుతే//**

అన్నిటియందు, అన్ని విధములుగను, అంతయును బ్రహ్మమే నని చూచుటచే బ్రహ్మభావము అను వాసన దృఢపడి పైన చెప్పిన మూడును నశించును."

అనగా సర్వము బ్రహ్మమే అను అభేదోపాసనచే జగము నందలి పదార్థములయందలి రాగ ద్వేషములు నశించుటచే క్రియ, ఇచ్ఛ, వాసన ఈ మూడును నశించును.

శుద్ధ వాసనా లక్షణము యోగ వాశిష్ఠమున కూడ చెప్పబడినది-

***పునర్జన్మాఙ్కురం త్యక్త్వా స్థితం సంభృష్ట బీజవత్ /***
***దేహార్థం ధ్రియతే జ్ఞాత జ్ఞేయా శుద్ధేతి చోచ్యతే //***

"జననము యొక్క మూలమును

నశింపజేసి, జ్ఞేయ తత్త్వము యొక్క జ్ఞానము లభింప జేయు వాసన మొలిచిన బీజము వంటిది. అది శుద్ధమగు వాసన.”

మలిన వాసన నశించు వరకు తత్త్వజ్ఞానము కలుగదు.

## తత్త్వజ్ఞానము, వాసనాక్షయము అన్యోన్యాశ్రయములు

“ఈ దృశ్య మానమగు సర్వ ప్రపంచమును మిథ్య. అద్వితీయడగు ఆత్మ పరమార్థ రూపుడు. కావున ఆత్మ స్వరూపుడు. ఆత్మకు భిన్నమగు పదార్థము వేరొకటి లేదు” అన్నది తత్త్వ జ్ఞానము. ఈ తత్త్వజ్ఞానోపపత్తి - సిద్ధి కలిగినప్పుడు విషయాభావముచే వాసనా క్షయమగును. తత్వజ్ఞానాభావము ఉన్నంతవరకు అనగా తత్త్వ జ్ఞానము కలుగనిదే పదార్థముల యందలి సత్యత్వ ప్రతీతి నివృత్తిని పొందదు. వాసనా ప్రవాహము అంతకంతకు ముందుకు సాగుచునే యుండును. ఈ విధముగా వాసనా క్షయమునకు

తత్త్వజ్ఞానము కారణము. దేహవాసనాది మలిన వాసనలచే చంచలమగు చిత్తమునందు ఆత్మజ్ఞానము కలుగు యోగ్యత లేదు ఇట్లు తత్త్వ జ్ఞానమునకు వాసనాక్షయము కూడ కారణమే.

తత్త్వజ్ఞానమునకు రెండు రకములగు సాధనములు కలవు. 1. అంతరంగ సాధనములు, 2. బహిరంగ సాధనములు.

యజ్ఞయాగాదులు బహిరంగ సాధనములు. వివేకాదులు అంతరంగ సాధనములు ఎనిమిది. అందును వివేకము, వైరాగ్యము, షట్ సంపత్తి, ముముక్షుత్వము అను వానికంటె శ్రవణము, మననము, నిదిధ్యాసనము ఎక్కువ ఆంతరంగికములు. అంత కంటెను "తత్త్వమసి" అను మహా వాక్యముచే "తత్" పదము యొక్కయు "త్వం" పదము యొక్కయు అర్థమును శోధించుట ఎక్కువ ఆంతరంగికము.

వివేకాదుల లక్షణములను అపరోక్షానుభూతి యందు శంకరులు వ్రాసిరి.

***నిత్యమాత్మ స్వరూపం హి దృశ్యం తద్విపరీత గమ్।***
***ఏవం యో నిశ్చయః సమ్యగ్వివేకో వస్తునః స వై॥***

ఆత్మస్వరూపము నిత్యము. దృశ్యమగునది దానికి విపరీతము. ఈ విధముగా పదార్థ నిశ్చయము వివేకము."

ఆత్మ సాక్షి. ఆత్మ సత్, చిత్, ఆనంద స్వరూపములు. దృశ్యములు అనగా దేహేంద్రియాదులు. వానికి విపరీతములగు స్వభావము కలవి అసత్ పదార్థములు, జడములు దుఃఖరూపములు. ఈ విధముగా సంశయము లేని నిశ్చయము కలుగుటయే వివేకము.

***బ్రహ్మాది స్థావరాన్తేషు వైరాగ్యం విషయేష్వను।***
***యథైవ కాక విష్ఠాయాం వైరాగ్యం తద్ధి నిర్మలమ్॥***

"బ్రహ్మ మొదలు స్థావర పదార్థము వరకు కల విషయముల యందు రాగమును

పొందకుండ వానిని కాకి రెట్టతో సమానముగా చూచుట శుద్ధ వైరాగ్యము.”

శాస్త్ర కారులు విషయములను కాకి, కుక్క, పంది మొదలగు వాని మలములతో పోల్చిరి. ఏలనన ఆయా జీవులు మలమును భక్షించును. కావున అవి మలము యొక్క మలము అగుటచే అత్యంత నిషిద్ధము.

***సదైవ వాసనా త్యాగః శమోయమితి శబ్దితః।***
***నిగ్రహో బాహ్యావృత్తీనాం దమ ఇత్యభిధీయతే॥***

“ఎల్ల వేళల యందును వాసనను త్యజించుట ‘శమము’ అనబడును. బాహ్యేంద్రియ నిగ్రహము ‘దమము’ అనబడును.”

లోక వాసన, దేహవాసన, శాస్త్ర వాసన వీనిని త్యజించి విషయముల వైపునకు పరుగెత్తు చిత్తమును నిగ్రహించు సామర్థ్యమును శమము అందురు, శ్రవణాది జ్ఞానేంద్రియములను వాగాది

కర్మేంద్రియములను నిషిద్ధ ప్రవృత్తుల నుండి మరలించుట దమము అనబడును.

***విషయేభ్యః పరా వృత్తిః పరమోపరతిర్హి సా/ సహనం సర్వ దుఃఖానాం తితిక్ష సా శుభా మతా//***

"విషయములనుండి నివృత్తిని చెందుట శ్రేష్టమగు ఉపరతి. దుఃఖములను అన్నిటిని సహించుట శుభకరమగు తితిక్ష."

***నిగమాచార్య వాక్యేషు భక్తిః శ్రద్ధేతి విశ్రుతా/ చిత్తై కాగ్ర్యం తు సల్లక్ష్యే సమాధాన మితి స్మృతమ్ //***

"శ్రుతుల యందును, సద్గురువుల వాక్యముల యందును నమ్మకము 'శ్రద్ధ' అనబడును. సద్రూపమగు లక్ష్యమునందు చిత్తమును ఏకాగ్రముగా నుంచుట 'సమాధానము' అనబడును."

వీని తరువాత వారు 'ముముక్షుత్వ' లక్షణమును కూడ చెప్పిరి.

***సంసార బన్ధ నిర్ముక్తిః కథం మే స్యాత్ కదా విధే /***
***ఇతి యా సుదృఢా బుద్ధిర్వక్త వ్యా సా ముముక్షతా//***

"ఓ దైవమా! సంసారమను బంధమునుండి నాకు ముక్తి ఎట్లు కలుగును అను దృఢమగు భావము ముముక్షుత్వము."

సంసార బంధము అనగా జనన మరణాది దుఃఖములకు హేతు భూతమగు అవిద్య. అనిత్యమగు దానిని నిత్యమైనదిగను, అశుభ్రమగు దానిని శుభ్రమైనదిగను, దుఃఖమును సుఖము గను, అనాత్మను ఆత్మ గను భావింప జేయునది అవిద్య అని యోగ సూత్రములు చెప్పుచున్నవి.

దేహేంద్రియాదులు అనిత్యములు. వానియందు నిత్యత్వమును గ్రహించుట అనిత్యముల యందు నిత్య భావము.

మలమూత్రాదులతో నిండిన అపవిత్రమగు

శరీరము పవిత్రమైనదని తలచుట అపవిత్రమునందు పవిత్ర భావము.

దేహేంద్రియాదులు అనేక విధములగు రోగములకు జన్మస్థానములు. అందుచే దుఃఖకరములు అయినను అవి సుఖము నిచ్చును అను తలంపు దుఃఖమునందు సుఖభావము. దేహేంద్రియాదులు అనాత్మ పదార్థములు అయినను 'నేనే అది' అను విపరీత భావము కలుగును. ఇదియే అనాత్మ యందు ఆత్మ భావము.

అవిద్యా పదముచే ఇవి అన్నియును గ్రహించవలెను.

శ్రవణ, మనన, నిదిధ్యాసములను గురించి శ్రుతి చెప్పుచున్నది.

***శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః।***

"ఆత్మను శ్రవణము చేయవలెను, మననము చేయవలెను, నిది ధ్యాసనము చేయవలెను."

"తత్త్వమసి" అను మహావాక్యము ద్వారా "తత్" పదము యొక్కయు, "త్వం" పదము యొక్కయు అర్థమును శోధించుట ఎనిమిదవ సాధనము.

నిదిధ్యాసనము యొక్క పరిపక్వావస్థ సవికల్ప సమాధి. సవికల్ప సమాధి యొక్క పరిపక్వావస్థ నిర్వికల్ప సమాధి. నిర్వికల్పసమాధి ద్వారా ఆవరణ భంగము అగుటతో అపరోక్ష జ్ఞానమగును.

"తత్త్వమసి" మహా వాక్యముద్వారా "తత్" పదము యొక్కయు "త్వం" పదము యొక్కయు అర్థమును శోధించవలసిన అవసరమేమి అని ప్రశ్నించ వచ్చును.

ఈ శోధన అను ఎనిమిదవ సాధనము శ్రవణ మందే సమావేశ మగును అని సమాధానము.

తత్త్వజ్ఞానము కలిగిన తరువాత మనుష్యునకు ప్రపంచము మిథ్య అను

నిశ్చయము కలుగును. ముత్యపుచిప్ప అని తెలిసిన తరువాత రజతము అనునది సత్యము అను భావము బాధించబడినట్లు ఈ మిథ్యాత్వజ్ఞానము కలిగిన తరువాత ప్రపంచమునందలి సత్యత్వ భావము బాధించబడును. అట్లు బాధితమగు ప్రపంచమునందు మనస్సు ప్రవర్తించదు. ఈవిధముగ అంతర్బాహ్య ప్రవృత్తులు లేని మనస్సు కాష్ఠ రహితమగు అగ్నివలె తన మూలమునందు లయమును పొందును. శ్రుతి కూడా చెప్పుచున్నది.

***యథా నిరిన్ధనో వహ్నిః స్వయోనావుపశామ్యతి/***
***తద్వద్వృత్తి క్షయాచ్చిత్తం స్వయోనావుపశామ్యతి//***

"కట్టెలు లేని నిప్పు తన తేజస్సామాన్యమగు కారణమునందు లయమగునట్లు అంతర్బాహ్య విషయములకు సంబంధించిన వృత్తులన్నియు నశించుటచే

చిత్తము తన అధిష్టానమగు కారణమునందు లయమును పొందును.” దీని పేరే మనోనాశము. మనోనాశము, తత్త్వజ్ఞానము రెండును కార్యకారణ సంబంధము కలవి.

మనోనాశము :-- సువర్ణాదులవలె సావయవమునై కామాది వృత్తుల నెడు పరిణామమును కల అంతఃకరణమున మనన రూపమున ఉండుటచే మనస్సు అనబడును. ఈ మనస్సు సత్త్వ, రజస్, తమో గుణముల కతమున క్రమముగా సుఖ, దుఃఖ, మోహములనబడు మూడు ధర్మములను కలిగియుండును. ఈ మూడు ధర్మములును మనస్సును ఆశ్రయించుకొని ఉండుట చేతనే ప్రతీతములగును. అనగా మనస్సు నందు సత్త్వాది త్రి గుణములకును రూపము సిద్ధించును. మనస్సు రాజస తామస వృత్తులను పొందుటచే స్థూల మగును.

స్థూలమయిన మనస్సు

అత్మసాక్షాత్కారమును పొంద యోగ్యమైనది కాదు. ఏలనన ఆత్మ దుర్విజ్ఞేయము అతి సూక్ష్మము. ఈ సూక్ష్మమగు ఆత్మను స్థూలమగు మనస్సు సాక్షాత్కరింప జేసికొనలేదు.

**“దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః”**

ఆత్మసాక్షాత్కారము అతి సూక్ష్మమగు బుద్ధికి కలుగునని శ్రుతి చెప్పుచున్నది. అందుచే ఆత్మ సాక్షాత్కారమునకు సూక్ష్మమగు మనస్సు తప్పక అవసరము. రాజస, తామస వృత్తులను నిరోధించుట చేతనే మనస్సు సూక్ష్మత్వమును పొందును. ఆ వృత్తులను నిరోధించి మనస్సును సూక్ష్మముగా చేయుటయే మనోనాశము.

మనోనాశమును గురించి యోగా వశిష్టమున వశిష్ఠుడు ఇట్లు చెప్పుచున్నారు.

**ద్వౌ క్రమౌ చిత్త నాశస్య యోగో జ్ఞానం చ రాఘవ/**
**యోగస్త ద్వృత్తి రోధో హి జ్ఞానం సమ్యగ వేక్షణమ్ //**

"ఓ రాఘువ, బ్రహ్మసాక్షాత్కారమునకు ఉపయోగించునంత సూక్ష్మత్వమును పొందుట చిత్తనాశము. చిత్త నాశము రెండు విధముల కలుగును. 1. యోగము, 2. వివేకము. చిత్త వృత్తి నిరోధము యోగము. అన్నమయాది పంచకోశముల నుండియు ప్రత్యగాత్మను విడదీసి చూచుట వివేకము.

చిత్త వృత్తి నిరోధమును గురించి శంకరాచార్యులు ఇట్లు చెప్పిరి:-

***యథా సువర్ణం పటుపాక శోధితం త్యక్త్వా మలం స్వాత్మగుణం సమృచ్ఛతి /***
***తథా మనః సత్త్వరజస్తమో మలం ధ్యానేన సంత్యజ్య సమేతి తత్త్వమ్//***

"క్షారాదులచే బాగుగా శుద్ధి చేసిన సువర్ణము మురికి పోయి ఉజ్జ్వలత్వము అను తన గుణమును పొందునట్లు మనస్సు ధ్యానము ద్వారా సత్త్వ, రజ, స్తమో మలములు పోవుటచే బ్రహ్మ తత్త్వమును పొందును."

# ఇరువది మూడవ ప్రసంగము

వివేక జ్ఞానమును గురించి తైత్తిరీయోపనిషత్తు చెప్పుచున్నది.

**“న వా ఏష పురుషోఽన్నర సమయః”**

“ఆ ఈ పురుషుడు అన్నరసమయుడు” అని ఆరంభించి,

**“తస్మాద్వా ఏత స్మాదన్నర సమయాద న్యోఽన్త రాత్మా ప్రాణమయః”**

ఆ కారణముచే ఆ అన్న రసమునకు అంతరాత్మ ప్రాణమయుడు అనియు

**“అన్యో అంతరాత్మా మనో మయః”**

“అతనికి కూడ అంతరాత్మ మనో మయుడు” అనియు,

**“అన్యోఽన్తరాత్మ విజ్ఞాన మయః”**

“అతనికి కూడ అంతరాత్మ విజ్ఞాన మయుడు” అనియు,

**“అన్యోఽన్తరాత్మఽఽనన్ద మయః”**

“అతనికి కూడ అంతరాత్మ ఆనంద మయుడు” అనియు చెప్పుచున్నది. ఈ

వాక్యముల తాత్పర్యము అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములను ఆత్మగా నంగీకరించమని కాదు. జిజ్ఞాసువునకు సోపాన క్రమమున శుద్ధమగు ఆత్మను తెలుపుటయే.

ఈవిషయమున కఠోపనిషత్తు నందు చెప్ప బడినది.

***ఇన్ద్రియేభ్యః పరాః హ్యర్థాః అర్థేభ్యశ్చ పరం మనః|***
***మన సస్తు పరా బుద్ధిః బుద్ధేరాత్మా మహాన్ పరః||***
***మహతః పర మవ్యక్త మవ్యక్తాత్పురుషః పరః|***
***పురుషాన్న పరం కించిత్సా కాష్ఠా సా పరా గతిః||***

"ఇంద్రియములకంటె విషయములు సూక్ష్మములు. (ఏలనన ఇంద్రియముల ప్రవృత్తి విషయములకు లోబడి ఉన్నది) విషయముల కంటె మనస్సు సూక్ష్మమయినది. మనస్సు కంటె

బుద్ధి సూక్ష్మము. బుద్ధి కంటె మహత్స్వరూపుడగు హిరణ్యగర్భుడు సూక్ష్మమైన వాడు. హిరణ్యగర్భుని కంటె అవ్యాకృతము సూక్ష్మమయినది. అవ్యాకృతము కంటె ఆత్మ సూక్ష్మమయినది. ఆత్మకంటే సూక్ష్మమైనది వేరొకటి లేదు. అదియే పరమాధారము. అదియే పరమగతి. దానినే పొందవలెను."

ఈవిధముగా ఆత్మసాక్షాత్కారమునకు ధ్యానయోగము, వివేకము (సదసద్విచారము) ఈ రెండు సాధనములు అని తేలు చున్నది.

గీత యందు కూడ చెప్ప బడినది.

***యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యో గైరపి గమ్యతే |***
***ఏవం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ||***

"సాంఖ్యముచే తెలియనగు స్థానమే యోగము చేతను కూడ తెలియనగును. సాంఖ్యము, యోగము రెండును ఒకటే అను

విషయమును తెలిసికొనువాడు నిజమగు తత్త్వవేత్త.

సాంఖ్యమనగా సదసద్విచారము. సదసద్విచారమనగా ఆత్మ వస్తు వివేచన చేయుట. ఆత్మ వస్తువు వివేచనముచే లభించు స్థానమే యోగము ద్వారా అనగా ధ్యానయోగము ద్వారా కలుగు అపరోక్ష జ్ఞానముచే లభించును.

## తత్త్వజ్ఞానము, మనోనాశము, వాసనాక్షయము- ఈ మూడును ఒకే సమయమున సిద్ధించును

"వాసనాక్షయము కానంతవరకు తత్త్వజ్ఞానము కలుగదు. తత్త్వజ్ఞానము కలుగనంతవరకు మనోనాశము కూడ అవదు. వాసనా క్షయము, తత్త్వజ్ఞానము, మనోనాశము – ఈ మూడును కార్య కారణ సంబంధము కలవి. కావున ఈ మూడింటిని ఒకేమారు అభ్యసించ వలెను." అని వశిష్ఠులు చెప్పిరి.

***వాసనాక్షయ విజ్ఞాన మనో నాశా మహా మతే/***
***సమకాలం చిరా భ్యస్తా భవన్తి ఫలదాయినః//***

" ఓ మహా బుద్ధి మంతుడగు రామా! వాసనాక్షయము, తత్త్వ జ్ఞానము, మనోనాశము- ఈ మూడింటిని చాల కాలము ఒకేమారు అభ్యసించినచో జీవన్ముక్తావస్థ పొందబడును. "

***తస్మాద్రాఘవ యత్నేన పౌరుషేణ వివేకినా/***
***భోగేచ్ఛాం దూరతస్త్యక్త్వా త్రయమేతత్సమాచరేత్ //***

"ఓ రాఘవ! పురుషార్థియగు వివేకి, విషయ భోగాదులందలి కోరికను దూరమునుండియే విడనాడి తత్త్వజ్ఞానము, మనోనాశము, వాసనాక్షయము అను మూడింటిని అభ్యసించవలెను."

తత్త్వజ్ఞానమునకు శ్రవణము, మననము మొదలగునవి సాధనములు. మనోనాశమునకు యోగమును (సమాధిని) అభ్యసించుట సాధనము. మలిన వాసనా నివృత్తికి మైత్ర్యాది

ప్రతికూల వాసనలను ఉద్భవింప జేయుట సాధనము.

వైద్యరాజ:- కొందరు విద్వాంసులు జ్ఞానులు రెండు రకములు అని చెప్పెదరు. 1. కృతోపాస్తి, 2. అకృతోపాస్తి. కృతోపాస్తికి తత్త్వజ్ఞానముతో పాటు జీవన్ముక్తి కూడ కలుగును. అకృతోపాస్తి జ్ఞానము కలిగిన తరువాత జీవన్ముక్తి కొరకు వాసనా క్షయమును, మనోనాశమును అభ్యసించవలెను.

స్వా.ప్ర.:- ప్రతి అంతఃకరణము నందును మల, విక్షేప, ఆవరణము లనెడు మూడు దోషములు ఉండును. అనేక జన్మల యందు బ్రహ్మహత్యాది పంచ మహాపాపములను, గోహత్యాది పాపములను చేయుటవలన కలుగు మలిన సంస్కారములు మల దోషము. విక్షేపదోష మనగా ఐదు రకములగు విషయాదుల భోగ వాసనలు. ఆవరణ దోషము అనగా జీవ బ్రహ్మముల మధ్య నుండు అజ్ఞానమను తెర. ఈ

మూడు దోషములను నివృత్తి నొందించుటకు వేదశాస్త్రముల యందు క్రమముగా కర్మ, ఉపాసన, జ్ఞానము ప్రతిపాదించబడినవి.

ఉపాసన చేసి విక్షేప దోషమును పోగొట్టుకొనకుండ తత్త్వజ్ఞానము కలుగునని ఎవరైన అనుకొనినచో అది సర్వదా అసంభవము. భోగ వాసన రాగ విశేషము. ఉపాసన లేనిదే భోగ వాసన నివృత్తిని పొందదు.

భోగవాసన నివృతిని పొందనిదే రాగాది దోషములు కల అంతఃకరణమునందు జ్ఞానము ఎప్పుడును కలుగదు. "***రజో రాగాదికం విద్ధి***" అని భగవానుడు గీతలో కూడ చెప్పెను. "రాగాది మలిన వాసనలు రజోగుణ కార్యములు. వాసన రెండు రకములు. శుద్ధము, మలినము అని. శుద్ధ వాసన దైవసంపద. మలిన వాసన అసుర సంపద. అసుర సంపదను పోగొట్టుకొనుటకు దైవ సంపదను సంపాదించ వలెను. దైవసంపద అన్ని విధములుగాను లభించినా పిమ్మట శ్రవణ, మనన, నిదిధ్యాసనముల ద్వారా జ్ఞానము

కలుగును.

రాగాది అసుర గుణాలు రజోగుణ కార్యములు. వైరాగ్యాదులు మిశ్రసత్త్వము యొక్క కార్యములు. తత్త్వజ్ఞానము శుద్ధసత్త్వము యొక్క కార్యము. "**సత్త్వాత్ సంజాయతే జ్ఞానం**" అని భగవానుడు గీతయందు చెప్పెను.

మిశ్ర సత్త్వ గుణమునకు చెందిన దైవసంపద యందు రజోగుణము ఉండదు. ఆ దైవసంపదచే శుద్ధ సత్త్వ గుణము కల జ్ఞానియందు మరల రాగము జనించును అను అభిప్రాయము తప్పు. కొందరు విద్వాంసులు అంతఃకరణము నుండి భోగ వాసనను నివృత్తిని పొందించ లేక , కేవలము శాస్త్రాభ్యాసము మాత్రమే చేసినందున "మేము తత్త్వ జ్ఞానులము, మాకు విదేహముక్తి యందు ఎట్టి బాధయు ఉండదు, జీవన్ముక్తి ఆనందమునకు బాధాకరము" అని చెప్పి జీవన్ముక్తికిని, తత్త్వ జ్ఞానమునకును భేదమును ప్రతిపాదించెదరు.

వారు భోగ విలాసముల యందు నిమగ్నులగుదురు, తాము కృతకృత్యుల మను కొనెదరు.

వైద్యరాజ:- జీవన్ముక్తి యందు విద్యారణ్యులు చెప్పిరి.

***రాగాదయః సన్తు కామం న తద్భావో పరాధ్యతి/***
***ఉత్ఖాత దంశోర గవద విద్యా కిం కరిష్యతి //***

"జ్ఞానికి రాగాదులు కలుగవు. కలిగినను వానివలన ఏమియు బాధ కలుగదు. విషపు కోరలు తీసివేసిన సర్పం ఏమియు బాధించ లేనట్లు గనే జ్ఞానికి రాగాది అవిద్యా కార్యములు ఏమియు చేయలేవు."

స్వా. ప్ర.:-జీవ బ్రహ్మముల మధ్య నున్న అజ్ఞానము తత్త్వ జ్ఞానముచే నివృత్తిని పొందిన పిమ్మట అజ్ఞానము, అజ్ఞాన కార్యములును అగు రాగాది మలిన వాసనలకు అస్తిత్వము కలదనుట సరియేనా?

వైద్య రాజ :- తత్త్వజ్ఞానము కలిగిన తరువాత రాగాదులగు మలిన వాసనలు ఉండవు. కాని విద్యారణ్యస్వామి వంటి మహా విద్వాంసులు అసత్యము వ్రాయుదురా?

స్వా. ప్ర. :-(నవ్వుచు) బికనీరులో ఒక మార్వాడీ ఉండెను. ఆతడు 12, 13 సంవత్సరముల బాలికను పెండ్లాడెను. అనంతరము తన వ్యాపారమునకు పర దేశమునకు వెళ్ళిపోయెను. మూడు, నాలుగు సంవత్సరాల తర్వాత మామగారు అతనికి ఉత్తరము వ్రాసెను, “మా అమ్మాయి పెద్దమనిషి అయినది. నీవు వచ్చి తీసికొని వెళ్ళుము.” ఆరు మాసముల తరువాత వచ్చెదనని మార్వాడీ సమాధానము వ్రాసెను. కాని ఆరు మాసముల తరువాత అతడు వెళ్ళ లేదు. అంతట మామగారు అతనికి తరుచు ఉత్తరములు వ్రాయుచుండెను. కాని ఆతడు నాలుగు మాసములలో వచ్చెదను,

ఐదు మాసములలో వచ్చెదను. అని సమాధానములు వ్రాసెను. కాని వెళ్ళలేదు. ఇట్లు పెండ్లి అయిన తర్వాత 12, 13 సంవత్సరములు గడచిపోయెను. అప్పటికి ఆ మార్వాడీ బొంబాయి వచ్చి, అచ్చటి మార్వాడి బజారులో మకాము చేసియుండెను. మార్వాడి మామగారు చాల విసుగెత్తి యుండెను. కావున అతను తన అల్లుని స్నేహితునితో, “నేను ఉత్తరములు వ్రాసి వ్రాసి విసిగితిని. నీవే వ్రాయుము” అని చెప్పెను. ఆ ఇరువురును కూర్చొని ఉత్తరము వ్రాసిరి. వ్రాయుచుండగా ఆతనికి కోపము వచ్చి ఇట్లు వ్రాయమనెను. “ఇంకా ఎక్కువ ఏమి వ్రాయుదును. నీ భార్య విధవ అయిపోయినది. ఇప్పుడైన రమ్ము” మిత్రుడు వ్రాయుటకు జంకెను. అంతట మామగారు ఇట్లనెను. “నీ కేమి భయము లేదు. నేను ఉన్నాను. వ్రాయుము.” ఆ విధముగా బొంబాయికి ఉత్తరము వ్రాయగా అందెను.

నలుగురులోను ఆ ఉత్తరము చదివి మార్వాడీ మొత్తుకొని ఏడ్వసాగెను. నాలుగు

వైపుల నుండి జనులు ప్రోగుపడి ఎవరు చనిపోయిరి? అని ప్రశ్నించిరి. మార్వాడీ ఏడ్చుచు “నా భార్య విధవ అయిపోయినది” అని పలికెను అందరు పకపక నవ్విరి.

మార్వాడీ పలికెను. నేనేమైనా అబద్ధము చెప్పుచున్నానా? ఉత్తరము చదివి చూడండి. జనులు ఉత్తరము చదివిరి. అనంతరము వారు ఇట్లనిరి. ఉత్తరమునందు వ్రాయబడి యున్నను, నీవు ఇక్కడ కూర్చొనియుండగా నీ భార్య విధవ అగుట ఎట్లు? ఆమాత్రం ఆలోచించవేమి?

మారువాడీ:- అది నేను కూడ ఎరుగుదును. కాని స్నేహితుడు ఇట్లు ఎందుకు వ్రాయును? అసత్యము వ్రాయడు కదా! అని అడిగెను.

మీరు కూడ ఆ మార్వాడీ వలె యుక్తి రహితంగా మాట్లాడుచున్నారు.

ఇది విని శ్రీ నిత్యానంద స్వామివారు మొదలగు వారందరును నవ్వసాగిరి.

యోగవాసిష్ఠము చెప్పుచున్నది.

***యుక్తి యుక్తముపాదేయం వచనం బాలకాదపి/***
***అన్యత్ తృణమివ త్యాజ్య మవ్యక్తం పద్మయోనినా//***

ఆధారము కల వాక్యము బాలకుడు చెప్పినను గ్రహించ వలెను. నిరాధారమగునది బ్రహ్మ చెప్పి నను గడ్డి పోచతో సమానముగా చూచి త్యజించవలెను."

ఇదంతయును నేను వినోదార్థము చెప్పితిని. జీవన్ముక్తికి సంబంధించిన ఆ శ్లోకము నందలి రాగ శబ్దమునకు భావము రాగము కాదు. రాగాభాసము మాత్రమే.

దప్పిక గొన్న వాడు ఎండమావులను చూచి నీరని భ్రమపడి దాహము తీర్చుకొనుటకు వారివైపు పరుగిడును. కాని ఆతనికి అచ్చట నీరు కన్పించక ఎండమావులే కన్పించును. అంతట వానికి ఎక్కడ క్షార భూమి ఉన్నను అది ఎండ మావులే అయి ఉండును. నీరు అనుకొనుట

అజ్ఞానము అని తోచును. అటులనే జ్ఞానము ద్వారా విషయాదుల యందు మిథ్యాత్వబుద్ధి కలిగినంతనే పదార్థముల యందు రాగాది మలిన వాసనలు కలుగుటకు అవకాశము పోవును. కావున పై శ్లోకము నందలి రాగ శబ్దమునకు తాత్పర్యము రాగాభాసము మాత్రమే. జ్ఞానికి ఉండు అన్నపానాదులను పొందవలెనను కోరిక రాగాభాసము అనబడును.

వైద్య రాజ :-తత్త్వ జ్ఞానము కలిగిన పిమ్మట భోగవాసన ఉండదు. అది బాగుగనే ఉన్నది. కాని సమాధినుండి ఉత్థానమును పొందిన పిమ్మట జ్ఞానియొక్క వృత్తి బహిర్ముఖమగును. కర్తృత్వ, భోక్తృత్వాది అంతఃకరణ ధర్మమును క్లేశమును కలుగ జేయును. ఆతడు దుఃఖనివృత్తిని పొందుటకును, మరల జీవన్ముక్తి యొక్క ఆనందమును పొందుటకును సమాధిని అభ్యసించవలెనా?

స్వా. ప.:- ఒకమారు సమాధి ద్వారా

# ఇరువది మూడవ ప్రసంగము

అవిద్య, అవిద్యా జన్యములగు దుఃఖములు నశించి బ్రహ్మసుఖము పొందిన తరువాత మరల దుఃఖనివృత్తి కొరకు సమాధిని అభ్యసించుట అసంభవము. ఎట్లనిన:-

ఒక మారు ఒక బ్రాహ్మణుడు స్నానం చేయుటకు సరోవరమునకు వెళ్ళెను. స్నానము చేసి వచ్చుచు తన ధోవతిని ఉతికికొని, పిండి, భుజముపై వేసికొనెను. ఇంటికి వచ్చిన తరువాత ఆ ధోవతిని ఆరబెట్టుటకు విదల్చెను. దాని లోపల నుండి ఒక చిన్న చేపపిల్ల బయట పడి గిలగిల కొట్టుకొనసాగెను. దయకలిగి ఒక కుండలో నీరుపోసి దానిలో ఈ చేపపిల్లను వేసి చెరువు వద్దకు తీసుకొని వెళ్లి కుండను అందులో విడచెను. చేపపిల్ల ఎంతయో ఆనందించెను. కుండ నుండి చెరువులోనికి వెళ్ళుచు, మరల చెరువు నుండి కుండలోని వచ్చుచు చేపపిల్ల ఎంతయో ఆనందమును పొందు చుండెను. రెండు చోట్లను నీరు ఉండుటయే ఇందుకు కారణము.

ఈవిధముగనే ఒకమారు జీవునకును,

బ్రహ్మమునకును మధ్య కల తెర పడిపోయినచో సమాధిదశ యందు ఉన్నను, ఉత్థానదశ యందున్నను ఆనందము సమానముగానే కలుగును. ఇక దుఃఖమునకు అవకాశమేది?

ఈవిషయమున శంకరభగవత్పాదులు వాక్యములను వినుడు.

***దేహాభిమానే గలితే విజ్ఞాతే పరమాత్మని|***
***యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర సమాధయః ||***

"దేహాభిమానము నశించి, పరమాత్మ జ్ఞానము కలిగిన తరువాత మనస్సు వెళ్లిన ప్రతి చోటకును సమాధికూడ వెళ్ళును."

స్వా. ని. :- తత్త్వజ్ఞానం కలిగిన పిమ్మట రాగము మొదలగు మలిన వాసనలు ఉండవు. దరిద్రుడెవడైన చక్రవర్తి అయినచో దారిద్ర్యము వలన కలిగిన దుఃఖములు పోవును. కాని వ్యాధి జన్యములగు దుఃఖములు నివృత్తిని పొందవు. అటులనే జ్ఞానికి అవిద్యా జన్యములగు

దుఃఖములు నివృత్తిని పొందిన పిమ్మట బ్రహ్మానంద సామ్రాజ్యము లభించును. కాని ప్రారబ్ధకర్మముల వలన శరీరము నందు రోగాది జన్యములగు దుఃఖములు మాత్రము కన్పట్టుచున్నవి. అవియును తత్త్వజ్ఞానికి బాధితానువృత్తిరూపమున ప్రతీతమగుచున్నవి. అందును భేదము కలదు. నిర్వికల్ప సమాధి రెండు రకములు. 1. అద్వైత భావన, 2. అద్వైత అవస్థ.

అద్వైత భావమును పొందిన వానికి ఆవరణభంగము అయిన పిమ్మట వృత్తి భావరూపమును పొందుటచే దుఃఖములు బాధితానువృత్తి రూపమున ప్రతీతము లగును. ఆ శుద్ధ సత్త్వగుణ ప్రధానమగు బ్రహ్మాకారవృత్తి కూడ స్వరూపమునందు లయమును పొందును. అది అద్వైత అవస్థ అనబడు నిర్వికల్పము. అదియే గుణాతీతా అవస్థ అని కూడ చెప్ప బడును. ఇట్టి గుణాతీతునకు దుఃఖములు కూడ బాధితానువృత్తి రూపమున ప్రతీతములు కావు.

ఇది ఛాందోగ్యోపనిషత్తు నందు చెప్ప బడినది.

**న పశ్యో మృత్యుం పశ్యతి న రోగం నోత దుఃఖతామ్ /**
**సర్వం హ పశ్యః సత్యతి సర్వమాప్నోతి నర్వశః//**

"బ్రహ్మవేత్త మృత్యువును చూడడు. రోగమును చూడడు. శీతోష్ణాది సుఖదుఃఖములను చూడడు. బ్రహ్మవేత్త అన్నిటిని స్వస్వరూపములుగనే చూచును. అన్ని విధములుగను అన్నిటియందును సర్వాత్మకమగు బ్రహ్మస్వరూపమును పొందును."

వైద్య రా:- అద్వైత భావన అను నిర్వికల్ప సమాధినుండి అద్వైత అవస్థ అనబడు నిర్వికల్ప సమాధి లోనికి వెళ్లుటకు సాధన మేమి?

స్వా|| ని|| :- తత్త్వజ్ఞానము కలిగిన పిమ్మట జనుల సంసర్గములో నుండి ఉపదేశాది సాత్త్విక ప్రవృత్తులను కలిగియుండు జ్ఞానులు అద్వైత భావమున ఉందురు. ఈ అద్వైత భావము నందు

కూడ భేదములు కలవు.

జ్ఞాన భూమికలు ఏడు: - (1) శుభేచ్ఛ, (2) విచారణ, (3) తనుమానస, (4) సత్త్వాపత్తి, (5) అసంసక్తి , (6) పదార్థ భావిని, (7) తురీయ.

వీనిలో మొదటి మూడు సాధనకోటికి సంబంధించినవి. మిగిలిన నాలుగును జ్ఞానకోటికి చెందినవి. సత్త్వాపత్తి, అసంసక్తి, పదార్థ భావిని, తురీయ - అను ఈ శ్రేణికి చెందిన వారు క్రమముగ బ్రహ్మ విదుడు, బ్రహ్మవిద్వరుడు, బ్రహ్మవిద్వరీయసుడు, బ్రహ్మవిద్వరిష్టుడు అనబడుదురు. వశిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు మొదలగు నాలుగవ భూమిక యందు ఉన్నవారు బ్రహ్మవిదులని చెప్ప బడెడివారు. జనులకు ఉపదేశించుట మొదలగు సాత్త్విక ప్రవృత్తులను కూడా కలిగి యుండెడి వారు. శుకుడు మొదలగు ఐదవ భూమిక యందలి వారు బ్రహ్మవిద్వరులనబడెడి వారు.

ఇట్టివారు జగమున నిర్ద్వంద్వలుగా

తిరిగెడివారు. ఇట్టివారులను గురించి శంకరులు చెప్పిరి.

***దిగమ్బరో వాఽపి చ సామ్బరో వా త్వగమ్బరో వాఽపి చిదమ్బరస్థః/***
***ఉన్మత్తవద్వాఽపి చ బాలవద్వా పిశాచవద్వాఽపి చరత్యవ న్యామ్//***

"చైతన్యాకాశమున నున్న బ్రహ్మజ్ఞుడు వస్త్రము లేకుండగనో, లేక వస్త్రముతోనో, లేక చెట్ల ఆకులు మొదలగునవి ధరించియో, వెర్రి వానివలెనో, లేక బాలునివలెనో, లేక పిశాచమువలెనో ఈ భూమిపై సంచరించును."

నేను పూర్వాశ్రమమున బెల్గాములో నున్నపుడు హనుమాను గనీలో బ్రహ్మనిష్ఠుడగు మహాత్ముడు ఒకడు ఉండెనని విని ఆయన దర్శనమునకు వెళ్ళితిని. అతని కేశములు చిందరవందరగా నుండెను. గడ్డము మొదలగువానితో చూచిన వారికి మహా భయంకరముగా నుండెను. అక్కడ ఒక బ్రాహ్మణ

అగ్రహారము కలదు. ఆ అగ్రహారము మధ్యనే హనుమానుని మందిరము ఉండెను. ఆ మహాత్ముని చూచుటకు నేను వెళ్ళు సరికి ఆయన బ్రాహ్మణులకు భోజనము చేసి పారవేసిన ఆకులు ఏరుకొని చంకలో నిడుకొని తిరుగుచుండెను. "ఈ విధముగా నుండు మనుష్యుడు మహాత్ముడు ఎట్లగును?" అని నాకు తోచెను. ఈ సందేహము నాకు కలుగు సమయమున అక్కడకు బ్రాహ్మణుడు ఆయనకు సేవ చేయుటకు వచ్చుచుండెను. ఒక బాలచాపల్యముతో నేను అతనిని అడిగితిని. "ఈ మహాత్ముని నీవు ఇంత ఎక్కువగా సేవించుచున్నాను ఈయన యందు ఎంతయో పూజ్య భావమును కలిగియున్నావు. నీకేమైన లాభము కలిగినదా?" అంతట ఆతడు ఇట్లు చెప్పెను. "నేను చెప్పినచో అహంకారము అనుకొనెదరు. లేనిచో అసత్యము పలుక వలసి వచ్చును. ఏమి చెప్పను!" ఆ మహాత్ముడు పిచ్చివాడు కాడను భావము నాకు కలిగెను. అయినను నాకు సందేహము పోలేదు.

బెల్గామునుండి 17, 18 మైళ్ళ దూరమున ఒక అమ్మవారి గుడి యుండెను. ఆవిడ మాహాత్మ్యము చాల గొప్పదని అందరు చెప్పెడి వారు. ఏదైన రోగము వచ్చినచో ఎట్లు తగ్గును? తగ్గునా, తగ్గదా అనునది ఆవిడ చెప్పెడిదట. అందరును ఆమెను అడుగుటకు వెళ్ళెడి వారు. ఆ గ్రామమున ఒక వ్యాపారి ఉండెను. అతనికి కడుపులో పోటు వచ్చి దానిచే ఆతడు చాలా బాధ పడుచుండెను. ఎన్ని మందులు వేసినను బాధ తగ్గ లేదు. ఆతడు కూడ అమ్మవారి వద్దకు అడుగుటకు వచ్చెను. ధూపముతో అమ్మవారు పూని చెప్పెను. మా గ్రామము నందలి హనుమాన్ గలీలో ఒక మహాత్ముడు కలడు. ఆయనకు మూడు పూటలు భోజనము పంపినచో ఈ బాధ తగ్గిపోవును. అటు తరువాత ఆ వ్యాపారి అటులనే చేసెను. ఆతని బాధలు పోయెను. అప్పటి నుండి భోజనము పంపెడి వాడు. ఇది చూచిన తరువాత ఆ మహాత్ముడు పిచ్చి వాడు కాదు, జ్ఞాని అను

నమ్మకము కలిగెను. పంచమ భూమిక యందున్న వారు ఇట్లు పిచ్చి వాని వలెను, బాలుని వలెను ఉందురు. వీరి వృత్తి అంతర్ముఖమయిన కొలదియు దేహభానము తగ్గుచుండును.

ఆరవ భూమియందు నడచుటు నమలుట, చూచుట మొదలగు క్రియలు ఆగిపోవును. చూచుట ఆగిపోవును అనగా కన్ను మూతపడదు. కాని శవమువలె చపలత్వ రహితముగ నుండును, 1954 విక్రమ శకమున (1897 క్రీ|| శ||) కుంభకోణమునందు ఒక మహాత్ముని ఈ స్థితిలో చూచితిని. ఆ గ్రామస్థులు 38 సంవత్సరములనుండి ఆయన ఆ స్థితిలో ఉన్నాడని చెప్పిరి. తర్వాత 5 సంవత్సరములు జీవించెను.

7 వ భూమిక యందున్న వాడు బ్రహ్మవిద్వరిష్ఠుడు. ఏడవ ఆరవ భూమియందు శరీరం 21 రోజులు ఉండును అని చెప్పుదురు. తత్త్వజ్ఞానముతో బాటు జీవన్ముక్తి కలుగును, ఈ

రెంటి యందును భేదము లేదు.

వైద్య రాజ :- కొందరు విద్వాంసులు తత్త్వజ్ఞానము కలిగిన తరువాత అవిద్యా లేశము ఉండును అని చెప్పుదురు. దాని నివృత్తి కొరకు మరల యోగమును చేయవలెనా?

స్వా. ని.:- అవిద్య యందు రెండు అంశములు కలవు. 1. ఆవరణము. 2. విక్షేపము. ఆవరణాంశము తత్త్వజ్ఞానముతో బాటు నశించును. విక్షేపాంశము ప్రారబ్ధ కర్మ క్షయము వరకును ఉండును.

***తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యేఽథ సంపత్స్యే/***

ప్రారబ్ధకర్మ క్షయము అగునంత వరకు మాత్రమే ఆతనికి ఆత్మప్రాప్తి కలుగుటకు ఆలస్యమగును. ప్రారబ్ధకర్మము నశించి శరీరపాతము అయినంతనే అతనికి సద్వస్తువు లభించును.

కాని ఆ జ్ఞానులు ముక్తిని పొందువరకు

ఎదురు చూచుచుందురు. అనగా ప్రారబ్ధ క్షయమును ఎదురుచూచుచుందురు. ప్రారబ్ధ క్షయము అగుటచే పరబ్రహ్మము నందు లీనమగుదురు. కాని తత్త్వజ్ఞానము కలిగిన తరువాత యోగాభ్యాసము చేయుట అనగా కుమారుడు పుట్టిన తరువాత పెండ్లి చేసికొనుట వంటిది.

స్వా. ప్ర. :-ఒక మారు నేను "వాంసదా" వెళ్ళితిని. సంభాషణలో వింటిని. అచ్చటి భిల్లులు కార్యము చేసుకుని ఇద్దరు ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత పెండ్లి చేసికొనెదరట. తల్లిదండ్రులు పెండ్లి సమయమున పిల్లల ఎదుట ఒట్టుపెట్టు కొనెదరు. ఇది ఏమిటి అని ప్రశ్నించగా ఇట్లు సమాధానము వచ్చెను. "ఇది అడవి జాతి, మాటి మాటికి కల్లు త్రాగి కొట్టుకొని విడాకులు పుచ్చుకొనెదరు. కాని పిల్లలు పుట్టినచో వారి యందలి ప్రేమచే అట్లు చేయలేరు. అందుచేతనే అట్లు పెండ్లాడెదరు. ఇది భిల్ల మతము."

ఇది విని అందరు నవ్విరి.

వైద్య రాజ : - ఇక్కడికే ఒక స్వామి వచ్చిరి. వారు విద్వాంసులు. మన స్వామి వారితో వారు కూడ చర్చించుచుండిరి. "తత్త్వజ్ఞానము కలిగిన తరువాత కూడ ప్రారబ్ధానుసారము భోగేచ్ఛయుండును" అని వారి వాదము. శ్రీ నిత్యానంద స్వామివారు "భోగేచ్ఛ అసురగుణము. జ్ఞానికి ఎట్లు కలుగును?" అని ప్రశ్నించిరి. ఆ స్వామి తనవాదమును మొండిగా నిలబెట్టు కొనసాగెను. అంతట స్వామివారు మౌనము వహించిరి.

స్వా. ప్ర.:-

***నాప్తోపదేశం సంవేత్తి విద్యామత్తః స్వహేతుభిః/***
***అనర్థమప్యభిప్రేతం మన్యతే పరమార్థవత్ // (శుక్రనీతి)***

"విద్యా మదము కలవాడు ఆప్తవాక్యమును తనకు కష్టము కలుగునను భావముతో అంగీకరించడు. తనకు అనుకూలముగా నున్న

చో అనర్థకరమగు అభిప్రాయమును కూడ పరమార్థము వలె భావించి అంగీకరించును."

నేటి విద్వాంసులకు శాస్త్రముల యందు శ్రద్ధ లేదు. వారు విషయాదులయందు ప్రవర్తించు చిత్త వృత్తులను ఆపుకొన లేరు. ఆ కారణముచే తమ దుర్నీతిని అనుసరించియే శాస్త్రార్థమును చెప్పెదరు. అంతేకాదు. శ్రుతి, స్మృతుల టీకలు కూడ తమకు అనుకూల మగునట్లుగనే చెప్పుదురు. అందుచేతనే మహాత్ములు చెప్పిరి.

***భక్త్యా భాగవతం శాస్త్రం న వ్యుత్పత్త్యా న టీకయా |***
***గృహిణ్యైవ గృహం ప్రోక్తం న పుంశ్చల్యా న వేశ్యయా ||***

"భగవత్ప్రీతి పాదితమగు శాస్త్రార్థము భక్తి చేతనే నిర్ణయించ బడును వ్యుత్పత్తులు చెప్పి కాని, టీకలు వ్రాసి కాని నిర్ణయించ బడదు. గృహిణి ఉన్నది గృహము. అంతేకాని పురుషలను చూచి నంతనే ఉద్రేకం చెందు కులట కాని, వేశ్య కాని ఉన్న గృహము గృహము కాదు."

అనగా శాస్త్రాభ్యాసము చేసినను శ్రద్ధా భక్తులతో ప్రభు పరాయణులు కానంతవరకు నిజమగు బోధ కలుగదు. శ్రద్ధాభక్తులతో ప్రభు పరాయణులగు వారిని గురించి భగవానుడు గీతలో చెప్పెను.

***తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతి పూర్వ కమ్।***
***దధామి బుద్ధి యోగం తం యేన మాముపయాన్తి తే ॥***

"పరమేశ్వరుని యందు ఏకాగ్రబుద్ధి కలిగి, ప్రేమతో పరమేశ్వరుని భజించు భక్తులకు బుద్ధియోగము లభించును. ఆ బుద్ధి యోగముచే వారు తమ ఆత్మ రూపమును పొందుదురు. ఆ బుద్ధి యోగమును నేను వారికి కలుగ జేయుదును."

# భర్తృహరి మహారాజుగారి ఆదర్శ త్యాగము పింగళామహాదేవి ఆదర్శ పాతివ్రత్యము

తరువాతి రోజున శ్రీ ప్రకాశానంద స్వామి వారు రాజకోట వెళ్ళ వలసి యుండెను. అది తెలిసికొని మూల్వాలా రాజుగారు స్వామి వారి దర్శనమునకు వచ్చిరి. వారితో శ్రీ శంకరానంద స్వామి వారును, వైద్య రాజ గోపాలజీ భాయి యును కూడ వచ్చిరి. వారు భిక్ష చేసి సాయం కాలము వెళ్లుడని పట్టుపట్టిరి. కానీ స్వామి వారు ఒప్పుకొన లేదు.

మూల్వాలా:- తమవంటి త్యాగుల పాదరజో భాగ్యము మా యింటికి కలుగవలెనుగదా!

స్వా.ప్ర. :-నేనేమి త్యాగిని? పూర్వం పిండి అడిగే వాడిని. ఇప్పుడు రొట్టె అడుగుచున్నాను. భర్తృహరి మహారాజు త్యాగి. ఆయన మాలవ

రాజ్య సంపద నంతను త్యజించి వెళ్లి పోయెను.

మూలాల్వాలా :- పింగళ దుష్టురాలు కావున వెళ్ళిపోయెను. ఆయనకు వైరాగ్య మెక్కడ?

స్వా. ప్ర. :- పింగళ చెడ్డది అను సంగతి నాటి కాలపు వాళ్ళు కల్పించిన అభూతకల్పన, పింగళ అసలు పేరు భానుమతి. భర్తృహరి నిర్వేదమునందు ఉన్నది. ఒక మారు భర్తృహరిమహారాజు, మహా రాణి భానుమతి ఇరువురును మూడవ అంతస్థులోని 'ఝరోఖా'లో కూర్చొని యుండిరి. ఆ సమయమున మార్గము నుండి మేళ తాళములతో ఒక ఊరేగింపు వెళ్ళుచుండెను. మహారాజు ఒక నౌకరును క్రింద నుండి వెళ్లి ఊరేగింపు ఎమిటో తెలిసికొని రమ్మని పంపెను. నౌకరు వెళ్లి తెలిసికొనివచ్చి చెప్పెను. ఒకామె భర్త చనిపోయెను. ఆమె భర్తతో సహగమనము చేయుటకు వెళ్ళుచున్నది. ఈ ఊరేగింపు అదియే. మహారాజు హర్షోద్రేకములో ఇట్లనెను:-"ఆహా! మా రాజ్యములో ఇటువంటి

పతివ్రతలు ఉన్నారా!” ఇది విని మహారాణి భానుమతి పలికెను. “ఈమె పతివ్రత కాదు. ఈమె సాహసముకల వనిత మాత్రమే.”

భర్తృ:- పతివ్రతకును సాహసనారికిని కల భేద మేమి?

భానుమతి:- తన భర్త మృత్యువును గురించిన వార్త తెలియగనే తన ప్రాణమును విడచు వనిత పతివ్రత. భర్తృ మరణానంతరము యోధుడు దృఢ మనస్సుతో యుద్ధ భూమి కరిగి ప్రాణము లర్పించినట్లు భర్తృ శవమునకు అగ్ని సంసారము చేసి దృఢమగు మనస్సుతో అగ్నియందు ప్రవేశించునది సాహస వనిత.

ఇది విని భర్తృహరి మహారాజు ఏమియు పలుక లేదు. కాని మనస్సులో ఈమెను పరీక్షించవలె ననుకొనెను. నాలుగైదు మాసములు గడచిన తరువాత భానుమతిని పిలచి నేను వేటకు వెళ్ళుచున్నానని చెప్పెను. ఇట్లని రాజధానినుండి 25, 30 క్రోసులు వెళ్లి పోయెను. అచ్చటినుండి

ఇద్దరు మనుష్యులను రాజధానికి వెళ్లి తాను చనిపోయిన సంగతి రాణికి తెలుపమని పంపెను. వారు మహారాణి వద్దకు వెళ్లి మిక్కిలి ఖేదముతో కండ్ల నీరు కార్చుచు నిలబడిరి. మహా రాణి ప్రశ్నించెను. "అంత దుఃఖకరమగు సంగతి ఏమి చెప్పదలచి యున్నారు? అసలు సంగతి ఏమి?" అతడు చెప్పెను. "ఏమి చెప్పను తల్లిగారూ! నోటి నుండి మాట వచ్చుట లేదు."

మహా రాణి మరల ప్రశ్నించెను:- "ఏమి జరిగినది?"

మనుష్యుడు:—మహారాజుగారు పులిని తుపాకితో కాల్చిరి. తుపాకి సరిగా పేలలేదు. ఇంతలో పులి వచ్చి మహారాజు గారిని చంపి వేసినది. ఇది విని మహారాణి "హా! మహారాజా చనిపోయారా!" అని నిట్టూర్పు విడిచి ప్రాణములను త్యజించెను.

మహారాజు కుటుంబములోని వారు వచ్చి మహారాణికి అగ్ని సంస్కారము చేసిరి.

మహారాజు వేటనుండి తిరిగివచ్చుచు కోటపై నల్ల జండాను చూచి ప్రశ్నించెను. రాజు కుటుంబములో ఎవరు చనిపోయిరి?" అచ్చటి వారు చెప్పిరి:-"తమరు పరీక్షించుట వలన ఈ ఫలితము కలిగినది." ఇట్లని జరిగిన సంగతి అంతయు నివేదించెను.

ఇది విని మహారాజు భవనములోనికి వెళ్ళుట మాని వేసెను. అచ్చట నుండియే శ్మశానమునకు వెళ్లిపోయెను. ఆమె చితాభస్మము నందు దొర్లుచు "ఓ భానుమతీ! నీవు పతివ్రతవు. నీవు నిజము చెప్పితివి. నీవు సచ్చరిత్రవు. నీవు నా ఆజ్ఞానుసారము సంచరించెడిదానవు." అని అనేక విధములుగా ఆమె గుణాలు వర్ణించుచు ఏడ్చుచుండెను. ఆహారమును విసర్జించెను. ఈ విధముగా ఐదు, ఆరు రోజులు జరిగెను. ఇంక మహారాజు ఇట్లు ఏడ్చుచు చనిపోయెదరనుకొనిరి. ఏదైన ఉపాయమును ఆలోచించవలెనను తలంపుతో మహారాజు గురువుగారగు గోరఖనాథునివద్దకు వెళ్లి నివేదించిరి.

గోరఖనాథుడు మారు వేషముతో చేతిలో కుండ తీసికొని శ్మశానమునకు వెళ్ళెను. మహా రాజు చూచుచుండగ ఆ కుండ చేతి నుండి జారి పడి పగిలిపోయెను. గోరఖనాథుడు అక్కడనే కూర్చొని ఏడ్వ సాగెను. “ఓ నా కుండా! నీవు ఏల పగిలిపోతివి? ” భర్తృహరి ఇట్లను కొనెను. ఇతడెవరు? “నా కంటెను ఎక్కువగా దుఃఖించుచున్నాడే!” అటు పిమ్మట ఆయన యోగితో ఇట్లనెను. “నీవు ఈ కుండకొరకు ఇంత ఎక్కువగా ఏల దుఃఖంచుచున్నావు?” ఇదిగో నా బంగారు చెంబును ఇచ్చుచున్నాను, తీసికొనుము” అనెను. యోగి పలికెను. బంగారు చెంబు నాకు ఎందుకు ఉపయోగపడును? నా కుండ ఎంత మంచిదో నీకు తెలియునా? వినుము.

***కరీషా నుచ్ఛేతుం దహనముపనే తుం ముహుర పః***

***సమాహర్తుం భిక్షామటితుమథ తాం రక్షితుమపి/***
***పిధాతుం పక్తుం చాశి తుమపి చ పాతుం పున రథో***
***పధాతుం నః పాత్రీ చిర మహహ చిన్తామణిర భూత్ //***

"అరణ్యము నుండి ఎండు పిడుకలను తెచ్చుటకును, నిప్పును తెచ్చుటకును, నీళ్ళు తెచ్చుకొనుటకును, భిక్షను అడిగి కొనుటకును, అడిగికొని తెచ్చిన భిక్షను దాచికొనుటకును, ఒక్కొక్కప్పుడు వండు కొనుటకును, భుజించుటకును, నీరు త్రాగుటకును ఉపయోగపడు చుండెడిది. అయ్యో! ఏమని వర్ణించెదను. నిద్రించినప్పుడు తలగడ వలె కూడ ఉపయోగించుచుండెడిది. నా కుండ నాకు చింతామణి వలె సర్వవిధములను ఉపకరించుచుండెను."

ఇదియే నా సర్వస్వమును. హా! హత విధీ! ఈ కుండ ముక్కలనన్నిటిని ప్రోగుచేసి వీనితో

నేను సహగమనము చేయుదును. ఈ కుండ ఎంత బలమైనదో చూచుటకు నేను నేలను పెట్టి కొట్టితిని. అందు చేత పగిలిపోయినది. ఆ కారణముచే ఈ కుండ నశించుటకు హేతువును నేనే. ఇక అది లేనిదే నేను జీవించుట ఎట్లు?

భర్తృహరి :—"నా భానుమతి ఎట్లు సహగమనము చేసినదో తెలుపుటకు కపటముగా ఈ గ్రంథ మంతయు సృష్టించి నా మోహాంధకారమును పోగొట్టిన ఈ వ్యక్తి నా గురు దేవులే అయి ఉండవచ్చును." ఇట్లు తలచి గురు దేవుని పాదములపై బడి ఇట్లనెను. "ఓ గురుదేవా! అనుగ్రహించి మోహముతో కూడిన ఘోరమగు నిద్రనుండి మేల్కొలిపిరి. నాకు ఉపదేశమును అనుగ్రహించి కృతార్థుని చేయుడు."

## సంస్కృతి అను ప్రపంచ జాలము సంకల్పముచే జనించినది.

గోరఖనాథుడు :-

***సంకల్పాత్ సకలాపి సంసృతిర భూదేషా విశేషాన్ధ్యభూ***
***రస్యాశ్చేద్ వినివృత్తిమిచ్ఛసి తద్వైత న్మూలము న్మూలయ/***
***నా వచ్ఛిన్న మనేహసా న చ దిశా యద్ బ్రహ్మ సచ్చిన్మయం***
***తత్ త్వం తత్త్వమిదం విచిన్తయ పరానన్దం పదం ప్రాప్స్యసి//***

ఒక అంధత్వ విశేషము కండ్లున్నను వస్తు స్వరూప భావమును అరికట్టును. అట్టి అజ్ఞానాంధకారమునకు జన్మభూమియగు ఈసంసృతి అనెడు ప్రపంచమంతయు సంకల్ప మాత్రముననే ఉద్భవించును. పరమేశ్వకుడు కూడ “ **ఏకోఽహం బహు స్యామ్**” నేను ఒకడను, అనేక మందిని అగుదును.” అని సంకల్పము చేసి సంసారమును సృజించెను. అటులనే, ఓ రాజా! ఏ రాజుకో కూతురు, “ఈమె నా భార్య” అని నీ వనుకొనినంత మాత్రమున నీ భార్య అయినది. ఈ సంకల్ప సృష్టి యే నీ

సుఖదుఃఖములకు కారణము. ఇప్పుడు నీవు ఈ సంసృతి నుండి నివృత్తి పొందగోరుచున్నచో సంకల్పమును మొదటికి పెరికి పాగ వేయుము. సంకల్ప జన్యమగు మమత్వమును విసర్జించుము. అంతట నీకు వస్తువు నందలి మమత్వమును విసర్జించినందున వస్తువుచే ఖేదము కలుగదు. పరమార్థ వస్తువు దేశ, కాలములచే పరిచ్ఛిన్నము కాదు. అట్టి సద్రూపమును, చిద్రూపము అగు బ్రహ్మము నీవే. ఈ తత్త్వము నిరంతరమును చింతించుటద్వారా పరమానంద పదమగు మోక్షమును పొందగలవు.

భర్తృహరి:- మహాత్మా, ఆశ అను నామాంతరము కల సంకల్పమును త్యజించితిని, తమ పాద పద్మములే శరణు.

గోరఖ్:- సుఖముగా నుండుము. సమయానుకూలముగా అమృతీకరణమును పొందెదవు.

స్వా. ని. :-భర్తృహరి శతకమున భర్తృహరి

చెప్పిన "**ధికతాం చ, తం చ, మదనం చ, ఇమాం చ, మాం చ**" అనునది అసత్యమా?

స్వా.ప్ర.:- అది అధిక పాఠము. అట్టివి ఇంకను చాలా ఉన్నవి.

# సద్గతిని సహగమనము చేయు వనిత పొందునా? వైధవ్యముతో జీవితము గడపునది పొందునా?

మూల్వాలా రాజుగారు ప్రశ్నించిరి. సహగమనము చేసిననే సద్గతి కలుగునా? విధవకు కలుగదా?

స్వా. ప్ర. :-దక్షసంహిత చెప్పుచున్నది.

***వ్యాల గ్రాహీ యథా వ్యాలం బలాదుద్ధరతే బిలాత్།***
***ఏవముద్ధృత్య దూతేభ్యః పతిం స్వర్గం ప్రజేత్ సతీ ॥***

"పాముల వాడు బిలము లోనున్న సర్పమును బైటికి లాగికొని ఎత్తుకొని పోవునట్లు

సహగమనము చేసిన వనిత యమదూతల నుండి భర్తను తీసికొని స్వర్గమునకు పోవును.” చనిపోవుచున్న భర్తను యమదూతలు తీసికొనిపోవు చుండగా భార్యకు “నా భర్తను యమదూతలు తీసికొనిపోవు చుండగా నేను ఇక్కడ ఎందుకు ఉండవలెను” అని తోచును. తాను కూడ సహగమనము చేసి భర్తను యమదూతల నుండి లాగికొని స్వర్గమునకు తీసుకొనిపోవును.

ఏ కారణం చేతనైనను సహగమనము చేయనిచో ఆమె తన వైధవ్యమును పూర్తి గా నిర్వహించును.

***“జీవన్తీ చేత్త్యక్త కేశా తపసా శోధయేద్వపుః//”***

“బ్రతికి ఉన్నచో కేశములను విసర్జించి తపస్సుచే శరీరమును పరిశుద్ధము చేయవలెను.” విధవ ధర్మాలను అనుసరించి రంగు బట్టలు, అలంకారములు, సుగంధ పదార్థములు మొదలగు మోహవర్ధకములగు పదార్థములను

త్యజించి చాంద్రాయణాది తపములను చేసి తన శరీరమును శోషింప జేయును.

**“నారాయణాస్య సేవాం కురుతే నిత్యమేవ చ॥”**

“నారాయణుని కూడ నిత్యము సేవించును.”

అనగా నారాయణుని విగ్రహమును ఎదుట నుంచుకొని నవవిధములగు భక్తులతోను నారాయణుని తన భర్తగా, భావించి పూజించును. ఏలనన:-

***విష్ణోః సంపూజనం కార్యం పతి బుద్ధ్యా న చాన్యథా।***

“విష్ణువును భర్తృ భావముతోనే పూజించవలెను. వేరొక విధముగా కాదు” అని చెప్ప బడినది.

## మీరాబాయి పరమాత్మయందు గల భర్తృభావము

మూల్వాలా రాజుగారు మరల ప్రశ్నించిరి:-

మీరాబాయికి భర్త యుండెను. ఆయనను విడచి ఆమె ప్రభువును సేవించినది. ఆమెకు ప్రభువు ఎట్లు లభించెను?

స్వా. ప్ర.:- బాల్య కాలమున మీరాబాయి కొందరు చెలికత్తెలతో ఆడుకొనుచుండెను. ఆడుకొనుచు చెలికత్తెలందరు తాము వరించిన ప్రియుల పేర్లను చెప్పుకొనిరి. ఒకామె తాను వరించిన వ్యక్తి పేరు ప్రతాపసింహుడనెను. మరియొక ఆమె కేసరీసింహుడనెను. ఈ విధముగానే సఖులు అందరును చెప్పిరి. మీరాబాయి వంతు వచ్చెను. ఆమె తలచెను. అయ్యో! అందరకును భర్తలు కలరే. నాకే భర్త లేక పోయెను. “నా కెందుకు లేడు” అని ఆమె దుఃఖించెను. అప్పటికి మీరాబాయి వయస్సు ఏడు, ఎనిమిది సంవత్సరములు. ఆమె తన తల్లిదండ్రులను అడిగెను. “నా స్నేహితురాండ్రు అందరకును భర్తలు కలరు. నాకు భర్త లేరా!”

తల్లిదండ్రులు నవ్వుచు మీరాబాయితో నిట్లనిరి:- “నీ భర్త గిరిధరుడే.” ఈమాట విని మీరాబాయి చాల సంతోషించెను. అందరికంటెను నా భర్త గొప్పవాడని చెప్పుచు ప్రభు పరాయణయగు మీరాబాయి “గిరిధరా, గిరిధరా" అనుచు భక్తి యందు నిమగ్నురాలయ్యెను. ఆమె తండ్రి సర్దారు. ఆయన మీరాబాయి పెండ్లి రాణాతో చేయుటకు ప్రయత్నించెను. ఇది తెలిసికొని మీరాబాయి ఖిన్నురాలయి పలికెను. “మీరు నా పెండ్లి గిరిధరునితో చేసిరి. నా భర్త గిరిధరుడే, ఇదేమిటి ఇట్లు చేయుచున్నారు? నన్ను వ్యభిచారిణిగా చేయుచున్నారా?” అని తాను పెండ్లి చేసికొననని పట్టుబట్టెను. తాను అవినాశియగు ప్రభువును పరిణయ మాడినందున ఇక వివాహము కూడదని పట్టుబట్టెను. ఈవిధముగ మీరాబాయి బాల్యము నుండియు ప్రభువునే భర్తగా తలచి ఆయనయందు భక్తిని కలిగియుండెను. ఆమె దృష్టిలో ప్రభువు తప్ప వేరు భర్త లేనందున భర్తృ

వియోగము కూడ ఆవిడకు లేదు.

అప్పుడు రాజుగారు శ్రీ ప్రకాశానంద స్వామి వారిని ప్రశ్నించిరి. "మరల తమరు ఎప్పుడు దయ చేయుదురు?"

స్వా.ప్ర.:-నా నిర్ణయము ఏమియు లేదు. ఎప్పుడైన ఇటు వచ్చినచో తప్పక వచ్చెదను.

రాజు :— చాతుర్మాస్యలు సమీపించుచున్నవి. తమరు ఇచ్చటనే చాతుర్మాస్యలు గడపిన బాగుండును. తమకు అనుకూలముగా నున్న ఏకాంత ప్రదేశమున ఏర్పాట్లు చేసెదము.

స్వా.ని.:-పీఠిడియాలో ఏకాంత స్థలము లేదు. కావున వారు ఇక్కడ ఉండు అవకాశము లేదు.

రాజు :—కమలేశ్వర మందిరము ఏకాంతముగా నుండును కదా! అది వారికి అనుకూలముగా నుండును.

స్వా. ని. :-కమలేశ్వరమందిరము

చాలదూరము భిక్ష మొదలగువానికి చాల ఇబ్బంది కలుగును.

రాజు :- దాని కేమి? అక్కడనే వండించెదము. వంటమనిషిని, నౌకర్లను ఏర్పాటు చేయుదును. ఇంక లోపము ఏమి?

స్వా. ని. :- నాలుగు వందల సంవత్సరములకు పూర్వము మద్రాసులో ఒక కోటీశ్వరుడగు నగర శ్రేష్ఠి ఉండెను. అతడు మహా ధనవంతుడు. కుబేరుని అవతారము అని జనులు చెప్పుకొనెడి వారు. ఒకప్పుడు ఆయన ఓడ ఒకటి దారి తప్పి తిరిగి రాలేదు. అందులో 60,70 మంది నావికులును, రత్నపరీక్షకులును ఉండిరి. మూడు సంవత్సరముల తరువాత హఠాత్తుగా ఓడరేవు నందలి సైనికుడు ఒక రాత్రి పన్నెండు గంటలకు వచ్చి మీ తప్పిపోయిన ఓడ వచ్చినదని చెప్పను. ఆ ఓడ తప్పుడు మార్గమున ఒక ద్వీపమును చేరెను. ఆ ద్వీపము నందు రత్నపురాళ్ళు లభించెను. ఆ విధముగా విలువగల రత్నశిలలను నింపుకొని ఓడ మూడు

సంవత్సరములకు మరలివచ్చెను. ఇది విని ఆతడు ఆనందముతో పొంగిపోయెను. అతడు బట్టలు వేసుకొని రేవుకు చూచుటకు వెళ్ళెను. ఇంతలో ఆతని గురువునకు ఈ సంగతి తెలిసెను. ఆతడు శ్రేష్ఠి ఇంటికి వచ్చెను. శ్రేష్ఠి భార్య "ఇక్కడే కూర్చొనుడు ఇప్పుడే వచ్చెదరు" అని చెప్పెను. గురువు వెళ్లిపోవలసి యుండెను. ఆయన ఒక తాటాకు తెప్పించి దాని పై "ఒక విరిగిన సూదికూడ నీతో రాదు" అని వ్రాసెను. శ్రేష్ఠి ఇంటికి వచ్చిన తర్వాత ఈ తాటాకు ఇవ్వమని చెప్పి గురువు వెళ్ళిపోయెను. శ్రేష్టి ఓడల రేవు నుంచి ఇంటికి వచ్చి ధోవతిని విడచి కౌపీనముతో స్నానము చేయ కూర్చొనెను. స్నానము చేయుచుండగా గురువుగారి తాళ పత్రమును భార్య ఇచ్చెను. అది చదివి ఆ శ్రేష్టి వెంటనే కౌపీనముతోనే వెళ్లిపోయెను. అచ్చటినుండి ఆతడు సంచారము చేయుచు బదరీగిరి నగరమునకు వెళ్ళెను. అచ్చటి రాజు కూడ ఆతని

దర్శనమునకు వచ్చెను. ఆయన కూడ చినిగిన బట్ట కట్టుకొని అతనితో తిరుగ సాగెను. ఈ స్వామి కౌపీనమును మాత్రమును ధరించెడి వాడు. వారు ఇరువురును ఎక్కడో ఒక చోట దుమ్ములో చెట్టు క్రింద పడి యుండెడి వారు. అక్కడ ఈ స్వామి పట్టణ స్వామి అను పేరుతో వ్యవహరించబడెడు వాడు.

మద్రాసునకు చెన్న పట్టణము అను పేరు కలదు. దానిని ఆధారముగా చేసికొని ఆయనకు పట్టణ స్వామి అను పేరు వచ్చెను. ఆయన సన్యాసిగా మారిన పిమ్మట ఒక పద్యమునందు ఇట్లు చెప్పెను.

“సన్యాసి కుక్క వలె తినవలెను. నక్కవలె తిరుగవలెను. కుక్క ఇంటింటికి తిరిగి ఏది దొరికితే అదితిని సంతోషించును. అటులనే సన్యాసి కూడ మానావమానములను లెక్కచేయకుండ ఏ భిక్ష దొరికిన దానితోనే తృప్తిని పొందును. నక్క ప్రాణులన్నిటికంటెను ఎక్కువ జాగ్రత్త కలది. అందుచే జీవహింస చేయు ఇతర

ప్రాణులు ఏవియు దానిని చంపలేవు. అటులనే సన్యాసి కూడ జగత్తునందు జాగ్రత్తగా ఉండి మాయాపాశనమున చిక్కుకొన రాదు.

# గౌరాంగుడు ఉచ్ఛిష్టాన్నమును ప్రేమతో భుజించెను

స్వా. ని :- బెంగాలులో సప్త గ్రామ జమీందారులగు హిరణ్యదాసుడు, గోవర్ధనదాసుడు అను ఇద్దరు సోదరులు ఉండిరి. వారిలో గోవర్ధన దాసునకునకు ఒక బిడ్డ పుట్టెను. ఆ ఒక్క బిడ్డతోనే ఆతడు చివరకు అమరత్వమును పొందెను. మహాత్ముడగు రఘునాథ దాసునకు తండ్రియగు భాగ్యము ఆ గోవర్ధన దాసునకు కలిగెను. కుటుంబమునకు ఏకైక పుత్రుడయినందున పెదతండ్రికిని, తండ్రికిని కూడ ఆ బాలుని యందు మిక్కుటమగు వాత్సల్యము ఉండెను. బాల్యము నుండియు రఘునాథదాసుడు గంభీరుడు.

వినయవిధేయతలు గలిగియుండెను. సుందరాకారుడు. రాజపుత్రుడగుటచే ఇంకను ఎక్కువగా శోభించు చుండెను. కుమారుని పండితుని చేయవలెనను తలంపుతో తండ్రి బలరామాచార్యుల వద్దకు పంపెను. ఆరోజులలో మహాత్ముడగు హరిదాసుగారు కూడ ఆ ఆచార్యుల వద్దనే యుండి అహర్నిశలు భగవన్నామ సంకీర్తనము చేయుచుండెడి వారు. బాలుడగు ఆ రఘునాధదాసు హరిదాసుగారి ధర్మ నిష్ఠకు ఎంతయో లోబడిపోయెను. వారిరువురును పరస్పరము స్నేహభావముతో నుండిరి. పెద్దవాడైన పిమ్మట రఘునాధుని మనస్సును అనంత వైభవములు ఆకర్షించ లేదు. విషయ భోగములు కామముతో సమానముగా తోచసాగెను. వెండి, బంగారు నాణెములను తన మార్గమునందలి కంటకములతో సమానముగా చూచుచుండెను. రాచకార్యముల యందు ఆతని మనస్సు ఉండెడిది కాదు. రఘునాధ దాసుని ప్రవర్తన చూచి తండ్రికి ఎంతయో విచారముగా

నుండెను. అనేక విధములగు విషయ భోగముల ద్వారా ఆతని మనస్సును ఆకర్షించ ప్రయత్నించెను. కాని అవి అన్నియు వ్యర్థమైన పిమ్మట ఆతనికి ఒక సౌందర్యవతితో వివాహము చేసెను. రఘునాథుడు యువకుడైనందున, పరమ సౌందర్యవతి యగు భార్యను పొంది తన ఔదాసీన్యమును విడనాడి ఆ ప్రేమ పాశమున బద్ధుడగునని తండ్రి ఆశయము. కాని తండ్రి చేసిన ఈ ప్రయత్నము నిష్ఫలమయ్యెను.

ఒక నాడు సమీప గ్రామమగు శాంతిపురము నందలి శ్రీ అద్వైతాచార్యుల వద్దకు గౌరంగ ప్రభులు వచ్చిరని తెలిసికొని రఘునాధ దాసు అచ్చటికి వెళ్ళుటకు అనుమతించమని తండ్రిని కోరెను.

తండ్రి చెప్పెను:— "నాయనా, నీవు ఒక్కడవే నా వంశ దీపము. నీవే మా జీవితమునకు ఆధారము. మహాప్రభువుల దర్శనము చేయవద్దని నేననుట లేదు. వృద్ధుడగు

నేను నిన్ను ప్రార్థించు చున్నాను. నా తెల్ల వెంట్రుకల వైపు చూచి త్వరగా తిరిగి రమ్ము.” రఘునాథుడు చెప్పెను. “తండ్రి! నేనేమి చేయుదును? ఎందుచేతనో ఎవరికి తెలియును? సాంసారిక కృత్యములయందు నా మనస్సు నిమగ్నమగుట లేదు. నా వలన మీకు దుఃఖము కలుగ రాదనియే కోరుచున్నాను. కాని నేను మాత్రము నా వశములో లేను. అయినను నేను తప్పక తమ సేవకు హాజరగదును” ఇట్లు చెప్పి రఘునాథదాసు శాంతి పురమునకు వెళ్ళెను. ప్రభువుల చరణములకు నమస్కరించి సంసార బంధము నుండి విముక్తి, నొందించమని ప్రార్థించెను. ప్రభువులు చెప్పిరి. “ప్రస్తుతము ఇంటికి వెళ్ళుము. మానవునకు కలిగిన క్షణిక వైరాగ్యము కష్టము కలిగినంతనే నశించును. ఇంకను కొన్ని రోజులు ఇంటిలో నుండుము. తరువాత చూడవచ్చును. ఇప్పుడు నేను బృందావనము వెళ్ళుచున్నాను. అక్కడినుండి పూరీజగన్నాథము వెళ్ళుదును. అక్కడ నన్ను

కలసికొనుము.” ప్రభువుల ఈ సమాధానము రఘునాధుని సంతృప్తి పరచెను. ఆతడు ఇంటికి మరలిన. కొన్ని దినముల తరువాత ప్రభువులు పూరి జగన్నాథము వచ్చిరను సంగతి రఘునాధునకు తెలిసెను. అంతట అక్కడకు వెళ్లి ప్రభువులను దర్శించవలెనని రఘునాధుని మనస్సు తొందరపడ సాగెను. నిద్రాహారములు లేవు. ఏదో విధముగా పూరీ వెళ్ళవలెనని తలచెను. బైటకు పిచ్చివానివలె నటించెను. కొంతమంది రఘునాథ దాసును గొలుసులతో కట్టమని సలహా చెప్పిరి. గోవర్ధనదాసు చెప్పెను. “నాయనలారా! రఘు పిచ్చివాడు కాడు. అతని పిచ్చి సంసారిక బంధములను భేదించ గోరుచున్నది. అపారమగు సంపద, సౌందర్యవతి యగు భార్య ఇంట నుంచలేకపోయినచో గొలుసులు ఇంట నుంచగలవా?” ఇట్లు చెప్పి రఘునాథుడు ఆజ్ఞానువర్తి అని తండ్రి ఎరిగియున్నందున నా ఆజ్ఞ కాని, ఆచార్యుల ఆజ్ఞ

కాని లేకుండ ఇంటి నుండి బైటికి వెళ్ళ రాదని విధించెను. ఇంకను తండ్రికి ధైర్యము చిక్కక రహస్యముగా అతనిపై పహరా విధించెను. ఎల్ల వేళల యందును ఎవడో ఒకడు అతనితో నుండెడివాడు. ఒకనాటి సంధ్యా కాలము నందు బలరామాచార్యులు ఏదియో పనియుండి వచ్చిరి. మాట్లాడిన తరువాత ఇంటికి మరలిపోయిరి. రఘునాధుడు కూడ ఆయనతో వెళ్లెను. ఆ సమయమున రఘునాథుని తండ్రిగారు ఎక్కడికో బైటికి వెళ్ళియుండిరి. ఆచార్యులతో కూడ నుండుటవలన రఘునాథుని ఎవ్వరును ఆపలేరు. కూడా ఎవ్వరును రాలేదు. మాటలు చెప్పుచు రఘునాథుడు ఆచార్యుని ఇంటి వరకు వెళ్లెను. రఘునాథుడు పలికెను. “అయితే వెళ్ళుదునా?” ఆచార్యులు చెప్పిరి. “ఓహో! మాటలలో ఏమియు తెలియనే లేదు. ఇంటినుండి చాలా దూరము వచ్చి వేసితివి. వెళ్ళుము. వెంటనే వెళ్లి చేయదగిన పనిని చేయుము.” ఇది గురువాజ్ఞగా భావించి రఘునాథుడు అచ్చటినుండి తిన్నగా పూరీ

వెళ్ళెను. వైరాగ్య భూషణుడగు రఘునాధ దాసు పూరీ వచ్చి గౌరాంగ ప్రభువుల చెంత నుండెను. వారి ప్రసాదమునే ఐదు రోజుల వరకు తీసికొనెను. కాని ఇది తగదు అనుకొనెను. జగన్నాథుని మందిర సింహద్వారమున భక్తులు ప్రసాదమును భిక్షకులకు పంచిపెట్టెదురు. ఇది తెలుసుకొని భిక్షుకుల మధ్య కూర్చొని దొరికిన దానితో సంతృప్తి పడుచుండెను. భిక్షకుల గుంపు త్రోపడి వలన ఒక్కొక్కప్పుడు రఘునాధునకు ప్రసాదము కూడ దొరకెడిది కాదు. అప్పుడు స్వస్థానమునకు వచ్చి జలమును మాత్రము త్రాగి వెళ్ళెడివాడు. నాలుగైదు రోజుల తరువాత గౌరాంగప్రభువు “రఘునాధుడు ఇక్కడ భోజనము చేయుట లేదు , ఎక్కడ తినుచున్నాడు” అను సందేహము కలిగి ఒక భక్తుని అడిగెను. సింహద్వారము వద్ద భిక్షకులతో పాటు కూర్చొని అడిగికొని లభించినది తినుచున్నాడని భక్తుడు చెప్పెను. గౌరాంగుడు ఎంతయో ఆనందించి

చెప్పెను. "నిజముగా రఘువు రత్నము. ఆతనికి నిజమగు వైరాగ్యము కలదు. గౌరవము, ఇంద్రియ భోగములు, రుచి, సిగ్గు మొదలగు వానిని ఆతడు లక్ష్య పెట్టుట లేదు. సన్యాసి జీవితము గడపుచు పరాధీనుడుగా నుండు వాడు కుక్కతో సమానము. సన్యాసి భిక్ష చేసి భుజించుటయే యుక్తము. కొంత కాలమైన తరువాత ఒక మనుష్యుడు రఘునాథదాసు తండ్రి తెలిపెను. "కొద్ది రోజులకు పూర్వము వేలకొలది జనులకు యజమాని అయి, వేలకొలది మందిచే తన ఆజ్ఞలను పాటింప జేయు నీ కుమారుడు రఘునాథుడు ఇప్పుడు ముష్టి వేసిన అన్నము కొరకు జగన్నాథుని సింహద్వారమున గంటల కొలది నిలబడి ఉండును. " తండ్రి చెప్పెను. "ఇంత వైరాగ్యముల కుమారుడు నాకు కలిగినందున నేను ధన్యుడను." అనంతరము తండ్రి ఒకనికి నాలుగు వందల రూపాయలు ఇచ్చి పూరీ పంపెను. వంటమనిషిని, నౌకరును ఉంచి రఘునాథుని భోజనముకు అన్ని ఏర్పాట్లు

చేయమనెను. (నాలుగు వందల రూపాయలు అనగా ఆరోజులలో ఒక మనిషికి ఒక మాసమునకు ఎనిమిది అణాలు సరిపోవు చుండెడివి.) సేవకుడు పూరీ వెళ్ళి రఘునాధునకు అన్ని సంగతులను తెలిపెను. రఘునాధుడు ఆలోచించెను. ఇంటిని, కుటుంబమును, పరివారమును సమస్తమును త్యజించిన నాకు తండ్రి పంపిన రూపాయలతో పని ఏమి? ఈ సమయమున రూపాయలు తీసుకొనుట అధర్మము.

భాగవతమున వ్రాయబడినది:-

***"యః ప్రవ్రజ్య గృహాత్ పూర్వం త్రివర్గావపనాత్ పునః |***
***యది సేవేత తాన్ భిక్షుః స వై వాన్తాశ్యపత్రపః //***

ధర్మము, అర్థము, కామము అను మూడు పురుషార్థములను ఇచ్చు గృహస్థాశ్రమము నుండి- ఇంటినుండి బయటకు వచ్చి సన్యాసము

తీసుకొనిన తరువాత గృహస్థ ధర్మములను - విషయాదులను సేవించినచో సన్యాసికి సిగ్గు లేదని చెప్ప వచ్చును. అతడు కక్కిన కూడు తినుచున్నాడు. కావున నేను ఆ డబ్బు స్పృశించుట కూడ తగదు." ఇట్లు తలచి సేవకుని ఇంటికి త్రిప్పి పంపెను. జనులు ఆతనిని గుర్తించిరి. అందుచే ఆతనికి భిక్ష అధికముగా లభించుచుండెను. ఇది కాంచి భిక్షాటనమును మానివేసెను. అంతటి నుండి భిక్షుకులతో బాటు క్షేత్రమునకు వెళ్లి ప్రసాదమును తీసికొని వచ్చెడివాడు. ఈ సంగతులు గౌరాంగ ప్రభువులకు తెలిసెను. వారు చెప్పిరి. "రఘు సర్వోత్తమమగు పని చేసెను. సింహద్వారము ముందు భిక్షకొరకు వేచి యుండుట వేశ్యావృత్తి. నోటితో నామజపము చేయుచున్నను చిత్తమునందు ఆ వృత్తి యే ఉండును. ఎవడైన భిక్ష వేసినచో బాగుండునని తోచును." ఇట్లు జరుగుచుండగా రఘునాధుడు ఒకమారు అన్న క్షేత్రమునకు వెళ్లి భిక్ష తీసికొనివచ్చి నామ

సంకీర్తనము చేయుచుండెను. ఇంతలో స్వరూప గోస్వామి అచ్చటకు వేంచేసిరి. వారు అడిగిరి. "రఘు సింహద్వారము చెంత భిక్ష ఎందుకు మానివేసెను?" సంగతి తెలిసికొని స్వరూపగోస్వామి పలికిరి. "చాల చిత్రము, వైరాగ్యమునందు ఏమాత్రము లోపము కన్పించినను వెంటనే ఆపని మానివేయును, సింహ ద్వారము నందలి భిక్షలో ఆయన ఏదియో దోషమును కాంచి ఉండ వచ్చును."

ప్రభువు పలికిరి:- "ఇందుకు నేను ఎంతయో సంతోషించు చున్నాను." రఘునాథ దాసు తనవద్ద ఒక చినిగిన బొంత మాత్రము ఉంచుకొనెడివాడు. రోజుకు రెండు గంటలు మాత్రమే నిద్రించెడివాడు. మిగిలిన సమయమంతయు ఇష్ట దేవతా స్మరణముతో గడపెడివాడు.

ఆయన తితిక్ష, సహనశీలత, జిహ్వా

సంయమము, అకించనత్వము హద్దులను దాటి యుండెను. అన్న క్షేత్రము సందు కూడ ఆయనకు పార తంత్ర్యము కానవచ్చుచుండెను. క్షేత్రాధికారులు ఆయనకు ఎక్కువగా భిక్ష పెట్టుచుండిరి. అందుచే అన్న క్షేత్రమునకు వెళ్ళుట కూడ మానివేసెను. జగన్నాధము నందలి దుకాణములలో భగవానుని ప్రసాదము అమ్ముచుందురు. రెండుమూడు రోజుల వరకు అమ్ముడు అవని ప్రసాదము కుళ్ళిపోవును. కుళ్ళిన ప్రసాదము వీధులలో పారవేయుదురు. పూరీలో పెద్ద పెద్ద తెలుగు ఆవులు చాల ఉండును. కడుపు నిండ ఈ అన్నము తినిన తరువాత ఆవులు మిగతా అన్నమును వదలి వేయును. సాయంకాల సమయమున రఘునాధదాసు వెళ్లి ఈ అన్నము తీసికొని నీటిలో కడిగి కొనెడివాడు. బెడ్డలు, రాళ్లు ఉన్నచో ఏరి పార వేసిడి వాడు. తరువాత దీనిలో బెల్లము కలుపుకొని తినెడివాడు. ఈ విధముగా తన రోజులు గడిపెడివాడు. ఒకరోజున రఘునాధదాసుని ప్రవర్తన అంతయు ఎవరో

ప్రభువునకు తెలిపిరి. వారి ఆనందమునకు అంతు లేదు. ఆ రోజు సాయంకాలమే ఆయన రఘునాథ దాసు ఉన్న చోటికి వెళ్లిరి. అప్పుడు అతను తన రుచికల పైన చెప్పబడిన భోజనమును భుజించుచుండిరి. గౌరాంగ ప్రభువులు నెమ్మదిగా అచ్చటకు వెళ్ళి వాని వెనుక నిలబడిరి. తన వెనుక ఎవరో ఉన్న సంగతి రఘునాధునకు తెలియదు. ఆయన ఒక కబళము నోటిలో నుంచుకొను సమయమున ప్రభువులు నెమ్మదిగా ఇట్లు పలికిరి. ఏమయ్యా, ఇంత రుచికల పదార్థమును కూడ ఒంటరిగా ఎవరికిని తెలియకుండ తినుచున్నావే? నాకు కొంచెము ఇవ్వవా?

ఇట్లు పలికి ప్రభువులు వాని పాత్రము నుండి తొందరగా ఒక గుప్పెడు అన్నము తీసికొని తన నోటిలో పెట్టుకొనెను.

"అయ్యో! అయ్యో" అనుచు అత్యంత కరుణార్ద్ర స్వరముతో ఏడ్చుచు ఆ పాత్రను రెండు చేతులతోను మూసివేసి రఘునాథుడు పలికెను.

“ప్రభూ, తమరు ఇదేమి చేయుచున్నారు? స్వామీ! ఈ అన్నము తమకు తగదు. ఈ కుళ్ళిన ఉచ్ఛిష్టాన్నమును తిని నన్ను పాపాత్ముని చేయకుడు.”

ఇంతలో నోటిలో నుంచుకొనిన ముద్దను తినివేసి గౌరాంగుడు రెండవ ముద్దకొరకు చేయి చాచెను. ఈ గంద్రగోళము విని స్వరూప గోస్వామి కూడ అచ్చటకు వచ్చిరి. ప్రభువులు రఘునాధదాసుని దగ్గర నుండి అన్నము తీసికొనుట చూచి వారి చేతులు పట్టుకొని స్వరూపగోస్వామి వారు ఇట్లు పలికిరి. “ప్రభూ ఇది తమకు తగదు.” వారు ఆ కుళ్లిన అన్నమును మ్రింగుచు ఇట్లనిరి. “స్వరూప్ జీ! నేను నిజము చెప్పుచున్నాను. నేటి అన్నము నాకు ఉన్నంత రుచిగా మరి ఏ పదార్థమును ఎప్పుడును ఉండలేదు.”

వైరాగ్యమనగా ఇదియే.

కావున తమరు మహా దేవ మందిరములో

వంట ఏర్పాటు చేసెద మనిన ప్రకాశానంద స్వామి వారు ఎట్లు అంగీకరింతురు?

స్వా. ప్ర. :– పూర్వము కాషాయవస్త్రములు ధరించి చాతుర్మాస్యలు చేయుచుండెడి వాడను. ఇప్పుడు ఒక స్థిరమగు చోటు లేదు. స్థిరముగా నుండను. చాతుర్మాస్యలు కూడ చేయుట లేదు.

స్వా.ని. :-తమవంటి వారలకు చాతుర్మాస్యల బంధము ఉండదు.

స్వా. శంక రా. :—(వినోదముతో) సన్యాసులు చాతుర్మాస్యలను పాలించవలెనే? లేనిచో స్వచ్ఛందులని చెప్పబడెదరు.

స్వా. ప్ర. :-- (వినోదముతోనే) సన్యాసులు చాతుర్మాస్యలను పాలించుట కంటె ముఖ్యము ధనాదులయందు అప్రతిగ్రహమును కలిగియుండుట. ముఖ్యమైన వాటిని మీరు పాలించుట లేదు. పైగా గౌణములగు చాతుర్మాస్యాదుల యందు మీరు పట్టుదల కలిగి యున్నారు. ఒకాయన భైయాజీ (అతి

చాదస్తులను భైయాజీ అందురు) ఎడమచేయి బైట ఉంచుకొని ఒంటి చేతితో వంట చేసిన భుజించెడి వాడట. ఒకడు ఇది చూసి అడిగాను. ఏమండీ వంట చేయునప్పుడు ఈ ఎడమ చేయి దూరముగా ఎందుకు ఉంచుచున్నారు?

భైయాజీ:—ఇది అపవిత్రములుగు కార్యములు చేయును. అందుచే బైట ఉంచుచున్నాను.

మనుష్యుడు :—అపవిత్ర కార్యము చేయు చేతిని బైట ఉంచుచున్నారు. కాని అపవిత్రములగు పదార్థములను (మల మూత్రాదులను) లోపలనే ఉంచుకొనుచున్నారే! ఆ అపవిత్ర పదార్థములను కూడ బైటనే ఉంచి కూర్చొన రాదా?

అందరు నవ్విరి.

ఇదేవిధముగా శంకరానంద స్వాములు అత్యంత నిషిద్ధమైన దానిని (ధనమును) ఇష్ట

దేవునిగా భావించి కూర్చొని యుండిరి.

స్వా. శం. :- "నేను ధనము ఉంచుకొనను. నేను కాగితపు నోట్లు ఉంచుకొనెదను. అవి ఉంచుకొన రాదను నియమము సన్యాసులకు లేదు.

ఇది విని అందరు ఇంకను నవ్విరి.

రాజుగారు :- (నిత్యానందుల వైపు చూచి) బాపూజీ ఏ సత్కారము చేసినను ఏమియు స్వీకరించరు. ఒంటరిగా డబ్బు లేకుండా ఎక్కడకు వెళ్లినను వారికి శ్రమ ఉండదా?

స్వా. ని. :-మన దృష్టికి అట్లుండును. శంకరభగవత్పాదుల వాక్యములు పరికింపుడు :-

***నిర్ధనోఽపి సదా తుష్టోఽప్య సహాయో మహా బలః|***
***నిత్య తృప్తోఽప్యభుఞ్జానోఽప్యసమః సమదర్శనః||***

"జ్ఞాని ధనము లేకపోయినను ఎల్లప్పుడును సంతృప్తితో నుండును. కూడా ఎవరు లేక

పోయినను ఆతడు మహాబల సంపన్నుడే. విషయ పదార్థములను అనుభవించక పోయినను ఆత్మ రసముచే తృప్తితోనే ఉండును. సర్వత్ర సమదృష్టితో నుండుటచే ఆయనతో సామాను డెవ్వడును ఉండడు.

స్వా. ప్ర:- స్వామి! తమరు నన్ను అట్టి వ్యక్తితో సాటి వానిగా తలచుట నాకు యుక్తముగా తోచుట లేదు.

స్వా. ని. :- అదేమి కాదు. మిమ్ములను గూర్చి నేను ఏమియు చెప్పుట లేదు. ప్రసంగము వచ్చినందున జ్ఞాని లక్షణము చెప్పుచున్నాను. రాజులకు కూడ కలుగని ఉత్తమ స్థితిని గురించి చెప్పు చున్నాను. వీరందరు రాజ్య భోగములతో మహదానందము పొందుచున్నా మనుకొనెదరు. కాని వీరికి రాజ్య వైభవములను విసర్జించిన నాడే యథార్థముగా ఆనందము కలుగును.

శాస్త్రములు కూడ ఘోషించుచున్నవి.

***రసం బ్రహ్మ వివేద్యశ్చ తృప్తో యః పరమాత్మని/
ఇన్ద్రంచ మన్యతే రజ్యం నృపాణాం తత్ర కా కథా //***

"బ్రహ్మానందమను రసమును అనుభవించిన వాడు, పరమాత్మను పొందుటచే ఆనందించిన వాడు ఇంద్రుని ఆనందమును కూడ అతి క్షుద్రముగా భావించును. ఇక రాజుల ఆనందము సంగతి చెప్ప నేల?"

స్వామి శ్రీ ప్రకాశానందులవారు వెళ్లుటకు ప్రయత్నము చేసినప్పుడు రాజుగారు తన మనిషికి చెప్పిరి. "మొన్ననే తెప్పించిన కొత్త మోటారు తీసికొని రమ్ము," మోటారు వచ్చిన తరువాత స్వామివారిని అందు కూర్చుండ బెట్టి రాజుగారు పలికిరి. "స్వామీ! ఇది చాలా మంచి మోటారు. మొన్న మొన్ననే క్రొత్తగా తెచ్చితిమి."

స్వా. ప్ర. :— నేను వెళ్లిన ప్రతి చోట చిన్న చిన్న పిల్లలు నా వద్దకు కార్లు, రైళ్లు మొదలగు

ఆటవస్తువులను తీసికొనివచ్చి ఆడుచుందురు. చిన్న వాళ్ళకు చిన్న బొమ్మలు, పెద్ద వాళ్ళకు పెద్ద బొమ్మలు.

ఇది విని స్వామి నిత్యానందుల వారు నవ్వుచు ఇట్లనిరి. "నిజమే. మీ మనస్సునకు మోటారు వాహనము. స్వామి వారి మనస్సునకు మాత్రము అది ఆడుకొను బొమ్మ."

అనంతరము స్వామి నిత్యానందుల వారి ఆజ్ఞ తీసుకొని స్వామి ప్రకాశానందుల వారు మొదలగు వారు అందరును రాజకోట వెళ్లిరి.

ॐ

# ఇరువది నాలుగవ ప్రసంగము

శ్రీ ప్రకాశానందుల వారు గోండలులో ఉన్నపుడు జూనాగఢ్ నుండి ప్రొఫెసర్ మహాదేవమల్లార్ జోశీ వారి దర్శనమునకు వచ్చిరి. ఆయన స్వామివారిని జూనాగఢ్ దయ చేయమని ప్రార్థించిరి. కొద్ది రోజుల తరువాత వచ్చెదనని స్వామివారు చెప్పిరి. పీఠడియా మార్గ మధ్యమున ఉన్నది. అక్కడ దిగి శ్రీ నిత్యానంద స్వామి వారి దర్శనము చేసికొని వచ్చెదమని సెలవిచ్చిరి. ఇది విని ప్రొఫెసరు గారు ఇట్లనిరి:- నేను కూడా వారి పేరు వింటిని. కాని దర్శనము మాత్రము చేయలేదు, నేను కూడ అక్కడికి వచ్చి అచ్చటినుండి తమను తీసికొని జూనాగఢ్ వెళ్ళెదను. మూడు రోజుల తరువాత స్వామి శ్రీ ప్రకాశానందుల వారు, ఉదయశంకర వకీలు, దయాశంకర భాయి ముప్వురును ఉదయపు రైలు

బండిలో పీఠడియా వెళ్లిరి. ఆ సమయమున శ్రీ నిత్యానంద స్వామివారి ఆశ్రమ ద్వారమునకు బయట తాళము వేసియుండెను. కావున అచ్చటి మనుష్యుడు తాళము చెవి తీసుకొని వచ్చుటకు వెళ్ళెను. శ్రీ స్వామివారును, ఉదయశంకర వకీలును అచ్చటి అరుగుపై కూర్చొనిరి. ఆ సమయమున శ్రీ స్వామి వారు చెప్పిరి.

భాగవతమునందు చెప్ప బడినది.

గృహస్థస్య క్రియాత్యాగో వ్రతత్యాగో వటోరవి |

తపస్వినో గ్రామసేవా భిక్షోరి న్ద్రియలోలతా||

గృహస్థుడు కర్మను త్యజించినను, బ్రహ్మచారి బ్రహ్మచర్య వ్రతమును త్యజించినను, వానప్రస్థుడు గ్రామములయందు నివసించినను, సన్యాసి విషయాసక్తుడైనను,

***ఆశ్రమాపసదా హ్యేతే ఖల్వా శ్రమవిడమ్బకాః /***

***దేవమాయావిమూఢాంస్తాన్ ఉపేక్షేతానుకమ్పయా॥***

అట్టి వారు ఆశ్రమాడంబరమును చేయు వారును, ఆశ్రమవాసులలో అధములు అగుదురు. జ్ఞానియగు పురుషుడు ఈశ్వరమాయా నిమగ్నులయిన అట్టి వారిని ఉపేక్షా భావముతో చూచును.

నేను ఇంకను ఇంద్రియలోలుడనే. కావుననే స్వామివారు నా యందు ఉపేక్ష భావము వహించి నాకు దర్శనము ఇచ్చుట లేదు.

ఉదయశం:- తమరు ఇట్లు చెప్పుచున్నా రేమి? నిత్య, నైమిత్తికాది ఐహిక కర్మలను నేను ఆచరించుట లేదు. పై వాక్యములు నాకు సంబంధించును.

స్వా. ప్ర. : ఇప్పటి బ్రాహ్మణులు శిలోంఛవృత్త్యాది సాధనములు లేనందున రోజంతయు వ్యావహారిక జీవితమున గడప వలసి వచ్చుచున్నది. ఇక నిత్య, నైమితికాది ఐహిక

కర్మము ఎట్లు ఆచరించగలరు? సన్యాసులనే ప్రమత్తులుగా పేర్కొనవలెను. ఇంతలో ఆశ్రమ ద్వారము తెరువబడెను. స్వాములు ఇరువురు ఒకరి నొకరు కుశల ప్రశ్నలు వేసిరి. స్వామి ప్రకాశానందులవారు తమతో కూడ వచ్చిన వ్యక్తులను శ్రీ నిత్యానంద స్వామి వారికి ఎరుక పరచిరి.

సాయంకాలము నాలుగు గంటలకు అందరును టీ తీసికొని కూర్చొనిరి. ఆ సమయమున ఉదయశంకర వకీలు నిత్యానందుల వారిని ప్రశ్నించెను.

"నేను చాల కాలమునుండి సంధ్యా వందనాది నిత్య కర్మములను ఆచరించుచున్నాను. అయినను అంతఃకరణము శుద్ధి నొందుట లేదు. ఇందుకు కారణ మేమి?"

# జీవిత నిర్వహణ సాధనమునకును అంతఃకరణమునకును గల సంబంధము

స్వా. ని. :- మీరేమి చేయుచున్నారు?

ఉదయ :- వకీలు వృత్తిని.

## రాజస ప్రకృతులు పది రకములు.

స్వా.ని. :- పూర్వకాలము వకీలు వృత్తి లేదు. రాజస స్వభావములు రాజనీతి ప్రకరణమున పది రకములుగా చెప్పబడినవి.

1. పురోహితుడు (వేదోక్త కర్మములను ఆచరింప జేయువాడు) 2. ప్రతినిధి, 3. ప్రధాని, 4. సచివుడు, 5. మంత్రి, 6. పండితుడు, (రాజుకు చెప్పదగిన రహస్యములను చెప్పువాడు) 7. ప్రాడ్వివాకుడు, (న్యాయాధిపతి) 8. అమాత్యుడు, (ప్రధానికి సహాయపడువాడు అనగా ఉపప్రధాని) 9. సుమంత్రుడు, 10. దూత,

సుదూత, పరమ సుదూత అని.

వీనియందు వకీలు వృత్తి చెప్పబడలేదు. పూర్వము విద్యాభ్యాసము చేయు అలవాటు ఉండుటచే వకీలు అవసరము లేకుండెను. ఈ రోజులలో విద్యాభ్యాసము తగ్గి రైతులు మొదలగు బీదవారికిని, రాజులకును, రాజోద్యోగులకును కల సంబంధములు హీనముగా నుండుటచే ప్రజలు భయభ్రాంతులును, అజ్ఞానులును అయిపోయిరి. కావున అధికారి సామాన్యజనుని కార్యవశమున ఏదైన ప్రశ్న అడిగినచో తగిన సమాధానము చెప్ప లేకపోవుచున్నాడు. భయ పెట్టి అడిగినచో మాట్లాడడు కూడను. ఈవిధముగ నేరములు మొదలగువానిని నిర్ణయించుటలో యథార్థము తెలిసికొనుట కష్టము. అట్టివారి యథార్థ విషయములను న్యాయాధికారికి తెలుపుటకు ప్రయత్నించు వ్యక్తులు నేటి వకీళ్ళు. ఈవృత్తి యందుకూడ వారి పరిశ్రమకు తగిన ప్రతిఫలము తీసి కొనుట ధర్మము. అంతేకాని న్యాయశాస్త్రం ఆడంబరముతో నిజమును

అబద్ధముగా ఋజువు చేసి ఇష్టము వచ్చిన డబ్బు గుంజుకొనుట వృత్తికాదు. ఈ కాలము నందలి వకీలు వృత్తిలో ఈ తప్పు పనులు తప్పని సరిగా జరుగుచున్నవి. మీ జీవనోపాయము పరిశుద్ధముగా నుండదు. శుద్ధమగు జీవనోపాయము లేనందున అంతఃకరణము పరిశుద్ధముగా నుండదు.

వృత్తిని గురించి మనుస్మృతియందు కొన్ని శ్లోకములు గలవు. అవి నాకు కంఠస్థము కావు. మనుస్మృతి తెరచి వాటిని వివరించిరి.

***అద్రోహేణైవ భూతానామల్ప ద్రోహేణ వా పునః |***
***యా వృత్తిస్తాం సమాస్థాయ విప్రో జీవేద నాపది||***

“బ్రాహ్మణుడు ఆపత్కాలమున ఏ ప్రాణికిని ద్రోహము చేయని వృత్తిని అవలంబించవలెను. అది వీలు కానిచో వీలైనంత తక్కువ ద్రోహము కలుగునదియే ఆచరించవలెను. అట్టి వృత్తితో

జీవితము గడుపుకొనవలెను.

***యాత్రామాత్ర ప్రసిద్ధ్యర్థం స్వైః కర్మభిరగర్హితైః|***
***అక్లేశేన శరీర స్య కుర్వీత ధన సంచయమ్ ||***

తన ప్రాణ రక్షణము కొరకు నింద్యము కాని కర్మలను ఆచరించి, శరీరమును బాధించకుండ ధనమును సంపాదించవలెను.

***ఋతా మృతాభ్యాం జీవేత్తు మృతేన ప్రమృతేన వా/***
***సత్యానృతాభ్యామపి వా న శ్వవృత్త్యా కదాచన||***

"జీవితము అంతటను ఋతము, అమృతము, మృతము, ప్రమృతము, సత్యము, అనృతము వీనిని దృష్టిలోనుంచుకొని జీవితము గడపవలెను. కాని కుక్కవలె జీవితము గడపరాదు."

ఋత ముఞ్ఛశిలం జ్ఞేయం అమృతం స్యాదయాచితమ్ |

మృతం తు యాచితం భైక్షం ప్రమృతం

కర్షణం స్మృతమ్||

ఉంఛము, శిలము అని ఋతము రెండు రకములు. ఉంఛ వృత్తితో జీవితమును నిర్వహించు కొనదలచినచో ఎవరికిని హాని కలుగని విధముగ త్రోవలోను, పొలములోను మిగిలిన ధాన్యమును ఒక్కొక్క గింజ చొప్పున ఏరుకొని వానిని ఉపయోగించు కొనవలెను. ఇది సర్వ శ్రేష్ఠమగు వృత్తి.

## రెండవరకపు వృత్తి

శిలవృత్తి అనగా ధాన్యపు వెన్నులను సంపాదించి గింజలను ప్రోగు చేయుట. ఈవృత్తి రెండవ తరగతికి చెందినది

ఈ రెండు వృత్తుల యందును కపటమునకు తావు లేదు. ఈ రెండు వృత్తులను 'ఋతము'. అని చెప్పెదరు. ఋత మనగా సత్యము. అడుగనిదే శ్రద్ధాసక్తులు కలవారు ఇచ్చినది 'అమృతము'. ఇది కూడ ఉత్తమమైన వృత్తియే. భిక్షాటనము చేసి కొంచెము కొంచెము

సంపాదించుట 'మృతము' అన బడును. ఇది సాధారణమైన వృత్తి. ఏలనన, అందు అడుగుకొనవలసియున్నది. వ్యవసాయం చేసి జీవితమును గడుపుకొనుట 'ప్రమృతవృత్తి'. అందు చాల పరిశ్రమ చేయ వలసివచ్చును. బ్రాహ్మణ జీవితమునకు లక్ష్యములయిన అధ్యయనాధ్యాపనములకు అంతరాయము కలుగును.

***సత్యానృతం తు వాణిజ్యం తన చైనాపి జీవ్యతే/***
***సేవా శ్వవృత్తి రాఖ్యాతా తస్మాత్తాం పరివర్జయేత్ //***

వ్యాపారము చేసి జీవితము గడుపుకొనుట 'సత్యానృత' వృత్తి అనబడును. నౌకరీ చేసి జీవితము గడపుకొనుట శ్వవృత్తి. కావున ఆ శ్వవృత్తిని త్యజించవలెను. ఆపద్ధర్మముగా జీవితమును గడపుకొనుటకు వాణిజ్యమును గ్రహించవచ్చును.

ఉదయ:— తమరు సెలవిచ్చినట్లు

పూర్వము జనులు శిలోంఛ వృత్తులతో జీవితము గడిపెడివారు. కాని కాలక్రమమున ఆ వృత్తులు పోయినవి. పూర్వకాలమున మనుష్యులు తక్కువ, పంటలు ఎక్కువ. రైతులు కొంత భాగం మాత్రమే పంటచేల నుంచి తీసికొని వెళ్ళెడివారు. మిగిలినది చేనులోనే విడచెడివారు. జనులు ఆ పంట నుండి శిలోంఛ వృత్తి ద్వారా తమ జీవితమునకు కావలసిన ఆహార ధాన్యములను సంపాదించెడివారు. ఇప్పుడు భారత దేశపు జనాభా పెరిగిపోయినది. ఆహార ధాన్యములు ఆప్రకారము పండుట లేదు. కావున శిల ఉంఛ వృత్తి ప్రస్తుతము జీవితము గడపుకొనుట అసంభవము. కాలధర్మ వశమున జనాలు ఏదోరీతిని పొట్ట పోషించు కొనవలసి వచ్చుచున్నది. డబ్బు సంపాదించుటకు వేరువేరు వృత్తులు చేయ వలసి వచ్చుచున్నది. వకీలు వృత్తితో అబద్ధములాడి సంపాదించినచో జీవితము శుద్ధ మైనది కాదని నాకు తెలియును.

కాని ఏమి చేయుదును? ఈ వృత్తిని విడిచి పెట్ట లేను కదా! అయినను నాకు తెలిసి నంత వరకు అసత్యపు కేసులు తీసికొనుట లేదు. పొరబాటున అబద్ధపు కేసు తీసికొనినచో తెలిసిన వెంటనే వారి డబ్బు వాపసు ఇచ్చి కేసు విడచి పెట్టు చున్నాను తప్పుడు ద్రోవను డబ్బు సంపాదించినచో ఆ ఫలితము నేను అనుభవించ వలసివచ్చును అని నేను ఎరుగుదును.

## చేసినది అనుభవించవలెను

స్వా. ప్ర. :-

ఏకః పాపాని కురుతే ఫలం భుజ్క్తే మహాజనః|

భోక్తారో విప్రముచ్యన్తే కర్తా దోషేణ లిప్యతే ||

“పాపము ఒకడు చేయును. దాని ఫలమును అందరు అనుభవించెదరు. అనుభవించిన వారు పాపమునుండి తప్పించుకొనెదరు. కాని చేసిన వాడు మాత్రము

ఆ దోషము నుండి తప్పించుకోలేదు.”

వాల్మీకి ఋషి బ్రాహ్మణ కుటుంబమున జన్మించి యుండెను. కాని బాల్యము నుండియు భిల్లుని ఇంట పెరిగెను. భిల్లులే తల్లిదండ్రు లనుకొనెడివాడు. ఆతడు భిల్ల వృత్తినే అవలంబించెను. కుటుంబ పోషణమునకు బిల్లులవలె దారిలో పోవు బాటసారులను కొట్టుచుండెను. ఆ మార్గము భయంకరమైనదని తెలిసికొని ఎవరును ఆ దారిని వెళ్ళెడి వారు కారు.

కాని దైవేచ్ఛచే సప్తమహర్షులు ఆ దారిని వచ్చిరి. వాల్మీకి వారిని “వస్త్రములు, పాత్రలు ఇవ్వండి, లేనిచో చంపి వేయుదు” నని చెప్పెను.

ఋషులు:_ మాకు చచ్చిపోయెదమని కాని, మా వస్త్రాదులు నీవు తీసికొనెదవని కాని భయము లేదు. మాకు అహంకార, మమకారములు కలుగవు. నీవు చంపిన చచ్చు వారము కామని మాకు తెలియును. ఏలనన

చచ్చుట శరీర కార్యము. కాని నీవు ఇంత మహాపాపము చేయుచున్నావు కదా! దానిని అనుభవించువారు మరియొకరు కలరా? నీవు పాపము కుటుంబము కొరకు చేయుచున్నావు. కావున నీ కుటుంబము నందలి జనుల వద్దకు వెళ్ళి వారు ఈ పాపము పంచుకొనెదరేమో అడుగుము.

వాల్మీకి:- మీరు తప్పించుకొనుటకు ఈ యుక్తి పన్నుచున్నారు.

ఋషులు:- దోచెదవను భయము మాకు లేదు. మేము నీకు కలుగు పాప భారమునందు దయకలిగి చెప్పితిమి. నీవు ఇంటికి వెళ్ళి అడిగి రమ్ము. మేము ఇక్కడే నిలబడి యుండెదమని ప్రమాణము చేయుచున్నాము.

వాల్మీకికి పూర్వ జన్మ సంస్కారము స్ఫురించి వారి మాటలు నచ్చినవి. ఆతడు ఇంటికి వెళ్లి భార్యాబిడ్డలు పాపమును పంచుకొనెదరేమో తెలిసికొనెను.

వారు చెప్పిరి. "చేసినవాడు అనుభవించవలెను. మాకేమి? మమ్ము పోషించుట నీ కర్తవ్యము, నీవు ఏ విధముగనైన సంపాదించుము. ఆ పాపము నందలి భాగముతో మాకేమి సంబంధము?"

ఈ విధముగా ఇంటిలోని వారు అందరును పాపమును పంచుకొనుటకు అంగీకరించ లేదు. తన పాపమునకు భాగస్థుడు మరి యొకడు లేడను సంగతి వాల్మీకి తెలిసికొనెను. అకార్యములను ఆచరించుటయందు విరక్తి కలిగెను. ఆతడు మహర్షుల చరణముల యందు పడిన వాడై వారి సదుపదేశమును తెలిసికొని పూర్ణ యోగ్యతను పొందెను. జగమునకు అపూర్వ ఆదర్శమును చూపించెను.

ఉదయ: — శుద్ధమగు వృత్తి తప్ప అంతఃకరణ శుద్ధి కొరకు మరియొక సాధనము ఏదైన కలదా?

# నిష్కామ కర్మచే కూడ అంతఃకరణము శుద్ధిని పొందును

స్వా. ని. :-- నిష్కామ భావముతో కర్మ చేయుటచే కూడ అంతఃకరణము శుద్ధి పొందును.

నిష్కామకర్మ అనగా కర్తవ్యదృష్టితో ఫలేచ్ఛ లేకుండ భగవత్ప్రీతి కొరకు మాత్రము కర్మ చేయుట. అనగా మనో, వాక్కాయములతో చేయు కర్మ.

***యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్/***
***యత్త పస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్// గీత. 9 అ.***

"నీవు ఏమి చేసినను, ఏమి తినినను, ఏవి హోమము చేసినను, ఏది దానము చేసినను, ఏ తపము చేసినను అంతయును నాకు అర్పించుము."

ఇంతలో ప్రొఫెసర్ జోషీ జూనాగఢ్ నుండి

ఇద్దరు విద్యార్థులతో వచ్చిరి. శ్రీ ప్రకాశానందులవారు శ్రీ నిత్యానందుల వారికి ప్రొఫెసరుగారిని పరిచయము చేసిరి. అప్పుడు ప్రొఫెసరుగారు నిత్యా నందుల వారితో పలికిరి. “తమ పేరు చాల కాలమునుండి వినుచున్నాను. స్వామి ప్రకాశానందులవారు ఇక్కడికి వచ్చిరి. వారి కొరకు నేను ఇచ్చటకు వచ్చుటతో తమ దర్శనము లభించినది. ప్రొఫెసరుతో వచ్చిన ఇద్దరు విద్యార్థులలోను ఒకరు బి. ఏ. లో చదువుచుండిరి. మరియొకరు ఇంటరులో చదువు చుండిరి. వారిలో రెండవ విద్యార్థి శ్రీ నిత్యానందుల వారిని అడిగెను.

పూర్వము బ్రహ్మచర్యాశ్రమము నందు బ్రాహ్మణులు వేదాధ్యయనము మొదలగునవి చేయుచుండిరి. ఇప్పుడు అవేమియు లేవు. సంధ్యా వందన నాది నిత్య కర్మములు కూడ చేయుట లేదు, నేను ఏమి చేయవలెను?

# ఆరు నిత్య కర్మల వలనను కలుగు ఫలము

స్వా. ని. :- నీవు కాలానుగుణముగా హూణవిద్య నభ్యసించుచున్నావు. అందుచే నీవు చేయవలసిన షట్కర్మలను యథావిధిగా చేయ వీలు లేక పోవచ్చును. అయినను లఘు సంధ్యాదులను చేయవచ్చును. విద్యాభ్యాసము ముగిసిన పిమ్మట షట్కర్మలను సమగ్రముగా యథావిధిగా చేయుటచే పాపవిముక్తుడ వగుదువు.

***సంధ్యా స్నానం జప శ్చైవ దేవతానాం చ పూజనమ్/***
***వైశ్వదేవం తథాతిథ్యం షట్ కర్మాణి దినే దినే //***

“స్నానము, సంధ్య, జపము, దేవతార్చన, వైశ్వదేవము, అతిథి సత్కారము ఇవి ప్రతిరోజును చేయవలెను. "

స్నానము:- స్నానసంధ్యాదులను ఈశ్వర

ప్రీత్యర్థము నియమాను సారము చేసినచో అంతఃకరణ శుద్ధి ద్వారా పరమాత్మని యందు భక్తియు, ఆత్మజ్ఞానమును పొందు యోగ్యతయు కలుగును. అనేక విధములగు ఈ సకామ కర్మలచే సంసార బంధమునందు చిక్కు వడిన నరునకు నిష్కామ కర్మ చేతనే విముక్తి కలుగును.

కావున సంధ్యా వందనాదికములు తప్పక ఆచరించవలెనని వేదము విధించుచున్నది. సంధ్య చేసినచో చేయవచ్చును కాని స్నానము చేయవలసిన అవసరము ఏమని అడుగవచ్చును. నిద్ర యందు శరీరము మాలిన్యమును పొందును. శరీరము సహజముగా మలినమైనది. అనేక ఛిద్రములు కల శరీరము రాత్రింబవళ్ళు స్రవించుచునే యుండును. ఆ మలినము నుండి శరీరమును పరిశుద్ధము చేయునది ప్రాతః కాల స్నానమే. కావుననే భగవానుడు, దేవతలు స్నానమును పొగడిరి. స్నానముచే ఉత్సాహము,

తృప్తి, చిత్త శాంతి, బల వృద్ధి, కాంతి, శరీర పుష్టి, సౌభాగ్యము, ఆయుర్వృద్ధి మొదలగు గుణములు కలుగునని పరాశరాది ఋషులు ధర్మ శాస్త్రముల యందు చెప్పుచున్నారు.

సంధ్య:- ఋషులు చిర కాలము సంధ్యావందనముతో బాటు జపము చేసి దీర్ఘాయువును పొందిరి. బుద్ధి, యశము, కీర్తి, అధ్యయనము మొదలగువానికి పనికివచ్చు బ్రహ్మ తేజమును పొందిరి. ఆయువు మొదలగునవి కోరువారు చాలా కాలము సంధ్యావందనము చేయవలెను. ద్విజుడు అందులో బ్రాహ్మణుడు సంధ్యావందనము చేయనిచో బ్రతికియున్నప్పుడు శూద్రునితో సమానము. చనిపోయిన తరువాత ఆతనికి కుక్క జన్మము కలుగును. సంధ్యను ఆచరించని మానవుడు అపవిత్రుడు. ఆతనికి కర్మాధికారము లేదు. సంధ్యా వందనమును విడనాడి మరి ఏ కర్మమును చేసినను దాని ఫలితము లభించదు. సంధ్యావందనమును, గాయత్రీ జపము చేయని బ్రాహ్మణుడు శూద్రుని

కంటె హీనుడు. గాయత్రీ తత్త్వమును తెలిసి కొనిన బ్రాహ్మణుడు లోక పూజ్యతను పొందును. కావున సంధ్యావందనము, గాయత్రీ జపము తప్పక చేయవలెను.

దేవతార్చన:- జపాదుల తరువాత దేవతార్చన చేయవలెను. పంచ దేవతా స్వరూపమున అందరి దేవతలను పూజించవలెను. జలము, అగ్ని, హృదయము, సూర్యుడు, వేదిక – వీనికి తోడు పాషాణ ప్రతిమల నుంచి, ఈశ్వర బుద్ధితో పూజించవలెను. సూర్యాది నవ గ్రహములు, గ్రామ దేవతలు మున్నగువారు అందరిచే పూజింప బడుదురు.

వైశ్వదేవము:- ద్విజులు గృహ్య సూత్రోక్త విధిని వైశ్వ దేవమును ఆచరించవలెను. హోమము చేయదగిన వస్తువు లభించనప్పుడు కాచిన పాలు కాని, లేక పండ్లు, పూవులు, లేత గడ్డి ఏది దొరకినదానితో విధివిహితముగ

హోమము చేయవలెను. వైశ్వదేవము చేయనిదే భోజనము చేయువారు నరకమును పొందెదరు అని పరాశరులు తన ధర్మశాస్త్రమున చెప్పిరి. అందుచే ఉప్పు వేసిన కూరలు మొదలగునవి తప్ప మిగిలిన హవ్యాన్నములను (నేయి, పెరుగు మొదలగునవి) అగ్నియందు హోమము చేయవలెను.

***కణ్డనీ పేషణీ చుల్లీ ఉదకుమ్భీ చ మార్జనీ/***
***పఞ్చ సూనా గృహస్థస్య తాభిః స్వర్గం న గచ్ఛతి//***

గృహస్థుని ఇంటియందు సన్నికల్లు, తిరుగలి, పొయ్యి, కుండ, చీపురుకట్ట ఉపయోగింపబడుటచే జీవహింస జరుగును. ఈ ఐదు విధములగు హింసల నుండియు నివృత్తిని పొందించుటకు వైదిక ధర్మము నందు బ్రహ్మయజ్ఞము, పితృయజ్ఞము, దేవయజ్ఞము, భూత యజ్ఞము, మనుష్య యజ్ఞము అను ఐదు యజ్ఞములు విధించబడినవి.

# అతిథి సత్కారము

భోజన సమయమున మనము ఎప్పుడును చూచియుండని, గోత్ర శాఖాదులు తెలియని, ఆచార విద్యాదులు కూడ ఎరుగని రాత్రి మాత్రము ఉండు వ్యక్తి అతిథి. తిథి అనగా ఒకరోజు. ఒకరోజు కంటే ఎక్కువ కాలము ఉండని వాడు అతిథి. ఒక గ్రామములో విచిత్రములుగు హాస్య కథాదులను ప్రదర్శించియు, సంగీతము ద్వారాను జీవితము గడపుకొనువాడు ఉన్నాడనుకొనుడు. అతనికి భార్య, ఇంట అగ్ని అన్నియు ఉండును. ఆతడు వేరొక ఇంటికి భోజనమునకు వచ్చిన అతిథిగా పరిగణించబడడు. పర గ్రామమునందు నివసించుచు వైశ్వదేవ సమయమున అనగా భోజన సమయమున వచ్చినచో ఆతడు అతిథి అనబడును. ఆమంత్రణముచే వచ్చువాడు అతిథి కాడు.

మనుస్మృతి చెప్ప బడినది.

***చౌరో వా యది చాణ్డాలో శత్రుర్వా పితృ ఘాతకః/
వైశ్వదేవే తు సంప్రాప్తే సోఽతిథిః సర్వసమ్మతః//***

"దొంగ కాని చండాలుడు కాని శత్రువుగాని, పితృహత్య చేసిన వాడుగాని ఎవ్వడైనను వైశ్వదేవము చేయుచుండగా వచ్చినచో నతడు అతిథిగా పరిగణింపబడును."

"మిత్రుడైనను, శత్రువైనను, మూర్ఖుడైనను, పండితుడైనను, వైశ్యదేవబలికి చివర భాగమున వచ్చిన అనగా భోజన సమయము వచ్చిన ఆతడు అతిథి అని అందరు అంగీకరించిరి. గృహస్థు బీద వాడయి అన్నాదులు లేకపోయినను భూమి, నీరు, మధురమగు పల్కులు లేని సజ్జన గృహము ఉండదు. "అతిథి విష్ణు స్వరూపుడు. తరింప జేయుటకు వచ్చును." అని తలచి భక్తితో ఆతనిని భోజనమునకు లెమ్మని ప్రార్థించవలెను. ఏ ఇంటినుండి అతిథి నిరాశతో వెళ్ళునో ఆ గృహస్థునకు అతడు తన పాపమును ఇచ్చి ఆతని

పుణ్యమును తీసికొని వెళ్ళిపోవును.

తుకారాము తన అభంగమునందు వ్రాసెను.

“మన ఇంటిలో దేవపూజ చేయుచుండగా ఎవరైన అతిధి వచ్చి కూర్చొనినచో ఆతనిని మొదట సత్కరించవలెను. అట్లు చేయకుండ దేవపూజ చేయట చాల అధర్మము. ఈ అపరాధము చేయు వ్యక్తి దేవతలపై చందన, పుష్పాదులు వేసినను, అవి వేయుచు మంత్రాలు చదివినను అవి అన్నియును భగవానుని తలపై రాతితో కొట్టినట్లు అగును. నీ యింటికి వచ్చిన అతిథిని అగౌరవము చేసి దేవుని ఎదుట పిండివంటల పళ్ళెము నుంచుటయా? మనస్సునందు అట్టి భేద భావములు ఉంచి దేవ పూజ చేయకుము. లేనిచో దైవమును కొట్టుటచే వచ్చు పాపమును నీవే భరించవలసి వచ్చును.”

## సంధ్యా వందన విధి

షట్కర్మములను ఆచరించ లేక పోయినచో

సంధ్యనైనను చేయవలెను. మనుస్మృతి మొదలగునవి ద్వి కాల సంధ్యను విధించినవి. గృహ్య సూత్రములు, మధ్యాహ్న సంధ్య కూడ విధించుచున్నవి. కావున త్రి కాల సంధ్యా విధి వచ్చినది. స్మృత్యనుసారము సంధ్యను ఆచరించుటకు వీలుపడనిచో శ్రుతిని అనుసరించి లఘు సంధ్య అనగా సూర్యోపస్థానము, అర్ఘ్యము, జపము మాత్రము చేయవలెను. త్రి కాలముల యందును సంధ్యా సమయమున చేయవలసిన గాయత్రి మూడు అష్టోత్తర శతములు అర్థ చింతనముతో పాటు ఉదయము కాని ఉదయ సాయంత్రముల యందు కాని పూర్తిచేయవలెను. అందు తనకు వీలగు మార్గమును అవలంబించవలెను.

విద్యార్థి :- ఈ మాత్రము ఇటు పైన చేయుదును.

స్వా, ప). :(నవ్వుచు) ఒక బ్రాహ్మణ కుమారుడు విదేశములకు వెళ్ళి బారిష్టరు అయి వచ్చెను. విదేశమునుండి వచ్చిన తరువాత తండ్రి

కుమారుని సంధ్యావందనము చేయమని చెప్పెను. “నేను సంధ్యావందనము చేయనా? ప్లీడరీ చేయనా?” అని అతడు ప్రశ్నించెను. మరేమియు చేయలేక పోయినను బ్రాహ్మణుడవయినందున గాయత్రి ఒక మాల (అష్టోత్తరశతము) అయిన చేయుము అని తండ్రి చెప్పెను. తరువాతి రోజున బారిష్టరు మాల తీసికొని గాయత్రిని ఉచ్చరించి ఒక పూసను త్రిప్పెను. అనంతరము “డిటో, డిటో" అని 107 పూసలు త్రిప్పెను. మాల త్వరగా పూర్తి అగుట గమనించిన తండ్రి ఇదేమని ప్రశ్నించెను. బారిష్టరు సమాధానము చెప్పెను. “ఒక మారు మంత్రము చదివి మిగిలిన 107 సార్లు డిటో, డిటో అంటిని.” అని చెప్పెను. (ఇది విని అందరు నవ్విరి)

ఇట్లు శ్రద్ధ లేకుండ ఏమి చేసినను అర్థము లేదు. ఏమి చేసినను శ్రద్ధతో చేయవలెను.

## సదాచారము ఆవశ్యకము

దానితో బాటు సదాచారము కూడ ఆవశ్యకమే. బ్రహ్మచర్యాశ్రమము నందు మీరు సదాచారముతో సంచరించుట తప్పని సరి. తైతిరీయోపనిషత్తు నందు చెప్పబడినది. "సత్యం వద, ధర్మం చర, స్వాధ్యాయాన్మా ప్రమదః"

"సత్యము పలుకుము, ధర్మముగా సంచరించుము. స్వాధ్యాయము నందు పొరబాటు రానీయకుము."

"***మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ***" అనికూడ చెప్ప బడినది.

నారద భక్తి సూత్రములయందు ఉన్నది.

"***త్రయః పురుషస్య గుర వో భవన్తి, మాతా, పితా, అచార్యశ్చ***"

"నరునకు తల్లి, తండ్రి, ఆచార్యులు అను వారు ముగ్గురును గురువులు."

తల్లియగు కౌసల్య, తండ్రి దశరథుడు, గురువు వశిష్ఠుడు కలసి కూర్చొనియున్నప్పుడు రామచంద్రుడు మొదట కౌసల్య మాతకు

నమస్కరించెను. తరువాత దశరథునకు నమస్కరించెను. అనంతరము వసిష్ఠునకు నమస్కరించెను. ఇది సదాచారము. సదాచారమును అనుసరించనివాని ఆచరణకును పశువు యొక్క ఆచరణమునకును భేదమేమి? ఏలనన పశువులు కూడ పెద్దవయిన తరువాత తమ తల్లిదండ్రులను మరచిపోవును. ఒక్కొక్కప్పుడు తమ తల్లిదండ్రులతోనే యుద్ధము చేయును.

***ప్రత్యహం ప్రత్యవేక్షేత నరశ్చరితమాత్మ నః/***
***కిన్ను మే పశుభిస్తుల్యం కిన్ను సత్పురు షైరితి//***

"మానవుడు ప్రతిరోజు తన నడవడికను పరిశీలించుకొనుచుండ వలెను. నా నడవడిక పశువుతో సమానముగా నున్నదా? సత్పురుషులతో సమానముగా నున్నదా అని పరీక్షించు కొనవలెను."

తైతిరీయోపనిషత్తు నందు చెప్పబడినది.

***యాన్యన పద్యాని కర్మాణి తాని సేవిత వ్యానినో ఇతరాణి|***
***యాన్యస్మాకం సుచరితాని తాని త్వయోపాస్యా నో ఇతరాణి ||***

"నిందారహితములగు కర్మములనే ఆచరించవలెను. ఇతర కర్మములను కూడదు. మా మంచి నడవడులను నీవు ఆచరించవలెను. వానికి వ్యతిరేకములయిన వాటిని ఆచరించరాదు." అని ఆచార్యులు శిష్యునికి ఉపదేశించిరి.

స్వా. ని. :- భక్తి సూత్రములు యందు నారదుడు చెప్పెను.

"***అహింసా సత్య శౌచ దయాస్తిక్యాది చారిత్ర్యాణి పరిపాలనీయాని***"

అహింస, సత్యము, శౌచము, దయ, ఆస్తికత్వము, చరిత్రము వీనిని సర్వవిధములను రక్షించు కొనవలెను.

# అహింసా స్వరూపము

***సర్వేషామేవ భూతా నామ క్లేశ జననం హి యత్/***
***అహింసా కథితా సద్భిర్యోగ సిద్ధి ప్రదాయినీ//***

ఏ ప్రాణికిని మనస్సు, వాక్కు కాయము వీనిచే దుఃఖము కలిగించ కుండుట అహింస అని సత్పురుషులు చెప్పిరి. ఈ విధమగు అహింసనే నారదుడు దైవభక్తికి విధించెను. దైవభక్తికి బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్యాసి అను నలుగురు ఆశ్రమవాసులును తగుదురు. సంసార వ్యవహారములను అన్నిటిని త్యజించి కేవలము ఈశ్వర పరాయణత్వముతో, విరక్తి భావముతో నుండుట అహింసా స్వరూప మనియును, అది మహా వ్రత మనియును యోగదర్శనమున వర్ణించబడినది.

***"ఏతే జాతి దేశ కాల సమయాన వచ్ఛిన్నాః సార్వభౌమా మహా వ్రతమ్"***

# ఇరువది నాలుగవ ప్రసంగము

అహింస, సత్యము, అస్తేయము, అపరిగ్రహము, బ్రహ్మచర్యము ఇవి యమము అను శబ్దముతో వ్యవహరించబడును. ఇవి ఎల్ల జాతుల యందును, ఎల్ల దేశముల యందును, ఎల్ల కాలముల యందును, సర్వావస్థలయందును స్థిరముగా నున్నచో మహా వ్రతము అని చెప్ప బడును.

బ్రాహ్మణత్వాది జాతులు, తీర్థాది ప్రదేశములు, చతుర్ధశ్యాది కాలములు బ్రాహ్మణ ప్రయోజనాది సమయములు (ప్రసంగములు) ఈ నాలుగు రకములగు పరిచ్ఛేదములు లేకుండ, చిత్తము యొక్క క్షిప్తాది సర్వావస్థలయందును ఈ యమాదులను పాటించుట మహా వ్రతము.

“బ్రాహ్మణుని చంపరాదు” అను విధి యొక్క భావము ప్రయోజనమును అనుసరించి ఇతరుని చంపవచ్చును అనుకొనబడును. ఇట్టి విధి జాతి పరిచ్ఛేదము కల విధి. "ఫలానా తీర్థ స్థలమునందు హింస చేయరాదు.” అనిన ఇతర స్థలములయందు ప్రయోజనాపేక్షతో హింసకు

వీలు కలుగును. చతుర్దశీ దివసమున హింసించరాదు అను నియమము మిగిలిన రోజులలో హింసను సమర్థించును. ఇట్టి నియమములు జాతి, దేశ, కాల పరిచ్ఛేదము తో కూడిన నియమములు. అటలునే బ్రాహ్మణ ప్రయోజనాదులు లేకుండ హింస చేయరాదు అను విధికి భావము బ్రాహ్మణ ప్రయోజనము ననుసరించి హింస చేయ వచ్చునని అగును.

ఈ నాలుగు విధములగు పరిచ్ఛేదములు లేని హింస- అనగా ఏ జాతిని, ఏ ప్రదేశము నందును, ఏ కాలము నందును, ఏ ప్రసంగము నందును హింసించకుండుట మహా వ్రతము.

## హింస

భక్తి కలిగి యున్నను గృహస్థాశ్రమము నందు వ్యవహార మగ్నులగువారు ఈవిధమగు అహింసను పాలించుట దుష్కరము. అపరాధిని దండించుటయు, సజ్జనుని సత్కరించుటయును ధర్మ నీతి యొక్క తత్త్వము అగుటచే రాజులు,

రాజ పురుషులు కూడ ఎల్ల కాలములయందు దండించవలసిన అవసరములు ఏర్పడును. ఇతరులను కూడ దండించుటకు ఈక్రింది శ్లోకము సంకేతము నిచ్చుచున్నది.

***"నఖినాం దంష్ట్రిణాం చైవ శృఙ్గిణామాత తాయినామ్/***
***హస్త్యశ్వానాం తథాన్యేషాం వధే న దోషభాక్//"***

గోళ్ళతో కాని, దంతములతో గాని, కొమ్ములతో కాని మనుష్యులను చంపు పెద్ద పులి, ఎలుగుబంటి మొదలగునవి; మదించి పిచ్చెత్తిన ఏనుగులు, గుఱ్రములు, మనుష్యులు మొదలగు ప్రాణులు; దుర్మార్గులు అగు మనుష్యులు వీరిని వధించినచో వధించు రాజు దోషమును పొందడు. మిగిలిన ఏ ప్రాణిని కూడ డబ్బుకొరకు కాని, రుచికొరకు కాని చంపరాదు.

1. ఇంటికి కాని; అడవిలో నున్న పశువులు మొదలగునవి తినుటకు ఉపయోగించు గడ్డికి గాని, ఇంట్లో కాని, పొలములో కాని నిలవ

చేసియున్న ధాన్యము గడ్డి మొదలగు వానికి గాని నిప్పు అంటించిన వాడును; 2. ఎవనినైనా చంపుటకు విషమునిచ్చు వాడును; 3. ఇతరుని చంపుటకు శస్త్రమును ధరించు వాడును; 4. పర ధనమును అపహరించిన వాడును; 5. అన్యాయముగా ఇతరుల క్షేత్రములను అపహరించిన వాడును; 6. స్త్రీలను అపహరించిన వాడును- ఈ ఆరు రకముల జనులును ఆతతాయిలు అనబడుదురు.

వీరిని వధించ వచ్చును. ఈ శ్లోకమునందు చెప్పబడిన వధ, లోక రక్షార్థమే అని గ్రహించవలెను. ధర్మ తత్త్వమును తెలిసికొనకుండ జైనులు వలె పురుగులను పెంచుట మాత్రము అహింస కాదు. ఆవును చంపబోవు పులిని చంపి ఆవును రక్షించుట నిజమగు ధర్మము. కాని హింస భయముచే ఆవును పులి నోటి నుండి రక్షించ కుండుట ధర్మము కాదు. అంతే కాదు, అట్లు చేయువాడు

దోషి. దొంగలు మొదలగు దుర్మార్గులను దండించుట ప్రజా రక్షణార్థము ధర్మము. దండ భయము లేనిదే ఏ మనుష్యుడును నీతితో సంచరించడు. అపరాధము చేయనివానిని దండించుట, మనస్సుతో ఇతరులకు అపకారమును కోరుట, కఠోర వాక్యములచే ఇతరులను బాధించుట ఇవి అన్నియును హింసా లక్షణములు. తమ హితమును కోరువారు ధర్మము ఇచ్చు ఈ ఆజ్ఞలను అతిక్రమించరాదు.

# సత్యము

***యస్త్వదు ష్టేన్ద్రియైర్దృష్టం శ్రుతం వేద విదాం వర/***
***తస్యైవోక్తి ర్భువే ద్వి ప్ర సత్యతా నాన్యథా భవేత్ //***

"దోషములు లేనట్టి ఇంద్రియములతో చూడబడినది, వినబడినది ఏది కలదో దానిని పలుకుట సత్యము. సత్యము అనునది మరి యొకటి లేదు."

తాను సత్యము పలికినచో నిర్దోషి వధించబడు సమయమున సత్యము పలుకవలెనా? పలుక రాదా? అను విషయమున ఇట్లు చెప్ప బడినది.

***ఉక్తేఽనృతే భవేద్యత్ర ప్రాణినాం ప్రాణరక్షణమ్।***
***అనృతం తత్ర సత్యం స్యాత్ , సత్యమప్య నృతం భవేత్॥***

"అసత్యము పలుకుటచే ప్రాణులు రక్షించబడుచో ఆప్రసంగమున అసత్యము సత్య మగును. అచ్చట సత్యము అసత్య మగును."

ఒక కసాయి ఒక ఆవును తరుముచుండెను. ఆ మార్గము ముందు రెండు శాఖలుగా విడిపోయెను. కసాయి కొంచెము వెనుకబడెను. ఆవు ఏ దిక్కునకు వెళ్లినదియు అతనికి తెలియలేదు. అక్కడనే ఒక సాధువు చెట్టు క్రింద కూర్చొని యుండెను. కసాయి సాధువును

ప్రశ్నించెను.

“ఓ సాధూ! ఇక్కడ నుండి వెళ్లిన ఆవు ఏ దిక్కునకు వెళ్లినది?” సాధువు చెప్పెను. "చూచినవాడు మాట్లాడుట లేదు, మాట్లాడువాడు చూడలేదు. రెంటిని కలుపువాడు గురు చరణముల యందు నిమగ్నుడై యున్నాడు.”

కసాయి ఇతడెవరో పిచ్చివాడనుకొనెను. ఆతడు అక్కడి నుండి - వెళ్ళిపోయెను. సాధువు నిజమే చెప్పెను. “చూచినవాడు మాట్లాడ లేదు.” అనగా కన్ను చూచినది. అది మాట్లాడుట లేదు. “మాట్లాడువాడు చూడలేదు” అనగా నాలుక మాట్లాడుచున్నది. అది చూడ లేదు. “ఇరువురును కలుపువాడు గురు చరణముల యందు నిమగ్నుడై యున్నాడు.” అనగా బుద్ధి నేత్రములద్వారా చూచును, జిహ్వ ద్వారా మాట్లాడును. అది గురు చరణములయందు నిమగ్నమయి ఉన్నది. కాని ఆ కసాయి తెలిసికొనలేక పోయెను. ఆ సాధువు మతి భ్రష్టుడనుకొని వెళ్ళిపోయెను. ఆవు ప్రాణమును

రక్షించుటకు సాధువు అట్లు చెప్పెను.

ఈవిషయమున మరియొక దృష్టాంతము కూడ వినదగును.

"దుర్యోధనుడు గదాప్రహారముచే మరణాసన్నుడై యుండెను. అతడు ఎంతయో బాధపడుచుండెను. కాని ప్రాణములు పోవుట లేదు. అంత అశ్వత్థామ అడిగెను. "ఓ దుర్యోధనా, నీ ప్రాణము ఏల పోవుట లేదు?" దుర్యోధనుడు సమాధానము చెప్పెను. "నా వద్దకు ఎవడైన పాండవుల శిరస్సులు తెచ్చినచో నా ప్రాణములు పోవును." వీలైన తీసికొని వచ్చెదనని అశ్వత్థామ చెప్పెను. ఈ సంగతి కృష్ణ పరమాత్మకు తెలిసి పాండవులను రక్షించుటకు ఉపాయము పన్నెను. వారిని దూర్వాసుని ఆశ్రమమునకు తీసికొని వెళ్లి "అశ్వత్థామ వీరిని చంపుటకు వచ్చినప్పుడు రక్షించవలె?" నని చెప్పెను. దుర్వాసుడు ఇట్లు పలికెను. "అదెట్లు జరుగును? నేను అసత్యము పలుకను కదా!

అశ్వత్థామ పాండవులను గురించి అడిగిన ఉన్నారనియే నేను చెప్పవలెనుకదా!” కృష్ణ పరమాత్ముడు పలికెను.

“ మీకు ఉపాయము చెప్పెదను” అని దుర్వాసుడు కూర్చొనినచోట ఒక కందకము తవ్వించి అందు పాండవులను దాచెను. పైన బల్లలు వేసి వానిపై దూర్వాసుని ఆసనమును ఏర్పాటుచేసెను. అనంతరము అశ్వత్థామ పాండవులను వెదకుచు దూర్వాసుని వద్దకు వచ్చి “స్వామీ! తమరు పాండవుల సంగతి ఎరుగుదురా?” అని ప్రశ్నించెను. దూర్వాస మహా ముని కృష్ణ పరమాత్ముడు పన్నిన ప్రకారము ఒక్కమారు క్రోధావిష్టుడయి తన ఆసనము క్రిందను వ్రేలుతో చూపించుచు, భయంకర శబ్దము చేయుచు పలికెను. “క్రింద ఉన్నారు” ఇది విని అశ్వత్థామ ఇట్లనెను

“స్వామీ! నేను స్వాభావికముగ తమను అడుగుచున్నాను. దానికి ఇంత క్రోధము ఎందుకు? అని చెప్పి అశ్వత్థామ అచ్చటినుండి

వెళ్లిపోయెను.

ఈ విధముగా అనేక సమయములయందు అసత్యము కూడా పలుక వలసి వచ్చును. ఉపాయములను కూడ పన్న వలసి వచ్చును, అయినను మిథ్యాభాషిత్వ దోషము కలుగదు.

## శౌచము

***అద్భిర్గా త్రాణి శుధ్యన్తి మనః సత్యేన శుధ్యతి/***
***విద్యాత పోభ్యాం భూతాత్మా బుద్ధిః జ్ఞానేన శుధ్యతి//(మను)***

“పరిశుద్ధమగు జలముతో శరీరము శుద్ధిని పొందును. సత్యముచే మనస్సు శుద్ధిని పొందును. విద్య తపములచే అంతఃకరణము శుద్ధిని పొందును. జ్ఞానముచే బుద్ధి పరిశుద్ధమగును.”

***క్షాన్త్యా శుధ్యన్తి విద్వాంసో దానేనాఽ కార్యకారిణః/***
***ప్రచ్ఛన్న పాపా జాప్యేన తపసా వేద విత్తమాః//***

# ఇరువది నాలుగవ ప్రసంగము

"విద్వాంసులు ఓర్పు చేతను, దుర్మార్గులు దానము చేతను ప్రచ్ఛన్నముగా పాపములు చేయువారు జపము చేతను, వేదమును తెలిసికొనిన వారు తపస్సు చేతను శుద్ధిని పొందెదరు."

## క్షాన్త్యా శుధ్యన్తి విద్వాంసః

ఓర్పు కలవాడు స్వర్ణము, కీర్తిని, మోక్షమును పొందును. ఆతడు పుణ్య క్షేత్రముతో సమానుడు. వాడు మానవుల పాపములను పోగొట్టి పవిత్రము చేయును. జగము నందలి ప్రాణులన్నిటి వశపరచుకొను వస్తువు "ఓర్పు." భూమిమీద పడిన నిప్పు జ్వలించదు. గడ్డిమీద పడినది జ్వలించును. అటులనే క్రోధము కలవాడు. అతి సామాన్య విషయములకు కూడ తొందరతో పోట్లాడుటకు తయారగును. అట్లు ఓర్పు కలవాడు తయారవడు. పైగా ఆతని మాటలతో క్రోధము కలవాని క్రోధము శాంతించును.

# దానేనాऽకార్యకారిణః

ఎవనికిని ఇతరుల సంపాదనలో అధికారము లేదు. ఎవడైన చేతికి తప్పుడు మార్గమున దొరికిన దానిని సంపాదించి ఇతరులకు దానము చేసినచో ఆ దానము తీసికొనిన వాడు కూడా ఆ పాపమును పొందును. కావున యోగ్య కర్మలను చేయుట ద్వారా సంపాదించిన ధనమును దానము చేసిననే తాను చేసిన అకార్యముల నుండి శుద్ధిని పొందును అని చెప్పవలెను. దానమునకు శాస్త్రమునందు పైన చెప్పబడిన స్వర్గాది విశేష ఫలములు దుష్ట మార్గమున సంపాదించిన ధనమును దానము చేయుటచే లభించవు. అట్టి స్వర్గాది ఫలములు పరిశుద్ధమగు సంపాదనముచే లభించిన ధనముతో చేసిన దానముతోనే సిద్ధించును.

ఇతరులకు దుఃఖము కలుగ కుండ తన చేతితో శుద్ధ మార్గమున సంపాదించబడిన ధనమును దానము చేయుట ఉత్తమము.

# ప్రచ్ఛన్న పాపా జాప్యేన

పాప నివృత్తి ని కలిగించు కర్మము ప్రాయశ్చిత్తము అనబడును. అజ్ఞాత పాపము ప్రాయశ్చిత్తముచే కొంతవరకు మాత్రమే నివృత్తిని పొందును. ఈ శ్లోకము నందలి ప్రచ్ఛన్న పాపమునకు అర్థము అజ్ఞాత పాపము అనియే చెప్పుకొనవలెను. కాలము, అగ్ని, మట్టి, వాయువు, మనస్సు, జ్ఞానము, జలము, పశ్చాత్తాపము, వ్రతము, జపము, ఉపవాసము- ఇవి అన్నియును శుద్ధికి సాధనములు.

మరణాశౌచము పది రోజులు. ఇది కాలిక శుద్ధి.

మట్టిపాత్ర అగ్నిలో కాల్చుట వలన శుద్ధిని పొందును. ఇది అగ్ని శుద్ధి, అశ్వమేధాది యజ్ఞములచే కలుగు శుద్ధి కర్మశుద్ధి.

ఆవు వాసన చూచినను, కీటకములు, తల వెంట్రుకలు, ఈగలు మొదలగువానిచే దూష్యములయిన ఆహారాదులపై శుద్ధి కొరకు

జలము, భస్మము మొదలగునవి విధించబడినవి. ఇది మృతికా శుద్ధి.

త్రోవలో నున్న నీటిని కుక్కలు మొదలగునవి స్పృశించుటచే కలుగు అపవిత్రత వాయువుచే పోవును. ఇది వాయుశుద్ధి.

మనశ్శుద్ధికి ఆధారము పరిశుద్ధములగు ఆలోచనలు. ఆత్మజ్ఞానము సర్వ పాపముల నుండియు పరిశుద్ధుడగుటకు సాధనము. తపము కృచ్ఛ్రాది వ్రతములు, జలము కూడ శరీర శుద్ధికి సాధనములు. పశ్చాత్తాపము, నిరాహారముకూడ శుద్ధి విషయమున ప్రసిద్ధములే. తెలిసిన వాడు వేదాభ్యాసము అను తపముచే పరిశుద్ధుడగును. అటులనే జపముచే కూడ మనస్సు పరిశుద్ధమగును.

## దయ

***ఆత్మవత్సర్వభూతేషు కాయేన మనసా గిరా/***
***అనుకమ్పా దయా సైవ ప్రోక్తా వేదాన్త వాదిభిః//***

"మనస్సు, వాక్కు, శరీరము వీనిచే అన్ని ప్రాణులయందును సహానుభూతి స్వభావమునే కలిగియుండుట అనుకంప. అదియే దయ అని వేదాంతులు చెప్పిరి."

తాను చెప్పినట్లు విను తన కుటుంబములోని వారి యందును, మిత్రాదుల యందును, తదితరుల యందును అనుకంపాభావము కలిగి యుండుటతో దయ పరి సమాప్తిని పొందదు. ప్రతికూలుర యందు కూడ దయ కలిగి యుండుటతో దయ పరిపూర్ణ మగును

ఈ విషయముననే చెప్ప బడినది.

***పరే వా బన్ధువర్గే వా మిత్రే ద్వేష్టరి వా సదా।***
***ఆపన్నే రక్షితవ్యం తు దయైషా పరికీర్తితా॥***

"బంధువులైనను కాక పోయినను, మిత్రులైనను శత్రువులైనను ఎల్ల కాలముల యందును ఆపదలనుండి రక్షించవలెను. అది యే దయ."

తనయందు మైత్రి కలిగియుండి, తనకు అనుకూలముగా ప్రవర్తించువారి యందు దయతో నుండుటలో కొత్త ఏమియును లేదు. కాని తనయందు శత్రుత్వమును వహించువారు కష్టములు పడుచున్నప్పుడు వారియందలి శత్రుత్వమును విడనాడి "**ఏకో దేవః సర్వ *భూతేషు గూఢః***" "ఒకే దేవుడు అన్ని భూతములయందును నిండియున్నాడు" అను శ్రుతి వాక్యమును జ్ఞాపకము తెచ్చుకొని శరీరముతోను, మనస్సుతోను, ధనముతోను వారిని కష్టములనుండి తప్పించుటకు ప్రయత్నించుటలో వారి దయ పరాకాష్ట నందుచున్నది. సత్సంగము, శాస్త్రాదుల పరిజ్ఞానము ఆ విషయమున సార్థకమగు చున్నవి.

ఇట్టి భూతదయ కలిగియుండుట మానవుని పరమ కర్తవ్యము. అదియే శ్రేష్ఠమగు ధర్మమని శాస్త్రములు కూడ ఘోషించుచున్నవి.

*ధర్మో జీవదయాతుల్యో న కోఽపి జగతీతలే/
తస్మాత్సర్వప్రయత్నేన కార్యా జీవదయా నృభిః//*

"ఈజగమున భూతదయకు సాటియగు వేరొండు ధర్మము లేదు. కావున అన్ని విధములుగను మానవుడు భూతదయను కలిగి యుండవలెను." ఈ విషయమున రంతి దేవుడు, శిబి, జీమూతవాహనుడు మొదలగు మహాత్ముల దృష్టాంతములు ప్రసిద్ధములు.

## ఆస్తికత్వము

"పరమాత్ముని అస్తిత్వము, వేదములు మొదలగునవి ఈశ్వర ప్రణీతములు, స్వర్గ నరకములు, బంధ మోక్షములు, పునర్జన్మము మొదలగునవి వేదము నందు చెప్పబడినవి అన్నియును నిజము" అని అంగీకరించుట ఆస్తికత్వము.

నేటి కాలేజీ విద్యార్థులలో చాలమంది

నాస్తికులగుచున్నారు. పరమాత్ముని అస్తిత్వము, వేదములు ఈశ్వరప్రణీతము లను సంగతి, పునర్జన్మ మొదలగునవి వారు అంగీకరించరు. విజ్ఞానశాస్త్రము ద్వారా ఇవి అన్నియును ఋజువు చేయబడవు అని చెప్పెదరు. కావున వారియందు ఆస్తికత్వ బుద్ధి లేదని చెప్పవచ్చును.

ఆస్తికత్వ భావముచే వారియందు అహింస, సత్యము, శౌచము మొదలగు గుణములుకూడ ఉండవు. ఏలనన హింసాది దుష్కర్మములకు ప్రతిఫలము కలుగును అనునది వారు అంగీకరించరు. అందుచే మీరు ఆస్తికత్వ బుద్ధిని కలిగియుండుట నేర్చుకొనవలెను. ఆస్తికత్వము సదాచారము యొక్క ముఖ్య లక్షణము.

స్వా.ప్ర.:- సదాచారముతో పాటు సత్సాంగత్యముకూడ కలిగియుండవలెను. సంగ దోషముచే మంచి కుటుంబముల పిల్లలు కూడ కాలేజీలలో అనేకరకములగు దురాచారములకు పాల్పడుచున్నారు. అవి వారి భావి జీవితముల

యందలి అనేక దుఃఖములకు కారణములగుచున్నవి.

ప్రో. జోషీ:- తమరు చెప్పినది యథార్థము. ఈ బ్రాహ్మణ కుమారులు మంచి ఇంటి వారైనను దుష్ట సాంగత్యముచే బీడీలు మొదలగునవి కాల్చుచుండెడివారు. నేను చెప్పినందున వీరు ఆ అలవాట్లను తగ్గించిరి. కాని ఇంకా నీచ స్నేహితుల స్నేహమును విడనాడుట లేదు.

## సత్సాంగత్యము

స్వా. ప్ర. :-

***మోహజాలస్య యోనిర్హి మూఢైరేవ సమాగమః|***
***అహన్యహని ధర్మస్య యోనిః సాధు సమాగమః||***

"మూర్ఖ సమాగమము మోహమునకు ఉత్పతి స్థానము. సాధు పురుష సాంగత్యము ధర్మ కారణము. అసాధువుల సాంగత్యముచే మోహము ఉద్భవించును. సాధువుల

సాంగత్యముచే ధర్మభావము వృద్ధిని పొందును. సాధు సమాగమము ఔన్నత్యమును కలుగ జేయును. అసాధువుల సాంగత్యము అధఃపతనమునకు మార్గము. సాధుసమాగమముచే సదాచారములు అలవాటు అగును. అసాధువుల సాంగత్యముచే దురాచారములు చేయును. దానికి పరిణామము దేవునకు దూరమగుట. అసాధువుల వాక్యములు ధర్మబంధమునందు శైథిల్యమును కలిగించును. అంతే కాదు. అసాధు సాంగత్యముచే నింద్యకర్మలను చేయుట, ధర్మమునందు అశ్రద్ధ మొదలగునవి ఉద్భవించును. కావున ఎల్లరును సత్పురుషుల సమాగమమును కోరవలెను. అసాధు సాంగత్యము నీచ భావములను, నీచ కామనలను వృద్ధినొందించును. కావున ఎల్లరును సత్సంగముచే తమను రక్షించుకొనవలెను. ఈవిషయమున ఇంకను చెప్ప బడినది.

## పశ్చాతాపమునకు కారణములు

**వస్తునిః శ్రేయసం వాక్యం మోహాన్న ప్రతిపద్యతే /**
**స దీర్ఘ సూత్రీ హీనార్థః పశ్చాత్తాపేన యుజ్యతే //**

"శ్రేయస్కరమగు వాక్యమును మోహముచే నమ్మని నరుడు సోమరి, పురుషార్థ హీనుడు. ఆతడు తరువాత పశ్చాత్తాపమును పొంద వలసి వచ్చును." సత్పురుషుని ముఖము నుండి వెలువడిన వాక్యము కల్యాణ కరమగును. కావున వెంటనే దానిని అనుసరించవలెను. అహంకారముతో దానిని తిరస్కరించ రాదు. చేయవలసిన దేదియో వెంటనే చేయవలెను. సోమరితనముతోను, మందబుద్ధితోను సమయమును వ్యర్థము చేయరాదు. హిత వాక్య తిరస్కారము, చేయదగిన సత్కార్యముల యందు దీర్ఘ సూత్రత్వము- ఈ రెండును పశ్చాత్తాప కారణములు.

**సతాం మత మతిక్రమ్య యోఽసతాం వర్తతే మతే /**

**శోచన్తే వ్యసనే తస్య సుహృదో న చిరాదివ॥**

"సత్పురుషుల అభిప్రాయములను ఉల్లంఘించి అసత్పురుషుల అభిప్రాయముల ప్రకారము సంచరించువాని మిత్రులు అచిరకాలములో అతనికి కలుగు ఆపదలను చూచి దుఃఖించెదరు."

ఒక రాజధానిలో ఒక నగర శ్రేష్టి ఉండెను. అతనికి ఒక కుమారుడు ఉండెను. కొంతకాలమైన తరువాత నగర శ్రేష్ఠి చనిపోవుటచే కుమారుడు నీచులగు స్నేహితుల సాంగత్యమును పట్టెను. తండ్రి స్నేహితులు అతనికి దుష్టుల సహవాసము మానమని ఎంత చెప్పినను వినలేదు. పర్యవసాన రూపముగా ఆతడు ఒక గొప్ప అపరాధము చేసి తన స్నేహితులతో బాటు పట్టుబడి న్యాయాధీశుని ఎదుట నిలబెట్టబడెను. న్యాయాధిపతి నీచపు దోషులను గాడిదపై కూర్చుండ పెట్టి నగరమంతయు ఊరేగించమని విధించెను. పిదప నగర శ్రేష్ఠి కుమారుని ఇట్లు ప్రశ్నించెను. "నీవు

ఎవరి కుమారుడవో, నీ వంశము ఎట్టిదో తెలుసునా? నీవు ఇంత నీచపు పని ఏల చేసితివి? వెళ్లు, నా ఎదుట నుండి వెళ్ళిపొమ్ము. నీ ముఖం చూడను" అని అతనిని చీవాట్లు పెట్టి బైటకు పంపించెను. న్యాయాధికారి విధించిన శిక్షను జనులు విమర్శించిరి. "న్యాయాధికారి శిక్ష విధించుటలో పక్షపాతమును చూపించెను. ఒకే నేరమునకు బీద వాళ్ళ పిల్లలను గాడిదపై కూర్చుండ బెట్టి ఊరంతయు త్రిప్పించెను. నగర శ్రేష్టి కుమారునకు చీవాట్లు మాత్రమే పెట్టెను. బీదవారిని కఠినముగా శిక్షించెను." ఆరోజు సాయంకాలము మిగిలిన దోషులు గాడిదపై కూర్చొని ఊరేగిరి. వారి వెనుక పిల్లలు చప్పట్లు కొట్టుచు వెంబడించిరి. ఈవిధముగా నగర ప్రదక్షిణము పూర్తి అయిన పిమ్మట వారు విడిచి పెట్టబడిరి.

కాని వారికి తమ దుష్కృతముచే ఏమాత్రమును గ్లాని కలుగలేదు. ఇంటికి వెళ్ళి ఆనందముతో తిని పండు కొనిరి. కాని నగర శ్రేష్ఠి

కుమారుని న్యాయాధికారి శబ్దములు చాల బాధించుచుండెను. ఇక ప్రపంచమునకు తన ముఖము చూపించుట ఎట్లు అని ఆతడు దుఃఖించుచుండెను. ఈ దుఃఖముతో ఆతడు ఎంతయో వికలుడయి విషము తిని మరణించెను. దీనివలన ఆతని మిత్రులు చాల దుఃఖించవలసి వచ్చెను. కావున మీ అందరకును జోషీ గారు దివ్యమూర్తి. వారి ఆజ్ఞలను ఉల్లంఘించుట మహాపాపము అని మీ అందరకు చెప్పుచున్నాను.

అనంతరము పెద్ద విద్యార్థి చెప్పెను. మా ఈ మిత్రుడు జోషీ గారు చెప్పినందున బీడీ త్రాగుట ఈ మధ్యనే మానివేసేను. కాని కుసాంగత్యముచే ఇతడు పాడయిపోయి మాట్లాడుచు, మాట్లాడుచు చిన్న చిన్న విషయములకు కూడా కోపించి అనవసరముగా పోట్లాడు చుండును.

స్వా. ప్ర. :- ఎల్లప్పుడు ఒక విషయం మాత్రం జ్ఞాపకము ఉంచుకోండి. మానవుడు తన

స్వభావమును మంచిగా నుంచుకొనవలెను. అనేక గుణములున్నను స్వభావము తప్పుగా నున్నచో గుణములు కప్పబడి పోవును. మీ దగ్గర మరి ఏమి లేకపోయినను, సత్స్వభావము ఉన్నచో అందరకును ఆనందము కలుగును.

ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి.

***స్వభావేన హి తుష్యన్తి దేవాః సత్పురుషాః పితా/***
***జ్ఞాత యస్త్వన్నదానేన వాక్ప్రదానేన పణ్డితాః//***

"దేవతలు, సత్పురుషులు, తండ్రి స్వభావము చేతనే సంతోషమును పొందెదరు. జ్ఞాతులు అన్న పానముల చేతను, పండితులు వాక్కును సదుపయోగము చేయుట చేతను సంతృప్తిని పొందెదరు."

స్వభావమును గురించి పారస భాగము ఇట్లు చెప్పుచున్నది.

## జీవ స్వభావము

ఈ శరీరములో ఎన్ని రకములగు

స్వభావములు కాననగునో వాని అన్నిటికిని జీవునితో సంబంధము కలదు. అయినను కొన్ని స్వభావములు శుభకరములు. కొన్ని అశుభకరములు. శుభ స్వభావముల ద్వారా జీవుడు ఉత్తమ దశను పొందును. అశుభ స్వభావముచే అధఃపతనము నొందును. స్వభావములు అనంతములు. అయినను వానిని నాలుగు రకములుగా విభజించవచ్చును.

1. పశు, 2. సింహ, 3. ప్రేత, 4. దేవతా స్వభావములు.

1. విషయ భోగముల యందు అఖిలాష గలిగి ప్రబలమగు తృష్ణ కలిగి కామాదికములకు వలయు సాధనములను మాత్రమే సంపాదించుటయందు నిమగ్నుడయిన వాడు పశుస్వభావుడు.

2. క్రోధ స్వభావము కలిగి మనోవాక్కాయములచే ఈర్ష్యను పొంది దుర్వచనములు పలుకుచు ప్రాణులను

హింసించువారు సింహస్వభావులు.

3. కపటము, మోసము, దంభము మొదలగు వాని ద్వారా ఇతరులను మోసగించు వారును, వారికి దుఃఖములు కలుగ జేసి ఉపాధులను పెంచు వారును ప్రేతస్వభావులు.

4. బుద్ధిచే విద్య, ఉపకారము, వైరాగ్యము మొదలగు దివ్య కార్యములయందు నిమగ్నులయి, నింద్య కార్యము లన్నిటిని విసర్జించి, సర్వ జీవులకును సుఖమును కోరువారు, శుభ కార్యములయందే ప్రసన్నులయి ఉండెడి వారును, జడత్వము, మూర్ఖత్వము విఘ్నములుగా తలచు వారును దేవతా స్వభావులు.

కుక్క అపవిత్రమైనదిగా చెప్పబడినది. దాని శరీరము అపవిత్రమని కాదు. స్వభావమే అపవిత్రము. ఏలనన అది క్రోధమున ఇతర ప్రాణులను చీల్చివేయును. అందుచేతనే అది అపవిత్రము. అటులనే పందియందు కూడ

శరీరమునకు సంబంధించిన అపవిత్రత లేదు. అపవిత్ర పదార్థములను కోరుటయే దాని అపవిత్రత. అటులనే ప్రేతములు, దేవతలు మొదలగువాని వాని అపవిత్రత, పవిత్రత అన్నియు స్వభావమునకు సంబంధించినవే.

సంతులును, శాస్త్రములును మనుష్యునకు ఇట్లు ఉపదేశించు చున్నవి. బుద్ధి అనెడు నేత్రముల ప్రకాశము ద్వారా మనస్సు అనెడు భూతము చేయ కపటములను గమనించవలెను. వానిని గమనించిన తోడనే చిత్తమునుండి వానిని తొలగించవలెను. అందుచే వాని వలన కలుగు విఘ్నములనుండియు, కపటములనుండియు మానవుడు రక్షించబడును.

శంకరాచార్యులవారు చెప్పిరి. మానవులందరి యందును భూత స్వభావము ప్రత్యక్షముగా గోచరించుచున్నట్లుగనే నాయందును కలదు. కాని భగవానుకు దానిపై నాకు బలమును ప్రసాదించెను. వాటి

విఘ్నములు నా దరి జేరవు. అదే విధముగ వారు సంతులకు ఇట్లు ప్రబోధించిరి. తృష్ణ అనెడు పందిని, క్రోధము అనెడు కుక్కను వశపరచుకొని బుద్ధిని అనుసరించి ప్రవర్తించినచో, మానవుని స్వభావము అంతయు పరిశుద్ధమగును. ఆ స్వభావము అతని పుణ్యమునకు బీజము అగును.

మనుష్యుడు చెడు స్వభావమునకు వశీభూతుడయి ప్రవర్తించినచో ఆతని స్వభావము అంతయును చెడ్డది అయిపోవును. ఈ అశుభ స్వభావమే మానవుని భాగ్యహీనతకు బీజమగును.

జీవునకు జాగ్రత్, స్వప్నావస్థల యందు తా నెట్టి విధముగ నున్నాడో స్పష్టముగా తెలిసినచో నేను భూతమునకును, కుక్కకును లోబడియున్నాను, వాని ఆజ్ఞ ప్రకారము సంచరించుచున్నానని తెలిసికొనగలడు.

ఎవనినైన ధర్మాత్ముని అధర్మముగా తామసము కల మనుష్యుడెవడైన జైలులో

ఉంచినచో ఆ ధర్మాత్ముమనకు ఎంతయో దుఃఖము కలుగును. అటులనే దేవత స్వభావము కలవాడెవడైన శునక స్వభావముకల దైత్య బంధమున పడినచో ఆతడు కూడ నీచత్వమును పొందును.

అటులనే యథార్థమగు నైతిక దృక్పథముతో ఆలోచించినచో నేను రాత్రింబవళ్ళు నా వాసనకు అధీనుడనై యున్నాను. చూచుటకు మాత్రము మనుష్యశరీరము ఉన్నను స్వభావము చేతను కుక్కను పందిని భూతమును పోలియున్నాను అవి తెలిసికొనగలడు. కాని పరలోకమును గురించి మాత్రము మరి యొక్క విధముగా చెప్పెదరు. అక్కడ స్వభావమును అనుసరించియే శరీరము లభించును. కావున తృష్ణ అధికముగా నున్న మనుష్యుడు పంది శరీరమును పొందును.

ఎవడైన తన స్వప్నమందు కుక్కను కాని, సింహమును కాని చూచినచో ఆ వ్యక్తి స్వభావము అపవిత్రమైనదని తెలిసి కొనవలెను. ఏలనన

స్వప్నములు పరలోకమును తెలుపును. స్వప్నములయందు మానవుడు ఇంద్రియ ప్రదేశమునకు అతీతుడగును. అందుచే ఆ స్థితిలో జీవునకు తన స్వభావము ననుసరించియే స్వరూపము కన్పించును. మనస్సు నందున్న స్వరూపమే ప్రత్యక్షముగా కన్పించును.

ఈవిషయమున వివరించినచో ఇంక చాల గ్రంథము అగును. కావున ఈవిషయము ఇక్కడే విడచుచున్నాను.

ఈ నాలుగు స్వభావములును అంతఃకరణమును ఆధారముగా చేసికొని చెప్ప బడినవి. కావున తన నడవడికను గుఱించి ఆలోచించి నేను ఈ నాలుగింటిలోను దేనికి చెందినవాడను అను విషయమును గురించి ఆలోచించి నిశ్చయమునకు రావలెను. ఎట్టి పని మనము చేయుచున్నామో అట్టి స్వభావము మన హృదయమున స్థిరపడును. అదియే పరలోకమున మనతో నుండునది.

స్వభావము లన్నిటికిని మూలము ఈ నాలుగు స్వభావములే. తృష్ణ అను పంది యొక్క ఆజ్ఞ ప్రకారము నడచిన వాని హృదయమున అపవిత్రత, లజ్జా హీనత, లంపటత్వము అను గుణములు ఉండును.

తృష్ణ అనెడు పందిని తన వశమునందు ఉంచుకొనినచో సంయమము, సౌశీల్యము, గాంభీర్యము, నిర్లోభము, నిష్కామము, తృష్ణాభావము మొదలగు సద్గుణములు కలుగును.

క్రోధము అనెడు కుక్కకు మానవుడు లొంగిపోయినచో కుటిలత్వము, జంకు లేక పోవుట, ఆత్మస్తుతి, డాంబికము, దుర్వచనములు పలుకుట, పదవీ వ్యామోహము, ఇతర జీవులను తమకంటే తక్కువగా చూచుట, ఇతరులను దుఃఖింప జేయుట మొదలగు అనేక దుర్గుణములు ఉద్భవించును. ఆ కుక్కను లొంగదీసుకొనినచో ధైర్యము, సహనము, ఓర్పు, శాంతి,

పరాక్రమము, దయ మొదలగు సుగుణములు ఉద్భవించును.

భూత ప్రేతముల ఆజ్ఞలను మానవుడు అనుసరించినచో ఆవిధముగనే ప్రవర్తించును. వారి హృదయములయందు మాలిన్యము, రోగము, కపటము, చింత, చపలము, పాఖండము మొదలగు చెడు స్వభావములు ఉద్భవించును. ఆ స్వభావమును వశపరచుకొనినచో వానికి లోబడడు. వాడు మనస్సును జయించును. అతనికి వివేకము, జ్ఞానము, విద్య, అనుభవము, పరోపకారము, శ్రద్ధ, మొదలగు గుణములు పెరుగును.

సత్స్వభావము మానవునియందు పెరిగిన అవి వానితో సర్వకాల సర్వావస్థలయందును ఉండును. అవి మానవుని పరమ భాగ్యమునకు నశించని బీజములు, అశుభ స్వభావములచే హృదయము అపవిత్రమగును. అదియే పాపము.

మానవుడు చెడు పని చేసినను, మంచి పని

చేసినను అది మానవుని విడనాడదు. మానవుని హృదయము దర్పణమువలె శుభ్రమయినది. ఆతడు చేయు పాపములు తుప్పువంటివి. ఆ హృదయము భగవానుని రాజ్యమునకు వెళ్లలేదు.

సత్స్వభావము కల మానవుడు ప్రకాశరూపుడు. ఆ ప్రకాశముచే హృదయ దర్పణముయొక్క అవిద్య అనెడు అంధకారము పోవును.

శంకరాచార్యులవారు చెప్పిరి.

మానవుడు చెడు పని చేసిన తరువాత వెంటనే మంచి పని చేసినచో దుష్కృత్యముచే వచ్చిన హృదయ మాలిన్యము పోవును. పరలోకము నందు ఎవరి హృదయము ఎట్లు ఉన్న అటులనే ప్రకటమగును. నిర్మల హృదయము అక్కడ అటులనే కాననగును.

“పరిశుద్ధాత్ములు నా మార్గమున నడచెదరు” అని భగవానుడు చెప్పెను. మానవుని హృదయాదులు ఉత్పత్తి కాలమున లోహ

ఫలకమువలె మొద్దుగా నుండును. విధివిహితముగ సంస్కరించుట చేతనే అవి నునుపెక్కి సర్వ పదార్థములను ప్రదర్శించును. అట్లు మర్దన సంస్కారముచే వానిని ప్రకాశవంతముగ చేయనిచో అవి మాలిన్యమును పొందును. వానియందు నిర్మలత్వము ఉండదు. అవి ఏ విషయమును చూపించలేవు.

భగవానుడు చెప్పెను. "ఇందు సందేహము లేదు. నేను నీ హృదయమును చూచుదును. నీవు ఏమి చేయుచున్నను నీ హృదయమునే చూచుచున్నాను."

స్వామివారు నాకు బ్రహ్మచర్యాశ్రమమున పూర్తిగా నిత్య కర్మలను ఆచరించమని చెప్పిరి. అనంతరము పారసభాగమున చెప్పబడిన జీవ స్వభావమును గురించి కూడ మీకు తెలిపితిమి. ఈ ప్రకారముగా మీరు బ్రహ్మచర్యాశ్రమమును గడపినచో అది మీకు చాలును.

అనంతరము ఉదయ శంకర భాయి

పలికిరి.

వీరికి బ్రహ్మచర్యాశ్రమమును గురించి చెప్పిరి. అటులనే మాకును గృహస్థాశ్రమమును గురించి చెప్పినచో ఎంతయో ఉపకారమగును. ఇవి అన్నియు మేము తెలిసికొనవలసినవే. ఇంతలో భోజనమునకు పిలుపు వచ్చెను. స్వామివారు భోజనానంతరము విషయములు వివరించెదమని చెప్పిరి. అందరు భోజనములకు లేచిరి.

ఓం

# ఇరువది ఐదవ ప్రసంగము

భోజనానంతరము అందరును స్వామి శ్రీ నిత్యానందుల వారి వద్దకు చేరిరి. ఉదయశంకరభాయి పూర్వపు ప్రసంగమును జ్ఞాపకము చేసి గృహస్థాశ్రమమును గురించి కొంచెము చెప్పుడనెను.

## గృహస్థాశ్రమము

స్వా. ని. :-

***యావన్న విన్దతే జాయాం తావదర్ధో భవేత్పుమాన్/***
***యన్న బాలైః పరివృతం శ్మశానమివ తద్గృహమ్//***

"మానవుడు భార్యను పొందనంత వరకు అర్ధ మాత్రుడగనే అసంపూర్ణుడుగనే ఉండును. బాలకులచే నిండియుండని ఇల్లు శ్మశానముతో

సమానము.”

జగదుత్పత్తికి ప్రథమ సంకల్పముగా ప్రజాపతి మనువును, శతరూపను సృజించెను. పురుషుడు ప్రథమమున ఒంటరిగా నుండుటచే రమణాది క్రియలకు వేరొక ప్రాణిని కోరెను. ఇట్లు పత్నీపతుల ఆవిర్భావము జరిగినట్లు బృహదారణ్యకము చెప్పుచున్నది.

***స వై నవ రేమే, తస్మాదేకాకీ న రమతే స ద్వితీయమైచ్ఛత్/***
***స హైతా వానాస యథా స్త్రీ పుమాంసౌ సంపరిష్వక్తౌ/ స ఇమమేవా***
***త్మానం ద్వేధాపాతయత్తతః పతిశ్చ పత్నీ చాభవతాం తస్మాదిద మర్ద***
***యగలమివ స్వ ఇతి హ స్మాఽహ యాజ్ఞవల్క్యస్త స్మాదయమాకాశః***
***స్త్రియా పూర్యత ఏవ తాగ్ం సమభవత్తతో మనుష్యా అజాయన్త//***

“ఈ విధముగా ఆ ప్రజాపతికి ఏ విధముగను

ఆనందము కలుగ లేదు. ఒంటరిగా నుండుటచే ఎవనికిని ఆనందము కలుగదు కదా! ఆతనికి రెండవ వ్యక్తిని గూర్చి- భార్యను గూర్చి కోరిక కలిగెను. భార్యా భర్తలు ఒకరినొకరు ఆలింగనము చేసికొనిన స్థితిని ఆ ప్రజాపతి పొందెను. ఆతడు తననే రెండుగా విభజించెను. ఆ విధముగ భార్యాభర్తలు ఉద్భవించిరి. రెండు పప్పు బద్దలు ఒక గింజ నుండి వెలువడినట్లు వారు వెలువడిరి. ఎవరికి వారు అర్ధ భాగము మాత్రమే.

యాజ్ఞవల్క్యుడు ప్రజాపతిని గురించి ఈ విధముగా తెలిసికొనెను. ఆ న్యూనత్వము భార్య యొక్క అస్తిత్వముచే పూరించబడినది. ఆ మనువు భార్యయగు శతరూపను పొందెను. వారికి మనుష్యుడు జన్మించెను.

ఇదేవిధమగు వృత్తాంతము బైబిలునందు కూడ ఉన్నది. పరమాత్ముడు చెప్పెను. "మానవుడు ఒక్కడే ఉండుట బాగుగా లేదు. కావున నేను ఆతనికి సహాయకుడను సృష్టించెదను." అని తలచి ప్రభువు భూమి మీద

నుండు వనచరములగు జంతువుల నన్నిటిని సృష్టించెను. ఆకాశమునందు ఎగురు అన్ని పక్షులను పుట్టించెను. వాని నన్నిటిని ఆదము దగ్గరకు తీసికొనివచ్చి అడిగెను. "వీనిని నీవు ఏ పేర్లతో పిలచెదవు." అనంతరము ఆదము వానిని ఏ ఏ పేర్లతో పిలచెనో అవి నిలబడి యుండెను.

ఆదము అన్ని పశువులకును, జీవులకును పేర్లు పెట్టెను. కాని ఆదమునకు తాను తప్ప మరియొక సహాయకుడు లేకుండెను. తరువాత పరమాత్ముడు ఆదమునకు గాఢనిద్ర రప్పించెను. ఆతడు నిద్రించెను. ఆ సమయమున ఆతని ఒక ఎముకను, అచ్చటి మాంసమును తీసి ఆ భాగమును యథాప్రకారముగా నింపి వేసెను.

ఆ ఎముకతో ప్రభువు స్త్రీని సృష్టించి ఆమెను పురుషుని వద్ద విడిచెను. ఆదము చెప్పెను. 'ఈమె నా ఎముకలలో ఒక ఎముక. మాంసము నందలి మాంసము.' ఇది. "స్త్రీ" అనబడును. ఏలనన ఈమె పురుషునినుండి ఉత్పన్నమైనది. ఆమె

‘ఈల్’ అను పేరుతో చెప్పబడినది.

అందుచే మనుష్యుడు తన తల్లిని, తండ్రిని విడచి తన భార్య సంపర్కము నందే ఉండును. భార్యాభర్తలు ఇరువురును నగ్నముగా నున్నను వారికి సిగ్గు కలుగదు.

**“సర్వావయవ సంపూర్ణాం సువృత్తా ముద్వ హేన్నరః”** అని ధర్మశాస్త్రమున వ్రాయబడినది. సమస్త అవయవములును సంపూర్ణముగా కలిగియుండి సదాచారశీలయగు కన్యను నరుడు వివాహము చేసికొనవలెను. వివాహము చేసికొను సమయమున కన్యయొక్క కులమును గురించి ఆలోచించమని శాస్త్రములు చెప్పుచున్నవి.

**“సా సాధ్వీ కులజా య చ పతి సేవాసు తత్పరా”**

“ఉత్తమ కులమున జన్మించి సదాచార పరాయణురాలయి భర్తృ సేవా నిరతురాలగు

కన్యను వివాహమాడవలెను.”

పూర్వకాలమున కులీనులనబడు వారు కన్యా విక్రయము చేసెడివారు కారు. అంతే కాదు. వ్యవహారము నందు కూడ సచ్ఛీలురు. నిష్కపటులు. ఆదానప్రదానముల యందు నమ్ముటకు వీలుగ నుండెడివారు. శాస్త్రములయందు చెప్పబడిన సత్య నిష్ఠాదులను పాటించెడివారు. ఈ రోజుల్లో మాత్రము ఆ కులములును, కులీనత్వమును పరంపరాగతమయిన మర్యాద పైన మాత్రమే ఆధారపడి ఉన్నవి. కులీనులు అకులీనులు చేయు పనులు కంటె కూడ తక్కువ రకపు పనులు చేయుట అనేక చోట్ల కనబడుచున్నది.

# అకులీనమగు కులము

కన్యా విక్రయము చేయు కులము అకులీనమగు కులము అని స్థూలముగా చెప్ప వచ్చును.

***కన్యాం ప్రదాయ యైర్వృత్తిరాత్మనః పరికల్ప్యతే/***
***దాసభాణ్డనటాదీనాం మార్గోఽయం న మహాత్మనామ్ //***

కన్యావిక్రయము చేసి జీవితము గడపుకొనుట దాసులు, హాస్యగాళ్ళు, నటులు చేయు పని. మహాత్ములు ఆచరించదగినది కాదు. కన్యావిక్రయము జరిగిన వంశమునందలి కన్యను వివాహమాడరాదు.

కన్యావిక్రయాదులు జరుగని వంశము ఉత్తమవంశము. కన్యావిక్రయము చేయు వంశము అధమ వంశము.

***స్వకన్యాపాలనం కృత్వా విక్రీణా తీహ యో నరః /***
***అర్థలో భాన్మహామూఢో మాంసకుణ్డం ప్రయాతి సః //***

“తన కుమార్తెను పెంచి ధనలోభముతో అమ్మువాడు మహా మూఢుడు. అతడు

మాంసకుండమను నరకములో పడును.” కన్యను అమ్మిన వచ్చు ధనముతో తిను అన్నము కన్య యొక్క మాంసముతో సమానము. దృష్టాంతము వినుడు.

ఒక బ్రాహ్మణుడు తన కుమార్తెను సమీప గ్రామమున విక్రయించి ఆ ధనముతో వచ్చుచుండెను. త్రోవలో ఒక ధర్మశాల ఉండెను. ఆ సత్రములో ఉన్నత జాతులకు చెందిన వారు ఉండెడివారు. కొంచెము దూరమున మిగిలిన జాతుల వారు ఉండెడివారు. చాండా లాదులు ఉన్న త్రోవను వచ్చి ఆ బ్రాహ్మణుడు ధర్మశాలలో ప్రవేశించెను. అచ్చటి వారు ప్రశ్నించిరి. “నీవు ఏ జాతికి చెందిన వాడవు?”

బ్రాహ్మణుడు:—నేను బ్రాహ్మణుడను.

అంతట అచ్చటి వారు మరల ప్రశ్నించిరి.

“నీవు బ్రాహ్మణుడవైన చాండాలాదులు కుక్క మాంసము వండు మార్గమున ఎందుకు

వచ్చితివి? నీవు వెళ్ళి స్నానము చేసి రమ్ము.”

బ్రాహ్మణుడు స్నానమునకు వెళ్ళి అచ్చట కన్పించిన ఒక చాండాలునితో కోపముతో నిట్లనెను. “నీవు చండాలుడవనియు, ఇక్కడ కుక్క మాంసమును వండుచున్నా వనియు మొదట చెప్పి యుండవలసినది. నీవు నన్ను అపవిత్రుని చేసితివి. నీ మూలమున నేను స్నానము చేయాల్సి వచ్చినది.”

చాండాలుడు ఆతనిని జాతి గూర్చియు, ఎక్కడనుండి వచ్చుచున్నదియును అడిగెను. బ్రాహ్మణుడు అన్ని సంగతులను వివరించెను. అతడు తన కుమార్తెకు పెండ్లి చేసి వచ్చుచున్నానని చెప్పెను.

చండాలుడు అడిగెను:- “పెండ్లి సమయమున ధనము ఏమైన తీసికొంటివా?”

బ్రా:- నేను బీద బ్రాహ్మణుడను. కొంచెం ధనము తీసి కొనవలసి వచ్చెను. ఏమి చేయుదును.

చాం :- అయిన నేను జాతి చండాలుడను. కాని నీవు కర్మ చండాలుడవు. నేను కుక్క మాంసము వండుకొని తినుచున్నాను. నీవు నీ కూతురు మాంసమును తినుచున్నావు. నీవు ఈ మార్గమున వెళ్ళితివి. అందుకే నేను అపవిత్రుడనైతిని. కావున నేను స్నానము చేయవలసియున్నది.

కావున ఇట్టి వంశమునందలి కన్యను పరిణయ మాడుట దోషము.

ఉదయ:- కన్య తండ్రి ధనము తీసికొనిన కన్యకు దోషము ఏమి? కన్య ఉత్తమురాలైన పాణిగ్రహణము చేయుటలో తప్పుఏమి?

స్వా. ని. :—

***క్రీతా ద్రవ్యేణ యా నారీ న సా పత్నీ విధీయతే।***
***న సా దైవే న సాపిత్ర్యే దాసీం తాం కశ్యపోఽబ్రవీత్ ॥***

"ధనము ఇచ్చి కొనుక్కొనిన స్త్రీ భార్య

అనబడదు. దేవ, పిత్ృ కార్యములందు ఆమెకు యోగ్యత లేదు. కశ్యపుడు ఆమె దాసి అని చెప్పెను.”

పూర్వ కాలమున పురుషులు, స్త్రీలును బానిసలుగా అమ్మ బడెడివారు. అమ్మకములో కొన్న వస్తువు తనదని చెప్పబడినట్లుగనే, అమ్మకములో కొన్న స్త్రీ పురుషులు కూడ తన వారుగనే చెప్పబడుదురు. వారు మన వద్ద ఏ పని చేసినను, ఏమి అనుభవించినను దాసదాసీ జనులతో సమానమే.

***క్రయ క్రీతా చ యా కన్యా పత్నీ సా న విధీయతే |***
***తస్మాజ్జాతా సుతా స్తేషాం పితృపిణ్డం (న) విధీయతే||***

ధనమునిచ్చి కొనబడిన స్త్రీ భార్య అనబడదు. అట్టి భార్యకు పుట్టిన కుమారుడు తండ్రికి పిండప్రదానము చేయుటకు అర్హత కలవాడని ఏ శాస్త్రము నందును చెప్పబడలేదు.

# భార్య భర్తల ఆదర్శము

***సా భార్యా యా పతిప్రాణా సా భార్యా యా ప్రజాపతీ।***
***మనో వాక్కర్మభిః శుద్ధా పత్యాదేశానువర్తినీ ॥***

పతిని ప్రాణ సమానముగా చూచునదియు, సంతానవతియును, మనస్సుచేతను, వాక్కు చేతను, కర్మల చేతను పరిశుద్దమయినదియును, భర్త్రాజ్ఞానువర్తినియును అగు నామె భార్య. భార్య భర్తను ప్రాణముతో సమానముగా చూచుకొనవలెను. వంశ వృద్ధి కొరకు సంతానమును కోరవలెను. పవిత్రమగు అంతఃకరణమును కలిగియుండవలెను. పరిశుద్ధములగు కర్మలను ఆచరించవలెను. పతి మాట దేవుని మాట అని తలచి ఆతడు ఆజ్ఞాపించినట్లు సంచరించ వలెను.

ఈవిషయమున కబీరు దృష్టాంతము కలదు.

ఒకనాడు సమీపముననున్న నగరమునుండి

# ఇరువది ఐదవ ప్రసంగము

ఇద్దరు ముగ్గురు గృహస్థులు తమ సందేహాలను నివారణ చేసికొనుటకు కబీరు వద్దకు వచ్చిరి. ఆ సమయమున కబీరు నేత నేయుచుండెను.

వారు ప్రశ్నించిరి. జ్ఞానము సంపాదించుకొనుట గృహస్థాశ్రమము నందు సులభమా? సన్యాసాశ్రమము నందు సులభమా?

ఇంతలో ఆయన భార్యను ఆజ్ఞాపించెను. "త్రాడు తెగినది. అతుకుటకు దీపము తీసుకొని రమ్ము." ఆమె దీపము తీసుకొని వచ్చెను. త్రాడును అతికిన తరువాత కబీరు భార్యతో చెప్పెను. "దీపము తీసికొని వెళ్ళుము," ఆమె ఆ ప్రకారము చేసెను. అనంతరము కబీరు ఆగంతకులతో చెప్పెను. మీ సందేహమునకు సమాధానము వచ్చినది. నా భార్య దీపము తీసికొని వచ్చినది. మరల దీపము తీసికొని పోయినది. గృహస్థులు అడిగిరి. "స్పష్టముగా తెలియజేయుడు." ఆ మహాత్ముడు పలికెను, "ఇట్టి పతివ్రతయగు భార్య ఉన్నచో గృహస్థాశ్రమము నందు కూడ సుఖముగా

జ్ఞానము కలుగును. జ్ఞానము లేని భార్య ఉన్నచో ఈ విధముగా పట్ట పగలు కూడ దీపము తీసికొని రమ్మని ఆజ్ఞాపించినప్పుడు ఏమి కన్పించుట లేదా, రాత్రియో పగలో తెలియుట లేదా? అని అడుగును. కాని ఈమె నా ఆజ్ఞను వేద వాక్యముగా తలచి దీపము తీసికొనివచ్చి హాజరయినది. ఇటువంటి భార్య ఉన్న వ్యక్తి యొక్క జీవితము సుఖముగా గడచును. చతుర్విధ పురుషార్థములును నిర్వహించబడును. ఈ విధంగా ధర్మార్థ కామ మోక్షముల అన్నిటియందును ఒకే విధముగ నడచువారికి పరమాత్ముడు సుఖము, శాంతి, కళ్యాణము కలుగ జేయును."

***సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ/***
***యస్మిన్నేవ కులే నిత్యం, కల్యాణం తత్ర వై ధ్రువమ్ //***

ఏ వంశమున భార్య వలన భర్తయు, భర్త

వలన భార్యయు సంతోషముగా నుందురో ఆ వంశమునకు నిస్సందేహముగా మంగళములు కలుగును. భార్యాభర్తలు ఉభయులును పరస్పరము కలసి యుండి సంతోషమును స్థిరపరచుకొనుటకు అన్యోన్య ప్రేమానురాగములతో ప్రయత్నించుచుండవలెను. ఒకరి తప్పులు మరియొకరు వెదకుట పనికాదు. ఒకరిపై మరియొకరు కోపించరాదు. పరస్పరము హితకరములగు పనులు చేసి సంతృప్తిని పొందవలెను. బండికి కట్టబడిన రెండు గుఱ్ఱములును సరిగా నడవక దేని వైపునకు అదియే లాగుటకు ప్రయత్నించినచో బండి తలక్రిందులగును. సరిగా నడచినచో ఏ బాధయు లేకుండ గమ్యమును చేరును. అటులనే భార్యాభర్తలు కూడా ఒకరికొకరు అనుకూలురయి నడువవలెను.

## భార్యా భర్తల ధర్మము

***అన్యోన్యస్యాఽ వ్యభిచారో భవేదామరణాన్తికమ్ /
ఏష ధర్మః సమాసేన జ్ఞేయః స్త్రీ పుంసయోః పరః//***

భార్యభర్తలు ఇరువురును ఆమరణాంతము ధర్మార్థకామములు మూడింటియందును వ్యభిచరించరాదు. అనగా భిన్నములగు ఉద్దేశ్యములను కలిగియుండరాదు. సంక్షేపముగా చెప్పదలచినచో ఇది భార్యాభర్తలు ఉభయుల శ్రేష్ఠమగు ధర్మము అని తెలిసికొనవలెను. భార్యయును, భర్తయును ధర్మమునందును, సాంసారిక కార్యముల యందును, భోగముల యందును పరస్పరము వ్యతిరేకములగు అభిప్రాయములతో నుండరాదు. భార్య భర్తకు సహకారిణిగను, సహధర్మచారిణిగను, సహభోగినిగను ఉండవలెను. ధర్మ కార్యముల యందు విపరీత భావములను కలిగియుండుట ధర్మ వ్యభిచారం. ధర్మ కార్యములయందు

వ్యతిరేక భావములను కలిగియుండని భార్య సహ ధర్మచారిణి అనబడును. శాస్త్రీయ దృక్పథమతో ఆలోచించిన తండ్రి భర్తకు కన్యాదానము చేసినప్పుడే భర్త గోత్రమునకు ఆమె సంబంధించును. భర్త గోత్రమే ఆమె గోత్రము. అటులనే ధర్మము కూడను.

ఒక గ్రామమునందు ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. వారికి ఒకడే కుమారుడు. ఒక రోజున వారు పురాణమునందు నూరుగురు బ్రాహ్మణులకు భోజనము పెట్టిన కలుగు ఫలము ఒక సన్యాసికి భిక్ష చేసిన కలుగును అని వినిరి. అది విని ఆ బ్రాహ్మణుడు ప్రతిరోజును ఒక దండకమండల ధారియగు సన్యాసిని కాని, త్యక్తదండిని కాని, అతడును కన్పించక పోయినచో శ్వేత వస్త్రధారియగు సన్యాసిని కాని (కుటీచకుడు, బహూదకుడు, కంసుడు) ప్రతి రోజును భిక్షకు పిలువవలెనని నిశ్చయించెను. ఈ నిర్ణయమునకు భార్యయు, కుమారుడును చాల బాధపడుచుండిరి. ఒకనాడు యథాప్రకారము ఆ

బ్రాహ్మణుడు భిక్షకు ఒక సన్యాసిని ఇంటికి తీసికొని వచ్చెను. ఇంటియందు భోజన పాత్రలు లేనందున సన్యాసిని ఇంట కూర్చుండ నియమించి విస్తరాకుల కొరకు బజారునకు వెళ్లెను. ఈ అదను చూచి బ్రాహ్మణుని భార్య ఆ సన్యాసితో నిట్లనెను :- “స్వామి! తమరు ఈ వలలో చిక్కుకొనిరా? ప్రతిరోజు తమవంటి వారిని పిలిచి కడుపునిండా తినిపించి దుడ్డుకర్రతో ఎముకలు విరుగగొట్టి తరిమి వేయుట నా భర్తకు అలవాటు. తమరు ఈ ఊబిలో దిగబడితేరే! తమరు ఈ దురదృష్టము నుండి తప్పించుకొనగోరినచో నా భర్త ఇంటికి వచ్చుటకు పూర్వమే ఇక్కడి నుండి వెళ్ళిపొండు.”

బ్రాహ్మణి వాక్యములను విని సన్యాసి అచ్చటినుండి బయలుదేరి వెళ్లిపోయెను.

ఇంతలో బ్రాహ్మణుడు విస్తరాకుల తీసికొని ఇంటికి వచ్చెను. ఆతనికి సన్యాసి కనపడలేదు. “స్వాముల వారు ఎక్కడికి వెళ్లిరి?” అని

ప్రశ్నించెను. భార్య సమాధానము చెప్పెను. "వారు దుడ్డు కర్ర కావలెననిరి. నేను ఇవ్వనని చెప్పితిని. అంతట వారు క్రోధముతో లేచి వెళ్లిపోయిరి."

బ్రాహ్మణుడు పలికెను. "అయ్యో! ఎంత తప్పు చేసితివి! ఒక దుడ్డుకర్ర ఇచ్చినచో ఏమి పోవును?" ఇట్లని బ్రాహ్మణుడు దుడ్డుకర్ర తీసికొని సన్యాసికి ఇచ్చుటకై పరుగిడెను. దూరముగా సన్యాసి పోవుచుండుట చూచి "స్వామీ! నిలబడుడు. ఈ దుడ్డుకర్ర తీసికొని వెళ్లుడు" అని గట్టిగా పిలచుచు ఊపిరి బిగపట్టి వేగముగా సన్యాసి వెనుక పరుగిడ సాగెను. భార్య చెప్పిన విధముగా బ్రాహ్మణుడు కొట్టుటకు దుడ్డుకర్ర తీసికొని వచ్చుచున్నాడని తెలిసికొని సన్యాసి ఉరకలు వేసికొని పరుగిడ సాగెను. ముందు సన్యాసి వెనుక బ్రాహ్మణుడును పరుగెత్తిరి. బ్రాహ్మణుడు "స్వామి, దుడ్డుకర్ర తీసికొనుడు" అని ఎంత చెప్పుచు పరుగెత్తినను సన్యాసి ఆ కేకకు అంద లేదు. బ్రాహ్మణుడు

అలసిపోయి నిరాశతో ఇంటికి తిరిగి వచ్చెను.

ఇట్లు ధర్మ కార్యముల యందు భర్తకు విపరీతముగా సంచరించినచో అట్టి భార్య సహధర్మచారిణి కాదు.

సహభోగిని:- భర్తకు పర నారి యందును, భార్యకు పర పురుషుని యందును అనురాగము కలిగినచో వారు ఇరువురును భోగము నందు వ్యభిచారము చేయుచున్నట్లు ఎరుగనగును. ఈ భోగమునకు సంబంధించిన వ్యభిచారము అన్ని విధముల దూష్యము. దీనిచే పాపమును, అపవిత్రతయును కలిగి ధర్మ భ్రష్టులగుదురు. పురుషుడు పర స్త్రీని కాని, స్త్రీ పర పురుషుని కాని ఆసక్తి కల దృష్టితో చూచినచో అది మానసిక వ్యభిచారము.

జమదగ్ని మహర్షి భార్య ప్రతి దినము నదిలోనికి స్నానము చేయుటకు వెళ్ళుచుండెను. స్నానము చేసిన తరువాత ఇసుకతో కుండను తయారుచేసి ఋషికి అర్ఘ్యాది విధులను

నిర్వర్తించుటకు జలమును తీసికొని వచ్చుచుండెడిది. ఒకరోజున ఆమె స్నానము చేయుచుండగా కార్తవీర్య మహారాజు ఆకాశమార్గమున వెళ్ళుచుండెను. ఆయనను చూచి ఋషి పత్ని ఇట్లనెను. "ఎంత సౌందర్యవంతుడు!" అనంతరము ఆమె స్నానము చేసి యథాప్రకారము ఇసుకతో కుండను చేయుటకు ప్రయత్నించెను. కాని కుండ తయారవలేదు. ఎంత శ్రమ పడినను ఇసుకతో కుండ తయారవలేదు. ఋషి భార్య కుండ లేకుండ ఆశ్రమములోనికి వచ్చుట చూచి జమదగ్ని ఆమెను ప్రశ్నించెను. "నీవు నీరు తీసికొని రాలేదా?" ఋషి పత్ని చెప్పెను. "నేడు కుండ తయారవలేదు."

జమదగ్ని అడిగెను. "ఏ పురుషుని అయిన చూచితివా?"

భార్య:—కార్తవీర్య మహారాజు ఆకాశమునందు వెళ్ళుచుండెను. ఆయన ఎంత అందమైన వాడు అను భావము నాకు కలిగెను.

అంతట జమదగ్ని ఇట్లనెను:— "నీవు మానసిక వ్యభిచారము చేసితివి."

ఇట్లని ఆయన తన కుమారుడగు పరశురాముని పిలచి చెప్పెను. "నీ తల్లిని సంహరించుము." తండ్రి చెప్పినట్లు కుమారుడు చేసెను. తాత్పర్యమేమన, తన భార్య తప్ప మిగిలిన స్త్రీల నందరను తల్లి, లేక సోదరి అను దృక్పథముతో చూడవలెను. తన భర్త తప్ప పురుషులందరి యందును తండ్రి లేక సోదరుడు అను భావముతో ప్రవర్తించవలెను.

ఈ కారణము చేతనే భార్యాభర్తలు ధర్మార్థ కామముల యందు వ్యభిచరించరాదు అని ఉపదేశించబడినది.

***"తథా నిత్యం యతే యాతాం స్త్రీ పుంసౌ తు కృత క్రియౌ/***
***యథా నాభిచరేతాం తౌ వియుక్తావిత రేతరమ్.//"***

వివాహం చేసికొనిన భార్యాభర్తలు వియోగావస్థ యందు కూడ వ్యభిచారము చేయకుండుటకు ఎల్ల వేళల యందును ప్రయత్నించవలెను.”

భార్య భర్తలు ఎంత కష్టము పడవలసివచ్చినను సహించి ఒకరినొకరు ఎల్లప్పుడును రక్షించు కొనవలెను. కొన్ని వేళలయందు భర్త వ్యాపారాదుల కొరకు పర దేశము వెళ్ల వలసి వచ్చును. అటులనే భార్య పుట్టింటికి వెళ్ళ వలసి వచ్చును. ఈ పరిస్థితుల యందు ఉభయులును వ్యభిచరించ రాదు.

పురుషుడు తనను రక్షించు కొనగలడు. కాని భార్య పరాధీనురాలు. అబల. కావున ఆమెను రక్షించుట భర్త ధర్మము. అయినను వాస్తవమునకు భార్య తనను తాను రక్షించు కొనవలెను.

***అరక్షితా గృహే రుద్ధాః వురుషైరాప్త కారిభిః/
ఆత్మానమాత్మనా యాస్తు రక్షేయుః తాః సురక్షితాః//***

ఇంటిలో ఆజ్ఞాపించు పురుషుల నడుమ ఉన్నను స్త్రీ రక్షణ లేనిదిగనే ఉండును. తనను తాను రక్షించుకొను స్త్రీయే పరిపూర్ణ రక్షణ కల నారి. సదాచార పరాయణురాలగు వనిత ఏ కట్టుబాట్లు లేకపోయినను తన శీలమును తానే కాపాడుకొనును. సచ్ఛీలయగు రమణి తన భర్త పరదేశములకు వెళ్ళినపుడు అతని మిత్రులు మొదలగు వారితో ఎంతయో మర్యాదతో ప్రవర్తించును. వారితో సంభాషించు అవకాశములు చాలా తక్కువ ఉండును. తగినంత కారణము లేనిదే బయటకు ఎక్కడికిని వెళ్ళదు. సుందర వస్త్రాలంకారములను ధరించి షోకుగా తిరుగదు. ఇట్టి ఆచారములతో మర్యాదగా సంచరించవలెను. క్లిష్ట పరిస్థితుల యందుకూడ సమయస్ఫూర్తితో తనను రక్షించు కొనవలెను.

ఒకమారు ఒక ఉత్తమ కుటుంబీకురాలి భర్త ఏదో పనిమీద ఇతర గ్రామమునకు వెళ్ళెను. భార్య ఒకతెయే ఇంటిలో ఉండెను. గృహము

చాల విశాలమైనది. సంధ్యా కాలమయి దీపము వెలిగించిన తరువాత ఒక నీచుడగు యువకుడు ఆమె ఒంటరిగా నుండుట తెలిసికొని భవనము నందలి ఒక చీకటి కోణములో దాగికొని యుండెను. ఆమెకు ఇది తెలియదు. రాత్రి 8, 9 గంటలకు సింహద్వారమును మూసి వేసెను. రాత్రి పన్నెండు గంటలకు ఆ నీచుడు మూల నుండి బయటకు వచ్చెను. ఆమె ఒంటరిగా నుండెను. ఇల్లు ఇతర ఇండ్లతో సంబంధము లేకుండ ఉండెను. కావున ఆమె తన శీలమును కాపాడు కొనుటకు ఉపాయమును ఆలోచించెను. ఆమె ధైర్యముతో ఆ పురుషుని సమీపించి ఇట్లనెను. "నీవు వచ్చుట చాల మంచి పని దైవము నా యందలి అవ్యాజానురాగముతో నిన్ను నా చెంతకు పంపెను.

నా భర్త నన్ను పెట్టు బాధలకు అంతు లేదు. ఆతడు అనిన నాకు ఎంతయో విరక్తి కలిగినది. ఆతడు ఇంటియందు కూడ లేడు. నీవు నేడు వచ్చుట నా అదృష్టము. మనము ఇరువురము

కలసి ఎచ్చటికైనా వెళ్ళిపోవుదము. ఇదియే మంచి అవకాశము.”

ఇట్లు చెప్పుచు నగలు, నాణెములు ఉన్న పెట్టెలను చూపించి ఆమె ఇట్లు పలికెను.

“ఇవిగో ఇవి ఆ నగల పెట్టెల తాళములు. నా వద్ద మనము ఇరువురము జీవితాంతము వరకు అనుభవించినను సరిపోవునంత ధనము కలదు. నీవు నగలు, ధనము మూట కట్టుచుండుము. నేను త్రోవలో తినుటకు పూరీలు, కూర మొదలగునవి తయారుచేసి తీసికొని వచ్చెదను.”

ఇట్లు చెప్పి ఆమె వంట ఇంటిలోనికి వెళ్ళెను. ఆమె పూరీలు, కూర తయారుచేసెను. ఆ వ్యక్తి నగలు, ధనము మూటకట్టెను. ఆతనిని పిలచి ఆ వనిత ఇట్లనెను. “పూరీలు తయారుచేసితిని. కొంచెము రుచి చూడుము” అని అతనిని వంట ఇంటిలో కూర్చుండ బెట్టి పొయ్యి మీద సలసల కాగుచున్న నూనె అతని

ముఖముపై పోసెను. తరువాత ఆమె బయటికి వచ్చి గోల చేసెను. అంత నలుగురును వచ్చి ఆతనిని పట్టుకొనిరి.

తాత్పర్యమేమన, భార్య విద్వాంసురాలును, సచ్ఛీలయును, బుద్ధిమంతురాలును అయినచో తనను తానే రక్షించుకొనును. దేవుడు కూడ ఆమెకు సహాయము చేయును.

ఉదయ:-చాలమంది స్త్రీలకు చదువు చెప్పించ రాదనెదరు. వారు తమ పుత్రికలను పాఠశాలలకు కూడ పంపరు. దాని పరిణామముగా వారికి బౌద్ధిక వికాసము కలుగదు. ఆ కారణముచే చదువురాని స్త్రీలు బుద్ధిని ఉపయోగించి తమను తాము రక్షించుకొనలేరు.

## బాలికలకు చెప్పదగిన చదువు

స్వా.ని. :- పూర్వ కాలమున బాలికలు

కూడా ధర్మశాస్త్రములు, సాహిత్యము, సంగీతము మొదలగునవి చదివెడివారు. ఈ విషయము పూర్వ కాలము నందలి స్త్రీలగు సీత, దమయంతి మొదలగు వారి ఇతిహాసములను చదివినచో తెలియనగును. ఈ మధ్య కొంత కాలమునుండి మాత్రము కారణాంతరములచే బాలికలకు సామాన్య జ్ఞానము కూడ కలిగించుట మానివేసిరి.

మహానిర్వాణమున వ్రాయబడినది.

***కన్యా ప్యేవం పాలనీయా శిక్షణీయాఽతి యత్నతః/***
***దేయా వరాయ విదుషే ధనరత్న సమన్వితాః//***

"బాలికను కూడా ఇటులనే పోషించి, శ్రద్ధగా చదువు చెప్పించవలెను. ధనముతోను, రత్నములతోను ఆమెను విద్వాంసుడగు భర్తకు ఒసగవలెను."

కుమారునకు చదువు చెప్పించినట్లుగనే కుమార్తెకు కూడ వ్యవహార జ్ఞానమును, పరమార్థ

జ్ఞానమును కలుగు చదువు చెప్పించవలెను. తల్లి గృహాచారములు- అనగా అత్త, మామ, భర్త మొదలగువారితో ఎట్లు ప్రవర్తించవలెనో అనునది నేర్పవలెను. స్వధర్మమును ఎరుగనట్టియు, అత్త, మామ, భర్త మొదలగువారితో లౌకిక వ్యవహారమున ఎట్లు ప్రవర్తించ వలెనో తెలియనట్టియు బాలికను పరిణయ మాడరాదని శాస్త్రములు చెప్పుచున్నవి.

మహానిర్వాణము చూడుడు.

***అజ్ఞాత పతి మర్యాదా మజ్ఞాత పతి సేవ నామ్/***
***నోద్వాహయేత్ పితా బాలామజ్ఞాత ధర్మశాసనమ్//***

"భర్తతో మెలగవలసిన రీతులు తెలియనట్టియు, భర్తను సేవించుట తెలియనట్టియు, ధర్మ నియమములను తెలియనట్టియు బాలికకు తండ్రి వివాహము చేయరాదు."

ఈ రోజుల్లో ధర్మశాస్త్ర పరిజ్ఞానము లేక పోయినను బాధ లేదు. కానీ భర్తృ సేవా పరిజ్ఞానము మాత్రము తప్పక ఉండవలెను.

ఉదయపుర రాణా తన కుమార్తెను మరికొందరు రాజులవలె మహమ్మదీయ రాజులకు ఇచ్చి పెండ్లి చేయలేదు. అంతే కాదు. మహమ్మదీయ రాజులతో వైవాహిక సంబంధములు కల రాజులతో కూడ చేసికొనరాదని నిర్ణయించెను, తన కుమార్తెలను తన రాజ్యమునందలి సర్దారులకే వివాహము చేయ మొదలిడెను. అట్లు వివాహము చేసికొనిన ఒక కుమార్తె అత్త వారి ఇంటికి వెళ్ళిన రెండవ రోజున భర్త ఆమెను పిలిచి ఎచ్చటికో బైటికి వెళ్ళవలసి యున్నదనియు, పాదరక్షలు తీసికొనివచ్చి ఎదుట నుంచమనియు చెప్పెను. రాకుమార్తె పలికెను. నేను దాసీ మనిషినా? నేను ఇట్టి పని చేయను” అని ఆమె తన పుట్టింటికి

వెళ్ళిపోయి తన తల్లితో ఈసంగతి చెప్పెను. రాణా కుమార్తెకు బోధించుటకు ఒక యుక్తిని పన్నెను. ఒకనాడు దర్బార్ లో జరిగిన సభకు తన అల్లుడు వచ్చెను. తన నౌకరుతో ఫలానా సర్దారు యొక్క (తన అల్లుడు) పాదరక్షలు ఫలానా చోట ఉంచుము అని చెప్పెను. ఆ పాదరక్షలు ఉంచబడిన చోటును తన అంతఃపురములో వారు అందరును తెర వెనుకనుండి చూచుటకు వీలుగ నుంచెను. రాణిని, కుమార్తెను ఇంకను ఇతర స్త్రీలను కూడ అచ్చట నుండి చూడ నియమించెను. సభ పూర్తి అయిన తరువాత తన అల్లుని ఆగమని చెప్పెను. అందరును వెళ్ళిన తదుపరి ఆ సర్దారు తాను పాదరక్షలు విడచిన చోటుకు వానిని ధరించ వెళ్ళెను. అవి అచ్చట దొరక లేదు. “ఇచ్చట లేనిచో మరియొక చోట నుండును, ముందునకు నడువుము, అక్కడ నుండును” అని రాణా పలికెను.

ఆవిధముగా రాణా సర్దారును పాదరక్షలు ఉన్న చోటికి తీసి కొనివచ్చెను. తెరలో నుండి

రాణి, రాకుమార్తె మొదలగు రాజ కుటుంబములోని వారందరును రాణాను సర్దారును చూచుచుండిరి. రాణా రెండు పాదరక్షలను తీసి తన రుమాలుతో దులిపెను. సర్దారు ఇది చూచి సిగ్గుపడుచుండ రాణా ఇట్లనెను. "మీరు మా అల్లుడుగారు. మాకు పూజ్యులు." ఈ విధముగా పలికి రెండు పాదరక్షలును రాణా తన చేతులతో తొడగెను. "మా అమ్మాయి బాల్య చాపల్యముచే తన ధర్మమును గుర్తించ లేకపోయినది, క్షమించుడు" అని చెప్పెను.

గృహస్థాశ్రమ ధర్మమును నేర్పుట తల్లిదండ్రుల ధర్మము అని దీని తాత్పర్యము.

అనంతర ప్రసంగమున ఉదయ శంకర భాయి ఈ సందేహమును వ్యక్తము చేసెను. "చిత్తము చాల మలినముగా నుండును. దానిని శుద్ధము చేయుటకు ఏదైన సాధనము కలదా?"

స్వా. ని. :-భగవత్స్వరూపులగు ఆచార్యులు

చెప్పిరి.

***శిష్టాన్న మీశార్చన మార్య సేవాం తీర్థాటనం స్వాశ్రమధర్మనిష్ఠామ్ /***
***యమానుసక్తిం నియమానువృత్తిం చిత్త ప్రసాదాయ వదన్తి తజ్ఞః//***

"పరిశుద్ధమగు సంపాదనము ద్వారా లభించిన అన్నము, ఈశ్వర భక్తి, శ్రేష్ఠ వ్యక్తులను సేవించుట, తీర్థ యాత్రలు, తమతమ ఆశ్రమముల ధర్మముల యందు శ్రద్ధ, అహింసాది నియమములను ప్రేమతో అనుష్టించుట, నియమానుష్ఠానము మొదలగు సాధనములు చిత్త ప్రసన్నతకు, అనగా చిత్త నైర్మల్యమునకు అవసరములు అని చిత్తశుద్ధికి వలయు సాధనములు తెలిసిన వారు చెప్పిరి."

1. ***శిష్టాన్నమ్*** :–శిష్టాన్నము అనగా న్యాయముగా సంపాదించిన ఆహారము. ఆ విషయమున ఇట్లు చెప్పబడినది.

***న్యాయోపార్జిత విత్తేన కర్తవ్యం జ్ఞాన రక్షణమ్/***

***అన్యాయేన తు యో జీవేత్ సర్వ ధర్మ బహిష్కృతః//***

"న్యాయముగా సంపాదించిన ధనముచే జ్ఞానమును రక్షించు కొనవలెను. అన్యాయముగా సంపాదించిన ధనముతో జీవించినవాడు సర్వధర్మ బహిష్కృతుడు."

***న్యాయోపార్జిత విత్తేన*** :- న్యాయముగా సంపాదించిన ధన మనగా ఉద్యోగస్థులు తమ జీతము తప్ప లంచము లేమియు తీసికొన రాదని భావము. అటులనే వ్యాపారస్థులు అధిక లాభములు తీసికొనకుండ సంపాదించిన ధనము న్యాయోపార్జితము అనబడును.

***జ్ఞాన రక్షణమ్*** :- జ్ఞాన రక్షణము అనగా ధర్మా చరణము. పరోక్ష జ్ఞానము కలిగిన తరువాత న్యాయముగా సంపాదించిన ధనము, అహింస మొదలగు దైవ సంపదను ఉపయోగించి, ధర్మమును ఆచరించి అపరోక్ష జ్ఞానమును పొందుటకు ప్రయత్నించవలెను.

ఇచ్చట ఈ ‘జ్ఞాన రక్షణం’ అను శబ్దము పరోక్ష జ్ఞాన రక్షణమును గురించి వ్రాయబడినది.

**అన్యాయేన తు యో జీవేత్** :-ఇక అన్యాయముగా సంపాదించిన ధనముతో జీవించువారు సంగతి ఆలోచించెదము. ఉద్యోగ వర్గము, వ్యాపారస్థులు మొదలగు వారి నుండి తమ అధికారమును దురుపయోగపరచి లంచములను తీసికొనెదరు. అటులనే వ్యాపారస్థులు తమ వస్తువులు చెడ్డవి అయినను మంచి వస్తువుల, ఖరీదును తీసి కొనెదరు. ఆ విధముగా వారు లాభములను సంపాదించెదరు. కొంత మంది వేలకొలది కూలీలను యంత్రములలోను, కర్మాగారముల యందును పనిలోనికి తీసికొని వారిచే రోజంతయును పనిచేయించెదరు. నాలుగణాలు మాత్రము కూలి ఇచ్చెదరు. ఇట్లు సంపాదించిన ధనము అన్యాయముగా సంపాదించిన ధనము అనబడును. ఇట్టి వారు ఎంత కాలము, ఏ విధమైన ఉపాసన చేసినను మల

విక్షేపదోషములు నశించి వారికి జ్ఞానము కలుగదు. వారు సర్వధర్మ బహిష్కృతులు.

ధర్మశాస్త్రమున చెప్పబడినది.

**న్యాయార్జిత ధన స్తత్త్వజ్ఞాన నిష్ఠోఽతిథి ప్రియః/**
**శాస్త్రవిత్ సత్యవాదీ వా గృహస్థేఽపి ముచ్యతే//**

"న్యాయముగా ధనమును సంపాదించు వాడును, తత్త్వజ్ఞానము నందు నిష్ఠ కలవాడును, అతిథులయందు ప్రేమ కలవాడును, శాస్త్రజ్ఞుడును, సత్యవ్రతుడును అయినవాడు గృహస్థాశ్రమమునందే ముక్తిని పొందును."

2. **ఈశార్చనమ్**:- అనగా ఈశ్వర భక్తి అనగా పరమాత్ముని యందలి భక్తి చెప్పబడినది. శాండిల్య సూత్రమున "**సా పరానురక్తి రీశ్వరే**" అని యున్నది. ఈశ్వరుని యందలి అనన్య ప్రేమయే భక్తి.

3. **ఆర్యసేవామ్**:-- ఆర్యులు అనగా

దైవసంపద కల సదాచార పరాయణులగు జనులు. వారిని సేవించుట ఆర్య సేవ అనబడును.

4. ***తీర్థాటనమ్*** :— పుణ్య క్షేత్ర సందర్శనముచే అంతఃకరణము పరిశుద్ధమగును. శ్రీరామచంద్రుడంతటి వైరాగ్యవంతుడు కూడ అంతఃకరణ పారిశుద్ధ్యమునకు పుణ్య క్షేత్ర సందర్శనమునకు వెళ్లెను.

5. **స్వాశ్రమధర్మనిష్ఠామ్** : — తమతమ ఆశ్రమ ధర్మముల యందు నిష్ఠతో నుండుట.

శాస్త్రమునందు వ్రాయబడినది.

***యతీనాం ప్రశమో ధర్మో నియమో వన వాసి నామ్ /***
***దానమేవ గృహస్థానాం శుశ్రూషా బ్రహ్మచారిణామ్//***

"యతి ధర్మము శాంతి. వానప్రస్థులకు నియమ పాలనము ధర్మము. గృహస్థుల ధర్మము దానము. బ్రహ్మచారులకు గురు శుశ్రూష

ధర్మము.”

**యతీనాం ప్రశమోధర్మ**:- శ్రుతి చెప్పుచున్నది.

***శాన్తో దాన్త ఉపరత స్తి తిక్షుః సమాహితో భూత్వాऽऽత్మన్యేవాऽऽ త్మానం పశ్యతి/***

“సన్యాసి శమము, దమము, ఉపరతి, తితిక్షలను పొంది తన ఆత్మయందే ఆత్మను చూచును.”

సర్వకాల సర్వావస్థల యందును వాసనా త్యాగము శమము. బాహ్యేంద్రియ నిగ్రహము దమము. విషయ నివృతి ఉపరతి. సర్వ దుఃఖ శమనము తితిక్ష, పరమాత్ముని యందలి చిత్తైకాగ్రత సమాహితత్వము.

**నియమో వనవాసినామ్**:-స్మృతి చెప్పుచున్నది.

***ఆథ విప్రో వనం గచ్ఛేద్వినా వా భార్యయా సహ/***

***జితేన్ద్రియో వ సేత్తత్ర నిత్యం శ్రౌతాగ్ని కర్మకృత్॥***

"గృహస్థాశ్రమము పూర్తి అయిన తరువాత బ్రాహ్మణాదులు భార్యతో కాని, భార్య లేకుండ కాని అరణ్యములోనికి వెళ్ళవలెను. అక్కడ జితేంద్రియులుగా నివసించవలెను. యథావిధిగా శ్రౌతాగ్ని హోత్రములను ఆచరించవలెను."

శ్లోకము నందలి "అథ'" శబ్దమునకు గృహస్థాశ్రమమునకు తరువాత అని అర్థము. ఆ కారణముచే గృహస్థాశ్రమమును నిర్వహించకుండ వానప్రస్థాశ్రమమును స్వీకరించ రాదని భావము.

***యోగాభ్యాసరతో నిత్యం స్థానాసన విహారవాన్।***
***హేమన్త గ్రీష్మ వర్షాసు జలాగ్న్యాకాశ మాశ్రయేత్॥***

కూర్చునియున్నను, నిలబడియున్నను,

నడచుచున్నను చిత్తమును యోగాభ్యాసమునందు లగ్నము చేయవలెను. హేమంత ఋతువునందు జలమునందు కూర్చొనవలెను. గ్రీష్మమునందు పంచాగ్ని మధ్యమున కూర్చొని తపస్సు చేయవలెను. అనగా నలుదిక్కులను అగ్నిహోత్రములను ప్రజ్వలింప జేసికొని శిరముపైనున్న సూర్యుని ఐదవ అగ్నిగా భావించి అగ్న్యా తపమును, సూర్యా తపమును సహించుచు తపస్సు చేయవలెను. ఇది పంచాగ్ని తపము. వర్ష ఋతువు నందు ఆరు బయట కూర్చొని వర్షమును సహించుచు తపస్సు చేయవలెను. అనగా నీరు, వేడి, చలి వహించవలెను.

***అగ్ని నాత్మని వైతానాన్ సమారోప్య యథావిధి/***
***ఆనగ్నిరనికేతః స్యా న్మునిర్మూల ఫలాశ నః//***

శ్రౌతాగ్నులను మూడింటిని యథావిధిగా తన యందు ఆరోపించుకొని అగ్నియును, అగ్ని

శాలయును లేకుండ మౌనముగా నుండి, దుంపలు, కాయలు మొదలగువానితో తన జీవితమును నిర్వహించు కొనవలెను. అనగా నివ్వరిధాన్యము, యవ మొదలగు జాతులకు చెందినవి కూడ తినరాదు. కందములు, మూలములు, ఫలములు మాత్రము అరణ్యము నుండి సంపాదించుకొని తినవలెను.

***దానమేవ గృహస్థానామ్*** :-ఇచట గృహస్థ ధర్మము దానము మాత్రమే అని ఏల వ్రాయబడినది అను సందేహము కలుగవచ్చును.

కలియుగము నందు దానము మాత్రమే ప్రధానమైనదిగా పరిగణించబడినది. ఏలనన, ఈ కాలమందలి జనులలో యజ్ఞములు, తపమును చేయు సామర్థ్యము కుంటుపడినది. కావున అంతఃకరణ పారిశుద్ధ్యముకొరకు దానమే ముఖ్యమని తెలుపబడినది.

బృహత్పరాశరస్మృతి చెప్పుచున్నది.

***తపః పరం కృతయుగే త్రేతాయాం జ్ఞాన ముచ్యతే/***
***ద్వాపరే యజ్ఞ మేవాహుః దానమేకం కలౌ యుగే //***

"కృతయుగమున తపము శ్రేష్ఠము. త్రేతాయుగమునందు జ్ఞానము ఉత్తమము. ద్వాపరమున యజ్ఞము ప్రధానము. కలియుగమున దానమే ముఖ్యము."

గృహస్థులు కృతయుగమున తపము చేయుచుండిరి. వారికి సంవత్సరము పాటైనను సరే అన్నము లేకుండ జీవించియుండగల శక్తి యుండెడిది. ద్వాపరమున యజ్ఞములు చేయుచుండిరి. కావున యజ్ఞ శక్తిచే తలచినది చేయగలిగెడివారు. యజ్ఞము చేసి వర్షము కావలెననిన కురిపించెడివారు. ఇట్లే సమస్త క్రియలను యజ్ఞములచే సాధించెడి వారు. నేటి జనులలో తపస్సు కానీ, యజ్ఞము గాని చేయు శక్తి లేదు. కావున దానమే ముఖ్యమని

చెప్పబడినది. ప్రతివ్యక్తియు తన శక్తిని అనుసరించి శ్రద్ధాభక్తులతో దానము చేయవలెను.

***పాత్ర స్య హి విశేషేణ శ్రద్ధా దానం తథైవచ /***
***అల్పం వా బహు వా ప్రేత్య దాన స్యావాప్యతే ఫలమ్ //***

"దానమునిచ్చు దాతలు తమ శ్రద్ధకు తగినట్లుగా ప్రతిగ్రహీత యోగ్యతను అనుసరించి కొంచెమో, అధికమో దానము చేసి మృతి చెందిన తరువాత దాన ఫలమును పొందెదురు."

దానము కొంచెమైనను, అధికమైనను తన శక్తిని అనుసరించి చేయవలెను. అది కూడ శ్రద్ధతో చేయవలెను. ప్రజలు ఏమనుకొనెదరో అను భయముతో దానము చేయువాడు లోకుల నిందనుండి విముక్తుడగును. కాని అతడు దాతగా పరిగణించబడడు. నిజముగా దారిద్ర్యముతో బాధపడువానికే దానము చేయవలెను.

ధర్మశాస్త్రములు ఘోషించుచున్నవి.

***శక్యాన్నదానం సతతం తితిక్షా ధర్మనిత్యతా/***

***యథార్థం ప్రతి పూజా చ సర్వ భూతేషు వై సదా॥***

"శక్తిని అనుసరించి ఎల్ల కాలముల యందును అన్నదానము చేయవలెను. సుఖ దుఃఖములను సహించుచు నిత్య ధర్మమును ఎల్లప్పుడును ఆచరించవలెను. వారి వారి యోగ్యతను బట్టి ఎల్ల ప్రాణులను ఆదరించి పోషించవలెను."

ఆకలితో బాధపడు వారికి అన్నము పెట్టవలెను. దుఃఖములతో బాధపడువారికి ఓర్మిని కలుగ జేయవలెను. లోక కళ్యాణకరములగు ధర్మములను ఆచరణలోనికి తేవలెను. ప్రతి ప్రాణియు ఈశ్వర స్వరూపుడని భావించి వానియందు ప్రేమను కలిగియుండవలెను.

మహా భారతమున ఉద్బోధించబడినది.

***దేయమార్తస్య శయనం పరిశ్రాన్తస్య చాసనమ్ /***

***తృషిత స్య చ పానీయం క్షుధిత స్య చ భోజనమ్॥***

“రోగముతో బాధపడు వానికి శయ్యను, అలసిన వానికి ఆసనమును, దప్పికగొన్న వానికి దాహమును, ఆకలిగొన్న వానికి అన్నమును ఇవ్వవలెను.”

ఎవరికి ఏ వస్తువు ఎప్పుడు కావలెనో వారికి ఆ వస్తువును అప్పుడు సమయానుకూలముగా దానము చేయవలెను. తాను ఇతరునకు ఎట్లు ఇచ్చునో తనకు పరమాత్ముడు అట్లనే ఇచ్చును.

ఇతర శాస్త్రములు కూడ బలపరచుచున్నవి.

***అన్నదః సుఖమాప్నోతి సుతృప్తః సర్వ వస్తుషు/***
***భూమి దానాత్పరం నా స్తి విద్యా దానం తతోఽధికమ్॥***

“అన్నమును దానము చేయువాడు సుఖమును పొందును. సర్వ పదార్థములను పొంది తృప్తి పొందును. భూ దానము

ఉత్తమమైనది. విద్యా దానము అంతకంటెను మించినది.”

ధనము మాత్రమే దానము చేయవలసిన పదార్థము అని అనుకొన నవసరము లేదు. అన్నదానము క్షణకాలమున తృప్తిని కలుగ జేయును. అంతకంటెను భూ దానము ఉత్తమమైనది. విద్యా దానము వీని అన్నిటి కంటెను శ్రేష్టమైనది, ఏలనన ఇది ఉభయులకును శ్రేయస్సును కలుగ జేయును.

***ఔషధం పథ్యమాహారం స్నేహాభ్యఙ్గం ప్రతి శ్రయమ్ /***
***దానాన్యేవం ప్రదేయాని హ్యన్యాని చ విశేషతః/***
***దీనాన్ధ కృపణాదిభ్యః శ్రేయస్కామేన ధీమతా//***

“బుద్ధిమంతులు తమ శ్రేయస్సుకొరకు దీనులకును, అంధులకును, దరిద్రులు మొదలగు వారలకును ఔషధములు, పథ్య పానములు, తైలాభ్యంగము, నివాసము మొదలగునవి

ఇవ్వవలెను. ఇతర దానములు కూడ విరివిగా చేయవలెను."

ఈ విధముగా శక్త్యనుసారము సత్పాత్రునకు చేయు దానమే దానము అనబడును. అసత్పాత్రమునకు చేయు దానము వ్యర్థము. బాధపడు వారలకు చేయు దానములో బాధపడుచున్న తన సోదరులకును, కుటుంబీకులకును చేయు దానము శ్రేష్ఠతరమైనది.

మనువు వాక్యమును పరిశీలింపుడు.

***శక్తః పరజనే దాతా స్వజనే దుఃఖజీవిని/***
***మధ్వపతో విషాస్వాదః స ధర్మ ప్రతిరూపకః//***

"ఇతరులకు విరివిగా దానము చేయుచు, తన వారలు దుఃఖించుచుండగా చూచుచుండువాడు ధర్మమునకు వ్యతిరేకముగా సంచరించుచున్నాడు. అది పేరునకు ధర్మము మాత్రమే. అట్టివాడు తేనె త్రాగుచున్నాననుకొనుచు విషమును

త్రాగుచున్నాడు.

తేనెయందు కలిపిన విషము ఆరంభమున తీయగ నుండును. కాని పరిణామమున దుఃఖమే కలిగించును. కీర్తి, అధికారము, ఉన్నత పదవి మొదలగు వాని కొరకు చేయు దానము కూడ ఆ శ్రేణికే చెందును. నిజమునకు అది దానము కాదు. ఆడంబరము. చివరకు దుఃఖ రూపముగ పరిణమించును, క్లేశములను కలుగ జేయును. నలుగురి మధ్యను కూర్చుని యున్నప్పుడు ఎవరైన యాచకులు వచ్చినచో, ఇవ్వకపోయిన బాగుండదని సిగ్గుతో అనేకమంది దానము చేయుదురు. అది వ్రీడా దానము. ఈ విషయమున ఈ దృష్టాంతము వినదగినది.

ఒక నగరమున ఒక ధనవంతుడు వ్యాపారస్థుడు ఉండెను. ఒక రోజున ఆతడు తన బండి కట్టించుకొని బజారులోకి వెళ్ళుటకు సిద్ధముగా నుండెను. అంతలో ఒక దరిద్రుడు ఆకలితో వచ్చి అన్నమునకు డబ్బు లేదనియు,

ఒక డబ్బు ఇవ్వమనియు ప్రార్థించెను. ఆ ధనవంతుడు అతనిని తిట్టి తన బండి ఎక్కి బజారు లోనికి పోయెను. బజారులో ఆతని బండి వద్దకు బేరగాళ్ళును, ఇతర గృహస్థులును తమతమ పనులకొరకు వచ్చిరి. సరిగా ఆ సమయమునకు వెనుకటి బిచ్చగాడు అక్కడికి వచ్చి ఒక డబ్బు ఇవ్వమని అడిగెను. ధనవంతుడు తన నలువైపుల ఉన్న బేరగాళ్ళను, గృహస్థులను పరిశీలించి ఆ ముష్టి వానికి వెంటనే నాలుగు అణాలు ఇచ్చెను. కాలాంతరమున ఆ ధనవంతుడు మృతి చెందెను. యముని ఎదుట న్యాయార్థము నిలబడెను. యముడు ప్రశ్నించెను. “ఈ ధనవంతుడు దానాది పుణ్య కార్యములు ఏమైన చేసెనా?”

చిత్రగుప్తుడు సమాధానము చెప్పెను. “ఈతడు దానాదులు ఏమియును చేయలేదు. కాని ఒకప్పుడు ఒక దరిద్రునకు నాలుగు అణాలు ఇచ్చెను.”

యముడు అడిగెను. “నాలుగు అణాలు ఎట్టి

పరిస్థితిలో ఇచ్చెనో తెలిసికొన వలసి యున్నది.”

చిత్రగుప్తుడు ఆ సంగతిని సవిస్తరముగా వివరించెను. మరియును ఆతడు ఇట్లనెను. ఈ విధముగా ఆతడు చేసిన దానములు చాల ఉన్నవి. అంతట యముడు చెప్పెను. “ఇట్టి దానములు అసలైన దానములుగా చెప్పబడవు. వీని వలన అతనికి ప్రయోజనము సిద్ధించదు. ఇవి దానములు కావు. వ్రీడాదానములు మాత్రమే. కీర్తి కొరకు చేసిన దానమునకు ప్రతి ఫలము లభించదు. దంభముతో కీర్తి కొరకు చేసిన దానము కూడ దానము కాదు.

కావున ఏ వ్యక్తియును ఈ విధముగా కీర్తి కొరకు కానీ సిగ్గుపడి కాని ఎప్పుడును దానము చేయరాదు.

## శుశ్రూషా బ్రహ్మచారిణామ్

శుశ్రూష నాలుగు రకములు :-ఆత్మ శుశ్రూష , అంగ శుశ్రూష, స్థాన శుశ్రూష, భావ

శుశ్రూష.

ఆత్మ శుశ్రూష :- తనకు లభించిన వస్తువులలో అత్యంత ప్రియమైన దానిని గురువునకు సమర్పించవలెను. ఉదాహరణమునకు ఎవరైన బొంబాయి నుండి పండ్ల బుట్ట పంపియున్నచో మొదట గురువు గారికి సమర్పించవలెను.

అంగ శుశ్రూష :-గురువునకు స్నానం చేయించుట, ప్రక్క వేయుట, కాళ్ళు పట్టుట, విసరుట మొదలగునవి అంగ శుశ్రూష అనబడును. ఇవి తాను స్వయముగా చేయవలెను.

స్థాన శుశ్రూష:—గురువు యొక్క గృహము, భూమి, తనవిగా భావించి వానిని కాపాడుచుండవలెను.

భావ శుశ్రూష:- తల్లి, తండ్రి, దైవము, సోదరులు, కుటుంబము అందరును గురు శబ్దముచే అభిహితులు అగుదురు అని భావించి

చేయు శుశ్రూష భావ శుశ్రూష అనబడును.

పైన చెప్ప బడిన సాధనములతో చిత్తశుద్ధి యగును. రాజస, తామసములగు మలిన వృత్తులు పోవును. సత్త్వప్రధానమగు మనోవృత్తి కలుగును.

6. **యమానుసక్తిమ్** :- యమానుష్టానము విధించబడినది.

ఈ విషయమున యోగ సూత్రమును పరికింపుడు.

***"అహింసా సత్యమస్తేయ బ్రహ్మచర్యాఽపరిగ్రహా యమాః"***

"అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము—ఇవి యమములు."

అహింస :-

***అహింసా వాఙ్మనః కాయైః ప్రాణిమాత్రాఽ ప్రపీడనమ్/***
***ఆత్మవత్సర్వభూతేషు కాయేన మనసా గిరా//***

# ఇరువది ఐదవ ప్రసంగము

"వాక్కు, మనస్సు, శరీరము - వీనిచే ఏ జీవులను బాధించ కుండా వాక్కు, మనస్సు, శరీరము- వీని చే సర్వమును స్వస్వరూపముగనే భావించుట అహింస."

సత్యము:- మహాభారతమున శాంతి పర్వమునందు సత్యమును గురించి చెప్పబడినది.

***నాస్తి సత్యాత్పరో ధర్మో నానృతాత్పాతకం పరమ్।***
***శ్రుతిర్హి సత్యం ధర్మస్య తస్మాత్సత్యం న లోపయేత్॥***

సత్యమును పలుకుట కంటె మించిన ధర్మము లేదు. అసత్యమును పలుకుట కంటె మించిన పాపము లేదు. సత్యము పలుకుట మహా ధర్మము. ధర్మమునకు ఆధారము సత్యము. ఇందుకు శ్రుతి ప్రమాణము కలదు. కావున ఎప్పుడును సత్యమును విడనాడ రాదు. అసత్యమును పలుక రాదు.

అస్తేయము:- తనకు ఎట్టి ఆపద కలిగినను

ఇతరుల అనుమతి లేనిదే వారి ధనమును మనోవాక్కాయములచే గ్రహించరాదు.

***చౌర్యేణ వా బలేనాపి పర స్వహరణం హి యత్ |***
***స్తేయమిత్యుచ్యతే సద్భిరస్తేయం తద్విపర్యయః ||***

“దొంగిలించి కాని, బలవంతముగ కాని ఇతరుల వస్తువులను తీసి కొనుట స్తేయం, అది చేయకుండుట అస్తేయము.”

బ్రహ్మచర్యము :- మైథున పరిత్యాగము.

***స్మరణం కీర్తనం కేలిః ప్రేక్షణం గుహ్యాభాషణమ్|***
***సంకల్పోఽధ్యవ సాయశ్చ క్రియా నిర్వృత్తిరేవ చ |***
***ఏత న్మైథున మష్టాఙ్గం ప్రవదన్తి మనీషిణః||***

స్త్రీని స్మరించుట, ఆమె గుణములను వర్ణించుట, ఆమెతో ఆటలు ఆడుట, కోరికతో ఆమెను చూచుట, ఏకాంతమున రహస్యముగా

మాట్లాడుట, విషయ భోగమును నిశ్చయించుట, ఆమెను కలసి కొనుటకు సమయమును, స్థానమును ఏర్పాటు చేయుట, విషయానుభవము అని మైథునము 8 విధములుగా చెప్పబడినది. ఈ విధమగు క్రియలను ఆచరించకుండుట బ్రహ్మచర్యము.

అపరిగ్రహము:-

పరిగ్రహము పది రకములు:— ఇల్లు, పొలము, ధనము, ధాన్యము, మనుష్యులు, పశువులు (ఏనుగులు, గుర్రములు, ఆవులు, మొదలగునవి) తల్పములు, వాహనములు, కూపములు, పాత్రలు మొదలగునవి దశ పరిగ్రహములు. వీని పరిగ్రహమును చేయనివాడు అపరిగ్రహి.

పరిగ్రహముచే కలుగు అరిష్టములను శాస్త్రములు చెప్పుచున్నవి.

***తపః శ్రుత పరివారాం శమ సామ్రాజ్య సంపదమ్ /***

***పరిగ్రహ గ్రహ గ్రస్తాస్య జేయుర్యోగినోఽపిహి॥***

"పరిగ్రహమును మొసలిచే మ్రింగబడినచో యోగులు అయినను తమ తపస్సు, శ్రుత జ్ఞానము అను కుటుంబము కల శమ సామ్రాజ్యమును కోల్పోవుదురు. కావున పరిగ్రహమును ఎల్ల విధములను త్యజించవలెను."

7. నియమాను వృత్తిమ్:-

"***శౌచ సంతోష తపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాః***" (యె.సూ)

పవిత్రత, సంతోషము, తపము, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అనునవి నియమములు.

శౌచము:- శౌచమనగా పవిత్రత. శౌచము రెండు రకములు. అభ్యంతరము, బాహ్యాము.

అభ్యంతర శౌచమనగా భావ శుద్ధి. బాహ్యాశౌచమనగా మృత్తికాజలాదులచే శుద్ధి.

పవిత్రమగు ఆహారాదులు కూడ బాహ్య శౌచముగా లెక్క పెట్టబడును.

శౌచముచే సత్త్వ శుద్ధి, సౌమనస్యము, ఏకాగ్రత, ఇంద్రియ జయము, ఆత్మ దర్శనము, యోగ్యత మొదలగునవి కలుగును.

సంతోషము:- సంతోషమనగా లభించిన సాధనముల కంటె మించినది కావలెనను కోరిక లేకుండుట. సంతోషముచే అపరిమిత సుఖము కలుగును.

"***సంతోషా దనుత్తమః సుఖ లాభః***" (యో. సూ)

తపము:- సుఖ దుఃఖాదులను సహించు శక్తి, తపము అనబడును. తపముచే దోషములు నశించి కాయేంద్రియాదులు సిద్ధిని పొందును. చిత్తైకాగ్రత అన్నిటికంటెను మించిన తపము.

***మన సశ్చేన్ద్రియాణాం హేకాగ్ర్యం పరమం తపః /***

***స జ్యాయస్సర్వ ధర్మేభ్యః స ధర్మః పర ఉచ్యతే //***

"మనస్సు, ఇంద్రియములు ఏకాగ్రతను పొందుట శ్రేష్ఠమగు తపము. ధర్మములన్నిటి కంటెను శ్రేష్ఠమగు ధర్మము అదియే."

స్వాధ్యాయము – మోక్ష ప్రతిపాదకములగు శాస్త్రములను అభ్యసించుట స్వాధ్యాయము అనబడును. ప్రణవ జపాదులు కూడ స్వాధ్యాయ కోటికి చేరును. "**స్వాధ్యాయాన్మా ప్రమాదః**" అని శ్రుతి కూడ చెప్పుచున్నది. స్వాధ్యాయమునందు పొరబడ రాదు.

***యథా యథా హి పురుషః శాస్త్రం సమధి గచ్ఛతి/***
***తథా తథా విజానాతి విజ్ఞానం చాస్య రోచతే//***

"మానవుడు శాస్త్రాధ్యయనము చేసిన కొలదియు, శాస్త్రమును బాగుగా తెలిసికొనగలడు. పరమాత్మ జ్ఞానమునందు కూడ అతనికి అభిరుచి కలుగును."

ఈశ్వరప్రణిధానము:- పరమాత్మునికి సర్వకర్మలను సమర్పించుట ఈశ్వరప్రణిధానము. ఈశ్వరప్రణిధానముచే సమాధి లభించును.

"***సమాధి సిద్ధిరీశ్వర ప్రణిధానాత్*** " అని యోగ సూత్రములు చెప్పుచున్నవి.

8. ***చిత్త ప్రసాదాయ వదన్తి విజ్ఞాః*** :-మూల శ్లోకమునందు చెప్పిన పై ఏడున్ను చిత్త శుద్ధికి వలయు సాధనములు అని విజ్ఞులు చెప్పుచున్నారు.

ఓం

# ఇరువది ఆఱవ ప్రసంగము

తరువాత రోజున ఉదయము అందరును టీ వేళకు శ్రీ నిత్యానందస్వామి వారి చెంత సమావేశమయిరి. పెద్ద విద్యార్థి ఇట్లు ప్రశ్నించెను :-

"క్షమించండి. తెలుసుకొనుటకు మాత్రమే ప్రశ్నించుచున్నాను. మా విజ్ఞానవాదము దేవుని అంగీకరించదు. అంతయును స్వభావసిద్ధమేనని అనును. దేవుని అస్తిత్వముని గురించి తమ అభిప్రాయము ఏమియో దయయుంచి తెలియ జెప్పుడు."

## దేవుని అస్థిత్వము

స్వా.ని. :- ప్రొఫెసరు జోషి మీ గురువులు. వారు ఉపనిషత్తులు, సూత్రములు, భాష్యాదులు మొదలగునవి అధ్యయనము చేసియున్నారు.

వారిని ప్రశ్నించుడు. నేను చదువుకొనలేదు.

ప్రొ. జోషి :— తమ ఎదుట చెప్పుటకు తగిన తాహతు నాకు లేదు. తమ శ్రీ ముఖము నుండి వినదలచి యున్నాను. తమరే చెప్పుడు.

స్వా. ని. :- వైజ్ఞానిక అభిప్రాయమునకును, వైజ్ఞానికుల పద్ధతికిని మధ్య భేదము కలదు. వైజ్ఞానిక పద్ధతి ప్రకారము జగన్నియంతను గురించిన ప్రశ్న అప్రస్తుతము. ఏలనన, వైజ్ఞానిక పద్ధతి దృశ్య జగత్తును ప్రయోగము ద్వారా తెలుపుటకు ప్రయత్నించును. కావున ప్రస్తుతము అడిగిన ప్రశ్న వైజ్ఞానికుల వ్యక్తిగతాభిప్రాయముగా తెలిసికొనవలెను.

ఈశ్వరుని అస్తిత్వమును గురించి ఆలోచించినను ఆ ఆలోచనలు వ్యక్తిగతాభిప్రాయము లనుకొనవలెననియే చెప్పవలసి వచ్చుచున్నది. సర్వమాన్యమగు సిద్ధాంత రూపమున గ్రహించ వీలులేదు. దృశ్య పదార్థమును మాత్రమే విజ్ఞానము ప్రయోగము

ద్వారా ఋజువు జేసి సత్యమని తలచును. అదృశ్యము ప్రయోగసాధ్యము కాదు.

ప్రభువును గురించిన కల్పన కల్పనమాత్రమే. వ్యక్తి గతమగు కల్పన వ్యక్తిగత వైశిష్ట్యము పై ఆధారపడియుండును. “ఇది అంతయు స్వభావ సిద్ధమే” అని వైజ్ఞానికులు తలచెదరు.

పెద్ద విద్యార్థి: – దేవుని గురించి తమ అభిప్రాయము సెలవిండు.

## సృష్టి కర్త ఉండవలెను

స్వా. ని. :- దేవుని అస్తిత్వమును అంగీకరించక పోయినను సృష్టికర్త ఒకడు ఉండవలెను కదా! ఎట్లన, ఒక అరణ్య మధ్యమున తోటలలో ఒక భవనము కలదను కొనుడు. దానిలో ప్రస్తుతము ఎవరును లేకపోయినను, ఎప్పుడో ఒకప్పుడు ఆ భవనమును ఎవరో నిర్మించిరనియు, వారు మరణించిరనియు, అనంతరము అ భవనము పాడుపడినదనియు

అనునది ఊహించదగినది కదా!

## సృష్టికార్యమును చేసినవాడు సర్వజ్ఞుడును, సర్వశక్తి మంతుడును అగు చైతన్య స్వరూపుడు

అటులనే సృష్టికి కూడ ఎవరో ఒక కర్త ఉండి ఉండవలెననునది యుక్తి సంగతము. ఆ సృష్టి అనెడు కార్యము మరియొక విధముగా జరుగదు. కావున ఆ సృష్టికర్త సర్వజ్ఞుడును, సర్వశక్తి మంతుడును అగు చైతన్య స్వరూపుడని తెలిసికొనవలెను. అనగా కార్యముచే కారణమును ఊహించవలెను. సృష్టియను కార్యమునకు కారణము సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును అగు చైతన్యస్వరూపుడగు దేవుడని ఊహించవలెను.

## వైజ్ఞానికుల దృష్టిలో జగత్తుకు ఉపాదాన కారణము పరమాణువు

పెద్ద విద్యార్థి :- విజ్ఞానం దృష్టిని పరికించినచో పరమాణువుచే జగమంతయు ఉత్పన్న మయినదని తెలియును. కాన జగమునకు పరమాణువు ఉపాదాన కారణమని తెలియుచున్నది. అందుచే జగత్కారణము దేవుడని అంగీకరించవలసిన అవసరము ఏమియును లేదు.

## మధ్యవర్తియగు తటస్థ స్వభావము

స్వా. ని. :— పరమాణు స్వభావమును గురించి మొదట ఆలోచించెదము.

పృథ్వి, జలము, తేజము, వాయువు- వీనికి పరమాణువులు కలవు. ఈ అన్ని రకములగు పరమాణువుల స్వభావము ఒకటేనా? లేక వేరు వేరు స్వభావములు కలవా? ఒకే స్వభావము అన్నచో పరమాణు భూత స్వభావగతమగు వైలక్షణ్యాభావముచే కార్య వైలక్షణ్యమునకు తావు లేదు. కాని కార్యమునందు వైలక్షణ్యము ప్రత్యక్ష సిద్ధము. అందుచే కార్యగత

వైలక్షణ్యముచే పరమాణు రూపమగు కారణమందు స్వభావ వైలక్షణ్యమును అంగీకరించవలెను. పరమాణు వైలక్షణ్యముచే ఒక పరమాణువుతో మరియొక పరమాణువునకు కల సంబంధములచే విలక్షణ పరిమాణములు కలుగుచున్నవి. ఈ ప్రత్యక్షములగు పరమాణు స్వభావముల యందు పరిణామములను కలుగజేయు కారణము వేరొక స్వభావమని తెలిసికొనవలెను. ఏలనన ఏ భౌతిక పదార్థమును అన్య పదార్థ సంయోగము కాని, అన్య పదార్థ స్వభావ ప్రభావముకాని లేనిదే రూపాంతరమును పొందదు. ఈ కారణముననే మీ విజ్ఞానవేత్తలు వేరు వేరు పరమాణువుల స్వభావములను కలుపుటకు మధ్య వర్తి యగు వేరొక తటస్థ స్వభావము యొక్క ఉనికిని అంగీకరించవలసి వచ్చుచున్నది.

## సమిష్టి స్వభావరూపుడు సృష్టికర్త

ప్రతి పరమాణువు యొక్క స్వభావమును

వేరు వేరని అంగీకరించినప్పుడు వాని సహాయమున ఘటము తయారు చేయుటకు ఒక సమిష్టి స్వభావమును అంగీకరించవలెను. దాని ప్రభావమే ప్రతి పరమాణు స్వభావము పైనను పడును. పృథ్వి యొక్క ఒక అణువునకు మరి యొక అణువులకు భేదము లేదు. కావున పృథ్వి యొక్క పరమాణు స్వభావముల యందు అభేదమును అంగీకరించుట యుక్తి సమ్మతము. కాని పార్థివ పరమాణువుల స్వభావమును ఏకము చేయుటకు సమిష్టి స్వభావము కలదని కార్య వైవిధ్యము స్పష్టమగుటకు యుక్తిచే అంగీకరించవలెను. ఇటులనే జలము, తేజము, వాయువు మొదలగు వాని పరమాణువులను ఆధారముగా చేసికొని విచారించిన ఒక సమిష్టి స్వభావమును అంగీకరించవలసి వచ్చును. ఆ స్వభావము అన్ని పరమాణు స్వభావముల యందును వ్యాపకమయి ఉన్న సర్వవ్యాపకమగు సమిష్టి స్వభావము.

# "సత్" అను నియామక స్వభావమే ఆ సృష్టికర్త

ఈ విధముగనే ప్రపంచము నందలి పదార్థములన్నియును పరమాణువులచే తయారయినవి అనియును, పరమాణు స్వభావములను సమ్మేళనము చేయు ఒక మహత్స్వభావము (వ్యాపకస్వభావము) ప్రపంచము నంతను నియమించుచున్న దనియును అంగీకరించవలసి యున్నది. ప్రతి పదార్థము యొక్కయు స్వాభావిక అస్తిత్వము వ్యాపక అస్తిత్వముచే శాసించబడుచున్నది. వ్యాపక వస్తువు "సత్" స్వరూపము. ఆ వస్తువు "అసత్" అనుకొనువారు దాని స్వభావము కూడ "అసత్ " అని ఒప్పుకొనవలసి వచ్చును. "అసత్" నుండి "సత్" ఉద్భవించు ననునది యుక్తము కాదు. కావున ప్రతి పదార్థ స్వభావమును శాసించు పూర్ణ స్వభావమే జగత్తునంతను నియమించుచున్నది. భావమును నియమించు

ఈ పూర్ణ స్వభావము సద్రూపము.

# సచ్చిదానంద స్వరూపమును, సర్వస్వభావ నియామకమును అగు స్వభావమే పరమేశ్వరుడు

చైతన్యము నందు కన్పించు జ్ఞాన సత్య స్వభావము, జడమందలి చైతన్యము యొక్క క్రియా సత్య స్వభావము మాత్రమే, జడపదార్థముల క్రియా శక్తికిని, చైతన్యముయొక్క జ్ఞానశక్తికిని మూలస్వరూపము. ఈ విధముగనే సర్వస్వభావములను శాసించు స్వభావము "సత్" అను జ్ఞానరూపము. అది సచ్చిదానందమును, పూర్ణానందమును, సర్వశక్తిమయమును అగు వ్యాపక స్వభావము, జగము నంతను విశ్వము నంతను నియమించును.

ఈ పై చెప్పిన విధముగా విచారించి చూచిన బలమగు తర్కముతో స్వభావవాదమును

చేయు విజ్ఞాన శాస్త్రముకూడ తానెంత దూరము పోయినను అద్వితీయమును, సచ్చిదానంద రూపమును, సర్వస్వభావ నియామకమును అగు ఒక స్వభావము ఉన్నదని ఒప్పుకొనవలసి వచ్చును. ఈ పదార్థమే పరమేశ్వరుడు అని అనుకొనవలెను. ఇట్లు తార్కిక దృక్పథముతో చూచిన స్వభావ వాదమునందు కూడ దేవుని అస్తిత్వము సిద్ధించును. పరమాణు స్వభావవాదులుగా నుండి దేవుని అస్తిత్వమును ఒప్పుకొనని వారు స్వభావవాదము యొక్క యథార్థ తత్త్వమును తెలిసికొనుట లేదు.

## సృష్టి అను కార్యమునకు కర్త ఉండవలెను

మీ తత్త్వవిచారము ప్రకారము జగమంతయు పరమాణు జనితము. ప్రతి కార్యమునకును నిస్సంశయముగా రెండు కారణములు ఉండును. 1. ఉపాదాన కారణము 2. నిమిత్త కారణము. కార్యమునకు ఉపాదాన

కారణము పరమాణువు అని తలచినచో వేరొకటి నిమిత్త కారణముగా మీరంగీకరించ వలెను. ఘటమను కార్యమునకు ఉపాదాన కారణము కపాలము అనగా మృత్తిక. అటులనే పటమునకు ఉపాదాన కారణము తంతువులు. వానికి భిన్నములగు కుంభకారుడు, దండము, చక్రము మొదలగునవి నిమిత్త కారణములు కదా! అవియే ఉపాదాన కారణమును వ్యవస్థీకరించి ఘటరూపమును, పటరూపమును పొందించును. అటులనే జగమునకు ఉపాదాన కారణము పరమాణువు అయినను ఈశ్వరుని కాదనుటకు వీలుపడదు. పరమాణువు చేతనమా? అచేతనమా? చేతన మనినచో అనేక చేతనములను సంయోగ పరచు ఒక వ్యాపక చేతనమును అంగీకరించవలసి వచ్చును. అచేతనము అనినను ప్రతిపరమాణు స్వభావమును శాసించు ఒక స్వతంత్ర స్వభావమును ముందు చెప్పిన విధముగా

అంగీకరించవలెను. ఈ విధముగ సృష్టియను కార్యము కర్తృసాపేక్షము. ఆ కర్త సర్వజ్ఞుడు, సర్వశక్తి మంతుడు, సర్వస్వభావ శాసకుడును అగు ఒక స్వతంత్ర స్వభావమని మీరు అంగీకరించవలసి వచ్చును. అదియే దేవుడు. ఇట్లు విజ్ఞాన దృక్పథములో కూడా ఈశ్వరుని అస్తిత్వము ఋజువు అగును.

## అనుమాన ప్రమాణము చే కూడ దేవుడు ఋజువు అగును

అనుమాన ప్రమాణముచే కూడా దేవుడు ఋజువు చేయబడునని మన దేశపు ప్రాచీన విద్వాంసులు తెలిసికొనిరి. సర్వతంత్ర స్వతంత్రులగు శ్రీ ఉదయనాచార్యులు స్వీయరచితమగు కుసుమాంజలియను గ్రంథమునందు దేవుని ఋజువు చేయుటకు కార్యత్వ, ఆయోజనత్వ, ధృతిత్వాది హేతువులు అనేకములను చూపించెను.

**"కార్యాఽఽయోజన ధృత్యాదేః"**

కార్యత్వము, ఆయోజనత్వము, ధృతిమత్త్వము మొదలగువానిచే దేవుడు ఋజువు చేయబడును. వానిని గురించి వరుసగా చర్చించెదము.

కార్యత్వము:-

**"క్షిత్యఙ్కురాదికం సక ర్తృకమ్ కార్యత్వాత్ ఘటవత్"**

ఘటపటాది కార్యములు సకర్తృకములు. కర్తచే నిర్వహించ బడును. అటులనే పృథ్వి, పృథ్వీ గతములగు అంకురాదులును కూడ కార్యములగుటచే సకర్తృకములు. ఆ కర్త జీవభిన్నుడు. పృథివ్యాది ఉపాదాన గోచరమగు అపరోక్ష జ్ఞానమును, చికీర్షయును, కృతిమత్త్వమును కలిగియుండును. అతడు దేవుడు.

## అయోజనత్వము

"సర్గాద్యకాలీన ద్వ్యణుకారమ్భక పరమాణుద్వయ సంయోగ జనకం కర్మ, చేతన ప్రయత్న పూర్వకం, కర్మత్వాత్ , అస్మదాది శరీర క్రియావత్"

మన శరీర క్రియలు చేతన వ్యాపారముచే జరుగును. అటులనే సృష్ట్యాది నుండియు జరుగు ద్వ్యణుకము మొదలుకొని పరమాణు ద్వయ సంయోగమువరకును కల కర్మలు చేతన ప్రయత్నములే. కాని ఈ చేతనము జీవస్వభావముకల చేతనము మాత్రము కాదు. సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును అగు ఒక చేతనపదార్థము అని ఒప్పు కొనవలెను. అదియే దేవుడు.

## ధృతి మత్త్వము

***"ఏతత్ బ్రహ్మాణ్డం పతన ప్రతి బన్ధకీ భూత ప్రయత్నవద ధిష్ఠితమ్, ధృతిమత్త్వాత్, వియతి విహఙ్గ మధృత కాష్ఠవత్."***

ఆకాశము నందలి పక్షి తన నోటిలో కట్టెను

కరచు కొని ఉండునట్లు, ఈ పృథ్వీవ్యాదులతో కూడిన బ్రహ్మాండమును ఎవడో పట్టుకొని ఉన్నాడా అనునట్లు ఉన్నది. ఈ బ్రహ్మాండాదులు స్వకీయ పతన ప్రతి బంధకమగు ఒకానొక పయత్నయుతమగు పదార్థమున నిలచియున్నవి. ఆ పదార్థము సర్వశక్తియుతము అయి ఉండవలెను. అనగా బ్రహ్మాండమంతయు నిలచియుండుటకు వీలగు శక్తి కలవాడు దేవుడనియే అంగీకరించవలెను.

ఈ విధముగనే దేవుని రుజువు చేయుటకు అనేకములగు అనుమాన ప్రమాణములను చూపించవచ్చును.

## ఈశ్వరపోక్తమగు వేదముచే కూడ దేవుడు ఋజువు చేయబడును

అనుమాన ప్రమాణముచే దేవుడు రుజువు అగునట్లుగనే ఈశ్వర ప్రోక్తము అగు వేదముచే కూడ దేవుడు ఋజువగును. ఎట్లనిన-

ద్యావా భూమీ జనయన్దేవ ఏకం విశ్వస్య కర్తా భువనస్య గోప్తా।

స్వర్గమును, భూమిని సృష్టించు ఒకే దేవుడు విశ్వమును సృజించును, రక్షించును.

వేదవ్యాస భగవానుడు కూడ బ్రహ్మ సూత్రముల యందు "జన్మాద్యస్య యతః", "ప్రకృతిశ్చ ప్రతిజ్ఞా దృష్టానానుపరోధాత్" మొదలగు సూత్రములచే ఈశ్వర లక్షణమును తెలిపెను.

"సృషి స్టితి లయములకు కారణుడు బ్రహ్మస్వరూపుడగు దేవుడు." "ప్రతిజ్ఞా దృష్టాంతములచే దేవుడు జగత్కారణము." అటులనే పతంజలి మహర్షి కూడ దేవుని ఋజువు చేయుటకు వివరించెను.

***"క్లేశకర్మ విపాకా శైరపరామృష్టః పురుషవిశేష ఈశ్వరః"***

క్లేశము, కర్మ, విపాకము, సూక్ష్మ వాసన

ఇవి లేని పురుష విశేషము దేవుడు.

## జీవుని అస్తిత్వము

పెద్ద విద్యార్థి:– “నేటి భౌతికాది విజ్ఞానములు శరీరభిన్నమగు ఆత్మ అను వేరొక వస్తువు లేదని చెప్పుచున్నవి” అని కొందరు విజ్ఞాన వేత్తలు చెప్పుదురు. శరీరము మృతినొందగనే ఆత్మ శరీరమునందే లయమును పొందును. కావున ఆత్మ శరీరభిన్నమగు వస్తువు కాదని వారి అభిప్రాయము. సున్నము, వక్క, తమలపాకులు వేరుగా నున్నంత కాలము ఎర్ర రంగు పుట్టదు. కాని అవి మూడును కలసిన వెంటనే ఎర్రనిరంగు పుట్టును. అటులనే భౌతిక పదార్థమగు శరీరమునందు చైతన్యశక్తి ఉద్భవించును. కాని ఆ శరీరము నశించిన వెంటనే చైతన్యశక్తి కూడా వెనువెంటనే నశించిపోవును. కావున జీవాత్మ శరీరమునకు భిన్నమైనది కాదు అనెదరు. కాని మన శాస్త్రములు శరీరము కంటె ఆత్మ భిన్నమయినదని చెప్పును.

ఈ రెండు అభిప్రాయములలోను ఏది నిజమో దయయుంచి చెప్పుడు.

## నచికేతుని ప్రశ్న – మృత్యువు తరువాత ఆత్మ ఏమగును?

స్వా.ని. :- కఠోపనిషత్తు నందు నీ వలెనే సాత్త్విక సాధన సంపన్నుడగు నచికేతుడు "మృత్యువు తరువాత ఆత్మ శరీర భిన్నముగ నుండునా? శరీర రూపముగా నుండునా?" అని యముని ప్రశ్నించెను.

***యేయం ప్రేతే విచికిత్సా మనుష్యేఽస్తీత్యేకే నాయమసితి చైకే।***
***ఏత ద్విద్యామనుశిష్టః త్వయాఽహం వరాణామేష వరః తృతీయః॥***

"కొందరు ఆత్మ ఉన్నదని చెప్పుదురు. మరికొందరు లేదని చెప్పుదురు. ఈ సందేహము వారికి చనిపోయిన వ్యక్తి యందు కలుగును. మీ ఉపదేశమును పొందిన నేను ఈ వృత్తాంతమును

తెలిసికొనదలచి యున్నాను ఇది నా మూడవ వరము.”

శరీరము, ఇంద్రియములు, ప్రాణములు, మనస్సు, బుద్ధి- వీనికి భిన్నమగునదియు శరీరముతో సంబంధము కలిగినదియు అగు ఆత్మ అనునది కలదని కొందరు విద్వాంసులు చెప్పుదురు. ఇట్టి ఆత్మ లేదని మరికొందరు చెప్పుదురు. ఏలనన, శరీర పతన నంతరము ఆత్మ ఉన్నదా లేదా అను సందేహము కలుగును. ఈ సందేహ నివృత్తి ప్రత్యక్ష ప్రమాణము చేత కాని, అనుమాన ప్రమాణం చేత కాని కలుగదు. పరమ పురుషార్థము సంశయ నివృత్తి ద్వారా లభించు ఆత్మవిజ్ఞానమునకు లోబడియున్నది. మీ ఉపదేశం ద్వారా జీవాత్మ విజ్ఞానమును పొంద గోరుచున్నాను. నాకు మీరు ఇచ్చిన మూడువరములలోను మిగిలిన మూడవవరము ఇది. దీనిని నేను కోరుచున్నాను.

## జీవ తత్వజ్ఞానము కడు సూక్ష్మము

నచికేతుని ఈ ప్రార్థన విని యముడు సమాధానము చెప్పెను.

**దేవైర త్రాపి విచికిత్సతం పురా న హి సుజ్ఞేయమణురేష ధర్మః|**
**అనం వరం నచికేతో వృణీష్వ మా మోపరో తీస్రరతి మా సృజైనమ్ ||**

ఓ నచికేతుడా, ఈ విషయమున పూర్వము దేవతలకు కూడ సందేహము కలిగినది. సామాన్యజనులు వినినను ఈ వస్తువును సరిగా తెలిసికొనలేరు. ఏలనన, ఆత్మ అత్యంత సూక్ష్మమయినది. కావున సందేహరహితమగు ఫలము నిచ్చు మరియొక వరమును కోరుకొనుము. ఈ విషయమున నన్ను ఇబ్బంది పెట్టకుము.

## ఆత్మ తత్త్వము అపూర్వము

ఇట్లు యముని వాక్యములను విని నచికేతుడు మరల యముని ప్రార్థించెను. ఈ వరముతో సమానమగు మరియొక వరము

నేనడుగవలసనది లేదు. కావున అదియే కోరుచున్నాను.

***దేవైర త్రాపివిచికిత్సితం కిల త్వం చ మృత్యో***
***యన్న సువిజ్ఞేయమాత్థ/***
***వక్తా చాస్య త్వాదృగన్యో న లభ్యో నాన్యో***
***వరస్తుల్య ఏతస్య కశ్చిత్// (కఠోప)***

“ఆత్మతత్త్వమును గురించిన సందేహము దేవతలకే కలిగెను కదా! ఓ యమధర్మరాజా! నీవే ఆత్మతత్త్వమును పూర్తిగా ఎరుగుదువు. కావున ఈ తత్త్వమును గురించి వివరింప సమర్థుడు నీవు తప్ప మరియొకడు లేడు. నాకు దీనితో సమానమైన ఇంకొక వరము కోరవలసినది ఏదియు లేదు.”

ఆత్మతత్త్వమును గురించి సందేహము దేవతలకు కలిగెను అని మీనుండియే తెలిసికొను చున్నాను. అనగా ఆత్మతత్త్వము సామాన్యునకు శ్రవణము చే కూడ సరిగా బోధపడదని తెలియచున్నది. ఇది పండితులకు కూడ బోధింప

శక్యము కానిది. ఇక మీరు తప్ప ఇంకొక ఆత్మతత్త్వ ఉపదేశకుడు ఎంత వెతికినా లభించదు. మీరు మాత్రమే ఈ ఆత్మతత్త్వమును వివరించ గల సమర్థులు. (కనుక) ప్రపంచము నందలి అనిత్య పదార్థములకు సంబంధించిన వరము లన్నిటిని విడచి ఈ ఆత్మతత్వమును మాత్రమే తెలుపమని కోరుచున్నాను.

## చైతన్యరహితమగు దేహము పుట్టుట

ఈ విధముగా నచికేతుడు అడిగిన ప్రశ్నకు యమధర్మరాజు చెప్పిన సమాధానమును చూచినచో ఆత్మతత్త్వమును తెలిసికొనుట చాల కష్టమని తెలియును. ఈ శరీరము పంచభూతముల (పృథివీ, జల, తేజో, వాయు, ఆకాశముల) పరిణామమని కొందరు చెప్పుదురు. దానికి ప్రమాణముగా "పాఞ్చ భౌతికో దేహః" అను వాక్యమును ఉదహరించెదరు. కొందరు నాల్గు భూతముల పరిణామము మాత్రమేనని చెప్పుదురు. పృధివ్యాది చతుర్భూతముల

యందును పరమాణువులచే కార్యారంభకత్వము సిద్ధించును. కాని పరమాణువుల అభావముచే ఆకాశమునందు కార్యారంభకత్వమునకు తావు లేదు అని వారి అభిప్రాయము. కావున దేహము చాతుర్భౌతికము అని "చాతుర్భౌతిక మిత్యేకే" అని ప్రమాణమును చూపెదరు.

మరికొందరి మతము ననుసరించి దేహము పృథ్వీమాత్ర పరిణామము. జలాదులు దాని ఉపష్టంభకములు అనగా ఆధారములు అని చెప్పి సాంఖ్య సూత్రమునందలి "ఏక భౌతిక మిత్యపరే" అనువాక్యమును చూపెదరు. ఈ విధమగు వాదముల ననుసరించి భౌతిక పరిణామము శరీరమని చెప్పినచో చేతనత్వ దృక్పథముతో విచారించిన శరీరమునందు చేతనత్వము యుక్తి సంగతము కాదు. ఏలనన, ప్రతి భూతము నందును స్వభావసిద్ధమగు చైతన్యము కన్పట్టుట లేదు.

ఈ విషయమున విజ్ఞులు ఇట్లు పల్కెదరు.

# ఇరువది ఆఱవ ప్రసంగము

## "న సాంసిద్ధికం చైతన్యం ప్రత్యేకా దృష్టేః"

ప్రతి భూతము నందును చైతన్యము ఉండదు. కావున శరీరము నందుకూడ చైతన్యము లేదు అని వారి వాదము.

తాంబూలము నందలి ఎరుపు తాంబూల కారణములగు వస్తువులయందు కన్పట్టుట లేదని మీరే చెప్పుచున్నారు కదా! అయినను అది వక్క, సున్నము మొదలగు వస్తువులతో కలిసిన పదార్ధము నందు కన్పట్టుచున్నది. అటులనే ప్రతి భూతము నందును చైతన్య భావము ఉన్నను భూత స్వభావ పరిణామము నందు తాంబూలము నందలి రక్త వర్ణము వంటి శక్తి కల చైతన్యము ఉండవలెను. కాని దీనికి సమాధానముగా ప్రతిపదార్ధము నందును వేరువేరుగా నున్నప్పుడు కన్పడనట్టి విశిష్టగుణములు సముదాయములందు కనపడును. వైయుక్తికములుగా నున్నప్పుడు మరుగుపడిన గుణములు సముదాయముల యందు కాననగును అని చెప్పెదరు.

కానీ వైయుక్తి పదార్థముల యందు లేని గుణములు సంఘాతము నందు కూడ ఉండవు. ప్రతి భూతము నందును లేని చైతన్యము సముదాయము నందును ఉండదు. "తాంబూల వస్తు సముదాయముచే జనించిన రాగముచే తాంబూల కారణములగు ద్రవ్యముల యందు కూడ రాగము ఊహించదగును. అటులనే పంచభూత కార్యమగు దేహము నందు చైతన్యము ఉండుట వలన అనుమాన ప్రమాణముచే ప్రతిభూతము నందును చైతన్యము ఉండవలెనని తేలుచున్నది" అని ప్రశ్నించ వచ్చును.

తత్త్వవిచారము చేసినచో అది సరి కాదని తోచును. పృథి వ్యాదుల యందలి విశిష్టగుణములు సజాతీయ కారణ గుణజన్యత్వము కలవి. పృథివ్యాది రూపమగు కారణమందు చైతన్యము లేనిచో పరిణామమగు దేహము నందు కూడ చైతన్యము ఉండదు. ఆ

చైతన్య స్వరూపమగు ఆత్మ  శరీర భిన్నము. శరీరమే చైతన్య రూపమగు ఆత్మ అని అంగీకరించినచో బాల్యము నందలి పదార్థములు వార్ధక్యము నందు విస్మృతి రాకూడదు. ఏలనన శరీరావయవాల ఉపచయా పచయములచే (వృద్ధి క్షయములచే) ఉత్పత్తి, వినాశములు జరుగును. శరీరము ఆత్మ ఒకటి కావు.

బాల్యమందలి ఉండే శరీరావయవములు వార్ధక్యము నందుఉండవు. అందుచే విస్మృతి కలుగును. బాల్యమునందలి శరీరము నందు చైతన్యముచే కలిగిన అనుభవములు వార్ధక్యము నందలి శరీర చైతన్యము నందు జ్ఞాపకము ఉండవు. కావున శరీరము, ఆత్మ వేరు వేరు అనునది నిశ్చితము. “పూర్వ శరీరోత్పన్నమగు సంస్కారముచే అనంతర శరీరము నందు సంస్కారములు ఉద్భవించి స్మరణము ఉండును” అని చెప్పుచో అది యుక్తి సంగతము కానేరదు. ఏలనన, అనంతములగు సంస్కారములను అంగీకరించుట కంటె శరీర భిన్నమగు

చైతన్యమును స్వీకరించుటయే యుక్తి సంగతము. శరీరమే చైతన్యమని అనుకొనినచో బాలుడు మాతృస్తన్య పానమునకు ప్రవర్తించుటకు తావు లేదు.

స్వా.ప్ర.:- దూడ యొక్క స్తన్యపాన ప్రవృత్తికి కారణము అనుకూల సాధనత్వ పరిజ్ఞానము. బాలునకు ఇష్ట సాధన జ్ఞానము ఉండనందున మాతృస్తన్య పాన ప్రసక్తి కలుగదు. వైదిక సిద్ధాంతము ననుసరించి జన్మాంతరముల యందలి ఇష్టసాధన జ్ఞానానుభవముచే తజ్జన్య సంస్కారములచే బాలుడు అట్లు ప్రవర్తించును.

ఆత్మ స్వయంప్రకాశకమగు జ్ఞానస్వరూపుడు.

పూర్వోక్తములగు కారణములచే ఆత్మ శరీర భిన్నము అనునది యథార్థమని బోధపడును. ఆ ఆత్మ అవిద్యా జనితములగు అనేక జన్మముల అదృష్టము ద్వారా జన్మజన్మాంతరములకు లభించును. వాస్తవమునకు ఆత్మ

జ్ఞానస్వరూపము. కాని అవిద్యకు లోనయినందున అజ్ఞాని వలె కన్పించును. జనులు త్రాడునందు సర్పమును చూచునట్లును, ముత్యపు చిప్పయందు రజతమును చూచునట్లును, సచ్చిదానంద స్వరూపమగు ఆత్మయందు అజ్ఞాన కృతమున జననమరణ ధర్మములను చూచెదరు. జ్ఞానరూపమగు ఆత్మ పదార్థముల నన్నిటిని ప్రకాశింప జేయును. పదార్థ జ్ఞానము కూడ ఆత్మ సద్భావము చేతనే కలుగును. జగము నందు జ్ఞాన స్వరూపము ఆత్మ అని తెలిసికొనకుండుటకు కారణము ఏమియు లేదు. ఏలనన, సర్వ ప్రపంచమును ఆత్మ చేతనే తెలిసికొనబడును. ఏలనన ఆత్మ జ్ఞాన స్వరూపము. తాను స్వయం ప్రకాశముగా నుండి అన్యములను ప్రకాశింప జేయును.

***యేన రూపం రసం గన్ధం శబ్దాన్స్పర్శాంశ్చ మైథునాన్ /***
***ఏతే నైవ విజానాతి కిమత్ర పరిశిష్యతే// (కర)***

లోకమంతయు రూప, రస, గంధ, శబ్ద,

స్పర్శ విషయ భోగములను దేనిచే తెలుసుకొనుచున్నదో అది ఇదియే. ఇది తప్ప మిగిలినది ఇంక ఏమి కలదు? మానవులందరును జ్ఞానస్వరూపమగు ఆత్మ ద్వారా రూప, రస, గంధ, శబ్ద, స్పర్శ, విషయానుభవములను తెలిసికొనెదరు. అటులనే రూపాదుల జ్ఞానమును పొందెదరు. స్థూల సూక్ష్మ సంఘాత రూపమగు ఈ జడ శరీరముచే రూపాది జ్ఞానము కలుగదు. సచ్చిదానంద స్వరూపమగు ఆత్మ ఉండుట చేతనే రూప రసాది విషయముల పరిజ్ఞానము ప్రాణులకు కలుగును. విశ్వమందలి పదార్థములన్నియు ఆత్మచేతనే తెలిసి కొనబడును. ఆత్మ స్వయం ప్రకాశమగుటచే తనంతట తానే తెలిసికొనబడును. దానిని తెలిసికొన కుండుటకు సామాన్య కారణము కాని విశేష కారణము కాని ఏదియును లేదు. ప్రధాన అజ్ఞాన విరోధియగు జ్ఞానమే ఆత్మను తెలిసికొనుటకు సాధనము. ఆత్మ అతిసూక్ష్మము. దుర్విజ్ఞేయము. అజ్ఞానముచే

జీవాత్మ తాను బ్రహ్మము కంటె భిన్నుడనని అనుకొనును. ఆ కారణముచే జనన మరణ ప్రహమున మునుగుచు తేలుచు ఉండును. కాని జీవాత్మ తాను బ్రహ్మమునకు అభిన్నమని తెలిసికొనునప్పుడు ఆత్మకు శోకము కలుగదు.

## బ్రహ్మాభిన్నమగు అద్వైతాత్మ

***స్వప్నాన్తంజాగరితాన్తం చోభౌ యోనానుపశ్యతి/***
***మహాన్తంవిభుమాత్మానం దత్వా ధీరో న శోటతి//***

స్వప్నావస్థ యందును జాగ్రదవస్థ యందును తెలిసికొన వలసినన పదార్థములను, ఆ రెండు అవస్థలను  కూడ చూచిన విద్వాంసుడే ఆత్మ బ్రహ్మాభిన్నము అని తెలిసి కొనగలడు. కల్పనా సర్వస్వమునకు అధిష్ఠానము బ్రహ్మ అని గ్రహించును. ఆతడు జనన మరణాదుల దుఃఖమును పొందడు. ఏ ప్రాణి అయినను కర్మ ఫల భోక్తయును, ప్రాణాది సమూహమును

ధరించునదియు జీవరూపమగు ఆత్మను, దేశ కాలములను, వాని యందలి పదార్ధములను నియమించు ఈశ్వరుని తన కంటె అభేదముగా తెలిసికొనిన తరువాత, తనకు కలిగిన ఆ అభేద జ్ఞానానంతరము ఆత్మను పొందును. అభయస్వరూపుడగుటచే ఆత్మరక్షణకు ఆ ప్రాణి యత్నించడు. తానే నిత్య అద్వైత రూపుడయిన తనను రక్షించువాడు, మరి ఇతరుడు యెచ్చటనుండి వచ్చును? ఎవరినుండి రక్షించును? ఈ వృత్తాంతమును చెప్పు శ్రుతి కూడ ఇట్లు చెప్పుచున్నది.

***య ఇమం మధ్వదం వేద ఆత్మానం జీవమన్తిశాత్ /***
***ఈశానం భూత భవ్యస్య న తతోవిజుగుప్పతే// (క౭)***

కర్మఫల భోక్తయును జీవ స్వరూపుడును అగు ఆత్మయు, భూత భవిష్య నియామకుడగు

ఈశ్వరుడును అభిన్నులు అని తెలిసికొనినవాడు దేని నుండియు రక్షణ పొందగోరడు.

## జీవుని స్వరూపము

పెద్ద విద్యార్థి:- మైక్రోస్కోపుతో కూడ అతికష్టమున చూడదగిన అతి సూక్ష్మ జీవుల యందును, ఏనుగులు మొదలగు స్థూల శరీరము కలవాని యందును జీవాత్మ ఒకే రకముగా నుండునా? లేక ప్రమాణములో భేదము ఉండునా? జీవాత్మ శరీరము నంతటి యందును ఉండునా? లేక ప్రత్యేక భాగము నందు ఉండునా?

## జీవాత్మ అతి సూక్ష్మము

***వాలా గ్రశతభాగస్య శతధా కల్పిత స్య చ /***
***భాగో జీవః స విజ్ఞేయః సచాఽఽనన్త్యాయ కల్పతే//***

"వాలాగ్ర భాగమును నూరు భాగాలుగా చేసి, అందలి ఒక భాగమును మరల నూరు భాగములుగా చేసినచో ఎంత చిన్నదిగా ఉండునో

జీవుడు అంత సూక్ష్మముగా నుండును."

## అతి సూక్ష్మగు జీవుని సామర్థ్యము

బ్రహ్మోపనిషత్తునందు ఈ వివరములు కలవు.

***నేత్రస్థం జాగరితం విద్యుత్ కంఠే స్వప్నం సమావిశేత్।***
***సుషుప్తం హృదయస్థం తు తురీయం మూర్ధ్ని సంస్థితమ్॥***

"జీవాత్మ నేత్ర స్థానమున ఉన్న జాగ్రదవస్థను పొందును. కంఠము నందున్న స్వప్నావస్థను పొందును. హృదయము నందుండగా గాఢనిద్రను పొందును. బ్రహ్మరంధ్రము నందు ఉన్న తురీయావస్థను పొందును."

జీవాత్మ జాగ్రదవస్థ యందున్నపుడు నేత్ర స్థానమున ఉండి ప్రత్యక్షాది ప్రమాణ వృత్తుల ద్వారా సకల వ్యవహారములను చేయును. స్వప్నావస్థ యందు కంఠము నందుండి 'హీత'

అను నాడి యందు ప్రవేశించి భ్రమ ద్వారా పెద్ద పెద్ద పట్టణములు, అరణ్యములు, సముద్రములు, ఏనుగులు, గుర్రములు మొదలగు వానిని సృష్టించును. సుషుప్తి యందు హృదయ ప్రదేశము నందలి పురీతతమను నాడి యందు ప్రవేశించుటచే బుద్ధి అవిద్య యందు లీనమయి పోవును. కాని అచ్చట అవిద్యా వృత్తి యుండును. ఏలనన నిద్ర నుండి లేచిన తరువాత నేను సుఖముగా నిద్రించి యుంటిని అని చెప్పును. ఆ వృత్తి లేనిచో సుఖాద్యనుభవము ఎట్లు జరుగును? ఆ వృత్తి సత్త్వ ప్రధానమయిన బ్రహ్మ రంధ్రమును చేరి సమాధి ద్వారా జీవబ్రహ్మముల మధ్యకల ఆవరణమును భంగము చేసి బ్రహ్మ సుఖమును అనుభవించును. అదియే అద్వైత భావన అను నిర్వికల్ప సమాధి. ఆ సమయమున సత్త్వ ప్రధానమగు వృత్తి యుండును. ఆ వృత్తి కూడా స్వరూపము నందు లయమును పొందును. అదియే నిర్వికల్ప సమాధి. అదియే గుణాతీతావస్థ.

# జనక యాజ్ఞవల్క్యుల కథ

అనంతరము ఈ విషయము పై స్వామివారు నిత్యానందుల వారిని చెప్పుమని కోరిరి.

స్వా. ని. :- బృహదారణ్యకము నందలి నాల్గవ అధ్యాయము, మూడవ బ్రాహ్మణము నందు ఈ కథ కలదు.

ఒకప్పుడు జనకుని వద్దకు యాజ్ఞవల్క్యుడు వెళ్లెను. వారు ఆ సమయమున అగ్నిహోత్రమును గురించి చర్చించిరి. జనకుడు అగ్ని హోత్రమునకు సంబంధించిన అపూర్వ జ్ఞానమును యాజ్ఞవల్క్యుని ఎదుట వెల్లడించెను. ఆయన చాల సంతోషించి జనకుని వరము కోరుకొనమని చెప్పెను. “నా ఇష్టము వచ్చిన ప్రశ్నలు అడుగుటకు వరము ఇవ్వ” మని జనకుడు కోరెను. యాజ్ఞవల్క్యుడు సంతోషముతో అంగీకరించెను. అంతట జనక మహారాజు యాజ్ఞవల్క్యుని ఇట్లు పశ్నించెను.

**యాజ్ఞవల్క్య కిం జ్యోతిరయం పురుష ఇతి / ఆదిత్య జ్యోతిః సమ్రాడితి హోవాచాదిత్యే వాయం జ్యోతిషాఽఽస్తే పల్యతే కర్మ కురుతే విపర్యేతీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య//**

యాజ్ఞవల్క్య! ఈ పురుషుడు అనగా శరీరము దేనిచే ప్రకాశిత మగుచున్నది. శరీరము జడమే అయినను కూర్చొనుచున్నది, లేచుచున్నది, పనులను చేయుచున్నది, వెనుకకు మరలుచున్నది. ఇవన్నియు ఎట్లు జరుగుచున్నవి?

## స్వయంజ్యోతిస్వరూపమగు ఆత్మయే ప్రేరకము

అంతట యాజ్ఞవల్క్యుడు "ఆదిత్య జ్యోతిః" అని సమాధానము చెప్పెను. సూర్యుని నుండియే చైతన్యమును పొంది పురుషుడు సకల కర్మలను ఆచరించును. జనకుడు "సరే" అని మరల ప్రశ్నించెను. "ఓ యాజ్ఞవల్క్య!

సూర్యాస్తమయము అయిన తర్వాత కూడా పురుషుడు సమస్త కర్మలను ఆచరించును. అప్పుడు అతనికి చైతన్యము ఎచ్చటనుండి వచ్చును?” యాజ్ఞవల్క్యుడు “చంద్రుని నుండి వచ్చును” అని చెప్పెను.

జన:-“చంద్రుడు అస్తమించిన తరువాత”

యాజ్ఞ: - “అగ్ని నుండి”

“సూర్య చంద్రులు అస్తమించి అగ్ని కూడ శాంతించిన తదుపరి ఈ పురుషుడు దేనిచే ప్రకాశనమును పొందును? అనగా దేనిచే చైతన్యమును పొందును?” అని జనకుడు మరల ప్రశ్నించెను.

యాజ్ఞవల్క్యుడు “వాణ్యైవాస్య జ్యోతిర్భవతి” అని సమాధానము చెప్పెను.

శబ్దమే పురుషునికి జ్యోతి అనగా ప్రకాశము. దాని చేతనే ప్రేరణను పొంది పురుషుడు ప్రవర్తించును. వర్షాకాలపు చీకటి రాత్రులలో తన చేయియే తనకు కన్పించని

సమయములో బాటసారులు కుక్కలు, గాడిదలు మొదలగు జంతువుల శబ్దములను విని వానిచే ప్రకాశమును పొందియే తమ గమ్యమును చేరుకొనెదరు. శబ్ద శ్రవణముచే శ్రోత్రేంద్రియము ప్రకాశమును పొందును. తద్వారా మనస్సున వివేకాదులు ఉద్భవించి శబ్దము వచ్చు వైపునకు వెళ్ళుట మొదలగు ప్రవృత్తులు జరుగును. ఈ విధముగ అచ్చట శబ్దమే ప్రకాశము.

రాజు చెప్పెను: - "బాగుగనే ఉన్నది. కాని సూర్య, చంద్రులు, అగ్ని, వాణి అన్నియు శాంతించిన పిమ్మట స్వప్నావస్థ యందు పురుషుడు ప్రకాశము ఎచ్చట నుండి పొందును? ఏలనన స్వప్నావస్థయందు ఈ బాహ్యేంద్రియములు వ్యవహార శూన్యములగును. అయినను మనుష్యుడు స్వప్నావస్థ యందు కూడ ప్రవృత్తులను కలిగియుండును. ఆ స్వప్నావస్థ యందు ప్రకాశమును కలుగజేయునది ఏది?

యాజ్ఞ:- ఆత్మయే పురుషుని ప్రకాశింప

జేయును. ఆత్మ ప్రకాశము చేతనే ఈ పురుషుడు అన్ని కర్మలను ఆచరించును.

"కతమ ఆత్మేతి" అని జనకుడు అడిగెను. ఆత్మ ఎట్టిది?

అంతట యాజ్ఞ్యవల్క్య మహర్షి చెప్పెను.

**"యోఽయం విజ్ఞాన మయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః"**

ఆత్మ సక్రమముగా ఇంద్రియ వృత్తులను ప్రేరేపించును. హృదయము నందుండు అంతర్జ్యోతియగు విజ్ఞానమయ స్వరూపము.

"చక్షురాది ఇంద్రియములకు ప్రేరణను ఇచ్చు బహిర్గతమగు సూర్యచంద్రాదుల జ్యోతి అంతయు స్వాభావికమగు జ్యోతి కాదు. స్వయం జ్యోతి స్వరూపుని వద్ద నుండి జ్యోతిని పొంది ఇంద్రియములకు ప్రేరణను ఇచ్చును." అని తాత్పర్యము.

చీకటి కొట్టు లోనికి సూర్యుని కాంతి వెళ్ళనిచో బయట సూర్యుని వెలుతురునకు ఎదుట

ఒక అద్దమును ఉంచి ఆ అద్దము ద్వారా సూర్య కాంతి చీకటి కొట్టులోనికి వచ్చునట్లు చేయును. కాని ఆ వెలుతురు అద్దము యొక్క వెలుతురు కాదు కదా! అది సూర్యునిదే. అటులనే సూర్య చంద్రాదులు ప్రకాశము ద్వారా ఇంద్రియ వృత్తులకు అను గ్రాహకములు. కాని ఆ ప్రకాశము సూర్య చంద్రాదుల స్వాభావిక ప్రకాశము కాదు. సూర్యచంద్రాదులు దర్పణ స్థానీయులు. పరప్రకాశ్యులు. సూర్యచంద్రాదులు కూడ ఎవరిప్రకాశముచే ప్రకాశితులగుదురో ఆ ఆత్మ మాత్రమే స్వయంప్రకాశము.

## స్వప్నావస్థ యందు కూడ ఆత్మ జ్యోతి రూపమున ప్రేరేపించును

పైన ప్రత్యగ్ జ్యోతి జాగ్రదవస్థ యందు ఇంద్రియాను గ్రాహకమని చెప్పబడినది. ఆ విషయమును ఇంకను స్పష్టీకరించుటకు శ్రుతి స్వప్నావస్థ యందు కూడ ఆ పదార్థపు అస్థిత్వమును తెలుపుచున్నది.

స సమానః సన్నుభౌ।

ఆ ఆత్మ సమాన రూపమున రెండు లోకముల యందును (జాగ్రదవస్థ యందును, స్వప్నావస్థ యందును) ప్రకాశించును. బుద్ధి తన వృత్తుల ద్వారా విషయ జ్ఞానమును పొందును. ఆ సమయమున ఆత్మ కూడ విషయజ్ఞానమును సంపాదించుచున్నట్లు భాసించును. (ధ్యాయతి ఇవ). ఆత్మ విజ్ఞాన స్వరూపము. నిత్యమును జ్ఞాన స్వరూపమును అయిన ఆత్మను క్షణిక విజ్ఞాన రూపముగా తలచుట తప్పు. కాని బుద్ధి వృత్తి మాత్రము క్షణికమగుటచే బుద్ధి క్షణిక విజ్ఞానము కలది. అందుచే ఆత్మకూడ క్షణిక విజ్ఞానము కలదిగా తోచును. బుద్ధి తన వృత్తుల ద్వారా చలనాది క్రియలను చేయించునప్పుడు ఆత్మ కూడ ఆ క్రియలకు కర్తగా ప్రతీత మగును. (లీలావతి ఇవ). వాస్తవమునకు అది కర్త కాదు.

ఆ ఆత్మయే స్వప్న రూపమున ఈ లోకమును, అనగా జాగ్రదవస్థను, మృత్యు

రూపమగు అవిద్యా కర్మలను అతిక్రమించును. అనగా స్వప్నా వస్థను పొందుట తోడనే జాగ్రదవస్థాబోధ్యములగు విషయములు, కర్మలు అన్నియును నశించును. ఏలనన స్వయం జ్యోతి యగు ఆత్మ స్వప్న సంబంధములగు పదార్థములను సృష్టించుకొనును. ఒకే శరీరము నందు ఉన్న ఆత్మ స్వప్న రూపమును పొంది మృత్యు రూపములగు కార్య కారణాదులను త్యజించి స్వప్నము నందు స్వకీయమగు ఆత్మ జ్యోతి స్వరూపమును పొందును.

## ఈ లోకము నందు పరలోకము నందును కూడ ఆత్మ స్వయం జ్యోతియగు ప్రేరకము

***స వా అయం పురుషో జాయమానః శరీరమ్.***

ఈ ఆత్మయే శరీరము అను ఉపాధి ఉద్భవించుటతో ఉద్భవించుచున్నట్లు భాసించును. ధర్మాధర్మాశ్రయమగు శరీరమును

ఇంద్రియములకు సంబంధింప జేయును. ఇది శరీరమును త్యజించి ఉత్క్రమణమునకు సిద్ధమయినప్పుడు శరీరము మృతిని పొందును. అంత శరీరమునకు సంబంధించిన పాపపుణ్యాది కర్మలు, వాని సాధనములగు ఇంద్రియాదులును ఆ సంబంధమును త్యజించును.

స్వప్న జాగ్రదవస్థల యందు రెండింటి యందును ఆత్మ ఒకే శరీరము నందు ఉండి కూడ జాగ్రదవస్థ యందు శరీరము యొక్క ఇంద్రియాదుల కార్యాచరణమును గ్రహించియు, స్వప్నావస్థ యందు త్యజించియు బుద్ధితో నిరంతరము సంచరించు చుండును. అటులనే ("ఉభౌ లోకౌ") రెండు లోకములనగా ఇహలోక, పరలోకములు- స్వర్గ పాతాళములు, రెంటి యందును జన్మ, మరణముల ద్వారా కార్యకారణ సంఘాతమును కలిగి (శరీరేంద్రియములను పొంది) నిరంతరము సంచరించు చుండును. సంసారము నుండి ముక్తిని పొందువరకు

ఇటులనే జరుగు చుండును.

దీనిని బట్టి కార్య కారణ సంఘాతము కంటె (శరీర, ఇంద్రియాదుల కంటె) ఆత్మ భిన్నమయినదని రుజువయినది. శరీరేంద్రియ రూపముననే ఆత్మ ఉన్నచో ఆత్మకు వాని నుండి విడువడుట అసంభవము. అగ్ని జ్వాల ప్రకాశరూపము. ఆ అగ్ని నుండి జ్వాలయు, ప్రకాశమును విడువడలేవు. కాని ఆత్మ నుండి కార్యకారణ సంఘాతము వేరు పడును. కావుననే ఆత్మ కార్యకారణ సంఘాతము కంటె వేరు.

ఆ పురుషుని వాసస్థానములు రెండు. 1. ప్రత్యక్షానుభూయమానమగు ఈ శరీరము, 2. శరీర వియోగానంతరము అనుభూయమానమగు పరలోకము. మూడవది లేదు. స్వప్నము ఈ రెంటికిని సంధి. రెండు గ్రామముల సరిహద్దు రెండు గ్రామముల కంటెను వేరు కాదు. అచ్చట నిలబడినచో రెండు గ్రామములను చూడవచ్చును. అటులనే స్వప్న స్థానము నందు ఉండి ఆత్మ ఈ లోకమును, పరలోకమును రెంటిని

అనుభవించును. పరలోకమునందు పాపములను, ఆనందమును రెంటిని అనుభవించును. ఈ లోకమునందు అను భావ్యములగు పదార్థములను కూడ అనుభవించును. ఏలనన స్వప్నము పూర్వము చూడని వానిని చూపించదు. పూర్వదృష్ట పదార్థముల స్మరణమే స్వప్నము. పురుషుడు స్వప్నావస్థకు జేరినప్పుడు భూత, భౌతిక మాత్రములను (అంశములను) కూడ తీసికొని వెళ్ళును. అనగా జాగ్రదవస్థ యందు చేసిన పదార్థముల వాసనలతో స్వప్నావస్థను పొందును. అనంతరము తానే తనకు లభించిన జాగ్రత్ శరీరమును త్యజించి వాసనా మయమగు స్వప్న శరీరమును నిర్మించి తన దీప్తిచే ప్రకాశించుచున్న స్వప్న పదార్థములను అనుభవించును.

***అత్రాయం పురుషః స్వయం జ్యోతిర్భవతి.***
***"ఈ స్వప్నావస్థ యందు పురుషుడు స్వయం జ్యోతి."***

# ఇరువది ఆఱవ ప్రసంగము

స్వప్న దర్శనము నందు జాగృతి కంటె వైలక్షణ్యము కలదు. జాగృతి యందు ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, సూర్య ప్రకాశములు మొదలగు వానిచే సంకీర్ణమగుటచే ఆత్మజ్యోతి నిశ్చయించ బడజాలదు. ఈ ప్రకాశము ఎవరిది? ఇంద్రియములదియా? మనస్సుదియా? బుద్ధిదియా? సూర్యునిదియా? ఆత్మదియా? అనునది నిశ్చయించుట జరుగదు. స్వప్నము నందు ఇవి ఏమియు ఉండవు. ఆత్మయే ఉండును. కావున స్వప్నానస్థ యందలి ప్రకాశము ఆత్మదియే అనియు, ఆత్మ స్వయం జ్యోతి అనియు అంగీకరించవలెను. జాగృతి యందలి విషయములే స్వప్నము నందు కలవు. స్వప్నము నందు జాగృతి కంటె ఏమి వైలక్షణ్యము కలదు? ఆత్మ స్వప్నావస్థ యందు స్వయం జ్యోతి అనుటకు తగిన ఆధారమేమి అను ప్రశ్నకు శ్రుతి ప్రమాణము కలదు.

***"న తత్ర రథా న రథయోగా న పన్థానో భపన్త్యంథ రథాన్ రథయోగాన్ పథః సృజతే"***

స్వప్నము నందు రథములు, గుర్రములు, నడచు మార్గములు ఏమియును ఉండవు. కాని స్వప్నము నందలి ఏకాగ్ర చిత్తతచే తానే అన్నిటిని సృజించు కొనును. ఒర నుండి వెలికి తీయబడిన కత్తివలె బుద్ధ్యాది ఉపాధి రహితమగు ఆత్మ స్వయముగా, స్వకీయమగు జ్యోతిచే ప్రకాశ మానమగుచు స్వప్నా వస్థయందు ప్రతీతమగును.

***"న తత్రాఽఽనన్దా ముదః ప్రముదో భవన్తి"***

స్వప్నావస్థ యందు ఆనందాదులు ఏమియును ఉండవు. వానిని అన్నిటిని ఆత్మ తానే సృష్టించుకొనును.

***"తదేతే శ్లోకా భవన్తి స్వప్నేన శరీరమభి ప్రహత్యా సుప్తః సుప్తాన భిచాక శీతి పుక్రమాదాయ శున రైతి స్థానమ్."***

స్వప్న భావము ద్వారా జాగ్రత్ శరీరమును నిశ్చేష్ట మొనరించి ఆత్మ తాను సుప్తావస్థను పొందకుండ ఉండి సుస్తావస్థను పొంది తన

ఆక్రమణతో నశించిన బాహ్య, ఆధ్యాత్మిక భావములను అన్నిటిని శరీర, అంతః కరణాదులను భాసింపజేయును. అనంతరము శుద్ధజ్యోతి రూపమును పొంది కర్మలను ఆచరించుటకు జాగృతిలోనికి వచ్చును.

***హిరణ్మయః పురుష ఏక హంసః.***

పురుషుడు చైతన్య జ్యోతియే స్వభావముగా కలవాడు. ఆ ఒక్కడే జాగృతి, స్వప్న, ఇహలోక, పరలోకము లన్నిటిలోనికి వెళ్ళును.

అటులనే పంచేంద్రియ వృత్తి కల ప్రాణము ద్వారా అత్యంత అశుద్ధమగు శరీరమును రక్షించుచు శరీరమునకు బయటనే ఉండును. అనగా శరీరముతో సంబంధము లేకుండ శుద్ధముగనే ఉండి కోరిన చోటికి వెళ్ళును.

స్వప్నావస్థ యందు ఒకప్పుడు దేవాది భావములను పొందును. మరియొకప్పుడు పశ్వాది భావములను పొందును. ఇట్లు వాసనాను సారము అనేక భావములను పొందును.

ఒకప్పుడు స్త్రీలను కూడి ఆనందించును. మరియొకప్పుడు మిత్రులతో ఆనందించును. భుజించుచు, తిరుగుచు ఉండును. సింహాది ప్రాణుల భయమును కూడ అనుభవించును.

మానవులందరును ఈ ఆత్మ సృజించిన వాసనాయుతమగు క్రీడ, ఆనందము మొదలగు వానినే చూడగలరు. కాని ఎవరును వానిని సృజించిన ఆత్మను చూడలేరు. "స్వప్నావస్థ యందు అత్యంత వివిక్తమును స్వయంజ్యోతి స్వరూపమును అగు ఆత్మ దృగ్గోచర మగుచున్నను జనులు దానిని చూడలేరు. ఇది ప్రపంచపు దురదృష్టము మాత్రమే" అని శ్రుతి స్పష్టముగా భేదమును ప్రకటించుచున్నది.

స్వప్నావస్థ యందలి నిద్రించిన-మనుష్యుని లేపరాదని వైద్యులు చెప్పిరి. ఏలనన, ఇంద్రియములను త్యజించి ఆత్మ స్వప్నావస్థ యందు విహరించుటకు వెళ్లినది. లేపు తొందరలో నేత్రములు, కర్ణములు మొదలగు

ఇంద్రియములను పొంద లేకపోయినచో ఔషధ సేవచే చికిత్స చేయుటకు వీలుపడదు. నిత్యాంధత్వము, బధిరత్వము మొదలగు దోషములు కలుగును. దీనిని బట్టి కూడ ఇంద్రియేతరమగు ఆత్మ ఏకైకమగు స్వయంజ్యోతి అని రుజువు అగుచున్నది.

స్వప్నలోకము వేరొకటియా? కాదా? అనే ప్రశ్న కూడ విచారించ దగినదే. జాగృతి యందలి లోకమే స్వప్నలోక మగుటకు వీలుపడదు. ఏలనన, స్వప్నమున ఇంద్రియములు అన్నియును ఉపరతిని పొందును. ఇక చూచుట, వినుట దీనిచే సంభవించును? ఇంద్రియములు ఉపరతిని పొందిన తరువాతనే స్వప్నములు చూచుట జరుగును. ఇందువలననే శ్రుతి చెప్పుచున్నది. "న తత్ర రథా న రథ యోగాః”

ఇట్టి స్వయం జ్యోతియగు ఆత్మను యాజ్ఞవల్క్యుడు జనక మహారాజుకు తెలిపెను.

కాని జనకుడు మరల ప్రశ్నించెను. ఇంకను

మోక్షమునకు సంబంధించిన ప్రశ్న నేను అడుగ వలసియున్నది. విమోక్షము యొక్క ఏక దేశిత్వము, విమోక్షము యొక్క ఉపయోగము, ఆత్మయొక్క స్వయం జ్యోతిత్వము- వీనిని గురించి తమరే సెలవిచ్చిరి. ఇక సంసారము నుండి ముక్తి కలుగు మార్గమును నాకు తెలుపుడు.

## విమోక్షము ఎట్లు కలుగును

ఇంతవరకు ఆత్మ స్వయంజ్యోతి స్వరూపము అనునది రుజువు చేయబడినది. కాని శ్రుతి ఇట్లు చెప్పుచున్నది.

***"స్వప్నో భూత్వేమం లోకమతిక్రామతి మృత్యో రూపాణి."***

స్వప్న రూపమును పొంది ఈ ఆత్మ ఈ లోకమను మృత్యు రూపమగు అవిద్యా కర్మాదులను అతిక్రమించును. అందు ఇంకను సందేహమునకు చోటు కలదు. "మృత్యురూపమును అతిక్రమించును కాని

మృత్యువును మాత్రము అతిక్రమించదు కదా” అని అడుగ వచ్చును. అంతియె కాదు. స్వప్నమునందు కూడ భయంకరమగు ప్రాణులు మొదలగు వానిని చూసిన భయత్రాసాదులు ప్రత్యక్ష మగును. అందుచే మృత్యువును అతిక్రమించలేదు అను విషయము నిశ్చయమగుచున్నది కదా! ఇక విమోక్షము ఎట్లు కలుగును? ఈ సందేహమునకు సమాధానము యాజ్ఞవల్క్యుడు ఎట్లు చెప్పుచున్నదియు విచారించుదము.

“మృత్యువు ఆత్మ యొక్క స్వభావము కాదు. ధర్మము కాదు” అనునది రుజువు అయినచో విమోక్ష విషయము రుజువగును.

## ఆత్మ నిత్య శుద్ధ, బుద్ధ, ముక్తము

***“సవా ఏష ఏతస్మిన్ సంప్రసాదే రత్వా చరిత్వా దృష్ట్వైవ పుణ్యం చ పాపం చ పునః ప్రతిన్యాయం ప్రతియోన్యా ద్రవతి స్వప్నా యైవ న యత్తత్ర కించిత్పశ్యత్యనన్వాగత స్తేన భవత్యసంగో హ్యాయం పురుష ఇత్యేవ మేవం తద్యాజ్ఞ్యవల్క్య సోహం భగవతే సహస్రం దదామ్యత ఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహీతి ”***

ఆ ఆత్మ సుషుప్తి యందు సంచరించి, ఆనందమును మాత్రమే అనుభవించి, పుణ్య పాపములను చూచి (అనుభవించి కాదు) వెళ్లిన క్రమమునకు విపరీత క్రమమున స్వప్నమునందే తిరిగి వచ్చును. (మెట్లు ఎక్కి మేడలోనికి వెళ్లిన వాడు తిరిగి వెనుకకు వచ్చునప్పుడు మొదట ఎక్కిన మెట్టుపై, అన్నిటికంటె చివరను కాలు ఉంచును. అటులనే జాగృతి నుండి స్వప్నము లోనికిని, స్వప్నము నుండి సుషుప్తి లోనికిని వెళ్లును. కావున సుషుప్తి నుండి స్వప్నము లోనికిని స్వప్నము నుండి జాగృతి లోనికిని

వెనుకకు మరలును. సుషుప్తి నుండి తిన్నగా జాగృతి లోనికి రాదు. “ప్రతి న్యాయం” అనగా విపరీతక్రమమున అని అర్థం.)

ఈ స్వప్నమున ఏమి చూచినను, చెప్పినను, వానితో ఆత్మ లిప్తమవదు. ఎట్లనిన, స్వప్నమునందు ఏదైనా హత్య చేసిన సంగతి మిత్ర మండలి యందు చెప్పినను ఆ వ్యక్తిని పాపాత్మునిగా మిత్రులు తలచరు. అటులనే దానిని ఏదియును స్పృశించలేదు. ఏలనన, ఆత్మ నిర్లిప్తము.

ఈ విషయమున ఒక దృష్టాంతము కలదు.

ఒక బ్రాహ్మణునకు స్వప్నము వచ్చెను. స్వప్నమున ఆతడు ఒక జలాశయము వద్దకు జలమును త్రాగుటకు వెళ్లెను. ఆ సరోవర తీరమున ఒక పెద్ద నేరేడు చెట్టు ఉండెను. దాని యొక్క ఒక లావైన కొమ్మపై ఒక కిరాతకుడు కూర్చుని నేరేడు పండ్లు తిని దాని గింజలు సరోవరములోనికి విసరుచుండెను, ఈ సంగతి

బ్రాహ్మణునకు తెలియదు. ఆతడు తొందర తొందరగా దోసిలితో నీరు త్రాగు చుండెను. ఒకమారు దోసిలి లోనికి నీటితో పాటు నేరేడు గింజ వచ్చి నోటిలోనికి పోయెను. పైకి చూచుసరికి బ్రాహ్మణునకు ఆ కిరాతకుడు కన్పించెను, తాను కిరాతకుని ఉచ్ఛిష్టమును తిని అపవిత్రుడనైతిని అను విచారము అతనికి కలిగెను. దానితో ఆతడు మేల్కాంచెను. మేల్కొనిన తరువాత కూడ అతనికి చాల పశ్చాత్తాపము కలిగెను. తాను జాతి భ్రష్టుడ నైతినని తలచి ప్రాయశ్చితమును తెలిసికొనుటకు పురోహితుని చెంతకు వెళ్లెను. పురోహితుడు తెలివైనవాడు. ఆ కారణముచే అతడు ఇట్లు చెప్పెను. "నీవు స్వప్నము నందు ఉచ్ఛిష్టము తింటివి. కావున దాని ప్రాయశ్చిత్తము కూడా స్వప్నము నందలి పురోహితుడే చెప్పును."

స్వప్నము మిథ్య. అందుచే సత్ స్వరూపమగు ఆత్మకు ఏ విధమగు దోషమును

కలుగదు. కావుననే ఆత్మ నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావము కలదని చెప్పెదరు.

## ఆత్మ నిర్లిప్తము

ఈ విషయము విని జనకమహారాజు చెప్పెను. “ఓ యాజ్ఞవల్క్యా! తమరు చెప్పినది యథార్థము. ఆత్మ కర్మలకు సంబంధించదు అని, మోక్ష పదార్థము యొక్క ఏక దేశ కర్మ ప్రవివేకము అని తెలిపితిరి. ఇక మోక్షము గురించి తిరిగి తెలుపుడు.

అంతట యాజ్ఞవల్క్యుడు చెప్పెను.

సుషుప్తి నుండి స్వప్నము లోనికి వచ్చినట్లుగనే, స్వప్నము నందు ఆనందించి మరల జాగృతిలోనికి వచ్చును. స్వప్నము నందు కర్మాదులచే ఆత్మ కొంచెమైనను లిప్తము కాదు. ఏలనన, అది నిస్సంగము. నిస్సంగత్వముచే కర్తృత్వము కూడ లేదు. స్వప్నము నందు కామములును, సాంగత్యమును ఆత్మకు ఉన్నచో వానితో ఆ సాంగత్య దోషములతో జాగృతిలోనికి

రావలసియున్నది. కాని అట్లు జరుగుట లేదు.

ఈ విధముగనే ఈ ఆత్మ జాగృతి యందు ఆనందించి, మరల పుణ్య పాపములను చూచియే, క్రమముగా జాగృతి నుండి స్వప్నమునకు చేరును. కావున జాగృతి యందు కూడ ఆత్మ నిస్సంగమే, ఏ రకపు కార్యముల చేతను ఆ ఆత్మ బద్ధమగుట లేదు. ఆత్మ జ్యోతి మాత్రముచే అవభాసితమగుచున్న కార్య (శరీరము) కరణ (ఇంద్రియములు) సంఘాతము మాత్రమే కర్మాదులను ఆచరించుచున్నది. ఆత్మ స్వయం జ్యోతి స్వభావము కలిగినది. అగుటచే దానిని ఏ కర్మయును బంధించుట లేదు. బుద్ధ్యాది ఉపాధులచే ఆత్మయందు పరిలక్షితమగు కర్తృత్వము ఔపచారికము. కావుననే శ్రుతి “ధ్యాయతి ఇవ, లేలాయతి ఇవ” అని 'ఇవ' శబ్దముతోనే వివరించినది. వాస్తవమునకు ఆత్మ ఏమియును చేయుట లేదు.

ఈ విధముగా జాగృతి, స్వప్న, సుషుప్తి

అవస్థల యందు ఆత్మ నిర్లిప్తము, కర్తృత్వ రహితము, స్వయం జ్యోతి స్వరూపము అనునవి రుజువు అయిన తరువాత చెప్పవలసినది ఇక ఏమియు లేదు. కావున దృష్టాంతమును మాత్రమే శ్రుతి తెలుప ప్రయత్నించు చున్నది.

"తద్యథా మహా మత్స్య ఉభే కూలే అను సంచరతి పూర్వం చాపరం చైవ మేవాయం పురుష ఏతా పుభావన్తావను సంచరతి స్వప్నాన్తంచ బుద్ధాన్తంచ||"

పెద్ద తిమింగిలము నదీ తీరములను రెంటిని ఆనుకొని సంచరించు నట్లు- నదీ ప్రవాహముపై ఆధారపడక, ఇష్ట మొచ్చినట్లు సంచరించునట్లు- ఆత్మకూడ స్వప్న, జాగృతుల యందు స్వేచ్ఛగా సంచరించును.

భౌతికాకాశమున శ్యేనము ఇష్టము వచ్చినట్లు ఎగిరి అలసిపోయిన తరువాత తన గూటిలో రెక్కలను ముడుచుకొని కూర్చొనినట్లు ఈ ఆత్మకూడ జాగృతి, స్వప్నముల యందు

ఇష్టమొచ్చినట్లు విహరించి శాంతి కొరకు సుషుప్తి స్థానమునకు వచ్చును. అచ్చట ఏ కామమును ఉండదు. ఏ స్వప్నము ఉండదు.

ఆత్మ యొక్క స్వభావము సర్వసంసార ధర్మశూన్యత్వమును, పరోపాధి నిమిత్తము మాత్రమే అగు సంసారధర్మత్వము అయినచో పరోపాధిరూపమగు అవిద్య స్వాభావికమా? ఆగంతుకమా? ఆగంతుక మయినచో వియోగమును పొందుటకు వీలుపడును. కాని ఆగంతుక మనుటకు ప్రమాణము ఏది? అవిద్య ఆత్మ యొక్క ధర్మము ఏల కాదు? ఇట్టి సందేహములను పోగొట్టుట కొరకు సకల అనర్థములకును బీజమగు అవిద్య యొక్క తత్త్వమును బోధపరచుటకు క్రింది శ్రుతి తెలుపబడినది.

**"తా వా అస్తైతా హీతా నామ నాడ్యో యథా కేశఃసహస్రధా భిన్నఃతావతాఽణిమ్నా తిష్ఠన్తి శుక్లస్య నీలస్య పిఙ్గలస్య హరితస్య లోహితస్య పూర్ణా అథ యత్రైనం ఘ్నన్తీవ జినన్తీ వహస్తీ వ విచ్ఛాయయతి గర్తమివ పతతి యదేవ జాగ్రద్భయం పశ్యతి తదత్రావిద్యయా మన్యతేఽథ యత్ర దేవ ఇవ రాజే వాహమేవేదం సర్వోస్మీతి మన్యతే సో ఽస్య వరమో లోకః"**

ఈ పురుషునియందు (శిరము, చేతులు, కాళ్ళు మొదలగునవి కలవాని యందు) "హిత" అను పేరుకల నాడులు కలవు. ఇవి కేశమును వేయి భాగములుగా చీల్చినను ఏర్పడు స్వరూపము కంటె సూక్ష్మముగా నుండును. అవి వాత, పిత్త, కఫ మిశ్రమమున తెలుపు, నలుపు, పసుపు, ఎరుపు మొదలగు రంగులను కలిగి యుండును. పంచ ప్రాణములు, దశేంద్రియములు, మనస్సు, బుద్ధియును కలసి లింగ దేహము అగును. అది సూక్ష్మముగను,

స్వచ్ఛముగను ఉండి నాడుల యందలి రసముల ఉపాధిచే స్త్రీ, ఏనుగ, గుఱ్ఱము, రథము మొదలగు ఆకార విశేషములు కల వాసనలను పొందును. అటి స్థితిలో (స్వప్నము నందు) శత్రువులు కాని, దొంగలు కాని వచ్చినచో నన్ను శత్రువులు కొట్టిరి, దొంగలు నాసొత్తు ఎత్తుకొనిపోయిరి. మొదలగు వాసనా నిమిత్తమగు అసత్య ప్రతీతి కలుగును. అంతట అతడు దుఃఖించును. కాని ఇదంతయును అవిద్యాకృతము.

## సర్వాత్మ భావము ఆత్మ యొక్క పరమ లోకము

ఆ అవిద్య నశించి దేవతా విషయమగు విద్య జన్మించినప్పుడు (జాగ్రత్ కాలమున) ఆ వాసనల ద్వారా తాను దేవుడనని తలచును. అవిద్య ఉద్భవించినప్పుడు స్వప్నము నందు కూడ నేనే ఈ రూపములను అన్నిటిని పొందుచున్నాను అను భావము కలుగును. ఈ

విధమగు జ్ఞానము ఆత్మ యొక్క సర్వాత్మ భావము. ఇదియే పరలోకము.

సర్వాత్మ భావము, లేక విద్యా ఫల స్వరూపమగు, మోక్షమును గురించి శ్రుతులు చెప్పుచున్నవి. అది మొదట ప్రస్తావించబడినది.

"యత్ర సుప్తో న కంచన కామం కామయతే" (ఈ విధముగా సుషుప్తి రూపమున) అదియే ఈ పురుషుని వాస్తవిక రూపము. సర్వాత్మ భావమును గురించి వెనుకటి శ్రుతి యందే "సోఽస్య పరమోలోకః" అని చెప్పబడినది.

***తద్వా అస్యైతదతీచ్ఛన్దా అవహతపాప్మాభయగ్ం రూపమ్ తద్యథా ప్రియయా స్త్రీయా/***

ఆ ఆత్మ యొక్క స్వరూపమే అతీచ్ఛందము. అనగా కామనా రహితము, పాపరహితము, అభయస్వరూపము, ఆ పరమాత్మ స్వరూపమే తన ఆత్మతో పరిష్వక్తమగును. అది బాహ్యా వస్తువుయో, ఆంతరంగిక వస్తువుయో ఎవరును

తెలిసికొనలేరు. ఇదియే ఈ పురుషుని స్వరూపము.

ఈ పురుషుడు "ఆప్త కాముడు" అనగా అన్ని కోరికలును ఇతనిని పొందియుండును. ఇతడు ఆత్మకాముడు. ఆత్మను మాత్రమే కోరుచుండును. అకాముడు. ఏ విధమగు కోరికయు ఇతనియందు ఉండదు.

ఈ సమయమున తండ్రి కొడుకులు, తల్లి కొడుకులు మొదలగు సంబంధములు విడిపోవును. మానవ దేవాది భావములు నివృత్తిని చెందును. చోరుడు, పాపాత్ముడు, భ్రూణ హత్య చేసిన వారు చండాలుడు (శూద్రునిచే బ్రాహ్మణ స్త్రీయందు జనించినవాడు) పౌలుసుడు, శూద్రునిచే క్షత్రియ స్త్రీయందు జనించిన వాడు) శ్రమణుడు, (సన్యాసి) తపస్వి, (వానప్రస్థుడు) మొదలగు భావములు అన్నియును నివృత్తిని పొందును. పురుషుడు పుణ్య పాప రహితుడగును. అన్ని రకములగు హృదయ

శోకములకును అతీతుడగును.

మరియొక సందేహము కలుగవచ్చును. స్వయం జ్యోతిష్వము అనగా చైతన్యాత్మ స్వభావము. చైతన్యాత్మ స్వభావము ఆత్మది కదా! ఆ స్వభావమును ఆత్మ త్యజించునా? అగ్ని ఉష్ణత్వ, ప్రకాశత్వములను త్యజించదు. కాని సుషుప్తి యందు తన చైతన్యాత్మ స్వభావము చూడనగుట లేదే అని అడుగవచ్చును. ఈ సందేహమునకు ఈ శ్రుతి సమాధానము చెప్పుచున్నది.

***యద్వై తన్న పశ్యతి పశ్యన్వై తన్న పశ్యతి న హిద్రష్టు ర్దృ ష్టేర్విపరిలో పో విద్యతేఽవినాశిత్వాత్ / న తు తద్ ద్వితీయ మస్తి తతోఽన్యద్విభక్తం యత్పశ్యేత్ //***

సుషుప్తి యందు అది చూచుట లేదు. అది దృష్టి కలిగియున్నను చూచుట లేదు. అవినాశియగుటచే ద్రష్ట యొక్క స్వరూపమగు దృష్టి నశించదు. అగ్ని యొక్క ఉష్ణము నశించని విధముగా దాని దృష్టి కూడా నశించదు. అది

తప్ప మరియొకటి లేదు. ఇక దేనిని చూచును? సుషుప్తి యందు ఆత్మ దేనిని చూచుట లేదు. ఇంద్రియ వృత్తులన్నియు శాంతించుటచే ఏమియును అనుభవించుట లేదు అని తోచును. అది సరి కాదు. ఏలనన, సుషుప్తి యందు కూడ జ్ఞానము ఉండును. ద్రష్టయగు ఆత్మ యొక్క దృష్టి విజ్ఞాన శక్తి. అది ఎప్పుడును నశించదు. అది నశ్వరము కాదు. అయినను కొంచెము భేదము మాత్రము కలదు. ఆ స్థితియందు ద్రష్ట వ్యతిరిక్తమగు జీవుడు వేరొండు ఉండడు. ఇక చూచువాడు ఎవడు? చూచునది ఏమి? ఆ సమయమున స్వరూప జ్ఞానము మాత్రమే కలుగును.

ఇదే విధముగ సుషుప్తి ముందు ఆత్మకు ఘ్రాణము, జిహ్వా, ఉచ్చారణము, శ్రవణము, విచారణము, స్పర్శ, విజ్ఞానము మొదలగు శక్తులు అన్నియును ఉన్నను ఆత్మభిన్నమగు వేరొకటి లేనందున వేరుగా వాసన చూచుట, రుచి

చూచుట మొదలగు క్రియలు తెలిసికొనబడవు. ఇతర వస్తువు ఏదైన ఉన్నను చూచువాడు ఎవడైన ఉన్నను ఈ క్రియలు అన్నియును జరుగును. కాని సుషుప్తి యందు వేర్వేరు వస్తువులను నిర్మించు అవిద్యయే శాంతించినప్పుడు ఎవరు ఎవరిని చూచుదురు?

బృహదారణ్య కోపనిషత్తునందు యాజ్ఞవల్క్య ఋషి జనకునకు చెప్పెను.

***సలిల ఏకో ద్రష్టాఽద్వైతో భవత్యేష బ్రహ్మలోకఃసమ్రాడితి హైన మనుశశాస యాజ్ఞవల్క్య ఏషాస్య పరమాగతి రేషాఽస్య పరమా సంపదేషోఇఽస్య పరమో లోక ఏషోఽస్యపరమ అనన్దఏత స్యైవాఽఽనన్ద స్యాన్యాని భూతాని మాత్రాముపజీవన్తి//***

ఓ జనక మహారాజా! ఆత్మ జలము వలె పరిశుద్ధమైనది, ఏకము, ద్రష్ట, అద్వితీయము. ఈ ఆత్మయే బ్రహ్మలోకము. బ్రహ్మ ప్రాప్తియే జీవాత్మ యొక్క పరమ గతి. అదియే శ్రేష్టమగు సంపద. అదియే జీవాత్మ యొక్క పరమ లోకము. అదియే

దానికి పరమానందము. ఆ బ్రహ్మానంద లేశముచే మాత్రమే- అంశముచే మాత్రమే ప్రాణులన్నియును జీవించును. ఆనందించును.

"అత ఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహీతి."

ఇటుపైన కూడా మోక్షమును పొందుటకు చెప్పమని యాజ్ఞ వల్క్యుని జనకుడు కోరెను. ఈ ప్రశ్న విని యాజ్ఞవల్క్యుడు ఆశ్చర్యమును పొందెను. భయమును పొందెను. ఆయన ఇట్లనుకొనెను. "కామ్యము ప్రశ్నకు నేను విమోక్ష సాధనమగు నిర్ణయమును తెలిపితిని. అనగా ప్రశ్న యొక్క ఏక దేశిత్వమును మాత్రమే గ్రహించితిని. కావుననే ఈ రాజు తిరిగి తిరిగి నన్ను ప్రశ్నించుచున్నాడు. ఈయన మహామేధావి. ఈయన నన్ను నలువైపుల నుండియు చుట్టు ముట్టెను. నేను స్వప్న జాగృతుల యందలి సంచారము ద్వారాను, సుషుప్తి వివరణము ద్వారాను, కారణ రహిత ప్రపంచమును గురించియును, మోక్షమును

గురించియును వివరించితిని. దానిని రాజు దృష్టాంతరూపమున గ్రహించెను. కావుననే మరల ప్రశ్నించుచున్నాడు. “ఈ విధంగా తలచి యాజ్ఞవల్క్యుడు ఉత్తర గ్రంథమున సాధన యుత ప్రపంచమును గురించియు, మోక్ష సిద్ధాంతమును గురించియును తెలిపెను.

ఆత్మ స్వప్నావస్థ యందు క్రీడించి సుఖదుఃఖములను అనుభవించి మరల జాగృతికి విపరీత గమనమున వచ్చును. కారణమగు జాగృతికి చేరును. రాజు వెళ్ళుచున్నప్పుడు ఉగ్రకర్మలను చేయు సూతాదులు రాజాజ్ఞ లేకపోయినా అయన వెనుక వెళ్ళునట్లు ఆత్మ ఊర్ధ్వగమనము చేయుచున్నప్పుడు- మరణ కాలమున- ప్రాణములు, వాగాది ఇంద్రియములు, ఒక చోటికి చేరి తృణజలూకా న్యాయమున వేరొక శరీరమును గ్రహించిన తరువాత దీనిని త్యజించును.

***సవా అయమాత్మా బ్రహ్మ***

ఆ ఆత్మయే బ్రహ్మరూపము.

విజ్ఞానమయము, మనోమయము, ప్రాణమయము, చక్షుర్మయము మొదలగునవి. ఈ బృహదారణ్యక మహావాక్యమును (యజుర్వేదీయ మహా వాక్యమును) చెప్పి బ్రహ్మ స్వరూపమగు ఆత్మ యొక్క యథార్థమును ఉపదేశించి యాజ్ఞవల్క్యుడు జనక మహారాజు అజ్ఞానమును పోగొట్టెను.

అనంతరము దర్బారు నుండి భోజనమునకు కబురు వచ్చుటచే అందరును భోజనమునకు లేచిరి.

ఓం

# ఇరువది ఏడవ ప్రసంగము

అనంతరము స్వామి శ్రీ నిత్యానందుల వారి వద్ద సాయంకాలము నాలుగు గంటలకు అందరును కూర్చొనిరి. ఆ సమయమున పెద్ద విద్యార్థి ప్రశ్నించెను. పరమాత్ముని స్వరూపము ఎట్టిది? సగుణమా? నిర్గుణమా?

## దేవుని స్వరూపము

స్వా.ప్ర.:-పరమాత్ముడు ఒకడే. కాని ఉపాధి భేదమున శ్రుతులు సగుణ, నిర్గుణ బ్రహ్మములను రెండు భేదములను తెలిపినవి. మాయా విశిష్టుడగు దేవుడు సగుణబ్రహ్మము. మాయారహితుడు నిర్గుణ బ్రహ్మము.

## సగుణ బ్రహ్మము

సగుణ బ్రహ్మము అనగా గుణాలతో కూడిన

బ్రహ్మము. గుణ శబ్దముచే సర్వజ్ఞుడు, సర్వశక్తి మంతుడు, సర్వ కాముడు, సత్య సంకల్పుడు-ఇత్యాది విశేషణ విశిష్టుడయి, క్లేశ, కర్మ, విపాక, ఆశ యాది దోషములచే రహితుడగు ఈశ్వరుని సగుణ బ్రహ్మమని చెప్పుదురు. ఆతనినే శ్రుతి "మాయి" అను శబ్దముచే ఉల్లేఖించినది. ఆతని విశేషమగు ఉపాధి మాయ. శ్వేతాశ్వతరోపనిషత్తు నందు చూడుడు.

***మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వరమ్/***
***తస్యావయవ భూతైస్తు వ్యాప్తం సర్వమిదం జగత్ //***

"జిజ్ఞాసువులు జగత్తుకు మూల కారణమగు ప్రకృతి మాయ అని తెలిసికొనెదరు. మాయాధిపతి మహేశ్వరుడని తెలిసికొనెదరు. మహేశ్వరుడు అనగా గొప్ప ప్రభువు. ఈ మాయచే కల్పించబడిన ఈ ఈశ్వరావయవములచే జగమంతయు

నిండియున్నది అని కొనవలెను.”

***అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్య చక్షుః స శృణోత్య కర్ణః/***
***స వేత్తి, వేద్యం న చ తస్యాస్తి వేత్తా తమాహురగ్ర్యం పురుషం మహాన్తమ్//***

“ఆ పరమేశ్వరునకు చేతులును కాళ్ళును లేవు. అయినను చాల దూరము సంచరించును. సమస్తమును గ్రహించును. ఆతనికి నేత్రములు లేవు. అయినను సమస్తమును చూచును. ఆతనికి చెవులు లేవు అయినను అన్నియును వినును. ఆతనికి మనస్సు లేక పోయినను తెలిసికొనదగిన వస్తువులను అన్నిటిని తెలిసికొనును. ఆతనిని తెలిసికొనినవాడు ఎవడును లేదు. అతడు మహాపురుషుడు, ప్రప్రథముడు అని బ్రహ్మవేత్తలు చెప్పుదురు.”

***ఏకైకం జాలం బహు వికుర్వన్నస్మిన్ క్షేత్రే సంహరత్యేష దేవః/***
***భూయః సృష్ట్వా పతయస్త థేశః సర్వాధిపత్యం కురుతే మహాత్మా //***

“ఈ పరమాత్ముడు దేవ మనుష్యాది అనేక జీవ సముదాయములను అనేక విధములుగా సృజించును, వానిని అన్నిటిని అంతమునందు వాని కారణమగు మాయ యందు లయమును పొందించును. అంతేకాదు. మరల లోకములను, లోక పాలకులను అటులనే సృష్టించి తాను సర్వ నియామకుడుగ నుండి ఆ మహాత్ముడు వారిపై ఆధిపత్యమును నిర్వహించును.”

***యచ్చ స్వభావం పచతి విశ్వ యోనిః పాచ్యాంశ్చ నర్వాన్పరిణామయేద్యః/***
***సర్వమేత ద్విశ్వమధితిష్ఠత్యేకో గుణాంశ్చ సర్వాన్వినియోజయేద్యః//***

“జగత్కారణుడగు పరమాత్మయే ప్రతి పదార్ధ స్వభావమును స్థిరముగా నిశ్చయించును. పరిణామము పొందదగిన వానిని పరిణామము పొందించును. తాను సమస్త విశ్వమునకును నియామకుడుగా నుండి దానిని తన అదుపులో నుంచుకొనును. మాయ యొక్క సత్త్వ, రజ, స్తమో

గుణములను మూడింటిని కార్యముల యందు కలుపును.”

**న తస్య కార్యం కరణంచ విద్యతే న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే |**
**పరాఽస్య శక్తిర్వివిధ్యావ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియా చ ||**

“ఈ పరమాత్మునకు శరీరము లేదు. ఇంద్రియములు లేవు, ఇతని కంటె గొప్ప వాడు కాని, ఇతనితో సమానమైన వాడు కాని మరియొకడు లేడు. ఈ పరమాత్ముని దివ్యశక్తి శాస్త్రములయందు అనేక రకములుగా వర్ణించబడినది. ఈ శక్తి అనాది నుండియు స్వతస్సిద్ధమగు జ్ఞాన క్రియ చేతను సర్వ విషయముల జ్ఞానములందును ప్రవర్తించు చున్నది; బల క్రియ చేతను తన సాన్నిధ్యమున ఉన్న అన్నిటిని శాసించుచున్నది.”

## నిర్గుణ బ్రహ్మము

పెద్ద విద్యార్థి:- సగుణబ్రహ్మస్వరూపమును

ఇంతవరకును తాము తెలిపిరి. ఇక నిర్గుణ బ్రహ్మ స్వరూపమును తెలుపండి.

స్వా. ప్ర. :- శ్వేతాశ్వతరోపనిషత్తు చెప్పుచున్నది.

"**సాక్షి చేతా కేవలో నిర్గుణశ్చ**." అని.

పరమాత్మ సాక్షి, చిత్ స్వరూపము ఆకారాది రహితము, నిర్గుణము. అనగా సత్త్వ రజస్తమములను మూడు గుణములును లేని వాడు.

## నిర్గుణబ్రహ్మము సచ్చిదానంద స్వరూపము

### *"సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ."*

బ్రహ్మము సత్ స్వరూపము, జ్ఞాన స్వరూపము, ఆనంద స్వరూపము. ఈ బ్రహ్మమునే బ్రహ్మవేత్తలు తెలిసికొనెదరు. ఇచ్చటి "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" అనునది స్వరూప లక్షణము. ఈ లక్షణము నందలి బ్రహ్మ పదము

లక్ష్య పరముగా ప్రయోగించబడినది. సత్యము, జ్ఞానము, అనంతము అనునవి ఇతర వ్యావృత్తి పూర్వకములగు బ్రహ్మముయొక్క విశేషణములు. విశేష్య విశేషణ భావముతో ఈ శ్రుతియందు సామానాధికరణ్యమును బోధించిన సత్యము, జ్ఞానము అనంతము అను మూడు శబ్దములు ఉన్నవి. సత్యపదముచే బ్రహ్మ భిన్నములగు అనర్థ అనిత్య పదార్థములు వ్యావర్తితరములు. జ్ఞానపదముచే జడములును, అప్రకాశములను అగు పదార్థములు వ్యావర్తితముల్లు. అనంత పదముచే దేశ, కాల, వస్తు పరిచ్ఛేద రహితమగు బ్రహ్మము బోధ్యము.

పదార్థ లక్షణము నందలి ప్రతి పదమును ఏదియో ఒక పదార్థమును వ్యావృత్తి చేయుట ద్వారా లక్ష్యమును చూపించును. "నీల కమలము" మొదలగు చోట్ల విశేషణము ద్వారా నీల కమలమును ఎరుక పరచవలసినచో "రక్త కమలమునకు" వ్యావృత్తి కలుగవలెను. అవ్యావృత్తి నీలపదముతోనే జరుగగలదు. ఇట్లే

అనేక విశేషణముల ద్వారా అనేక విశేష్యములను దూరము చేసి లక్ష్యమును చూపవలెను. కాని "నిర్గుణ బ్రహ్మము ఒకటే" అను చోట అనేక విశేషణములను ఉపయోగించవలసిన అవసరము లేదు. సూర్యుడు ఒకడే అయినప్పుడు ఆ సూర్యునకు ఒకడే అను విశేషణము ఉపయోగించుట నిరర్థకము.

కావున పై మూడు పదములలోను ఏదియో ఒక ముఖ్యమైన అభీష్ట పదమును ఉపయోగించి బ్రహ్మ స్వరూపమును బోధించుట యుక్తము.

## "సత్" మొదలగు పదముల సార్థక్యము

పెద్ద వి :- అద్వితీయమగు బ్రహ్మము ఒకడైనప్పుడు ఇక మూడు పదములు వాడవలసిన అగత్యమేమి?

స్వా. ప్ర. :- అద్వితీయ మగు బ్రహ్మము ఒక్కడే. ఆ కారణముచే అతనిని నానాపదార్థేతర

వ్యావృత్తి రూపమున తెలిసికొనవలసిన అవసరము లేదు. కాని ఒక సంగతి. ఆకాశమునందు సూర్యుడు కలడు. అదేవిధమగు సూర్యప్రతిబింబము అనేక జలాశయము లందు కాననగును. ఆ పరిస్థితియందు కల్పనా ప్రసూతులగు సూర్యులను వ్యావృత్తిని పొందించుటకై ఆకాశము నందలి సూర్యుడు సత్యము అని విశేషణము ప్రయోగించ వలెను. “సత్యము” అను విశేషణము ఆకాశము నందలి సూర్యుని యందు ఎట్లు సార్ధకమో అటులనే బ్రహ్మేతరమగు కల్పిత అన్యాకృత భూతాకాశాదుల వ్యావృత్తి కొరకును, బ్రహ్మ పద జోధ్యమగు నిర్గుణబ్రహ్మము భూతాది భిన్నమని తెలియజేయుటకును యుక్తము. ఏలనన అవ్యాకృతములగు ఆకాశాధి భూతములు అనిత్యములు, కల్పితములు, బ్రహ్మము సత్యము. తద్భిన్నము కల్పనా ప్రసూతము కాదు.

కాలత్రయ బాధారహితము సత్యము. క్వాచిత్కమగు పదార్థ ప్రతీతి కలది అసత్యము.

ఎట్లనిన-

“మృత్తిక నుండి ఘటము ఉద్భవించును అని చెప్ప బడినది.”

మృత్తిక నుండి సర్వకాల సర్వావస్థలయందును ఒకే రకమగు ఘటాకృతులు ఉద్భవించవు. ఒకప్పుడు ఘటములు ఉద్భవించినను మరియొకప్పుడు ప్రమిదలు మొదలగునవి ఉద్భవించును. వికారములగు ఈ పదార్థము లన్నియు అనిత్యము. శ్రుతికూడ చెప్పుచున్నది.

**వాచార మ్భణం వికారో నామధేయం**
**మృత్తికే త్యేవ సత్యమ్**

పేరు పెట్టబడుటతో “నామ ధేయము” అను వికారమును పొందును. కాని యథార్థమునకు “మృత్తిక” అనునదియే సత్యము. అనగా మృత్తికచే జనించిన కుండలు, ప్రమిదెలు అన్నియును మృత్తికయే. కుండ, ప్రమిద

మొదలగునవి పేర్లు మాత్రమే.

ఇట్లు సత్యపదము ద్వారా బ్రహ్మ వికారములగు ఇతర పదార్థములు వ్యావర్తితములు. "చిత్" అనగా జ్ఞానము. ఈ పదముచే జడపదార్థములు వ్యావర్తితములు, లౌకిక జీవుల జ్ఞానము అనిత్యము. కావున బ్రహ్మము అనిత్య జ్ఞాన రూపము అను భావ నివృత్తి కొరకు "అనంత" పదము ప్రయోగించబడినది. అనంతము అనగా దేశ, కాల, వస్తు. పరిచ్ఛేద రహితము.

ఇట్లు సత్యాది పదములచే బోధించబడు అఖండ, ఏక రస బ్రహ్మము నిర్గుణ బ్రహ్మము. "జ్ఞానం బ్రహ్మ" అని చెప్పినను బ్రహ్మ లక్షణము బోధ్యమే. ఈ నిర్గుణ బ్రహ్మముతోనే విశ్వము అంతయు నిండియున్నది.

# ఇది అంతయు దేవునిచే నిండియున్నది

శ్రుతి చెప్పుచున్నది-

***"ఈశా వాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్"***

పరోక్ష-అపరోక్ష రూపమున చూడ నగు ఇదంతయును దేవునిచే నిండియున్నది. ఆ నిర్గుణ బ్రహ్మమే "వాయ్వాది" రూపమున వ్యవహృతుడగుచున్నాడు, పత్యక్షమగుచున్నాడు. కాన యథార్థమునకు తాత్త్విక దృష్టిని పరిశీలించినచో బ్రహ్మము అప్రచలితము. ఏలనన, అది వ్యాపకము; అక్రియము.

## సృష్టికి పూర్వము "సత్" స్వరూపమగు నిర్గుణబ్రహ్మము.

***తదే జతి తన్నై జతి తత్ దూరే తదన్తి కే/***
***తదన్తరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః//# (ఈశా)***

లేదను కొనువారికి ఆ బ్రహ్మము దూరముగా నుండును. ఏలనన విద్వాంసులు

కాని వారికి బ్రహ్మము అజ్ఞాతము, అప్రాప్యము. ఆ బ్రహ్మమే సర్వ వ్యాపకము; విద్వాంసుల దృష్టికి చాల దగ్గరగ నుండును. ఆ బ్రహ్మమే సృష్టికి పూర్వము "సత్" రూపమున ఉండెను. అది ఒకటే అద్వితీయ రూపమున ఉండెను.

## నిర్గుణ బ్రహ్మము పర బ్రహ్మము

***"సదేవ సౌమ్యేద మగ్ర ఆసీదేక మేవాద్వితీయమ్" (ఛాందో)***

ఓ సౌమ్యుడా! సృష్టి ఉత్పత్తికి పూర్వము ఈ దృశ్య జాతమగు జగత్తునకు అధిష్ఠానమగు "సత్ " రూపము ఒక్కటే అద్వితీయ రూపమున ఉండెను. ముండకోపనిషత్తు ఈ నిర్గుణ బ్రహ్మమే పరబ్రహము అని చెప్పినది. అది శరీర రహితమని చెప్పబడినది.

***"అథ పరా యయా తదక్షర మధిగ మ్యతే యత్త దదృశ్యమగ్రాహ్య***

***మగోత్ర మవర్ణమ చక్షుః శ్రోత్రం తదపాణి పాదమ్ / నిత్యం విభుం సర్వ గతం సుసూక్ష్మం తదవ్యయం యద్ భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః/***

నిర్గుణ రూపముగా ప్రతి పాద్యమగు పర బ్రహ్మమే పరా విద్య అని చెప్ప బడును. ఆ పరా విద్యచే అక్షర పర బ్రహ్మము తెలియనగును. ఆ నిర్గుణబ్రహ్మము అదృశ్యము, దృష్టికి విషయము కాదు. అగ్రాహ్యము. హస్తాదులకు విషయము కాదు. అగోత్రము- వామనాది విశిష్ట గోత్ర రహితము. అశరీరి, వర్ణ, చక్షుః, శ్రోత్రాది రహితము; హస్త పాదాది రహితము. నిత్యము కాలత్రయ బాధితము. అనగా కాల కృత పరిచ్ఛేద రహితము. విభువు అనగా దేశకృత పరిచ్ఛేద రహితము. సర్వగతము. సర్వపదార్థములయందును అదృశ్యము. అవ్యయము. అనగా వికార రహితము. ఆ బ్రహ్మము సర్వ భూత యోని అనగా అది సర్వ

భూతములకును అధిష్టాన కారణము. దానిని సమా హిత చిత్తులు బాగుగా చూచుదురు. ఆ బ్రహ్మమే నిష్కలాది రూపమున గూడ ప్రతిపాదింపబడినది.

***నిష్కలం నిష్క్రియం శాన్తం నిరవద్యం నిరఞ్జనమ్||***

కళలు అనగా అవయవములు. అవి బ్రహ్మమునకు లేవు. అంతే కాదు. మనస్సు, కర్మ మొదలగు 16 కళలును లేవు. నిష్క్రియం అనగా క్రియా రహితము. శాంతము అనగా షడూర్మి రహితము. జరా, మృత్యు, శోక, మోహ, క్షుధా, తృషాది షడూర్మి రహితము. నిరవద్యము అనగా శుద్ధ నిరంజనము. కర్మ రహితము, ఫల రహితము అనగా మాయా రహితమగు పర బ్రహ్మము నానా రూపములు కలది కాదు. నానా రూపమున చూచిన వాడు జన్మ, మృత్యువుల చక్రములో తిరుగును.

# మనో వాగ్విషయము కాని నిర్గుణబ్రహ్మము

***యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ/ ఆనన్దం బ్రహ్మణో విద్వాన్న బిభేతి కదాచనేతి//***

మనస్సునకును, వాక్కునకును విషయము కాని బ్రహ్మము, అనగా ఎచ్చటనుండిన మనస్సుతో కూడిన వాక్కు నివృత్తిని చెందునో ఆబ్రహ్మము 'తత్త్వమస్యాది' మహావాక్యములకు లక్యము. దీనినే శ్రుతులు సాక్షి, చేతనము, కేవలము, నిర్గుణము అగు బ్రహ్మము అని చెప్పినవి.

# నిర్గుణ బ్రహ్మము ఉపాసనచే లభించును

పెద్ద విద్యార్థి:- నిర్గుణ బ్రహ్మము మనస్సునకు, వాక్కునకును విషయము కాదని

తమరు చెప్పిరి. ఇక అది ఎట్లు తెలిసికొనబడును?

స్వా.ప్ర:- శ్రుతులు నిర్గుణ బ్రహ్మోపాసనమును కూడ వివరించినవి. ఈవిషయము పిప్పలాదుడు సత్య కామునకు తెలిపెను.

***"ఏతద్వై సత్యకామ పరం చాపరం బ్రహ్మ యదోఙ్కార స్తస్మా
ద్విద్వానేతేన వాయతనే నైకతర మన్వేతి."***

"ఓ సత్య కాముడా! ఈ బ్రహ్మము, పర, అపర భేదముచే రెండు రకములుగా తెలియనగును. అది ప్రణవముయొక్క యొక్క వాచ్యము. కావున విద్వాంసులు ఈసాధనము చేతనే ఆ రెండు బ్రహ్మములలోను దేనినైన ఉపాసించవలెనని తలచెదరు." ఇట్లు ఉపాసన రెండు రకములు. భేదోపాసన, అభేదోపాసన.

# నిర్గుణ బ్రహ్మముయొక్క అభేదోపాసనము లేక అహంగ్రహ ధ్యానము

నిర్గుణ బ్రహ్మము యొక్క అభేదోపాసనము(అహంగ్రహ ధ్యానము) కూడ జ్ఞానమునకు సాధనము. కతిపయ కారణములచే బ్రహ్మము యొక్క అపరోక్ష జ్ఞానమును పొందని జనుడు అహంగ్రహ ధ్యానము ద్వారా బ్రహ్మము యొక్క అపరోక్ష జ్ఞానమును పొందవలెను.

"అహం బ్రహ్మోస్మి"- "నేను బ్రహ్మము" అను వృత్త్యాత్మక మగు ధ్యానము అహంగ్రహ ధ్యానము. సగుణ బ్రహ్మము నందు కూడ "అహంగ్రహ ధ్యానము" శాస్త్రముల యందు పేర్కొన బడినది. "**అకూం విష్ణుః**" మొదలగు వాక్యములచే అనేక ప్రదేశములయందు ఈవిషయము ఉదహరించబడినది.

బ్రహ్మము "ఓం" కారాభిన్నముగా నెరిగి

ప్రణవ రూపమగు బ్రహ్మము నేను అని ప్రతిక్షణము నిరంతరము బ్రహ్మ చింతనము చేయుట నిర్గుణ బ్రహ్మము యొక్క అహంగ్రహ ధ్యానము. ప్రణవో పాసన అనేక ఉపనిషత్తులయందు ఉన్నది. కాని మాండూక్యోపనిషత్తు నందును, దాని భాష్యము నందును విశేషముగ వివరించబడినది.

నిర్గుణ బ్రహ్మము ప్రణవాభిన్నమని చింతన చేయువానికి జ్ఞానము ద్వారా మోక్షము కలుగును. సగుణ బ్రహ్మమును ప్రణవము ద్వారా ధ్యానించువానికి బ్రహ్మలోకము లభించును.

## ప్రణవముద్వారా అభేదోపాసనము

ఈ జగమునందలి కారణ, కార్య రూపములగు నామ రూపాత్మక పదార్థముల అన్నియును "ఓం" కార స్వరూపము. పదార్థములు నామ రూపములను రెండు భాగములుగా నున్నను రూపము నామము కంటె వేరు కాదు. నామాత్మకమే. ఏలనన నామము

చేతనే పదార్థాకారము గ్రహించబడుచున్నది. నామము లేనిదే పదార్థ వ్యవహారము జరుగదనునది సర్వసాధారణ విషయము. కావున నామరూపముల రెండింటి యందును నామమే సారము కలది. సాంసారిక పదార్థముల ఆకార వినాశానంతరము కూడ నామము శేషించును. అంతమునందు నామముచే వ్యవహారము లన్నియు జరుగును.

## ప్రణవాభేదముగా చేయబడు నిర్గుణ బ్రహ్మ చింతనము

ఇట్లు విచారించిన పదార్థములన్నియును సత్యమగు నామము కంటె భిన్నమైనవి కావనియును, పదార్థములన్నిటి యొక్క నామ ధేయములును “ఓం” కార రూపమగు అక్షరముకంటె భిన్నమైనవి కావనియును తేలును. ఏలనన అతి ప్రాచీన నామము పరమేశ్వరునిదే. అది “ఓం” కార రూపము. జగమునందలి ఇతర

నామ ధేయములన్నియును “ఓం” కారము నుండియే ఉద్భవించినవి. “ఓం” కారము బ్రహ్మము యొక్క వాచకము. బ్రహ్మము “ఓంకార” వాచ్యము. “**తస్య వాచకః ప్రణవః**” అని పతంజలి భగవత్పాదులుకూడ నుడివిరి. “ఓం” కారము సర్వ పదార్థాభిన్నము. కావున “ఓం” కారము, బ్రహ్మము వేరు కావు. ఏలనన సర్వపదార్థరూపము "ఓం" కారము. అటులననే సర్వపదార్థ రూపము బ్రహ్మము. అందు చేతనే బ్రహ్మమునకు, “ఓం” కారమునకును భేదము లేదు. ఆ కారణముచే “ఓం” కారము వాచకము. బ్రహ్మము వాచ్యము. వాచ్య వాచకముల అభేదము స్వభావ సిద్ధమే. ఆలాగు కాదనిన “ఓం” కారము బ్రహ్మముయొక్క నామ భేదమయి బ్రహ్మము నందు అధ్యస్తమని చెప్పవచ్చును. అధ్యస్త పదార్థము అధిష్ఠానభిన్నము కాదు. ఇటుల విచారించినను “ఓం” కారమునకును భేదము లేదు. కావున ప్రణవాభేద రూపమగు నిర్గుణ బ్రహ్మమును

చింతన చేయవలెను. ఈరీతిగా నిర్గుణ బ్రహ్మోపాసన ద్వారా ఈ అభేద చింతనము జ్ఞానమునకు ఉపయోగించును.

## పంచాయతనోపాసన ప్రతీకోపాసన

పెద్ద. వి:-ఈనాడు సాకార, నిరాకారములను రెండు రకముల ఉపాసనా పద్ధతులు కానవచ్చుచున్నవి. సాకారము అనగా సగుణము; నిరాకారము అనగా నిర్గుణము. ఇక శాలిగ్రామాదుల ద్వారా చేయు పంచాయతనోపాసన సగుణోపాసన అనబడునా?

స్వా.ప్ర. :-ఈ అభిప్రాయము శాస్త్ర పరిజ్ఞానము లేని మూలమున కలిగినది. సగుణోపాసనయును నిర్గుణోపాసనయును నిరాకారునినే ఉపాసించుచున్నవి. మాయావిశిష్టుడగు దేవుడు సగుణుడు అనబడును. మాయారహితుడగు శుద్ధబ్రహ్మము నిర్గుణ బ్రహ్మము అని చెప్పబడును. శాలిగ్రామాది దేవపంచాయతనము సగుణము కాదు,

నిర్గుణమును కాదు. అది ప్రతీకము. ఆ ఉపాసన ప్రతీకోపాసన.

***యన్మనసా న మనుతే యేనాహుర్మనో మతమ్ |***
***తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిద ముపాసతే ||***

అని కేనోపనిషత్తు చెప్పుచున్నది.

“దేనిని మనస్సుతో తెలిసికొనలేడో, దేని ద్వారా మనస్సు తెలియబడునో అదియే బ్రహ్మము అని తెలిసికొనుము. నీవు ఉపాసించు పరిచ్ఛిన్నములగు పదార్థములు బ్రహ్మము కాదు.”

***యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూంషి పశ్యతి |***
***తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిద ముపాసతే||***

“దేనిని కంటితో ఎవడును చూడ లేడో, ఎవనిచే కన్నులన్నిటిని చూచుచున్నాడో అదియే

బ్రహ్మము అని నీవు తెలిసికొనుము. ఈ పరిచ్ఛిన్న పదార్థములను ఉపాసించుట బ్రహ్మము కాదు.”

ప్రతీకోపాసన వేదోక్తము, పురాణోక్తము అని రెండు విధములు. వేదోక్తమగు ప్రతీకోపాసన నాలుగు విధములు. 1. సంపదుపాసన 2. ఆరోపోపాసన, 3. సంవర్గోపాసన, 4. అధ్యాసోపాసన. ఈనాడు ఆరోప, సంవర్గ, అధ్యాసోపాసనలు కానరావు. అల్ప గుణవంతుడు అధిక గుణశీలుని ఉపాసించుట సంపదుపాసన. ఇందు కూడ రెండు విభాగములు కలవు. 1, ఆధ్యాత్మ ఉపాసన 2. అధిదేవోపాసన.

## వేదోక్త మగు ఆధ్యాత్మ, అధిదేవోపాసనలు

ఈవిషయమున ఛాందోగ్యము ఇట్లు చెప్పుచున్నది.

*“మనో బ్రహ్మేత్యుపాసీత”*

“మనస్సు బ్రహ్మము అని అనుకొని

ఉపాసించుము."

ఇచట మనస్సు అల్పమైనది. దానియందు అధికత్వగుణమును చూసి- అనగా అది వ్యాపక బ్రహ్మము అని అనుకొని ఉపాసించుట ఆధ్యాత్మ సంపదుపాసన.

"**ఆకాశో బ్రహ్మ**"

"ఆకాశము బ్రహ్మము"

ఇచట ఆకాశము బ్రహ్మము కంటె అల్పమైనది. దానిని వ్యాపక బ్రహ్మముగా తలచి ఉపాసించుట అధి దేవసంపదుపాసన.

జనుల బుద్ధి స్థూలమయిన కొలదియు సూక్ష్మ విషయములను ఆధారముగా తీసుకొను సామర్థ్యము తగ్గినందున ఈనాడు వేదోక్తములగు ఆధ్యాత్మ, అధిదేవ సంపదుపాసనా పద్ధతులు పూర్తిగా నశించి పోయినవి.

## పురాణోక్తమగు ప్రతీకోపాసన

ఇక దానికి బదులు శాలిగ్రామాది పంచాయతనోపాసన వృద్ధి పొందినది.

శాలిగ్రామము అల్పము. దానియందు అధికత్వబుద్ధితో అనగా వైకుంఠ వాసియగు విష్ణువును బుద్ధితో ఉపాసించుటయును; నర్మదేశ్వరుడు అల్పము, అందు అధికత్వబుద్ధితో అనగా కైలాస వాసియగు శంకరుడను భావముతో నుపాసించుటయును; సూర్యుడు, జగదంబ, గణేశుడు, రాముడు, కృష్ణుడు మొదలగు విగ్రహములను ఉపాసించుటయును పురాణోక్తమగు ప్రతీకోపాసన.

## జనుల బుద్ధి స్థూలమగుటకు కారణము ఏమి?

పెద్ద విద్యార్థి:- బుద్ధి వికసించుచున్నను ఆధునిక విజ్ఞానముచే ఆశ్చర్యకరములగు అనేక విషయములు కనిపెట్ట బడుచుచున్నను, పూర్వముకంటె ఇప్పటి జనుల బుద్ధి అంతకంతకు స్థూలమగుచున్నదని తమరు చెప్పుచున్నారు. ఇది ఎట్లు?

స్వా. ప్ర. :- మీ విజ్ఞానమునందు కూడ హిందూదేశము నందలి ప్రాచీన శాస్త్రజ్ఞులు చేసిన పరిశోధనలు అపూర్వములు. గ్రహణాదులకు సంబంధించిన కఠిన గణిత విషయములు ఎప్పుడో వారు చెప్పినవి ఇప్పటికిని నిజమగుచునే ఉన్నవి. ఈ విధముగనే వారు అనేకములగు పరిశోధనలు చేసిరి. కాని నేడు మనము వానిని కోల్పోతిమి.

## విజ్ఞాన బుద్ధికిని ఆధ్యాత్మ విద్యా బుద్ధికిని భేదము కలదు

విజ్ఞానము, ఆధ్యాత్మ విద్య- ఈ రెంటికిని వేరు వేరు బుద్ధులు ఉపయోగించబడును. విజ్ఞానము నందు అత్యంత సూక్ష్మ బుద్ధి కలవాడు ఆధ్యాత్మము నందుకూడ సూక్ష్మబుద్ధిని కలిగియుండునని చెప్పలేము. విజ్ఞాన పరిశోధనకు సంబంధించిన బుద్ధి రాజసము. ఆధ్యాత్మ పరిశోధనలకు ఉపయోగించు బుద్ధి సాత్త్వికము. విజ్ఞానమునందు బుద్ధి

సూక్ష్మమగుచున్న కొలదియును ఆధ్యాత్మవిద్య యందు స్థూలమగును. రజస్తమోగుణ ప్రధానమగు బుద్ధి స్థూలబుద్ధి. సత్త్వగుణ ప్రధానమగు బుద్ధి సూక్ష్మబుద్ధి అనబడును.

## జనుల బుద్ధి స్థూలత్వమును పొందుటకు కారణము

స్వా. ప్ర. :- పూర్వకాలమునందు సంతానమునకు వివాహము చేసికొనుచుండిరి. వారి జీవితము ద్రవ్యము లేకపోయినను గడిచెడిది. కాని రోజులు గడిచిన కొలది ద్రవ్యము యొక్క అవసరము పెరిగిపోయినది. ఈవిధముగా ద్రవ్యాది లోభము చేతను, దారాపుత్రాదుల యందలి ప్రేమ చేతను, బుద్ధి స్థూలమయి పోవుచున్నది. ఈవిషయమున యోగవాశిష్ఠమున వశిష్ఠుల వాక్యములు వినుడు.

***స్నేహేన ధనలోభేన లాభేన మణియోషితామ్ /***

***ఆపాతరమణీయేన చేతో గచ్ఛతి పీనతామ్॥***

"కుటుంబాదుల యందును ఇతరములగు అనేక భోగ్య పదార్థముల యందును ప్రేమ కలిగి యుండుట చేతను, ధనలోభము చేతను, కాంతాది స్థూల పదార్థములు లభించుట చేతను చిత్తము స్థూలత్వమును పొందును."

***ఆధివ్యాధి విలాసేన సమాశ్వాసేన సంసృతౌ।***
***హేయదేయ ప్రయత్నేన చేతో గచ్ఛతి పీనతామ్॥***

"అనేక రకములుగు దుఃఖముల చేతను, రోగాదులు చేతను, సాంసారిక పదార్థములయందు రమణీయ బుద్ధియు, నిత్యత్వ బుద్ధియు కలిగియుండుట చేతను దుఃఖదాయకములగు వానిని విడనాడవలెనను ప్రయత్నము ఉన్నను కూడ చిత్తము స్థూలత్వమును పొందును."

***దురాశాక్షీర పానేన భోగానలబలేన చ।***
***ఆస్థాదానేన చారేణ చిత్తాహిర్యాతి పీనతామ్॥***

"సర్పమునకు పాలుపోసి పెంచిన బాగుగా బలియును. విషము కూడ వృద్ధిని పొందును. అటులనే దురాశ అను పాలు త్రాగుట చేతను భోగాగ్ని యొక్క బలము చేతను, సాంసారిక పదార్థములు యందు అస్తిత్వ బుద్ధి కలిగి యుండుట చేతను, అనేక విధములగు విషయ భోగములను అనుభవించుట చేతను చిత్తము అను సర్పము స్థూలత్వమును పొందును."

ఈ విధముగా సామాన్య జనుల బుద్ధి స్థూల మగుచున్నది. కావున శాలిగ్రామ, నర్మదేశ్వరాదుల ఉపాసన వాడుకలోనికి వచ్చినది.

పెద్ద విద్యార్థి:- అందరకును ప్రతీకోపాసన కావలెనా?

స్వా. ప్ర. :- భగవానుడు మహాభారత మందలి ఉత్తర గీత యందు చెప్పెను.

***అగ్నిర్దేవో ద్విజాతీనాం, మునీనాం హృది దైవతమ్/***

**ప్రతిమా స్వల్ప బుద్ధీనాం సర్వత్ర సమదర్శి నామ్ //**

"ద్విజులకు అగ్ని దైవము. మునులకు హృదయము దైవము. అల్ప బుద్ధి కలవారలకు విగ్రహము దైవము. సమబుద్ధి కలవారలకు దైవము ఎల్లడలను గలడు."

ఆ ఉత్తర గీత యందే మరియొక చోట ఇట్లున్నది.

**తీర్థాని తోయ రూపాణి దేవాన్పాషాణ మృణ్మయాన్ /**
**యోగినో న ప్రపద్యన్తే ఆత్మ ధ్యాన పరాయణాః//**

"జల రూపమును పొందిన తీర్థములను, మృత్పాషాణాది విగ్రహ రూపములను పొందిన దేవతలను ఆత్మ ధ్యాన పరాయణులగు యోగులు సేవించరు."

స్వా. ని. :- ఇతర శాస్త్రములు కూడ కూడా చెప్పుచున్నవి.

**పాషాణ లోహ మణి మృణ్మయ విగ్రహేషు**
**పూజా పునర్జన్మ కరీ ముముక్షోః/**
**తస్మాద్యతిః సహృదయార్చనమేవ కుర్యాత్**
**బాహ్యార్చనం పరిహరేత్ అపునర్భవాయ//**

"పాషాణము, ధాతువు, మణి (స్ఫటికాదులు) మృత్తిక మొదలగువానిచే తయారు చేయబడిన ప్రతిమలను పూజించుటచే ముముక్షువులకు పునర్జన్మమును, భోగములును కలుగును. కావున సన్యాసి తన హృదయము నందే దేవతార్చనము చేయవలెను. బహిరంగార్చనను త్యజించవలెను."

పెద్ద విద్యార్థి:- ఇంతకుముందు చెప్పిన శ్లోకము ప్రకారము బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు అగ్ని దైవమనియును, మిగిలిన అల్ప బుద్ధిశాలురకు- అనగా స్త్రీ శూద్రాదులకు విగ్రహ పూజనము విధివిహితమనియు తేలుచున్నది కదా! కాని నేడు ద్విజులే విగ్రహ పూజ చేయుచున్నారు. ఇది తగునా?

సా. ప్ర. :- పూర్వకాలము నందలి బ్రాహ్మణులు విద్యా తపస్సులచే ఒప్పుచుండిరి. "***తపోయోనిభ్యాం బ్రాహ్మణః స్మృతః***" అని శాస్త్రములు చెప్పుచున్నవి. ఇట్టి తపశ్శాలురకు వారి యోగ క్షేమముల చింత ఉండెడిది కాదు.

## యావత్ జీవేద్ అగ్నిహోత్రం జుహ్యాత్

"జీవించి ఉన్నంత కాలము అగ్నిహోత్రము చేయవలెను." ఈ విధిని అనుసరించి ఆ కాలము నందలి క్షత్రియులు, వైశ్యులును ప్రాతః కాలమునందును, సాయంకాలము నందును అగ్నిని ఉపాసించెడి వారు. కాని ఇప్పుడు అన్ని జాతుల వారిని తమ యోగ క్షేమమునకు సంబంధించిన చింత వేధించుచున్నది. ఈ ఆపత్కాలము నందు అగ్ని హోత్రాదులు ఎక్కడనైన అరుదుగా చూడనగును. కేవలము స్వధర్మ రక్షణ పరాయణులు మాత్రము వానిని ఆచరించుచున్నారు. ఇట్లు కాల ప్రభావము

చేతను, స్థూలబుద్ధి అన్ని జాతుల వారి యందును పెరిగిపోవుట చేతను విగ్రహ పూజ యందు ఇంత ప్రేమ కలుగుచున్నది.

## అభిరుచి ననుసరించి ఉపాసన

పెద్ద విద్యార్థి:—ఇప్పటి స్థితి ఇలాగ ఉన్నచో తమవంటి సత్పురుషులు అనుగ్రహించి ప్రతీకోపాసనను విడనాడునట్లు జనులకు నచ్చ చెప్పి బ్రహ్మోపాసన చేయమని సూచన చేయ రాదా?

స్వా.ని.:- మీరు చెప్పింది నిజమే, కాని ప్రాణులు జన్మాంతర సంస్కార వశమున ఏ పదార్థములయందు అభిరుచి కలుగునో వానినే సేవించెదరు. అటులనే ఉపాసన కూడ ఎవరి అభిరుచి ప్రకారము వారు చేసెదరు. ఉపాసనకు సంబంధించిన వారి మనో వృత్తులను మార్చి వేరొక పద్ధతి యందు వారి మనస్సును ప్రవర్తింప జేసిన ఉభయ భ్రష్టులగును. కావున శ్రద్ధాభక్తులతో ఎవరు ఏ విధముగా ఉపాసించిన

వారిని అట్లు ఉపాసించనిమ్ము. కర్మ పరిపాకము చెందిన వెంటనే ఆ ఉపాసన సహాయముననే క్రమముగా ఆతడు బ్రహ్మోపాసన యందు తత్పరుడగును. పరిపాకము కానంతవరకు వారికి ఉపదేశించుట యుక్తము కాదు.

ఈ విషయమున ఒక దృష్టాంతము కలదు.

అరేబియా దేశమునందు ఒక అడవి మనుష్యుడు అడవిలో నుండి పశువులను మేపుచు వ్యవసాయము చేయుచుండెడి వాడు. అతనికి దేవుని నిరాకార స్వరూపము తెలియదు. దేవుడు అత్యంత సౌందర్యశాలి అని అతని అభిప్రాయము. దేవుడు భక్తులను అనుగ్రహించుననియును, వారి అపరాధములను క్షమించుననియును అతని నమ్మకము. ఒక్కొక్కప్పుడు అతడు దేవునితో ఇట్లు సంభాషించెడివాడు.

“ఓ దేవుడా! నీవు అత్యంత రూప శీలుడవనియును, దీన రక్షకుడవనియును

విందును. నేను దీనుడను. నాయందు దయయుంచి నాదగ్గరకు రమ్ము. నీ తలవంచి శిరోజములను చిక్కుదీయుదును. నీ వస్త్రములను, శరీరమును శుభ్రము చేయుదును.”

ఇట్లు పలికి భక్త్యావేశమున ఏడ్చి దేవుని విరహముతో స్పృహ తప్పి పడిపోయెడివాడు. ఒకరోజున ఆతడు అరణ్యములో నుండగా దేవుని వాస్తవిక స్వరూపమును తెలిసికొనిన, హసన్ బంసరీ అను మహానుభావుడు వచ్చెను. హసన్ బంసరీ ఆ అరణ్యవాసి చెప్పు మాటలను వినెను.

“ఓ దేవుడా, నీవు సౌందర్య నిధివి. నాదగ్గరకు రమ్ము, నీ శిరోజములను చక్కబరతును. నీకు తల్లిదండ్రులు లేరు. అందుచేత నీ తలకు చిక్కు నేను తీయుదును.” ఈ మాటలు విని హసన్ బంసరీ పలికెను.

“ఓ సోదరుడా నీవు దేవుని నిజస్వరూపమును ఎరుగవు. దేవుడేమైన మనుష్యుడా నీ దగ్గరకు వచ్చుటకు! ఆయన

విశ్వాధికారి. ఆయనకు రూపము లేదు. ప్రపంచమునకు తల్లియును, తండ్రియును కూడ ఆయనయే. ఇక ఆయనకు తల్లిదండ్రుల అవసరము ఏది? కావున నీవు అజ్ఞానముతో దేవుని అట్లు పిలువకుము. అట్లు దేవుని నీవు పిలచినచో నరకములో పడెదవు.

హసన్ బంసరీ వాక్యములచే ఆతని చిత్తము కించపడెను. ఆతడు ఆలోచించెను. "ఈతడు చెప్పు విధముగానే దేవుడు ఉన్నాడా? అయితే ఇంత కాలము నేను చేసిన దేవసేన వ్యర్థమేనా? కాదు. ఇతడు చెప్పినది అబద్ధము. నేను అనుకొనినదియే నిజము."

ఇట్లు మనస్సునందు నిశ్చయించుకొని ఆతడు హసన్ బంసరీతో పలికెను. "ఓరీ! నీవు ప్రపంచమునందలి దేవుని శ్రేష్ఠ భక్తులలో కెల్ల శ్రేష్ఠుడవని వింటిని. కాని నేడు నీవు చెప్పు మాటలను బట్టి చూచిన నీవు దేవుని యథార్థ స్వరూపమును ఎరుగవని తేలుచున్నది. నీ బుద్ధి కాలిపోను. నీవు నాకు అసత్యమును నేర్ప

జూచుచున్నావా? నేటి నుండి ఈవిధముగా మరి ఎవరితో ఇట్లు చెప్పకుము.” అని అతడు దేవుని విరహముతో ఏడ్వసాగెను.

హసన్ బంసరీ అచటినుండి ముందుకు వెళ్ళెను. త్రోవలో ఆతనికి ఇట్లు ఆకాశవాణి విన వచ్చెను.

"ఓరీ హసన్ ! నీవు నా భక్తుని అభీష్ట రూపమగు నా స్వరూపమును ఎరుగవు. కావున నీవు వెంటనే ఆతని వద్దకు వెళ్ళి “నీవు చెప్పిన విధముగనే దేవుడు ఉన్నాడని” చెప్పుము.

ఈ అశరీర వాణి విని హసన్ బంసరీ ఆ మనుష్యుని వద్దకు వెళ్లి క్షమించమని కోరి పలికెను. “నేను చెప్పినది అజ్ఞానముచే చెప్పితిని, మీరు చెప్పినది నిజము.”

ఈ కారణముచే సంసారిక జీవులకు అనురాగము కలపట్ల బుద్ధి భేదము కలుగ జేయ ప్రయత్నించుట యుక్తము కాదు. అట్లు చేసిన వారు ఉభయభ్రష్టు లగుదురు. వారి అభీష్టము

ననుసరించి వారు చేయుట మంచిది.

గీత కూడ చెప్పుచున్నది:-

**న బుద్ధి భేదం జనయేదజ్ఞానాం కర్మ సజ్గినామ్/**
**జోషయేత్సర్వ కర్మాణి విద్వాన్యుక్తః సమాచరన్//**

"విద్వాంసుడు కర్మసంగియగు అవివేకి బుద్ధిని భేదించుటకు ప్రయత్నించడు. కర్మలను అన్నిటిని గౌరవ పురస్సరముగ నాచరించుచు అవివేకులను కర్మమార్గానువర్తులుగ జేయును. "

ఎవడైనను కర్తవ్యముగా భావించిన దానినే ఆచరించును. కావున యోగ్యత లేనిదే ఎవనికైనను చెప్పుట నిరర్ధకము.

పెద్ద విద్యార్థి:— నేను పసితనమున దేవాలయములలోనికి దేవ దర్శనమునకు వెళ్ళెడి వాడను. అచ్చటకు అనేక మంది స్త్రీ పురుషులు భక్తితో దేవ దర్శనమునకు వచ్చెడివారు. కాని

వారు చాల గుంపులో నుండుటవలన త్రోపిడికి లోనయి ఏకాగ్రతతో దర్శనము చేయలేక పోయెడివారు. కాని ఈ పది సంవత్సరములలోను ఈ విషయమున ప్రజల మనస్తత్వములో మార్పు వచ్చినట్లు విశద మగుచున్నది. ఇప్పుడు కూడ స్త్రీ పురుషులు దర్శనమునకు వెళ్ళుచును ఉన్నారు. వారికి వేరు వేరు ఏర్పాట్లు కూడ ఉన్నవి. కాని నేటి జనుల మనః ప్రవృత్తులు కేవలము విగ్రహ దర్శనముతో సంతోషము పొందుట లేదు. దేవస్థానములయందు కథా కాలక్షేపములు, ఉపన్యాసాదులు జరుగు చున్నవి. చాలమంది వానిని వినుటకు అచ్చట కూర్చొనుచు కూడ ఉన్నారు. దేవ దర్శనము మాత్రము చేయుట స్థూలదృష్టికి సంబంధించిన విషయమనియు, కథా శ్రవణముచే ధర్మాధర్మ వివేకము కలిగి జనులకు హితాహితములు బోధపడుననియు, తద్వారా వారు కర్తవ్యాకర్తవ్యములు నిర్ణయించుకొనగలరనియు నా అభిప్రాయము.

కావుననే నాకు దేవదర్శనము మాత్రమే చేయుటకంటె కథా శ్రవణము చాల మంచిదని తోచుచున్నది.

స్వా. ప్ర. :— నేను ఉత్తర హిందూస్థానము నందలి కాశీ, ప్రయాగ, హరిద్వారము, హృషీకేశము మొదలగు అనేకములగు చిన్న, పెద్ద పుణ్యక్షేత్రములను, దేవాలయములను, మఠములను, ఆశ్రమములను చూచితిని. అచ్చట కూడ శాస్త్రార్థము, కథా శ్రవణము, సిద్ధాంత చర్చ మొదలగు సూక్ష్మ బుద్ధులకు సంతోషమును కలుగ జేయు జ్ఞాన ప్రదాయకములుగు సాధనములను గురించి ఉపదేశించుట గమనించితిని. చాల పుస్తకముల ద్వారాను, గ్రంథాలయముల ద్వారాను జ్ఞానమును వృద్ధి పొందించుకొనుటకు అచ్చటి జనులు చేయు ప్రయత్నములను కూడ చూచితిని. కొన్ని చోట్ల పుస్తకములే దేవతలను కొని దానిని చదువుటతో కృతకృత్యుల మగుచున్నామను భావము కూడ కంటిని నిస్సందేహముగా ఈ

ప్రవృత్తులన్నియును దేవ దర్శనముకంటె సూక్ష్మమును, ఉన్నతమును అగు స్థాయిని చూపించుచున్నవను మాట నిజమే. కాని వీని అన్నిటి యందును కూడ వివేక వైరాగ్యాది సాధనములతో, శ్రవణము చేసిన జ్ఞానమును ఆచరణములో నుంచుటకు ప్రయత్నము తక్కువగా కానవచ్చుచున్నది. జనులు శ్రవణము మాత్రమే చేయుచున్నారు. కాని అనంతరము దానిని మననమును, ఏకాంతమున నిదిధ్యాసనమును చేయువారు చాల తక్కువ మంది కానవచ్చుచున్నారు. కబుర్లు చెప్పువారు చాల మంది కలరు. కాని ఆచరించువారు అరుదు. ఇది అంతయు కలియుగ ప్రభావము.

భవిష్య పురాణమందలి ఆ యుగ వర్ణనమును పరికించుడు:-

***గృహే గృహే పుస్తక భార భారం పురే పురే పణ్డిత యూథయూథమ్/***

# ఇరువది ఏడవ ప్రసంగము

***మఠే మఠే తాపస బృన్ద బృన్దం న బ్రహ్మ వేత్తా న చ కర్మకర్తా//***

ఇంటింటను పుస్తకముల బరువు మిక్కుటముగా నుండును. గ్రామ గ్రామము నందును పండిత బృందములు కన్పించును. ప్రతి మఠ మందును తపశ్శాలురు గుంపులు గుంపులుగా నుందురు. కాని బ్రహ్మ జ్ఞాని కాని, కర్మయోగి కాని కానరాడు. అనగా మనన నిదిధ్యాసనముల ద్వారా ఆత్మసాక్షాత్కారము చేసికొని, గీతయందు చెప్పబడిన స్థిత ప్రజ్ఞ లక్షణములను అన్నిటిని కలిగియున్న బ్రహ్మజ్ఞుడు దొరకుట దుర్లభము. అంతియే కాదు. కర్మోపాసనచే మల, విక్షేప దోష నివృత్తిని పొంది, పరిశుద్ధ చిత్తుడయి, దైవ సంపచ్ఛాలియయి సదాచార శోభితుడగు జనుడు కూడ కూడా ఈ రోజులలో ఎక్కువగా కానవచ్చుట లేదు.

కఠోపనిషత్తు నందు యముడు నచికేతునకు చెప్పెను :-

***నా విర తో దుశ్చరితాన్నాశాన్తో నా సమాహితః/***
***నాశాన్తమానసో వాఽపి ప్రజ్ఞానేనైన మాప్నుయాత్//***

"దుశ్చరితము నుండి నివృత్తిని పొందని వాడును, శాంతిని పొందని వాడును, సమా హిత చిత్తవృత్తుడు కాని వాడును, అశాంత మనస్కుడును విజ్ఞానముచే కూడ ఆత్మను పొందలేడు."

దుశ్చరితుడు:— పరస్త్రీ గమన, పర ధనాపహరణాదులు దుశ్చరితములు. ఈ నానావిధములగు పాతకముల నుండియును చిత్త వృత్తులు నివృత్తిని పొందనిచో వాడు దుశ్చరితుడు.

అశాంతుడు:- విషయ పంచకమును వెంటాడుటచే మనస్సు శాంతిని పొందని వాడు.

అసమాహిత చిత్తుడు:- ఏకాంతమున

కూర్చొని యోగ సమాధి యందు చిత్తైకాగ్రతను సాధించని వాడు.

అశాంతమానసుడు:— వ్యాపారము, గౌరవము, కీర్తి, మొదలగునవి పెంచు కొనవలెనను ప్రవృత్తితో మనస్సునకు విరామమును ఇవ్వని వాడు.

ఇట్టి బహిర్ముఖులగు వ్యక్తులు ఆత్మను పొందలేరు.

సాంసారిక ప్రవృత్తుల యందు నిమగ్నులయిన వ్యక్తులు ఈవిధముగా బహిర్ముఖులగుటచే ఆత్మను పొందలేరు. అటులనే సన్యసించిన పిదప కూడ సాధువులును, సన్యాసులును ఆశ్రమములు స్థాపించుట, శిష్యుల సమూహమును పెంచుకొనుట, ఉపదేశములు ప్రచారము చేయుట మొదలగు బహిర్ముఖములగు ప్రవృత్తుల యందు నిమగ్నులగుటచే విరామమును పొందుట లేదు. వారుకూడ ఆత్మను పొందలేరు.

# సగుణ నిర్గుణ బ్రహ్మోపాసనాధికారము

పెద్ద విద్యార్థి— సగుణ బ్రహ్మోపాసన చేయనిదే ఆది నుండియు నిర్గుణ బ్రహ్మోపాసనము చేయనగునా? చేయ వీలు లేదా?

స్వా.ప్ర.:-గీతయందు భగవానుడు చెప్పెను.

***క్లేశోఽధికతర స్తేషాం అవ్యక్తాసక్తచేత సామ్ /***
***అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిర వాప్యతే //***

అవ్యక్తమునందు ఆసక్తి కలిగిన మనస్సు కలవాడు అనగా నిర్గుణ బ్రహ్మమునందు ఆసక్తుడగు వ్యక్తి సగుణ బ్రహ్మోపాసనకంటె ఎక్కువ కష్టపడవలెను. ఏలనన, దేహాభిమానము కల నరుడు నిర్గుణ బ్రహ్మ సాక్షాత్కారమును చాలా కష్టముతో పొందును.

# ఇరువది ఏడవ ప్రసంగము

సగుణ బ్రహ్మోపాసనానంతరము నిర్గుణ బ్రహ్మోపాసనము క్రమబద్ధము. ఇట్లు చేయుటచే నిర్గుణోపాసన యందు కొంత సదుపాయము కూడ కలుగును. సగుణ బ్రహ్మోపాసనము నందుకూడ ధ్యానాదులను ఆచరించుటచే, నిర్గుణోపాసనము నందు చిత్తైకాగ్రత సులభ సాధ్యమగును. కామ్యమగు సగుణ బ్రహ్మోపాసనముచే విక్షేపదోషము నివృత్తి నొందును. అంతఃకరణమునందలి విషయ పంచకానుభవమునకు సంబంధించిన వాసన విక్షేప దోషము. జన్మాంతరమున నిష్కామ భావముతో సగుణ బ్రహ్మోపాసనమును ఒనరించి విక్షేప దోష నివృత్తిని పొందించు కొనిన ముముక్షువులు, సహజమగు విక్షేప రహితమగు చిత్తమును కలిగియుండుటచే, సగుణ బ్రహ్మోపాసనమును చేయకుండగనే నిర్గుణ బ్రహ్మమును ఉపాసించగలరు. ఇట్లు ప్రథమము నుండియు నిర్గుణ బ్రహ్మోపాసనమును చేసి ప్రాప్యమును పొందిన కొందరు ముముక్షువులు

కూడ లేకపోలేదు. కావున సగుణ బ్రహ్మోపాసనము చేయనిదే నిర్గుణ బ్రహ్మోపాసనము జరుగదను నియమము లేదు.

బ్రహ్మోపాసనము సులభము కాదు. గృహము, ధనము, పశువులు, కుటుంబము, దారా పుత్రులు మొదలు వానియందు పరమాసక్తి ఉన్నంత కాలము సగుణ బ్రహ్మోపాసనము కూడ జరుగదు. సగుణ బ్రహ్మోపాసకులు ఎక్కువ కష్టపడుదురు. నిర్గుణ బ్రహ్మోపాసకులు వారి కంటెను మిక్కిలి కష్టపడుదురు. ఏలనన అత్యంత సూక్ష్మమును, నిర్విశేషమును అగు అక్షర బ్రహ్మ ధ్యానము చాల కఠినము. ఇహ, పర లోకముల యందలి భోగములు కాకి రెట్టతో సమానము అని తలచు తీవ్ర వైరాగ్య శీలురు మాత్రమే నిర్గుణ బ్రహ్మోపాసనమును ఆచరించగలరు.

ఐహిక భోగములను కోరక, పారలౌకిక భోగములను కోరు మంద విరాగులకు సగుణ బ్రహ్మోపాసనము నిర్దేశించబడినది.

ప్రతీకోపాసనము మిగిలినవారు చేయదగినది.

ఇట్లు ప్రథమమున ప్రతీకోపాసన, తరువాత సగుణ బ్రహ్మోపాసన, అనంతరము నిర్గుణ బ్రహ్మోపాసన చేయవలెను.

## ప్రేమ లేని ప్రతీకోపాసన నిరర్థకము

పెద్ద విద్యార్థి:- చాల మందికి శాలిగ్రామాదుల ప్రతీకోపాసనచే జీవిత మంతయును గడచి పోవుటయును, అప్పటికి కూడా స్వస్వరూప జ్ఞానము కలుగకుండుటయును నేను చూచుచున్నాను.

స్వా. ప్ర.:-దీనికి కారణము కలదు. ఈ రోజులలో జనులు ప్రేమ లేకుండగనే శాలిగ్రామ నర్మదేశ్వరాదులను పూజించుచున్నారు. ఆ పూజ కూడ వారు యథావిధిగా చేయుట లేదు. అభిషేక చందన, పుష్ప, నైవేద్యాదులకు సంబంధించిన క్రియలను మాత్రము ఆచరించుచున్నారు.

తత్సంబంధమగు భావనను కలిగియుండుట లేదు. శాలిగ్రామమును పూజించిన తదుపరి విష్ణు భావముతో ధ్యానము చేయవలెను. అటులనే నర్మదేశ్వరుని పూజించిన తరువాత శివ ధ్యానము చేయవలెను. ఇట్లు ఎవడును చేయుట లేదు. ఇక అంతఃకరణ పారిశుద్ధ్యము ఎట్లు కలుగును? అంతఃకరణ పారిశుద్ధ్యము లేనిదే జ్ఞానము ఎట్లు లభించును?

## ప్రేమచే అంతఃకరణము సత్త్వ ప్రధానమగును

యథావిధిగా నాచరించక పోయినను, ప్రేమతో ఆచరించినచో అంతఃకరణము సత్త్వ ప్రధానమయి బుద్ధి యోగమును పొందును. గీతను పరికించుడు.

***“తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతి పూర్వకమ్/***

***దదామి బుద్ధి మోగం తం యేన మాముపయాన్తితే//***

"నిరంతరము నన్ను ధ్యానించుచు, ప్రేమతో నన్ను పొందు భక్తులకు తత్త్వజ్ఞానము అను యోగమును నేను ఇచ్చుచున్నాను. దాని సహాయమున వారు నన్ను చేరగలరు " అని కృష్ణ భగవానుడు చెప్పు చున్నాడు.

ధనాది సర్వవిధ మాయిక పదార్థముల యందును తీవ్ర వైరాగ్యమును పొంది ప్రభువును నిరంతరము భజించినచో బుద్ధి యోగము అనగా దివ్యదృష్టి లభించును అని దీని తాత్పర్యము.

## వస్తు వివేకముచే వైరాగ్యము కలుగును

పె. వి. :- తీవ్ర వైరాగ్యము ఎట్లు కలుగును?

స్వా. ప్ర. :—సదసద్వస్తు వివేకము చేసిన వైరాగ్యము లభించును. ఈ విషయమున సిద్ధార్థుని దృష్టాంతము కలదు.

బుద్ధుడు క్రీస్తుపూర్వం 558 సం||న హిమాలయ ప్రాంత భూములయందు చంపారణ్యమునకు ఉత్తరమున నేపాలు సమీపమున కపిలవస్తు నగరమున జన్మించెను. కపిలవస్తు నగరము మగధ యందో, లేక బీహారునందో ఉండెడిదని అనుకొనుచున్నారు.

## సిద్ధార్థుని వివేకము

సిద్ధార్థుడు బాల్యము నుండియును చింతన శీలుడు. ఏకాగ్ర చిత్తుడు. కంటపడిన దానిని సూక్ష్మముగా పరికించుటయును, దానిని గురించి శ్రద్ధగా యోచించుటయును అతని స్వభావము. అతడు యౌవనమున సుఖ భోగములను అనుభవించునప్పుడు కూడ వివేకమును విడనాడ లేదు. సుఖము అనగా నేమి? దుఃఖము అనగా నేమి? వానిని అనుభవించుట అనగా నేమి? మొదలగు విషయములను గురించి ఆలోచించెడి వాడు. మూర్ఖులు వృద్ధులను, వ్యాధిగ్రస్తులను చూచి అసహ్యించుకొనెదరు. వారిని

తిరస్కరించెదరు. వారివలె ఆలోచించుట నాకు తగదు అను కొనెడివాడు. అజ్ఞానులు మృత శరీరమును చూచి దూరముగా తొలగెదరు. ఆవిషయమును మరచిపోయెదరు. వారు కూడ ఒక రోజు చావవలెనను సంగతి జ్ఞప్తికి తెచ్చుకొనరు. కాని నేను ఆ విధముగ చేయలేను.” ఇట్టి తలంపుతో ఆతని యౌవన మదము, ఆరోగ్య మదము, జీవిత మదము పూర్తిగా కరిగిపోయినవి.

భవనములు, అశ్వరథాది వాహనములు, పశువులు, ధనము, దారాపుత్రాదులు, దాసదాసీజనమును కలవారు సుఖించుచున్నారని ఈ జగము నందలి చాలా జనులు అనుకొనుచున్నారు. మనుష్యుని సుఖము ఈ వస్తువులపై ఆధారపడియున్నది. కాని బుద్ధ దేవుడు ఇట్లను కొనెను, “నేను మృతిని చెందుదును. రోగగ్రస్తుడనగుదును. శోకమును పొందుదును, వార్ధక్యము, వ్యాధులు, మృత్యువు, శోకము- వీనితో సంబంధించిన వస్తువులపై నా సుఖము ఆధారపడి ఉన్నదను కొనుట యుక్తము

కాదు. నేను దుఃఖరహితుడను కానప్పుడు ఇతరులకు నా వలన సుఖము ఎట్లు కలుగును? జరా వ్యాధులును, మరణ శోకములును పొందని వస్తువును శోధించి దానిని శరణు పొందవలెను.”

## వైరాగ్యము

ఇట్టి ఆలోచనలలో మునిగిన వ్యక్తికి సాంసారిక సుఖములయందు ఆనందము ఎట్లు లభించును? నశ్వరములును, క్షణిక భోగము కలిగి భూత కాలపు స్మృతి మాత్రముగా నారిపోవునట్టివియును, వార్ధక్యమును, రోగమును, మృత్యువును సమీపించు నట్టివియును, వియోగముచే శోకమును కలుగ జేయునట్టివియును అగు సుఖములనుండి ఆయన మనస్సు వెనుకకు మరలెను. ఇంట ప్రియ వ్యక్తి మృతి నొందుటకు సిద్ధముగా నుండగా దీపావళి నాడు పగలు పిండి వంటలు ఎట్లు రుచించును? రాత్రి దీపములు వెలిగించు నిచ్ఛ ఎవరికి కలుగును? అటులనే సిద్ధార్థుడు తన శరీరము

జరా, వ్యాధి, మృత్యువులను చేరుటకు వలయు రూపాంతరములను నిమిషనిమిషమునకు పొందుచుండుట చూచి సుఖానుభవము నుండి విరక్తిని పొందెను. అంతకంతకు తన సమీపమునకు వచ్చిన ప్రతి వస్తువును - తన బంధుమిత్రులు, దాస దాసీ జనములతో సహా అందరు వ్యక్తులును అట్టి సుఖముల కొరకే వెర్రిగా తిరుగుచుండుట చూచి ఆయన హృదయము కరుణాతరంగిత మయ్యెను. “జనులు ఇంత జడత్వమును ఏల పొందియున్నారు? ఏల ఆలోచించుట లేదు? ఐహిక పారలౌకికములగు తుచ్ఛ సుఖములకొరకు ఇంత ఆతురతతో నెందుకు ఉన్నారు? కాని ఈ విషయములను తెలియజెప్పుట ఎట్లు? ఈ సుఖమునకు ప్రత్యామ్నాయముగా వేరొక నశ్వరము కాని సుఖమును శోధించి తెలిపినప్పుడే ఇందు కృతకృత్యుడనగుదును. ముక్తిని పొందించు సుఖమును అన్వేషించెదను. నా హితముకొరకు ఈ సుఖమును వెతుకవలెను. నా ప్రియ జనుల

యందలి యథార్థమగు ప్రేమను వ్యక్తము చేయవలెననినను ఈ సుఖమును శోధించవలెను.”

ఈవిధమగు ఆలోచనలతో కొంత కాలము జరిగెను. అంతట నిండు యౌవనమున తల్లిదండ్రుల అంగీకారము లేక పోయినను దారా పుత్రులకు ఎరుక పరచకుండ ఇంటి నుండి ఆయన బయలు వెడలెను. ముండనము చేయించుకొని, కాషాయము ధరించి నిత్య సుఖమును శోధించ దొడగెను.

## తపము

ఇంటినుండి సిద్ధార్థుడు కడుదూరము వెళ్ళిపోయెను. చర్మకారుడు మొదలు బ్రాహ్మణుడు వరకునున్న ఎల్ల జాతుల జనుల నుండియును లభించిన భిక్షను ఒకే పాత్రమున భుజించసాగెను. ఇట్టి ప్రవర్తన ఆరంభమున ఆతనికి చాలా అసహ్యముగా తోచెను. కాని

ఆయన మనస్సునకు ఇట్లు నచ్చ చెప్పెను:- "ఓ జీవుడా! నిన్ను సన్యసించమని ఎవడును బలవంతము చేయలేదు. నీ యంతట నీవు ఈ వేషమును వేసికొంటివి. రాజ సంపదను ఆనందముతో త్యజించితివి. ఇప్పుడు భిక్షాన్నమును తినుటకు అంత అసహ్యించు కొనుచున్నావేమి? మానవునకును మానవునకును భేదమును చూపుట చూచి నీకు బాధ కలిగెను కదా! కాని ఇప్పుడు హీన కులజుని అన్నము తినవలసి వచ్చినప్పుడు ఆతని యందు కరుణ కలుగుటకు బదులుగా అసహ్యము ఏల కలిగినది? సిద్ధార్థుడా! ఈ దౌర్భల్యమును విడనాడుము. సుగంధ యుక్తమగు ఆహారమునకును హీన కులజులు అర్పించిన ఆహారమునకును నీవు భేదమును పాటించ రాదు. ఈస్థితిని నీవు పొందినచో నీ సన్యాసము సఫలమగును.

ॐ

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

రాత్రి భోజనానంతరము తొమ్మిది గంటలకు స్వామివారి చెంతకు అందరును చేరిరి. అంతట పెద్ద విద్యార్థి ప్రశ్నించెను. జ్ఞానమును సంపాదించుటకు గురువు అవసరమా? కాదా?

## జ్ఞానమును పొందుటకు గురువు అవసరము

స్వా. ప్ర. :–శంకరులు పార్వతితో చెప్పిరి.

***యద్యప్యధీతాః నిగమాః షడఙ్గాన్యాగమాః ప్రియే /***
***అధ్యాత్మాదీని శాస్త్రాణి జ్ఞానం నాస్తి గురుం వినా//***

"చతుర్వేదాలు, షడంగములు, ఆగమములు, ఆధ్యాత్మాది శాస్త్రములును

చదివినను గురువు లేనిదే జ్ఞానము కలుగదు." ఛాందోగ్యోపనిషత్తు నందు కథ ఉన్నది.

ఒక సమయమున నారదుడు సమిత్పాణియై సనత్కుమారుని సమీపించి ప్రార్థించెను. "ఓ మహాత్మా! తమరు నాకు బ్రహ్మ విద్యను ఉపదేశించుడు."

సనత్కుమారుడు పలికెను. "నీకు బ్రహ్మ విద్యను గురించి తెలిసిన దంతయును నాకు వివరించుము. పిమ్మట నీకు తెలియనిదేమైన ఉన్నచో చెప్పెదను." నారదుడు పలికెను.

"ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వణం చతుర్థ మితిహాస పురాణం పఞ్చమం వేదానాం వేదం పిత్ర్యం రాదిం దైవం నిధిం వాకో వాక్యమేకాయనం దేవ విద్యాం, బ్రహ్మ విద్యాం భూత విద్యాం క్షత్ర విద్యాం నక్షత్ర విద్యాం సర్పదేవజన విద్యాం ఏతద్భగవోఽధ్యేమి||"

"స్వామీ! నేను ఋగ్వేదము చదివితిని.

యజుర్వేదము, సామ వేదము, నాలుగవదగు అధర్వణ వేదము, ఇతిహాస పురాణమగు పంచమ వేదము, వేదముల వేదము (వేదములను తెలిసికొనుటకు సాధనమగు వ్యాకరణము) శ్రాద్ధకల్పము, గణితము, ఉత్పాత జ్ఞానము నిధిశాస్త్రము, తర్కశాస్త్రము, నీతిశాస్త్రము, నిరుక్తము, వేద విద్య, (శిక్ష, కల్పము, ఛందశ్శాస్త్రము, చితి శాస్త్రము- అగ్ని హోత్రాగ్నిని సమకూర్చు విద్య) భూతతంత్రము, ధనుర్వేదము, జ్యోతిషము, సర్ప విద్య (గారుడము) దేవ జన విద్య(గంధ ధారణ సామర్థ్యము, నృత్యము, గీతము, వాద్యము, శిల్పము) మొదలగు విజ్ఞానములనన్నిటిని ఎరుగుదును." "అయిన నీవు సర్వజ్ఞుడవు, స్వతంత్రుడు, కృతార్థుడవు" అని సనత్కుమారుడు పలికెను. నారదుడు తిరిగి పలికెను.

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

***"సోహం భగవో మన్త్రవిదేవాస్మి నాఽఽత్మవిచ్ఛ్రుతం హ్యేవ మే భగవద్దృశేభ్యస్తరతి శోకమాత్మవిదితి సోఽహం భగవః శోచామి తం మా భగవచ్ఛోకస్య పారం తారయత్వితి తం హోవాచ యద్వై కించైతదధ్యగీష్ఠా నామైవైతత్॥"***

"ఓ మహాత్మా! నేను మంత్రములను (కర్మలను) మాత్రమే ఎరుగుదును. ఆత్మవేత్తను కాను. ఆత్మజ్ఞాని అకృతార్థబుద్ధి రూపమగు మనః పరితాపమును అధిగమించునని తమ వంటి వారల నుండి వింటిని, ఓ మహానుభావా! నేను ఆత్మజ్ఞానిని కానందున అకృతార్థ బుద్ధితో సర్వ కాలముల యందును బాధపడుచున్నాను. నన్ను ఈ శోక సాగరమునుండి తరింప జేయుడు."

సనత్కుమారుకు చెప్పెను:-నీవు తెలిసికొన్న దంతయును నామమాత్రము. జనులు విష్ణుబుద్ధితో విగ్రహమును ఉపాసించునట్లు. నీవు (1) నామమును ఉపాసించుము. నామము బ్రహ్మము అని ఉపాసించు వారికి నామ

విషయమునందు ఇష్టానుసారము ప్రవృత్తి కలుగును. అనగా నామోపయోగము క్రమబద్ధమగును. ఈ ఉపదేశమును విని నారదుడు ప్రశ్నించెను. "బ్రహ్మ దృష్టి కలుగుటకు నామముకంటె మించినది ఏదైన కలదా?" సనత్కుమారుడు జవాబు చెప్పెను. ఉన్నది. శబ్దములను ఉచ్చరించు (2) వాక్కు నామము కంటె మించినది" వాక్కును బ్రహ్మముగా నెరిగి నారదుడు తిరిగి ప్రశ్నించెను. వాక్కు కంటె మించినది వేరొండు కలదా? సనత్కుమారుడు చెప్పెను. "కలదు. వాక్కుకంటే మించినది (3) మనస్సు. మనస్సు అనగా వివక్షా బుద్ధి స్వరూపమగు అంతఃకరణ ప్రవృత్తి. అది వాక్కు యొక్క ప్రేరకము. ఏలనన వివక్షా బుద్ధి లేనిచో వాక్కు ఉచ్ఛరించబడదు. కావున మనోబ్రహ్మమును ఉపాసించుము. అట్టివానికి మానసిక విషయములయందు ఇష్టానుసారము ప్రవృత్తి కలుగును.(మనో నిరోధము జరుగును.)

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

నారదుడు తిరిగి ప్రశ్నించెను. "మనస్సు కంటే మించినది ఏదైన కలదా?" సనత్కుమారుడు చెప్పెను "మనస్సు కంటే మించినది (4) సంకల్పము. సంకల్పము అనగా విషయములను కర్తవ్యములుగను, అకర్తవ్యములుగను విభజించు అంతఃకరణ వృత్తి. సంకల్పముచే జగమంతయును సామర్థ్యమును పొందును. సంకల్ప బ్రహ్మమును ఉపాసించువానికి సంకల్ప విషయముల యందు ఇష్టానుసారము ప్రవృత్తి కలుగును. కావున సంకల్పమును బ్రహ్మ బుద్ధితో ఉపాసించుము." అట్లు ఉపాసించి నారదుడు మరల ప్రశ్నించెను. "బ్రహ్మ దృష్టి కలుగుటకు సంకల్పముకంటె మించినది వేరొకటి కలదా?"

సనత్కుమారుడు సమాధానము చెప్పెను. "(5) చిత్తము సంకల్పము కంటె మించినది. చిత్తమనగా లబ్ధ పదార్థములను అవగతము చేసికొను సామర్థ్యము అను అంతఃకరణ వృత్తి. ఈవృత్తి లేనిదే సంకల్పము అసంభవము. కావున

సంకల్పము కంటె చిత్తము మించినది. కావున చిత్త బ్రహ్మమును ఉపాసించుము. పిమ్మట చిత్త విషయము లందు ఇష్టానుసారం ప్రవృత్తి కలుగును." అట్లు ఉపాసించి నారదుడు అడిగెను

"బ్రహ్మ దృష్టికి చిత్తము కంటె మించినది వేరొకటి కలదా?" సనత్కుమారుడు సమాధానము చెప్పెను. "లేకేమి! చిత్తముకంటె మించినది (6) ధ్యానము:- ధ్యానమనగా శాస్త్రము ద్వారా దేవతాదులను ఆలంబనములుగా భావించు వృత్తి. ఆలంబనము అను ఏకాగ్రతా వృత్తి లేనిదే చిత్త నిశ్చలతకు తావు లేదు. కావున ధ్యాన దృష్టితో బ్రహ్మమును ఉపాసించుము. ధ్యాన బ్రహ్మమును ఉపాసించువానికి తత్త్వమునకు సంబంధించిన పదార్థము లన్నియును లభించును." ఇట్లు ధ్యాన బ్రహ్మోపాసనమును తెలిసికొని నారదుడు అడిగెను. "ధ్యానము కంటె మించినది ఏమైనా కలదా?"

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

సనత్కుమారుడు సమాధానము చెప్పెను:-

"(7) విజ్ఞానము ధ్యానము కంటె మించినది. విజ్ఞానమనగా శాస్త్రాది విషయకమగు జ్ఞానము. అర్థ జ్ఞానము లేనిదే ధ్యానము అసంభవము. శివుడు, విష్ణువు మొదలగు వ్యక్తుల రూపము అను అర్థము తెలియనిదే ధ్యానము జరుగదు. కావున ధ్యానము కంటె విజ్ఞానము శ్రేష్ఠమైనది. కావున విజ్ఞాన రూపమగు బ్రహ్మమును ఉపాసించుము. పిమ్మట విజ్ఞానమునకు సంబంధించిన పదార్థములన్నియును లభించును." అట్లు ఉపాసించి నారదుడు తిరిగి ప్రశ్నించెను. "విజ్ఞానము కంటె మించినది వేరొకటి కలదా?" సనత్కుమారుడు చెప్పెను. "విజ్ఞానం కంటే మించినది (8) శారీరిక బలము. వంద మంది జ్ఞానులను ఒక శారీరిక బలసంపన్నుడు కంపింపజేయును. కావున నీవు బల బ్రహ్మమును ఉపాసించుము. అట్లు చేయువానికి బలమునకు సంబంధించిన పదార్థములు అన్నియును

లభించును," బల బ్రహ్మోపాసనానంతరము నారదుడు మరల ప్రశ్నించెను. "బలము కంటే మించినది వేరొకటి కలదా?" సనత్కుమారుడు సమాధానము చెప్పెను. "బలమునకు మించినది (9) అన్నము. అన్నము లేనిదే బలము కలుగదు. పది రోజులు అన్నము తిననిచో పూర్తిగా దుర్బలుడగును. ఏమియును చేయలేడు. కావున బలమునకు కారణము అన్నము. ఆ అన్నమును నీవు బ్రహ్మరూపమున ఉపాసించుము. ఇట్లు చేసిన వానికి అన్న విషయకమగు పదార్థములన్నియును లభించును." అన్న బ్రహ్మోపాసనానంతరము నారదుడు తిరిగి ప్రశ్నించెను.

"అన్న బ్రహ్మమునకు మించినది వేరొకటి కలదా?" సనత్కుమారుడు జవాబు చెప్పెను. "అన్నం కంటె మించినది (10) జలము. జలము లేనిదే అన్నము పండదు. అల్ప వృష్టిచే తక్కువ అన్నము పండును. సు వృష్టిచే బాగుగా అన్నము

(ఆహార పదార్థములు) పండును. కావున జల బ్రహ్మమును అట్లు ఉపాసించుము. ఉపాసించు వాడు జలమునుండి ఉద్భవించు విషయములన్నిటిని పొందును."

జల బ్రహ్మోపాసనానంతరము "బ్రహ్మ దృష్టికి జల బ్రహ్మము కంటే మించినది వేరొకటి ఏమి?" అని ప్రశ్నింప సనత్కుమారుడు చెప్పెను. "జలమునకు మించినది (11) తేజస్సు, తేజము వాయువును గ్రహించి ఆకాశమున వ్యాపించినప్పుడు ఈ తాపముచే ఇక వర్షము వచ్చును అని జనులు చెప్పెదరు. కావున తేజము జలము కంటె మించినది. కావున తేజోరూపము కల బ్రహ్మమును ఉపాసించుము. దానిని ఉపాసించువానికి తేజస్సునకు సంబంధించిన విషయములు అన్నియును లభించును." తేజో బ్రహ్మోపాసనానంతరము నారదుడు మరల ప్రశ్నించెను.

"బ్రహ్మోపాసనకు తేజస్సునకు మించిన దేవి?" అని అడుగగా "తేజమునకు మించినది

(12) ఆకాశము. ఏలనన ఆకాశమునందు తేజోవంతమగు పదార్థములు అన్నియు సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు, నక్షత్రములు మొదలగునవి దృగ్గోచరము లగును. కావున తేజమునకు మించినది ఆకాశము. నీవు ఆకాశమును బ్రహ్మరూపమున ఉపాసించుము. ఆవిధముగ చేయుటచే తద్విషయకములగు పదార్థములన్నియు నీవశమగును." అని జవాబు చెప్పెను.

"ఆకాశ బ్రహ్మముకంటె మించినది బ్రహ్మ దృష్టి కలుగుటకు వేరొకటి ఉన్నదా?" నారదుడు అని ప్రశ్నించెను. సనత్కుమారుడు జవాబు చెప్పెను. "ఆకాశమునకు మించినది (13) స్మరణము. ఇంత వరకు కార్య కారణ భావ రూపమున ఉత్తరోత్తరము వ్యాపకమగు పదార్థములయందు బ్రహ్మ దృష్టిని కలుగ జేసితిని. ఇప్పుడు తద్భిన్నమగు నిమిత్త నైమిత్తిక భావ రూపమును తెలుపుదును. స్మరణము లేనిదే

ఏ వ్యవహారము కూడ సంభవము కాదు. కావున ఆకాశము కంటె స్మరణము శ్రేష్ఠము. ఆ స్మరణము నందు బ్రహ్మ దృష్టిని పొందుము. స్మరణమునందు బ్రహ్మ దృష్టిని పొందిన వానికి తద్విషయములు లభించును." స్మరణ బ్రహ్మమును ఉపాసించిన తరువాత నారదుడు అడిగెను. "బ్రహ్మోపాసనకు స్మరణము కంటె మించినది వేరొకటి కలదా?"

సనత్కుమారుడు జవాబు చెప్పెను. "స్మరణముకంటె మించినది (14) ఆశ. అంతఃకరణమున వృద్ధిని పొందిన విషయములు అన్నియును ఆశ లేనిదే స్మరించబడవు. ఋగ్వేదాదులను అధ్యయనము చేయవలెను ఆశ ఉన్నచో ఆ అధ్యయన విషయముల స్వాధ్యాయము తరచు చేయవలెను. కావున నీవు ఆశా బ్రహ్మమును ఉపాసించుము. దానిచే నీకు ఆవిషయమునకు చెందిన పదార్థములన్నియును లభించును." ఆశా బ్రహ్మమును ఉపాసించి ప్రశ్నించెను.

"ఆశ కంటె మించినది కలదా?" సనత్కుమారుడు సమాధానము చెప్పెను "ఆశ కంటె (15) ప్రాణము మించినది. ఈవిషయమున శ్రుతిని పరికింపుడు.

***"ప్రాణో వో ఆశాయా భూయాన్ యథా వా అరా నాభౌ సమర్పితా ఏవ మస్మిన్ ప్రాణే సర్వం సమర్పితం ప్రాణః ప్రాణేన యాతి ప్రాణః ప్రాణం దదాతి ప్రాణాయ దదాతి ప్రాణో హ పితా ప్రాణో మాతా ప్రాణో భ్రాతా ప్రాణః స్వసా ప్రాణ ఆచార్యః ప్రాణో బ్రాహ్మణః||"***

"ప్రాణమే ఆశ కంటె మించినది. చక్రము యొక్క కుంచములో ఆకులు ఇమిడి యున్నట్లు ఈ సమష్టి ప్రాణమునందు జగమంతయు ఉన్నది. ప్రాణము ప్రాణముచే సంచరించును. ప్రాణము ప్రాణము నిచ్చును. ప్రాణము తండ్రి, ప్రాణము తల్లి, ప్రాణము సోదరుడు, ప్రాణము

సోదరి, ప్రాణము ఆచార్యుడు, ప్రాణము బ్రాహ్మణుడు.”

మూర్ఖుడు ఎవడైన తన తండ్రి, తల్లి, సోదరుడు, సోదరి, ఆచార్యుడు, బ్రాహ్మణుడు మొదలగు వారి పట్ల అనుచిత ప్రవర్తనను కలిగి యున్నచో వానిని నిందించెదరు. కాని శరీరము నుండి ప్రాణము పోయిన తరువాత ఆశరీరమును దహించినను, దాని అవయవములను ఛేదించినను ఆతడు హంతకుడుగ పేర్కొన బడడు. కావున ఇదంతయును ప్రాణమే. ప్రాణమే అన్ని అనుభవములను, చింతనములను, నిశ్చయములను చేయును. అదియే అతి వాది. నామము మొదలుకొని ఆకాశము వరకు గల జగమునంతను అతిక్రమించి జగమంతకును ఆత్మను నేను అని చెప్పును. “వీని అన్నిటి కంటెను మించినది ప్రాణమే. దీనికి మించినది ఏమియు లేదు” అనుకొని నారదుడు ఇక ప్రశ్నించ లేదు.

అనంతరం సనత్కుమారుడు అనుగ్రహించి

మిథ్యా జ్ఞానము నుండి అతనిని తప్పించి సత్యాదులను ఉపదేశించెను.

# సత్యోపదేశము

***"ఏష తు వా అతివదతి యః సత్యేనాతివదతి సోఽహం భగవః సత్యేనాతివదా నీతి సత్యం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి సత్యం భగవో విజిజ్ఞాస ఇతి//"***

"ప్రాణమును తెలిసికొనినవాడు నిజమునకు అతివాది కాడు సత్యాతివాదియే నిజమగు అతి వాది." అని సనత్కుమారుడు చెప్పి నంతనే నారదుడు ప్రశ్నించెను. "నేను సత్యాతి వాదినగు విధమును తెలుపుము." శ్రేష్ఠమగు సత్యమే తెలిసికొనదగినది. కావున నేను ఆ సత్యమును తెలిసికొన గోరుచున్నాను. తరువాత విజ్ఞాన ప్రాముఖ్యమును సనత్కుమారుడు ఉపదేశించెను.

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

***"యదా వై విజానాత్యథ సత్యం వదతి నావిజానన్ సత్యం వదతి విజానన్నేవ సత్యం వదతి విజ్ఞానం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి విజ్ఞానం భగవో విజిజ్ఞాస ఇతి ॥"***

"సత్యమును విశేషముగా నెరిగిన వారు మాత్రమే సత్యమును తెలుపుదురు. విశేషముగా తెలియనివారు సత్యమును తెలుప లేరు. కావున విజ్ఞానము సత్యముకంటె మించిన జ్ఞాతవ్య విషయము." అని సనత్కుమారుడు చెప్పెను. అంతట నారదుడు ప్రశ్నించెను. "ఓ మహాత్మా నేను విజ్ఞానమును తెలిసికొన కోరుచున్నాను.

అనంతరం మననము ప్రధానమని చెప్ప గోరి ఇట్లు పలికెను.

***"యదా వై మనుతేఽథ విజానాతి నామత్వా విజానాతి మత్వైవ విజానాతి మతి స్త్వేవ విజిజ్ఞాసితవ్యేతి మతిం భగవో విజిజ్ఞాసఇతి॥"***

"మననముచే విజ్ఞానము లభించును.

మననము చేయనిదే విజ్ఞానము కలుగదు. మననమును తెలిసికొనవలెను." అని సనత్కుమారుడు చెప్పిన తోడనే నారదుడు ప్రశ్నించెను. "స్వామీ! నేను మననమును గురించి వివరముగా తెలిసికొన గోరుచున్నాను."

పిదప ఆస్తిక్యబుద్ధి అను శ్రద్ధ జ్ఞాతవ్యము అని చెప్ప గోరి ఇట్లు ఉపదేశించెను.

***"యదా వై శ్రద్దధాత్యథ మనుతే నాశ్రద్దన్మనుతే శ్రద్ధదేవ మనుతే శ్రద్ధాత్వేవ విజిజ్ఞాసితవ్యేతి శ్రద్ధాం భగవో విజిజ్ఞాస ఇతి//"***

"శ్రద్ద ఉన్నచో మననము జరుగును అశ్రద్ధచే మననము జరుగదు. శ్రద్ధావంతుడే మననము చేయును. కావున శ్రద్ధయే ముఖ్యముగా తెలిసికొనదగినది." ఇట్లు సనత్కుమారుడు చెప్పి నంతనే నారదుడు శ్రద్ధను గురించి చెప్పుడని ప్రార్థించెను.

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

***"యదా వై ని స్తిష్టత్యథ శ్రద్దధాతి నానిస్తిష్ఠన్ శ్రద్దధాతి నిస్తిష్ఠ న్నేవ శ్రద్దధాతి నిష్ఠాత్వేవ విజిజ్ఞాసితవ్యేతి నిష్ఠాం భగవో విజిజ్ఞాసఇతి//"***

"నిష్ఠావంతునకే శ్రద్ధ కలుగును. నిష్ఠ లేనిదే శ్రద్ధ లేదు. కావున నిష్ఠ శ్రేష్ఠమని తెలియనగును." అని సనత్కుమారుడు "కృతి" (ఇంద్రియ సంయమము, చిత్తైకాగ్రతయు) తెలిసికొనదగినదని వివరించుచు ఇట్లు చెప్పెను.

***"యదా వై కరోత్యథ నిస్తిష్ఠతి నాకృత్వా నిస్తిష్ఠతి కృత్వైవ నిస్తిష్ఠతి /
కృతి స్త్వేవ విజిజ్ఞాసితవ్యేతి కృతిం భగవో విజిజ్ఞాస ఇతి//"***

"కార్యమును ఆచరించువానికే నిష్ఠ కలుగును. చిత్తైకాగ్రత లేనిదే కార్యకర్తలకు నిష్ట కలుగదు. కావున "కృతి" గురించి ముఖ్యముగా తెలిసికొనవలెను." అంతట నారదుడు కృతిని గురించి తెలుపమని ప్రార్థించెను. సనత్కుమారుడు కృతి కంటె శ్రేష్ఠమయినది

సుఖమని తెలుపుచు దానిని వివరించెను.

***"యదా వై సుఖం లభతేఽథ కరోతి నా సుఖం లబ్ధ్వా కరోతి సుఖమేవ లబ్ధ్వా కరోతి సుఖం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి సుఖం భగవో విజిజ్ఞాస ఇతి//"***

"సుఖమునకు ఇచ్చట నిరతిశయ సుఖమని అర్థము. అందరును సుఖముకొరకు "కృతిని" ఆచరించెదరు. సుఖ రాహిత్యము కొరకు అనగా దుఃఖముకొరకు ఎవ్వరును కృతిని ఆచరించరు. సుఖేచ్ఛ చేతనే కృతి- కర్మ జరుగుచున్నది. ఆ సుఖమే శ్రేష్ఠమని తెలిసికొనవలెను." నారదుడు పలికెను, "ఆ సుఖమును గురించి తెలుపుము." అనంతరము భగవానుడు "భూమ" అనగా నిరతిశయమగు వస్తువు తెలిసికొనవలెను అని దానిని ఉపదేశించెను.

***"యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి భూమైన సుఖం భూమా త్వేవ విజిజ్ఞాసితవ్య ఇతి భూమానం భగవో విజిజ్ఞాస ఇతి."***

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

"నిరతిశయమగునదియే సుఖము. అల్పాధిక్యములు తృష్ణా మూలములు. తృష్ణ దుఃఖ కారణము. కావున నిరతిశయమును గురించియే బాగుగా తెలిసికొనవలెను" అని సనత్కుమారుడు ఉపదేశించి నంతనే నారదుడు పలికెను. "స్వామీ! నేను నిరతిశయ వస్తువును- భూమను తెలిసికొన గోరుచున్నాను." అప్పుడు సనత్కుమారులు నిరతిశయ వస్తువగు భూమ యొక్క- బ్రహ్మముయొక్క లక్షణము సెలవిచ్చిరి.

***"యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి స భూమాఽథ యత్రాన్యత్పశ్యత్యన్యచ్ఛృణోత్యన్యద్విజానాతి తదల్పయో వై భూమా తద మృత మథ యదల్పం తన్మర్త్యం సభగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి స్వే మహిమ్ని యది వా న మహిమ్నీతి//"***

ఎచ్చట- ఏ తత్త్వమునందు ఇతరములను చూచుట లేదో, ఇతరములను వినుట లేదో, అన్య

విషయములను తెలిసికొనుట లేదో అనగా ఏది సర్వ సంసార వ్యవహార రహితమో అది భూమ. ఏది ఇతరములను చూచునో, ఇతరములను వినునో, ఇతర విషయములను తెలిసికొనునో అది అల్పము. అది స్వప్న పదార్థముల వలె నశించును. తద్విపరీతమును, ప్రసిద్ధమును అగు భూమ అవినాశి. పరిచ్ఛిన్నమగు నది నశ్వరము." సనత్కుమారుని ఈ వాక్యములను విని నారదుడు ప్రార్థించెను. "భూమ దేనియందు ఉన్నది?" సనత్కుమారుడు సమాధానము చెప్పెను. వ్యవహార దృష్టిని చూచిన తన విభూతియందు ఉన్నది అని చెప్పవచ్చును కాని వాస్తవమునకు ఆ విభూతి యందు లేదు. అది ఆశ్రయ రహితము, సర్వాధారము. అది దేనినికూడ ఆశ్రయించి లేదు.

కార్యకారణ భావ రూపమగు నామము నుండి ఆకాశ పర్యంతము కల వ్యాపక లక్షణ విశిష్టమగు పదార్థములను వివరించిన తదుపరి

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

సనత్కుమారుడు నారదునకు స్మరణము మొదలుకొని సుఖము వరకుగల నిమిత్త నైమిత్తిక భావరూపమును ఉపదేశించెను. పిమ్మట యథార్థామృత రూపమగు భూమను వివరించెను. ఈ భూమను తెలిసికొనినచో సర్వమును తెలియును. ఏలనన భూమ సర్వాధారము. సర్వాధిష్ఠానము. ఈ భూమ రూపమగు చరమోపదేశమునకు పూర్వము చెప్ప బడిన నామాదుల యందు బ్రహ్మ దృష్టితో ఉపాసన చేయవలెననునది అంతయును ప్రతీకోపాసనయే. సంసార దుఃఖ పరితప్తుడగు నారదుడు సనత్కుమారునితో "నేను నామమునే ఎరుగుదును. ఆత్మను ఎరుగను" అని చెప్పెను. అంతట సనత్కుమారుడు "ఆ నామము నందే బ్రహ్మ దృష్టిని పొందు" మని శాసించెను. అనంతరము నారదుడు సకల నామముల యందును బ్రహ్మదృష్టిని నిలిపి ఉపాసించెను. తరువాత నారదుడు నామ బ్రహ్మము కంటె మించిన దేమైన కలదా అని ప్రశ్నించెను.

సమాధానముగా సనత్కుమారుడు క్రమముగా నామ బ్రహ్మము మొదలుకొని వాక్కు, మనస్సు, సంకల్పము, చిత్తము, ధ్యానము, విజ్ఞానము, బలము, అన్నము, జలము, తేజము, ఆకాశము, స్మరణము, ఆశ, ప్రాణము, సత్యము, మననము, ఆస్తిక్యబుద్ధి రూపమగు శ్రద్ధ, ఆచార్య సేవా రూపమగు నిష్ఠ, కృతి, సుఖము, భూమ- ఈ విధముగా ఉత్తరోత్తరాధిక్యముకల పదార్థముల యందు బ్రహ్మదృష్టిని కలుగ జేయుచు వానిని ఉపాసించవలసిన అవసరమును తెలిపెను. ఇది ఇంతవరకును మీరు తెలిసికొనియే ఉన్నారు.

నారదుని వంటి వాడు కూడ అంత విద్వాంసుడయినను శోక రహితుడయి ఆత్మ విద్యను తెలిసికొన లేనందున సనత్కుమారుని చెంతకు వెళ్ళవలసి వచ్చెను. కావున శాస్త్రభ్యాసమాత్రముచే సూక్ష్మమగు బ్రహ్మవిద్య తెలియ రాదు. దాని కొరకు అనుభవము కలవాని వద్ద ఉపదేశమును పొంది తీరవలెను. డాక్టరీ

తెలియుట కొరకు మెడికలు కాలేజీలో చదువు కొనినను మంచి అనుభవముకల డాక్టరు వద్ద అభ్యాసము చేయుట అవసరము కాదా! అటులనే బ్రహ్మవిద్యా జ్ఞానము కూడ గురువు లేనిదే లభించదు.

స్వా. ని. :— బృహదారణ్యకోపనిషత్తు చెప్పబడినది.

"ఆచార్యవా౯ పురుషో వేద"

"ఆచార్యుడు కలవాడు (గురువును శరణుజొచ్చిన వాడు)ఆత్మను తెలిసికొనును." ఆచార్య లక్షణము సూత సంహిత యందు ఉన్నది.

## ఆచార్య లక్షణము

***ఆచార్య ఏవ సంసార మోచన ప్రద ఉచ్యతే |***
***ఆచార్యో నామ వేదాన్త విచారేణాప్త వేదనః||***

"సంసారము నుండి ముక్తిని కలుగజేయువాడు ఆచార్యుడు. వేదాంత శాస్త్ర విచారముచే తత్త్వజ్ఞానమును పొందినవాడు

ఆచార్యుడు." ఆచార్య లక్షణమును శ్రీ శంకర భగవత్పాదుల వారు ఉపదేశ సాహస్రి యందు స్పష్టముగా చెప్పిరి.

***"ఆచార్య స్తూహాపోహ గ్రహణధారణశ మద మదయాను గ్రహాది సంపన్నో లబ్ధాగమో ద్రష్టా దృష్ట భోగేష్వనాసక్తః, త్యక్త సర్వ కర్మ సాధనో బ్రహ్మవిత్ బ్రహ్మణి స్థితోఽభిన్నవృత్తో దమ్భ దర్ప కుహకశార్యమాయా మాత్సర్యానృతాహంకార మమత్వాది దోషవివర్జితః। కేవల పరానుగ్రహ ప్రయోజనో విద్యోపయోగార్థీ పూర్వముపదిశేత్॥"***

ఆచార్యుడు ఈ కింది గుణములను కలిగియుండవలెను.

ఊహ:- శిష్యునకు సందేహమును వెల్లడించు శక్తి లేనప్పుడు ఆతని సందేహమును తెలిసికొని, ప్రశ్న అసంపూర్ణమైనచో పూర్తి చేసి, ఉపదేశించుట తోడనే జ్ఞానమును కలుగ జేయు అపూర్వములగు యుక్తులను కలిగియుండుట.

అపోహ:- సిద్ధాంత విరుద్ధమగు పక్షమును నిరాకరించు సామర్థ్యము. గ్రహణము:- శిష్యుడు అడిగిన ప్రశ్నలను వెంటనే తెలిసికొనుట. ధారణ:- గ్రహించిన ప్రశ్నలను సమగ్రముగా వివరించు సమయమున అవ ధారణతో జ్ఞాపకము ఉంచుకొను సామర్థ్యము. శమము:- మనోనిగ్రహము. దమము:- ఇంద్రియ నిగ్రహము. దయ:- దుఃఖించు వారిని చూచుటచే జనించు కరుణ. అనుగ్రహము:- దయ కలిగిన మీదట దుఃఖించు వారి దుఃఖములను పోగొట్టవలెనను స్వభావము. ఇట్టి గుణములు ఆచార్యుని యందు ఉండవలెను. మరియు శాస్త్రజ్ఞుడును, ఇహపర భోగములయందు ఆసక్తి కలిగియుండని వాడును, కర్మ సాధనములను, స్త్రీ ధనాదులను త్యజించిన వాడును, బ్రహ్మజ్ఞుడును, బ్రహ్మభేదమును కలిగించు శాస్త్ర విహితములగు ఆచారములను పాలించువాడును, దంభము (మిథ్యధర్మాడంబరము) గర్వము, ఇతరులను మోసగించుట, నిష్ఠురత్వము, ఇతరులకు

భ్రాంతిని కలుగ జేయుట, ఇతరుల గుణములను దోషములుగా వర్ణించుట, అసత్య భాషణము, దేహాభిమాన కృతములగు శిష్యాదులయందు మమత్వాది దోషములు ఇవి-కొంచెమైన లేని వాడును అయి యుండవలెను. ఆతడు కేవలుడుగా నుండి ప్రపంచమునందు ఔదాసీన్యమును పొంది ఇతరులయందు అనుగ్రహము కలిగియుండుట మాత్రమే ప్రయోజనముగా కలిగి, విద్యను సదుపయోగ మొనరించుటయే కోరుకొను చుండవలెను. ఇట్టి ఆచార్యుడు వెనుక చెప్పిన బ్రహ్మవిద్యను ఉపదేశించవలెను. ఆచార్య లక్షణములు మనుస్మృతియందు కూడ కలవు.

***ఉపనీయ తు యః శిష్యం వేద మధ్యాపయేత్ ద్విజః |***
***సకల్పం సరహస్యం చ తమాచార్యం ప్రచక్షతే ||***

శిష్యునకు ఉపనయనము చేసి తన ఇంటికి

తీసికొని వెళ్లి కల్ప (యజ్ఞ విద్య) యుక్తమును, రహస్య (దశోపనిషత్తులు) యుక్తమును అగు వేదమును నేర్పు వాడు ఆచార్యుడు.

పెద్ద విద్యార్థి:- ఈ రోజులలో శిష్య పరంపర, పుత్ర పరంపర వలె అనుక్రమమున వాడుకలో నున్నది కదా? అట్టివారు ఆచార్యులనబడదురా?

స్వా. ప్ర. :- ఆచార్యులని యే చెప్పబడుదురు. బ్రాహ్మణులలో ద్వివేది, త్రివేది, చతుర్వేది మొదలగు వంశ నామములు ఉన్నట్లే వారుకూడ ఆచార్య సంజ్ఞతో వ్యవహరించబడుదురు. యథార్థమునకు శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మాధవాచార్యులు మొదలగు భాష్యకారులు మాత్రమే ఆచార్యులు అని చెప్పబడుదురు.

పెద్ద విద్యార్థి:-- గురువు ఒక్కరే ఉండవలెనా అనేకులు ఉండవచ్చునా?

స్వా.ప్ర. :- మీకు కాలేజీలో ప్రతి విషయమును ఒక్కొక్క ప్రొఫెసరు నేర్పుదురు. ఇంగ్లీషు, సంస్కృతము, అర్థశాస్త్రము మొదలగు విషయములకు వేరు వేరు ప్రొఫెసర్లు ఉందురు. అటులనే సంస్కృతమునందు కూడ వ్యాకరణము, న్యాయము, మీమాంస మొదలగు విషయములకు వేరువేరు గురువులు ఉందురు. అదే విధముగ కర్మ, ఉపాసన, జ్ఞానములకు కూడా వేరు వేరు గురువులు ఉండవచ్చును.

ఒకమారు ఉద్దాలక మహర్షి కుమారుడు శ్వేత కేతుడు ప్రవాహణడను రాజునాస్థానమునకు గౌరవ ప్రతిష్ఠలను సంపాదించవలెనను కోరికతో వెళ్ళెను. సభలో ప్రవాహణుడు అతనిని ప్రశ్నించెను. "నీవు తండ్రి అనుశాసనమును పొందితివా?" "చిత్తము. నేను అన్ని విద్యలను నేర్చు కొంటిని." "నీవు పంచాగ్ని విద్య నేర్చుకుంటివా?" ""చిత్తము. నేర్చుకొంటిని."

అంతట రాజు ఆతనిని పంచాగ్ని విద్యకు

సంబంధించిన ప్రశ్నలను అడిగెను. శ్వేతకేతుడు ఒక దానికి కూడా సమాధానం చెప్పలేదు. అందుచే గౌరవము లభించుటకు బదులు అతనికి అగౌరవము కలిగెను. అప్పుడు ఆతడు తండ్రి వద్దకు వెళ్ళి చెప్పెను. "నన్ను ప్రవాహణ మహారాజు అడిగిన ప్రశ్నలలో ఒక్క దానికి కూడ నాకు సమాధానము తెలియదు, మీరు నాకు నేర్ప లేదు." తండ్రి అడిగెను:-"ఏమి ప్రశ్నించెను?" శ్వేత కేతుడు పంచాగ్ని ప్రసంగమును తెలిపెను. తండ్రి చెప్పెను:-"అది నాకు కూడ తెలియదు."

అనంతరము ఆయన ప్రవాహణుని వద్దకు వెళ్ళి పంచాగ్ని విద్యను నేర్చుకొనెను. ఉద్దాలక మహర్షి గొప్ప తత్వవేత్త, అయినను యజ్ఞ విద్యనేర్చుకొనుటకు ఆతడు ప్రవాహణ రాజు వద్దకు వెళ్ళెను. కావున తనకు తెలియని విద్యను తెలిసికొనుటకు తెలిసిన గురువు వద్దకు వెళ్ళుట తప్పు కాదు. గురుగీత యందు పార్వతితో శంకరులు చెప్పిరి :-

***మధులుబ్ధో యథా భృఙ్గః పుష్పాత్ పుష్పాన్తరం వ్రజేత్|***
***జ్ఞానలుబ్ధః తథా శిష్యో గురోర్గుర్వన్తరం వ్రజేత్||***

"తేనె యందు ఆశగల భ్రమరము ఒక పుష్పమునుండి మరియొక పుష్పము వద్దకు వెళ్ళును. అటులనే జ్ఞాన పిపాసువగు శిష్యుడు ఒక గురువు వద్దనుండి మరియొక గురువు వద్దకు వెళ్ళవలెను."

పెద్ద విద్యార్థి :-తమరు శాస్త్రములను ఉదహరించి ఒక గురువు వద్దనుండి మరియొక గురువు వద్దకు వేరు వేరు విద్యలు నేర్చు కొనుటకు వెళ్ళవలెనని తెలిపిరి. కాని ఒక్కొక్కప్పుడు ఒక గురువు ఒక అభిప్రాయమును ప్రకటించిన, వేరొక గురువు వేరొక అభిప్రాయమును ప్రకటించును. ఇట్లు గురువుల యందు మత వైవిధ్యము కన్పించిన ఏమి చేయవలెను?

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

స్వా.ప్ర. :- సాంఖ్య సూత్రము చెప్పుచున్నది.

***"బహు శాస్త్ర గురూపాసనేఽపి సారాదానం షట్ పద వత్"***

"అనేక శాస్త్రముల గురువులను ఉపాసించినను భ్రమరమువలె సారము గ్రహించవలెను." భ్రమరము ఒక వృక్షమునుండి మరియొక వృక్షమునకు అచ్చటినుండి ఇంకొక వృక్షమునకు ఇట్లు అనేక వృక్షముల వద్దకు వెళ్ళును. వాటి పుష్పములపై కూర్చొనును. ప్రతి వృక్షము నందును ఏదియో ఒక భేదము ఉండి తీరును. కానీ భ్రమరము వాని పత్రములు, ఫలములు మొదలగు వానిపై తన దృష్టిని ప్రసరింప జేయదు. ప్రతి పుష్పము యొక్క రసమును మాత్రమే- మధువును మాత్రము పానము చేయును. అటులనే జిజ్ఞాసువు అనేకులగు గురువుల వద్దకు తప్పక వెళ్ళవలెను, వారి వద్దనుండి లభించిన జ్ఞానమును గ్రహించ వలెను. వైవిధ్యములు కన్పించినచో

వైవిధ్యములపై విశేష లక్ష్యమును చూపక సర్వ సిద్ధాంత సారమగు జ్ఞానామృతమును మాత్రమే గ్రహించవలెను.

షట్ దర్శనముల సిద్ధాంతములు వేరు వేరు. ఒక దానికి మరియొకటి భిన్నము అయినను అన్ని దర్శనములను అభ్యసించవలెను. వీని అన్నిటియందును కల సామాన్య ధర్మములు ప్రతి వాడును అంగీకరించ వలెను. ఉదాహరణకు సాంఖ్య, యోగ, న్యాయ ప్రక్రియలలో కొన్నిటిని వేదాంతము అంగీకరించినది. ఉపకరించు వస్తువు ఎచ్చట నుండి లభించినను దానిని ఉపేక్షించ రాదు. అంతే కాదు. దానిని పొందుటకు అనేకులగు గురువులు ఉపాసించి వివేక బుద్ధిని ఎల్లప్పుడును ఉపయోగించుటకు సిద్ధముగా నుండవలెను.

ఈవిధముగా మంత్రమును ఉపదేశించు గురువు-గాయత్రీ ప్రణవాదులను ఉపదేశించు గురువు ఒకడే ఉండును. కాని జ్ఞానమునకు

సంబంధించిన ఇతర విషయములకు ఇతర గురువులు కూడా ఉండ వచ్చును. వారివద్ద జ్ఞానమును సంపాదించవలెను. అందుకు అభ్యంతరము లేదు. అటులనే గాయత్ర్యాదుల జపానుష్ఠానాదుల పద్ధతులను తెలుపు మరియొక గురువును కలిగియుండుటలో తప్పేమియు లేదు.

## యజ్ఞోపవీత రహస్యము

పె. వి. :- యజ్ఞోపవీతము ధరించుటకు కల కారణ మేమి? అది పురుషులు మాత్రమే. ఏల ధరించవలెను? ఈ మధ్య కొంతమంది అనధికారులు కూడ ధరించుచున్నారు. ధరించినవారు దానియందు గౌరవ భావమును వ్యక్తపరచుట లేదు. అధికారము ఉన్నవారు కొందరు ధరించుటయే లేదు. దానికి సంబంధించిన రహస్యములను ఎరిగింపుడు.

స్వా. ప్ర. :-యజ్ఞోపవీత శబ్దమును వివేచన చేయుటచే దానిని ధరించుట కల కారణములు తెలియును. అందుకు సంధించిన సందేహములు

నిర్మూలమగును.

యజ్ఞ-ఉప-వి-ఇత = యజ్ఞమునకు దరిజేరుట. యజ్ఞ శబ్దమునందు “యజ్” ధాతువు కలదు. అందుచే యజ్ఞాధికారమును పొందుట అని అర్ధము. యజ్ఞోపవీత సంస్కారము యజ్ఞాధికారము నిచ్చును. ఇది సకామ, నిష్కామ కర్మల నియమములను పాటించుటకు చేయు ప్రతిజ్ఞకు చిహ్నము. నాలుగు వేదములయందు యజ్ఞోపవీత ధారణకు మంత్రములు కలవు.

1. ఋగ్వేదము:-

***ఓం యజ్ఞోపవీతం పరమం పవిత్రం ప్రజాపతేర్యత్ సహజం పురస్తాత్ ఆయుష్య మగ్ర్యం ప్రతిముఞ్చ శుభ్రం యజ్ఞోపవీతం బలమస్తు తేజః***

“యజ్ఞోపవీతము పరమ పవిత్రమైనది. జ్ఞానరూపమగు యజ్ఞోపవీతము పూర్వము ప్రజాపతితో కూడ జన్మించినది. ఆయువు,

బలము, తేజము, సర్వ శ్రేష్ఠత్వము ఇచ్చునదియును, అంతఃకరణమును నిర్మల మొనర్చునదియును అగు యజ్ఞోపవీతమును నేను ధరించుదును."

2 యజుర్వేదము :-

***ఓం యజ్ఞోపవీతం పరమం పవిత్రం బృహస్పతేర్మత్ సహజం పురస్తాత్ ఆయుష్య మగ్ర్యం ప్రతిముఞ్చ శుభ్రం యజ్ఞోపవీతం బలమస్తు తేజః||***

"ప్రజాపతి" శబ్దమునకు బదులుగా యజుర్వేదము "బృహస్పతి" శబ్దము ఉపయోగించబడినది. మిగతా అర్థము సమానము.

3. సామవేదము :-

***ఓం యజ్ఞోపవీత మసి యజ్ఞస్య త్వా యజ్ఞోపవీతే నోపన హ్యామి***||

"ఇది యజ్ఞోపవీతము, ఈ యజ్ఞోపవీతము ద్వారా నిన్ను యజ్ఞ సమీపమునకు తీసికొని

వెళ్ళెదను.”

4 అథర్వణవేదము :-

ఓం యజ్ఞోపవీత మసి యజ్ఞస్య త్వా యజ్ఞోపవీతే నోపన హ్యామి||

(అర్థము పై మంత్రముతో సమానము)

పరాప్రకృతి లేక మాయ బ్రహ్మాభిన్నమగు జీవుని తన సత్త్వ రజస్తమములను త్రిగుణములయిన, త్రిగుణ కార్యములును అనబడు బంధములతో కట్టి ఉంచును అను దానిని యజ్ఞోపవీతము సూచించును. మాయాగుణములగు సత్త్వరజస్తమము లనబడు మూడును రజస్తమో మిశ్రమమగు అధిక సత్త్వమును, సత్త్వతమో మిశ్రమమగు అధిక రజోగుణము, రజస్సత్త్వ మిశ్రమమగు అధిక తమోగుణము- ఇట్లు వైవిధ్యముచే 9 గుణములగును. ఈ తొమ్మిదింటికిని తొమ్మిది తంతువులును ప్రతీకములుగా తలచవలెను. శుద్ధ రజస్తమస్సత్త్వ రూపమగు త్రిగుణాత్మకమగు

అవిద్య బ్రహ్మ గ్రంథి. ఇట్టి యజ్ఞోపవీతము ధరించబడును. దీనిచే సాధకుడు ఎల్లప్పుడును ఏమరుపాటు లేకుండ ఈ విషయమును గుర్తుంచుకొనును. నేను నవతంతు యుక్తమగు మాయా పాశముచే బద్ధుడనై యున్నాను. యజ్ఞాద్యనుష్ఠానముచే చిత్తమును శుద్ధి నొందించుకొని నేను ఈ పాశమును ఛేదించవలెను.” ఈ విధముగా అవిద్యా బంధనము నిరంతరము గుర్తుకు వచ్చుచుండుటకు ఆ బంధన ప్రతీకముగా సాధకుడు యజ్ఞోపవీతమును ధరించవలెను. వేదోక్తమగు యజ్ఞానుష్టానము ద్వారా బంధన ముక్తికి ప్రయత్నించవలెను.

యజ్ఞోపవీతమును ధరించు అధికారము బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణములకు మూడింటికిని కలదు అని మనుస్మృతి చెప్పుచున్నది.

***గర్భాష్టమేఽబ్దే కుర్వీత బ్రాహ్మణ స్యోప నాయనమ్/***

***గర్భాదే కాదశే రాజ్ఞో గర్భాత్తు ద్వాదశే విశః||***
***బ్రహ్మవర్చస కామాయ కార్యం విప్రస్య పఞ్చమే/***
***రాజ్ఞో బలార్థినః షష్ఠే వైశ్యాయేహార్థినోఽష్టమే||***

"గర్భము మొదలుకొని 8 వ సంవత్సరమున బ్రాహ్మణునకును, 11వ సంవత్సరమున క్షత్రియునకును, 12వ సంవత్సరమున వైశ్యునకును యజ్ఞోపవీతము నర్పించవలెను. కాని బ్రహ్మ వర్చస్సును ( తేజస్సును) కోరు బ్రాహ్మణుడు 5వ సంవత్సరమునను, బలము కోరు క్షత్రియుడు 6వ సంవత్సరమునను, లౌకిక సుఖములను కోరు వైశ్యుడు 8వ సంవత్సరమునను తమ బాలకులకు ఉపనయన సంస్కారము చేయవలెను. పూర్వము స్త్రీ పురుషులకు ఉభయులకును కూడ యజ్ఞోపవీత ధారణ ఉండెననుటకు శాస్త్రము నందు అధికారము కలదు.

***పురా కల్పే కుమారీణాం మౌఞ్జీ బన్ధన మిష్యతే/***
***అధ్యాపనం చ వేదానాం సావిత్రీ వాచనం తథా //***

"పూర్వము కన్యలకు కూడా ఉపనయన సంస్కారము చేయబడు చుండెడిది. వేదాధ్యయనము, గాయత్ర్యుపదేశము కూడ చేయబడెడివి." కాని యజ్ఞోపవీతము ధరించుట అనగా నూలు దారము మెడలో వేసికొనుట కాదు. దానితో బాటు యజ్ఞానుష్ఠానము చేయవలసి యున్నది. ఈపని పిల్లలు కల స్త్రీలు చేయలేక పోయెడివారు. ఆచరించ వలసిన విధముగా ఆచరించు సామర్థ్యము ఉండెడిది కాదు. పిల్లలు ఏడ్చినా, పడిపోయినా ఇంకా ఇతరములగు అవసరములలో తల్లులు వెంటనే పరుగెత్త వలసి వచ్చును. ఆవిధముగా కర్మ విచ్ఛేదము జరుగుట తటస్థించి స్త్రీలు యజ్ఞానుష్ఠానాదులు నిర్వహించలేరనునది రుజువయినది. అంతట పురుషులు స్త్రీలతో ఇట్లు చెప్పిరి. "మీ పనులు

మీరు చేయండి. మీరు గృహ కృత్యములు నిర్వహించండి. మేము యజ్ఞము చేసెదము. దాని ద్వారా జనించిన అపూర్వము నందు (పుణ్యమునందు) అర్ధ భాగము మీకు ఇచ్చెదము.” అనంతరము స్త్రీలు ధరించు యజ్ఞోపవీతము పురుషులు ధరించిరి. అంతటితో స్త్రీల వేదాధ్యయనము అంతమొందినది. యజ్ఞానుష్ఠానముల యందు వారు సహధర్మచారిణీ స్థానమును మాత్రము నిలుపుకొనిరి.

అవిద్యా బంధము తెగి చిత్తశుద్ధి కలుగ నంతవరకు యజ్ఞోపవితమును ధరించవలెను. “అవిద్యా ప్రతీకమగు యజ్ఞోపవీతమును నేను ఏల ధరించవలెను?” అనునంతటితో అవిద్య నుండి ముక్తి కలుగదు. న్యాయాధిపతి ఏ నేరస్థునికైన ఇంత కాలము శిక్ష అనుభవించవలెనని శిక్ష విధించిన తదుపరి ఆ నేరస్థుడు సమయము పూర్తి కాక ముందే బేడీలు

తెంపుకొని ఏదో విధముగా స్వేచ్ఛను పొందదలచినచో స్వేచ్ఛకు బదులుగా ఆతనికి ఇంకను కఠిన శిక్ష అదనముగా లభించును. అటులనే కర్మానుష్ఠానము ద్వారా చిత్త శుద్ధి కలుగుటకు ముందు యజ్ఞోపవీతమును త్రెంచి విసరి వేయుటచే అవిద్యా బంధనమునుండి విముక్తి కలుగుటకు బదులుగా ఇంకను ఎక్కువగా బంధమునందు చిక్కుకొనును. కావున వానప్రస్థాశ్రమ పర్యంతము యజ్ఞోపవీతమును ధరించవలెను.

యజ్ఞాద్యనుష్ఠానముల ద్వారా చిత్తము శుద్ధిని పొందిన తరువాత అవిద్యా ప్రతీక మగు బాహ్య సూత్రమును (యజ్ఞోపవీతమును) త్యజించి బ్రహ్మభావమను యథార్థ సూత్రమును ధరించి సన్యాసమును స్వీకరించవలెను. బ్రహ్మోపనిషత్తు నందు చెప్పబడినది.

***సశిఖం వపనం కృత్వా బహిస్సూత్రం త్యజేద్బుధః।***

***యదక్షరం పరం బ్రహ్మ తత్సూత్రమితి ధారయేత్ ||***

"విద్వాంసుడు శిఖా సహితముగా ముండనము చేయించుకొని బాహ్య సూత్రమును త్యజించి నాశరహితమగు పర బ్రహ్మ సూత్రమును ధరించ వలెను."

***సూచనాత్సూత్ర మిత్యాహుః సూత్రం నామ పరం పదమ్ |***
***తత్సూత్రం విదితం యేన విప్రో వేద పారగః||***

"పరబ్రహ్మమును సూచించుటచే ( తెలియ జేయుటచే) ఈ సూత్రము (సూత్రాత్మ) పరమపదము అనగా మోక్ష రూపము. ఇది మోక్ష రూపమని తెలిసికొనిన విద్వాంసుడు వేదమునంతను తెలిసి కొనినట్లే."

***బహిస్సూత్రం త్యజే ద్విద్వాన్యోగ ముత్తమమాస్థితః|***
***బ్రహ్మ భావ మిదం సూత్రం ధారయే ద్యస్స చేత నః||***

# ఇరువది ఎనిమిదవ ప్రసంగము

"ఉత్తమమగు యోగము నందు నిష్ఠకల విద్వాంసుడు బహిస్సూత్రమును త్యజించి బ్రహ్మభావమను ఈ సూత్రమును ధరించినచో ఆ నరుడు ప్రకాశ స్వరూపుడు అగును."

***జ్ఞాన శిఖినో జ్ఞాన నిష్ఠాః జ్ఞాన యజ్ఞోపవీతినః/***
***జ్ఞానమేవ పరం తేషాం పవిత్రం జ్ఞానముచ్యతే //***

జ్ఞానరూపమగు శిఖయును, జ్ఞానరూపమగు యజ్ఞోపవీతమును, జ్ఞాన నిష్ఠయును కల సత్పురుషుల జ్ఞానము శ్రేష్ఠము. అదియే పవిత్రమైనది అని చెప్పబడును."

యజ్ఞోపవీతము నర్పించు సంస్కారము ఉపనయనము అని కూడ చెప్ప బడును. ఈ ఉపనయ శబ్దమునకు రెండు అర్థములు కలవు. 1 గురువు వద్దకు బాలకుని విద్యాధ్యయనము చేయించుటకు తీసికొని వెళ్ళుట, లేక వారికి అప్పగించుట. 2. మరియొక కన్ను. ప్రాణుల కన్నిటికిని రెండు కళ్లు ఉండును. వానికంటె విశేషమగు కన్ను శాస్త్ర జ్ఞానమను నేత్రమును

పొందుట. కాళిదాసు రఘువంశమున చెప్పెను.

***కామం కర్ణాన్త విశ్రాన్తే విశాలే తస్య లోచనే / చక్షుష్మతా తు శాస్త్రేణ సూక్ష్మ కార్యార్థ దర్శినా //***

"పెద్ద పెద్ద కళ్ళు ఉన్నంత మాత్రమున ఆతడు కళ్ళు కలవాడు కాదు. సూక్ష్మ కార్యార్థములను తెలుపు శాస్త్రము ద్వారానే ఆతడు చక్షుష్మంతుడుగా చెప్ప బడును. " మరియు

***సర్వస్య లోచనం శాస్త్రం యస్య నాస్త్యన్ధ ఏవ సః/***

"శాస్త్రజ్ఞానమను కన్ను లేనివాడు కళ్ళు ఉన్నను గ్రుడ్డివాడే." అని చెప్ప బడెను. ఈవిధముగా వేద శాస్త్రాధ్యయనాధికార సూచకముగా యజ్ఞోపవీతము గుర్తించబడినది.

## జపించదగిన శ్రేష్ఠ మంత్రము

పె. వి. :—జపించదగిన మంత్రములలో

శ్రేష్ఠమైనది ఏది?

స్వా. ప్ర. : -"సాని త్ర్యాస్తు పరం నాస్తి"

గాయత్రి కంటె మించిన మంత్రము లేదు. కావుననే బ్రాహ్మణులు గాయత్రినే ముఖ్య మంత్రముగా గ్రహించిరి.

## ప్రణవ మంత్రాధికారము

పె. వి. :— అయిన ప్రణవ మంత్రమును జపించుటలో దోషమేమైన కలదా?

స్వా. ప్ర. :-గృహస్థులు ఈ మంత్రమును జపించరాదు. కామినీ కనకములను త్యజించిన సన్యాసులకే దీనియందు అధికారము కలదు.

పె. వి.:- నేటి సన్యాసులు ధనము బాగుగా ఆర్జించు చున్నారు. వారికి ప్రణవాధికారము ఎట్లు కలదు?

స్వా. ప్ర. : - ధనార్జన చేయు సన్యాసులకు ధర్మముతో సంబంధం లేదు. కావున వారిని ఉదాహరణకు తీసికొనరాదు

పె: వి. :– గృహస్థులు కామినీ కనకములను త్యజించి ఏకాంతమున కూర్చుండినచో అధికారము కలదా?

స్వా. ప్ర. :— అట్టి వారికి కలదు. ఏలనన దీనికి ఆశ్రమముతో సంబంధము లేదు. త్యాగముతో సంబంధము కలదు. మాయికములగు ధనాదిపదార్థములను త్యజించి ఐకాంతికమగు వానప్రస్థ జీవితమును నిర్వహించువారికి అధికారము కలదు. ఏ కారణము చేతనైన సంపూర్ణ త్యాగము చేయలేనివారు అజపా మంత్రమును జపించ వచ్చును. "సోఽహమ్" అన్నది అజపా మంత్రము.

## సోఽహమ్

"సోఽహమ్" నందు రెండు శబ్దములు కలవు. "సః" అను శబ్దమునకు అర్థము ఆతడు అనగా బ్రహ్మము. "అహమ్" అను శబ్దమునకు "నేను" అని అర్థము. ఆ రెండు శబ్దములకును

సామానాధికరణ్యము కలదు. కావున ఆ రెండును బ్రహ్మము, ఆత్మ. ఈ రెండింటి యొక్కయును అనగా జీవ బ్రహ్మముల రెండింటి యొక్కయు ఏకత్వమును తెలుపును.

## “సోఽహమ్” జప విధి

శ్వాసను లోపలికి తీసికొనుట పూరకము. శ్రద్ధగా పరికించు సాధకుడు శ్వాసను లోపలికి తీసికొనునప్పుడు, అనగా పూరకమును ఆచరించు సమయమున “సో" అను ధ్వని వచ్చును. అటులనే శ్వాసను విడుచు సమయమున అనగా రేచకము నందు “హమ్” అను ధ్వని కలుగును. పూరకము నందలి చిత్త వృత్తితో దీనిని కలిపినచో సాధకునకు అయత్న పూర్వకముగా “సోఽహమ్” అను ధ్వని అనుభూత మగును. కావున అనేకమంది ప్రారంభావస్థ యందలి సాధకులకు ప్రణవ జపము కంటె “సోఽహమ్" జపము ఎంతయో సులభము. చిత్త వృత్తిని ఆపుటకు ఈ

“సోఽహమ్” జపమును ఉపయోగించెదరు.

ధ్యానము చేయు సామర్థ్యము లేనివారికి ఇది ఎంతమో ఉపయోగము. అంతియే కాదు. “సోఽహమ్” జపము చేయుటచే వేదోక్తమగు ప్రణవ జపము దానంతట అదియే జరుగును. శాస్త్రములు చెప్పుచున్నవి:-

***సకారం చ హకారం చ లోపయిత్వా ప్రయోజయేత్ |***
***సంధిం చ పూర్వ రూపాఖ్యం తతోఽ సౌ ప్రణవో భవేత్ ||***

“సోఽహమ్” నందలి సకార హకారములను లోపింపజేసి, పూర్వ రూపమగు ఏకాదేశ సంధి చేసినచో “సోఽహమ్” అనునది ప్రణవమగు “ఓమ్” అగును.

“సోఽహమ్” జపము శ్రేష్ఠమని తెలిసికొని అర్థమును భావించు కొనుచు జపించినచో మలదోషనివృత్తి యగును. దేవానుగ్రహము కలుగును. అనగా నిర్వికల్ప సమాధి వరకు

చేరుటకు ఇది సాధనము. ఈ “సోఽహం”, నకు సంబంధించిన దృష్టాంతము ఒకటి కలదు.

ఎన్నియో పనులతోను, చిక్కులతోను సతమతమగుచున్న మనుష్యుడు ఒకడు ఒక మహాపురుషుని సమీపించి ఇట్లు ప్రార్థించెను. “స్వామీ! నాకు ఉన్న ఈ చిక్కులు అన్నియును తప్పిపోయినచో నాకు దేవునియందు మనస్సు లగ్నము చేయు నవకాశము కలుగును. దయతో నాకు అట్టి మార్గమును ఉపదేశింపుడు.” ఆమహాత్ముడు పలికెను. “కొంత కాలము వినియోగింపవలసివచ్చును.” ఆతడు “సరే” అనెను. మహాత్ముడు చెప్పెను. “ఈ మంత్రమును ఇచ్చుచున్నాను. నలుబది దినములు జపించుము. ఆనాడు నీవద్దకు ఒక భేతాళుడు వచ్చును. ఆతనికి నీ పనులును, చిక్కులును అప్పగించి నీ మనస్సును దేవునియందు లగ్నము చేయుము.”

మహాత్ముడు చెప్పినట్లు 40 రోజులు సాధన చేయగా భేతాళుడు ఎదుట హాజరయ్యెను.

ఆతనికి పనులు పురమాయించగా “మీరు చెప్పు పనులను చేసెదను. కాని పని లేని సమయము సంప్రాప్తమగుచో మరి మీ చెంత నుండను” -అని భేతాళుడు నుడివెను, ‘సరే’ అని పనులు చెప్పసాగెను. భేతాళుడు శర వేగమున పూర్తి చేయుట చూచి ఆ మనుష్యుడు మహాత్ముని చెంతకు పరుగిడి పని చెప్ప లేనిచో భేతాళుడు వెళ్ళి పోవునట అని చెప్పెను. అంతట మహాత్ముడు “నీకు చెప్పుటకు పనులు లేనిచో ఒక పెద్ద స్తంభమును పాతించి దానిని ఎక్కుచు దిగుచు ఉండమని చెప్పుము.” అని ఉపాయము చెప్పెను. ఆ మనుష్యడట్లు చేయగా భేతాళుడు అలసి పోయెను. “స్వామీ! పని లేనిచో ఊరక కూర్చొనెదను. నాకు ఈ స్తంభమును ఎక్కుచు దిగుచు ఉండమని ఆజ్ఞాపింపకుడు” అని ప్రార్థించెను, ఆ మనుష్యుడు ‘సరే’ అని భేతాళుని తన అదుపులో నుంచుకొనెను.

మనస్సును ఆ భేతాళునివలె “సోఽహమ్”

అను స్తంభమును ఎక్కుచు దిగుచు ఉండునట్లు చేసిన అది అలసిపోయి చాంచల్యమును విడనాడి మన వశము నందుండును. “సోऽహమ్” (అజపా జపము) సహజముగా పూరక రేచకముల ద్వారా జరుగుచునే యున్నది. దానితో చిత్త వృత్తిని అనుసరింప జేసినచో సంకల్ప వికల్పములు అంతమొంది మనస్సు వశ పడును.

కాళాభాయి స్వామి శ్రీ ప్రకాశానందుల వారిని తమ గ్రామము జేతపురమునకు దయచేయ ప్రార్థించగా జూనాగఢము వెళ్ళి తిరుగుదలలో వచ్చెదనని చెప్పిరి. మా గ్రామమునందు తమకు వసతులను కలుగ జేయుదునని కాళాభాయి నుడివెను.

స్వా. ప్ర:- సౌభాగ్యవతి ఒకావిడ ఒక విధవకు నమస్కారము చేయగా ‘నావలె వర్ధిల్లుము’ అని ఆశీర్వదించెనట. అదే విధముగా అరణ్యమున ఉన్న నన్ను గ్రామ సమీపము నందున్న సత్రమునకు తీసికొనివచ్చిరి. ఇప్పుడు కాళాభాయి గ్రామము లోపలికే తీసికొని

వెళ్ళునట. ఈ విధముగా నన్ను తిరిగి గృహస్థాశ్రమములోనికి రప్పించుచున్నారా?

కాళాభాయి:—స్వామి వారికి జగత్తు అనిన భయపడవలసిన సమయము గడచిపోయినది. ఇప్పుడది యెందులకు?

## బ్రహ్మ స్థితి యందున్న వానికి భయమెందుకు?

స్వా.ని.:- బ్రహ్మస్థితునకు జనులనుండి కాని పదార్థముల నుండి కాని భయముండదు. తీవ్ర వైరాగ్యశీలునకు పదార్థముల నుండి భయముండదు. కాని "***అహిరివ గణాద్భీతః***" సర్పము జన సమూహమునుండి భయపడునట్లు ఆతడు జన సమూహమునుండి భయపడును. తన యోగాభ్యాసమునకు అంతరాయము కలుగుటయే ఇందుకు కారణము. మంద వైరాగ్యము కలవాడు పదార్థములనుండి కూడా భయపడును.

స్వా: ప్ర|| :- నేను అట్టి వాడనే. వివేకము ద్వారా పూర్ణ వైరాగ్యము ఇంకను నాకు కలుగ లేదు. నా మనస్సును నమ్మ లేకున్నాను. ఈ దృష్టాంతము చూడుడు.

ఒక భక్తుడు నిత్యము నదికి వెళ్లి స్నానము చేసెడివాడు. ఒక గణిక యింటి గుండా వెళ్ళవలసి వచ్చెను. ఆమె 'తమరు పురుషులా? స్త్రీయా?' అని ప్రశ్నించుచుండెను. సమాధానమియ్యకుండా తల వంచుకొని పోవుచుండెడి వాడు. ఇట్లు కొన్ని సంవత్సరములు గడువగా ఆతనికి మృత్యు సమయము ఆసన్నమయ్యెను. ఆ గణికను రప్పించి "సోదరీ! నేడు నీ ప్రశ్నకు గుండెలు మీద చెయ్యివేసి సమాధానము చెప్పుచున్నాను. " నేను పురుషుడనే." ఇంతవరకు నా మనస్సుపై నమ్మకము లేక చెప్పనైతిని. ఇంద్రియములను జయించిన వాడే పురుషుడు గదా! చనిపోవుచున్న నాకు ఇక భయ మేల?" అని భక్తుడు చెప్పెనట.

స్వా.ని. :-ఈ దృష్టాంతము జిజ్ఞాసువులకు గాని తమకు కాదు. పాముల వాడు విషపు

కోరలను తీసివేసి జనుల యెదుట పామును ఆడించును. అది యెంత బుస కొట్టినను, ముందు దంతములతో కప్పలను పట్టినను దానినుండి భయపడవలసిన అవసరము లేదు. అట్లే అంతఃకరణముయొక్క రాజస తామస వృత్తులను సమాధి ద్వారా నివృత్తి నొందించిన తరువాత భయము ఉండదు.

స్వా.ప్ర. :- ప్రభూ! ఇది జ్ఞానుల లక్షణము. ఇంకా నేను జిజ్ఞాసు దశకు కూడా రాలేదు. నాకా యుపమానము తగదు.

పిమ్మట స్వామి ప్రకాశానందులవారు ప్రో|| జోషీ మున్నగు వారితో జూనాగఢము బయలుదేరగా, కాళాభాయి తిరుగుదలలో జేతపురము దయచేసి తమవంటి సంతుల పాదరజస్సుచే మా గ్రామమును పవిత్రింప జేయుడని కోరెను.

## సంతుల లక్షణము

స్వా.ప్ర. :- బొంత కట్టుకొని చేత భిక్షా

పాత్రమును ధరించి నంత మాత్రమున సంతు కానేరడు. తీర్థాటనము, కఠోర తపము, వన వాసము, చక్కని తిలక ధారణము, అక్షమాలాగ్రహణము - వీటివల్ల సంతు కానేరడు. తుకారాము నుడివినట్లు మూల వస్తువగు దేహాభిమానమును త్యజించ నంతవరకు ఎవడును సంతు కానేరడు. ప్రభువుకు దూరముగనే ఉండును. ఇందుకొక దృష్టాంతము కలదు.

ఒక పాకీవాడు మురికి బట్టలతో మలపు గంపను నెత్తి మీద పెట్టుకొని మహోత్సాహముతో రాజుగారిని దర్శించుటకు బయలు దేరెను. దారిలో అందరును వేళాకోళం చేయుచుండిరి. చివరకు రాజ ద్వారమునకు చేరగా ద్వార పాలకులు తరిమివేసిరి. ఇది చూచి ఒకడు 'నాయనా! రాజ దర్శనము కావాలంటే ఆ గంపను పార వేసి స్నానాదులచే పరిశుద్ధుడవై సభ్య వేషముతో రమ్ము. నీ కప్పుడు రాజ దర్శనమగును' అని చెప్పెను. అంతట ఆ

పాకీవాడు అట్లాచరించి రాజ దర్శనము చేసెను. అటులనే స్థూల సూక్ష్మ కారణ శరీరము లనెడు మూడింటి నుండియు యోగబలమున దేహాభిమానమును పోగొట్టనంత వరకు 'నేను సాక్షిని' అని తన స్వరూపము తెలియనంత వరకును పరమాత్ముని దర్శనము చేయుటకు ఎవడును అర్హుడు కాడు.

పిమ్మట స్వామివారు జూనాగఢమునకు బయలుదేరి వెళ్ళిరి.

ఓం

# ఇరువది తొమ్మిదవ ప్రసంగము

జూనాగఢము నుండి స్వామి శ్రీ ప్రకాశానంద స్వామివారు జేతపురము తిరిగి వచ్చినపుడు గ్రామము బైట సత్రములో మకాము చేసిరి. ఆరోజు సాయం కాలము స్వామి శ్రీ నిత్యానంద స్వామి వారును, స్వామి శ్రీ శంకరానంద స్వామి వారును, రాజు గారును అచ్చటికి దయ చేసిరి. కుశల ప్రశ్నలు అడిగి కూర్చొను సరికి డా. లల్లూ భాయియును ప్రభాశంకర భాయియును వచ్చిరి.

## ఒకని పై శ్రద్ధ యుంచి కర్తవ్యములను నిర్వహింపుము

ప్రభాశంకర భాయి డా|| లల్లూ భాయిని ఉద్దేశించి పలికిరి:-

మీరు చాలా అధ్యయనము చేసిరి. ఏదైన ప్రశ్న అడిగినచో అందరును తెలిసికొనుటకు వీలుపడును.

డా. లల్లూభాయి:— కొద్దియో గొప్పయో చదివితిని. కాని మనస్సునకు సంతృప్తి లేదు. ఇక అందరిని అడిగి నేనేమి చేయుదును?

స్వా. ప్ర. :—ఈ విషయమున ఒక దృష్టాంతము కలదు. ఒక సంతు ఒక గ్రామమున ఉండెడివాడు. అచ్చటి ఒక మనుష్యుడు ఆయన సత్సంగమునకు వచ్చెడి వాడు. ఐదారు రోజులు వచ్చిన తరువాత అతడు ఆ సంతును కోరెను. ‘తమరు నాకేదైన ఉపదేశించుడు.’ సంతు ప్రశ్నించెను:-“నీకు ఇంకొక మహాత్ముని పరిచయమేమైన కలదా?’ ఆ మనుష్యుడు జవాబు చెప్పెను. ‘చాలా మందిని చూచితిని. కాని తమ యందు మాత్రమే నాకు శ్రద్ధాభక్తులు కలవు. తమరేమైన ఉపదేశించినచో నేను తప్పక ఆ ప్రకారము నడచుకొనెదను.’

# ఇరువది తొమ్మిదవ ప్రసంగము

అంతట సంతు అడిగెను:- నీవు ఏమైన పుస్తకములు చదివితివా?"

అతడు సమాధానము చెప్పెను:-‘గీత, యోగవాశిష్ఠము మొదలగు గ్రంథములను అధ్యయనము చేసితిని.’

సంతు చెప్పెను. "గీత శ్రీ మద్భగవానుడగు కృష్ణుని శ్రీముఖమునుండి ఉపదేశించబడినది. యోగ వాశిష్టము శ్రీ రామచంద్రుల గురువగు వశిష్ఠుల వారి ఉపదేశము. నీకు అట్టి పుస్తకముల పైననే శ్రద్ధ లేనప్పుడు నా మాటలమీద మాత్రము శ్రద్ధ ఎట్లు ఉండును? కావున ఎక్కడ పడితే అక్కడ అందరిని అడుగుట వ్యర్థము. ఒకనిపై శ్రద్ధ నుంచి కర్తవ్యమును కలిగి గీత చెప్పిన ప్రకారము నిర్వహించుచుండవలెను.”

ఈమాటలతో ఆ జిజ్ఞాసువు సిగ్గుపడెను. ఆతడు పలికెను. “నా అపరాధము క్షమించుడు. నేటి నుండి గీత పై శ్రద్ధకలిగి గీత చెప్పిన ప్రకారము నడచుకొనెదను.”

అంతట ఆ సంతు ఇట్లు పలికెను:-“అదే మంచిది. గీత యొక్క అర్థమును పూర్తిగా తెలిసికొనినచో గటెక్కగలవు. మీరు చూచుచునే ఉందురు. ఈ రోజులలో అనేక మంది జీవితాంతము వరకు ప్రతిరోజు గీత పారాయణము చేయుదురు. కాని అర్థము సరిగా తెలిసికొనరు. కొందరు కొలది దినములలోనే అర్థమును తెలిసికొనెదరు. కారణ మేమన రజ స్తమః ప్రధానమైన బుద్ధికలవారు జీవితాంతము వరకు చదివినను దాని రహస్యాలు తెలిసికొనలేరు. కాని సత్త్వ ప్రధాన మగుటచే వివేక యుక్తమగు బుద్ధికలవారు కొలది కాలములోనే యథార్థమగు అర్థమును తెలిసికొనెదరు. భర్తృహరి నుడివెను.

***“ఆఘ్రాయ పుస్తకం ధన్యాః పర్వం విద్మ ఇతి స్మృతాః /***
***శత వారం పఠిత్వాపి హా! న విద్య జడా వయమ్//***

# ఇరువది తొమ్మిదవ ప్రసంగము

"పుస్తకమును ఆఘ్రాణించి పూర్తిగా అర్థము అయినదని తెలుప గలిగిన వారు ధన్యులు. మేము నూరు మారులు పుస్తకము చదివినను మూర్ఖులమే అయితిమి గదా!" మహాత్ములు ఏదైన ఉపదేశించినప్పుడు తమను ఉద్దేశించియే ఉపదేశ వాక్యములను పలికెదరు."

స్వా.ని.:-ఈ రోజులలో నూరు మారులే కాదు, వేయి మారులు చదివినను ఒక్కొక్క విషయం తాత్పర్యము తెలియనప్పుడు ఇంక ఆచరణలో పెట్టుట ఎట్లు? పూర్వ కాలము నందలి ఉత్తమాధికారులు గురువు నుండి ఒకేమారు వినియో, లేక గురువు నుండి తెలిసికొనియో తాత్పర్యమును గ్రహించి ఆచరణలో పెట్టుచుండెడి వారు. కాని జడ బుద్ధులకు నూరు మారులు తెలియ జెప్పినను యథార్థ వస్తువును గ్రహించలేక పోయెడివారు. చదివినను వస్తువును వస్తువుగా తెలిసికొన లేనివాడు జడ బుద్ధి అనబడును.

## సరిగా తెలిసికొనుట అనగా నేమి ?

శబ్దార్థము తెలియుట తెలిసికొనుట కాదు. చదివిన తర్వాత మాయిక పదార్థములు దుఃఖ రూపములని గ్రహించి వానిని విసర్జించుట తెలిసికొనుట అన బడును.

స్వా. ప్ర.:-హృషీకేశము నందున్నప్పుడు నేను మహాత్ముల వద్ద నుండి వింటిని. "ఒక యువకుడు ఒక గురువు వద్ద సన్యాసమును స్వీకరించెను. అంతట గురువు అతనికి తత్త్వ బోధ అను గ్రంథమును నేర్ప మొదలిడెను. అందు వివేకాది సాధనములు నాల్గింటిని మొదటి రోజున నేర్పెను. రెండవ రోజు గురువు వద్దకు శిష్యుడు వెళ్ళలేదు. గురువు ఆతనిని తన వద్దకు పిలిపించి అడిగెను.

"ఒకే రోజున పుస్తక మంతయు పూర్తి అయినదా?"

శిష్యుడు చెప్పెను:- "నేను పుస్తకమును చదువను. చదివినది ఆచరణలో పెట్టిన తరువాత నేను పుస్తకమును చదువుదును. నిన్న తమరు

వివేకాది సాధనములను నాల్గింటిని గురించియు సెలవిచ్చిరి. కాని, వానిని నేను ఆచరించ లేకపోయితిని. వానిని ఆచరించిన తరువాత మిగిలిన విషయాలను నేర్చుకొనుటకు తమ వద్దకు వచ్చెదను.”

గురువు నిష్ఠా శీలుడగుటచే శిష్యుని మాటలు నచ్చెను. ఈతడు తీవ్ర జిజ్ఞాసువని ఆతడు నమ్మెను. అనంతరము కొలది రోజులలోనే శిష్యుడు వివేకాదులను ఆచరించి గురువు గారి వద్ద తత్త్వ బోధ గ్రంథమును పూర్తి చేసెను. తరువాత గురువుగారి వద్ద శెలవు తీసికొని గంగాతీరమున సంచరించుచుండెను. ఎల్ల కాలముల యందును క్రియాశీలుడయి జన సంపర్కమునకు దూరముగా నుండెను. ఒక వేళ అవసరమైన మితముగా మాట్లాడెడివాడు. మరియొక స్వామిని గురించి కూడ నేను వింటిని. ఆయన కడు సమర్థుడగు విద్వాంసుడు. ఒకప్పుడు ఒక నగరములో సభ జరిగెను. ఆహ్వానమును పొంది ఆయన ఆ సభకు వెళ్ళెను.

అందు ఒక ముఖ్య పండితునితో శాస్త్రార్థము చేసి ఆతనిని ఓడించెను. అంతట పండితుడు అతనితో నిట్లనెను. నీవు విద్వాంసుడవు అయి సన్యాసమును తీసికొంటివి. కాని నీ పాండిత్యము ఇతరులకు దుఃఖము కలిగించినది. భర్తృహరి చెప్పెను.

# మహాత్ముల శీలము

***విద్యా వివాదాయ ధనం మదాయ శక్తిః సరేషాం పరిపీడనాయ |***
***ఖలస్య సాధోర్విపరీత మేతత్ జ్ఞానాయ దానాయ చ రక్షణాయ ||***

"దుర్మార్గుల విద్య అబద్ధపు వాదములకు ఉపయోగపడును; వారి ధనము మదమును కలిగించును; శక్తి ఇతరులకు దుఃఖమును కలుగ జేయును. ఆ వస్తువే సజ్జనులపట్ల వ్యతిరేక ఫలములను కలుగ జేయును. వారి విద్య జ్ఞానము కలుగ జేయుటకు ఉపయోగపడును. వారి ధనము దానము చేయబడును. వారి శక్తి

దుర్బలులను రక్షించును.” ఇది విని స్వామి వారికి పశ్చాత్తాపము కలిగెను. ఆరోజు నుండియు ఆయన సంభాషణము బాగుగా తగ్గించి వేసెను. ఆయన కూడ గంగా తీరముననే సంచరించు చుండిరి.

దైవ ప్రకృతి కలవారు చదివినది కొంచెమైనను దానిని ఆచరణ లోనికి తీసికొని వచ్చెదరు. అసుర ప్రకృతి కలవారు చదివిన కొలదియు నిష్ఠురులగుదురు. పెద్ద పెద్ద నగరములలో శ్మశానములయందు కట్టెలను అమ్మువారు తరచు శవములను కాల్చుచుండుట చూచి నిష్ఠురులగుదురు కదా! సామాన్య జనులు ఎప్పుడైన శ్మశానమునకు వెళ్ళవలసి వచ్చినచో శ్మశాన వైరాగ్యమును పొందెదరు. కాని శ్మశానమున కట్టెలు అమ్మువాడు మాత్రము ఏమాత్రము సంకోచించకుండగనే “ నేడు 150 శవములు వచ్చినవి. నిన్న రెండు వందల వచ్చెను. కావున నేడు సంపాదన తగ్గిపోయెను.” అని చెప్పును. ఏలనన వానికి అది నిత్యకృత్యము

అయిపోయెను.

స్వా. ని. :- ఒక మాటలో వైరాగ్యమును పొందు సంతులు నామ దేవుని వంటి దైవ ప్రకృతి కలవారు ఎక్కడో ఉందురు.

నామ దేవుడు ఎప్పుడు పురాణాది శ్రవణమునకు వెళ్ళెడి వాడు కాదు. ఒక రోజున ఆ గ్రామమున ఒక సంతు హరికథ చెప్పుటకు వచ్చెను. అది వినవలెనని నామదేవుని భార్యకు ఎంతయో కోరిక కల్గెను. నామదేవుడు స్పష్టముగా నిరాకరించెను. "ఇంత శ్రమపడి ఎందుకు వెళ్ళవలెను? కాలము గడవక పోయినచో ఇంట కూర్చొని పిండి విసురుము. హరికథ విని ఆచరణలో చూపకపోయినచో చాల పాపము." ఇట్లు చెప్పిన భార్య చాలపట్టుబట్టెను. అంతట వారు ఇరువురును హరికథా శ్రవణమునకు వెళ్లిరి. అట్లు ఒక రోజున కథ వినుట తోడనే అతని యందు పరివర్తనము కలిగి మహాభక్తుడు అయ్యెను.

# రామ్ జీ భాయి భాగవతము చదివి వైరాగ్యమును పొందెను

స్వా. ప్ర.:-నామదేవుడు పుట్టి చాలా రోజులు అయినది. ఈనాడు కూడ ఒక వారము రోజులు భాగవతము చదివి వైరాగ్యమును పొందిన మహా వ్యక్తి కలడు.

ఆయన పేరు రామ్ జీ భాయి. జామ్ నగరు నివాసస్థలము. ఆయన పోలీసు డిపార్టుమెంటులో హెడ్ గుమాస్తా. ఒక మారు ఆయన మిత్రులు ఒకాయన తన వద్ద ఒక వారము ఉండి భాగవత సప్తాహమును వినమని పట్టుబట్టెను. రామ్ జీ భాయి వారము కథ వినెను. అంతటితో ఆయన జీవితమే మారిపోయెను. భగవద్భక్తుడయ్యెను. ఆనాటి నుండియు ఆయన భగవద్భక్తుడయ్యెను. ఆయన పై అధికారి పోలీసు సూపరింటెండెంటు యూరోపియను. ఆయన కూడ జామ్ నగర్ విడచి వెళ్ళునప్పుడు రామ్ జీ భాయిని సాష్టాంగ దండ ప్రణామమాచరించి చెప్పెను. మీరు నన్ను

పాపములనుండి రక్షించితిరి. ఇట్లు చెప్పి వారికి కృతజ్ఞత తెలిపి శెలవు తీసికొనెను. రామ్ జీ భాయి తుకారాము, నరసింహ మెహతా, మొదలగు వారి త్రోవకు చెందిన వాడు.

ఇంతలో కాలా భాయి వచ్చి ఇద్దరు స్వాములకు నమస్కరించి పలికెను. "తమరు ఇరువురు వచ్చిన సమయముననే నేను రావలసి యుండెను. కాని స్నానము చేయుచుంటిని. కావున కొంచెము ఆలస్యము అయినది. అంతట లల్లూభాయి వినోదముగా పలికెను.

"మహాత్ముల వద్దకు వెళ్ళినప్పుడు పవిత్రులయి వెళ్ళవలెను కదా!" నిజమే. "పవిత్రులవకుండ మహాత్ముల చెంతకు ఏల వెళ్ళవలెను?"

లల్లూ :-పవిత్రత అనునది స్నానాదుల యందే కలదా? మరియొక విధమైనది ఏదైనా కలదా?

కాళా :— ఆ విధమైన పవిత్రతను

గురించియే నేను ఎరుగుదును. మీరు మరియొక విధమైన పవిత్రతను గురించి ఎరిగి యున్నచో చెప్పుడు.

లల్లూ:- నా కేమి తెలియును. బాపూని (స్వామివారిని) ప్రార్థించుడు. స్వామి శ్రీ నిత్యానందుల వారు డా.లల్లూ భాయిని ఉద్దేశించి పలికిరి. "ఇన్ని శాస్త్రములు చదివితిరి కదా! పవిత్రతను గురించి తెలియదా!

కాళా :-కొద్దియో గొప్పయో నాకు తెలియును. కాని తమ శ్రీముఖమునుండి ఇంకను వినవలెనని కోరికగా నున్నది.

స్వామి శ్రీ నిత్యానందుల వారు స్వామి ప్రకాశానందుల వారిని కోరిరి. "పవిత్రతను గురించి రెండు ముక్కలు చెప్పండి."

## పవిత్రత

స్వా. ప్ర.:- పవిత్రతను గురించి పారస భాగమున వ్రాయబడినది.

భగవానుడు చెప్పెను :- విరక్తుడు నాకెంత

ఇష్టుడో, అంతయే పవిత్రుడైన ప్రాణి కూడ ఇష్టుడు. ఈ పవిత్రత శరీరమునకు కాని, వస్త్రములకు కాని సంబంధించినది కాదు. జలముచే లభించు పవిత్రత అత్యంత స్థూలమైనది.

పవిత్రత నాలుగు రకములు :-

1 జీవాత్మ యొక్క పవిత్రత:- అనగా అనాత్మ పదార్థములకు భిన్నుడుగా నుండి, సర్వ పదార్థములను విస్మరించి, భగవత్స్వరూపము నందు చిత్తము లీనము చేయుట. ఇది మహాపురుషావస్థ.

2. హృదయము యొక్క పవిత్రత:- మలిన స్వభావమును పొందకుండుట. ఈర్ష్య, అభిమానము, దంభము, తృష్ణ మొదలగు దుష్ట స్వభావములను త్యజించి వినయము, సంయమము, త్యాగము, ధైర్యము మొదలగు శుభ స్వభావములను అనుసరించుట.

3. సర్వేంద్రియములను పాపముల నుండి

దూరముగా నుంచి, వానిని సంయమము నందుంచి, సంతుల ఆజ్ఞానుసారము వానిని సంచరింప జేయుట. ఇది సాత్విక పురుషులు పాటించు పవిత్రత.

4. వస్త్రములు, శరీరము మొదలగునవి శుభ్రముగా నుంచుట. ఈ స్థూల పవిత్రత అందరకును తెలిసినదియే. నిరంతరము శరీరము మాత్రము పవిత్రముగా నుంచుకొనగోరువాడు అధముడు. అది చాలా సులభమగుటయే ఇందుకు కారణము దానిచే మనస్సుకూడా సంతోషమును పొందును. అందరును అతడు పవిత్రుడని అనుకొనెదరు.

మనః పవిత్రతచే స్థూల సుఖము లభించదు. ఇతరులకు అది తెలియదు కూడను. సూక్ష్మమును, భగవానునకు మాత్రము తెలియునది అగుటచే దానియందు మానవునకు ప్రేమ కలుగదు. సామాన్య జనులు అది కష్టసాధ్యమని తలచెదరు. అయినను శరీర పవిత్రత యందు తెలివిగలవాడు యోగ్యుడుగా

చెప్పబడును. అనగా శరీర పవిత్రత కొరకు శుభ కర్మలను త్యజించరాదు. విద్యాభ్యాసము, సద్వచన విచారము, శరీరము కొరకును, బంధువుల కొరకును మంచి వృత్తిని అవలంబించుటయును, యాచించకుండుటయును మొదలగునవి శుభ కర్మలు. వానిని విడనాడి స్నానాదులు యందే ఎక్కువ సమయమును వ్యర్థము చేయరాదు. కపటము, గర్వము- వీనినుండి తనను కాపాడుకొనుచుండుట మరియొక ముఖ్య విషయము. బాహ్య శౌచము నందే అధికముగా మనస్సును ప్రవర్తింప జేయువారు తాము ఎంతయో పవిత్రుల మనుకొనుట సహజము. అందుచే వారికి గర్వము కలుగును. అకస్మాత్తుగా ఏదియైన అపవిత్ర పదార్థము పై కాలు పడినచో ఇతరులు నిందించెదరని భయపడుదురు.

స్థూలమగు పవిత్రతచే కీర్తి కలుగును. దానిచే నుత్పన్నమగు దంభమువలన బుద్ధి

నశించును. కావున దంభమును, కపటమును త్యజించుటకు స్థూల పవిత్రతను త్యజించుట యుక్తము.

నిత్యము సంశయములలో ద్రుగ్గకుండుట మూడవ విషయము. పవిత్రతచే నితరులకు దుఃఖములను కలుగనీయకుండుట నాలుగవ గమనించ దగ్గ విషయము. ఇతరులను బాధించుట మహాపాపము. స్థూల పవిత్రతకు త్యాగమునందు స్థానము లేదు. మిత్రులెవరైన కలిసికొనగోరినచో వారిని అగౌరవించుట మహాపాపము. మిత్రభావముతో నితరులను కలిసికొనుట పవిత్రత కంటె వేయి రెట్లు మించినది. ఎవరైన నీ ఆసనముపై కూర్చొనినను, నీ చెంబులోని నీరు తీసికొనినను బాధపడరాదు. వారిని నిందించరాదు. కఠిన వాక్కులు హృదయమును వేధించును. అట్టి పవిత్రత పాపము. ఇట్టి కర్మలచే గర్వము కలుగును. ప్రజలకు తాను ఎంతయో ఉపకారము చేయుచున్నా ననియును, అట్లు చేయనిచో ప్రజలు

ఏమయిపోవునో అనియును తోచును. ఈ విధముగా క్రోధముతో, దంభముతోను హృదయము అపవిత్ర మగును. కావున శరీర శుద్ధి కంటె హృదయ శుద్ధి ముఖ్యము.

శరీరము పరిశుద్ధముగా నుంచుకొనుచున్నట్లుగనే, ఆహార విహారములయందును, సంభాషణ యందును పారిశుద్ధ్యమును పాటించవలెను. ఈ పారిశుద్ధ్యము శరీర వస్త్ర పారిశుద్ధ్యముకంటె మించినది. ఎవడైన చేతులు, కాళ్ళు బాగుగ కడిగికొనినను ఆకలి లేనిదే తినినచో అజ్ఞాని యనబడును. ఏలనన ఆకలి లేనిదే తినుట అపవిత్రత. ఇక కాళ్ళు చేతులు కడిగికొనుటవలన ప్రయోజనము ఏమి? ఇది గమనించ దగ్గ విషయములలో ఐదవది.

ఇక ఆరవ విషయము. పవిత్రతను నిర్వహించుట యందు నిమగ్నుడయి ఇతర కార్యములకు హాని కలుగనీయరాదు. తన

స్నానాదుల యందు మునిగియుండి ఇతరులను తనకొరకు ఎక్కువ కాలము నిరీక్షింప జేయుటచే ఇతరులకు దుఃఖము కలుగును. ఇట్టి పవిత్రత నింద్యము.

పవిత్రత యందు కల స్థూల, సూక్ష్మ భేదములను ఇట్లు తెలిసికొని సూక్ష్మ పవిత్రతకొరకు ఎక్కువ పురుషార్థమును చేయవలెను.

అంతట రాజుగారు స్వామి వారిని ప్రశ్నించిరి. "ఇచ్చటి నుండి తమరు ఎచ్చటకు వేంచేయుదురు."

స్వా. ప్ర :- ఇచ్చటి నుండి రాజకోట వెళ్ళదలచియున్నాను.

రా:– రైలుమార్గమున పీఠడియా వెళ్లి, ఒక రాత్రి అక్కడ నుండి మోటారుపై వెళ్ళెదరా?

స్వా. ప్ర :—కాదండీ, అట్లు రాలేను.

రా: - నేటి రాత్రికి పీఠడియా దయచేసి, రేపు భిక్ష చేసిన తరువాత అచ్చటినుండి,

జేతపురము తిరిగిరాగలరా?

స్వా.ప్ర.:- అట్లుకూడ జరుగదు.

రా:- అయిన నేడే మోటార్ పంపెదను. షికారు కొరకు దానిలో పీఠడియో వరకు వెళ్ళి తిరిగి రండు.

స్వా.ప్ర:-షికార్లు తమ వంటి వారి పనులు. అది మేము చేయరాదు.

రా:- మమ్మ్మలను సంతోష పెట్టుటకు దయచేయుడు.

స్వా. ప్ర:-తమరిని సంతోష పెట్టుటకు నేను గాడిద పై కూర్చొనవలెనా! ఇది విని అందరును నవ్విరి.

స్వా||నిత్యానందుల వారు స్వా||ప్రకాశానందుల వారిని ప్రశ్నించిరి. తమరు ఇచ్చట (జేతపురము నందు)ఎన్ని రోజులు ఉందురు?

స్వా. ప్ర :- రెండు రోజులు ఉండవలెనని తలచుచున్నాను.

స్వా.ని: -- అయిన రెండు రోజులలోను ఒకరోజు మాకు దయచేయుడు అని బ్రతిమాలిరి.

స్వా. ప్రకాశానందుల వారు అలాగుననే చేసెదననిరి.

రెండవ రోజు ఉదయము స్వామి వారితో కాళాభాయి ప్రేమజీ భాయి మొదలగువారు పీఠడియో వెళ్లిరి. కాళాభాయి ప్రేమజీ భాయి పీఠడియా వచ్చినంతనే స్వామి నిత్యానందులవారు వారి ఆరోగ్యమును గురించి ప్రశ్నించిరి. ప్రేమజీ భాయి సమాధానము చెప్పెను. ఆరోగ్యము బాగుగనే ఉన్నది. పైగా తమ దర్శనముచే ఇంకను బాగుగా ఉన్నది.

# తనను దర్శించుట యందలి మహత్త్వము

స్వా.ని:—మా దర్శనముచే ప్రయోజనము ఏమి? మొదట తనను తాను చూచు కొనవలెను. దానిచే అనర్థములు అన్నియును నివృత్తిని

పొందును. ఆనందము కలుగును.

ప్రేమ :- (వినోదార్థము) నేను ప్రతి రోజును ఉదయము లేచి అద్దములో నా ముఖమును చూచుకొని ఆనందించుచున్నాను.

## ఆత్మను వివరముగా తెలిసికొనవలెను

స్వా. ప్ర. (వినోదముగా) ఈయన విరోచనుని పెద్దన్నయ్య వలె కన్పట్టు చున్నాడు. ఛాందోగ్యోపనిషత్తు సందు ఈ కథ యున్నది:-

దేవతలు, దానవులు బ్రహ్మ వద్దకు ఉపదేశమును పొందుటకు వెళ్ళిరి. బ్రహ్మగారు వారికి దహరోపాసనయును, దాని సాధనములగు బ్రహ్మచర్యాదులను ఉపదేశించిరి. పిదప సభా విసర్జన సమయమున వారలను ఉద్దేశించి పలికెను:-

***య ఆత్మాఽపహత పాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽ పిపాసః సత్యకామః సత్యసంకల్పః సోఽన్వేష్టవ్యః స విజిజ్ఞాసితవ్యః, స సర్వాంశ్చ లోకానాప్నోతి సర్వాంశ్చ కామాన్యస్త మాత్మాన మనువిద్య విజానాతీతి హ ప్రజాపతిరువాచ||***

"ఆత్మ పాప రహితము. వార్ధక్య రహితము, మృత్యు రహితము. దానికి శోకము లేదు, ఆకలి లేదు. దాహము లేదు. దాని కామము సత్యము. సంకల్పము సత్యము. దానిని శోధించుట యుక్తము. దానిని గురించి వివరముగా తెలిసికొనవలెను. అట్టి ఆత్మను సవివరముగా తెలిసికొనిన జనుడు సర్వ లోకములను సర్వ కామములను పొందును."

## ఆత్మవిద్య తెలిసికొనగోరిన అసురులు

పై విధముగా బ్రహ్మ చెప్పిన ఉపనిషత్తును దేవతలును, అసురులును వినిరి. వారు గుమిగూడి ఆలోచించిరి. "ఆత్మ

పాపాదిరహితమును, సర్వ కామములను ఇచ్చునదియును అయినచో, దానిని తెలిసికొనుట యుక్తము. కావున మనము తప్పక దానికి తెలిసికొనవలెను. మీరు అందరును (దేవతలు, అసురులును) మాకు అనుమతినిచ్చినచో మేము ఇద్దరము ప్రజాపతి వద్దకు వెళ్ళి ఈ జ్ఞానమును తెలిసికొనివచ్చి అందరకును తెలియజేయుదుము" అని అనుమతి పొంది దేవతలకు రాజగు ఇంద్రుడును, అసురులకు రాజగు విరోచనుడును బ్రహ్మ వద్దకు ఆత్మ విద్యను నేర్చుకొనుటకు సమిత్పాణులయి వెళ్లిరి. వారు 32 సంవత్సరములు బ్రహ్మచర్యమును ఆచరించిరి. అప్పుడు బ్రహ్మ వారిని అడిగెను. మీరు ఏ కోరికతో ఇచ్చటకు వచ్చిరి? వారు "**య ఆత్మాऽపహత పాప్మా**" అను వెనుకటి ఉపనిషత్తును ఉదాహరించి ప్రశ్నించిరి:- "తమరు (బ్రహ్మగారు) ఈ ఉపనిషత్తును (బ్రహ్మ విద్యను) ఎరుగుదురని మేము వింటిమి. కావున

ఈ జ్ఞానమును తమవద్ద నుండి పొందుటకు బ్రహ్మచర్యముతో నుంటిమి.

(ఈ విధముగ బ్రహ్మ విద్యా గౌరవమును, బ్రహ్మ విద్యను పొంద వలసిన పద్ధతియును తెలియ జేయుటకు ఈ ఆఖ్యాయిక చెప్పబడినది.)

## ఆత్మ అనగా బ్రహ్మము యొక్క యథార్థ స్వరూపము

***తౌ హ ప్రజాపతిరువాచ య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి హో వాచైతదమృత మభయమేత ద్బ్రహ్మేత్యథ యోఽయం భగ వోఽప్సు పరిఖ్యాయతే యశ్చాయమాదర్శే కతమ ఏష ఇత్యేష ఉ ఏ వైషు స్వర్వేష్వన్తేషు పరిఖ్యాయత ఇతి హోవాచ॥***

వారికి ప్రజాపతి చెప్పెను:-

"ఈ కంటి యందు కన్పించు పురుషుడే ఆత్మ." ఆయన ఇంకను ఇట్లు చెప్పెను:-"ఇది

అమృతము, ఇది అభయము. ఇదియే బ్రహ్మము.” అంతట ఇంద్రుడును, విరోచనుడును అడిగిరి:- “ఓ స్వామీ! ఈ జలమునందు ఎల్లెడల కన్పించునదియును, దర్పణము నందు కన్పించునదియును ఏమి?” ప్రజాపతి పలికెను:-“అదియే ఎల్లెడల కనిపించుచున్నది.”

ఇంద్రుడును, విరోచనుడును నిష్పాపులు అని అనుకొని బ్రహ్మగారు చెప్పిరి:-

అంతర్దృష్టి కలవారు, అనగా యోగ శక్తిచే నిష్పాపులయినవారు యోగముచే నేత్రములయందు చూచునది ఆత్మ. అది పాప రహితము. అమృతము. అభయ స్వరూపము. అదియే బ్రహ్మము. ఈవిషయము మీకు నేను పూర్వమే తెలిపితిని.

ఇట్లు ప్రజాపతి ఇంద్ర విరోచనులకు ఆత్మ స్వరూపమును తెలిపెను. కాని ఇంద్ర విరోచనులు అల్ప బుద్ధిచే ఛాయా పురుషుడే ఆత్మ అనుకొనిరి.

ఎదుటి మనుష్యుని కంటియందు తన ప్రతిబింబము చూచినప్పుడు కన్పించునదియే అమృతమును, అభయమును అగు ఆత్మ అని అనుకొనిరి. అదియే సత్యమని రుజువు చేసికొనుటకు ప్రజాపతిని ప్రశ్నించిరి:- "ఓ స్వామీ! నీటియందు కన్పించునదియును, దర్పణాదులయందు కాననగునదియును, మిలమిలలాడునదియును అగు పురుష రూపమేనా మీరు ఆత్మ అనునది! ఇట్టి పురుషుని మేము తెలిసి కొంటిమి. ఇది నిజమేనా?" అంతట ప్రజాపతి కొంచెము ఆలోచించి చెప్పెను:- "అవును. అవును. మీరు తెలిసికొనినది సరిగనే ఉన్నది."

## మిథ్యా భాషిత్వ దోషమును పొందకుండ 'అవును' అనిన దాని యందలి 'అవును' ను నేర్పు పద్ధతి

"మీరు తెలిసికొనినది అసత్యము అని

చెప్పినను, నేను చెప్పిన దానికి విపరీతార్థమును గ్రహించిరి అనినను వీరి ఉత్సాహము తగ్గిపోవును. పునః ప్రశ్నించరు” అని బ్రహ్మ ఉదశరా వాది దృష్టాంతములతో వారికి వివరించి తెలిపి విపరీత జ్ఞానమును నివృత్తి నొందించెను. ఇట్లు శిష్యులను రక్షించ వలెననెడు తలంపుతో ప్రజాపతి వంటి ఆచార్యుడే వారు అన్న మాటలు అవుననెను.

కొందరు ఈ సందేహమును కూడ వెల్లడించెదరు:-

“ఏమైనను ప్రజాపతి దృఢముగా “**ఏష ఉ ఏవ**” ఇదియే ఆత్మ అనుటలో అసత్యము పలుకలేదు. ఏలనన ప్రజాపతి వంటి ఆచార్యుడే అట్లు అసత్యము పలికినచో జగమంతయు మిథ్యాభాషియే అగును.”

కాని ఈ సందేహమునకు స్థానము లేదు. ఏలనన ప్రజాపతికి అది తెలియని విషయము కాదు. శిష్యులు తెలిసికొనిన ఆత్మకు విపరీతమగు

ఆత్మను ప్రజాపతి "**య ఏషో క్షిణి**" మొదలగు వానిచే అప్పుడే వివరించియుండెను. ఆయన చిత్తమునందు తాను చెప్పిన సత్య స్వరూపమగు ఆత్మయే నిహితమయి ఉండెను. ప్రజాపతి అనుభవజ్ఞుడు. అంతియే కాదు, "**సర్వేషాం చాభ్యనర్తః సర్వాన్తరః**" అని శ్రుతి కూడా చెప్పుచున్నది. అన్నిటికిని లోపల సర్వాంతరమగు ఆత్మ కలదు. ఆ ఆత్మనే "**ఏష ఉ**" అను శబ్దముచే ప్రజాపతి శిష్యులకు చెప్పెను. కావున ప్రజాపతికి మిథ్యా వాదిత్వ దోషము ఆపాదించబడదు. కాని పిల్ల వాడును, ఉపాధ్యాయుడును విహారమునకు వెళ్ళినప్పుడు పిల్లవాడు ఏనుగును చూసి "గురువుగారు! ఏనుగును చూడండి, స్తంభము వలె నున్నది." అని చెప్పి నప్పుడు "ఏనుగు స్తంభమువలె నుండునా!" అని గురువు అనినచో శిష్యుడు అగు బాలకుడు నిరుత్సాహమును పొందును. కాని గురువుగారు శాంతితో "అవును నాయనా! ఇది ఏనుగ. దీని కాళ్ళు స్తంభములవలె ఉన్నవి.

స్తంభములవంటి కాళ్ళు చేటలవంటి చెవులు, రోకలి వంటి తొండము, పెద్ద గుండ్రని దొంగవంటి శరీరము ఇవి అన్నియును కలసినచో ఏనుగ అనబడును" అని చెప్పినచో శిష్యుడు గురువు గారి ద్వారా నిజము తెలిసికొంటిని అని తలచి ఉత్సాహమును పొందును. గురువు శిష్యుడు చెప్పినది అసత్యము అని త్రోసివేయకుండ ఏనుగ యొక్క సత్య స్వరూపమును తెలుపుటయే ఇందుకు కారణము. అటులనే ప్రజాపతి తన మనస్సునందు నిశ్చయించు కొనిన ఆత్మను లక్ష్యము నందుంచుకొనియే "అవును అదియే ఆత్మ" అని పల్కెను. కాని వెంటనే ఉదశరా వాది దృష్టాంతములను కూడ ప్రారంభించెను. కావున ప్రజాపతికి మిథ్యా వాదిత్వ దోషము ఆపాదించబడదు.

# ఉదశరావము నందు ఆత్మను చూడుదు

***"ఉదశరావ ఆత్మానమవేక్ష్య యదాత్మనో న విజానీథస్తన్మే ప్రబ్రూత మితి తౌ హోదశరావేఽవే క్షాంచ క్రాతే తౌ హ ప్రజాపతిరువాచ కిం పశ్యథ ఇతి తౌ హోచతుః !" సర్వమేద మావాం భగవ ఆత్మానం పశ్యాన ఆ లో మభ్య ఆ నభేభ్యః ప్రతిరూపమితి//"***

"ఉదశరావము నందు ఆత్మను చూచి ఆత్మను తెలిసికొనలేక పోయినచో నాకు తెలుపుడు" అని ప్రజాపతి పలికెను.

అంతట వారు ఇరువురును ఉదశరావము నందు ఆత్మను అవలోకించబోయిరి. అట్లు చేసి వారు ఇట్లనిరి :- ఓ స్వామీ, ఇదంతయును ఆత్మ అని మేము తెలిసికొంటిమి. కేశములు మొదలుకొని నఖముల వరకును గల ప్రతిబింబము ఆత్మ. (ఛాయాత్మయే ఆత్మ అని

వారు తెలిసికొనిరి.)

బ్రహ్మ శిష్యులగు ఇంద్రవిరోచనులతో చెప్పెను.

మీరు జలకుండమున చూచి ఆత్మను తెలిసికొనుడు. అప్పుడు తెలియని దేమైన ఉన్నచో మీ సందేహములను నన్నడుగుడు. వారు ఇరువురును కుండమున చూచుటకు వెళ్లిరి. కాని వారు ప్రజాపతిని సందేహములు అడుగ లేదు. ఏలనన వారు ఛాయాత్మయే ఆత్మ - అనగా శరీరమే ఆత్మ అనుకొనిరి. వారు తృప్తిని పొంది వెళ్ళనుంకించిరి. "***తౌ హ శాన్త హృదయౌ ప్రవవ్రజతుః***" అని మూడవ మంత్రమున చెప్ప బడినది. ఈవిధముగ అట్టి శిష్యులు తనవద్ద నుండి విపరీతార్థమును గ్రహించి వెళ్ళుట యుక్తము కాదు. వారు ప్రశ్నించక పోయినను ప్రజాపతి విపరీతార్థమును పోగొట్టుటకు అడిగాను:—

"మీరు జలకుండమున ఏమి చూచిరి?"

వారు ఇరువురును సమాధానము చెప్పిరి.

నఖశిఖాపర్యంతమును మేము ఎట్లుంటిమో అటులనే జలకుండము నందుకూడ కన్పట్టితిమి. సరిగా మా స్వరూపమునే మేము చూడ గలిగితిమి. ఇప్పుడు మాకు ఏమియు సందేహము లేదు.

అంతట బ్రహ్మ మరల ప్రశ్నించెను.

## అనాత్మ నుండి ఆత్మ నిశ్చయమును తప్పించు యుక్తి

***తౌ హ ప్రజాపతిరువాచ సాధ్వలంకృతౌ సువసనౌ పరిష్కృతౌ భూత్వోదశ రావేఽవే క్షాథామితి తౌ హ సాధ్వలంకృతౌ సువ సనౌ పరిష్కృతౌ భూత్వోదశ రావేఽ వే క్షాంచ క్రాతే తౌ హ ప్రజాపతిరువాచ కిం పశ్యథ ఇతి॥***

"ప్రజాపతి పలికెను:- మీరు బాగుగా అలంకరించుకొని సుందర వస్త్రములను ధరించి, నఖములను, కేశములను సరిచేసికొని జల

కుండమునందు చూడుడు.” వారు ఇరువురును బాగుగా అలంకరించుకొని, సుందర వస్త్రములను ధరించి, నఖ, కేశములను, సరిచేసి కొని జలకుండము నందు చూచిరి. ప్రజాపతి వారిని ప్రశ్నించెను:-“మీరు ఏమి చూచుచున్నారు.”

వారి ఇరువురకును ఛాయ, దేహము మొదలగు అనాత్మ పదార్థములయందు ఆత్మదృష్టి లేకుండ జేయుటకు ప్రజాపతి ఒక యుక్తి పన్నెను. మీరు మొదట ఉన్నవారు ఉన్నట్లుగా చూచిరి కదా! ఇప్పుడు అలంకరించుకొని చూడుడు అని చెప్పెను. ఇట్లు చేయమనుటలో ప్రజాపతి యొక్క ఆశయము మొదట కన్పించని అలంకారాదులు ప్రతిబింబము నందు కన్పించుటకు గల కారణము శరీర సంబంధము మాత్రమే అని తెలుపుటయే. ధరించిన తదుపరి ప్రతిబింబమునందు చూచి అవి అన్నియును ఆగంతుకము లేనని తెలిసి కొనబడును. దేహాదుల ఛాయ కూడ మొదట కన్పించెను. కాని

పరిష్కరింపబడుటచే (ఛేదించబడుటచే) నఖ, కేశాదులు కన్పించవు. కావున వాని ఛాయ కూడ కన్పించదు. ఇట్లు కేశనఖాదులకు ఆగమాపాయిత్వము కలదు. కేశాదులకు వలెనే దేహమునకు కూడ ఆగమాపాయిత్వము ఉండుటచే అనాత్మ అని తెలియనగును. అంతియే కాదు, ఆగమాపాయిత్వము కల సుఖ, దుఃఖ, రాగ ద్వేషాదులు కూడ అనాత్మ పదార్థములు అని తెలియును. ఆశయముతో ప్రజాపతి పై మంత్రము తెలిపెను:-

***"తౌ హోచతుర్య థైవేద మావాం భగవః సాధ్వలంకృతౌ సువసనౌ పరిష్కృతౌ స్వ ఏవమేవే మౌ భగవః సాధ్వలంకృతౌ సువసనౌ పరిష్కృతా విత్యేష ఆత్మేతి హోవాచ ఏత ద మృత మభయమేత ద్బ్రహ్మేతి తౌ హ శాన్త హృదయౌ ప్రవ వ్రజతుః॥"***

వారిరువురును చెప్పిరి:- "ఓ స్వామీ! మేము ఇరువురమును అందమగు ఆ భూషణములతో, సుందర వస్త్రములతో,

ఛేదించబడిన నఖ కేశములతో నుంటిమి. అటులనే సుందర భూషణములతోను, వస్త్రములతోను ఛేదించబడిన నఖ కేశములను కూడిన ఈ ఛాయయే ఆత్మ” అనిరి. “ఇది అమృతము, అభయము, ఇది బ్రహ్మము” అని ప్రజాపతి చెప్పెను. ఇరువురును శాంత హృదయులై వెళ్ళిబోయిరి.

వీరి వివేకము స్వకీయములగు దోషములచే ప్రతి బద్ధము అని ప్రజాపతి కనుగొనెను. ఈ చక్షువుద్వారా చూచునది ఆత్మ అని సాక్షాత్తు ఆత్మను నిర్దేశించినను తెలిసికొన లేకపోయిరి. జల దృష్టాంతముచే విపరీతార్థ గ్రహణమును పోగొట్టదలచినను పోలేదు. అయినను ప్రజాపతి స్వాభిమతముగు ఆత్మ స్వరూపమును మనస్సునందిడి కొని ఇది ఆత్మ, ఇదియే అమృతము, అభయము, బ్రహ్మము అని చెప్పెను. ఇంకను వారి విపరీతార్థ గ్రహణము పోవుట లేదు. తన వాక్యములను గురించి తత్త్వవిచారము

చేసిన వారికి కల ప్రతి బంధము క్షయమును పొంది తమంతటట తామే వారు ఆత్మ యొక్క సత్య స్వరూపమును తెలిసికొనగలరు. ఇంకను కొన్ని సంవత్సరములు ఇచ్చటనే ఉండుడని చెప్పినచో వారు దుఃఖించెదరు. ఇట్లు తలచి ప్రజాపతి ఉపేక్షించెను. ఇంద్ర, విరోచనులు శాంత హృదయులై వెళ్ళిపోయిరి. వారికి సంతోషము కలిగెను. కాని సందేహ నివృత్తి కలుగ లేదు. సందేహ నివృత్తి కలిగినచో విపరీతార్థ గ్రహణము ఉండదు కదా! ఆత్మ యొక్క సత్య స్వరూపమున తెలిసికొనినచో వారి సందేహము నివృత్తిని పొందును. అది ఇంకను వారు తెలిసికొనలేరు. మిథ్యా జ్ఞానముచే సంతోషము కలిగెను. అది కూడ ఆభాసమే.

## సాత్విక వృత్తి కల వారి తెలివి

***"తా హాన్వీక్ష్య ప్రజాపతి రువాచానులభ్యాఽఽత్మాన మనువిద్య వ్రజతో యతర ఏతదుపనిషదో భవిష్యన్తి దేవా వాఽసురా వా తే పరాభవిష్యన్తీ తి స హ శాన్త హృదయ ఏవ విరోచనోఽసురాఞ్జగామ తేభ్యో హైతాముపనిషదం ప్రోవాచాఽఽత్మైవేహ మహయ్య ఆత్మా పరి చర్య ఆత్మానమేవేహ మహయన్నాత్మానం వరిచరన్నుభౌ లోకావవాప్నో తీమం చాముం చేతి//"***

ఇంద్ర విరోచనులు వెళ్ళుచుండుట చూచి ప్రజాపతి పలికెను. మీ ఇరువురిలో ఎవరైనను ఆత్మను తెలిసిన కుండగను, ఆత్మను పొందకుండ వెళ్ళినచో వెళ్లిన వారి స్నేహితులు దేవతలయినను అసురులయినను పరాభవమును పొందుదురు.

బ్రహ్మ పలికిన ఈ పలుకులు వినకుండ విరోచనుడు సంతృప్తిని పొంది వెళ్ళెను. ఆతడు తన స్నేహితులగు అసురులకు విపరీతార్థమునే బోధించెను.

# ఇరువది తొమ్మిదవ ప్రసంగము

"ఈ ప్రపంచమున శరీరమే పూజించదగినది. ఇదియే ఆత్మ. ఈ శరీరమే సేవించదగినది. ఈవిధముగా ఈ శరీరమే ఆత్మ అని పూజించు జనులు ఈ లోకమును, పర లోకమును కూడ పొందెదరు."

***"అథ హేన్ద్రోऽ ప్రాప్యైవ దేవానేతద్భయం దదర్శ, యథైవ ఖల్వయమస్మిన్ శరీరే సాధ్వలంకృతే సాధ్వలంకృతో భవతి సువసనే సువసనః, పరిష్కృతే పరిష్కృతః, ఏవమేవాయమస్మిన్నన్ధేऽన్ధో భవతి స్రామే స్రామః పరివృక్ణే, పరివృక్ణోऽస్యైవ శరీరస్య నాశ మన్వేష నశ్యతి, నాహమత్ర భోగ్యం పశ్యామీతి//"***

ఇంద్రుడు సాత్త్వికుడు. అతడు కొంచెము దూరము వెళ్లిన తరువాత ఏకాంతమున కూర్చుండు మననము చేసికొనెను. అంతట నాతనికి భయము వేసెను. ఆతడు గురువు గారి వాక్యములను గురించి ఇట్లు తర్కించెను. "ఈ

శరీరమే ఆత్మ అయినచో శరీరము అలంకరించబడి నప్పుడు ఆత్మకూడ అలంకరించబడును; గంధ, పుష్పాదులచే శోభించునప్పుడు ఆత్మకూడ శోభించును; కండ్లు పోయినప్పుడు అంధత్వము పొందును; కాళ్ళు చేతులు పోయినప్పుడు ఆత్మకు కూడ అవయవ వైకల్యము తటస్థించును; శరీరము నశించినప్పుడు ఆత్మకూడ నశించును. ఆత్మ ఇటు వంటిది అయినచో పారలౌకిక భోగము అను దానికి అర్థము లేదు ఆత్మ ఈ శరీరముతో బాటు చనిపోవును. కావున నేను పొందిన నా జ్ఞానమునందే ఏదియో లోపము కలదు. ఇది ఆత్మ అయి ఉండదు." అని తలచి దేవతల చెంతకు వెళ్ళకుండగ వెనుకకు మరలి వచ్చి చెప్పెను.

***"స సమిత్పాణిః పునరేయాయతం హ ప్రజాపతిరువాచ మఘ వన్యచ్ఛాన్త హృదయః ప్రావ్రాజీః సార్థం విరోచనేన కిమిచ్ఛన్పునరా గమ ఇతి స హోవాచ యథైవ ఖల్వయం భగవోఽస్మిన్ శరీరే సాధ్వలం కృతే సాధ్వలం కృతో భవతి సువసనే సువసనః పరిష్కృతే పరిష్కృతః, ఏవమేవాయ మస్మిన్నన్ధేఽన్ధో భవతి, స్రామే స్రామః, పరివృక్ణే, పరివృక్ణోఽస్యైవ శరీర స్య నాశ మన్వేష నశ్యతినాహమత్ర భోగ్యం పశ్యామీతి॥"***

చేతిలో సమిధలు తీసికొని, బ్రహ్మచర్యమును స్వీకరించి, విద్యార్థి రూపమున వచ్చిన ఇంద్రుని చూసి ప్రజాపతి పలికెను.

"ఓ ఇంద్రా నీవు కూడ శాంత హృదయుడవై విరోచనునితో వెళ్లిపోయితివి కదా! ఇప్పుడు ఏమి తెలిసికొనవలెనను కోరికతో వెనుకకు మరలి వచ్చితివి?"

ఇంద్రుడు చెప్పెను:-"ఓ స్వామి! ఈ

శరీరము అలంకరించు కొనినచో ఆత్మ అలంకారయుక్త మగుచున్నది. శరీరమునకు అంగ వైకల్యము తటస్థించిన ఆత్మకు కూడ అంగ వైకల్యము కలుగుచున్నది. శరీరమునకు అంధత్వము కలిగిన ఆత్మకు కూడా అంధత్వము కలుగు చున్నది. శరీరము నశించిన ఆత్మ నశించుచున్నది. అనంతరము ఇందు భోగము అనునది ఉండట లేదు.

## ప్రతి బంధ నివృత్తికి బ్రహ్మచర్యము

**"*ఏవమేవైష మఘవన్నితి హోవాచైతం త్వేవ తే భూయోఽ నువ్యాఖ్యాస్యామి వసాపరాణి ద్వాత్రిగ్ంశతం వర్షాణీతి, స హాపరాణి ద్వాత్రిగ్ం శతం వర్షాణ్యువాస తస్మై హోవాచ.*"**

ప్రజాపతి చెప్పెను:- ఓ ఇంద్రుడా! నీవు చెప్పింది నిజమే. కావున నేను నీకు ఇంకను ఆత్మయొక్క సత్య స్వరూపమును గురించి వివరించవలసియున్నది. నేను సరిగా చెప్పినను

నీకు తెలియలేదు. ప్రతి బంధ నివృత్తి జరుగనిదే నేను చెప్పినది నీకు సరిగా తెలియదు. కావున దోష నివృత్తి కొరకు మరి 32 సంవత్సరములు బ్రహ్మచర్యముతో నుండుము. ఇంద్రుడు అంగీకరించి ఇంకను 32 సంవత్సరములు ప్రజాపతి సన్నిధానమునందు బ్రహ్మచర్యముతో నివసించెను. ఆతని దోష నివృత్తి అయినంతనే ప్రజాపతి పలికెను:-

## స్వప్నాత్మ బ్రహ్మము కాదు

***"య ఏష స్వప్నే మహీయమానః చరత్యేష ఆత్మేతి హోవాచ ఏతద మృత మభయమే తద్ బ్రహ్మేతి సహ శాన్త హృదయః ప్రవవ్రాజ న హాప్రాప్యైవ దేవా నేతద్భయం దదర్శ తద్యద్యపీదగ్ం శరీరమన్ధం భవత్యనన్ధః స భవతి యదిస్రామమస్రామోన వైషోఽయం దోషేణ దుష్యతి//"***

"స్వప్నము నందు పూజింపబడుచు, మహిమ సమన్వితమయి సంచరించునది ఆత్మ.

ఇది అమృతము, అభయము, బ్రహ్మము” అని పలికెను. అటు తరువాత ఇంద్రుడు శాంతహృదయుడై బయలు దేరును. కాని దేవతలను చేరకుండగనే ఇంద్రునకు సంశయముచే భయము కలిగెను. “శరీరమునకు అంధత్వము కలిగినను స్వప్నమునందు అంధత్వము కలుగుట లేదు. శరీరమునకు కాలు, చెయ్యి మొదలగువాని సామర్థ్యము తగ్గినను స్వప్నమునందు తగ్గుట లేదు. శరీర పాటవము తగ్గినను ఆత్మ పటుత్వ హీనమగుట లేదు. శరీర దోషముచే ఆత్మ దూషిత మగుట లేదు. స్వప్నము నందు తన శరీరము నశించుట కూడ ఆత్మ చూచుచునే యున్నది. శరీరము వధించబడుచున్నను ఆత్మ వధించ బడుట లేదు. ఆరంభమునందు అక్షిపురుషుడుగా తెలిసికొనబడిన ఛాయాత్మ నశించును. కావున నా జ్ఞానము అసంపూర్ణము. ఇంకను సందేహ నివృత్తి కొరకు వివరముగా తెలిసికొన వలెను” ఇట్లు

తలచి ఇంద్రుడు దేవ లోకమునకు వెళ్ళకుండగనే వెనుకకు మరలెను. సమిత్పాణి అయి ప్రజాపతిని సమీపించెను. ప్రజాపతి అతనిని వెనుకటి వలెనే ప్రశ్నించెను:-

"ఓ ఇంద్రా నీవు తత్త్వార్థమును తెలిసికొని శాంత హృదయుడవయితివి కదా! సందేహ నివృత్తిని పొందిన పిదప కూడ మరల ఏల వచ్చితివి?"

ఇంద్రుడు పలికెను:-"స్వామీ! నేను తెలిసికొని స్వప్నాత్మ శరీరము అంధత్వమును పొందినను అంధత్వము పొందుట లేదు. అయినను నాకు స్వప్నాత్మ యందు కూడ భోగములు కన్పట్టుట లేదు. ఏలనన సుషుప్తి యందు స్వప్నాత్మ యుండదు. కావున ఆ స్వప్నాత్మ తత్త్వము కాదా అని తోచుచున్నది."

ప్రజాపతి ఇట్లు పలికెను:- అవును. అటులనే, ఇంకను నీవు యధార్థమగు ఆత్మ తత్త్వమును తెలిసికొనలేదు. నేను సరిగా చెప్పినను

నీ బుద్ధి యందలి ప్రతి బంధముచే నీకు వస్తు పరిజ్ఞానము కలుగుట లేదు. ఆ ప్రతి బంధము పోయిన పిమ్మట నీకు తెలిపెదను.

## సుషుప్త్యాత్మ బ్రహ్మము కాదు

తరువాత ఇంద్రుడు మరి ముప్పది రెండు సంవత్సరములు బ్రహ్మచర్యముతో నివసించెను. అంతట బ్రహ్మ చెప్పెను:-

***"తద్య త్రైతత్ సుప్తః సమస్తః సంప్రసన్నః స్వప్నంన విజానాత్యేష ఆత్మేతి హోవాచ ఏతదమృత మభయమేతద్ బ్రహ్మేతి స హ శాన్త హృదయః ప్రవవ్రాజ, స హాప్రాప్యైవ దేవానేతద్భయం దదర్శ న హి ఖల్వయమేవగ్ంం సగ్ంం ప్రత్యాత్యానం జానాత్యయమహమస్మీతి నో ఏవే మాని భూతాని వినాశ మేవాపీతో భవతి నాహమత్ర భోగ్యం పశ్యామీతి॥"***

ఇది నిద్రించినప్పుడు కర్మేంద్రియములును, జ్ఞానేంద్రియములును అన్నియును లయమును

పొందినప్పుడు ఉన్న స్వప్నమును కూడ ఎరుగని ఆత్మయే ఆత్మ. అది అమృతము, అభయము, బ్రహ్మరూపాము. ఈ వాక్యమును విని ఇంద్రుడు శాంతహృదయుడయి బయలు దేరును. కాని పూర్వము వలెనే దేవతల దరిజేర కుండగనే ఆతనికి భయము కలిగెను. సరిగా ఇంకను ఆత్మయొక్క సత్య స్వరూపమును తెలిసికొనలేకపోతిని అనుకొనెను.

సుషుప్తి యందుకూడ ఈ భూతములవలెనే ఆత్మకూడ వినాశమును పొందును. అది కన్పించదు. కావున అను భోగ్య పదార్థము ఏదైన ఉన్నట్లు తొచదు. ఈవిధమగు సందేహము మరల కలుగుటచే సమిత్పాణియయి ఇంద్రుడు మరల ప్రజాపతిని సమీపించెను. ప్రజాపతి “ ఓ ఇంద్రా, శాంతహృదయుడవయి వెళ్ళితివి కదా! మరల ఏల వచ్చితివి? ఇంద్రుడు కూడ వెనుకటివలెనే సమాధానము చెప్పెను. అవును, నిజమే. కాని సుషుప్తి కాలమందలి ఆనందమును అనుభవించు భోక్త కూడా నశించునని తమరే సెలవిచ్చితిరి

కదా! అయిన యథార్థమగు ఆత్మ స్వరూపము నాకు తెలియనే లేదు. కావున నాకు ఆత్మ యొక్క యథార్థ స్వరూపమును తెలయజేయుడు. అప్పుడు ప్రజాపతి పలికెను:- “ఓ ఇంద్రా! ఇక నీ బుద్ధి యొక్క ప్రతి బంధము కొంచెమే ఉన్నది. ప్రథమమున చెప్పిన తత్త్వమునే నేను రెండవ మారును మూడవ మారును చెప్పితిని. ఇప్పుడు నాలుగువ మారు చెప్ప వలసి యున్నది. కానీ నీవు ఇంకను ఐదు సంవత్సరములు బ్రహ్మచర్యమును జరిపినచో అప్పుడు నీకు సత్వ స్వరూపమును తెలిపెదను.” ఆవిధముగనే ఇంద్రుడు 5 సంవత్సరములును బ్రహ్మచర్యము నిర్వహించెను. అప్పటికి 101 సంవత్సరములు గడచెను.

## బ్రహ్మ విద్యా ప్రాప్తికి 101 సంవత్సరములు బ్రహ్మచర్యమును ఆచరించవలెను

ఈ విషయమున శ్రుతి చెప్పుచున్నది:-

***"తాన్యేకశతగ్ం సంమేదురేత త్తద్యదాహురేకశతగ్ం హవై వర్షాణి మఘవన్ప్రజాపతౌ బ్రహ్మచర్యము వాస తస్మై సహోవాచ //"***

ఈవిధముగా నూట ఒక సంవత్సరములు గడచెను. కావుననే ఆర్యులు ప్రజాపతి వద్ద నూట ఒక్క సంవత్సరములు బ్రహ్మచర్యముతో గడపి ఇంద్రుడు బ్రహ్మ విద్యను పొందెనని చెప్పెదరు. బ్రహ్మ విద్యను ఇట్లు స్తుతింతురు, ఇంద్రుడు వంటి దేవరాజే ఆత్మజ్ఞానమును పొందుటకు నూట ఒక సంవత్సరములు బ్రహ్మకు శిష్యరికము చేయవలసి వచ్చినచో అంతకంటే నెక్కువ పురుషార్థము చేయగలవాడు ఎవడైన కలడా?

## 101 సంవత్సరములు అనగా అర్థము

పైన 101 సంవత్సరము బ్రహ్మచర్యం పాటించవలెనని తెలుపబడినది. కొందరకు

సందేహము కలుగవచ్చును. “**శతాయుర్వై పురుషః**“ అని చెప్ప బడినది. మనుష్యుని ఆయుర్దాయము నూరు సంవత్సరములు కదా! ఈ ఆయువు అంతయును పైన ఒక సంవత్సరమును ఎక్కడనుంచి లభించును? 101 సంవత్సరములు ఇంద్రుడు ప్రజాపతి వద్ద బ్రహ్మవిద్యను పొందుటకు పరిశ్రమ చేయుచునే ఉన్నచో ఇంద్రుడు రాజ్యమును ఎప్పుడు చేసెను? ఇతర కర్మలను ఎప్పుడాచరించెను? దీనికి సమాధానము చెప్పవలెను.

పండితులు యుక్తితో ఏదో విధముగ సమాధానము చెప్పి వేయుదురు. దేవతల సంవత్సర మానము వేరు. “**శతాయు దేవః**” అన యున్నను వారి నూరు సంవత్సరముల కాలము చాలా దీర్ఘముగా నుండును. మొదలగునవి చెప్పెదరు. కాని ఈ యుక్తి సరియైనది కాదు. ఇంద్రుడు కూడ శతాయువే అనుకొనినచో బ్రహ్మచర్య కాలమున ఆతడు దేవలోకము నందే

యుండుటచే నీ ఆయుర్ధాయము కూడ పూర్తి అయిపోవును.

దేవతలు అమరులు. వారి ఆయువునకు అంతము లేదు. "**అమాప సోమమమృతా అభూమ**" "మేము సోమపానము చేసితిమి. కావున అమృతరూపులము అయితిమి." అను వాక్యమును ఆధారముగా చేసికొని ఈ అనంతమగు ఆయుర్దాయమునుండి 101 సంవత్సరములు బ్రహ్మచర్యము ఆచరించెనని చెప్పుదమనినను సరికాదు. ఈ అమృతత్వము సరియైనది కాదు. "దేవతల అమృతత్వము కూడ సాపేక్షికమే." అని భాష్యా కారులు చెప్పిరి. యధార్థమునకు అన్నియను క్షయమును పొందును. ఆత్మ తక్క మిగిలినవి అన్నియును మరణ ధర్మము కలవి. కావున పై సందేహమునకు నివృత్తి అవసరము. మాదృష్టిలో శాస్త్ర సమ్మతమగునది ఇట్లని తోచుచున్నది. పూర్వ మీమాంసయందు సంవత్సర శబ్దము దివస వాచకము. ఈవిషయమున జైమినీయము,

6వ అధ్యాయము, 7 పాదమునందలి 31 సూత్రము నుండి 40వ సూత్రము వరకు ఒక స్వతంత్ర అధికరణము ఉన్నది. అచ్చట ఈ విషయమున సందేహము వెల్లడించబడినది. ఎట్లనిన:-

కొన్ని కర్మలు సహస్ర సంవత్సర పర్యంతము చేయవలెనని వేదమున చెప్పబడినది.

“**సహస్ర సంవత్సరం తదాయుషా మసంభవాన్మనుష్యేషు**.” అని యున్నది. వేయి సంవత్సరములు చేసి సాధించవలసిన కర్మలు వేదమునందు చెప్ప బడినవి. అంత ఆయుర్దాయుము మనుష్యునకు లేదు. కావున ఈ కర్మలను ఆచరించు అధికారము గంధర్వాదులగు దేవతలకే కలదా? లేక మనుష్యులకు కూడ కలదా? అను సందేహమును వెల్లడించి పూర్వపక్షముగా ఈ సూత్రము చెప్పబడినది. మనుష్యులకు ఇంత ఆయువు లేనందున ఈ కర్మలు ఆచరించుట సంభవము కాదు అని చెప్ప

బడెను. దీనికి పూర్వపక్షముగా అనంతర సూత్రము కలదు:-

***"అపి వా తదధికారా న్మనుష్య ధర్మః స్యాత్."***

కర్మలయందు మనుష్యులకు అధికారము ఉండుటచే సహస్ర సంవత్సర సాధ్యములగు కర్మలను ఆచరించు అధికారము కూడ మనుష్యులకు కలదు. మీమాంసా శాస్త్ర సమ్మతములగు అధికారి లక్షణములు గంధర్వాదులు యందు కానరావు మనుష్యులయందే కలవు. కావున మనుష్యులే అధికారులు, తరువాత నున్న ఒక సూత్రమును ఆధారముగా తీసికొని దీనిపై కూడా సందేహమును వెల్లడించెదరు.

"రసాయనాదులను సేవించుట ద్వారా వేయి సంవత్సరములు ఆయుర్దాయమును పొందగల మనుష్యులు అధికారులా?" "వేయి సంవత్సరముల వరకును జీవింపజేయు శక్తి రసాయనములకు కూడ లే" దనియే దానికి సమాధానము. ఈ విధముగా సహస్ర సంవత్సర

శబ్దమునందే గౌణత్వ కల్పన చేయవలసి వచ్చును. లావుకాయనుడను ఆచార్యుని అభిప్రాయమును 37 వ సూత్రమునందు ఉదహరించి శబరస్వామి సంవత్సరమునకు గౌణత్వమును కల్పించుట యుక్తమని ధృవపరచు చున్నారు.

**“అహాని చాభి సంఖ్యత్వాత్”**

సంవత్సరము అనగా ఒక రోజుగా గ్రహించవలెను. ఈవిధముగా మీమాంసయందు సంవత్సర శబ్దము దివస వాచకము స్పష్టము అయినది. అయిన ఆ కర్మలయందు వేయి సంవత్సరముల ఆయుర్దాయము కల గంధర్వాదులకు అధికారము కలదా? మనుష్యులకు కలదా అను సందేహము కలుగును. మనుష్యులకే అధికారము కలదనినచో మరల సందేహము ఉన్నది. రసాయనమును సేవించి వేయి సంవత్సరముల మానవులు జీవించినచో అట్లు సేవించువారికే అధికారము

కలదని తేలును. రసాయనములు అగ్ని వర్ధకములు, వార్ధక్యమును పోగొట్టును. స్వర, వర్ణాదులను బాగు చేయును. అంతే కాని ఆయువును ఇవ్వ లేవనునది దీనికి సమాధానము. "శతాయుర్వై పురుషః" అను శ్రుతికూడ మనుష్యునకు శతవర్షములు మాత్రమే ఆయుర్ధాయుము అని చెప్పుచున్నది. ఒక వేళ ఎవరైన నూరుకంటె ఎక్కువ సంవత్సరములు బ్రతికి యున్నను వేయి సంవత్సరముల ఆయుర్ధాయము సమర్థించుటకు వీలు పడదు. కావుననే వెనుకటి సిద్ధాంతము నందు సంవత్సర శబ్దము దివస వాచకమని నిర్ధారణ చేయబడింది. అనగా సహస్ర సంవత్సరములకు బదులుగా వేయి రోజులు ఆచరించవలసిన కర్మ అని గ్రహించవలెను. అదే విధముగా ఇచ్చట కూడ 101 సంవత్సరములకు బదులుగా 101 రోజులు ఇంద్రుడు ప్రజాపతి దగ్గర బ్రహ్మచర్యమును ఆచరించెను అని చెప్పినచో ఎంతయో యుక్తియుక్తముగ ఉండును అని తోచుచున్నది.

ఇప్పుడు ఆత్మ తత్త్వమును గురించి ఇంద్రునకు ప్రజాపతి చెప్పెను.

## ఆత్మకు భోగాధిష్ఠానమగు శరీరము

***"మఘవన్ మర్త్యం వా ఇదగ్ం శరీరమాత్తం మృత్యునా తదస్యామృతస్యా శరీరస్యాఽఽత్మనోఽధిష్ఠామాత్తో వై సశరీరః। ప్రియా ప్రియాభ్యాం న వై సశరీరస్య సతః ప్రియా ప్రియయోరపహతి రస్త్యశరీరం వావ సన్తం న ప్రియాప్రియే స్పృశతః॥"***

"ఓ ఇంద్రుడా, శరీరము మృత్యు ధర్మము కలది. మృత్యువు దీనిని నశింపజేయును. ఇది అమృత స్వరూపమును, శరీరాదిరహితమును అగు ఆత్మకు భోగాధిష్ఠానము. సత్స్వరూపమగు ఈక్షణకర్త యొక్క తేజో, జల, పృథి వ్యాది క్రమమున ఉత్పన్నమయిన భోగాధిష్ఠానము, లేదా "***అనే న జీవే నాత్మనాఽ ను ప్రవిశ్య***" అను శ్రుతిని అనుసరించి జీవరూపమున ప్రవేశించిన ఆత్మాధిష్ఠానము. ఈ శరీర యుక్తమగు ఆత్మ

అనగా సశరీరుడుగు జీవుడు ప్రియా ప్రియములకు బద్ధుడగును. సశరీరుడయినంత కాలము అనగా శరీరాభిమానిగా నున్నంత కాలము ప్రియా ప్రియముల నివృత్తి కలుగదు. "***అశరీరం వా***" అను శ్రుతినిబట్టి శరీరాభిమానమును త్యజించి జీవించువానిని ప్రియా ప్రియములు స్పృశించవు.

ఈవిధమగు ఆత్మతత్త్వమును ప్రథమమునే "***య ఆత్మా అప హతపాప్మా, విజరో, విమృత్యుః***" మొదలగు శబ్దములచే ప్రజాపతి ఇంద్రునకు ఉపదేశించెను. దానినే నాలుగవ మారు కూడ తెలిపెను.

శుక్లపక్షపు పాడ్యమి రోజున చంద్రుడు కన్పించినప్పుడు సంపూర్ణ శక్తి యుక్తుడగు వ్యక్తి, తాను చంద్రుని చూసి, ఇతరులకు చూపు నప్పుడు శాఖా చంద్ర న్యాయమున చూపించును. ఇదిగో.. చూడుము నా వ్రేలుపై చంద్రుడు ఉన్నాడు... నా వ్రేలు చివరకు తిన్నగా చూడుము, అక్కడ ఇంటి కప్పు ఉన్నది కదా! అక్కడే చంద్రుడు ఉన్నాడు...

అబ్బే కాదు. కప్పునకు కుడివైపున చూడుము. చెట్టు ఉన్నది. ఆ చెట్టు చంద్రుడు అనును. తరువాత ఆ చెట్టు కాదు. చెట్టు యొక్క కుడి వైపు కొమ్మ చంద్రుడు అని చెప్పును. అనంతరము కొమ్మ కాదు. కొమ్మమీద చంద్రుడు కలడని తెలుపును.

ఇట్లు చెప్పుట యందలి ఉద్దేశ్యము శుద్ధమైనదే. చేతి వ్రేలు చంద్రుడు అని నంత మాత్రమున వేలు చంద్రుడు అయిపోదు. చంద్రుడు చంద్రుడే. ప్రథమ పర్యాయము తెలిపిన చంద్రునే చతుర్థ పర్యాయము కూడ తెలిపెను.

అటులనే ప్రథమమున ఇంద్ర విరోచనులకు ప్రజాపతి చెప్పిన దానిని విరోచనుడు పూర్తిగా తెలిసికొనకుండగనే వెళ్ళిపోయెను. ఆ ఆత్మనే ఇంద్రుడు తెలిసికొనుటకు చివరివరకును ప్రయత్నించెను. తిరిగి తిరిగి ప్రశ్నించెను. ప్రజాపతి కూడ ఆ ఆత్మనే తెలిపెను.

కాళా:—ప్రేమజీ భాయి వైష్ణవుడు. వారికి

వేదాంత విషయములను ఉపదేశించినచో నచ్చునా?

## వసుదేవ పరాయణులగు వైష్ణవులు

స్వా. ప్ర.:- (వినోదముగా) మీరు వైష్ణవులు కారా?

***వైష్ణవ బహువః సన్తి వసుదేవ పరాయణాః|***
***వైష్ణవా విరళాః సన్తి వాసుదేవ పరాయణాః||***

"నేడు వసు-అనగా ధనమును దేవుడుగా భావించి దాని కొరకే ఆలోచించుచునుండు వైష్ణవులు చాల మంది ఉన్నారు. కాని వాసు దేవ పరాయణులగు- కృష్ణ భక్తులగు వైష్ణవులు చాల తక్కువ."

చాలమంది తాము వైష్ణవులమని గర్వపడెదరు. ఉదయముననే లేచి స్నానము మాలలు త్రిప్పుదురు. గీతా పాఠము చేయుదురు. మందిరములకు వెళ్ళి భగవద్దర్శనము చేయుదురు. కాని ఉదయమునుండి సాయంకాలము వరకు ధనమును ఎక్కువగా

సంపాదించుట ఎట్లు అని ఆలోచించుచునే యుందురు. రోజంతయు అన్ని విధములగు ప్రవృత్తులను కలిగియుందురు. గీతయందు అసుర సంపదగా వివరించబడిన నిషిద్ధములగు వైభవ విలాసములను ఎల్లప్పుడును సేవించుచుందురు.

గీతయందు చెప్పబడినట్లు గనే "**అన్యాయేవార్థ సంచయం**" మోసము, కపటము చేసి అన్యాయముగా ధనమును సంపాదించెదరు. ఈ విధముగా వేలు, లక్షలు రూపాయిలు సంపాదించుచున్నను, వారికి సంతోషము కలుగదు. ఇంకను ఎక్కువ ధనమును సంపాదించవలెనని ప్రయత్నించుచునే యుందురు.

ప్రేమజీ:-(వినోదార్థము) కాళి భాయికి ఒక దుకాణము కలదు. వేరొక దుకాణము ప్రారంభించ ప్రయత్నించుచున్నారు.

కాళా:- ఏమి చేయుదును? రోజు గడచిపోవుచున్నది. కాని సుఖముగా కాలక్షేపము చేయుటకు తగినంత దొరుకుట లేదు.

స్వా.ప్ర.:-రోజు గడచుచున్నది కదా!

కాళా:- ఏదో విధముగా గడచుచున్నది.

స్వా. ప్ర. :-గడచుచున్నదా అయితే ఇంకను సంతోషించకుండుటకు కారణమేమి?

కాళా:- సంతోష లక్షణ మేమి?

స్వా. ప్ర. :-

***యదృచ్ఛా లాభతో నిత్యం ప్రీతిర్యా జాయతే నృణామ్ /***
***తం సంతోషం విదుః ప్రాజ్ఞాః పరిజ్ఞానైక తత్పరాః//***

"మనస్సునకు యాదృచ్ఛికంగా కోరినది లభించినచో దానివల్ల కలుగు ప్రీతి - ప్రసన్నతా విశేషము (రాగ విశేషము కాదు) దానికి సంతోషము అని జ్ఞాన సంపాదనాతత్పరులగు విద్వాంసులు చెప్పుదురు."

# సంతోష మహాత్మ్యము

సంతోషమును గురించి పారస భాగమున చెప్పబడినది:-

ధర్మమునకు మూలము త్యాగము. కాని అది సంతోషము లేనిదే సాధ్యము కాదు. కావుననే సంతోషము అనగా “త్యాగార్థము” అని మహాపురుషులు చెప్పిరి. ఉత్తమ స్థానములు అన్నియును సంతోషముతోనే లభించును. ప్రభువు చెప్పెను “ నేను సంతోషమునకు దగ్గరగా నున్నాను. నా సహాయమును దయయును సంతోషమునకు సమర్పించుచున్నాను. వ్రతము, తపముచేయక పోయినను సంతోషము పొందిన వాడు నిర్భయముగా నుండును.”

# సంతోష లక్షణము

భోగేచ్ఛ అసుర వృత్తి. దానినుండి నివృత్తిని పొందవలెనను కోరిక దైవ వృత్తి. మొదటి వాసన స్తంభము. రెండవది ధర్మ స్తంభము. ఈ రెండు వృత్తులకును ఎల్లప్పుడు పోరాటము జరుగుచుండును. బలము కల వృత్తి జయించుచుండును. ధర్మమునందు ముందుకు అడుగు వేసి భోగములను వశపరచుకొనినచో అంతిమ విజయమును సాధించును. ఈ యుద్ధము మనస్సు యొక్క యుద్ధము. ధర్మమును ధ్రువపరచుటలో ముందుకు అడుగు వేయుటయే సంతోషము.

బాల్యమునందు హృదయపు కోటను అసుర సేనలు ముట్టడించును. కిశోరావస్థ యందు ఈ కోట యందు దైవ సేన ప్రకటమగును. అసుర సేవను వశపరచుకొననంత వరకు ఉత్తమ స్థితి కలుగదు. పురుషార్థమును ఆచరించి యుద్ధము చేయనంతవరకు అసుర సేన వశమవదు. కావున అంతవరకు హృదయమనుకోట దుర్మార్గుల బారినుండి బయటపడదు.

ఈ యుద్ధము నందు జాగ్రత్తగా నుండి వాడు చైతన్యము లేని రాజువంటి వాడు. ఆతని దేశము శత్రు రాజులచే దోచబడి పాడయి పోవును. కాని భోగములను అన్నిటిని అదుపులో నుంచుకొని వివేకము ఆజ్ఞాపించి నటుల ప్రవర్తించినచో పూర్ణ విజయమును పొందును. ఇట్టి జయమును పొందిన వారు చాల తక్కువ. దృఢమగు సంతోషము లేనిదే ఈ కోటను జయించలేము. కావున ఈ సుగుణమును పొందుటకు ఎల్ల వేళల యందును పురుషార్థము చేయుచు చుండవలెను. ఇష్టము అనిష్టము అను రెండు లేని నరుడు ఉండడు. కాని రెంటియందును సంతోషమును పొందుట కష్టమైన పనియే. భోగము, గౌరవము, సంపద, దారా పుత్రులు మొదలగునవి కలిగినప్పుడు అవియే నిత్యము అనుకొని వానియందు ప్రసన్నుడయి ఉండుట అచేతనత్వమునకు, లేక విముఖత్వమునకు గుర్తు. కావుననే సంతులు ఇష్ట

వస్తు ప్రాప్తి యందు సంతోష ప్రాప్తి కఠినము అని చెప్పిరి. అనిష్టప్రాప్తి యందు, నిర్ధనత్వాదుల యందు యథార్థ సంతోషము లభ్యమగును. హృదయము నిర్లిప్తమయిన తదుపరి ఇష్ట ప్రాప్తి యందుకూడ యథార్థ సంతోషము కలుగును. మాయా పదార్థములను చూసి వాని యందు సంతోషమును పొంది, వానికి బద్ధుడగుట కూడదు అని దీని తాత్పర్యము. అవి అన్నియును అనిత్యములగుటచే సత్యములు కావు అని గ్రహించ వలెను. ఐహిక సుఖము సుఖము అనుకొన రాదు. ఏలనన అది ప్రభు విముఖుని జేయును. లభించిన ఐహిక సుఖము లన్నిటియందును భగవానుని అనుగ్రహమును కాంచిన వాడు దేవుని సమ్ముఖమునకు వెళ్లును. భగవానుని అనుగ్రహముగా తలచుట అనగా శరీరము, మనస్సు, ధనము–అభీష్ట పాదార్థములన్నియును భగవానునికి అర్పించుటయందు సందేహించ కుండుట. ఆతడే యథార్థమగు సంతోషమును పొందును. అది

కూడా పైన చెప్పిన విధముగా ప్రవర్తించిన నాడే సంతుష్టుడుగా పరిగణించబడును. భజన ద్వారా పరమపదమును పొందవలెననిన పాపమును త్యజించవలెను, అందు సంతోషమును పొంద వలెననుటలో సందేహము లేదు. ఆదియందు మాలిన్య రహితముగా అనగా విధివిహితముగా నుండ వలెను. మధ్య కాలమున దృష్టిని నిరోధించవలెను. సంకల్పమును ఆపవలెను. అంతిమ భాగమున నిరభిమానుడయి భజనమును చేయవలెను. ఈ మూడు దశల యందును సంతోషము ఎంతైన అవసరము. సంతోషమును పొందనిదే పాప త్యాగము జరుగదు. భోగేచ్ఛ వర్ధిల్లిన కొలదియు పాపములు వర్ధిల్లును. అటుపైన సంతోషమును పొందుట కష్టతరము. కావున ఆరంభము నుండియే సంతోషమును కలిగి యుండుట ఉత్తమము. దుఃఖము కలిగిన అది ప్రభుని ఇచ్ఛగా తలచి సంతోషించినచో ఉత్తమ ఫలము కలుగును. మహాత్ములు ప్రభువును

ఈవిధముగా ప్రార్థించుదురు:-

"ఓ ప్రభూ! సంసార దుఃఖములను సంతోషముగా సహించు బలమును నాకు కలుగ జేయుము."

కష్టములయందు ధైర్యమును కోల్పోకుండ, తన దుఃఖమును ఎదుటి వారి వద్ద ప్రకటించ కుండ ఉండువాడు నా వాడని ఎల్ల వేళల నేను అనుకొనెదననియును, ఆతని అపకృత్యములను లెక్కించనని యును, అట్టివాడు గ్రుడ్డివాడయినను, సర్వకాల సర్వావస్థల యందును ప్రసన్న చిత్తుడుగా నున్నచో ఆతనికి దర్శనమును ఇచ్చెదననియును ప్రభువు చెప్పెను.

పగ తీర్చుకొనకుండుట యందు కూడా సంతోషము ఆవశ్యకము. ఎదుటి వానిని బాధించవలెనను ప్రవృత్తి ఉన్నంత కాలము పూర్ణ ధర్మము లభించదు. "ఎవడైన నిన్ను బాధించినచో ఆతనిపై పగసాధించకుండ నాపై నమ్మకమును ఉంచి శాంతముగ నుండు" మని

ప్రభువు చెప్పెను. అపకారమునకు బదులు అపకారము కాదు, ఉపకారము. కుడి దవడపై ఎవడైన కొట్టినచో ఎడమ దవడను అతని ఎదుట నుంచుము. తలపాగ తీసికొనినచో చొక్కా కూడా ఇచ్చి వేయుము. అని సంతు జీససు చెప్పెను. నిజమగు సంతు ఇట్టి సంతోషమునే కలిగియుండును.

## కామమును బలహీనపరచు నుపాయము

వస్త్రాదును ఎవనినైన బలహీన పరుచవలెననిన ఆహారము నీయ రాదు. అటులనే కామమును బలహీన పరుచవలెననిన పగటిపూట ఉపవాసము ఉండుము. రాత్రి భోజనము చేయుము. అది కూడ కొంచెమే. నేత్రములను సుందర రూపమును చూడనీయకుము. ఏకాంతము నందు ఉండుము. అటులనే మనస్సు సంకల్పముల నుండియు, ఆలోచనల నుండియు

దూరము చేయుము. ప్రతి శరీరము పైకి మాత్రము సుందరముగ నుండును. లోపల రుధిరము, మాంసము, మల మూత్రములు మొదలగు దుర్గంధోత్పాదకములగు పదార్ధములు నిండి యున్నవి అని తెలిసికొనుము. ఇట్టి ఉపాయములచే కామము దుర్బలమగును. క్రూర జంతువు ఆహారము తగ్గించుట చేతను కాని, అసలు ఆహారమును ఇవ్వకుండుట చేతను కాని బలహీనతను పొంది చెప్పు చేతలలో నుండును. అటులనే కామము కూడను. కామోత్తేజకములుగు పదార్ధములను త్యజించుటచే అది వశమగును. నేత్రములను, సంకల్పములను నిరోధింపవలెను. ఇదియే కామమును వశ పరచుకొను ఉత్తమ మార్గము.

## ధర్మ వాసనను పెంచుట

ధర్మ వాసన రెండు విధములుగా వృద్ధినొందించబడును.

1. త్యాగముచే కలుగు లాభమును

మనస్సుకు తెలియజేయుట.

2. త్యాగులగు సంతుల వాక్యములపై తరుచు విచారము చేయుట. ఇట్లు చేయుటచే నమ్మకము దృఢపడును. భోగ సుఖము క్షణికమనియును, త్యాగ సుఖము చిరస్థాయి అనియును తెలియును. ఈ జ్ఞానము కలుగుటచే ధర్మ వాసన ప్రాబల్యమును పొందును. కావున నెమ్మది నెమ్మదిగా భోగి వృత్తి మార్చ వలెను.

# తృష్ణ లేని నిర్ధనత్వము

శరీరమునకు అవసరమగు నంత ధనము మాత్రమే సంపాదించుట యందు ఎంతయో లాభము కలదు. నష్టము తక్కువ. అవసరము కంటె ఎక్కువ ధనమును సంపాదించుట యందు నష్టము ఎక్కువ. లాభము తక్కువ. కొందరకు కొలది ధనమే ఎంతయో దుఃఖము కలుగ జేయునదిగా తోచును. నిర్ధనత్వము నందు తృష్ణా రాహిత్యమును, ధనముచే తృష్ణ పెరుగుటయును మాత్రమే ఇందుకు కారణము.

మూడు రకములగు నిర్ధనులు.

నిర్ధనులు మూడు రకములు:-

1. కొందరకు ధనమును సంపాదించవలెనని ఎంతయో కోరిక యుండును. కాని ధనము సంపాదించలేరు. ఇట్టివారు తృష్ణా శీలురు.

2. కొందరు ధనమును సంపాదించుటకు ప్రయత్నించెదరు, కాని లభించినచో ప్రసన్న చిత్తులగుచు స్వీకరించెదరు. లేనిచో బాధ పడరు. ఇట్టివారు సంతుష్టులు.

3. మరి కొందరికి ధనము కావలెనని కోరికయును ఉండదు. లభించినను స్వీకరించరు. ఇట్టివారు వైరాగ్య శీలురు.

## నిర్ధనుని మహత్వము

మహాపురుషుడగు మూసాకు ఆకాశవాణి వినిపించెను:-

"నిర్ధనత్వము నిన్ను సమీపించినచో సంతోషముతో దానిని స్వీకరించుము.

స్వర్గమునందు చూచిన నిర్ధనులు చాలమంది కన్పింతురు, ధనవంతులు నరకమునకు పోవుదురు. భగవానుడు తనకు ఎక్కువ ప్రియమైన వానికి బంధువులును, ధనమును లేకుండా జేయును. ఏలనన ధనవంతుడు స్వర్గమునకు పోవుటకు చాల శ్రమపడవలెను. దిక్కులేని నిర్ధనుడు సంతోషముగా ఎట్టి శ్రమయును లేకుండ స్వర్గమునకు వెళ్లును. కావుననే నిర్ధనుల సాంగత్యమును పొంది వారికి యథాశక్తి సేవ చేయుడని సంతులు చెప్పిరి.

ఒక సంతు తన ఆశ్రమమున నిర్ధనులను తనవద్ద కూర్చొన బెట్టెడి వాడు. ధనవంతులను తన వెనుక కూర్చొన నియమించెడి వాడు. నిర్ధనులను అసహ్యముగా చూడరాదనియు, వారు భగవానుని కుమారులనియును చెప్పెడివాడు. ధనము పెరిగినకొలదియును ఎక్కువ సంతోషమును పొందని వాడును, వయస్సు మళ్ళినకొలదియు దుఃఖము పొందని వాడును

ఉత్తములు.

నిర్ధనత్వము అన్ని విధముల ఉత్తమమైనదని పై వివేచనమువలన తేలుచున్నది. కాని దాని సాఫల్యము ఎల్ల వేళల ప్రసన్న చిత్తముతో నుండి, తన దుఃఖమును ఇతరుల ఎదుట చెప్పకుండ భగవానుడు తన ప్రియతమునకే మిక్కుటము దుఃఖమును కలుగ జేయునని నమ్మినప్పుడు మాత్రమే నిర్ధనత్వమునకు సాఫల్య ముండును.

ధనవంతుని సాంగత్యము గోరు జ్ఞాని కపటాత్ముడు. రెండు పైసలు ఉన్నవాడు దేవునికి ఒక పైస ఇచ్చినచో అతని దానము ధనవంతుని వేయి రూపాయిల దానము కంటె మించినది.

సంతోషమును గురించి శాస్త్రము చెప్పుచున్నది:-

***సంతో షైశ్వర్యసుఖినాం చిరం విశ్రాన్తచేతసామ్/***

***సామ్రాజ్యమపి శాన్తానాం నృణాం తూర్ణం త్రృణాయతే॥***

"సంతోషమను ఐశ్వర్యమును పొంది సుఖపడుచు, దీర్ఘ కాలము నుండి చిత్తవిశ్రాంతిని పొందిన శాంతపురుషులకు చక్రవర్తిత్వము కూడ గడ్డిపోచవలె తుచ్ఛముగా కన్పించును."

## భక్తికి త్యాగము ఆవశ్యకము

ప్రేమజీ భాయీ:- జ్ఞానమునకు త్యాగము కావలెను. కాని మేము సాంసారిక జీవులము. మాకు భక్తితోనే సంబంధము కలదు. భక్తి ఇంటిలో కూర్చుండియే పొందనగునని మేము వింటిమి. భక్తికి త్యాగము అవసరము లేదు కదా!

స్వా. ప్ర. :- త్యాగము లేనిదే భక్తి కుదురుట సంభవించదు. భక్తి సూత్రము నందిట్లున్నది.

## జ్ఞానమునకు భక్తి వైరాగ్యములు కావలెను

# ఇరువది తొమ్మిదవ ప్రసంగము

" సా చ కామయమానా నిరోధ రూపత్వాత్ "

"అది (ప్రేమ, భక్తి) కామనాయుక్తము, నిరోధరూపము (త్యాగరూపము) అగుటవలన. కామనాయుక్తమగు భక్తి యనగా భగవదాకారమను ఏకాకార వృత్తి జన్యమగు ఆనందానుభవ విషయకమగు ఇచ్ఛ. నిరోధమనగా పదార్థాచింతన పురస్సరమగు భగవదేకాకారత. అనగా సర్వమాత్ర విషయ పరిచింతన త్యాగ పూర్వకమగు భగవదేకాకారత."

భక్తి సూత్రములు ఇంకను చెప్పుచున్నవి:-

***"తత్తు విషయత్యాగాత్ సంగత్యాగాచ్చ "***

విషయ త్యాగము అనగా ఆంతరికమగు విషయ వాసనా త్యాగము. సంగ త్యాగమనగా బాహ్యములగు విషయ భోగములను త్యజించుట. భక్తి విషయములను, సంగమును త్యజించుటచే లభించును.

జ్ఞానమునకు రెండు సాధనములు కావలెను. భక్తి, వైరాగ్యము, మాయికములగు సాంసారిక పదార్థముల యందలి ప్రేమ రాజసము. అది రాగము అనబడును. ప్రభువు నందలి ప్రేమ సాత్త్వికమగుటచే భక్తి అనబడును. కావున మాయిక పదార్థముల యందలి ప్రేమ త్యజించబడనంత వరకు భక్తి కలుగదు. ఒకే మారు రెండు చోట్ల ప్రేమ ఉండదు. మాయిక పదార్థములనుండి ప్రేమను నివర్తింపజేసి ప్రభువు వైపు ప్రసరింపజేయవలెను. అందరు చే జ్ఞానమునకు భక్తియును, వైరాగ్యమును కావలెను.

త్యాగము రెండు రకములు అని వివేక చూడామణి యందు కలదు:-

***అన్తస్త్యాగో బహిస్త్యాగో విరక్తస్యైవ యుజ్యతే / త్యజత్యన్తర్బహిః సంగం విరక్తస్తు ముముక్షయా//***

“వైరాగ్యవంతుడే ఆంతరికమగు విషయ వాసనలను బాహ్యములగు విషయ భోగములను

త్యజించగలడు. వైరాగ్యవంతుడు ముముక్షువగుటయే ఇందుకు కారణము.” శ్రుతి కూడా చెప్పుచున్నది

**“న కర్మణా న ప్రజయా న ధనేన త్యాగేనై కే నాఽ మృతత్వ మానశుః”**

“కర్మ చేతను కానీ, సంతానము చేతను గాని, ధనము చేతను గాని అమృతత్వము అనగా మోక్షము కలుగదు. త్యాగము చేతనే మోక్షము లభించును.”

కాళా:- తినుట, త్రాగుట, ధరించుట మొదలగునవి విషయములు అనబడినచో వీనిని అన్నిటిని ఆపివేసిన శరీరము నిలబడునా?

## శరీర రక్షణమునకు మూడు పదార్థములు ముఖ్యము

స్వా. ప్ర.:- శరీర నిర్వహణమునకు కావలసిన ఆహారమును తీసికొనుటయు, శీతోష్ణముల నుండి శరీరమును రక్షించుకొనుటకు

బట్ట కట్టుకొనుటయు విషయములు అనబడవు. శరీర రక్షణార్థము  ఆహారము, వస్త్రము శీతోష్ణ రక్షణార్థము స్థానము- ఈ మూడు మాత్రమే అవసరమని పారస భాగము నందున్నది. మాయా పదార్థము లన్నిటికిని మూలము ఈ మూడు మాత్రమే, ఆహారము, వస్త్రము, స్థానము ఈ మూడింటిని కోరి శరీరమను వాహనమును రక్షించుటకే భోగములు కోరబడుచున్నవి. కాని ఆ భోగేచ్ఛా ప్రాబల్యముచే హద్దులు ఉండవు. కావున భగవానుడు వానికి హద్దులు కల్పించుకొనుటకు బుద్ధిని ఇచ్చియున్నాడు. సంతుజనుల వాక్యముల ద్వారా ధర్మ శాస్త్రములను పుట్టించెను. వానిని శ్రవణము చేయుటచే బుద్ధికి వివేకము కలిగి తత్వవిచారం చేయుటకు ఆతడు అట్లు చేసెను. భోగాభిలాష బాల్యమునందే ప్రాబల్యమును పొందును. శరీర పోషణము అన్నపానాదుల ద్వారా ముందు కలుగును. బౌద్ధిక వికాసము అనంతరమున కలుగును. కావున భోగములు

మొదటినుండియు హృదయమును ఆవహించుకొని యుండును. అందుచే బుద్ధి యొక్క ఆజ్ఞలు పాటించబడవు. ఆహారాదుల ప్రయోజనము కూడ తెలియదు. తాను జగమున ఏల జన్మించెనో కూడ మరచిపోవును. విషయ పంచకమును వశపరచుకొనుట చాల కష్టము. అందువలననే సకల వైభవములను అనుభవించి పూర్ణ వైరాగ్యమును పొందిన భర్తృహరిమహారాజు విషయ వాసనను గురించి ఇట్లు చెప్పెను:-

## విషయ వాసన యొక్క ప్రాబల్యము

***భిక్షాశనం తదపి నీర సమేక వారం***
***శయ్యా చ భూః పరిజనో నిజ దేహ మాత్రమ్ /***
***వస్త్రం తు జీర్ణ శతఖణ్డ మ యీా చ కన్థా***
***ఆహా! తథాపి విషయా న పరిత్యజన్తి//***

"భిక్షాటనముచే భోజనము జరుగుచున్నది. అదియను రుచి లేనిది, ఉడికి ఉడకనిది, ఎండిపోయినది. అదియు ఒక్కమారు మాత్రమే.

నిద్రించు శయ్య భూమి. సేవించు పరిజనులు కాళ్ళు చేతులు మాత్రమే. వందలకొలది కన్నములు కల బొంత మాత్రమే వస్త్రము. అయినను విషయములు పూర్తిగా వదల లేదు. ఎంత దుఃఖించ వలసిన విషయం!”

భర్తృహరి తనపై వేసికొని ఈ విషయము చెప్పెను. మహాపురుషులు ఏమి చెప్పినను తమను ఉద్దేశించియే చెప్పెదరు. యథార్థమునకు అది ఆయన మనకొరకు తెలిపెను. శరీర నిర్వహణానంతరము కలుగు కోరికలన్నియును విషయేచ్ఛలు అనబడును. శరీర నిర్వహణమునకు మాత్రము వలయు కోరికలు విషయేచ్ఛలు అనబడవు.

## శరీర స్వరూపము

***శరీరం ప్రణవత్పశ్యేదన్నం తు వ్రణలేపనమ్।***
***వ్రణ సేచనవద్వారి వస్త్రంతు వ్రణ పట్టవత్॥***

శరీరం ఒక గాయమనియు, అన్నము ఆ గాయమునకు పట్టించు ఔషధమనియు,

తృషానివారణార్ధము పానము చేయు జలము ఆ గాయమును కడుగుటకు ఉపయోగించుచున్నా మనియు, వస్త్రము ఆ గాయమునకు కట్టు కట్టుగుడ్డ అనియును తలచవలెను.

ఈ శ్లోకమున శరీరము వ్రణ రూపమున వర్ణించబడినది. అనగా దుఃఖ రూపము అని అర్థము, గాయము యొక్క బాధ తగ్గుటకు పట్టీ కట్టవలెను. ఈ పట్టీకి రుచికరములగు నానావిధ పరమాన్నములును పనికి రావు. ఉడికించిన పిండి ముద్దను ఉపయోగించవలెను. దానిని కడుగుటకు శీతల జలము కావలెను. అంతే కాని సోడా, లెమన్ మొదలగు పానకములు అవసరము లేదు. గాయమునకు చినిగిన గుడ్డతోనో కట్టు కట్టవలెను. జరీ బట్టలు, పట్టుబట్టలు మొదలగు ఎక్కువ ఖరీదు కల బట్టలు అక్కర లేదు. ఈ విధముగ నిర్వహణమునకు సరిపడు అన్న వస్త్రాదులే శరీరమునకు అంద జేయవలెను.

ఆహారాదులు ప్రాణ పోషణమునకు గాని ఇంద్రియ పోషణమునకు కాదు. సర్కసులోని పెద్ద

పులికి చాల తక్కువగా ఆహారము పెట్టిన పనిచేయదు. ఎక్కువగా తినిపించిన ఎప్పుడో ఒకప్పుడు తిరుగుబాటు చేయును.

పని చేయుటకు అవసరమైనంత మాత్రము తప్పక పెట్టవలెను. అటులనే మనము కూడ మన శరీర నిర్వహణమునకు చాలినంత ఆహారము తప్పక తీసుకొనవలెను.

ప్రేమజీ:- తమరు సెలవిచ్చిన విధముగా మహా త్యాగులు, యోగులు ఎవరైన ఉన్నచో వారే ఆచరించగలరు. నావంటి సంసారి తమరు చెప్పిన ప్రకారము చేయ గలడా? మావంటి వారలు వైరాగ్యమును పొందుటకు సాధనములు ఏమి?

# వైరాగ్యమును పొందుటకు సాధనములు

స్వా.ని.:- "అవ్యాకృత భజనాత్ " అని భక్తి సూత్రములు చెప్పుచున్నవి. అఖండ భజనముచే

సాధనములు లభించును. తినుచును, త్రాగుచును, తిరుగుచును, పని చేయుచును ఎల్ల వేళల హరి భజన చేయవలెను. మనమున ప్రభుని నామమును స్మరించ వలెను. ఇట్లు చేయుటచే వైరాగ్యాది సాధనములు అన్నియును మెల్లమెల్లగా సమకూరును.

స్వా. ప్ర. :-ప్రేమజీ భాయి అంతవరకు సాగ లేడు. ఎందుకు మీరు అంత శ్రమ పడుచున్నారు?

ప్రేమ:- మేము ఏమి చేయవలెనో తాము తెలిపినచో భవిష్యమున మాకు ఉపయోగించును.

స్వా.ప్ర:- ఒక నగల వర్తకుడు ఉండెను. ఒక రాత్రి అతని ఇంటిలో దొంగలు కన్నము వేయు చుండిరి. భార్య ఆతనితో ఈ విషయమును చెప్పెను. “ఎరుగుదును” అని ఆతడు సమాధానము చెప్పెను. దొంగలు లోపలికి ప్రవేశించిరి. అది కూడ ఆమె భర్తకు తెలిపెను, అప్పుడు కూడా ఆతడు “ తెలియును” అని

సమాధానము చెప్పెను. ఇంటిలోని ధనమును అపహరించి మూటలు కట్టు చుండిరి. భార్య ఆ సంగతి కూడ తెలియబరచెను. భర్త “నాకు తెలుసును” అని బదులు చెప్పెను. దొంగలు ధనము తీసికొని పోయిన తరువాత ఆమె భర్తకు నివేదించెను. భర్త “తెలుసును” అనెను. అంతట భార్య ఇట్లనెను. “నీ తెలివి మన్ను కాను? తెలిసినను ఆపలేదు. ఇంక తెలిసినను, తెలియక పోయినను రెండును సమానమే.”

ప్రేమ: - నేను సోమరిని, పనులు చేయలేను. ప్రభువు కృప జూపి ప్రేరణను కలుగ జేసినచో ఏమైన అగును.

స్వా. ప్ర. :-- పాండవులు వన వాసము చేసి తిరిగి హస్తినాపురమునకు వచ్చిన వెంటనే శ్రీ కృష్ణపరమాత్మ కౌరవులను, పాండవులకును సంధి చేయుటకు ప్రయత్నించెను. ఆతడు మొదట ధర్మరాజు నొద్దకు వెళ్ళి కౌరవులతో యుద్ధము చేయకుండ మధ్యవర్తి పరిష్కారమునకు ఒప్పు

కొనమని తెలిపెను. అపుడు ధర్మరాజు ఇట్లనెను. “పరమ సంతోషము. నేను మధ్యవర్తి పరిష్కారమును అంగీకరించుచున్నాను. మా పక్షమున మొదటి మధ్యవర్తిగా దుర్యోధనుని ఏర్పాటు చేయుచున్నాను.” అటు తరువాత శ్రీకృష్ణుడు దుర్యోధనుని వద్దకు వెళ్ళి చెప్పెను. “నేను యుద్ధమునకు బదులుగా మీ ఇరువురి మధ్య నున్న తగాయిదాను పంచాయతీ ద్వారా పరిష్కరించ గోరుచున్నాను. ధర్మరాజునకు తెలిపితిని. ఆతడు అంగీకరించెను. అంతియే కాదు. తన పక్షమున మధ్యవర్తులలో నీ పేరే మొదటిదిగా సూచించెను. ఇది విని దుర్యోధనుడు ఇట్లనెను :-

“ఇదేమిటి ఇట్లనుచున్నావు? జగమున న్యాయము పలుకువాడు ఒకడైన లేడు కదా? 5 గురు మధ్యవర్తులను ఎక్కడ నుండి తీసికొని రాగలను? ఈ తగాయిదా మధ్యవర్తులద్వారా పరిష్కారము కాజాలదు. శ్రీకృష్ణుడు మానవ సంహారమును, యుద్ధ భయమును ఆపుటకు

అనేక విధముల దుర్యోధనునకు బోధించెను. పాండవుల భాగము వారికి ఇచ్చి వేయుట ధర్మము అనియును, ఇవ్వకుండుట అధర్మము అనియును దానికి పరిణామము మంచిదిగా నుండదు అనియును చెప్పెను. అంతట దుర్యోధనుడు పలికెను :—

***జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః జానామ్య ధర్మం న చ మే నివృత్తిః/***
***కే నాపి దైవేన హృది స్థితేన యథా నియుక్తోఽస్మి తథా కరోమి.//***

"ఏది ధర్మమో ఎరుగుదును. అయినను అందు నాకు ప్రవృత్తి కలుగుట లేదు. ఏది అధర్మమో ఎరుగుదును. అయినను దానినుండి నివృత్తిని పొంద లేక పోవుచున్నాను. హృదయము నందున ఒక మహా శక్తి యగు దైవముచే నియుక్తుడనై ఆ ప్రకారము చేయుచున్నాను." అనెను.

ఈ విధముగానే ప్రేమజీ భాయి తనను తప్పించుకొనుచున్నారు.

స్వా.ని.:-స్వామివారు (ప్రకాశానందులవారు) ప్రేమజీ భాయి పైననే దాడిచేయుచున్నారు.

అంతట ప్రేమజీ భాయి ఇట్లనెను. చేదు మందు తల్లియే త్రాగించును కదా! స్వామివారికి నాపై ఎంతయో కృప కలదు. అనలు ఆయన ఎవరితోను మాట్లాడెడి వారే కాదు. నా యందలి కరుణ చేతనే ఇంత మాట్లాడిరి.

స్వా. ప్ర.:-ఒక సాధువు 12 ఏండ్లు మౌనము వహించి చివరికి నోరు విప్పగా బు బు బు అని నోట వచ్చినదట. నేను మాట్లాడిన మాటలు ఇట్టివే అన్నమాట. పుష్కరము చెప్పిన బూడిదలో పోసిన పన్నీరే అన్నట్లు ఉన్నది. నేనెప్పుడు మాట్లాడినా ఇట్లే ఉండును. ఇది విని అందరు నవ్విరి.

ఓం

# ముప్పదియవ ప్రసంగము

సాయంకాలము డా|| లల్లూభాయి ఒక భక్త వరుని తోడ్కొని పీఠడియా వచ్చెను. స్వాముల వారిద్దరును వారిని కుశలమడిగిరి. డా|| లల్లూభాయి ఆ భక్తుని ప్రకాశానందుల వారికి ఎరుక పరచెను. ఈయన ఒక భక్తుడు. వీరు యోగ వాశిష్టము, ఆత్మపురాణము మొదలగు గ్రంథములను చదివిరి. గురు శ్రీవారి జీవితమును చదివిన మీదట వీరికి తమ దర్శనము చేయవలెనని కోరిక కలిగినది.

స్వా.ప్ర.:- జీవితము గురుశ్రీ వారిది. నాకు ఏమియును దానితో సంబంధము లేదు. నేను వినిన విషయములలో సూక్ష్మములైన వానిని గ్రహించ లేక పోయితినికూడను. కొద్దియో గొప్పయో స్థూల విషయములను మాత్రము

వింటిని. వానిలో కూడ జ్ఞాపకము ఉన్నవి మాత్రమే వ్రాసితిని. వానిని కూడ ఇప్పుడు ఆచరించ లేకపోవుచున్నాను. “అది నేను వ్రాసితిని” అని మీరు అనుకొనుట తప్ప పైకి ఏమియును ఆధారములు కన్పించుట లేదు.

ఒక సంతు ఒక పుస్తకము వ్రాసెను. దానిని ఒక గ్రామము నందలి ఇద్దరు మిత్రులు చదివిరి. చదువుచుండ ఒక సంవత్సరములో వారిరువురును దైవసంపదను పొంది వైరాగ్యమును పొందిరి. ఇరువురును తలచిరి :- ప్రపంచమునుండి ఇంత పూర్ణ వైరాగ్యమును కలిగించు ఈ గ్రంథమును వ్రాసిన మహాపురుషుడు పూర్ణ జ్ఞాని అయి ఉండును. ఇట్లు తలచి వారు దూర దేశమునుండి ఆయన దర్శనము చేసి కొనుటకు వారి ఆశ్రమమునకు వచ్చిరి. ఆయన పూర్తిగా మాయావి అని అచ్చట వారికి తెలియ వచ్చెను. అన్ని విధములగు విషయముల యందును చిక్కువడి యుండెను. అతడు వారు విరాగి కాడు. పూర్ణ రాగి. ఇది

పరికించిన వెంటనే వారు ఆ మహాత్ముని అడిగిరి:- తమ పుస్తకము చదివి నంతనే మాకు పూర్ణ వైరాగ్యము కలిగినది. కాని తమరు మాత్రము అందుకు వ్యతిరేకముగా నున్నారు."

ఆమహాత్ముడు సమాధానము చెప్పెను:-

కమ్మరి శ్రమపడి వేలకొలది పదును కల కత్తులు తయారు చేయును. కాని వానిని యుద్ధ క్షేత్రములో ఉపయోగించు సామర్థ్యము అతనికి ఉండదు. శూరవీరులగు క్షత్రియులు మాత్రమే ఆ తీక్షణ ఖడ్గములను ఉపయోగించగలరు. నేను కమ్మరిని. మీరు ఆ శూరులును, వీరులును అగు క్షత్రియులు.

## సహవాసముచే యథార్థము గ్రహించనగును

పుస్తకమునుబట్టి చూచినచో జ్ఞానియో, అజ్ఞానియో తెలిసి కొనలేము. దగ్గరగా నుండి చూచినచో గ్రంథ కర్త రహస్యమును

తెలిసికొనవచ్చును. సీతను వెదకుచు రామలక్ష్మణులు పంపా సరోవర సమీపమునుండి వెళ్ళునప్పుడు ఆ సరోవరము నందలి ఒక కొంగను చూచి రాముడు లక్ష్మణునితో నిట్లనెను:-

***పశ్య లక్ష్మణ పమ్పా యాం బకః పరమధార్మికః|***
***శనైః, శనైః పదం ధత్తే జీవానాం వధశఙ్కయా||***

" ఓ లక్ష్మణా! ఈ పంపా సరోవరము నందలి కొంగ ఎంత ధర్మము కలదియో చూడుము. జీవహింస జరుగునను భయముతో నెమ్మది నెమ్మదిగా అడుగులు వేయుచున్నది."

ఇది విని ఒక చేప పలికెను:-

***బకః కిం శ్లాఘ్యతే రామ యేనాహం నిష్కులీకృతా|***
***సహవాసీ విజానాతి చరిత్రం సహవాసినామ్||***

"ఓ రామా! కొంగను ఏల

పొగడుచున్నావు? ఇది మా కులము నంతను నాశనము చేసినది. కూడా ఉండు వారే కూడా ఉండువారి చరిత్రను సరిగా ఎరుగుదురు.”

(ఇచ్చట రామచంద్రునితో చేప చెప్పినది అనుదానిని అలంకార రూపముగనే గ్రహించవలెను.)

కాళాభాయి:— భక్త వరులకు తమ సహవాసము ఇంతవరకు లభించలేదు. కాని మేము తమను చాల కాలమునుండి ఎరుగుదుము. తమ సహవాసమున చాల కాలము నుండి ఉన్నాము. తమరు శ్మశానము నందు పడి ఉండుటయు, ఎండిన రొట్టె ముక్కలు తినుటయు, శీతోష్ణాదులు సహించుటయును మేము చూచుచునే ఉన్నాము.

స్వా. ప్ర. :- శంకరులు పార్వతితో చెప్పిరి:-

***తృణపర్ణోదకాహారాః సతతం వనవాసినః/***

***హరిణాదిమృగాదేవి యోగిన స్తే భవ న్తి కిమ్ //***

"గడ్డి, ఆకులు, నీరు మాత్రమే ఆహారంగా కలవారు యోగులు అయినచో లేళ్లు మొదలగు పశువుల సంగతి యేమి? అవి యోగులా?"

అడవులలో భిల్లులు మొదలగువారు కూడ ఉందురు. వారిని యోగులు అనెదరా? దక్షిణ దేశమున ఒక మహాత్ముని చూచితిని. ఆయన అరణ్యమున నివసించెడి వాడు. లేత అరటి ఆకులు భక్షించెడి వాడు. అయినను ఆతని శరీరము నిలచి యుండెను. కాని ఆయనయందు జ్ఞానము మాత్రము లేశ మైనను లేకుండెను.

***మృద్భస్మమ్రక్షణాదేవి ముక్తాః స్యుర్యది మానవాః/***
***మృద్భస్మశాయినో గ్రామ్యాః కిం తే ముక్తా భవన్తి హి//***

"మట్టి కాని, భస్మము కాని శరీరమునకు పూసుకొనుట చేత యోగులు ముక్తిని పొందుచో

మట్టిలో పరుండు కుక్కలు మొదలగునవి బూడిదలో పరుండును కదా! అవి ముక్తిని పొందునా?”

చాలమంది సాధువులు శరీరము పై భస్మము, మట్టి పూసు కొనెదరు. భస్మాది ధారణముచే వారి శరీరమునందలి ఛిద్రములు మూసి వేయబడును. వారికి చలివేయదు. పంచాగ్ని తాపమును కూడ పొందరు. ఇట్లు కంబళీలు మొదలగునవి కప్పుకొనకుండుటకు వారి భస్మాదిధారణము ఉపయోగించును. “హిమాలయమున ఒక రకపు మూలిక కలదు; దాని భస్మమును శరీరమునకు పట్టించుకొనినచో ఎటువంటి మంచునందు సంచరించినను చలివేయదు” అని నేను హృషీ కేశమున వింటిని అటులనే తినెడి కంద మూలముల యందుకూడ విశేషము కలదు. ఒక రకపు దుంపను తినుటచే 8 రోజుల వరకును ఆకలి దప్పికలు ఉండవు. మరియొక రకపు మూలిక పక్షము రోజుల

వరకును ఆకలి దప్పికలు లేకుండ జేయును. ఇటులనే నెల, రెండు నెలలు, మూడు నెలలు, ఆరు నెలల వరకు కూడ ఆకలి దప్పికలు లేకుండ జేయు మూలికలు కలవు. వానిని ఉపయోగించిన వాడు యోగి అనబడడు.

***గృహారణ్య సమాలోకే గత వ్రీడా దిగమ్బరాః/***
***చరన్తి గర్దభాశ్చైవ యోగినస్తే భవన్తి కిమ్ //***

"ఇల్లు, అరణ్యము రెంటిని సమానముగా చూచు వారును సిగ్గు లేని వారును, దిగంబరులుగా తిరుగు వారును యోగులు అగుచో గాడిదలు కూడ యోగులు అగును. అవికూడ సిగ్గువిడిచి నగ్నముగా తిరుగును కదా!" నేను హృషీకేశమున ఉన్నప్పుడు చాలమంది యోగులు దిగంబరులై చలిలో కూర్చొనుచుండిరి. వారితో ఒక్కొక్క సాధకుడు కూడ ఉండెడివాడు. జనులు సిద్ధిని పొందిన మహాత్ముని వద్ద కంబళీలు, దుప్పట్లు, పండ్లు, పూలు, మిఠాయిలు ఉంచెడి వారు. కానుకలు కూడ ఇచ్చెడివారు. ఇట్టి వారి యందు వైరాగ్యాది

సాధనములు మాత్రము కన్పించెడివి కావు. కావున వారు యోగులు అనబడరు.

***ఆజన్మమరణాన్తాశ్చ గఙ్గాదితటినీస్థితాః /***
***మణ్డూక మత్స్య ప్రముఖాః వ్రతిన స్తే భవన్తి కిమ్//***

"గంగాది నదుల తీరములయందు ఉండుటచే పవిత్రులగుచో జన్మమునుండి మృత్యు పర్యంతము గంగాతీరమున ఉండు కప్పలు, చేపలు మొదలగునవికూడ యోగులగునా?" కొందరు హరిద్వారము నుంచి కాశీ వరకు గంగానదీతీరమున తిరుగుదురు. త్రోవలో సదా వృత్తులనుండి అడిగి తినెదరు. ఇట్టి వారు నియమశీలురు అని చెప్పబడరు. దైవ సంపద యొక్క గుణములను ధరించి దాని నియమములను పాలించిన వారే నిజమగు నియమ శీలురు.

***వదన్తి హృదయానన్దం పఠన్తి శుకసారికాః /***

***జనానాం పురతో దేవి విబుధాః కిం భవన్తి హి॥***

"మాట్లాడు చిలుకలును, గోరువంకలును మొదలగునవి హృదయానందమును పొందించును. కాని అవి విద్వాంసుల శ్రేణిలో చేరునా?"

ఇంటిలో పెంచిన చిలుక కూడ ప్రతిరోజు ఇంటిలోని మనుష్యులను పేరు పెట్టి పిలచును. పిల్లి వచ్చినచో కర్రతో కొట్టమని చెప్పును. కాని నిజముగా పిల్లి వచ్చినప్పుడు రెక్కలు ముడుచుకొని వణికి పోవును. తన యథార్థమగు అడవి భాషలో చేం చేం అనును అటులనే నేటి జనులు వాద వివాదముల యందును, ఉపన్యాసముల యందును "దేహేంద్రియాదులు అసత్యములు, విషయాదులుకూడ మాయిక పదార్థములే, ధనము, భార్యాబిడ్డలు మొదలగు మాయిక పదార్థములు అన్నియును దుఃఖ రూపములు, పరమాత్ముడు సుఖ రూపము, అతనిని పొందవలెను" అని చెప్పెదరు. కాని వారి

ధనాదులు లోపించినను, దారాపుత్రాదుల వియోగము సంభవించినను తనకు ఇష్టులైన బంధువులలో ఎవరైన చనిపోయినను, తమ శరీరమునకు ఏదైన బాధ కలిగినను ఎంతయో బాధపడెదరు. ఇట్టివారు యోగులు అనబడరు. శాస్త్రాభ్యాసము చేసి శ్రవణ, మనన, నిది ధ్యాసములు చేసిన వారును, బ్రహ్మ సాక్షాత్కారమును పొందిన వారును యోగులు అనబడుదురు.

**తస్మాదిత్యాదికం కర్మ లోక వఞ్చన కారకమ్ /**
**మోక్షస్య కారణం సాక్షాత్తత్త్వజ్ఞానం కులేశ్వరి//**

"పైన చెప్పిన నిరాహారాదులు అన్నియును జగమును వంచించుటకు మాత్రమే. మోక్షమునకు సాక్షాత్సాధనము తత్త్వజ్ఞానము మాత్రమే."

భక్తవరుడు:— "తమరు శ్మశానములో

శవము కాలుచుండగా చూచిన వైరాగ్యము కలిగెను, అంతట తమరు ఇంటినుండి బైటకు వచ్చి వేసిరి" అను సంగతి యథార్థమే కాదా? ఇప్పుడు నాకు వైరాగ్యమే లేదంటున్నారే? ఇది ఎట్లు?

స్వా.ప్ర.:- అవును. అది నిజమే. వైరాగ్యము మూడు రకములు.

## వైరాగ్య భేదములు

***విషయాణాం వైరస్యాద్యస్త్యాగవాన్ భవేత్స వరః |***
***ఉపదేశాత్స చ మధ్యః శ్మశాన వైరాగ్యతో హీనః||***

"విషయముల యందలి అనిత్యత్వమును ఎరిగి వైరాగ్యమును పొందువాడు ఉత్తముడు. గురువు మొదలగు వారి ఉపదేశములచే వైరాగ్యమును పొందువాడు మధ్యముడు. శ్మశాన వైరాగ్యమును అధముడు." పర్వతములనుండి నుండి తన యంతట తాను ప్రవహించు

ప్రవాహము అఖండముగా నుండును. ఎవడైన ఒక గొయ్యి తవ్వి పది పన్నెండు బిందెలు నీరు పోసినచో కొంత కాలము ఉండి తరువాత ఎండిపోవును. మరుభూమియందు నీటి ప్రతీతి మాత్రమే ఉండును. యథార్థమునకు అక్కడ జలము ఉండదు. వివేక యుక్తమగు వైరాగ్యము స్థిరముగా నిలచి యుండును. ఈవిషయమున కబీరు చరిత్రమును దృష్టాంతముగా గైకొన వచ్చును:-

ఒకనాడు కబీరు ప్రసిద్ధిని విని ఒక వ్యక్తి ఆయనను దర్శించుటకు వచ్చెను. ఆయన ఆసమయమున ఇంట లేకుండెను. ఆయన భార్య చెప్పెను:-

" మా బంధువులలో ఒకరు చనిపోయిరి. అంత్యక్రియలకు వారు శ్మశానమునకు వెళ్లిరి." వచ్చిన వ్యక్తి అడిగెను:-

"అచ్చట ఎంత మందియో ఉందురు కదా! వారిలో కబీరుగారు ఎవరో ఎట్లు తెలియును?

కబీరు భార్య చెప్పెను: -

“మిగిలిన వారి అందరకును శ్మశానము నందు ఉన్నంత సేపును ముఖము పై వైరాగ్య చిహ్నములు ఉండును. కాని శ్మశానము నుండి బయటకు వచ్చుట తోడనే ఆ ఔదాసీన్యము ఉండదు. వారిది శ్మశాన వైరాగ్యము, కాని కబీరుగారి ఒక్కరి వైరాగ్యము మాత్రము శ్మశానము విడచిన తరువాత కూడ ఉండును. ఏలనన వారి వైరాగ్యము వివేకముతో కూడినది.”

నాది శ్మశాన వైరాగ్యము. ఎండమావులవలె పైకి కన్పించునది మాత్రమే. ఇప్పటివరకు ఆచరించ లేక పోతిని.

కాళా:- తమరు సమస్తమును ఆచరణలో చూపుచున్నారు. మేము మాత్రము ఆచరించుటకు తలచుచునే ఉన్నాము. కాని సాంసారిక జీవుల మగుటచే చుట్టుపక్కల ఉన్న వాతావరణము వలన ఆచరించుటకు ఏమాత్రమును వీలగుట లేదు. ఇక తమరే అట్లు చెప్పుచున్నచో మా స్థితి

ఏమనవలెను?

స్వా.ప్ర.:- మీరు నేడు ఇట్లు చెప్పుచున్నారు, కాని 5000 సంవత్సరములకు పూర్వము భగవానుడు చెప్పెను:-

***మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధ యే/***
***యతతా మపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్వతః//***

"వేలకొలది మంది మనుష్యులలో ఒకడు సిద్ధి కొరకు ప్రయత్నించును. అట్లు ప్రయత్నించువారిలో వేయి మందిలో ఒకడు యథార్థముగా నన్ను తెలిసి కొనగలడు."

ఐదు వేల సంవత్సరములకు పూర్వము వేలకొలది జనులలో ఒకడు సిద్ధికొరకు కోరువాడు ఉండును అని వ్రాయబడినది. కాని నేడు లక్షల కొలది జనులలో ఒకడు కూడా జ్ఞానమును పొందవలెనని కోరువాడు ఉండడు.

భక్త:_ ఇదంతయు ఆచరించుట చాల

దుర్ఘటము. ఇట్లు నేను ఆచరించగలనా?

స్వా.ప్ర.:-

***శరీర నిరపేక్షస్య దక్షస్య వ్యవసాయినః |***
***బుద్ధి ప్రార మ్భకార్యస్య నాస్తి కించన దుష్కరమ్||***

శరీరాభిమానము లేని వాడును, నిర్భయుడును, నేర్పరియును, నిత్యమును పరిశ్రమ చేయువాడును, బుద్ధి చెప్పినట్లు పనిచేయు వాడును అగు వ్యక్తికి దుష్కరమయినది ఏమియును లేదు."

శరీర నిరపేక్షస్య :-నేను సంసారము నుండి నివృత్తిని పొంది ఏకాంతమున కూర్చొని భజన చేసినచో నా శరీర నిర్వహణము ఎట్లు జరుగును అను యోగ క్షేమమునకు సంబంధించిన విచారము ఉండరాదు.

ద క్ష స్య :-యోగాభ్యాసము చేయుచున్నప్పుడు ఆతని తపము, త్యాగము, నిష్కామము చూచి అతనియందు పూజ్య

భావముచే ఆకర్షణ పొంది అనేక మంది సత్కారము, గౌరవము, పూజలు, ద్రవ్యాదులు స్వీకరించమని ప్రార్థించెదరు. ఆ ఆశలకు లోనుకాకుండు నేర్పరితనము కలవాడు.

వ్యవసాయినః :- ఆత్మజ్ఞానము కొరకు నిర్విరామకృషి చేయువాడు.

బుద్ధిప్రారమ్భకార్యస్య :-సత్త్వ ప్రధానమగు వివేక బుద్ధిద్వారా వైరాగ్యాది సాధన సంపన్నుడయి యోగ సాధన చేయువాడు.

నా కించన దుష్కరమ్:- అట్టివానికి దుష్కరమయినది ఏమియును లేదు.

# జీవేశ్వరాఽద్వైతము

భక్త :- జీవుడును, ఈశ్వరుడును ఒకడే అని చెప్పెదరు. కాని వారిలో ఈశ్వరుడు సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును కూడను. జీవుడు మాత్రము

అల్పజ్ఞుడు, అల్పశక్తి మంతుడు. ఇట్టి విరుద్ధ లక్షణములు కల జీవేశ్వరులు ఒకటి అని ఎట్లు అనుకొనగలము? జీవేశ్వరులు ఒకటి అయినచో ఉపాస్య ఉపాసక భావము ఎట్లు కలుగును?

స్వా. ప్ర. :- అధిష్టానమగు జీవేశ్వరులు ఒకటే. కాని మూల ప్రకృతి యగు అజ్ఞానమును మాయ, అవిద్య అని రెండు బాగములుగా గ్రహించవలెను.

***మాయా చా విద్యా చ స్వయమేవ భవతి।***

“మూల ప్రకృతి యగు అజ్ఞానమే మాయ గను, అవిద్య గను రూపొందును.” అందును మాయ సత్త్వ ప్రధానము. తన ఆశ్రయమును ఆచ్ఛాదించ లేదు. తద్విశిష్టమగు చైతన్యము ఈశ్వరుడు. ఆతడు సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును. అవిద్య తమోగుణ ప్రధానము. అది తన ఆశ్రయమును ఆచ్ఛాదించును. తద్విశిష్టమగు జీవుడు అల్పజ్ఞుడును, అల్ప శక్తిమంతుడును. ఇది ఉపాధి

భేదముచే కలుగును. కావున జీవేశ్వరులలో విరోధ ప్రతీతి కలుగును. పురుగుపై చిన్న రాయి వేసినచో చనిపోవును. ఏనుగుపై పెద్ద రాయి వేసినను మరణించదు. దాని భారమును సుఖముగా వహించగలదు. జీవాత్మ రెండింటి యందును సమానముగా నున్నను శరీరోపాధి యందలి భేదముచే భేదము కన్పించును. జల దృష్టితో సముద్రమును, తరంగమును ఒకటే అయినను సముద్రమునందు మొసళ్ళు, మత్స్యములు, ఓడలు మొదలగునవి అనేకము ఉండును. తరంగమునందు ఉపాధి భేదముచే వానికి స్థానము లేదు. ఉపాధి భేదముచే ఈశ్వరుడు పెద్దవాడు. జీవుడు చిన్న వాడు. ఈశ్వరుడు ఉపాస్యము. జీవుడు ఉపాసకుడు. తత్త్వ దృష్టితో ఉభయులును ఒకటే. శంకరభగవత్పాదులు ఈవిషయమున సెలవిచ్చిరి:-

***సత్యపి భేదా పగమే నాథః తవాహం న మామకీ నస్త్వమ్/***
***సాముద్రో హి తరఙ్గః క్వచన సముద్రో న తారఙ్గః//***

"ఓ స్వామి, భేదము లేదు. అయినను నేను నీ వాడనే. నీవు నా వాడవు కావు. తరంగము సముద్రమునకు సంబంధించినదే. కాని ఎట్లు చూచినను సముద్రము తరంగమునకు సంబంధించినది కాదు." తత్త్వ దృష్టిని పరికించిన అన్నిటియందును ఒకటే కలదు.

ఆంజనేయులువారు నిరంతరము శ్రీరామచంద్రుని సేవించుటలో తత్పరులై యుండిరి. వారి విషయమున కొందరకు సందేహము కలిగెను. "హనుమానుడు ఎంత కాలము నుండియో శ్రీరాముల వారిని సేవించుచునే యున్నాడు. అయినను ఇంకను ఆయన దాసుడే." అను కొనిరి. శ్రీరామచంద్రులు ఈవిషయమును గ్రహించిరి. నిండు సభలో ఆయన ఆంజనేయుని ప్రశ్నించిరి. "నీ

స్వరూపము ఏమి?” ఆయన తలచెను. శ్రీరామచంద్రుని దాసుడను అని చెప్పినచో భగవానుని సేవ చేయుచున్నాను. నేను దాసుడను గానే ఉండిపోయినట్లు జనులు అనుకొనెదరు. “నేను బ్రహ్మమును” అని చెప్పినచో “నీవు బ్రహ్మము అయినచో శ్రీరామచంద్రుని సేవచేయుట ఏమి?” అని ప్రశ్నించెదరు. ఇట్లు ఆలోచించి ఆయన సమాధానము చెప్పెను:-

***దేహ భావేన దాసోఽస్మి జీవ భావే త్వదంశకః|***
***ఆత్మ భావే త్వమేవాహమితి మే నిశ్చితా మతిః||***

“దేహ భావముచే నేను నీ దాసుడను. జీవ భావముతో నీ అంశమును, ఆత్మ భావముతో నీవే నేను అని నా దృఢ నమ్మకము.”

తాత్పర్యమేమన దేహేంద్రియముల దృష్టితో తాను జగము నంతకును దాసుడు అను దాసత్వ భావమును పొందుటచే గర్వము, అభిమానము,

రాగద్వేషాదులు మొదలగు దోషములు నివృత్తిని పొంది ఈశ్వర భావమును పొందుదురు. ఎవడైన క్రోధముతో నీ ఎదుటకు వచ్చినచో అది పరమాత్ముని నృసింహ స్వరూపముగా తలచుము. ధూర్తుడు ఎవడైన వచ్చినచో అవి పరమాత్ముని వామన స్వరూపముగా భావించుము. మాయగాడు ఎవడైన మాయ చేయుటకు వచ్చినచో ఆతనిని పరమాత్ముని కృష్ణ రూపముగా తెలిసికొనుము. ధర్మాత్ముడు ఎవడైన వచ్చినచో అతడు సాక్షాత్తు శ్రీరామచంద్ర భగవానుడని అనుకొనుము. ఇట్లు అందరను పరమాత్ముని గనే చూడుము. ఈశ్వరుడు అనేక అవతారాలు ఎత్తినట్లు గనే జగము నందు ఒకే పరమాత్మ అనేక రూపములు ధరించెను. శ్రుతికూడ చెప్పుచున్నది:-

***తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్ ॥***

"పరమాత్ముడు దానిని (కార్యరూపమగు జగమును) సృజించి దానియందే తాను జీవరూపమున ప్రవేశించెను."

ఇట్టి దృష్టిని పొందుటచే పశుపక్ష్యాది ప్రాణులన్నిటి యందును మానవుడు పరమాత్మని దర్శించును. ఈవిషయమున శ్రీమద్భాగవతమును పరికించుడు :-

***ఈశ్వరో జీవకలయా ప్రవిష్టో భగవానితి।***
***ప్రణమేద్దణ్డవద్భూమౌ శ్వాచాణ్డాలగో ఖరమ్॥***

"అన్నిటియందును జగదీశ్వరుడు తన జీవకళారూపమున ప్రవేశించెను. అని తలచి కుక్క, చండాలుడు, గోవు, గాడిద అన్ని జీవులకును నమస్కరించవలెను."

ఏ ప్రాణి అయినను సరే, తుచ్ఛమైనదని తలచరాదు. తాను గొప్ప వాడను అనుకొనరాదు. తాను ఎదుట వారికి ఎవరికిని నమస్కరించ రాదనియును, ఇతరులు తనకు నమస్కరించవలెననియును అనుకొనరాదు. అట్టి అహంభావమును వీడి అన్నిటియందును ఈశ్వర భావమును పొంది నమస్కరించవలెను. అనగా త్రోవలో వచ్చుచు పోవుచు ఉన్నప్పుడు కన్పించిన

పశు పక్ష్యాదులన్నిటికిని నమస్కరించవలెనని భావము కాదు. ఎల్ల ప్రాణులయందును ఈశ్వర భావమును పొందుము. ఇట్లు చేయుటచే గర్వాదులు నశించును. శత్రు, మిత్రాది విషమ దృష్టి తొలగిపోవును. సర్వాత్మభావము కలుగును. ఇట్టి సర్వాత్మభావము జ్ఞాన దేవుని యందు ఉండెను.

జ్ఞాన దేవుడు తన సోదరుడైన నివృత్తి నాథునితో బ్రాహ్మణుల వద్దకు వెళ్ళెను. [1]తాము

---

[1] జ్ఞాన దేవుని తండ్రి విరక్తుడై సన్యాసుల గుంపులో చేరెను. కొద్దిరోజుల తర్వాత అతనికి దీక్ష యిచ్చిన గురువుగారు రాగా జ్ఞాన దేవుని తల్లి వారికి సాష్టాంగ ప్రణామము చేసెను. ఆ గురువుగారు ఆమెను 'పుత్రవతీ భవ' అని ఆశీర్వదించిరి. అంతట ఆమె భర్త గుర్వాజ్ఞచే తిరిగి గృహస్థాశ్రమములో ప్రవేశించగా ఆ

సన్యాసి కుమారుల మనియును అందుచే తమకు ఏదో రీతిని ప్రాయశ్చిత్తము చేసి, పవిత్రుల జేసి యజ్ఞోపవీత ధారణ చేయుంచుడనియును ప్రార్థించెను. సన్యాసి కుమారునికి ప్రాయశ్చిత్తము అనునది లేదని బ్రాహ్మణ సభ నిర్ణయము చేసి ఆవిషయము జ్ఞానదేవునకును అతని సోదరునికి తెలిపిరి. సభ ముగియు సమయమున వారిలో ఒకరు ఆ సోదరులిద్దరిని ఇట్లు ప్రశ్నించెను. మీ పేర్లకు అర్థములు మీకు తెలియునా? తెలిసినచో చెప్పుడు, నివృత్తి నాథుడు చెప్పెను:- నా పేరు 'నివృత్తి'. ప్రవృత్తి మార్గమునకు పోకుండ స్వసుఖామృతమును అనుభవించెదను.

---

దంపతులకు జ్ఞాన దేవుడు, నివృత్తి నాథుడు అను ఇద్దరు కుమారులు, ముక్తా బాయి అను కుమార్తెయు జన్మించిరని కథ కలదు.

# ముప్పదియవ ప్రసంగము

జ్ఞాన దేవుడు పలికెను:- నా పేరును అనుసరించి వేదములు అన్నియును నాకు తెలియును. చిన్న పిల్లల నోట నుండి ఇంత పెద్ద మాటవిని సభాసదులు నవ్వ కుండ నుండ లేక పోయిరి. ఇంతలో త్రోవను పోవు చున్న ఒక దున్నపోతును చూపించి వారు ఇట్లనిరి:- పేరులో ఏమి కలదు? ఈ దున్నపోతు పేరు కూడ జ్ఞాన దేవుడే.

ఇది విని జ్ఞాన దేవుడు పలికెను:—నిజమే. ఈ దున్నపోతు నందును, నా యందును కూడ ఉన్న ఆత్మ భావమునందు ఇసుమంతయును భేదము లేదు. ఆ దున్నపోతు కూడ నా ఆత్మయే. అన్ని దేహముల యందును ఒకే పరమాత్మ నిండి యున్నది. ఎన్ని కుండల నీళ్లు పెట్టినను వాటి అన్నిటియందును ఒకే సూర్యుడు ప్రతిబింబించును. ఉపాధి భేదముచే భిన్నముగా కన్పించును. అయినను వివేకము కలవాడు సూర్యుని సూర్యత్వము నందే లక్ష్యమును కలిగియుండును. కారణమున దృష్టి, స్థిరపడిన

వాడు కార్యమును చూచి కొంచెము కూడ ఆశ్చర్యపడడు వివిధములగు స్వర్ణాలంకారములు అన్నియును స్వర్ణ రూపములే. ప్రతిబింబాధిష్ఠానము బింబమే. వస్త్రము తంతురూపమయినట్లు నామరూపాత్మకమగు జగము కూడ పరమాత్మా రూపమే.

చైతన్యమయుడగు జ్ఞాన దేవుని దృష్టిలో తనకును దున్నపోతునకును భేదము కన్పించలేదు. జ్ఞాన దేవుని అంతరంగమున గల అభేద ప్రతీతి బ్రాహ్మణులకు కలుగుటకు ఎంతయో కాలము పట్టలేదు. దున్నపోతుల కాపరి దున్నపోతు వీపు పై మూడు దెబ్బలు కొట్టెను. వెంటనే జ్ఞాన దేవుని వీపుపై మూడుతట్లును లేచి వానినుండి రక్తము ప్రవహించ మొదలిడెను. ఇది చూసి సభాసదులందరును ఆశ్చర్యచకితులయిరి.

ఉపాధి భేదముచే కన్పించు భేద భావము వాస్తవికము కాదు అనియే దీని భావము.

# తత్త్వోపదేశముచే జ్ఞానోపలబ్ధి

భక్త:- అభేద జ్ఞానము ఎట్లు కలుగును ? గురువు ద్వారా కలుగునా? లేక శాస్త్రాభ్యాసముచే కలుగునా?

స్వా. ప్ర :-సాంఖ్య సూత్రములు చెప్పుచున్నవి:-

***రాజపురుషవత్తత్త్వోపదేశాత్ /***

"తత్త్వోపదేశముచే రాజపుత్రునకు కలిగినట్లు కలుగును."

ఒక దేశమున ఒక రాజు ఉండెను. అతనికి అన్ని సుఖములను ఉండెను. కాని సంతానము లేదు. ఎన్నియో యజ్ఞములును, దానములును చేసెను. 50, 55 సంవత్సరముల వయస్సు నందు ఆతనికి కుమారుడు కలిగెను. రాజ్యమంతయును ఎంతయో ఆనందించెను. రాజు గొప్ప గొప్ప జ్యోతిష్కులను పిలిపించి రాజకుమారుని జాతకమును చూపించెను. జాతకమును చూచినవారిలో ఒక జ్యోతిష్కుడు ఇట్లు

భయపెట్టెను:-

"ఈ రాజపుత్రుడు రాజ్యములో ఉన్నచో రాజ్యమునకు ఆపత్తు కలుగును." రాజు గ్రుడ్డి నమ్మకముతో రాకుమారుని మంత్రికి అప్పగించి చెప్పెను:-

"రాజకుమారుని అరణ్యములోనికి తీసికొనిపోయి వధించుము." మంత్రి ఎంతయో దయా స్వభావుడును, దూరదృష్టి కలవాడును అయి యుండెను. బాలకుని తేజోవంతమగు ముఖమును, సుందర రూపమును చూచి వధకులతో పాటు తాను కూడ అరణ్యములోనికి వెళ్ళెను. ఆ మంత్రి బాలకుని అరణ్యములోనికి తీసికొని వెళ్ళి భిల్ల దంపతులకు అప్పగించెను. బాలకుని పెంచుటకు వలయు ఏర్పాట్లు చేసి ఆ భిల్ల దంపతులకు వార్షికములను నిర్ణయించెను. ఈ విషయములు రాజునకు తెలియ నియ్య లేదు. రాజపుత్రుడు భిల్లుని వద్దనే పెరుగుచుండెను. అతడు బాల్యము నుండియు ఎంతయో

పరాక్రమవంతుడును, బుద్ధిమంతుడును అయియుండెను. అతడు ప్రతి దినము ధనుర్బాణములు ధరించి అరణ్యమునకు పోయెడివాడు. ఈవిధముగా ఆతనికి 18, 19 సంవత్సరముల వయస్సు వచ్చెను. ఈ సమయమునకు రాజుగారి వయస్సు కూడ 70 సంవత్సరములు వచ్చెను. అనారోగ్య కారణమున ఆయన శరీరము చాలా బలహీనమయ్యెను. అప్పుడు ఆయనకు పశ్చాత్తాపము కలిగెను. “నా కుమారుడు బతికి ఉన్నచో ఈ రాజ్య భారమును వహించి వార్ధక్యమున నాకు సుఖమును కలుగ జేసి యుండును కదా!” అని మంత్రి వద్ద వాపోయెను. మీ కుమారుడు బ్రతికియున్న ఏమి చేయుదురని ప్రశ్నించెను. రాజు పలికెను:- “ఇట్లు జరుగుట సంభవము కాదు. నా కుమారుని నీకే వధింప నప్పగించితిని కదా!” ఇది విని మంత్రి యథార్థ పరిస్థితులను వివరించి “మీ కుమారుడు జీవించి యున్నాడు అని విన్నవించెను.

రాజు పరమానందముతో పుత్రుని తోడ్కొని రమ్మని మంత్రికి ఆజ్ఞాపించెను. వెంటనే మంత్రి అరణ్యములోనికి వెళ్ళి భిల్లుని పిలచి "నీకు కొన్ని సంవత్సరములకు పూర్వము అప్పగించిన రాజ కుమారుడు ఎక్కడ ఉన్నాడ"ని అడిగెను. బిల్లుడు ఆ రాజకుమారుని తీసికొని వచ్చి మంత్రి ఎదుట నిలబెట్టెను. అశ్వారూఢులతోనున్న మంత్రిని చూచుటతోడనే రాజపుత్రుడు మిక్కిలి భయపడెను. మంత్రి ఆతనిని తన దగ్గరకు పిలచి ఇట్లనెను:-

"నీవు రాజకుమారుడవు. నీ రాజ్యమునకు రమ్ము నీ తండ్రి గారు పిలువనంపిరి."

రాజకుమారుడు చెప్పెను:-'నేను రాజకుమారుడను కాను. నేను భిల్ల బాలుడను. ఎదుట నున్న ఈ వ్యక్తులు నా తల్లిదండ్రులు.'

మంత్రి ఎంత తెలియజెప్పిన ఆ రాజకుమారుడు నమ్మలేదు. చివరకు "ఈమె నా తల్లి. ఈమె చెప్పిన నమ్ముదును." అని

రాకుమారుడు పలికెను. అంతట భిల్ల వనిత జరిగిన సంగతులన్నియును విశదీకరించెను. రాజకుమారుడు యథార్థమని విశ్వసించి మంత్రితో బయలు దేరెను. మంత్రి ఆతనిని రాజునొద్దకు తీసికొని వెళ్ళి చెప్పెను.

"నేను ఎంత చెప్పినను నితనికి నమ్మకము కలుగ లేదు. తల్లి చెప్పిన మాటలను నమ్మి ఇతడు ఇక్కడకు వచ్చెను."

ఒక్క మారుగా రాజు అతనిని కౌగిలించుకొనుటకు ముందుకు వచ్చెను. కాని రాజకుమారుడు సంకోచించెను. ఆతనికి మంత్రి ఎంత చెప్పినను తాను భిల్లుడను అను భావమే ఆతనిని వేధించుచుండెను. అంతట మంత్రి ఇట్లు వివరించెను. మీ ఉభయుల శరీరము ఒకటే. భిల్లులు నల్లగ కురూపులుగ నుందురు. భిల్లులతో నిత్యము సంచరించుచు, ఎండలో తిరుగుచున్నను నీ శరీర వర్ణము తెల్లగనే ఉన్నది. భిల్లుల శరీరమువలె నల్లగ లేదు. అనంతరము అద్దములో రాకుమారునకు ఆతని స్వరూపమును

చూపించెను. అంతట రాజ కుమారునకు పూర్ణానుభవము కలిగెను.

***సంవర్ధితో రాజపుత్రో వనే భిల్లేన కేనచిత్।***
***న త్వం భిల్లో రాజపుత్ర ఇత్యాప్తేన ప్రబోధితః॥***

"వనమునందు భిల్లునిచే పెంచబడిన రాజపుత్రుడు 'నీవు భిల్లుడవు కావు, రాజపుత్రుడవు' అని ఆప్త జనునిచే ప్రబోధించబడెను."

ఇటులనే మంత్రి వంటి గురువును, భిల్లమాత వంటి శృతియును రెండును కావలెను. గురువు ద్వారా శృతిని శ్రవణము చేసి, మనన, నిది ధ్యాసములు చేయుటచే రాకుమారునకు అనుభవము కలిగినట్లుగా తనకు అభేద జ్ఞానము కలుగును.

భక్త:- ఖాళీగా కూర్చొనినచో మనస్సు అటునిటు పరుగెత్తదు. కాని మాలాదులు తీసికొని జపించుచున్నప్పుడు మనస్సు ఎక్కువగా

పరుగెత్తును. కారణమేమి?

స్వా. ప్ర. :— ఈ విషయమున ఒక దృష్టాంతము కలదు.

ఒక బ్రాహ్మణుడు గలడు. అతనికి ఒక ఆవు ఒక దూడ ఉండెను. ఆ దూడ పెద్దదైన తరువాత ఆ బ్రాహ్మణుడు ఒక గొల్లను పిలచి ఆ ఆవు దూడను అరణ్యమునందు విడచెను. అక్కడ ఆ దూడ చూడు కొనెను. ఇది తెలిసికొని బ్రాహ్మణుడు ఆవుదూడను తీసికొని వచ్చుటకు గొల్లతో అరణ్యమునకు వెళ్ళెను. కాని ఆ దూడ రాలేదు. బ్రాహ్మణుడు ఎంత శ్రమపడినను ఆవుదూడ అతనితో రాలేదు. మెడలో త్రాడు కట్టి లాగినను రాలేదు. అంతట తెలివిని ఉపయోగించి మెత్తని లేత పచ్చ గడ్డిని చూపించగా గడ్డి తినవలెనను కోరికతో ఆతని వెంట నడచెను. బ్రాహ్మణుడు ఇంటికి తీసుకొని వచ్చి దానికి తెలకపిండి మొదలగునవి తినిపించెను. దాని రుచి తెలియక యుండుటచే తిని మరల అరణ్యమునకు బయలు దేరును. తిరిగి గడ్డి, తెలకపిండి

చూపించగా బ్రాహ్మణ ఇంటికి వచ్చి తిరిగి అరణ్యమునకు పోవుచుండెను. ఒక సారి బ్రాహ్మణుని యింట ఉండగా ఈని దూడ ను కనుట సంభవించెను. దానితో ఆ ఆవు కూడ ప్రేమ పాశమునకు కట్టు పడిపోయెను, ఇక అది ఇంటనే ఉండి పోయెను. కర్రతో కొట్టినను బైటికి పోలేదు. తాత్పర్యమేమన:- ఆవరణ భంగమయి జ్ఞానమను కుమారుడు కలిగినంతనే వృత్తి అంతర్ముఖమయి మనశ్చాంచల్యము నశించును.

# ఏకాంత మహాత్మ్యము

తదుపరి భక్త వరుడు ప్రశ్నించెను:- నేను చాల రోజులనుండి భార్యను కోల్పోయి ఉన్నాను. నాకు వేరొక ఉపాధి కూడా లేదు. ఏకాంతమున నుండి అభ్యాసము చేయవలెనని నా ఉద్దేశ్యము.

స్వా. ప్ర. :- ఇది చాల మంచి తలంపు. ఇంతవరకును మహాత్ములయిన వారు అందరును ఏకాంతమున ఉండియే కార్య సిద్ధిని పొందిరి. ఏకాంతమును గురించి పారసభాగమున

# ముప్పదియవ ప్రసంగము

వివరించబడింది:-

ఏకాంతమునందు ఆరు లాభములు కలవు.

1. భజన అన ఆలోచనా సిద్ధి. చిత్తైకాగ్రత ఏకాంతమున కలుగును. చిత్త వృత్తిని భగవానుని యందు లీనము చేసి పదార్ధములను అన్నిటిని విస్మరించుట అనునది ఏకాంతమున కాని జరుగదు. ఏలనన మాయా పదార్థములు అన్నియును జీవుని బంధనమున చిక్కుపడునట్లు చేయును. ఎంతయో భాగ్యశాలియగు జిజ్ఞాసువునకే సంసారముతో నిర్లిప్తుడుగా నుండు శక్తి కలుగును. మహాపురుషులు ఆరంభావస్థ యందు పర్వత గుహలయందు నివసించెడివారు. పూర్ణావస్థను పొందిన తరువాత శరీర వ్యాపారమును పూర్తి చేయుటకు మాత్రమే జగముతో సంబంధము కల్పించుకొనెడి వారు. ఇక వారి చిత్తమును భగవద్భజనము నందే సంలగ్నము చేసెడివారు. భగవత్ప్రీతి జగత్ప్రీతి నుండి సంతునికి విరక్తి, కలిగించునని మహాపురుషులు చెప్పుదురు. ఒక సంతు చెప్పెను.

“నేను ముప్పది సంవత్సరములనుండి భగవంతునితో మాట్లాడుచున్నాను. కాని తమతో మాట్లాడుచున్నానని ఈజగము నందలి జనులు అనుకొనుచున్నారు.” ఇట్టిది అసంభవము కాదు. ఏపదార్థము నందైన మిక్కిలి ప్రేమ కలిగినచో జన సమూహమునందు కూర్చొనినను వారి మాటలను వినము. వారిని చూడము కూడను అయినను ఈ దశను పొంది గర్వించ రాదు. చాలమంది జన సంపర్కముచే పాడగుదురు.

ఒక తపశ్శాలి కలడు. ఆయనను జనులు ప్రశ్నించిరి:- స్వామీ! తమరు ఒంటరిగా ఎందుకు ఉండుచున్నారు? ఆయన సమాధానము చెప్పెను:- “నేను ఒంటరిగా లేను. నాతో భగవానుడు ఉన్నాడు.”

ఏకాంతమున ఉన్న మరియొక సంతుని కూడ ఇట్లే ప్రశ్నించగా అతను ఇట్లు చెప్పెను:- నేను నా కర్తవ్యమున పొందిన నిమగ్నత వలన ఇతరులను కలియవలె ననెడి కోరిక కూడా నాకు

కలుగదు.

ఆ కర్తవ్యము ఏమి అని వారు ప్రశ్నించిరి, ఆతడు ఇట్లు సమాధానము చెప్పెను:- అనుక్షణము భగవానుడు నాకు చేయు ఉపకారముల సంఖ్య పెరుగుచున్నది. నా పాపములను క్షమించమని ప్రార్థించుటలో నా సమయము వ్యయమగుచున్నది. ఇతరులను కలసికొనుటకు అవకాశము ఉండుట లేదు. ఇట్టి సంతులు ధన్యులు కదా!

ఒక జిజ్ఞాసువు మరియొక సంతు వద్దకు వెళ్ళెను:-

"నీవు ఎందుకు ఇచ్చటకు వచ్చితివి?" అని ఆయన ప్రశ్నించెను.

జిజ్ఞాసువు జవాబు చెప్పెను:-

తమ సాంగత్యమున విశ్రాంతిని పొందుటకు వచ్చితిని.

సంతు చెప్పెను:-

"భగవంతుడు లభించిన వాడు విశ్రాంతి

కొరకు మరి ఏ చోటికి వెళ్ళవలెను?"

మరియొక సంతు పలికెను:-

“రాత్రి అయిన నాకు ఆనందము కలుగును. ఏలనన ప్రభాతము అగు వరకును ఏకాంతమున భగవద్భజనము చేయుచు ఉండవచ్చును. సూర్యోదయము అయినంతనే జనులు విక్షేపము కలుగ జేయుదురను బాధ కలుగును.”

మరియొక సంతు చెప్పెను:-

“జనులతో వాద వివాదములను చేయవలెనను కొనువారు మూర్ఖులు. వారి హృదయము మాలిన్యమును పొందును. ఆయువు వ్యర్థమగును.”

ఒక బుద్ధిమంతుడు చెప్పెను:-

“ఏ మనుష్యుని అయినను కలిసికొనవలెనను కోరిక కలిగినచో వారి హృదయమున ఆత్మ సుఖమును పొందు కోరిక లేదని తెలిసికొన వలెను. కావుననే స్థూల

పదార్థములను కోరును. జనులను కలసి కొనగోరువాడు కడు బీద వాడు.”

ఈ దృష్టాంతముల బట్టి ఉత్తమమగు భజన హృదయమునందలి అభ్యాసము అని తేలుచున్నది. అభ్యాసము చేతనే భజన రహస్యము తెలియనగును. ఆలోచనా శక్తియు, జ్ఞానమును కలుగును. ఇవియే సాధనమునకు మూలము. ఈ అభ్యాసము ఏకాంతమునందు తప్ప మరియొక విధముగా జరుగదు. ఏకాంతముచే అనేక పాపములనుండి విముక్తుల మగుదుము. జనుల సాంగత్యమున చేరు నాలుగు రకముల పాపములనుండి తప్పించుకొన గలుగువారు చాల తక్కువ మంది కలరు.

1. నింద. ఇది మొదటి పాపము. దీని చే ధర్మ భ్రష్టులగుదురు.

2. ఇతరులు అపకృత్యములు చేయు చుండగా చూచి ఉపదేశించ కుండుట. దీనిచే సాధకుడు శాస్త్రముల విధి నుండి

విముఖత్వమును పొందును. ఒక వేళ ఉపదేశించినను ఆ ఉపదేశమును విననుద్దేశ్యము వ్యక్తికి లేనిచో ఆతనితో విరోధము కలుగును.

3. దంభము:- ఎవరైన కలసి కొనుటకు వచ్చినచో "మిమ్ము కలసి కొనవలెనని చిర కాలము నుండి అభిలాషగా నున్నది. అది నేడు ఈడేరినది. అది. మీ బంధువులు అంతా క్షేమమా. " ఇట్లు మాట్లాడెదరు. హృదయమున అతనియందు కాని ఆతని బంధువులయందు కాని ప్రేమ ఉన్నను లేక పోయినను ఆవిధముగా మాట్లాడుట దాంభిక ప్రవర్తనగా నెరుగవలెను.

ఒక వ్యక్తి ఒక సంతు వద్దకు వెళ్ళెను. సంతు ఆయన రాకకు కారణము అడిగెను. "తమ దర్శనము చేయవలెనను ప్రేమతో వచ్చితిని" అని అతడు చెప్పెను.

సంతు చెప్పెను:-నీవు నా యందలి ప్రేమతో రాలేదు. ప్రేమను పోగొట్టుకొనుటకు వచ్చితివి. ఏలనన నీవు నా స్తుతి తగినంతగనే చేయలేదు.

మితిమీరి నన్ను స్తుతించి నీ గొప్పతనమును ప్రకటించితివి. కావున మనము ఇరువురము దంభముచే పాషండులము అయితిమి. అందుచే ప్రేమ శాశ్వతముగా నిలువదు. కావున ప్రేమ కలవారు ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసి కొనరు. కొన్ని సమయములలో వేసిన కుశల ప్రశ్నలకు సంతులు చెప్పు సమాధానములు వినుడు.

1. సుఖముగాను ఆనందముగాను ఉన్నాము.

2. పొందవలసిన పదవి పొందు శక్తి నా చేతిలో లేదు. దుఃఖ దాయకములగు కర్మములనుండి నివృత్తిని పొందుటకూడ నాచేతిలో లేదు. నేను నా యోగక్షేమములను భగవానుని చేతిలో ఉన్నవని తెలిసికొంటిని. కావున నా వంటి దుఃఖితుడు, అనాధుడును ఎవడును లేడు.

3. నేను పాపాత్ముడను. దుర్బలుడను.

ప్రారబ్ధము అనుభ వించుచున్నాను.

4. నరక దుఃఖము నుండి నిర్భయుడను అయినచో నిజమగు సుఖము కలుగును.

5. ఉదయమున లేచినచో సాయంకాలము వరకును జీవించునో, జీవించడో తెలియని వాని సంగతి ఏమని చెప్పుదును?

6. ఆయువును, బలమును తగ్గించు, పాపము పెరుగుచు ఉండు వాని సంగతి ఏమని చెప్పుదును?

7. ప్రభువు ఇచ్చినది తినుచున్నాను. మనస్సు ఇచ్చిన ఆజ్ఞలను పాటించ చున్నాను.

8. ఆయుర్దాయము, బలము అనుక్షణము తగ్గి పోవుచున్నవి. అయినను పెద్దవాడు అగుచున్నానని తలచుచున్నాను. అట్టివాని సంగతి ఏమని చెప్పుదును?

9. మరణమే తప్పని సరియును పరలోకమున దండన పొందుటకే పాత్రుడు అయిన వానిని గురించి ఏమి చెప్పుదును?

10. పాపము చేయని రోజున పరమ సుఖమును పొందుదును. జీవితమునందు అట్టి రోజు ఒకటి లభించినను అది నా మహా భాగ్యముగా తలచెదను.

11. దూర దేశము వెళ్ళవలెను. దగ్గర దిన బత్తెము లేదు. మార్గము మహా భయంకరమైనది. కూడ నెవరును లేరు. వెళ్లునది న్యాయాధికారి వద్దకు. తప్పించు వాడు ఎవడును లేడు. అట్టి వాని దుర్దశ ఏమని చెప్పగలము?

4 వ పాపము:- మనము ఎవరి సాంగత్యము చేయుదుమో వారి స్వభావము మనయందు ధృఢముగా నాటుకొనిపోవును. ఆ సంగతి మనకు తెలియదు కూడను. ఆ కారణముచే ఆ స్వభావము పెరిగి పోవును. మహాపురుషుని సాంగత్యముచే హృదయము కోమలమయి నట్లుగనే భోగలాలసుని సాంగత్యముచే హృదయమునందు భోగముల యందు అభిరుచి కలుగును. కమ్మరి కొలిమి దగ్గర కూర్చొనినచో బట్టలు నల్ల పడి పోవు నట్లు

దుస్సాంగత్య పరిణామము కూడ అయోగ్యముగా ఉండక తప్పదు. సాత్విక పురుషుని సంగతి అత్తరు దుకాణమువంటిది. ఎవరి సాంగత్యముచే మాయ యందలి ప్రేమ పోయి భగవత్ప్రీతి కలుగునో వారిని ఉత్తములుగా తలచుము. వారిని ఎప్పుడును త్యజించకుము. కాని విద్వాంసుడైనను, ఆతని కృత్యములు మాటలను అనుసరించి ఉండక పోయినచో ఆతనిని తప్పక త్యజించుము. జన సమాగమమున ఇట్టి భయములు ఉండును.

ఏకాంతమున నుండుటచే సంసారము నందలి ఈర్ష్య, ద్వేషము, సంప్రదాయ విరోధము, మొదలగు విఘ్నములనుండి తప్పించు కొన వచ్చును. ఉపాధినుండి ముక్తిని పొందనగును. అందరును తనను గురించి ఎట్టి ఆశలును పెట్టు కొనరు. తాను ఇతరులనుండి ఎట్టి ఆశలును కలిగియుండడు. ఆశ దుఃఖములన్నిటికిని మూలము. ఆశారహితు డవవలెననిన

ఏకాంతము ఉత్తమ ప్రదేశము ఏకాంతమున నుండుటచే మూర్ఖులు, పాపాత్ములు అగు వారి సాంగత్యం నుండి విముక్తులగుదురు.

## సాంగత్యముచే కలుగు లాభములు

పరమార్థము ఏకాంతమున లభించదు. సాంగత్యము చేతనే లభించును. సాంగత్యముచే ప్రథమమున విద్యా లాభము కలుగును.

కావున యథార్థమగు విద్య లభించు వరకును ఏకాంతముచే ప్రయోజనము లేదు. విద్యను పొందకుండ ఏకాంతమున నున్న వాడు నిద్ర యందును, వ్యర్థమగు ఆలోచనల యందును తన సమయమును వ్యయము చేయును. ఆతడు భజన యందు నిమగ్నుడయినను యథార్థ జ్ఞానము కలుగనిదే భజన అభ్యసించబడదు. భగవంతుని తెలిసికొనుట ఎట్లో ఎరుగ లేడు. ఏవేవియో కొన్ని విపరీత నిర్ణయములను చేసికొని భగవానుని సమ్ముఖమునకు చేరుటకు బదులుగా

విముఖుడయి కుమార్గమును పట్టును. రోగి వైద్యుని సాంగత్యము విడచుట హితకరము కానట్లుగనే జీవుని బుద్ధి విద్యను పొందనిదే వ్యాధిగ్రస్త మగును. అట్టి వాని ఏకాంతము ఫలించదు. యథార్థమగు విద్యను తెలిసికొని, ఆవిధమగు కృత్యములను చేసి, అట్టి ఉపదేశములను చేయువాడు మహోత్తముడు. ఉపదేశమును తీసికొనుటయును, ఇచ్చుటయును ఏకాంతమున జరుగదు.

2. సాంగత్యముచే ఇతరులను సంతోషపరుచ వచ్చును. ఏకాంతమున ఎట్టి సేవయును చేయలేము.

3. సాంగత్యముచే సహనము మొదలగు గుణములు కలుగును.

4. అనేక విధములగు సందేహాలను సంకల్పములును పోవును.

5. అన్యోన్యము ప్రేమయును వృద్ధి పొందును.

6. జన సమూహము చేతను, వారితో కలిసి ప్రవర్తించుట చేతను, నిరభిమానము వినయము పుట్టును. ఏకాంతమున ఇంతకు విపరీతములగు భావములు పుట్టును. కొందరు ప్రభు వృత్తి చే ఏకాంతమును సేవింతురు. ఎల్లరును వారి దర్శనమునకు వచ్చెదరని, వారి ఆశయము.

ఒక నగరమున ఒక బుద్ధిమంతుడు ఉండెను. ఆతడు ఎన్నియో గ్రంథములు రచించెను. అంతటితో తాను భగవత్సామీప్యమును పొందెనని ఆతడు తలచెను అప్పుడు ఆయనకు ఆకాశవాణి విన వచ్చెను:-

"నీవు నన్ను జగమున ప్రకటించుకొంటివి. ఇట్టి గొప్పతనము నాకు ఇష్టము లేదు." ఇది విని అతడు సర్వమును త్యజించి ఏకాంతమును సేవించుచు ఇక దేవుడు తనయందు ప్రసన్న డయ్యెనని అనుకొనుచుండెను. మరల ఆతనికి ఆకాశవాణి విన వచ్చెను:- "ఇంకను నేను నీయందు ప్రసన్నుడను కాను. నీవు గొప్పవాడ నను కొనుచున్నావు." అంతటి నుండి ఆతడు

ఏకాంతమును త్యజించి జన సమూహము నందుండి యథార్థముగా వ్యవహరించెను. అభిమాన రహితుడయి సమ భావముతో నుండెను. అప్పుడు ఆతనికి ఆకాశవాణి విన వచ్చెను-

"ఇప్పుడు నేను నీ పట్ల ప్రసన్నుడను అయితిని."

జన సమూహమునందు ఉండుటచే గౌరవము తగ్గిపోవును విద్య యందును, కృత్యములయందును ఎవరైన ఛిద్రములు చూచెదరేమో నను భయముతో ఏకాంతము అనెడు తెరతో దానిని కప్పగోరును. జనులు ప్రతి దినము తన దర్శనమునకు వచ్చి, తనకు సాష్టాంగ దండ ప్రణామములు చేయవలెనని ఆశించును. ఈవిధమగు ఏకాంతము దంభము మాత్రమే. ఏకాంతము నందుండు వ్యక్తి ఎప్పుడును భజనము, తత్త్వవిచారము- వీనిని మరువరాదు. జిజ్ఞాసువు ఈ రెండు రకముల

స్థితులను పొందనంతవరకును యథార్థ భేదమును తెలిసికొనలేడు.

"జగమంతయు నశ్వరము అను జ్ఞానము ప్రథమమున కలుగవలెను. తరువాత జగము తనను ఏమనినను బాధ కలుగని మనస్సును పొందవలెను. అటులనే మానావమానముల భయము ఇంచు కంతయును ఉండరాదు. అట్టి నరుడే ముక్తుడు.

తన అధికారమును గమనించి అధికారము ననుసరించి ప్రవర్తించవలెను. ఏకాంతమున నుండు తన కర్మ చేతను వాక్కు చేతను ఎవరికిని ఖేదము కలుగ రాదని తలచవలెను. అటులనే జగత్తు యొక్క ఉపాధిచే తనకు దుఃఖము కలుగ రాదనియును భావించి అన్ని విధములగు చిక్కుల నుండియు బయటపడి భగవద్భజనము నందు అవధానమును కలిగియుండవలెను. ఇట్టి నిశ్చయము కలిగినవానికి సర్వ సంకల్ప నిరోధమును కలుగ జేయునది ఏకాంతమే. ఏకాంతమున ఉండు వారు ఆహార వస్త్రాది

సంయమమును పాటించవలెను. ఎవడైన తన కృత్యముల చేతను, వాక్కుల చేతను దుఃఖము కలుగ జేసినను ఆతనిని క్షమించవలెను. తన నిందా స్తుతులపట్ల లక్ష్యమును ఉంచరాదు. ధర్మ కార్యములయందు అవధానమును నిలిపి తన ఉత్తమ కార్యమును సిద్ధింప జేసి కొనవలెను.

ఇంతలో పీరడియా అను గ్రామము నుండి కొంతమంది రైతులు స్వామివారి దర్శనార్థము ఏతెంచిరి. ప్రసంగ వశమున వారు పలికిరి:- నాలుగైదు రోజులకు పూర్వము ఈ పరిసరములకు ఒక అవధూత వచ్చిరి. వారు పంచాగ్ని మధ్యమున తపము చేయుదురు. గంజాయి మిక్కుటముగా త్రాగుదురు. అచ్చటికి ఎవరైన సాధువులు వచ్చిన వారిని ప్రశ్నించును:- నీ మఠము పేరేమి? నీవు గంజాయి త్రాగునప్పుడు ఉచ్చరించు మంత్రమేది? నీకు ఆ మంత్రము వచ్చునా? ఈ మంత్రము వచ్చునా? అని ప్రశ్నించును. సాధువులు సమాధానము చెప్పలేక

పోయినచో వేళాకోళము చేయును. గంజాయి త్రాగుటకు అలవాటుపడిన వారు అనేకులు అచ్చటికి చేరి, స్వామి! గంజాయి త్రాగుటవలన ప్రయోజనము ఏమి అని వారిని ప్రశ్నించిరి. ఆయన ఇట్లు సమాధానము చెప్పెను.

"గంజాయి త్రాగనిదే భగవద్ధ్యానము ఎట్లు చేయనగును? భగవానుడుగు శంకరుడు కూడా గంజాయి త్రాగి యోగాభ్యాసము చేసి యోగసిద్ధిని పొందెను." ఈ విధముగా ఆయన గంజాయిని సమర్థించెను.

స్వా.ని:—ఈ విషయమున "అనుభవ ప్రకాశము" నందు ఒక కథ కలదు.

పరాశరుడు:- నేను నీవు లేని చోట హృషీకేశుడగు గోవిందుడు ఉన్నాడు. ఈవిషయమున ఒక కథ వినుడు:-

## దంభముతో కూడిన వైరాగ్యమును, తపమును

ఒకప్పుడు సంతులమగు మేము అందరము కలసి ఒక మార్గమున, పోవుచుంటిమి. ఆ మార్గమున పంచాగ్ని తప్తుడగు ఒక తపశ్శాలి కన్పించెను. ఆయనను చూచి మేము స్వాభావికముగా ఆయన వద్దకు వెళ్ళితిమి. తపశ్శాలి అడిగెను:- ఓ సంతులారా మీరు ఎవరు? ఎచ్చటి నుండి వచ్చుచున్నారు? ఎక్కడికి వెళ్లుచున్నారు?

జడ భరతుడు చెప్పెను:- నీవు ఇప్పుడు ఉన్నట్లు గనే ఎల్ల కాలముల యందును అగ్నిలో కాలుచునే యుండుము. వ్యర్థముగా మమ్ము అడుగుటచే నీకు ఏమి ప్రయోజనము సిద్ధించినది? కాని గోవిందుని భక్తి లేనిదే కర్మము లన్నియును వ్యర్థము. కావున గోవిందుని భజించుము. దానిచే ద్వైత మాలిన్యము తొలగును. భజన చేయకుండ పీల్చు శ్వాస నిరర్థకము అని తెలిసికొనుము. మాంసపు ముద్ద వంటి జిహ్వా భజనము చేయనిదే వ్యర్థముగా

నోటిలో నుంచు కొన దగదు. వ్యర్థమగు మూర్ఖ ప్రలాపముల కొరకు జిహ్వా సృజించ బడ లేదు. నోటితో భజన చేయుచు పాపములయందు మనస్సు సంచరించుచున్నచో మేలు ఎట్లు అగును? భజన మానవ కళ్యాణమునకు సంబంధించినది. ఇందు ప్రారబ్ధమును అంగీకరించవలెను. ధన సంపాదనమునందు పురుషార్థమును గమనించవలెను. శరీరము మృత్యువు నోట పడును. అయినను మానవుడు కామముతో కూడిన జీవితమును గడుపు చున్నాడు. శరీర పాతమునకు పూర్వమే మానవుడు తన కళ్యాణమును పొందవలెను. మృత్యువు సమీపించిన కొలదియు ఏమి చేయుటకును శక్తి ఉండదు. ఈ సంగతి మానవుడు ఎరుగడు. నీవు తపశ్శాలివి అని అనుకొనుచున్నావు. అది వ్యర్థము, నీ అహంకారమును త్యజించుము.

తప:- తమరిని కలియుటతోడనే అహంకారము శమించినది. అగ్ని సాంగత్యముచే

కట్టెకు తన రూపము ఉండదు. అగ్ని రూపమే ఉండును.

జడ భరతుడు :--కర్మలను అన్నిటిని జ్వలింప జేసి నైష్కర్మ్యము అను భస్మమును శరీరమునకు పట్టించుకొనువాడు తపశ్శాలి. నీవు దేనినైనా భస్మము చేసితివా?

తప :-చెప్పు వివేకము లేదు. అంతేకాదు. త్యజించదగిన పదార్థములు ఏవియో గ్రహించదగినవి ఏవియో నాకు తెలియనే తెలియవు.

జడ భరతుడు:- ఓ తపశ్శాలి! దుఃఖ దాయకములగు పదార్థములను జనుడు త్యజించును. సుఖమును కలుగజేయు వానిని స్వీకరించును. విషయేంద్రియ సంబంధము సంయోగ వియోగములయందు సుఖ దుఃఖములను గ్రహింప జేయు మనో రూపమగు అహంకారము అజ్ఞానులగు జీవులను అందరను

బాధించును. దుఃఖమును కలుగ జేయు ఆ అహంకారమును నీవు ఇంత వరకును త్యజించలేదు. అంతే కాకుండా అందరి కంటెను ఎక్కువ అహంకారమును నీవు పొంది యున్నావు. ప్రపంచమునకు భజన కాని తపము కాని ఏమియును తెలియదు. మీ వంటి తపశ్శాలురు ఇట్లు భావించుదురు:-

“మేము గురువుగారు నేర్పిన భజన చేయు మహా తపశ్శాలురము. పంచాగ్ని తప్తులము. మా మహా గురువులు 84 అగ్నులను జ్వలింప జేయుదురు. మహాపండితులు, సిద్ధులు, వైద్యము నందు నేర్పరి. నా అన్న కుమారుడు నా శిష్యుడు. అతడు ముళ్ళపై పరుండును. నాలుగు సార్లు పూర్ణ యాత్రలను సేవించి వచ్చెను. రోజంతయును పారాయణ చేయుచుండును. మేము పాత్రము, ఆసనము, మాల-వీనిని గ్రహించునప్పుడు, మల, మూత్రములను విసర్జించునప్పుడును ఉపయోగించవలసిన, మంత్రములను తెలిసి కొంటిమి. మా గురువులు

రాజ పూజ్యులు కూడను. మేము ఒక శేరు గంజాయి ఒక జాములో పీల్చి వేసినను, ఉమ్మెత్త గింజలు మొదలగునవి తినినను మాకు ఏమియును అపకారము జరుగదు. ఎవరైన సాధువులు కన్పించినచో ఈ ప్రశ్నలు అడగవలెను.

నీ ఊరు ఏమి? పేరు ఏమి? సంప్రదాయము ఏమి? ఫలాన పూజ చేయుటకు వలయు మంత్రము ఏమి? ఆనపకాయ బుర్రను ఉపయోగించు మంత్రము ఏమి? జోలి మంత్రము ఏమి? మీ మహా గురువుల పేరు ఏమి?

ఈ ప్రశ్నలు అన్నిటికిని సంతృప్తి కరమగు సమాధానము చెప్పినచో వాడు ఎంత హీన శ్రేణికి చెందినను సాధువుల పంక్తిలో కూర్చొను అధికారమును పొందుచున్నాడు. అసలు చెప్పక పోయినను, ఏవైన కొన్ని చెప్పలేక పోయినను, గురువు లేని వాడును అయినను సాధువులలో లెక్కించబడడు. మంత్రములు తెలియని ఆతని

ఆనపకాయ బుర్రయు జోలీయుసు లాగి కొనవలెను. మరియొక వేషముతో విద్వాంసుడు ఎవరైన వచ్చినను వారికి ప్రేమతో భోజనాదులు సమర్పించరాదు. అన్నము పెట్టుటకు కూడ సందేహించవలెను. ఆతడు అన్య సంప్రదాయమునకు చెందిన వాడగుటచే పంక్తి బాహ్యుడు. గృహస్థుడు ఎవడైన కళ్యాణముకొరకు శరణు జొచ్చినచో ఆతనికి బంధన కారణమగు అనాత్మ ధర్మము నంతను ఉపదేశించవలెను. ఆతనిని గో సంరక్షణము నందును, భాండార రక్షణము నందును వినియోగించవలెను. అతి ఉత్తముడగు అధికారిని పూజ యందు వినియోగించవలెను. గురు శిష్యుల పరంపరను తెలిసికొని, అదియే పరమధర్మముగా భావించి ఎల్లరకును నేర్పవలెను. మౌఖిక భక్తియే సమస్తమును అని ఈ తపశ్శాలురు చెప్పు చున్నారు. కాని వీరు భక్తి యొక్క యథార్థ స్వరూపమును నిశ్చయించ లేరు. ప్రాతః కాలముననే లేచి అఖండ విభూతిని ధరించి ఎంత

ధనమును నిలవచేసినను తప్పు లేదు అందురు. నిరహంకారులయి సత్సంగ ప్రతాపముచే స్వరూపమును తెలుసుకునే వారు ఎక్కడో ఉందురు. కావున ఓ తపోనిష్ఠుడా! ఈ మిథ్యా దేహాభిమానమును త్యజించి సారమగు పదార్థమును తెలిసికొనుము. “నేను జ్ఞానిని” అను అహంభావమును త్యజించుము. ఇక మిగులునది అవాచ్యమగు పదము మాత్రమే; అదియే పరమ భక్తి. చూడదలచినచో జ్ఞానులను అడిగి తెలిసికొనుము. చూడదలచినచో వేదమును శోధించుము. లేదా స్వానుభవమున విచారించి గ్రహించుము. ఇక నీకు ఎట్లు తోచిన అట్లు చేయుము.” అని పలికి జడ భరతుడు మౌనమును వహించెను.

స్వా. ప్ర. :— పూర్వం మంద వైరాగ్యము కలవారు అయి ఉండిరి. వారు మహాపురుషుల ఉపదేశములను విననైన వినుచుండిరి. కాని ఈ నాటి జనులకు మంద వైరాగ్యము కూడ లేదు.

ఇట్టి వారికి స్వయముగా బ్రహ్మ దేవుడు వచ్చి చెప్పినను తెలియదు. ఇట్టివారు ప్రజలను మోసగించుటకు మాత్రమే ఇంటినుండి బయటకు వచ్చెదరు.

ఇది విని రాజుగారు చెప్పిరి.

నేను చిన్న వాడనుగా నున్నప్పుడు సాధువుల గుంపులు ఇక్కడకే వచ్చెడివారు. వారికి స్వయంపాకము మొదలగునవి నేను పంపెడి వాడను. వారికి గంజాయి మొదలగు వస్తువులు కూడ ఇచ్చెడి వాడను. సాధువులు గంజాయి త్రాగి భజన చేయుదురనియు కావున వారికి గంజాయి ఇచ్చుట మా ధర్మమనియు మా పెద్దలు చెప్పెడు వారు

స్వా. శంకరానందజీ:- (వినోదార్థము) ఇప్పటివారికి తెలివి లేదు. మా గురువు గారు ఒక గుక్కలో చిలుము అంతా పట్టేసే వారని చెప్పు చుండెడివారు. (ఇది విని అందరును నవ్విరి)

స్వా. ప్ర. :- మోహము అను మద్యమును

పానము చేసి ప్రతి ప్రాణియు స్పృహ తప్పియే ఉన్నాడు. దాని పైన ఈ భంగు గంజాయి వంటి మాదకద్రవ్యములను సేవించి ఇంకను మత్తును పొందినచో పూర్తిగా స్పృహతప్పి పోవును. గంజాయి తాగి మతి పోగొట్టు కొనిన సాధువులను అనేకులను చూచితిని. పూర్వమువారు చెప్పిన ప్రకారము రాజులును, శ్రీమంతులును తమ సర్వస్వమును త్యజించి సన్యసించెడివారు. వారిలో జగడములు ఉండెడివి కావు. కాని ఈనాడు ఆ పద్ధతి లేదు. తిండి లేకపోయినచో సన్యాసము తిండికి ఆధారము అగుచున్నది. ఇక జగడములు ఎందుకు ఉండవు?

రాజుగారు:-సన్యాసము స్వీకరించిన తరువాత జగడము ఆడుటకు గల కారణమేమి?

# దృష్టి మూడు రకములు

స్వా.ప్ర.:- దృష్టి మూడు రకములు, శ్వాన దృష్టి, బాల దృష్టి, పురుష దృష్టి. కుక్క తన ప్రతిబింబమును జలమునందు చూచి వేరొక కుక్క

అని తలచి దానిని శత్రువుగా భావించి ద్వేష బుద్ధితో దానితో పోట్లాడుటకును, మొరుగుటకును ఉంకించును. ఇది శ్వానదృష్టి.

బాల దృష్టి:- బాలుడు అద్దము నందు తన ప్రతిబింబమును గాంచి అది తానుగా భావించి అజ్ఞానముచే ఆశ్చర్యమును పొందును. అది బాల దృష్టి

పురుష దృష్టి:— పురుషుడు అద్దమునందు అనేక ఆడంబరములతో తన ముఖాలను చూచి అవి అన్నియును నేనే అని భావించును.

శ్వాన దృష్టియందు అజ్ఞానులు శత్రుత్వ, మిత్రత్వ భావముచే భేద దృష్టిని పొంది రాగ ద్వేషములను పెంపొందించెదరు.

బాల దృష్టియందు శాస్త్రాభ్యాసము చేసినను, గురువుల వద్ద విద్యను అభ్యసించినను అనుభవము కలుగదు. ఎప్పుడో ఒకప్పుడు రాగ ద్వేషములు స్ఫురించును. తత్త్వవిచారమే వానిని తప్పించ గలుగును.

పురుష దృష్టియందు జగమంతయును నా స్వరూపమే అను జ్ఞానము కలుగును. అట్టివారి యందు రాగ ద్వేషములు ఉండవు.

మొదటి వానిని అజ్ఞాని యనియు, రెండవరకపు వ్యక్తిని జిజ్ఞాసువు అనియును, మూడవ రకపు వ్యక్తిని జ్ఞాని యనియు చెప్ప వచ్చును.

భగవానుడు చెప్పెను— **దేహముద్దిశ్య పశువత్ వైరం కుర్యాత్ న కేనచిత్** । "పశువువలె దేహముకొరకు ఎవరితోను వైరమును పొంద రాదు."

పశుపక్ష్యాదులకు "నేను దేహ భిన్నమగు ఆత్మను" అను జ్ఞానము కలుగదు. మనుష్యునకు మాత్రమే శాస్త్రము ద్వారా అట్టి జ్ఞానము కలుగును. మనుష్యులలో కూడ పామరులకు విషయలంపటులకును "నేను దేహభిన్నమగు ఆత్మను" అను ప్రకాశము కన్పించదు. వారుకూడ పశువులవలెనే తలచెదరు. కాని జిజ్ఞాసువులు

మాత్రము శాస్త్రము ద్వారా తెలిసికొనెదరు. జ్ఞానులు పూర్ణానుభవము ద్వారా వాస్తవిక స్వరూపమును తెలిసికొని ఆనందము పొందెదరు. తన వాస్తవిక స్వరూపమును తెలిసికొన నంత వరకును మనుష్యుడు కూడ పశువుతో సమానుడేనని గ్రహించవలెను.

"**జ్ఞానేన హీనాః పశుభిః సమానాః**" "జ్ఞానము లేని వారు పశువుతో సమానులు" అని శాస్త్రములు ఘోషించుచున్నవి.

ఇంతలో ఒక బ్రాహ్మణుడు కన్యాదానము చేసికొనుటకు ఏమైన ఇప్పించమని వేడుటకు రాజు గారి వద్దకు వచ్చెను. "ఇప్పుడు కాళీ లేదు. రేపు రమ్ము" అని రాజుగారు సమాధానము చెప్పిరి.

స్వా. ని.:-- ధర్మరాజు దగ్గరకు ఒక నాడు ఒక యాచకుడు వచ్చెను. ఆతనితో ధర్మరాజు రేపు రమ్ము నేడు ఖాళీ లేదని చెప్పెను.

ఆసమయమున భీమసేనుడు అచ్చటనే

కూర్చొనియుండెను. ఆతడు వెంటనే వెళ్ళి మంగళ వాయిద్యములు వాయించ మొదలిడెను. అది విని ధర్మరాజడిగెను:- నేడు మంగళ వాయిద్యములు ఎవరు వాయించుచున్నారు? ఆయన సహదేవునికి చూచి రమ్మని ఆజ్ఞాపించెను. సహదేవుడు చూచి వచ్చి భీమసేనుడు మంగళ వాయిద్యములు వాయించుచున్నాడని చెప్పెను. అంతట భీమసేనుని పిలిపించి ధర్మరాజు అడిగెను:- "నేడు ఏ విధముగా ఆనందించవలసిన రోజు? ఎందుకు నీవు మంగళవాద్యములు వాయించుచున్నావు?"

భీమసేనుడు చెప్పెను:-- మీరే ఆ యాచకుని రేపు రమ్మని చెప్పిరి. మీరు సత్యవచనులు. రేపటి వరకు మీరు జీవించెదరను ఆనందముతో మంగళ వాయిద్యములు వాయించుచున్నాను.

ఈ సమాధానము విని ధర్మరాజు సిగ్గుపడి, ఆ బ్రాహ్మణుని వెంటనే పిలిపించి సత్కరించెను. జనులను రమ్మనుచును పొమ్మనుచును

ఉండరాదు. వెంటనే దానము చేయవలెను. “**త్వరిత దానం మహా పుణ్యమ్**” అని చెప్పబడినది. రాజుగారు శ్రీ ప్రకాశానందుల వారిని ఉద్దేశించి పలికిరి:—ఇట్టి యాచకులు పలువురు వచ్చెదరు. కాని అందరను కలసికొనుటకు అవకాశము ఉండదు. అయినను శక్తికొలది చేయుదును.

స్వా. ప్ర. :-ఒక రాజు సభ చేసెను. ఆ సభలో ఒక వైపున అధికారులను, మరియొక వైపు వర్తకులను కూర్చొనిరి. రాజు దగ్గర నగర శ్రేష్ఠి కూర్చొనియుండెను. రాజు నగర శ్రేష్ఠిని అడిగెను:- నీ వద్ద ఎంతధనము కలదు? నీకు ఎంతమంది సంతానము?”

న. శ్రే.:-“నా దగ్గర 25 లక్షల రూపాయిలు కలవు. నాకు ఒక కుమారుడు కలడు.” ఈ సమాధానమును విని అందరును విచారించిరి. నగర శ్రేష్ఠి ఈవిషయమును గమనించి ఇట్లు పలికెను:- నేను చెప్పిన మాటలను తమరు తెలిసి కొనలేదు. నాదగ్గర ధనమైతే 5 కోట్లు కలదు. కాని

అందులో 25 లక్షలు మాత్రమే నా చేతితో ధర్మము చేసితిని. అది నా పరలోకమున దాచబడినది. అటులనే బిడ్డలు నలుగురు కలరు. కాని వారిలో ఒకడు నా ఆజ్ఞను మన్నించును. శరీరమునందు పుట్టిన క్రిమికీటకాదులవలె మిగిలిన వారు నన్ను బాధించెదరు. కావున వారిని నేను బిడ్డలను కొనుట లేదు. "**పుత్రోయస్తు భక్తిమాన్**" "భక్తి కలవాడు పుత్రుడు." అదే విధముగా తన చేతితో సన్మార్గమున ఉపయోగించబడిన ధనము మాత్రమే మనతో వచ్చును.

***ధనాని భూమౌ పశవశ్చ గోష్ఠే భార్యా గృహద్వారిజనాః శ్మశానే/***
***దేహశ్చితాయాం పరలోకమార్గే కర్మానుగో గచ్ఛతి జీవ ఏకః//***

"దేహ పాతముతో ధనము భూమిమీద పడిపోవును. పశువులు పశు శాలలో ఉండిపోవును. భార్య ఇంటిగుమ్మము వద్ద

ఉండును. ఇతర జనులు శ్మశానము వరకు మాత్రమే వచ్చెదరు. శరీరము చితి యందు ఆగిపోవును. కర్మలతో కూడిన జీవుడు మాత్రమే పరలోకమునకు పోవును. అనగా మృత్యువు తరువాత దారపుత్రాదులు ఎవరును కూడరారు. కర్మను అనుసరించి ఒంటరిగా పరలోకమునకు పోవును.

రాజు: – తమవంటి మహాత్ములు నేను ఎల్లప్పుడును సత్కర్మలను ఆచరించు చుండునట్లు ఆశీర్వదించండి. ఇదే నా ప్రార్ధన.

నాదగ్గరకు అడుగుటకు చాలమంది వచ్చెదరు. అందరకును నేను ఎక్కడనుండి ఇవ్వగలను? నేను సామాన్య సంసారినయితే ఎవరును రారు. పెద్దరాజ్యము ఉన్నచో అడిగి నంతయు ఇవ్వగలిగి యుండెడివాడను. నా దురదృషముచే చాల మందికి లేదని చెప్ప వలసి వచ్చుచున్నది. నాస్థితి గోచికి పెద్ద, అంగవస్త్రమునకు చిన్న."

స్వా.ప్ర.:- ఒక గ్రామము బైటకు ఒక యోగి వచ్చియుండెను, వారి దర్శనమునకు ఒక భూస్వామి వెళ్ళిడి వాడు. నిత్యము ఆయనకు సేవచేసెడివాడు. నాలుగైదు మాసముల తరువాత ఆ భూస్వామి యోగిగారికి తన దుఃఖమును వెల్లడించెను:- " నా కుమారులకును, కుమార్తెలకును పెండ్లిండ్లు చేయవలసియున్నది. తగిన ధనము లేదు. మా జాతిలో చాలా ఖర్చు అగును. మా జాతి వారే దర్బారు రాజుగారు ఎంతయో సుఖముగా నున్నారు" అనెను. యోగిగారు నీ అదృష్టమునుబట్టి లభించును అని చెప్పిరి. అనంతరము దైవ వశమున దర్బారు రాజుగారు సంతానము లేకుండా చనిపోయిరి. ఆ భూస్వామి వారికి సమీప వారసుడు అగుటచే అధికారము లభించెను. అతడు ఎంతయో సంతోషించెను. కాని రెండు మూడు సంవత్సరాలలో ఆ స్థితియందు కూడ అసంతృప్తి కలిగెను. ఆతడు మరల యోగిగారి వద్దకు వెళ్లి

పలికెను:-“లౌకిక బాధ్యతలు పెరిగిపోయినవి. ఖర్చులు పెరిగి పోయినవి. వచ్చు ధనము అందుకు కూడ సరిపోవుట లేదు. ఇంత కంటె భూస్వామి జీవితమే మెరుగు. ఏదైన పెద్ద రాజ్యము ఉన్నచో బాగుండును. అనేకమంది నా దగ్గరకు వచ్చెదరు. వారికి ఏమి చెప్పను?” కొలది కాలములో ఆ దేశపు పెద్ద రాజే వంశ హీనుడయ్యెను. వారి వంశమునకు కూడ ఈ రాజుగారే సమీప బంధువు అగుటచే ఆరాజ్యముకూడ ఇతనికే దక్కెను. ఇక ఆతని ఆనందమునకు అంతు లేదు. నెమ్మది, నెమ్మదిగా రాజ్యము అనిన కూడ ఆతనికి విరక్తి కలిగెను. ఆతడు యోగి వద్దకు వెళ్ళి చెప్పెను:- ఈ రాజ్యము ఉపాధిని పెంచుచున్నది. ఉరి, శరీర దండన, ఇతర రాజులతో శత్రుత్వము- ఇట్టి అనేక కృత్యములు నాకు ఇష్టము లేనివి చేయవలసి వచ్చుచున్నది. ఈ మాటలు విని యోగిగారు ఇట్లనిరి:- “నిజమగు సుఖము కోరుచో నావలె గుహలో కూర్చొనుము.

యోగాభ్యాసము చేసి బ్రహ్మ సుఖమును పొందుము. ఈ సర్వవిధ దుఃఖములనుండియు ముక్తిని పొందుము. ఏ సాంసారిక వస్తువు నందును సుఖము కలుగదు.

భర్తృహరి చెప్పెను:-

***నిష్కణ్టకేఽపి న న సుఖం వసుధాధిపత్యే***
***కస్యాపి రాజతిలకస్య యదేష దేవః/***
***విశ్వేశ్వరో భుజగరాజ విభూతిభూషో హిత్వా***
***తపస్యతి చిరం సకలా విభూతీః//***

భూమిపై నిష్కంటక రాజ్యమును సంపాదించినను సుఖమును పొందలేము. కావుననే పెద్ద పెద్ద సర్పములను, భస్మమును అలంకారములుగా ధరించి విశ్వేశ్వర మహా దేవుడు సకల విభూతులను త్యజించి చాలా కాలము తపము చేసెను."

స్వామి శంకరానందులు రాజుగారితో వినోదార్థము పలికెను:-

తమకు పరమాత్ముడు చిన్న రాజ్యమును

ఇచ్చెను. భూస్వామి అయినచో బీదలకు దానము కాని, సన్యాసులకు భిక్ష కాని చేయలేక పోయెడివారు. పెద్ద రాజ్యము ఉన్నచో స్వాములను, సన్యాసులను, మహాత్ములను దర్శించుటకు కూడ వీలు కలిగి యుండెడిది కాదు. “ఈ బాబాలతోను, సాధువులతోను మనకు ఏమిపని? వీరి సాంగత్యము మనకు ఎందులకు? నేను పెద్ద రాజును.” అనుకొని గర్వముతో సన్యాసులకు దూరముగా తొలగి పోయి యుండెడి వారు. తమరు సామాన్య భూస్వామియును కారు. పెద్ద రాజును కారు. మీకు భోగ భాగ్యములకు లోటు కూడ ఏమియును లేదు. 40, 50 మోటార్లు కలవు. పెద్ద పెద్ద బంగళాలు కలవు. సర్వవిధ సౌఖ్యములను అనుభవించుచు కూడ ఉన్నారు. వీనితో పాటు స్వాముల యొక్కయు, సన్యాసుల యొక్కయు సాంగత్యమును కూడ పొందుచున్నారు.

స్వా. ప్ర. :-శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు.

***న విషయ భోగో భాగ్యం యోగ్యం ఖలు యత్ర జన్తుమాత్ర మపి/***
***బ్రహ్మేన్ద్ర రుద్ర మృగ్యం భాగ్యం విషయేషు వైరాగ్యమ్//***

"విషయ భోగము జంతువులకు కూడ భాగ్యము కాదు. బ్రహ్మయు, ఇంద్రుడును, రుద్రుడును కూడ విషయ వైరాగ్యము అనెడు భాగ్యమును వెదకుదురు."

మెఱుపు వెలుతురువంటి క్షణికములుగు మాయిక పదార్థముల యందు వైరాగ్యము కలుగుట నిజమగు భాగ్యము. ఆ వైరాగ్యాది సాధనములు బ్రహ్మ సుఖమును లభింపజేయును.

ఇది విని శ్రీ స్వామి నిత్యానందులు ఎంతయో ఆనందించిరి.

అటు తరువాత స్వామి శ్రీ ప్రకాశానందుల వారు మోటారు మార్గమున రాజకోట వెళ్లుటకు బయలు దేరిరి. ఈ సమయమున భక్త రాజు పలికెను:- నేను కొద్ది రోజుల తర్వాత కాశీ మొదలగు పుణ్యక్షేత్రములు వెళ్లుదును.

అనంతరము ఏకాంతమున కూర్చొనవలెనని యున్నది.

స్వా. ప్ర.:–ముస్లిము మహాపురుషులలో ఒకడగు అబ్దుల్లా మక్కాలో తాను చేయవలసిన పనులు చేసి మసీదు నందలి ఒక పార్శ్వమున నిద్రించుచుండెను. నిద్రలో అతడు స్వప్నమును కాంచెను.

ఇద్దరు దేవ దూతలు స్వర్గము నుండి క్రిందికి దిగుచుండిరి. ఒక దేవ దూత రెండవ దూతను అడిగెను:– ఈమారు ఎంతమంది మక్కా యాత్రకు వచ్చిరి?

ఆతడు చెప్పెను:- మొత్తము ఆరులక్షలు.

“వారిలో ఎందరి యాత్రకు దేవుడు సంతోషించెను?”

“ఆరు లక్షల మందిలోను ఎవరి యాత్రయును సఫలము కాదు.”

ఈ సంవాదము విని అబ్దుల్లాకు ఎంతయో దుఃఖము కలిగెను. ఆతడు పలికెను:- అయ్యో!

దూర దేశములనుండి ఇంతమంది యాత్రికులు నానావిధములగు దుఃఖములను సహించి, శ్రమపడి దీర్ఘమగు మార్గమును దాటి, పర్వతములు, అరణ్యములు, మరుభూములు మొదలగువానిని దాటి మక్కా యాత్రకు వచ్చిరే! వారి అందరి పరిశ్రమయును, వారు సహించిన కష్టములును వ్యర్థమైపోయెనా!"

మొదటి దేవదూత: - డెమాస్కస్ నగరమున ఒక చర్మ కారుడు కలడు. అతని పేరు అలీఆల్ మవుఫ్. ఆతడు మక్కా యాత్రకు రాలేకపోయెను. అయినను ఆతనికి మక్కా దర్శన ఫలమును, తీర్థాటన ఫలితమును ఇంట కూర్చొని ఉండగనే లభించెను.

ఇది వినినంతనే అబ్దుల్లా స్వప్నము నుండి మేల్కొనెను. డెమాస్కస్ నగరము వెల్లి ఆ చర్మ కారుని దర్శనము చేయవలెనని ఆతనికి తోచెను. ఆతడు డెమాస్కస్ నగర మార్గమును పట్టెను. వెతకుచు వెతకుచు అబ్దుల్లా, ఆలీ అల్ మవుఫ్

ఇంటికి చేరెను. అబ్దుల్లా పిలుపు విని ఒక మనుష్యుడు బైటికి వచ్చెను. ఆతనిని అబ్దుల్లా ప్రశ్నించెను:-“నీవు ఏమి పని చేయుదువు?”

“ నేను చెప్పులు కుట్టెదను”

“నేను నీకు ఒక ప్రధాన విషయము చెప్పవలసి యున్నది.”

“దయతో చెప్పండి.”

అంతట అబ్దుల్లా స్వప్న వృత్తాంతము అతనికి వినిపించెను. అతడు అబ్దుల్లాను “మీరు ఎవరు” అని ప్రశ్నించెను. “అబ్దుల్లా” అని వినగానే గట్టిగా ఒక అరుపు అరచి స్పృహ తప్పి పడిపోయెను. కొంత సేపటికి అతనికి తెలివి వచ్చిన తరువాత అబ్దుల్లా అతనిని తన గత చరిత్ర చెప్పమని అడిగెను.

నేటికి 20, 30 సంవత్సరముల నుండి మక్కా యాత్ర చేయవలెనను తలంపుతో నేను చెప్పులు కుట్టిన ధనములో కొంచెము కొంచెము ఇంటి ఖర్చులు పోగా మిగుల్చు కొంటిని. ఈ

సంవత్సరము మక్కా యాత్రకు బయలు దేరితిని. నా భార్య గర్భవతి. ఒక రోజున మా పొరిగింటి వంట వాసన నా భార్య ఆఘ్రాణించి ఆ వంటకమును భుజించవలె నను కోరికను వ్యక్తము చేసెను. ఆమె నాతో నిట్లనెను:-"వారి ఇంటికి వెళ్ళి ఆ వంటకములో నుండి కొంచెము అడిగి నాకు తీసికొని రమ్ము."

ఆమె మాటలు ప్రకారము నేను పదార్థమును అడుగుటకు పొరుగింటికి వెళ్ళితిని వారు ఇట్లు చెప్పిరి:-"ఏడు రోజుల నుండి యింటనున్న చిన్న పిల్లలతో సహా అందరము ఆకలితో ఆహారము లేక ఉంటిమి. చివరకు చేయునది లేక ఒక చచ్చిన జంతువు యొక్క మాంసమును తెచ్చితిని. అది నేడు మాయింట వండబడినది. అట్టి మాంసము శాస్త్రమునందు నిషిద్ధముగా పరిగణించబడినది. అది నేను మీకు ఇవ్వను" నా పొరుగింటి యజమాని చెప్పిన ఈమాటలతోనా హృదయము ఎంతయో

బాధపడెను. నేను ఇంటికి వచ్చి మక్కా యాత్రకు నిలవ చేసిన ధనమంతయును నా పొరుగింటి యజమానునికి ఇచ్చితిని. అతనితో నేను ఇట్లు పలికితిని:- "నేను మక్కా వెళ్ళుటకు వలయు మార్గ వ్యయమునకు ఈ ధనమును నిలవచేసితిని. దీనితో నీవు సుఖముగా ఆహారపదార్థములను కొనుక్కొని భుజించుము. పిల్లలకు బట్టలు కుట్టించుకొనుము. నేడు నా మక్కా యాత్ర ఇక్కడనే అయినది. నా తీర్థ దర్శనము ఇచ్చటనే జరిగినది" అని చెప్పితిని.

ఇవి అబ్దుల్లాతో ఆ చర్మకారుడు చెప్పిన మాటలు.

కావున మీ దగ్గర డబ్బు ఉన్నచో బీదలకు ఇచ్చుట యుక్తము.

***ఉత్తమా సహజావస్థా మధ్య మా ధ్యాన ధారణా/***
***అధమా ప్రతిమా పూజా తీర్థ యాత్రాఽధమాధమా//***

"జ్ఞానికి సహజావస్థ ఉత్తమమయినది. ధ్యానము మధ్య మార్గము. విగ్రహారాధన ఆతనికి అధమమైనది. తీర్థ యాత్ర అధమాధమమే."

జ్ఞానికి సహజావస్థ అనగా సహజ సమాధి ఉత్తమమైనదిగా పరిగణించబడినది. ఏకాంతమున కూర్చొని ధ్యానము, యోగము మొదలగునవి ఆచరించుట ఆతనికి మధ్యమ మార్గము. విగ్రహారాధన ధ్యాన ధారణము కంటెను స్థూలమయినది. కాన కనిష్టమైనదిగా పరిగణించబడినది. తీర్థాటనమునందు తినుట, త్రాగుట, ఆడుట మొదలగువానియందు అనేక విధములగు ఇబ్బందులు ఉండుటచే నిత్య కర్మోపాసన అయినను సమయమునకు జరుపు కొనుటకు వీలుపడదు. కావున తీర్థాటనము అధమాధమము అని చెప్ప బడినది. అయినను మీకు అట్టి కోరిక యున్నచో చేసికొని రండు.

రాజుగారు:- బాపూ. తమరు ఎప్పుడు దయ చేయుదురు?

స్వా. ప్ర.:- నిత్యానంద స్వామి వారు ఇక్కడే ఉన్నారు కదా! త్రోవను వచ్చుచు, పోవుచు ఉన్నప్పుడు స్వాభావికముగనే ఆకర్షణ కలుగును కదా!

రాజు:- తమవంటి గొప్ప సన్యాసి (గొప్ప త్యాగి) పాదములతో మా గృహము పవిత్రము అవును. దయయుంచి తమరు తప్పక దయ చేయుచుండుడు.

స్వా. ప్ర.:- (రాజుగారు ఉపయోగించిన "గొప్ప" అను పదమునకు గల రెండవ అర్థమును ఆధారముగా తీసికొని) నేను గొప్ప త్యాగిని. ఇది మాత్రము మీరు నిజమే చెప్పిరి.

త్యాగము రెండు రకములు. 1. మాయిక పదార్థములను త్యజించుట. భర్తృహరి మొదలగు వారు మాయాకార్యములగు రాజ్యాదులను త్యజించి బ్రహ్మమును పొందిరి. అనగా సామాన్యమైన వానిని త్యజించి గొప్పదగు బ్రహ్మమును పొందిరి.

2. బ్రహ్మ త్యాగము:- నేను గొప్పదగు

బ్రహ్మమును త్యజించి తుచ్ఛములుగు మాయిక పదార్థములను అంటి పెట్టుకొనుచున్నాను. కావున నేను. “గొప్ప త్యాగిని " అనగా గొప్పదియగు వస్తువును త్యజించిన వాడను.

రాజు:- బాపూ! ఇంత తలక్రిందుగా ఎందుకు చెప్పు చున్నారు? అట్టి వాడను నేను. ప్రభువును త్యజించి కూర్చొని ఉన్నాను. తమరు కాదనినను దేశము అంతయును తమను త్యాగి అనియే చెప్పుచున్నది. అది అంతయును అసత్యమా!

స్వా. ప్ర.:-(వినోదార్థము) నన్ను దేశములో అందరు ఎరుగుదురు అన్నది కూడా యథార్థమే. గాయకురాలిని దేశము అంతయును ఎరిగి యుండును. కాని పతివ్రతను మాత్రము ఎరిగి యుండదు. ఏలనన ఆమె ఏదో ఒక బట్ట కట్టుకొని ఏకాంతమున తన భర్త సేవచేసి కొనుచు ఉండును. ఆమెను ఎవరు తెలిసికొనెదరు?

అంతట అందదు పకపక నవ్వ సాగిరి

అనంతరము స్వామి శ్రీ ప్రకాశానందుల

వారు రాజకోట వేంచేసిరి. భక్త రాజు మొదలగువారు జేతపురము వెళ్లిరి.

ఓం

# ముప్పది యొకటవ ప్రసంగము

18 సంవత్సరములకు పూర్వము ఒకమారు శ్రీ ప్రకాశానందుల వారు 'వాంసదా' వెళ్లియుండిరి. 'వాంసదా' మహారాజుగారితో జరిగిన సంభాషణలో మహా రాజుగారు ఇట్లనిరి:- "వచ్చుచుండు ప్రతి సన్యాసియును, సత్రమనియో, పాఠశాల అనియో, కుంభోత్సవములో సంతర్పణ చేయవలెననియో ఏదియో ఒక వంకను ధనమును కోరుదురు. ఆ ధనముతో వారు వైభవోపేతముగా జీవితమును గడుపుదురు. అందుకు కారణమేమి? "

## సన్యాసులు పూర్వము-ఇప్పుడు

స్వా.ప్ర. :-పూర్వము మీవంటి రాజులును, యాజ్ఞవల్క్యుడు వంటి సాధు గురువులగు ఋషులును సంపదనంతయును త్యజించి

సన్యసించెడివారు. అన్ని వైభవములను చూచి యుండుటచే సదసద్వివేకము ద్వారా మాయిక పదార్థములపట్ల వీతరాగులయి ద్రవ్యాదులయందు మోహమును ఎంత మాత్రమును కలిగియుండెడి వారు కాదు సన్యాసమునకు కూడ మూల్యము ఉన్నది. మహాత్ముడగు ఇబ్రహీము ఒక ఫకీరు తన స్థితిని గురించి విచారించుచుండగా చూచెను. ఈ మనుష్యుడు ఫకీరు వేషమును మూల్యమును చెల్లించకుండ ధరించెననియు, ఆతడు ఫకీరు జీవితము - సన్యాసి జీవితము దారిలో దొరకునదిగా తలచెననియను అనుకొనెను. ఊరికే దొరకిన సంపదచే ఇట్టి ఫలితమే కలుగును కదా!

ఈవిషయమును ఆతడు ఆ ఫకీరుకు చెప్పెను. ఆ ఫకీరు ఇబ్రహీమును అడిగెను. ఫకీరు జీవితము అమ్మబడునా?

ఇబ్ర:— అవును. నేను బలఖా రాజ్యమును ఇచ్చి ఫకీరు జీవితమును తీసికొంటిని.

భర్తృహరి మహారాజుకూడ ఇట్టివాడే. భర్తృహరి మహారాజును ఎరిగియున్న ఒక రాజు ఆయన సన్యాసము తీసికొనిన తరువాత ఆయనను కలసికొనుటకు వచ్చెను. ఆయన ధరించిన చిరుగులబొంత మొదలగువానిని చూచి చెప్పెను:-ఇట్టి దారిద్ర్యమును ఎక్కడనుండి సంపాదించిరి.

భర్తృహరి జవాబు చెప్పెను:-

"నీ రాజ్యము కంటె పెద్దరాజ్యము యొక్క సంపదను ఇచ్చి కొంటిని."

1956వ విక్రమ సంవత్సరమున (A. D. 1899 సం||) పెద్ద కరువు వచ్చెను. ఆసమయమున నేను భూజ్ యందు చాతుర్మాస్యలు చేయుటకు ఆగియుంటిని. హిందూ దేశము అంతయును ఈ కరువుతో బాధపడుచుండెను. ఎందరో దిక్కులేని పిల్లలు అన్నము లేక ఆకలితో అలమటించుచు, ఏడ్చుచు తిరుగు చుండెడివారు. ఇట్టి పిల్లలకు కొందరకు

సాధువులును, సన్యాసులును కాషాయవస్త్రములు ధరింపజేసి ముండనము చేయించి సాధువుల వేషము వేయించెడివారు. తరువాత సంవత్సరము 1957 విక్రమ సంవత్సరమున భాద్రపద మాసమున నేను అహమదాబాదులో నుంటిని. నేను ఉన్న చోటు అనాథాశ్రమమునకు దగ్గరగానుండెను. ఆ అనాథాశ్రమము స్థిరమైనది కాదు. కేవలము కరువు రోజులకు ఉపయోగపడుటకు మాత్రమే ఆరంభించబడెను. ఆ అనాథాశ్రమము మూసి వేయబడు సమయము ఏతెంచిన వెంటనే దానిలో నుండు కొందరు పిల్లలు సాధువులు అయిరి. కొందరు సన్యాసుల వద్దకు వెళ్ళి సన్యాసమును తీసికొనిరి. నేటి సాధువులు సన్యాసమును పొట్ట గడపుకొనుటకు సాధనముగా నుపయోగించుచున్నారు. నేను కూడ వారిలో ఒకడును.

జ్ఞానార్ణవమున చెప్పబడినది :-

***యతిత్వం జీవనోపాయం కుర్వన్తః కిం న లజ్జితాః /***

***మాతుః పణ్యమివాలమ్బ్య యథా కేచిత్ గతఘృణాః//***

తల్లి యొక్క అసభ్య ప్రవర్తనను పొట్టగడపుకొను సాధనముగా నేర్పరచుకొని జీవించువాడు సిగ్గులేని వాడుగను, దయాహీనుడుగను తలచబడును. సన్యాసమును జీవనోపాయముగా నేర్పరచుకొనువాడు కూడ అట్టివాడే. ఆతడు సిగ్గుపడ రాదా?"

మాయొక్క ఈ ప్రవర్తనను శాస్త్రములు నిందించుచున్నవి. కాని మేము సిగ్గుపడుట లేదు.

ఇట్టివారు భిక్షాటనమునకు వేషము వేసికొనెదరు. కావున అందుకు పనికివచ్చు వారివద్ద ఏదోవంక పెట్టి ధనము సంపాదించెదరు. కాని యథార్థమగు వైరాగ్యము కలవాడు రాజ్యము ఇచ్చినను పుచ్చుకొనడు. ఈ విషయమున బుద్ధ భగవానుని ఆదర్శము గ్రహించదగినది.

## బుద్ధ భగవానుడు

# ముప్పది యొకటవ ప్రసంగము

అవి బుద్ధ భగవానుడు సంచారము చేయు రోజులు. ఒక చోట గొల్లలు మేకల మందలను తోలుకొని వెళ్ళుచుండిరి. బుద్ధుడు వారిని అడిగెను:- "ఈ మేకలు అన్నియును ఎక్కడికి తీసికొని వెళ్లుచున్నారు?"

గొల్లలు చెప్పిరి:-బింబిసార మహారాజులు యజ్ఞము చేయుచున్నారు. ఆ యజ్ఞమునందు ఆహుతి ఇచ్చుటకై మేము ఈ మేకలను తీసికొని వెళ్ళుచున్నాము.

బుద్ధ భగవానుడు యజ్ఞమునకు వెళ్ళవలెనను కోరికతో ఆ గొల్లల వెనుక నడచెను. ఒక మేక కుంటిది అగుటచే సరిగ నడవలేక వెనుకబడి పోవుచుండెను. గొల్ల కర్రతో కొట్టిన కొంచెము దూరము కుంటుచుకుంటుచు తొందరగనడచుచు మరల మామూలుగా వెనుక బడిపోవుచుండెను. మరల దెబ్బతినుచుండెను. ఇది చూచి బుద్ధ భగవానుని హృదయము దయతో నిండిపోయెను. ఆయన గొల్లతో నిట్లనెను:- "సోదరా! ఈ మేకను భుజములపై

నెక్కించుకొని మోసి కొని నీ వెనుక నడచెదను. నీవు వెళ్ళుచోటికే నేనును వచ్చుచున్నాను. నీ గమ్యము చేరినంతనే మేకను నీకు స్వాధీనము చేయుదును."

గొల్ల చెప్పెను:— "సరే."

అంతట బుద్ధ భగవానుడు దానిని మోయుచు నడచెను.

బింబిసార మహారాజు రాజధాని వచ్చినంతనే గొల్లలు ఒక చోట విడిదిచేసిరి. బుద్ధుడు ఆ మేకను గొల్లకు అప్పగించెను. తరువాత బుద్ధ భగవానుడు బింబిసారుని యజ్ఞ సమారంభమునకు వెళ్లి రాజును కలిసికొనవలెనను కోరికను ప్రకటించెను. రాజు లోపలికి వచ్చుటకు అనుమతి నిచ్చెను. బుద్ధుడు రాజు నెదుటకు వెళ్లి ప్రశ్నించెను:- "మహారాజా! ఈ యజ్ఞమును ఎందుకు చేయుచున్నారు?

రాజు:—స్వర్గ సుఖమును కోరి చేయుచున్నాను.

బుద్ధుడు:— నర మేధము చేసినచో ఏమిఫలము లభించును?

రాజు:—స్వర్గము కంటె ఉన్నతమగు ఫలము కలుగును.

బుద్ధుడు:-ఇదిగో. నా శరీరము సంసిద్ధముగా నున్నది. ఇన్ని జీవులను చంపి ఆహుతి ఇచ్చుటకన్న ఒక జీవుని ఆహుతి ఇచ్చి కావలసిన ఉన్నత పదవిని పొందుము.

ఈమాటలు వినినంతనే రాజునకు ఆశ్చర్యము కలిగెను. ఆయన బుద్ధుని వైపు ఏకాగ్ర దృష్టితో చూచుచు ఉండిపోయెను. బుద్ధ భగవానుని తేజమునకును, ప్రభావమునకును ఆతడు లోబడిపోయెను. రాజు ఆయన కాళ్ళపై బడి శరణు వేడెను. అంతటితో ఆ యజ్ఞమును ఆపివేసెను. బుద్ధ భగవానుడు రాజునకు తత్వోపదేశము కావించెను. రాజు వారికి శిష్యుడయ్యెను. అంతట బుద్ధుడు అచ్చటనుండి వెళ్లుటకు సంసిద్ధుడయ్యెను.

ఇది చూసి రాజు పలికెను:-“తమరు ఎక్కడికి వెళ్ళుచున్నారు? ఈ రాజ్యమును తమకు అర్పించుచున్నాను. తమరు ఈచిరుగు బట్టలను విడచి మంచి బట్టలు ధరించుడు. ఇచ్చటనే ఉండి రాజ్యమును అనుభవించుడు.

బుద్ధుడు చెప్పెను:- నాకు రాజ్యము ఉండెను. ఆసుఖము నాకు తుచ్ఛమైనదిగను, అనిత్యమైనదిగను తోచెను. కావున రాజ్యమును త్యజించి నేను మహత్తమమును, అవినాశియునగు సుఖమును వెతకుటకు బయలుదేరితిని. రాజ్యమునందు సుఖము కలుగును అను భావము ఇంచుకంతయును నాకు కలుగ లేదు.

ఈవిధముగా చెప్పి బుద్ధుడు వెళ్లిపోయెను.

ఈప్రకారము మహాత్ములకు మాయిక సుఖములు తుచ్ఛములు అను అనుభవము కలుగును. కావున వారు ఆ సుఖములను గ్రహించరు. నేడు ముముక్షువులు చాల తక్కువ.

బుభుక్షువులు మాత్రము ఎక్కువ.

## అధికారమునను సరించి వస్తువును గ్రహించవలెను

బ్రహ్మ విద్యను సంపాదించుటకు కూడ పరంపరాగతమగు యోగ్యత మొదలగునవి ఆవశ్యకములు. మహాత్ములు మహద్వస్తువును గ్రహించెదరు. తుచ్ఛులు తుచ్ఛ వస్తువునే గ్రహించెదరు.

భర్తృహరి చెప్పెను:-

***స్వల్పం స్నాయువసావ శేష మలినం నిర్మాంసమప్యస్థి గోః***
***శ్వా లబ్ద్వా పరితోషమేతి న తు తత్తస్య క్షుధాశాన్తయే/***
***సింహో జమ్బుక మఙ్కమాగతమపి త్యక్త్వా నిహస్తి ద్విపం***

***సర్వః కృచ్ఛ్రగతోఽపి వాఞ్ఛతి జనః సత్త్వానురూపం ఫలమ్॥***

"కొంచెము మాత్రమే స్నాయువును, క్రొవ్వును మిగిలియుండి మాంసము లేని ఎద్దు ఎముకను సంపాదించి కుక్క సంతోషించును. ఆకలి తీరునా, తీరదా అనికూడ విచారించదు. కాని సింహము మాత్రము దగ్గరకు వచ్చిన నక్కను విడచి ఏనుగునే వధించును. ఈ విధముగ ఎల్ల జీవుల కష్టములు సహించవలసి వచ్చినను తమ బలమునకు తగిన ఫలమునే కోరుదురు."

మహా:- అయిన వీరి సన్యాస ధర్మము భంగము నొందుట లేదా?

స్వా.ప్ర.:-వీరికి సన్యాస ధర్మముతో సంబంధము లేదు. ముష్టి ఎత్తుకొనుటకు మాత్రమే వీరు సన్యాసి వేషమును వేసికొనెదరు.

నిజమగు సన్యాసి.

మహా:- అయితే తమరు ఎరిగిన నిజమగు సన్యాసి ఎవరైన కలరా?

# ముప్పది యొకటవ ప్రసంగము

స్వా. ప్ర. :— ప్రస్తుతం సౌరాష్ట్రలో పీఠడియూలో ఉన్న స్వామి శ్రీ నిత్యానందుల వారు అట్టివారే. వారు చాల పవిత్రులు. ఇంకను ఉండి ఉందురు. కాని నాకు తెలిసిన వారు మాత్రం వీరు ఒక్కరే.

అటు తర్వాత ఒక సంవత్సరమునకు మహారాజుగారు రాజకోట వెళ్లిరి. అప్పుడు శ్రీ ప్రకాశానందులవారు వాఘజీ భాయి సరోవర మార్గమున నిర్మింపబడిన కుటీరములో బస చేసి యుండిరి. మహారాజుగారు స్వామి వారిని కలసికొనుటకు అచ్చటికి వచ్చి యుండిరి. ఏకాంతముగా నున్న కుటీరమును చూచి మహా రాజుగారు ఇట్లనిరి:- ఇది ఋష్యాశ్రమమువలె శాంతిమయముగానున్నది. ఆహా! ఎంత శాంతముగా నున్నది. ఇచ్చటనే ఉండవలెనని నాకు ఎంతయో అభిలాషగా నున్నది.

స్వామి ప్రకాశానందులవారు అడిగిరి:- మీవంటి మహారాజ భవనములలో నుండు వారికి కుటీరములో నుండవలెనని అభిలాష కలిగినదా?

అయిన నాకు రాజభవనము అనిన ఎంతయో ప్రీతి. ఆకుటీరమున స్వామి శ్రీ నిత్యానందుల వారి ఫోటో ఉండెను. మహా రాజుగారు ప్రశ్నించిరి:- "ఈ ఛాయాచిత్రము ఎవరిది?"

"గత సంవత్సరము శ్రీ నిత్యానందుల వారిని గురించి చెప్పితిని కదా! ఇది వారిదే" అని ప్రకాశానందులవారు చెప్పిరి.

అంతట వారు అడిగి:— పీఠడియా ఇక్కడికి ఎంత దూరము? మోటారు మార్గమున వెళ్ళవచ్చునా?

స్వా. ప్ర.:- ఇక్కడికి నలుబది రెండు మైళ్ళు కలదు. మోటారు వెళ్లును. "తమరు కూడ పీఠడియా వచ్చెదరా?" అని మహారాజు గారు అడిగిరి. స్వామి వారు అనుమతించిరి. రెండు రోజుల తరువాత స్వామి శ్రీ ప్రకాశానందుల వారును, మహారాజు గారును రాజ కోటనుండి మోటారులో పీఠడియా వెళ్లిరి.

## శిష్టాచారము

# ముప్పది యొకటవ ప్రసంగము

మహా రాజుగారు నిరాడంబరులు. వారు సామాన్య దుస్తులను ధరించియుండుటచే ఆయన మహారాజుగారని అపరిచితులు తెలిసికొనలేరు. అయినను ఆయన యొక్క తేజోవంతమగు ముఖమును చూచి ప్రకాశానంద స్వామి వారిని నిత్యానంద స్వామి వారు ప్రశ్నించిరి:- "వీరు ఎవరు?"

స్వా. ప్ర.:- వీరు 'వాంసదా' మహా రాజు. తమరు అడిగి నందున చెప్పవలసి వచ్చినది. వీరు కడు నిరాడంబరులు, ధర్మనిష్ఠులు. సామాన్య వేషమును ధరించుదురు. సామాన్య మానవుని వలె వర్తించుదురు. "తాను రాజు" అని ఎవరికిని తెలియనీయరు.

స్వా. ని.:-యథార్థమే. తమతో నుండుటచే వీరును ఉత్తములే అయియుందురని నాకు తోచినది. కానిచో వీరికిని తమకును సాంగత్యము ఉండెడిది కాదుకదా! రాజు తన రాజ్య గర్వమును వీడి సంతు వద్దకు వెళ్లినప్పుడే సంతులు కృప జూపెదరు.

గౌరాంగప్రభువులు పూరీజగన్నాథమున ఉండిరి, ఆసమయమున కటక నగరాధిపతియగు ప్రతాపరుద్రమహారాజు తన కులగురువగు భట్టాచార్యులను జగన్నాథమందిరమునకు వలయు ఏర్పాట్లు చేయుటకు పూరీలో ఉంచెను మహారాజుల ప్రతినిధిగా ఆయన గౌరాంగ ప్రభువులకును, వారి భక్తులకును సేవ చేయుచుండెను. రథ యాత్ర రోజు వచ్చినందున ఆ కుటుంబ ఆచార ప్రకారము ప్రతాపరుద్ర మహారాజు తన కుటుంబముతోను, పరివారముతోను సహా జగన్నాథ పురమునకు వచ్చెను. ఆయన కుల గురువులను పిలిపించి సంతులు, సాధువులు, పండితులు దర్బారులోనికి వచ్చి దర్శనమునిచ్చి ఆశీర్వదించునట్లు ప్రముఖులగు గౌరాంగుల వారిని కూడ రప్పించి తనను కృతార్థుని చేయించమని చెప్పెను. కాని మహాప్రభువులగు గౌరాంగులకు రుచికరములగు పదార్థములను తినవలెనని కాని, సన్మానము

పొందవలెనని కాని, ద్రవ్యాదులను ఆర్జింపవలెనని కాని కోరిక లేకుండెను. ఇక వారు దర్బారుకు ఎందుకు వెళ్ళెదరు?

పై మూడు విషయములను మహాప్రభువు త్యజించి, వీతరాగులయి సన్యాసమును స్వీకరించి యుండిరి. అంతేకాకుండ శాస్త్రముల యందు సన్యాసి రాజు దర్శనము చేయుట పూర్తిగా నిషిద్ధము. రాజుకు ఈ సంగతి ఏమి తెలియును? ఆనాటి వరకును వారు యథార్థమగు సన్యాసిని చూచియుండ లేదు. కావుననే ఆయన భట్టాచార్యులను ప్రభువు వద్దకు పంపిరి. భట్టాచార్యులు ప్రభువుల వద్దకు వెళ్ళి భయపడుచు చెప్పిరి:- ప్రభూ, ప్రతాపరుద్ర మహారాజులు తమ కుటుంబముతోను, పరివారముతోను రథ యాత్రకు ఇచ్చుటకు వచ్చిరి. తమ దర్శనమునకు ఎంతయో ఉత్సాహపడుచున్నారు. తమరు దయచేసి వారికి తమ దర్శనమును ఇచ్చి కృతార్థులను చేయుడు. ప్రభువు చెవులు మూసికొని పలికిరి:- శ్రీవిష్ణు,

శ్రీవిష్ణు. తమరు పండితులు అయి కూడ ఇంత ధర్మ విరుద్ధమగు కృత్యమును ఎందుకు చేయుచున్నారు. సన్యాసి రాజ దర్శనము చేయుట పాపము అని చెప్పబడినది.

తమరు మావారైయుండి కూడ నన్ను ధర్మ భ్రష్టుని చేయుటకు ఇట్టి అభిప్రాయమును ప్రకటించినచో ఇక్కడ మా ధర్మమును రక్షించువారు ఎవరు? ఇక మేము పూరీ విడచుట యుక్తము. ఆహా! సంసార విషయములయందు చిక్కుకొనిన రాజుల దర్శనమా! ఎంత విషాదకరమైన వార్త చెప్పిరి? భట్టాచార్యులుగారూ నన్ను క్షమించండి. ఇంతలో ప్రతాపరుద్రుని సామంత రాజగు రాయదత్త రామానందుడు విద్యానగరమునుండి ప్రభువులదర్శనమునకు వచ్చెను. వారిని చూచి ప్రభువు ఒక్కమారు లేచి నిలబడెను. ప్రణామము చేయుటను వంగిన రామానందుని

గాఢాలింగనము చేసికొని పలికెను:-

"ఇపుడు నాకు రాముడు లభించెను. ఆనంద సహితుడగు రాముడు. ఇక మా ఆనందమునకు హద్దు లేదు."

ఇది చూచి భట్టాచార్యులు ఆశ్చర్యపడి. ఇట్టి రాజుల అందరి సేవను పొందెడివాడును, తాను ఉన్న రాజ్యమునకు అధికారియును అగు రాజును కాదని సామాన్యుడగు రాజుయందు ఎంత ప్రేమ చూపు చున్నారు? అచ్చటినుండి భట్టాచార్యులు ప్రతాపరుద్రుని వద్దకు వెళ్ళి చెప్పెను:- నేను ఎన్ని మారులు ప్రార్థించినను వారు తమను కలిసి కొనుటకు అంగీకరించ లేదు. రాజ దర్శనము చేయనని వారి ప్రతిజ్ఞ. ప్రతాపరుద్రుడు ఎంతయో బాధా పూరిత హృదయముతో పలికెను:- వారు అట్టి ప్రతిజ్ఞను చేసినచో నేను కూడ ప్రతిజ్ఞను చేయుచున్నాను. ప్రభుపుల పూర్ణకృపను అయినను పొందెదను. లేదా శరీరమునైనను త్యజించెదను. ఇది గమనించి భట్టాచార్యులు చెప్పిరి:-

"మహారాజా, తమరు చింతించకుడు. ప్రభువులు తమయందు తప్పక కృపను ప్రదర్శించెదరు. రామానందరాజు అచ్చటికి వచ్చి యుండెను. ఆతడు ప్రభువుల దర్శనమునకు వచ్చెను. వారిని ప్రభువులు స్వయముగా కౌగలించుకొనిరి. ప్రభువులు దయాసముద్రులు. తమరు ఒక పని చేయుడు. రాజ లాంఛనములతో వారి దర్శనము చేయుట యుక్తము కాదు. రథము మార్గమున విశ్రాంతికి ఆగినప్పుడు ప్రభువులు ఆ పరిసరములలో విశ్రమించుచుందురు. అప్పుడు వారి చరణముల పై బడి భక్తి యుక్తమగు శ్లోకమును పలికిన తమ మనోవాంఛితము ఈడేరును. ఆవిధముగనే రథ యాత్ర యందు మార్గమధ్యమున రథము నిలచెను. ఆ సమయమున పరిసరోద్యానమున ప్రభువులు అర్ధ నిమీలిత నేత్రులయి విశ్రమించి యుండిరి. అంతట భట్టాచార్యుల సంకేతమును పొంది ప్రతాపరుద్రుడు తన రాజ వస్త్రములను

పరిత్యజించి ఛత్ర, ఛామర, మకుటాది రాజ్య చిహ్నములను విసర్జించి సామాన్య వస్త్రమును ధరించి, పాదరక్షలు లేని పాదములతో ప్రభు దర్శనమునకు బయలు వెడలెను. నియమానుసారము అంగరక్షకులు వెంబడించిరి. కాని వారిని కూడ ఆపివేసెను. తాను ఒక్కడే ప్రభువుల వద్దకు వెళ్ళెను. మొదట కొంచెము కంగారుపడెను. కాని నెమ్మదిగా వెళ్ళి ప్రభువుల కాళ్ళు పట్టుకొని నెమ్మదిగా పాద సేవ చేయదొడగెను. కాళ్ళు పట్టుచు ప్రతాపరుద్రమహారాజు గోపికాగీతములను పాడ మొదలిడెను. వానిని విని ప్రభువులు వెంటనే లేచి , కూర్చొనిరి. రాజును ఆలింగనము చేసికొని ఇట్లు పలికిరి. “ఆహా! మహా భాగ్యము. ధన్యుడను. నేడు ప్రేమామృతమును పానము చేయించి నన్ను కృత కృత్యులను చేసిరి. తమరు ఎవరు? స్వయముగా వచ్చి నాయందు ఏల ఇంత నిర్హేతుక కటాక్షమును ప్రకటించిరి?

రాజు చెప్పెను: - “ప్రభూ! నేను తమ

దాసాను దాసుడను అవవలెనను కోరికతో నున్న ఒక అకించనుడగు సేవకుడను. నేడు నాకు ఏమి లభించ లేదు? తమ ప్రేమాలింగనము లభించిన తదుపరి నాకు సంసారమున పొందవలసిన వస్తువు మరియొకటి ఏదైన కలదా? నేడు నేను ధన్యుడనైతిని. ఇన్ని రోజుల నుండియు జగన్నాధుని సేవించిన సేవలకు నేడు ఫలితము లభించినది. తమ శ్రీ చరణముల యందు నా ప్రేమ స్థిరముగా నుండునట్లు కరుణించుడు. ఇదియే ప్రతాప రుద్రుడు తమ చరణముల పై బడి ప్రార్థించుచున్నాడు." ప్రభువులు ఎంతయో సంతోషించిరి.

మహాత్ముడగు కబీరు చెప్పెను:-

"దివ్య రసపానము, పరువు ప్రతిష్ఠలకు ప్రాకులాడుట. ఈ రెండును ఏకకాలమున సంభవించవు. ఒకవరలో రెండు కత్తులు ఇముడునా?

ఈ విధముగానే ప్రతాపరుద్రుడు రాజ్య

గర్వముతో నున్నంత కాలము ఇతర వ్యక్తుల ద్వారా సందేశములను పంపు చుండెను. అట్లు చేయుచున్నంత కాలము ఆతనికి ప్రభుదర్శనము లభించలేదు. అభిమానము లేని భక్తుని వలె ప్రభువుల శరణుజొచ్చినప్పుడే ప్రభువు ఆతనిని కృపతో జూచెను."

అనంతరము శ్రీ నిత్యానందుల వారు ఇట్లు చెప్పిరి.:-

"అయితే ఇప్పుడే దర్బారులోనికి కబురు పంపండి. వారికి ఆలస్యముగా తెలిసినచో కోపపడెదరు." అని ఒక వ్యక్తిని దర్బారులోనికి పంపెను ఆ అవసరము లేదని వాంసదా మహారాజు చెప్పెను. కాని స్వామివారు మనుష్యుని పంపిరి.

సమాచారము అంది మూల్వాలా రాజు వచ్చిరి. మహారాజు గారు ఇతర జనులతో పాటు జంబుఖానాపై కూర్చుని యుండుట చూచి సిల్కు జంబుఖానా పై కూర్చొనమని వారిని కోరిరి.

ఇది కాంచి నిత్యానందుల వారు పలికిరి :- నేను మొదటనే వారికి చెప్పితిని. కాని వారు కూర్చొనలేదు.

స్వా. ప్ర. :- నేను మొదట వాంసదా వెళ్ళినప్పుడు అచ్చట రహస్యముగా నుంటిని. తొమ్మిది రోజుల వరకును మహారాజు గారికి తెలియలేదు. పదవ రోజు నేను వెళ్లిపోవలసిన సమయమునకు వారికి తెలిసెను. వెంటనే వారు వచ్చిరి. కాని వారిని నేను గుర్తించ లేదు. కాని సమీపమున కూర్చొనినవారు "మహారాజుగారు విచ్చేసిరి" అని చెప్పిరి. నేను క్రింద మట్టిలో కూర్చుని ఉంటిని. వారుకూడ అక్కడనే వచ్చి కూర్చొనిరి. అంతట నేను వారితో నిట్లంటిని:- "మీరు దుమ్ములో కూర్చొనవలసి వచ్చెను."

వారు సమాధానము చెప్పిరి:— నేను ఏదో ఒక రోజున దానిలో కలియ వలసి యున్నది.

# మహాపుణ్యాత్ములగు రాజులకు మాత్రమే మృత్యువు జ్ఞాపకము ఉండును

శ్రీ నిత్యానంద స్వామి వారు ఈమాటలు విని చాల సంతోషించి ఇట్లనిరి:-"మృత్యువు రాజులకు జ్ఞాపకమే రాదే!"

ఒకప్పుడు బలఖ్ బుఖారా చక్రవర్తి అరణ్యము గుండ పాలకీలో కూర్చొని వెళ్లుచుండెను. వెళ్ళిన కొలది మార్గము చాల ఇరుకుగా నుండెను. అచ్చట ఒక చచ్చిన ఒంటె పడియుండెను. పాదుషా పల్లకిలో ఉండెను. చచ్చిన ఒంటె దారిలో పడియుండుట చూచి పాలకీ మోయవారు ముందుకు నడచుట మానివేసిరి.

పాదుషా అడిగెను:- "ఎందుకు ఆగిరి?"

వారు చెప్పిరి:- "త్రోవలో ఒంటె చచ్చిపడియున్నది."

పాదుషా చెప్పెను:— " లేపండి, కాస్త"

పాలకీమోయువారు పలికిరి :- హుజూర్ , అది చచ్చిపోయినది.

పాదుషా అడిగెను:— "చచ్చిపోవుట అనగా నేమి?"

పాలకి మోయువారు చెప్పిరి:— శరీరమునుండి జీవము పోయినచో చచ్చిపోయినదని చెప్పుదురు.

అంతట పాదుషా పాలకి నుండి దిగి ఒంటె వద్దకు వచ్చెను. ఆ ఒంటె కొంచెమైనను కదల కుండను, మెదల కుండను ఉండుట ఆతడు చూచెను. దాని మృత దేహమునుండి దుర్గంధము బయలు వెడలుచుండెను. ఈ స్థితి చూసి పాదుషా ఆలోచించసాగెను:-

"జీవుడు పోయిన తరువాత శరీరమునకు ఇట్టి స్థితి పట్టునా? నాకు కూడ ఏదో ఒక రోజున ఇట్టిస్థితియే కలగ వలసివచ్చినచో రాజ్యము, ధనము, సంపద మొదలగునవి అన్నియును

ఎందుకు? నేను ఇప్పటినుండియు దేవుని సేవించెదను.”

ఇట్లు చెప్పి రాజధానికి వెళ్ళుటకు బదులుగా ఆతడు ఫకీరు వేషమును ధరించి అరణ్యమునకే వెళ్ళిపోయెను. బుద్ధ భగవానుడు కూడా ఈవిధముగనే శవమునుచూచి వైరాగ్యమును పొందెను. అనంతరము త్యజించి సత్యమును శోధించుటకు సన్యాసమును పొందెను.

ఈవిధముగ రాజులకు మృత్యువు జ్ఞాపకము వచ్చినచో వారు మహాపురుషులు అని వేరుగా చెప్పనక్కరలేదు.

పిదప మూళ్వాలా రాజుగారు మహారాజుగారిని నేడు ఇచ్చట ఉండుటకు అనుగ్రహించుడని కోరిరి. ప్రకాశానంద స్వాముల వారిని ఆజ్ఞాపించమని కూడ చెప్పిరి. కాని ప్రకాశానంద స్వాముల వారు ఇట్లు పలికిరి:-“వీరి పరిస్థితిని బట్టి వీరిని ఉండమని

పట్టుబట్ట రాదు."

మూడు నాలుగు సంవత్సరములకు పూర్వము 11. సంవత్సరములు కల అత్యంత సుందరుడు వీరి కుమారుడు బొంబాయిలో అపెండిసైటిసుకు ఆపరేషను జరుగుచుండగా ఆపరేషను బల్ల మీదనే చనిపోయెను. అప్పుడు వీరి హృదయమునకు ఎంతయో ఆఘాతము కలిగెను. అయినను సంస్కారియగుటచే ఎంతయో ధైర్యమును వహించెను. ఈ మధ్యనే వీరి తమ్ముడు చనిపోయెను. ఆ సోదరుని భార్య మహా పతివ్రత. సతీ దేవి వంటిది. ఆ దుఃఖముతో మృత్యువును ఎదురు చూచుచున్నది. వీరికి ఆపదమీద ఆపద వచ్చుచున్నది.

ఈ మాటలు విని నిత్యానందుల వారు గద్గద స్వరముతో నిట్లనిరి:- ప్రాపంచిక దుఃఖములు ఎన్ని కలిగినను వీరిని ఏమియును క్రుంగదీయలేదు. శ్రీమద్భాగవతమున ఒక కథ యున్నది.

# ముప్పది యొకటవ ప్రసంగము

పూర్వ కాలమున చిత్ర కేతుడను చక్రవర్తి కలడు. ధరిత్రి వారి కోరికలను అన్నిటిని పూరించుచుండెను. ఒక శుభముహూర్తమున మహాత్ముడగు ఆంగీరసుడను ఋషి సంచారము చేయుచు దైవేచ్ఛచే ఆ రాజునింటికి వచ్చెను. రాజు వారికి గొప్ప స్వాగతము ఇచ్చెను. ఋషికి ఉన్నతాసనము సమర్పించి రాజు వినయముతో వారికి నమస్కరించి భూమి పై వారి ఎదుట కూర్చొనెను. ఋషి వారిని అడిగెను. ఓ రాజా! మనస్సు ఎందుకు విచారించుచున్నది? చిత్రకేతుడు చెప్పెను:- స్వామి! నా రాజ్యము నందలి ఐశ్వర్యము లోకపాలురు కూడ పొందగోరుదురు. అయినను ఆకలి దప్పికలతో నున్న వానికి రాజ వైభవము ఆనందమును కలుగ జేయనట్లు నేను అపుత్రుడను అగుటచే రాజ వైభవము నాకు ఆనందమును కలుగ జేయుట లేదు. కుమారులు లేనందున పూర్వులతో పాటు నేనును నరకమునకు పోవుదును అను భయము కలుగుచున్నది. కావున నన్ను రక్షించి అపుత్రుడ

నగు నాకు సంతానము కలుగ జేసి నన్ను ఉద్ధరించుడు.

'**అపుత్రస్య గతిర్నాస్తి**' అని ధర్మశాస్త్రములు ఘోషించుచున్నవి గదా! దయాసముద్రుడగు అంగీరసుడు ఆతనిని ఉద్ధరించుటకు త్వష్ట్ర యజ్ఞము చేసెను. యజ్ఞావశిష్ఠమగు చరువును రాజు యొక్క ప్రథమ భార్యయగు కృతద్యుతిచే భుజింప జేసెను. రాణి గర్భవతియయి సుముహూర్తమున ఒక కుమారుని ప్రసవించెను. రాజు ఆనందముతో సత్పాత్రులగు బ్రాహ్మణులకు అనేకములగు దానములను చేసెను.

కృతద్యుతి తనకుమారునిపట్ల వాత్సల్యముతో పొంగిపోవుచుండుట చూచి సవతులగు ఇతర రాణులు తమకు సంతానము లేనందున కలిగిన శోకముతోను, ఈర్ష్యతోను లోలోన బాధపడుచుండిరి. సంతానవతియగు తన మహారాణిని చిత్రకేతు మహారాజు కూడ మిక్కిలి గౌరవముతో జూచుచుండెను. ఇది కూడ ఇతర

రాణుల ద్వేషమును పెంచెను. ద్వేషముచే బుద్ధి నశించి, దారుణహృదయలయి ఆ అసహన శీలులు అగు సవతులు రాకుమారునికి విషము పెట్టిరి. అంతట రాజ కుమారుడు మృతినొందెను. తన ప్రియతముడగు కుమారుడు మృతి నొందిన వార్త రాజుకు అపరిమిత శోకమును కలుగ జేసెను. అతడు నడుచుచు, లేచుచు, స్నేహానుబంధముచే అనుక్షణము పెల్లుబుకుచున్న శోకముచే విహ్వలుడయి మూర్ఛను పొందుచు, ఎట్టెట్లనో కుమారుని మృత శరీరము వద్దకు వెళ్లి బిగ్గరగా ఆక్రందనము చేసెను. ఏ విధముగను ఆయన తన మనస్సును నిలుపుకొన లేకపోయెను. రాజు ఇట్లు దుఃఖముతో మూర్ఛనొందుచు, అనాథునివలె నుండుట గాంచి సహజ దయాసముద్రుడగు బ్రహ్మ తనూజుడు ఆంగీరసుడు నారదునితో మారు వేషమున అచ్చటికి వచ్చెను. రాజు కుమారుని చెంత శవము వలె పడియుండెను. శోకము ఆతనిని క్రుంగదీసి వేసెను. అట్టి రాజునకు అంగీరస

మహర్షి శాస్త్ర వాక్యములను ప్రమాణముగా జూపి ఉపదేశించెను.

”ఓ రాజేంద్రా! నీవు శోకించుచున్న ఈతనికిని నీకు కల సంబంధము ఏమి? పూర్వజన్మమున ఇతనికిని, నీకును ఎట్టి సంబంధము ఉండెను? ఇప్పుడు ఇట్టి సంబంధము కలదు! ముందు ఎట్టి సంబంధము ఉండును?”

“తత్త్వవిచారము చేసినచో నదీ ప్రవాహముచే ఇసుక రేణువులు గుమిగూడుచు చెదిరిపోవుచునుండునట్లు, ప్రాణులు కూడ కాల ప్రవాహమున పరస్పరము గుమిగూడుచును. చెదరిపోవుచును ఉండును. పూర్వజన్మమున పిత్రాదిరూపమున వ్యవహరించిన ప్రాణులే మరణానంతరము వేరయి ఈ జన్మమున అతనికే పుత్రాది రూపములను పొందును. కొన్ని ఇతరుల పుత్రాదిరూపములను పొందును. వారే జన్మాంతరమున భార్య, శత్రువులు మిత్రులు

మొదలగు రూపములను కూడ పొందుదురు. కావున ఈతడు నీ కుమారుడు. నీవు ఇతని తండ్రివి అనునది నిత్య నియమము కాదు.”

“యథార్థమునకు అహంకార, మమకారములు అజ్ఞాన జన్యములు. మృత్యువు ఎల్లరకును సర్వసాధారణము. జగము మిథ్య అయినచో ప్రతీతి ఎట్లు అగుచున్నది? నేను తండ్రిని అను ప్రేమాభిమానము కూడ దేనిచే కలుగుచున్నది? అని నీవు ప్రశ్నించవచ్చును. దానికి సమాధానము వినుము. దేవుడు తన మాయచే సమస్తమును సృష్టించెను. దానిచే ప్రతీతి అగుచున్నది. ప్రతీతిచే ప్రాణుల పట్ల అభిమానము కలుగుచున్నది.”

కరుణా సముద్రుడగు ముని చెప్పిన అమృతోపమములగు వాక్యముల తత్త్వమును తెలిసికొని రాజు ఊరడిల్లెను. అంతరంగమునందలి బాధచే శోకగ్రస్తమగు ముఖమును చేతితో మూసికొని పలికెను:-

ఓజ్ఞానసంపన్నులగు మహాత్ములారా! అవధూత వేషమున ఇచ్చటికి గుప్త రూపమున వచ్చిన తమరు ఎవరు? మూఢాత్ముడనగు నాకు జ్ఞాన ప్రకాశమును కలుగ జేయుడు.

అంతట ఆంగీరసమహర్షి పలికెను:- “ఓ రాజా! నీకు పుత్రుడు కావలెనని కోరిక కలిగినంతనే ఆ కోరికను ఈడేర్చిన ఆంగీరసుడను నేను. ఈయన సాక్షాత్తు బ్రహ్మ కుమారుడగు నారదుడు. నీవు హరి భక్తుడవు. మోహము పొందుట నీకు తగదు. కావుననే కుమారుని మృత్యువుచే కలిగిన శోకమున ఇంత ఎక్కువగా మోహమున చిక్కుపడుట చూచి నీ పై అనుగ్రహముతో మేము ఇరువురమును ఇక్కడకు వచ్చితిమి. ఏలనన భగవద్భక్తుడు మోహమును పొందుట యుక్తము కాదు.

మొదట నేను నీ వద్దకు ఉత్తమ జ్ఞానమును కలిగింపవలెనను అభిలాషతో వచ్చితిని. కాని నీవు సంసారాసక్తుడవగుట గాంచి

ఆసమయమున నీకు పుత్ర ప్రాప్తి యగు నుపాయమును చేసితిని. పుత్రుడు కలవానికి ఏ దుఃఖము కలుగునో నీవు అనుభవించితివి. ఈవిధముగనే భార్య, ధనము, గృహము మొదలగు సకల విధ సంపదలును సంతాప కరములు మాత్రమేనని నీవు తెలిసికొనుము. ఓ రాజా! సేవకులు, ఉద్యోగులు, బంధువులు, అందరును శోకమును, మోహమును, భయమును వాటి పరిణామమగు బాధను కలుగ జేయువారే. అవి అన్నియును నశ్వరములు. స్వప్నముల వలెను, మాయవలెను, మనో రథముల వలెను అసత్యములు.

మానవుడు కర్మ వాసనచే విషయ చింతన చేయును. అంతట ఆతని మనస్సు నుండి నానా విధములగు కర్మలు జన్మించును. కర్మలు కూడ ఈవిధముగ జూచిన మనస్సు నుండియే జన్మించినవని నిర్ణయించ వచ్చును.

అప్పుడు ఆంగీరసమహర్షితో కూడ వచ్చిన నారదుడు తన యోగ బలముచే మృతినొందిన

రాకుమారుని ప్రత్యక్షము కావించి ఆ జీవాత్మతో నిట్లనెను:- "ఓ జీవాత్మా! నీ తల్లిదండ్రులు, సంబంధీకులు అందరును నీ శోకముతో ఎంతయో ఖిన్నులయియున్నారు. అది గమనించి నీవు మరల ఈ కళేబరమున ప్రవేశించి స్నేహ యుక్తులగు వారి మధ్యను మెలగి నీ మిగిలిన ఆయుర్దాయమును పూర్తి చేయుము. తండ్రి ఇచ్చిన వైభవములను అనుభవించి, రాజ సింహాసనమునకు శోభను కలుగ జేయుము."

ఆ జీవాత్మ ముని చెప్పిన ఈ వాక్యములను విని శరీరమునందు ప్రవేశించి పిత్రాది బంధువులను ఉద్దేశించి ఇట్లు పలికెను:-

"నేను కర్మకు అధీనుడనయి దేవ, పశు, పక్షి మనుష్య యోనుల యందు తిరుగుతున్నాను. నేను చనిపోవుటచే నాయందు పుత్ర భావముతో మీరు ఎందుకు శోకించు చున్నారు? ఏదియో ఒక జన్మ యందు మీ శత్రువును అనుకొని నా మృత్యువుచే ఏల సంతోషించుట లేదు? పుత్రాది

సంబంధము నిత్యము కాదు. మారుచుండును. ఒకప్పుడు బంధువు, ఒకప్పుడు మిత్రుడు, మరియొకప్పుడు శత్రువు అగుట తటస్థించును. ఒకరికిని మరియొకరికిని సంబంధము ఉండదు. జన్మ జన్మకును క్రొత్త సంబంధములు కలుగును.

సువర్ణాది పదార్థము వర్తకుల చేతిలో పడి వివిధములగు మార్పిడులను పొందునట్లుగనే జీవుడు కూడ తన శుభాశుభకర్మల ద్వారా అనేక యోనులయందు తిరుగుచుండును. మనుష్యునకును, పశువులు మొదలగు జీవజంతువులకునుకూడ సంబంధము స్థిరమగ నుండదు. సంబంధము ఉన్నంత కాలమే మమత్వముకూడ ఉండును. పశువును అమ్మిన పిదప దానియందు మమత్వము ఉండదు కదా!"

ఇట్లు చిత్రకేతు మహారాజు కుమారుని ఆత్మ చిత్రకేతుడు మొదలగువారల కెల్లరకును తగిన ఉపదేశమునిచ్చి, శరీరమునుండి బైటికి వెడలిపోయెను. ఆ బంధువులు అందరును ఆశ్చర్యముతో స్నేహ శృంఖలములను

పటాపంచలు చేసి శోకమును విడనాడిరి.

ఈవిధముగ ఆంగీరసుడును, నారదుడును చేసిన ఉపదేశములచే చిత్రకేతుడు జ్ఞానమును పొంది శోక మోహమునుండి నివృత్తిని పొందెను. వియోగ కరమగు మరియొక పదార్థమునందు ప్రేమను కలిగి యుండుటచే కలుగు పరిణామము దుఃఖమే. బృహదారణ్యకమును పరికించుడు:-

***తదేతత్ప్రేయః పుత్రాత్ప్రేయో విత్తాత్ప్రేయోఽన్యస్మాత్ సర్వస్మా యదయమాత్మా/ స యోఽన్యమాత్మనః ప్రియం బ్రువాణం బ్రూయాత్ దస్తరతరం ప్రియం రోత్స్యతీతీశ్వరో హ తథైవ స్యాదాత్మాన మేవ ప్రియముపాసీత స య ఆత్మానమేవ ప్రియముపాస్తే న హాస్య ప్రియం ప్రమాయుకం భవతి//***

"ఆత్మ అన్నిటి కంటెను దగ్గర నున్నది. అది పుత్రుని కంటెను ప్రియమైనది. విత్తము కంటెను ప్రియమైనది. మిగిలిన పదార్థములు అన్నిటి

కంటెను కూడ నెక్కువ ప్రియమైనది. ఆత్మవ్యతిరిక్తమగు అనాత్మ పదార్థము ప్రియమైనది అని చెప్పువానితో ఆత్మ వాది " నీ ప్రియమగు అనాత్మ పదార్థము ఏడ్చుచున్నది." అని చెప్ప గలడు. అట్లు జరుగుటయే అందుకు కారణము. కావున ప్రియమగు ఆత్మ తత్త్వమే ఉపాసించదగినది. ఆత్మ ప్రియమైనది అని ఉపాసించు వాని క్రియ పదార్థము ఎప్పుడును నశించదు."

స్త్రీ, ధనాది మాయిక పదార్థములు అనిత్యములు, సంయోగ వియోగములు కలవి. వాని పరిణామము దుఃఖము. కాని పరమాత్ముని యందలి ప్రేమ ఏనాడును వియోగమును పొందదు. కావున ప్రభు పరాయణులగుట యుక్తము.

పూర్వ కాలము నందలి గొప్ప గొప్ప వారికి కూడా ఇట్టి ఆపదలు వచ్చినప్పుడు మనము ఎంత?

ఇంతలో ఆస్థానమునుండి టీ మొదలగు ఫలహారములు వచ్చెను. ఫలహారముల తరువాత వాంసదా మహారాజు ‘ఇంద్ర సింహజీ’ బయలు దేరుచు నిత్యానందులవారిని ఇట్లు ప్రార్థించిరి:-

“మావలన తమకు జరుగు సేవను సెలవిండు.”

స్వామి శ్రీ నిత్యానందుల వారు ఇట్లనిరి:-

“మీ ప్రజల సేవయే మా సేవ రాజులు తమ ప్రజలను రక్షించవలెను. రాజు ప్రజలకు తండ్రి. తండ్రి కుమారుని చదివించును. అతనికి వినయమును నేర్పును. ఆతనిని రాబోవు ఆపదలనుండి రక్షించును. అటులనే రాజు కూడ ప్రజలపట్ల సంచరించవలెను. రాజు ప్రజలకు తండ్రి వంటి వాడు.

***ప్రజానాం వినయాధానాత్ రక్షణాద్భరణాదపి/***
***స పితా పితర స్తాసాం కేవలం జన్మ హే తః వ//***

# ముప్పది యొకటవ ప్రసంగము

"ప్రజలకు శిక్షణనిచ్చుట, రక్షించుట, పోషించుట- ఈ పనులు చేయుటచే రాజు ఆ ప్రజలకు తండ్రి అనబడును. తల్లిదండ్రులు పుట్టుటకు కారణములు మాత్రమే."

బీదలను పోషించుట రాజు యొక్క ముఖ్యమగు కర్తవ్యము. రోగము కలవానికే ఔషధము అవసరమగును. రోగము లేనివానికి ఔషధము అక్కర లేదు. బీదవానిని, అన్నము లేని వానిని దుర్బలుని ఏ ఆధారమును లేని వానిని పోషించుటయే మహా ధర్మము. ఇదియే నిజమగు సేవ.

పూర్వ కాలము నందలి రఘువంశ రాజులు దానము చేయుటకే- అనగా బీదలను పోషించుటకే ధనమును సంపాదించుచుండిరి.

"***త్యాగాయ సంభృతార్థానామ్***" అని రఘువంశమున చెప్పబడినది. రాజు తన బీద ప్రజలను పోషించవలెను. వారికి ఏదైన భయము కాని, దుఃఖము కాని కలిగినచో దానిని నివృత్తి

నొందించవలెను. తన ప్రజలు సుఖముగా నున్న నాడే ఆ రాజు మంచి రాజు అని చెప్పబడును. బీదలగు ప్రజలకు అన్నము పెట్టవలెను. వస్త్రములను ఇవ్వవలెను. చదువు చెప్పించవలెను. ఆవిధముగా వారి ఆశీర్వచనములను పొందవలెను. బీదల సేవ దేవుని సేవ. బీదలను పోషించినచో వారు ఎప్పుడును చెడు పనులు చేయరు. ఎవడైన చెడు నడత నడచుచున్నచో వానిని ఆపెదరు.

పూర్వ జన్మ పుణ్యము చేతనే రాజుగా పుట్టును. రాజ్యాధికారమును పొందిన తరువాత ప్రజలను యథార్థముగా పోషించినచో ఆతడు "రాజు" అను శబ్దమునకు తగిన వాడుగా నెంచబడును.

***రఞ్జితాశ్చ ప్రజా యేన తస్మాద్రాజేతి శబ్ద్యతే /***

"ప్రజలకు అన్నము, వస్త్రము, విద్య, వినయము కలుగ జేసీ సంతోష పెట్టు వాడే రాజు."

# ముప్పది యొకటవ ప్రసంగము

ప్రజలు రోగముచే బాధపడుచున్నచో రోగములను పోగొట్టుటకు వైద్య శాలలను నిర్మించవలెను. రోగములు లేని వారికి ఇతర సదుపాయములు చేయవలెను. ప్రజలు ఆరోగ్యముగా నున్నచో రాజునకును, రాజ్యమునకును హితము కలుగును. ఆరోగ్యవంతులగు ప్రజలు ఉత్సాహముతో నుందురు. ఉత్సాహముచే రాజ్యము అంతయును సమృద్ధిని పొందును. కావున బీదలగుప్రజల ఆరోగ్యము నందు లక్ష్యము ఉంచుట రాజు యొక్క ముఖ్య కర్తవ్యము.

అనాథాలయముల ద్వారా బీదలగు జనులను రక్షించవలెను. బీదల చిన్న పిల్లలకు, వృద్ధులకును దిక్కు ఉండదు. వారికి సహాయము చేయు వారు ఉండరు. వారిని ఓదార్చు వారైన ఉండరు. అట్టి వారలను అనాథాలయముల యందుంచి పోషించవలెను. బాలకులు భావిపౌరులగుటచే పెరిగి పెద్దవారయి రాజ్యము పట్ల తమ కర్తవ్యములను ఎన్నడును

విస్మరించరు. బీదలు చలి కాలములో ధరించుటకు సరియగు బట్టలు ఉండక పోవుటచే చలితో బాధ పడుచుందురు. వణకుచు చలి యొక్క భయంకరమగు చేతుల్లో చిక్కుకొని పోవుదురు. దుఃఖించు ఆ బీదలకు తగినట్లు వస్త్రములను ఇవ్వవలెను. అప్పుడే క్షత్రియ శబ్దము యథార్థమగును.

అన్న సత్రములను ఏర్పాటు చేయించి వానియందు బీదలకు అన్నము పెట్టించుచో క్షుద్బాధతో నున్న ప్రజలు శాంతిని పొంది ఆశీర్వదించుదురు. ఈవిధముగా ప్రజలను పాలించుట క్షత్రియుని ముఖ్య ధర్మము.

***క్షత్రియస్య పరో ధర్మః ప్రజానాం పరిపాలనమ్ /***
***తస్మాత్సర్వ ప్రయత్నేన రక్షయేన్నృపతిః ప్రజాః//***

"ప్రజలను పాలించుట క్షత్రియుని ముఖ్య ధర్మము. కావున అన్ని విధములను రాజు

ప్రజలను రక్షించవలెను.”

బీదల దుఃఖములను పోగొట్టు రాజే నిజమగు రాజు. ఆతడు రాజే కాదు; రెండు చేతులు కల పరమేశ్వరుడు.

పరమ ధార్మికుడును తన ప్రజలను పోషించుచు, వారిని దుర్మార్గుల బారినుండి రక్షించుచును, అభయమిచ్చుచును ఉన్న రాజు సాక్షాత్తు బ్రహ్మతో సమానుడు. కావున ప్రజా పాలనమును బీదలకు సహాయము చేయుటయును రాజ ధర్మము. తన ప్రజల మనస్సులను రంజింప జేయు రాజు రాజు శబ్దముయొక్క యథార్థమగు భావమును వ్యక్తము చేయు చున్నాడు. జనులలో బాధను పెంచుటవలన కాని, భూమి మీది జలమును శోషింప జేయుటచే కాని భూమిని వేడి చేయుటచే కాని చంద్రుడు చంద్రుడనబడుట లేదు. జనులకు ఆనందము నిచ్చును. భూమిని శోషింప జేయుటకు బదులు శీతల పరచుచు తన కిరణముల ద్వారా మిక్కిలి దుఃఖించుచున్న

వారికి కూడా సుఖమును కలుగ జేయు చుండుట చేతనే చంద్రుడు చద్రుడనబడుచున్నాడు. అటులనే తన బీద జనులను సంతోష పెట్టు వాడును, వారియందు దయ కలిగి యుండు వాడును అగు రాజు మాత్రమే రాజనబడును.

***యథా ప్రహ్లాద నాచ్చన్ద్రః ప్రతాపాత్త పనో యథా /***
***తథైవ సోఽభూద న్వర్థో రాజా ప్రకృతిరఞ్జనాత్ //***

"జనులను ఆనందింప జేయుటచే చంద్రుడనబడును. తపింప జేయుటచే తపనుడు(సూర్యుడు) అనబడును. అటులనే ప్రజలను రంజింప జేయుటచే రాజు అనబడును."

రాజులు చోరాదులచే బాధపడు దిక్కు లేని వారి దుఃఖములను పోగొట్టవలెను. బీదలను ఉద్ధరించుటయే వారి ప్రధాన వ్రతముగా భావించవలెను. బీదలను రక్షించువానికంటె

ఉత్తముడు మరి యొకడు లేడు.

ఈ శరీరము మాంసము, ఎముకలు, మల మూత్రములు మొదలగువానితో నిండి యున్నది. కావున సహజముగా ఇది మురికిది. దీని యందు అసహ్యము కలుగుట స్వభావసిద్ధము, ఇది ఛాయవలెను, నీటి బుడగ వలెను క్షణములో నశించును. ఈవిషయమును గుర్తెరిగి రాజులు నశ్వరమగు శరీరము కొరకు బీద ప్రజలను పీడించ రాదు.

సదాచారముతో ప్రజలను రక్షించే రాజుకు ప్రజలు ఎన్నడును ఎదురు తిరుగరు. పైగా వారు రాజుకు కష్ట సమయమున సహాయము చేయుదురు. ఆ కారణముచే రాజులు సదాచార సంపన్నులై ప్రజలకు సహాయము చేయవలెను. బీదలను పోషించియు, యోగ్యులను గౌరవించియు, అనాధులను రక్షించియును నిరాధారులకు ఆశ్రయమునిచ్చియు ఎల్లరకును జీవనోపాధులు కల్పించును. అప్పుడే ప్రజలు అతనిని సేవించెదరు. అట్లు చేయక శుష్క

సరోవరము నందలి పక్షులవలె వారిని విడిచినచో అట్టి రాజును ప్రజలు త్యజించెదరు.

ఆర్తుని రక్షించుట, శరణాగతుని రక్షించుట క్షత్రియ శబ్దమునకు అర్థము. ఎక్కువ దుఃఖముతో తనకు కలిగిన ఆపదలనుండి తప్పుకొను శక్తి లేక "ఈతడు మనలను రక్షించును" అను పరిపూర్ణ విశ్వాసముతో ఎల్ల ప్రాణులును పృథ్వీవల్లభుడగు వీరక్షత్రియుని శరణు జొచ్చెదరు. అట్టి దుఃఖితులను రక్షించక పోయినచో అట్టి నిందనీయుడగు రాజు జీవించుట వ్యర్థము.

కాళిదాసుని వాక్యములు వినుడు:-

***క్షతాత్కిల త్రాయత ఇత్యుదగ్రః క్షత్రస్య శబ్దో భువనేషు రూఢః/***
***రాజ్యేన కిం తద్విపరీత వృత్తేః ప్రాణై గుప క్రోశ మలీమ సైర్వా//***

"నాశము నుండి రక్షించువాడు క్షత్రియుడు," అని ఉత్తమమగు క్షత్రియ శబ్దమునకు అర్థము. ఇది జగత్ప్రసిద్ధము.

అందుకు వ్యతిరేకముగా సంచరించువాడు - అనగా ప్రజలను నాశము నుండి రక్షించనివాడు రాజ్యమును పొందుటకు అర్హుడు కాడు. అతని రాజ్యము, అపకీర్తిచే మలినమయిన ఆతని ప్రాణములును రెండును వ్యర్థములు.

పూర్వ కాలము క్షత్రియులు శరణాగతుని రక్షించుటకు నిరంతరము సంసిద్ధులుగా నుండెడివారు. శిబి దృష్టాంతము నుండి ఈవిషయము ధ్రువ పడుచున్నది.

చంద్రవంశమున శిబి అనే పేరు గల రాజు ఉండెను. ఆయన ఒక యజ్ఞమును ఆరంభించెను. ఇంద్రుడును, అగ్నియు ఆతని దయా స్వభావమును ఔదార్యమును పరీక్షించి దలచిరి. తమ మాయచే ఇంద్రుడు డేగ రూపమును, అగ్ని పావురము రూపమును ధరించిరి. డేగ పావురమును వెంటాడి తరుముచు ముక్కుతో పొడుచుచు, కాళ్ళతో తన్నుచు వచ్చుచుండెను. పావురము భయముతో పారి వచ్చి శిబి ఒడిలో కూర్చొనెను. భయంతో వణకిపోవుచున్న దాని

ఆకారమును చూచినతోడనే శిబికి దయ కలిగెను.

రాజు డేగతో నిట్లనెను:- ఈ పావురము నాకు శరణుజొచ్చినది. కావున నీవు దీనిని చంపరాదు. అందుకు బదులుగా నీవు కోరిన విధముగా మరియొక మాంసము నీకు ఇచ్చెదను.

డేగ మనుష్య వాక్కులతో పలికెను:— రాజా! నేను ఆకలితో నున్నాను. ఇది నా ఆహారము. దీనిని నాకు విడువుము. లేనిచో నేను చచ్చి పోవుదును, ఇది ధర్మమా?

రాజు చెప్పెను. ఈ పావురము నాకు శరణుజొచ్చినది. శరణాగత రక్షణము నా ధర్మము. ఆ కారణముచే ఈ పావురమును నీకు నేను ఇయ్యను. సువర్ణము, భూమి మొదలగునవి దానము చేయు వారు ఈ భూమిపై చాలా మంది కలరు. అది సులభము కూడను. కాని భయ భీతునకు అభయము నిచ్చువాడు దొరకుట సులభము కాదు. మహా యజ్ఞముల ఫలము కూడా కాలక్రమమున క్షయము పొందును కాని

భయగ్రస్తునకు అభయము నిచ్చుటచే కలుగు సత్ఫలము ఎప్పుడును నశించదు అని మహాఋషులు చెప్పుదురు. ***ధర్మః సత్య దయా పరః*** అని శాస్త్రములు ఘోషించుచున్నవి. సత్యము, దయ ఈ రెండును పరమ ధర్మములు. మనో, వాక్కాయములచే సర్వ ప్రాణుల యందును దయ కలిగియుండు క్షత్రియుడు బ్రహ్మ లోకమును పొందును. నీకు నీ ఆత్మ ప్రియమైనది. అటులనే ఇతరునకు అతని ఆత్మ (జీవాత్మ)ప్రియమైనది. ఈ విషయమును అంగీకరించి ఈ పావురమును బ్రతికి ఉండనిమ్ము. ఈవిధముగా శిబి ఎంతయో నచ్చ చెప్పెను.

ఈమాటలు విని డేగ చెప్పెను:- అది నీ యభీష్టము అయినచో ఆ పావురముతో సమానముగా బరువు కల మాంసము. నీ శరీరమునుండి ఇమ్ము. రాజు ప్రసన్న భావముతో ఈ షరతును అంగీకరించెను. రాజు తన మాంసమును కోసి త్రాసుతో చూచుటకు

నిశ్చయించెను. త్రాసులో మాంసమును ఉంచిన కొలదియు పావురముయొక్క బరువు పెరుగసాగెను. అంతట రాజు తన శరీరమును ఖండించి త్రాసునందుంచుటకు ఖడ్గమును తీసెను. ఉత్సాహానందములతో ఆతడు తన విధి నిర్వహణకు సంసిద్ధుడగుట తోడనే “ధన్యుడవు, ధన్యుడవు” అను ఆకాశవాణి విన వచ్చెను. ఇంద్రాగ్నులు పక్షి రూపములను త్యజించి దర్శనమిచ్చిరి. అనంతరం వారు కోరిన వరముల నిచ్చి తమతమ నెలవులకు వెళ్ళిపోయిరి. ఈవిధమున శిబిమహారాజు పరోపకారమునకు తన శరీరమును ఉపయోగించి శాశ్వత కీర్తిని పొందెను. తన బీద ప్రజల కొరకు జీవించు రాజుల జీవితము కొనియాడదగినది.

బీదలు తమ దుఃఖమును మరిచిపోయి, ఆకలిగొనిన అతిథులు ఆతిథ్యమును సత్కారమును పొంది, ఆర్తులగు ప్రజలు సేవను పొంది, జీవులు ఉన్నతి సాధనములను,

విశ్రాంతిని పొంది, సుఖించు రాజ్యము నందలి రాజే పవిత్రుడు. ఆ రాజ్యమే పవిత్రమగు రాజ్యము. నిరాధారులగు జీవులను దేవుడు రక్షించమని రాజునకు అప్పగించును. వారిని రక్షించుటయును, వారి ఔన్నత్యమును చూచుటయును, వారికి అన్నాదులను ఇచ్చి సుఖింప జేయుటయు మాత్రమే రాజు యొక్క ధర్మము.

ప్రజల దుఃఖములు పోయినప్పుడే రాజ్యలక్ష్మి సదుపయోగమును పొందినదని తెలిసికొనవలెను. బీదలకు ఎల్ల వేళల సహాయము లభించవలెను. బీదల సేవయే దేవుని సేవ. ఇట్లు మీరు ప్రజల సేవ చేయుడు. అదియే మా సేవ.

## స్వామివారి నిష్కామత్వము

పీఠడియా నుండి రాజకోటకు మరల వచ్చిన పిదప మహారాజు గారు చెప్పిరి. "స్వామివారు చాల ఆనంద స్వభావులు."

స్వా. ప్ర. :- కొంతమంది కేవలము

ఆనందముతోనే ఉందురు. స్వామివారు నిష్కామి కూడను. వారి ఆశ్రమ ద్వారమునకు ఎల్ల వేళల యందును తాళము వేయబడి యుండును. ఇతర గ్రామముల నుండి వచ్చినవారు ఎవరైన లేరనుకొని తిరిగి పోయెదరేమో, జనులు కోప పడెదరేమోనని దర్బారు నుండి ఒకరు వచ్చి ద్వారము కడనుండి వ్యక్తికి తాళము చెవిని ఇచ్చెదరు.

## నిష్కామియగు ఫజల్

తపోనిధియగు ఫజల్ జీవించియున్న రోజులలో బగ్దాదు పాదుషా ఖలీఫాహారూణఅల్ రసీదు ఒక నాటి సాయంకాలము తన మిత్రునితో నిట్లనెను:-

“నీవు నన్ను ఇప్పుడే అట్టివారి చెంతకు తీసికొని వెళ్ళుము, ఎవరి ద్వారా నా అంతరంగమునకు శాంతి కలుగునో. నేను

సంసార జంఝాటముతో విసుగు చెందియున్నాను.” ఖలీఫా మిత్రుడు ఆయనను ఆ తపోనిధియగు సూఫియాన్ ద్వారము వద్దకు తీసికొని వెళ్ళి తలుపు తట్టెను. లోపలి నుండి ప్రశ్న విన వచ్చెను:-“ఎవరు?”

బైటి నుండి సమాధానము వెళ్ళెను:- “దేశాధి పతియగు హారూణ అల్ రసీదు.”

లోపలి నుండి:- ఎంతయో ధన్యుడను. తమరు దయ చేసిరా! ముందు తెలిసియున్నచో నేనే తమ చెంతకు వచ్చి యుండెడి వాడనే.

చక్రవర్తి:- నేను కలిసి కొనదలచిన వ్యక్తి ఈతడు కాడు.(ఏలనన ఇతడు మాయా విశిష్టుడగు జీవుడు.)

సూఫియాన్:— తమరు కలసి కొనదలచిన వ్యక్తి ఫజలు అయి ఉండును.” తదుపరి వారందరును ఫజల్ ఇంటికి వెళ్లిరి. ఆసమయమున ఫజుల్ కురానునందలి ఈ వాక్యమును ఉచ్చరించుచుండెను:-

"తమను కూడ దేవుడు ధరాత్ములను కొనవలెనని దుర్మార్గులు తలచెదరు."

చక్రవర్తి :- ఓహో! నాకు ఉపదేశించుటకు ఈ ఒక్క వాక్యమే చాలును. ఫజలు తన ఇంటికి వచ్చిన చక్రవర్తితో, వచ్చిన కారణ మడిగి ఇట్లనెను:-

"నేను చేయుచున్న పనికి అభ్యంతరము కలుగ జేసి నన్ను ఇతర విషయముల పైకి త్రిప్పకుడు."

చక్రవర్తి యొక్క మిత్రుడు:- "దేశపు చక్రవర్తిని గౌరవించవలెను."

ఫజలు:- "నా పనికి విఘ్నములు కలుగ జేయవద్దు."

తరువాత కుటీరములోనికి ప్రవేశించుటకు వారికి అనుమతి లభించెను. కాని హారూణ అల్ రసీదు ముఖము చూడరాదను ఉద్దేశ్యముతో ఫజలు దీపమును ఆర్పి వేసెను. హారూణతో చీకటిలోనే కరచాలనము చేసి ఇట్లనెను:- ఎంత

కోమలమైన హస్తములు. ఈ చేతులు నరకాగ్ని నుండి ముక్తిని పొందవలెను.

ఇట్లు పలికి ఫజలు నమాజునందు నిమగ్నుడయ్యెను. చక్రవర్తి రోదనము చేయుచు పలికెను:- ఇంకను ఏమైన చెప్పుడు.

నమాజు పూర్తి అయిన పిమ్మట ఫజలు పలికెను:- మీ తండ్రి పైగంబరగు హజరత్ మహమ్మదునకు పినతండ్రి. ఆయన పైగంబరును ఖలీఫా పదవిని తీసికొనమని బ్రతిమాలెను. అంతట పైగంబరు ఇట్లు పలికెను:-

"చిన్నాన్న గారూ! ఖలీఫాగా వేయి సంవత్సరములు సేవ చేయుటకంటె జీవితమును దేవుని సేవలో నుఉపయోగము చేయుట ఎంతయో మంచిది." దేశాధిపత్యము కంటె మనస్సుపై అధిపత్యం మంచిది.

ఇంకను ఏమైన చెప్పుడని ఖలీఫా ఫజలును అడిగెను:-

ఉమరు అబ్దుల్ అజీజు సింహాసనము

అధిష్ఠించినప్పుడు అబ్దుల్లా కుమారుడు సాలమును, ఇయుతు కుమారుడు రేఝాను, కాబేరు కుమారుడు మొహమ్మదును ఖలీఫా పదవికి వచ్చినందున తాను ఆచరించవలసిన కర్తవ్యమును అడిగెను.

వారిలో ఒకడు పలికెను:-

”మీరు పర లోకపు దండన నుండి ముక్తిని పొందదలచినచో వృద్ధులను తండ్రితో సమానముగా చూచు కొనవలెను. యువకులను బంధువులుగను, బాలురను వాత్సల్యముతోను, స్త్రీలను సోదరీ సములుగను, మాతృసములుగను చూడవలెను.”

చక్రవర్తి, ఏడ్చుచుచునే యుండెను.

“దేవుడనిన భయపడవలెను. అప్రమత్తతతో నుండుము. ప్రజలకు మేలు కోరుము. మీ రాజ్యములో ఒక్కడైనను ఆకలితో అన్నము లేకుండ యున్నచో, రాత్రి నిద్రను ఆ కారణముచే కోల్పోయినచో ఆతడు దేవుని దర్బారులో మీ పైన

ఫిర్యాదు చేయును."

ఈ వాక్యములు వినుటతో చక్రవర్తి ఏడుపు ఇంకను పెరిగి పోయెను. చక్రవర్తి స్నేహితుడు ఫజిలుతో పలికెను:-"మీరు చక్రవర్తిని చంపి వేయుచున్నారు."

చక్రవర్తి ఈ మాటలు విని ఇంకను అధికముగా ఏడ్వ మొదలిడెను.

చక్రవర్తి:- "మీరు ఏమైన ఎవరికైన ఋణము తీర్చవలసి యున్నదా ?"

ఫజలు:--అవును. నేను ప్రభువునకు చాల ఇవ్వవలసి యున్నది. ఆయన ఋణమును నేను తీర్చుకొన లేకపోతే అది ఎంతయో సిగ్గుపడవలసిన సంగతి.

చక్కవర్తి—ఇది నిజమే. కాని నేనడుగునది వేరు. తమరు జనులకు ఇవ్వవలసినది ఏమైనా కలదా?

ఫజలు:- ప్రభువు కృపచే నాకు అపారమగు సంపద లభించినది. ఆయనకు

అసంఖ్యాకములగు ధన్యవాదములు. ఆ ఋణము అనుమాట నాకు అవసరము లేకపోవుచున్నది.

అటు తరువాత ఒక వేయి బంగారు నాణెములు ఫజలు ఆసనము వద్ద నుంచి చక్రవర్తి పలికెను:- ఇది తప్పుడు మార్గమున సంపాదించలేదు. నాకు మా తల్లిగారి ఇచ్చిన సంపద. తమరు కృపతో స్వీకరించుడు.

ఫజలు:- (అనిష్టముతో) నేను నీకు ఇంత చెప్పినను ఏమియు ప్రయోజనము లేక పోయెను. ఇంకను ఇట్టి దురాలోచనలును, దుష్కార్యములును చేయుచునే ఉన్నావు. నేను నీ భారమును తగ్గించ గోరుచున్నాను. నీకు ఔన్నత్యమును, ముక్తి లభించు మార్గమును చూపించుటకు ప్రయత్నించుచున్నాను. కాని నీవు అందుకు వ్యతిరేకముగా ఇంకను భారము పెంచుకొని నన్ను కూడ నరకములో పడవేయ జూచుచున్నావు. ఇదుగో నేను చెప్పునది వినుము. నీది అనునది నీకు ఏమైన ఉన్నచో ప్రభువునకు

సమర్పించుము: కాని నీవు ఎవనికి ఇచ్చుట కూడదో వానికి ఇచ్చుచున్నావు. అరరే! నా ఉపదేశములు నీకు ఏమియు ఉపయోగించనే లేదే!... ”

ఇట్లు పలుకుచు ఫజలు లేచి నిలబడెను. కుటీర ద్వారమును మూసివేయుట ఆయన అభిప్రాయము అని ఖలీఫా తెలిసికొని బైటికి వచ్చెను. తలుపు మూయబడెను. బైటికి వచ్చి ఖలీఫా పలికెను:-ఆహా! ఈ మహాపురుషుడే నిజమగు పవిత్ర పురుషుడు.

ఇది అంతయు విని వాంసదా మహారాజావారు ఎంతయో సంతసించి యిట్లు పలికిరి. మహాత్ముడగు ఫజలువంటి వారే శ్రీ నిత్యానందుల వారు కూడను. నా కెన్నియో సదుపదేశములు వారివల్ల లభించినవి. నేను ప్రజలను సుఖ పెట్టుటకు ఎంతైనా ప్రయత్నింతును. పిమ్మట మహారాజావారు వాంసదా వెళ్ళిపోయిరి.

ॐ

# ముప్పది రెండవ ప్రసంగము

శ్రీ ప్రకాశానంద స్వామివారు ఒకప్పుడు జేతపురమునందుండగా దామజీ భాయి రాజకోటనుండి వెళ్లి వారిని తీసికొనివచ్చిరి. వారితో మోహన భాయి, శంకర భాయీ ఉండిరి. సాయం కాలము 5 గంటలకు వారందరును రాజకోటకు బయలుదేరి. మొదట అనుకొనిన ప్రకారము వారు మార్గమధ్యమునందలి పీరడియాలో ఆగి శ్రీ నిత్యానంద స్వామి వారి దర్శనార్థం వెళ్లిరి. ఆప్రసంగమున శంకర భాయి జీవ బ్రహ్మైభేదమును తెలుపు భజనను ఒక దానిని పాడెను. అది వినుటతోడనే శ్రీ నిత్యానంద స్వామి వారి నేత్రములనుండి ఆనందాశ్రువులు బయలు వెడలినవి.

## జీవ బ్రహ్మైం భేదము

# ముప్పది రెండవ ప్రసంగము

స్వా.ని.:- శ్రుతులయందు జీవబ్రహ్మోభేదము చాల యుక్తియుక్తముగా ప్రతిపాదించబడినది. అది మహావాక్యములు ద్వారానే తెలియును. 1. ప్రజ్ఞానం బ్రహ్మ 'ప్రజ్ఞానము బ్రహ్మము.'2. అయమాత్మా బ్రహ్మ 'ఈఆత్మ బ్రహ్మము' 3. అహం బ్రహ్మోస్మి 'నేను బ్రహ్మమును,' 4. తత్త్వమసి 'అది నీవు' ఇటు వంటి అపరోక్ష బోధకములగు వాక్యముల ద్వారా జీవ బ్రహ్మ అభేదము స్పష్టముగా కన్పించును.

4. తత్త్వమసి- ఈ మహా వాక్యమున తత్; త్వమ్, అసి అను మూడు పదములు కలవు. ఇందలి 'తత్' పదముచే సర్వజ్ఞుడును, సర్వ శక్తి విశిష్టుడు అగు దేవుడు గ్రహించబడును. "త్వమ్" పదముచే అల్పజ్ఞుడును, అల్పశక్తి విశిష్ఠుడును అగు జీవుడు గ్రహించబడును. ఈ ఇరువురును పరస్పర విరుద్ధములగుటచే ఇరువురి అభేదమును అసంభవము, కాని భాగ త్యాగలక్షణచే బ్రహ్మోభేదము సిద్ధించును. ఒక రకపు బంగారములో వెండియు, రెండవరకపు

బంగారములో రాగియు కలిసినవి అనుకొనుడు. ఒకటి వెండి కలసిన బంగారము అనెదరు. రెండవది రాగి కలసిన బంగారము అనెదరు. కాని అగ్నిలో కరగించినంతనే వెండియును, రాగియు వేరయి రెంటి యందును ఉన్న బంగారము మాత్రమే మిగులును. అటులనే ఈశ్వరోపాధి యుతమగు సర్వజ్ఞత్వమును, సర్వశక్తి మత్త్వమును విడనాడి కేవలము తత్ పద లక్ష్యార్థమగు చైతన్యమును జీవనోపాధియుతమగు అల్పజ్ఞ, అల్పశక్తి మత్త్వములను త్యజించి కేవల చైతన్య భాగమునే గ్రహించినచో ఉభయులకును అభేదము సిద్ధించును. తత్పదవాచ్యార్థమగు సర్వజ్ఞుడును సర్వశక్తి విశిష్టుడునగు ఈశ్వరునకును, త్వమ్ పద వాచ్యార్థమగు అల్పజ్ఞుడును, అల్పశక్తి విశిష్టుడును అగు జీవునకును ఉభయులకును అభేదము సిద్ధించును. కాని లక్షణచే తత్పద లక్ష్యార్థమగు చైతన్యము, త్వంపదలక్ష్యార్థమగు

చైతన్యము రెంటికిని అభేదము సిద్ధించును. శుద్ధ బ్రహ్మమునందు జగము అంతయును అధ్యస్తము అనగా దానియందు ఉన్నది. బ్రహ్మజ్ఞానంతరమున అందే లయమును పొందును. బ్రహ్మము, త్వమ్ పద లక్ష్యార్థమగు సాక్షి చైతన్యము-ఈ రెండును ఒకటే అయినందున శుద్ధ బ్రహ్మమునందు జగము యొక్క ఉత్పత్తి స్థితి లయములు ఉన్నవి.

అటులనే సాక్షి చైతన్యము కూడ ఉత్పత్తి స్థితి లయములకు అధిష్ఠానము. ఈ జీవబ్రహ్మాభేదమును తెలుపు సిద్ధాంతమును శ్రుతి స్వయముగా చెప్పుచున్నది.

***మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్/***
***మయి సర్వం లయం యాతి తద్ బ్రహ్మాద్వయ మస్మ్యహమ్ //***

"శుద్ధబ్రహాభిన్నమగు నేను సాక్షిని. దాని నుండియే ఈ జగమంతయును ఉద్భవించినది. నాయందే స్థితిని పొందుచున్నది. నాయందే

లయమును పొందుచున్నది. ఏలనన నేనే అద్వయుడగు బ్రహ్మ స్వరూపుడను.”

జగముయొక్క ఉత్పత్తి స్థితి లయములన్నియును నాయందే కల్పితములు. నా అస్తిత్వమునకు భిన్నమగు వేరొక అస్తిత్వము లేదు. అధిష్టానమగు అస్తిత్వమునకు భిన్నమగు కల్పిత పదార్థమునకు అస్తిత్వము లేక పోవుటయే ఇందుకు కారణము. ముత్యపుచిప్ప యందు కల్పించబడిన వెండి యొక్కయు త్రాడు యందు కల్పించబడిన సర్పము యొక్కయు అస్తిత్వము క్రమముగా ముత్యపుచిప్ప యొక్కయు, వెండి యొక్కయు అస్తిత్వములకు భిన్నము కానట్లు జగముయొక్క అస్తిత్వము కూడ సాక్షికి భిన్నము కాదు. విద్య మానమగు జగమంతయు నాయందు కల్పించబడినది. నేను సాక్షిని. ఆజగమునకు అధిష్టానమును.

ఇట్లు శ్రుతిని వివరించి స్వామివారు జీవబహ్మ భేదమును వర్ణించిరి. ఇది వినిన

రామజీ భాయి ఇట్లనెను :- "ఇది గంభీర విషయము. మావంటి వారలకు ఇది తెలియదు. కావున మావంటి వారలకు తెలియు సులభ మార్గమును దేనినైన తెలుపగోరుచున్నాను."

స్వామి శ్రీ నిత్యానందుల వారు శ్రీ ప్రకాశానందుల వారిని రామజీ భాయికి తెలియునట్లు తెలుపమని కోరిరి.

## సామాన్యులకు సులభమగునది భక్తి

స్వా. ప్ర. :-మీవంటివారలకు భక్తి శ్రేష్ఠమైనది. భక్తి సూత్రములయందు నారదమహాముని చెప్పెను:- ***అన్య స్మాత్ సౌలభ్యం భక్తౌ|***

కర్మయోగ జ్ఞాన యోగములకంటె భక్తి సులభము. కర్మ యోగమునకు ధనము కావలెను. జ్ఞాన యోగమునకు విద్య కావలెను. వర్ణాశ్రమ భేదము చే అధికారి భేదము కూడా అందు

కనిపించుచున్నది. ద్విజులకు వేదాధికారము కలదనియును, స్త్రీ శూద్రాదులకు పురాణాధికారము కలదనియును ఇట్టి రకరకములగు భేదములు అందు పాటించబడినవి. కాని భక్తి యందు అన్ని వర్ణముల వారికిని, ఆశ్రమముల వారికిని అధికారము కలదు. అది సులభము, భక్తి లక్షణము ఇట్లు చెప్ప బడినది:-

**సా త్వస్మిన్ పరమ ప్రేమరూపా।**

"కేవలము ప్రభువు నందు మాత్రమే ప్రేమ కలిగియుండుట భక్తి."

భక్తి రెండు రకములు:— 1. గౌణి 2. ముఖ్య.

# గౌణి

"***గౌణీ త్రిధా గుణ భేదాదార్తాది భేదాద్వా***" అని గౌణి భక్తి సూత్రములయందు వివరించబడినది.

గుణ భేదము చేతను, ఆర్తాది భేదము చేతను కూడ గౌణీభక్తి మూడు రకములు.

గుణ భేదముచే అనగా సత్త్వ రజ స్తమో భేదముచే మూడు రకములు. శ్రీమద్భాగవతము చెప్పుచున్నది:-

***అభిసంధాయ యద్ధింసాం దమ్భం మాత్సర్యమేవ వా /***
***సంరమ్భీ భిన్నదృగ్భావం మయి కుర్యాత్ స తామసః //***

"ఇతరులను బాధించవలెనను ఉద్దేశ్యముతో, కపటము చేయవలెననెడు తలంపుతో లేక పరోత్కర్షాసహిష్ణుత్వముతో క్రోధము, భేద భావము- ఈ రెండును కలిగియుండి విగ్రహాదులయందు దైవ భక్తిని

కలిగియుండుట తమోగుణ విశిష్టమగు భక్తి అన బడును.”

***విషయాన భి సంధాయ యశ ఐశ్వర్యమేవ వా /***
***అర్చాదావర్చయేద్యో మాం పృథ గ్భావః స రాజసః//***

“విషయేచ్ఛతోను, యశమును పొందవలెననుడు కోరికతోను ఐశ్వర్యమును పొంద వలెనను కోరికతోను భేద దృష్టితో విగ్రహాదులను పూజించిన రజోగుణ విశిష్టమగు భక్తి అనబడును.”

***కర్మనిర్హార ముద్దిశ్య పరస్మిన్వా త దర్పణమ్ /***
***యజే ద్యష్టవ్యమితి వా పృథ గ్భావః స సాత్వికః//***

“పాప క్షయమును దృష్టియందుంచుకొనియు, కర్మను- ఆ పరమాత్మునికి అర్పించి దేవుని సంతోషపెట్టవలెనను తలంపుతోను, యజ్ఞాది

కర్మలు చేయుట యుక్తము అనెడు భావముతోను కర్మలు చేయుచు భేద దృష్టితో విగ్రహాదులయందు దైవభక్తి కలవాడు సత్వగుణ విశిష్టుడగు భక్తుడు.”

ఆర్తాది భేదమున భక్తి నాలుగు రకములు.

***చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున |***
***ఆర్తో జిజ్ఞాసుర్థార్థీ జ్ఞనీ చ భరతర్షభ||***

అని భగవద్గీత తెలుపుచున్నది.

“నాలుగురకములకు చెందిన సత్కార్యనిరతులగు జనులు దేవుని భజించుదురు. 1. ఆర్తుడు 2. జిజ్ఞాసువు 3. ధనార్థి 4, జ్ఞాని.”

1. ఆర్తుడు:- దుఃఖించువాడు.

కౌరవసభలో ద్రౌపది వస్త్రములను విప్పమని దుర్యోధనుడు ఆజ్ఞాపించెను. ఈ తగని ఆజ్ఞను వినినంతనే ద్రౌపది సభలో కూర్చొని యున్న భీష్ముడు, ద్రోణుడు మొదలగు పెద్దలందరి ముఖముల వైపును చూచెను. అటు తరువాత

ఆమె పాండవుల వైపు చూచెను. కాని వారు అందరును తలలు వంచుకొని కూర్చుని యుండిరి. వారిలో ఎవరికిని ఆమెను రక్షించు సామర్థ్యము లేకుండెను. ఈ సంగతిని గమనించి ఆమె కృష్ణ పరమాత్ముని ప్రార్థించెను.

2. జిజ్ఞాసువు:- ఆత్మజ్ఞానము పొందవలెనను తలంపు కల వాడు. ముచికుందుడు, జనకుడు, ఉద్ధవుడు మొదలగువారు ఆత్మ జ్ఞానము కొరకు ప్రభువును ఆరాధించెను.

3. అర్థార్థి:- ఇహలోకము నందు కాని, పరలోకము నందు కాని భోగసాధనములగు అర్థమును కోరువాడు. సుగ్రీవుడు, విభీషణుడు, ఉపమన్యుడు మొదలగువారు ఇహలోక భోగముల కొరకును, ధ్రువాదులు పరలోక భోగముల కొరకును ఆరాధించిరి.

పై చెప్పిన మూడురకముల భక్తులును గౌణభక్తులు. ముఖ్య భక్తులు. పరాభక్తు

లనబడుదురు. ‘జ్ఞానీ చ భరతర్షభ’ అని శ్లోకము నందు వర్ణించిన జ్ఞాని ముఖ్య భక్తుడు. లేక పరాభక్తుడు. సనకాదులు, నారదుడు, ప్రహ్లాదుడు, పృథుమహారాజు, శుకుడు మొదలగువారు జ్ఞానులగు భక్తులు, ఈగౌణిభక్తి ముఖ్యభక్తికి కారణము.

భక్తిసూత్రములయందు నారదమహాముని చెప్పెను:-

***ఉత్తర స్మాదుత్త రస్మాత్ పూర్వపూర్వా శ్రేయాయ భవతి /***

గౌణిభక్తి ముఖ్యభక్తి ఈ రెండింటిలోను ముందు దానికంటే తరువాతిది శ్రేష్టము. భాగవతమున శ్రవణాది నవ భక్తులు చెప్పబడినవి. అవికూడ గౌణిభక్తికోటికే చెందును.

## నవ విధ భక్తులు

***శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనమ్/***

**అర్చనం వన్దనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్||**

"విష్ణు భగవానుని శ్రవణము చేయుట, కీర్తించుట, స్మరించుట, పాద సేవచేయుట, అర్పించుట, వందనము చేయుట, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము - అను ఈ తొమ్మిదియును. భక్తియందలి రకములు.

1. శ్రవణము:- భగవానుని గుణానువాదమును ప్రేమతో వినుట శ్రవణము. పరీక్షిత్ మహారాజు శ్రవణభక్తితో 7 రోజులలో ప్రభువును పొందెను.

2. కీర్తనము:- ప్రేమతో భగవానుని గుణానువాదమును కీర్తించుట. నారదమహాముని నిరంతరము ప్రభుని గుణ గానముచే ప్రభు సాక్షాత్కారమును పొందెను.

3. స్మరణము: - ఉత్సాహముతో ప్రభు స్వరూపమును హృదయమున నిలిపి స్మరించుట.

ప్రహ్లాదుడు ఎల్లప్పుడును ప్రభువును హృదయమున స్మరించి ప్రభువును పొందెను.

4 పాద సేన:- నిత్యము ప్రభువు చెంత నుండి పాద సేవ చేయుట, లక్ష్మణుడు శ్రీ రామచంద్రుని పాదములను సేవించి ప్రభువును సంతోష పెట్టెను. పాద సేవ అనుమాట సర్వవిధములగు సేవలకును ఉపలక్షణముగా గహించవలెను.

5. అర్చన: - రామకృష్ణాది మూర్తులను షోడశోపచారములతో పూజించుట అర్చన భక్తి అనబడును. అంబరీషుడను మహారాజు అర్చన భక్తితో తరించెను. ఈనాడు రామకృష్ణాది అవతారములు ప్రత్యక్షముగా గోచరించవు. కావున వాని విగ్రహములను ఉంచి పూజించుట అర్చన భక్తి అనబడును. విగ్రహములు మూడు రకములు :

1. సాత్త్వికములు. 2. రాజసికములు, 3. తామసికములు.

శుక్ర నీతి యందు ఈ విషయము వివరించబడినది.

***యోగముద్రాన్వితా స్వస్థా వరాభయకరాన్వితా /***
***దేవే న్ద్రాదిస్తుతా యాచ సాత్త్వికీ సా ప్రకీర్తితా //***

“యోగముద్రతో కూడినది కాని, స్వస్థమగు విగ్రహము కాని, వరాఽభయహస్తములు కలది కాని, ఇంద్రాది దేవతలు స్తుతించబడినది కాని సాత్త్విక విగ్రహము అని చెప్ప బడును.”

1 యోగముద్రతో కూడినది:- అర్ధోన్మీలిత నేత్రద్వయముతో దృష్టిని భ్రూమధ్యమున అనగా- నాసికాగ్రమున నిలిపినది.

2. స్వస్థ:-- పద్మాసనమున శాంత భంగిమముతో నున్నది.

3. కరాఽభయ కరాన్వితా:- అభయ వరదహస్తములతో కూడినది. వరములను, అభయమును ఇచ్చుచున్నట్లు ఉన్న విగ్రహము.

ఎడమచేయి పైకి ఎత్తి చూపుచు అభయమును ఇచ్చుచుండుటయును, కుడిచేయి వరమును ఇచ్చుచున్నట్లు ఉండుటయును కలది.

4. ఇంద్రాది సంస్తుత:— ఇంద్రాది దేవతలు వినయముతో సూక్తముల ద్వారా స్తవము చేయుచు ఉండట.

పైన చెప్పిన నాలుగురకముల విగ్రహములును సాత్త్విక విగ్రహములు. ఈవిధములగు సాత్త్విక విగ్రహములను పూజించువారు, తరుచు ముముక్షువులు అయి యుందురు. సాత్తికవిగ్రహములు సాత్త్విక ముద్రలతో కూడియుండును. యోగముద్ర, జ్ఞానముద్ర, అభయముద్ర, వరముద్ర- అనునవి సాత్విక ముద్రలు. సాత్విక ముద్రాన్వితములగు విగ్రహములను, సాత్విక ముద్రలను చూచుటచే పాపములు నశించును, పుణ్యము కలుగును, కోరికలన్నియును సిద్ధించును అని శాస్త్రజ్ఞులు చెప్పిరి.

***మోద నాత్సర్వదేవానాం ద్రవణ్పాపసంతతేః/***

***తస్మాద్ ముద్రేతి సా ఖ్యాతా సర్వకామార్థ సాధనీ||***

“దేవతలందరును ప్రసన్నులగుటయును పాపములన్నియును తొలగిపోవుటయును, కోరిన పదార్థముల నన్నిటిని లభింపజేయునది యను ‘ముద్ర’ అని జగత్ప్రసిద్ధము.” ఉత్తమ ముద్రాన్వితములగు సాత్త్విక విగ్రహములను ధ్యానించుటచే చిత్తమునకు స్థైర్యము కలుగును. లయ, కషాయ, విక్షేప, రసాస్వాదాది దోషములు సాత్త్విక పూజకునికి ధ్యానమునందు ప్రతి బంధకములుగా నుండవు. సాత్త్విక విగ్రహమును అర్చించుటచే ధ్యానాదులద్వారా జ్ఞానము కలుగును. “***సత్త్వాత్ సంజాయతే జ్ఞానమ్***” అని చెప్పబడినది. సాత్త్వికవిగ్రహమును ధ్యానించుటచే, సత్త్వగుణ విశిష్టులగు సత్పురుషుల ఉపదేశములచే సత్త్వాధిక్యముచే జ్ఞానోత్పత్తి యగును. అనన్య భావముతో సాత్త్వికవిగ్రహారాధన చేయుచున్న భగవద్భక్తుని

హృదయమున నేను దాసుడను అను భావము ప్రథమమున ఉద్భవించును. ఇంకను పరిపాకమును పొందిన పిమ్మట పూజకుని హృదయమున “పూజ్యుడగు దేవుడు నాసత్త్వము” అను భావము కలుగును. ఈ భావ పరిపాకాంతమున పూజ్యుడు తన స్వరూపము అని అంగీకరించును. మధుసూదన సరస్వతీ స్వాముల వారు భగవానుని శరణుజొచ్చినచో సాధనాపరిపక్వ కలిగినంతనే ముముక్షుత్వము లభించును అని చెప్పిరి:-

***త స్యైవాహం మమైవాసౌ స ఏవాహమితి త్రిధా /***
***భగవచ్ఛరణత్వం స్యాత్ సాధనాభ్యాసపాకతః//***

“సాధనాభ్యాసము పరిపక్వమయినకొలదియు భగవానుని శరణునందు క్రమక్రమముగా మూడురకముల భావపరివర్తనము కలుగును. 1. నేను అతని వాడను. 2. భగవానుడు నావాడు. 3. నేను

ఆతనినే”

పైన చెప్పబడిన సాత్విక విగ్రహారాధన చేయువాడు పరి పక్వావస్థయందు పూజ్యుడే అగును.

శుక్ర నీతియందు చెప్ప బడినది:-

## రాజస విగ్రహము

***తిష్ఠతి వాహనస్థా వా నానాభరణభూషితా / యా శస్త్రాస్త్రా భయవరకరా సా రాజసీ స్మృతాః //***

“నిలబడి కాని, వాహనము పై కూర్చొనికాని, వివిధాలంకారములతో అలంకరింపబడికాని, శస్త్రాస్త్రములతోను, వరదాభయహస్తములతోను కాని ఉన్న విగ్రహము రాజస విగ్రహము.”

అర్థార్థులగు అర్చకులు తరచు రాజసవిగ్రహమును పూజించుదురు. రాజసవిగ్రహలక్షణము శాస్త్రజ్ఞులు ఇట్లు చెప్పిరి:-

నిలబడి కాని, గరుడ, వృషభ, సింహాది వాహనారూఢమైకాని ఉన్నను, అనేక విధములగు అలంకారములను అలంకరించుకొని, వివిధ శస్త్రాస్త్రములను ధరించి అభయ, వరదహస్తములతో నున్నను అట్టి విగ్రహము రాజసవిగ్రహమనబడును. రాజసవిగ్రహమును పూజించువారి హృదయముల యందు సాత్విక భావములు ఉదయించుట అరుదు. ఏలనన దేవత యొక్క ఆకారమును బట్టి ధ్యానము చేయువాని హృదయ భావములు నిర్మితమగును.

తమోగుణ విశిష్టమగు విగ్రహమును గురించి శుక్ర నీతి ఇట్లు చెప్పుచున్నది.

***శస్త్రాస్త్రైర్దైత్యహన్త్రీ యా ఉగ్రరూపధరా సదా |***
***యుద్ధాభినన్దినీ సా తామసీ ప్రతిమోచితా||***

“శస్త్రాస్త్రములతో దైత్య సంహారము చేయునట్టిదియు, ఎల్లప్పుడును ఉగ్రరూపమును ధరించినట్టిదియును, యుద్ధమునందు ఆనందమును కలిగియుండునట్టిదియును అగు విగ్రహము తామసవిగ్రహము అనబడును.”

కత్తులు మొదలగు శస్త్రములను, త్రిశూలము, చక్రము మొదలగు అస్త్రములను ధరించి దైత్య సంహారము చేయుచు ఉండునట్టిదియు, ఎల్లప్పుడును ఉగ్రరూపమును ధరించునట్టిదియు, యుద్దము నందు ఇచ్ఛ కలిగినట్టిదియు అగు విగ్రహము తామసవిగ్రహము. ఇట్టి విగ్రహమును తమోగుణ విశిష్టులగు అర్థార్థులు పూజించెదరు. ఆపూజ వలన కలుగు ఫలితము స్వల్పమే. తామస ప్రతిమను పూజకాని, ధ్యానము కాని చేయువారికి సాత్త్విక మనస్తత్త్వము కలుగదు. ఏలనన తమోగుణవిశిష్టమగు విగ్రహమును పూజించుటచే నాతని మనస్సు నందు తామస భావము లే జనించును.

6. వందనము:—సాష్టాంగ దండ ప్రణామము ప్రభు చరణములకు ప్రేమతో నమస్కరించుట వందన భక్తి అనబడును. అక్రూరుడు శ్రీకృష్ణ పరమాత్మునకు అత్యంతమగు

ప్రేమతో నమస్కరించి ప్రభువును పొందెను.

7. దాస్యము: – ప్రభువు నాజ్ఞలను ప్రేమతో పాటించుట దాస్యభక్తి అనబడును. హనుమానుడు శ్రీరామచంద్రు నాజ్ఞలను యథార్థముగా పాటించి సంతుష్టి పరచెను.

8. సఖ్యము:-ప్రభువునందు ప్రేమతో మైత్రిని నెరపుట సఖ్య భక్తి, అర్జునుడు కృష్ణపరమాత్మనితో అనుకూలముగా వ్యవహరించెను. అది సఖ్య భక్తి.

9. ఆత్మనివేదనం:— సర్వస్వమును అర్పించుట ఆత్మనివేదనము అను భక్తి. బలిచక్రవర్తి ప్రేమతో తన సర్వస్వమును ప్రభుచరణములయందు సమర్పించెను.

సమగ్రముగా అలోచించి చూచిన ఆత్మనివేదనము అను భక్తి పద్ధతియందు ముందు తెలపిన భక్తి పద్ధతులు అన్నియు సమావేశ మగును.

**కృత్వా దేహాధికం తస్య ప్రీత్యై సర్వం తదర్పణమ్/**
**నిర్వాహాయ చ శూన్యత్వం యత్తదాత్మసమర్పణమ్//**

"పరమాత్ముని ప్రేమ కొరకు తన దేహాదులు అన్నియును ఆతనికి సమర్పించి తన నిర్వహణకు శూన్యత్వమును ఉంచుకొనవలెను. (అనగా ఏమియును మిగుల్చు కొనరాదు.) ఇది ఆత్మసమర్పణము అనుభక్తి. ఈ తొమ్మిది విధములుగను చెప్పబడు భక్తి గౌణి అనబడును.

"***గౌణ్యాతు సమాధి సిద్ధిః***" అని శాండిల్య భక్తి సూత్రములు చెప్పుచున్నవి.

ఈ శ్రవణాది నవవిధములగు భక్తి చేతను సమాధి లాభము కలుగుచున్నది. గౌణిభక్తినే అపరభక్తి అని అందురు. ఈ తొమ్మిది విధములగు భక్తి చేతనే సవికల్ప సమాధి ద్వారా నిర్వికల్ప సమాధి ప్రాప్తించును. నిర్వికల్ప సమాధిచే సాక్షాత్కారము కలుగును. అదియే ముఖ్యభక్తి లేక

పరాభక్తి అని అనబడును.

ఈ రోజులలో మీరందరును చెప్పునది నిజమగు భక్తి కాదు. శ్రవణ, కీర్తనాదులు 8 మాత్రము కన్పించును. కాని ఆత్మనివేదనము మాత్రము కాన వచ్చుట లేదు. ఆత్మనివేదనము తప్ప మిగిలినవి అన్నియును భక్తి యొక్క ఆభాస మాత్రములే. ప్రభువు పై ఆస్తిక్యబుద్ధి లేకపోవుటయే ఇందుకు కారణము. ఆస్తిక్యబుద్ధి యున్నచో రేపు గురించి చింతించవలసిన అవసరము ఏమి?

## గీతా పండితుని ఆస్తిక్యబుద్ధి

ఒకానొక గ్రామమున ఒక బ్రాహ్మణ పండితులు ఉండెడివాడు. ఆతడు శ్రీకృష్ణ పరమాత్ముని పరమ భక్తుడు. నిత్యము గీతను పఠించు చుండెడివాడు. అందుచే నాతడు గీతాపండితుడని పిలువబడెడివాడు. కుటుంబమును పోషించుటకు ఏమియును పురుషార్థమును ఆచరించెడి వాడు కాడు.

అయాచితముగా అనాయాసముగా లభించిన దానితో కుటుంబపోషణమును చేసెడివాడు. ఈ విధముగా జరుగుచుండగా ఒకప్పుడు పెద్ద కరువు వచ్చెను. అందుచే జీవితనిర్వహణము కష్టమయ్యెను. భార్య అతనితో కుటుంబ నిర్వహణమునకు పురుషార్థమును చేయుమని అనేక మారులు చెప్పుచుండెడిది. "ఇంతవరకును నేను యాచించలేదు. కావున ఇక ముందు నేను యాచించుటకు వెళ్ళను." అని అతడు చెప్పెను. అంతట భార్య ఇట్లనెను:- "పిల్లలు మనము ఆకలితో చచ్చిపోవుచున్నాము. బ్రాహ్మణులము కదా! గ్రామము లోనికి వెళ్లి ఏదియో ఒకటి యాయవారము అడిగి తీసికొనిరండు." అందుకు కూడ ఆ బ్రాహ్మణుడు ఇష్టపడ లేదు, ప్రభువు నందు శ్రద్ధా భక్తులు కలిగియుండమని చెప్పెను. "ప్రభువునందు శ్రద్ధాభక్తులు కలిగియుండుటచే కడుపు నిండదు." అని భార్య మరల సమాధానము చెప్పెను.

అంతట గీతా పండితుడు ఆమెకు ఇట్లు నచ్చ చెప్పెను. గీతయందు శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పెను.

**అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగ క్షేమం వహామ్యహమ్॥**

"నా యందలి అనన్య భక్తితో నన్ను చింతన చేయుచు, నన్ను ఉపాసించుచు, నాయందు నిత్యము ప్రేమను చూపుచు ఉండు నా భక్తుల యోగక్షేమములు నేను చూచెదను."

యోగము అనగా లభించనిది లభించునట్లు చేయుట. క్షేమము అనగా లభించినదానిని కాపాడుట. గీతయందు శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన ప్రకారము అయన యందు శ్రద్ధకలిగి యుండుము అని బ్రాహ్మణుడు భార్యతో చెప్పెను. దానికి ఆమె ఇట్లనెను.:-

"ఆ వ్రాసినది తప్పు" అని తాళపత్ర

గ్రంధమునందు ఉన్న ఆ శ్లోకమును ఆమె గంటముతో ముమ్మారు కొట్టివేసెను. అంతట గీతా పండితుడు మిగుల కోపించి చెప్పెను.

"నా ప్రభువునందు నీకు నమ్మకము లేదా? ఇది ఏమి ఇట్లు చేసితివి?" అని మిక్కిలి ఖేదముతో ఆయన ఇంటినుండి బయలు వెడలి ఒక ఏకాంత స్థానమున గీతా పారము చేయుచు కూర్చొనెను. అటు తరువాత ఒక యువకుడగు గొల్ల ఒక కావిడిలో పప్పు, పిండి, నెయ్యి, పెరుగు, పంచదార, కూరలు మొదలగు పదార్ధములను తీసికొని గీతా పండితుని ఇంటికి వచ్చెను. అతడు కావిడి దింపు కొని ఎంతయో అలసిపోయినట్లు కూర్చొనెను. గీతాపండితుని భార్య ఆతనిని అడిగెను.

"ఇవి అన్నియును ఎవరు పంపెను?"

మా యజమాని శేరుగారు ఆ సామానులు స్వయం పాకమునకు మీకు పంపెను. తీసికొనడు అని గొల్ల సమాధానము చెప్పెను. గీతా పండితుని

భార్య సంతోషించి వంట వండెను. వంటకములను భుజించి వెళ్ళమని ఆ గొల్లను ఆమె పట్టుబట్టెను. కాని గొల్ల సమాధానము చెప్పెను. "నాకు భుజించు సామర్థ్యము లేదు. నా నాలుకపై మూడు పుండ్లు పడియున్నవి. వాని నుండి రక్తము స్రవించుచున్నది. అమ్మా! నేను వెళ్ళుచున్నాను."

గీతా పండితుని భార్య అడిగెను:- పండితులు వచ్చి అడిగినచో ఏమని చెప్పుదును?

గొల్ల జవాబు చెప్పెను :-- "నాలుక యందు మూడు పుండ్లు ఉన్న మనుష్యుడు వచ్చి ఈ స్వయం పాకమును ఇచ్చెనని చెప్పుడు.

గీతా పండితుడు ఏకాంతమున రోజంతయును ఉండి సాయం కాలము ఇంటికి వచ్చెను. అంతట ఇంటిలో నున్న మంచి ఆహార పదార్థములను చూచి విస్మయముతో నడిగెను. "ఇవి అన్నియు ఎక్కడి నుండి తెచ్చితివి?"

భార్య జవాబు చెప్పెను:- ఎవరో శేఠ్ యొక్క

గొల్లయట. అతని నాలుకపై మూడు పుండ్లు కలవట. మీరు ఇంటినుండి బైటికి వెళ్ళిన తర్వాత తెచ్చి ఇచ్చెను. శ్రీకృష్ణపరమాత్ముడే ఈ సామాను అంతయును తెచ్చి ఇచ్చెనని తెలిసికొనుటకు ఆ బ్రాహ్మణునకు ఆలస్యము అవ్వ లేదు. ఆయన భార్యతో నిట్లనెను:-

ఆతడు గొల్లకాడు, సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్ముడే వచ్చెను. నీవంటి పాపాత్మురాలికి దర్శనమిచ్చెను. కాని నేను మాత్రము యథా ప్రకారముగనే ఉన్నాను. అవి నాలుక మీద పుండ్లు కావు. నీ గంటపు కొట్టి వేతలు. ఇప్పుడైన తెలిసికొని పరమాత్మునిపై అచంచలమగు శ్రద్ధా విశ్వాసములను కలిగియుండుము. భవిష్యత్తును గురించి చింతించక పోయినచో ప్రభువే తనంతట తాను తన భక్తులను రక్షించును.

# ఫకీరుని ఆస్తిక్య బుద్ధి

ఈవిషయముననే మరియొక దృష్టాంతము కూడ కలదు. తపశ్శాలియగు 'శాహసుజా'

పరమ ధార్మికరాలును యౌవనవతియును అగు కన్యక ఒకర్తె ఉండెను. కేర్మాను దేశవు చక్రవర్తి ఆ కన్యను తనకు పరిణయమాడనిమ్మని శాహసుజాకు వర్తమానము పంపెను. "మూడు రోజులలో సమాధానము చెప్పెదనని" శాహసుజా చెప్పెను. "ఈ మూడు రోజులలోను ఆతడు ఎన్నియో మసీదులు గాలించెను. మూడవరోజున అతడు మసీదులో ఒక యువకుడగు ఫకీరును కాంచెను. ఆతడు ఎంతయో భావ యుక్తముగా నమాజు చదువు చుండెను. ఆతని నమాజు పూర్తి అగు వరకును అతడు అక్కడ నిలబడి యుండెను. నమాజు పూర్తి అయిన తదుపరి ఆ ఫకీరును శాహసుజా అడిగెను. "ఓ యువకుడా! నీకు వివాహము అయినదా?"

ఫకీరు:-"లేదండీ"

శా. స. :-"నీకు పెండ్లి చేసి కొనవలెనను కోరిక కలదా?"

ఫకీరు:- నావంటి దరిద్రునకు ఎవడైన తన

కుమార్తె నిచ్చునా? నాదగ్గర మూడు డబ్బులు కంటే మించి లేవు.

శా. సు. :-- నా కుమార్తెను. నీకు ఇచ్చి పెండ్లి చేయుదును. ఆ మూడు డబ్బులలోను ఒక డబ్బుతో సాంబ్రాణి, మరొక డబ్బుతో రొట్టె, ఇంకొక డబ్బుతో పటిక బెల్లము కొనుక్కొని రమ్ము.

ఈవిధముగా శాహసుజా కొమార్తె వివాహము ఆ ఫకీరుతో జరిగెను. ఎంత ఆశ్చర్యము, అపారమగు ధనము గల కేర్మాను చక్రవర్తికి తన కుమార్తెను ఇచ్చి పెండ్లి చేయకుండ శాహసుజా తన కుమార్తెను పరమానందముతో ఒక దైవభక్తుడును, ధ్యానపరాయణుడును అగు బీద ఫకీరునకు ఇచ్చి వివాహము చేసెను.

వివాహము అయిన నాటి రాత్రి ఆ కన్య తన భర్త కుటీరములో అడుగు పెట్టెను. ఆమె కుటీరము నలుదెసల కలయచూచెను. ఒక మూల ఒక జల పాత్ర ఎండిన రొట్టె ముక్క ఉండెను. “ఇది ఏమి”

అని కన్య అడిగెను.“ ఈ రొట్టి ఇక్కడ ఏల నుంచబడినది?” అని ఆమె ప్రశ్నించెను.

భర్త చెప్పెను:-“నేటి రాత్రి తినుటకు పనికి వచ్చును అని తలచి నిన్న నిలువ చేసితిని. ఈమాట వినినంతనే ఆమె నిస్పృహతో తన పుట్టింటికి వెళ్ళిపోవుటకు సిద్దమయ్యేను. ఇది కాంచి ఫకీరు పలికెను. శాహసుజా వంటి ధనవంతుని కుమార్తె నావంటి దరిద్రుడగు ఫకీరునకు సహధర్మచారిణి కాతగదు అను సంగతి నేను మొదటి నుండియు ఎరుగుదును.”

యువతి పలికెను:- ప్రియతమా! నీ నిర్ధనత్వమును తెలిసి కొని నేను పుట్టినింటికి (అలిగి) వెళ్లుచున్నానని అనుకొనకుము. నీ ప్రభుపరాయణత్వము నందలి లోపమునకు దుఃఖించి వెళ్ళిపోవుచున్నాను. “రేపు ఏమి తిందును” అను తలంపుతో నీవు ఈ రొట్టెను నిలవచేసి యున్నావు. నీవు ఎంతనమ్మకము లేని వాడవు! మా తండ్రిగారు నీ పైపై ఆడంబరములు చూచియే నిన్ను ఎంచిరి అని నాకు తోచుచున్నది.

ఇరువది సంవత్సరములు నన్ను పెంచి పెద్ద దానిని చేసి దేవుని పై పూర్తియగు ఆస్తిక్య బుద్ధి కలవానికి ఇచ్చి పెండ్లి చేయుదునని చెప్పెను. కాని నీకు దేవుడు రొట్టె అయిన నిచ్చునను నమ్మకము లేదు.

ఇది విని ఫకీరు స్తబ్ధుడయ్యెను, ఎంతయో సిగ్గుపడి ఇట్లనెను:-

"ప్రియా! నా పాపమునకు ప్రాయశ్చిత్తము ఏమి?"

భార్య పలికెను:- " ఇంటిలో నేనైన నుండవలెను, లేక ఆ రొట్టెముక్క అయినను ఉండవలెను."

ఫకీరు వెంటనే ఆ రొట్టెముక్కను బైటికి విసరివేసెను.

"ప్రభుపరాయణుడగు వాడు రేపు ఏమగునను చింతను కలిగి యుండడు" అనియే అన్ని మతములును చెప్పుచున్నవి. ఈవిషయము బైబిలు నందుకూడ కాననగును.

# క్రీస్తు ఆస్తిక్య బుద్ధి

మహాత్ముడగు క్రీస్తు బైబిలునందు ఒక చోట చెప్పెను:-

"నీవు నీ జీవితమును గురించి ఏమియు బాధపడటం లేదు. కావున ఏమి తినవలెను? ఏమి త్రాగవలెను? ఏమి ధరించవలెను? ఇట్టి విషయములను చింతించవలసిన అవసరము లేదు. ఆహారాదులకంటె జీవితము ఎక్కువ విలువైనది గాదా! ఆకాశమునందు ఎగురు పక్షులను చూడుము. అవి ధాన్యమును నాటుట లేదు. కోయుటలేదు. నిలవ చేయుట లేదు. అయినను పరమాత్ముడు వానికి అన్నపానాదులను సమకూర్చుచునే యున్నాడు. పక్షులకంటెను నీవు గొప్ప వాడవే కదా!

తోటలో పెరిగిన లిల్లీ అను పుష్పమును చూడుము. అది ఎట్లు పెరిగినది? అది ఏమియు చేయుట లేదు. అయినను వాడిపోవుట లేదు. దేవునిపై నమ్మకము లేని వారలారా! అదిగో

చూడుడు. పరమాత్ముడు అడవిలోని గడ్డిని కూడ రక్షించును. మిమ్ము రక్షించడా? కావున నేను ఏమి తినెదను? ఏమి ధరించెదను? మొదలగు ఆలోచనలను ఎప్పుడును కలిగియుండ రాదు. (ఏలనన ప్రాపంచిక జనులు ఎల్లప్పుడును ఈ వస్తువులను గురించియే బాధపడు చుందురు.)నీకు ఈ వస్తువులు అన్నియు కావలెనని పరమాత్మునకు తెలియును. ముందు నీవు ప్రభువు యొక్క రాజ్యమును ఆయన యొక్క సత్య ప్రియత్వమును శోధించి తెలిసికొనుము. అప్పుడు ఈ వస్తువులు అన్నియును వాటంతటవియే నీకు లభించును. కావున ఆలోచించవద్దు. 'రేపు' వచ్చినచో అదియే ఈ వస్తువులన్నిటిని చూచుకొనును. నేటి అనర్థములన్నిటిని గురించియు నేడే ఆలోచించవలెను.

పరమాత్ముడు, సైతాను (అనగా మాయ) ఇరువురును ఒకేమారు భజించబడరు.

సంక్షేపముగా చెప్పవలెననిన మీరు నాస్తికులే. అందుచేతనే మీకు పరమాత్ముని పై శ్రద్ధ లేదు. అందుచేతనే రేపటి సంగతి ఆలోచించు చున్నారు.”

పరమాత్ముడు, మాయ. ఈ రెండును ఒకేమారు లభించవు. అను విషయమును గురించి కబీరు సాహబుకూడ చెప్పెను: -

“ప్రభువుపై ప్రేమకల చోట ధనాది మాయిక పదార్థములపై ప్రేమ ఉండదు. ధనాది మాయిక పదార్థములపై ప్రేమ ఉన్న చోట ప్రభునిపై ప్రేమ ఉండదు. నిజమగు ప్రభు భక్తి ఉన్న చోటనే వైరాగ్యము కూడ కన్పించును.”

## సర్వాత్మ భావ విచారము

ఈవిధముగ మొదట విగ్రహము ద్వారా నవవిధభక్తులను ఆచరించుచు విగ్రహగతుడగు పరమాత్ముడు స్థావర జంగమాత్మకమగు సర్వ ప్రాణుల యందును వ్యాపకుడై యున్నాడని తెలిసికొని భక్తితో బాటు సర్వాత్మ భావమును

కూడ చింతన చేయవలెను.

భాగవతమునందు కూడ భగవానుడు చెప్పెను:-

***మద్గుణ శ్రుతిమాత్రేణ మయి సర్వగుహాశయే /***
***మనోగతిరవిచ్ఛిన్నా యథా గఙ్గామ్భసోఽమ్బుధౌ//***
***లక్షణం భక్తి యోగస్య నిర్గుణస్య హ్యుదాహృతమ్ /***
***అ హైతుక్యవ్యవహితా యా భక్తిః పురుషోత్తమే//***

"నాగుణశ్రవణముతో బాటు, సర్వాంతర్యామినగు నాయందు సముద్రమునందు గంగాజలమువలె అవిచ్ఛిన్నముగా (మధ్య చెదరి పోకుండ) మనస్సు లగ్నమయి యుండవలెను అట్లుండుటు ఏవిధమగు ఫలమును కోరుట కాని, భేదభావమును కలిగియుండుట కాని కూడదు.

ఇది పురుషోత్తముడగు పరమాత్ముని పట్ల నాచరించబడు నిర్గుణ భక్తి యోగము యొక్క లక్షణము.”

పశువులు, పక్షులు, మనుష్యులు, కీటకములు, మిడుతలు మొదలగు ప్రాణులన్నిటియందును పరమాత్మనే చూడవలెను. పరమాత్ముడు వేరు వేరు స్వరూపములతో వేరు వేరు ఆకారములచే తానే అన్నిటి యందును ఉండును అని భావించి ప్రభువును ధ్యానించవలెను. విగ్రహారాధన చేయువారు ఇతరుల పట్ల చూపు రాగ ద్వేషములు యథార్థమగు భక్తి కాదు. భగవానుడు చెప్పెను.

***అహం సర్వేషు భూతేషు భూతాత్మావస్థితః సదా/***
***తదవజ్ఞాయ మాం మర్త్యః కురుతేఽర్చావిడమ్బనమ్//***

సర్వాంతర్యామినగు నేను అన్ని ప్రాణులయందును ఎల్లప్పుడును ఉందును. దానిని అవమానము చేయుచు విగ్రహారాధన

చేయునాడు పూజను అపహసించుచున్నాడు.”

**యో మాం సర్వేషు భూతేషు సన్తమాత్మాన మీశ్వరమ్/**
**హిత్వాఽర్చాం భజతే మౌఢ్యాత్ భస్మన్యేవ జుహోతి సః//**

“ నేను సద్రూపమున అన్ని ప్రాణులయందు ఉండు ఈశ్వరుడను. వానిని ఉపేక్షించి విగ్రహారాధన చేయుమూఢుడు బూడిదలో హోమము చేయుచున్నాడని తెలిసికొనవలెను.”

పరమాత్ముడు సర్వవ్యాపకుడు అయినను కొందరు మంద బుద్ధులు, అనగా మొద్దులు విగ్రహమునందే ప్రభుభావమునుగాంచి ఇతరులను ఉపేక్షించుదురు. అంతేకాదు. పంచాయతన దేవతలలో కూడ ఒకరిని ఆరాధించి మరియొకరిని ఉపేక్షించుదురు.

## భేద బుద్ధి మహా పాపము

పంచాయతనమునందుకూడ భేద బుద్ధితో

వ్యవహరించువారికి బ్రహ్మహత్యా పాతకము సంభవించునని దేవీ భాగవతమున చెప్పబడినది.

***శ్రీకృష్ణేచ తదర్చాయాం అన్యేషాం ప్రకృతౌ సతి/***
***శివే చ శివలిఙ్గే చ సూర్యే సూర్యమణౌ తథా//***
***గణేశే వా తు దుర్గాయాం ఏవం సర్వత్ర సున్దరి/***
***యః కరోతి భేద బుద్ధిం బ్రహ్మహత్యాం లభేత్తు సః//***

"ఓసతీ! శ్రీకృష్ణునియందును, ఆతని విగ్రహము నందును, ఇతర విగ్రహము నందును, శివుని యందును, శివలింగము నందును, సూర్యుని యందును, సూర్యకాంతమణి యందును, గణేశుని యందును, దుర్గ యందును భేద భావమును పాటించు వారు బ్రహ్మ హత్యా పాతకమును పొందెదరు."

వేరువేరు దేవతలను పూజించుటచే రాగ ద్వేషములు కలుగునను తలంపుతో శాస్త్రములయందు పంచాయతన పూజను

ప్రతిపాదించిరి. అందు ఒకరు ముఖ్యులు, మిగిలిన నలుగురును గౌణులు. 1. విష్ణు పంచాయతనము 2. శివ పంచాయతనము 3. దేవీ పంచాయతనము 4. సూర్య పంచాయతనము 5. గణేశ పంచాయతనము అను ఈ 5 పంచాయతనములును ముఖ్యమైనవిగా గ్రహించబడినవి. రాగ ద్వేషములు కలుగకుండుటకు ఈఏర్పాటుకు శ్రీ శంకర భగవత్పాదులుకూడ స్వీకరించిరి. ఇది స్మార్త ఉపాసన అని చెప్పబడును. అయినను తెలివితక్కువతనముచే అజ్ఞానులు దేవతలయందు భేద భావమును కలిగియుందురు.

## అర్థము లేని మత భేదములు

శైవ, వైష్ణవాది మత మతాంతరములు అన్నియు గ్రుడ్డివాళ్ళ దృష్టాంతమును పోలినవి.

ఒకప్పుడు 5 గురు గ్రుడ్డివారు కలసి ఏనుగును చూచుటకు వెళ్ళిరి. ఒకడు ఏనుగును తీసికొనివచ్చి వారి ఎదుట నిలబెట్టెను. ఒక

గ్రుడ్డివాడు తన చేతితో ఏనుగు చెవిని ముట్టుకొనెను. రెండవ వాడు కాలు ముట్టుకొనెను. మూడవవాడు తొండమును స్పృశించెను. నాలుగవవాడు తోకను పట్టు కొనెను. 5 వ వాడి చేతికి ఏనుగు కడుపు తగిలెను.

అంతట చెవి చేతికి తగిలిన మొదటి గ్రుడ్డివాడు ఇట్లనెను:- చాల రోజుల నుండి ఏనుగును చూడవలెనను కోరిక యుండెను. అది నేడు సఫలమయ్యెను. ఏనుగు సరిగా చేటవలె నున్నది. కాలు పట్టు కొన్న రెండవ వాడు పలికెను. లేదు సోదరా, లేదు. ఏనుగు సరిగ స్తంభము వలె నున్నది. తొండము అందిన మూడవవాడు చెప్పెను. మీరు ఇరువురును మూర్ఖులు. ఏనుగు కొండచిలువ వలె నున్నది. తర్వాత తోకను ముట్టు కొనిన నాలుగో వాడు ఇట్లనెను:- మీరు చెప్పిన మాటలన్నియను తప్పులే. ఏనుగ త్రాడు వలెనున్నది. ఇక 5 వ వాడు వారిని మందలించుచు ఇట్లు పలికెను:-

"అరే, మీ అందరికీ నేడు మతి స్తిమితము

పోయినదా ఏమి? ఎందుకు అట్లు ప్రేలుచున్నారు? ఏనుగు సరిగా పీపావలె నున్నది.

ఈ విధముగా వారు తమ చేతికి అందిన అవయవమును ఆధారముగా చేసికొని ఏనుగ రూపమును మనస్సు నందు ఊహించుకొని తమ అభిప్రాయమే నిజమను కొని జగడము ప్రారంభించిరి. ఆ జగడము అంతకంతకు పెరిగి తిట్లు తిట్టుకొనుట నుండి కొట్టుకొనుటవరకు పెరిగెను. ఇది చూసి ఇరుగు పొరుగున ఉన్న వారు ఆశ్చర్యముతో వారి మూర్ఖత్వమునకు నవ్వుకొనిరి.

యథార్థమునకు వారిలో ఎవ్వరును ఏనుగు యొక్క నిజస్వరూపమును తెలిసికొన లేకపోయిరి. ఇటులనే శైవ, వైష్ణవాది వివిధ మతస్థులు కూడ అంధహస్తి న్యాయమున కొట్లాడుచున్నారు.

నేడు వైష్ణవులకును, శైవులకును ఒకరనిన మరియొకరికి కిట్టదు.

**హస్తినా తాడ్యమానోఽపిన గచ్ఛేత్ శైవమన్దిరమ్/**

మతి చెడిన ఏనుగు వచ్చి త్రొక్కివేయుటకు సిద్ధముగానున్నను "పక్కన ఉన్న శివాలయములోనికి వెళ్ళరాదు. ఏనుగు కాలి క్రింద పడిపోయి చచ్చిపోవుట మంచిది అని వైష్ణవులు చెప్పెదరు."

అటులనే ఈ శ్లోకము నందలి శబ్దములను కొంచెము మార్చి శైవులు కూడ ఇట్లు అనెదరు.

**హస్తి నా తాడ్యమానోఽపి న గచ్ఛేత్ విష్ణుమన్దిరమ్ /**

"ఏనుగు నిన్ను చంపుటకు వచ్చుచున్నను విష్ణ్వాలయమునకు వెళ్ళరాదు."

ఇట్లు శైవమతస్థులు విష్ణువును నిందించెదరు. అటులనే ఆమతమువారిని ఎంతయో అవమానించెదరు.

ఈ మతానుయాయువులు, కర్ణాటకమునందును, త్రిలింగదేశము నందును

లింగాయతులు, జంగములు అను వారలయందు ఉన్నారు. అచ్చటి కొందరు బ్రాహ్మణులు తాము శైవులమందురు. కాని వారు శంకరాచార్యులవారి అద్వైత మతావలంబులును, పంచాయతనోపాసకులును కూడను. శివుని, విష్ణువుని ఆధారముగ తీసుకొని మత భేదములు ఉంటే ఉండుగాక, కాని ఒకే విష్ణువు యొక్క అవతారములు రామ, కృష్ణాదులు పది ఉన్నవి కదా! వారియందు కూడ తెలివితక్కువచే ద్వేష భావము కానవచ్చుచున్నది.

నాకు ఇద్దరు మిత్రులు ఉండిరి. వారిలో ఒకడు అనన్య రామ భక్తుడు. రోజును రామాయణము చదివి శ్రీరామచంద్రుని విగ్రహమును పూజించెడివాడు. రెండవ వాడు కృష్ణోపాసకుడు. ఆతడు గీతాధ్యయనముచేసి కృష్ణ విగ్రహమును పూజించెడివాడు. ఒకనాటి ప్రసంగమున కృష్ణ భక్తుడు పలికెను- శ్రీకృష్ణుడు విష్ణుభగవానుని పదహారుకళలతోను నిండిన

అవతారము. ఆయన పూర్ణ పురుషోత్తముడు. శ్రీరామచంద్రుడు విష్ణుభగవానుని 12 కళలను మాత్రమే కలిగియున్నాడు. కావున ఆయన పూర్ణ పురుషోత్తముడు కాడు.

అంతట రామభక్తుడు చెప్పెను:- శ్రీకృష్ణుడు పూర్ణపురుషోత్తముడు అయి ఉండవచ్చును. అయినను ఆయన చరిత్రహీనుడు. శ్రీరామచందుడు ఏకపత్నీ వ్రతస్థుడు. ఒకటే మాట. ఒకటే బాణము మొదలగు నియమములను పాటించేవాడు. ఆయన ఉత్తముడు. ఈ విధముగా వారిలో పరస్పరము ద్వేషము పెరిగెను. ఒకరి ముఖము మరియొకరు చూచుటకూడ మానివేసిరి. ఈ విషయముననే ఒక దృష్టాంతమును గమనించుడు.

ఒక గ్రామము నందు ఒక స్వామివారి మఠము ఉండెను. వారికి ఇద్దరు శిష్యులు ఉండిరి. ఒకసారి వైశాఖమాసమున మిక్కుటమగు ఎండలు కాయుచుండెను. ఆరోజులలో ఒకనాటి రాత్రి గురువుగారు డాబాపై పరుండియుండిరి.

శిష్యులు. ఇరువురును ఆయన పాదములు పట్టుచుండిరి. ఇరువురు శిష్యులును వారి సేవలను పంచుకొని యుండిరి. పెద్దశిష్యుడు ఎడమకాలు పట్టుచుండెను. చిన్న శిష్యుడు. కుడి కాలు పట్టుచుండెను. ఇరువురు శిష్యులు పరస్పరము ద్వేషముతో జ్వలించుచుండిరి.

ఆసమయమున గురువుగారికి దాహము వేసి చిన్న శిష్యుని దాహము ఇయ్యమని అడిగెను. ఆతడు కాలుపట్టుట మానివేసి నీరు తీసికొని వచ్చుటకు క్రిందకు వెళ్ళెను. అంతట పెద్ద శిష్యుడు ఇట్లు ఆలోచించెను. “చిన్న శిష్యుడు లేనిసమయమున ఆతని కాలును రెండు మూడుసార్లు గట్టిగా గిల్లి వేయుట మంచిది.” ఇట్లు తలచి గురువు గారి కుడి కాలు పై గట్టిగా రెండు మూడు గిల్లులు గిల్లెను. గురువు గారు ఓరీ; మూర్ఖుడా! ఇదేమి? ఇట్టిపని చేయుచున్నావు? అని బాధతో పలికిరి. ఇంతలో గురువుగారికి నీళ్ళు తీసికొనివచ్చిన చిన్న శిష్యుడు ఆయన

బాధపడుచుండుట చూచి ఇది ఏమి? అని అడిగెను. ఈమూర్ఖుడు గట్టిగా గిల్లెనని గురువుగారు చెప్పిరి.

ఈమాటలు విని చిన్న శిష్యుడు పలికెను:- "ఇతడు నాకాలుపై గిల్లెను. నేను ఇతని కాలును విరుగకొట్టి కుంటిదానిని చేసి వేయుదును." ఇట్లని దుడ్డుకర్ర తీసికొనివచ్చి గురువుగారి ఎడమకాలి పై గట్టిగా రెండు మూడు దెబ్బలు వేసెను. దానితో గురువు గారి కాలు విరిగి పోయెను. ఉదయము సేవకులు వచ్చి గురువు గారిని ప్రశ్నించిరి. స్వామీ! ఇదేమి కర్మము?

గురువుగారు ఇట్లు సమాధానము చెప్పిరి:- ఈ మూర్ఖులు ఇరువురును పోట్లాడుకొని నాకాలు విరుగకొట్టిరి. వీరిరువురను వెళ్ళకొట్టుడు. (ఇది విని అందరును నవ్విరి.)

అజ్ఞానవశమున ఇట్టి విపరీతములు జరుగును.

ఈవిధముగా తమోగుణ, రజోగుణ

యుక్తమగు బుద్ధికలవారల యందు జడత్వము కాననగును. కావున బుద్ధిని ఉపయోగించి సత్త్వ ప్రధానమగు బుద్ధితో వస్తువును వస్తురూపమున గ్రహించి ఉపాసించవలెను. మీరు మొదట పంచాయతనమును పూజించుడు. అనంతరము మాయా విశిష్టుడు ఈశ్వరుని- అనగా సగుణ బ్రహ్మమును ఉపాసించుడు. తరువాత నిర్గుణబ్రహ్మమును ఉపాసించుడు.

వేదమునందు ఉపాసనాశబ్దమును, పురాణములయందు భక్తి శబ్దమును ఉపయోగించబడినవి. ఈ రెంటికిని ఎక్కువ భేదము లేదు. భక్తి అనగా ప్రేమ. ఉపాసన అనగా సమీపమున కూర్చుండుట. ప్రభుని సాన్నిధ్యమును పొందుట.

ఈవిధముగా వేద శాస్త్రముల యందును, ఆచార్యోపదేశముల యందును మలదోషనివృత్తి కొరకు నిష్కామకర్మమును, విక్షేపదోష నివృత్తి కొరకు ఉపాసన లేక భక్తియును ముముక్షువులకు

నిర్దేశించబడినవి.

అంతట దామజీ భాయి ప్రశ్నించెను:-

"ఇంకను నా మనస్సు భక్తి మార్గమున దృఢముగా సంచరించుట లేదు. క్షణములో మాయా విషయముల యందు మనస్సు ప్రవర్తించును. ఇక భక్తి ఎట్లు వృద్ధిని పొందును?"

స్వా. ప్ర. : భాగవతమున చెప్పబడినది:-

***భక్తిః పరేశానుభవో విరక్తిర న్యత్ర చైవ త్రిక ఏకకాలః|***
***ప్రపద్యమానస్య యథాశ్నతః స్యుః తుష్టిః పుష్టిః క్షుదయోపాఽను గ్రాసమ్||***

"భోజనము చేయు మానవునకు ప్రతి ముద్దకును సంతోషమును పుష్టియును కలిగి ఆకలి తీరును. అటులనే ప్రభువును శరణుజొచ్చిన వానికి భక్తి ప్రభువుయొక్క అనుభవము, విరక్తి మూడును ఒకే సమయమున కలుగును."

ఈ శ్లోకము ఒక మామూలు దృష్టాంతముచే తెలియనగును.

ఒకకానొక దరిద్రుడు ఉన్నాడనుకొనుడు. ఆతనికి ఉండుటకు ఒక చిన్న కుటీరము ఉన్నది. ధరించుటకు చినిగిన బట్టలు, తినుటకు ఎండిన రొట్టెలు దొరకు చున్నవి. ఇట్టి వానికి ఏవ్యాపారమునందో నెమ్మదిగా రెండుమూడు వేలరూపాయలు దొరకిన తన కుటీరమును విడచి మంచి ఇంట్లో నివసించుట మొదలు పెట్టును. మంచి భోజనము భుజించును. తనకు లభించిన ద్రవ్యముతో కొంచెము కొంచెముగా వ్యాపారము మొదలు పెట్టి అంతకంతకు వృద్ధి చేసికొనుచు లక్షాధికారియు, కోటీశ్వరుడును అయిపోవును. డబ్బు పెరిగినకొలదియు బండ్లు, వాహనములు, నౌకరులు, చాకరులు మొదలగునవి అన్నియును వరుసగా వృద్ధిపొందిపోవును. ఈవిధముగా ఆతడు ఐశ్వర్యమును పొందినకొలదియు ఆతని పురాతనకుటీరము, చినిగిన వస్త్రములు, ఎండిన

రొట్టెలు మొదలగునవి పూర్తిగా పోవును. అటులనే ప్రభువును శరణుజొచ్చిన వానికి మొదట భక్తియు, తరువాత అతని శరీరమునందు భగవదనుభవములును వృద్ధి పొందుచుండును. ప్రభువుయొక్క ఆనంద స్వరూపమును ఎక్కువగా అనుభవించిన కొలదియు ఆతనికి జగమునందలి మోహ పదార్థములపట్ల విరక్తి కలుగును. ఈవిషయమున భాగవతమున చెప్ప బడినది:-

***న పారమేష్ఠ్యం న మహేన్ద్రధిష్ణ్యం నసార్వభౌమం న రసాధిపత్యమ్ / న యోగసిద్ధీర పునర్భవం వా మయ్యర్పితాత్మేచ్ఛతి మద్వినాన్యత్//***

"భగవద్భక్తితో భగవదనుభవములను పొందుసత్పురుషులు నిరంతరము విరక్తులుగనేయుందురు, వారికి బ్రహ్మసుఖము నందు కూడ కోరిక యుండదు. ఇంద్ర వైభవమునందు కూడ ప్రేమ కలుగదు. అటులనే సార్వభౌమత్వము, సర్వరసాధిపత్యము, యోగసిద్ధి, మోక్షము- వీనిలో దేనినికూడ కోరరు.

నాయందు తన మనస్సును అర్పించినవాడు ఆ మనస్సుతో నేను తప్ప (భగవానుడు తప్ప) మరియొక పదార్థమును దేనినికూడ కోరడు.”

ఈవిషయమున భక్త వరుడగు తుకారాముని దృష్టాంతము కలదు.

తుకారాము మొదట మంచి స్థితిగతులుకలవాడే కాని భక్తహృదయమును పొందుటచే దుఃఖతుని ఎవనినైన చూచిన దయతో ఆతనికి ధనాదిపదార్థములను ఇచ్చెడివాడు. ఇట్లు ధనాదులను వ్యయము చేయుచు తుకారము తన జీవితమును సామాన్య వ్యక్తి జీవితమువలె గడపెడివాడు. ఈ విషయము శివాజీ మహారాజుకు తెలిసెను. ఆయన తన మంత్రిని పిలిచి తుకారాముకు ధనము, వస్త్రాలంకారములు మొదలగునవి పంపమని చెప్పెను. మహారాజు నాజ్ఞను అనుసరించి మంత్రి నౌకరులచే అన్ని వస్తువులను తుకారాము ఇంటికి తీసికొని వెళ్ళిరి. ఆసమయమున తుకారాము తన ఇంట

లేకుండెను. అందుచే ఆయన భార్య “కొంచెము సేపు కూర్చొనుడు. వారు బైటికి వెళ్ళిరి. ఇప్పుడే వచ్చెదరు” అని చెప్పెను.

మంత్రి చెప్పెను:- ఈ వస్తువులను అన్నిటిని శివాజీ మహారాజు కాన్కగా పంపెను. తమరు తీసికొనుడు. తుకారాము భార్య పట్టరాని సంతోషముతో ఆ వస్తువులను అన్నిటిని ఇంటిలో నుంచుకొనెను. ఇంతలో తుకారాము వచ్చి మంత్రికి నమస్కరించి ఇట్లనెను:-

“తమరు గొప్పవారు. మాయింటికి వచ్చుటకు కారణము ఏమి?”

మంత్రి సమాధానం చెప్పెను:-“శివాజీ మహారాజు కాన్కగా పంపిన వస్తువులను ఇచ్చుటకు వచ్చితిని.”

ఇది విని తుకారాము వ్యాకుల హృదయముతో పలికెను:-

“దయయుంచి తమరు తీసికొనివచ్చిన వస్తువులు వెనుకకు తీసికొని పొండు. వీనిని

తీసికొనుట మా ధర్మము కాదు.”

మంత్రి వారికి ఎంత తెలియజెప్పిన ఆయన ఏమియు ఉంచుకొన లేదు. నిరుపాయుడై మంత్రి ఆ వస్తువులను అన్నిటిని వెనుకకు తీసికొనిపోయెను. శివాజీ మహారాజుకు ఈ సంగతి తెలిపెను.

తరువాతి రోజు శివాజీ మంత్రిని పిలచి చెప్పెను:-

“తుకారాముగారిని తీసికొని వచ్చుటకు నేను నీకు ఒక ఆహ్వాన పత్రమును ఇచ్చుచున్నాను. దీనిని తీసుకొని వెళ్ళుము. ఈ పాలకీని, గుర్రపు రౌతులను వెంట బెట్టుకొని వెళ్ళి వారిని తీసికొనిరమ్ము.”

ఆ విధముగా మంత్రి తుకారామును తీసికొనివచ్చుటకు వెళ్లెను. ఆయన తుకారాముని మహారాజు వద్దకు దయ చేయమని ప్రార్థించెను. తుకారాము ఇట్లు సమాధానము చెప్పెను:- ఈవిధమగు అధికారాడంబరములచే నాకు

సంతోషమునకు బదులుగా కష్టము కలుగును."

ఆయన వ్యాకులత్వముతో విఠలనాథుని సంబోధించుచుపలికెను.

***దివట్యా ఛత్రీ ఘోడే హేతో బర్యాత నా పడే***
***ఆతాం యే యే పండరీరాయా మన గోవసీ కాసయా॥***
***మాన దమ్భ, చేష్టా హేతో నుకరాచీ విష్టా***
***తుకా హ్మణే దేవా మాంఝే సోడవణే ధావా॥***

"కాగడా, ఛత్రము, గుఱ్ఱములు - మొదలగు వానిని, ధనవంతుడు గానున్న రోజులలో కూడ నేను ఉపయోగించ లేదు. ఓవిఠలనాథుడా! ఇప్పుడు ఏల నన్ను వైభవమున చిక్కు పరచుచున్నావు? గౌరవము, దంభము, చేష్టలు- ఇవి పందిమలము వంటివి. (తుకారాము చెప్పుచున్నాడు) పరుగెత్తుకొని రమ్ము. నన్ను వీనినుండి విడిపింపుము" అని పలికి వచ్చిన వారికి నచ్చచెప్పెను. శివాజీకి చిత్రము ద్వారా ఇట్లు తెలియపరచెను:-

"నేను ఉదాసీనావస్థలోనున్న అరణ్య వాసిని. దుమ్ముతో నిండిన శరీరము, అమంగళమగు వేషము. ఏది దొరకిన అది తినువాడను, రూపవిహీనుడను. ఇట్టివానిని దర్శించుటచే ఏమిలాభము కలుగును? నావంటివాడు సదా పాండురంగని శరణునందు వాంఛారహితుడయి ఆనందమున సంచరించు చుండవలెను."

తర్వాత రోజున శివాజీ స్వయముగా కానుకలు అన్నిటిని తీసికొని వచ్చెను. తుకారాము నవ్వి ఇట్లు పలికెను:- తండ్రియగు విఠ్ఠలనాథునకు ఉన్నది అంతయును నాదియే. అందు చేతనే నా మనస్సు సంతోషించుచున్నది. మీరు తెచ్చిన మృద్రూపములగు కాంచన మౌక్తి కాదులు మాయ. వానిని నేను ఏమి చేయుదును? నా ధనము త్రిభువన వైభవము. మీకు కూడ అట్టి సుఖము కావలెనను కోరిక యున్నచో విఠ్ఠలుని శరణు అత్యంత సులభ సాధనము. పురుగు,

రాజు రెండును నా దృష్టిలో సమానమగు ప్రాణులే. మోహము, ఆశ - ఈ రెండును కలికాలపు ఉరిత్రాళ్ళు. వాటికి ఇచ్చుట తావు లేదు. స్వర్ణము, మట్టి- రెండును సమానమే. (తుకారాము చెప్పెను.) “వైకుంఠము అంతయును ఇంటియందు కూర్చొని యుండగనే వచ్చినది. ఇక నాకు ఏవిషయమున లోటు కలదు?”

అనంతరము శివాజీ తరచు తుకారాము యొక్క సత్సంగ లాభమును పొందెను. ఇట్లు చాలా కాలమైన పిమ్మట ఒకమారు శివాజీ ఒక లక్ష ఇరువది అయిదు వేలమంది బ్రాహ్మణులను సమావేశపరచెను. ఆ సమయముననే సంతుల సమావేశమును కూడ ఏర్పాటు చేసెను. ఆ సమావేశమున తుకారాము భజనలో జన సమూహము అంతయు లీనమై పోయెను. తుకారాముయొక్క ఈ మహిమను గాంచి శివాజీ విస్మితుడయి ఆయనకు నాలుగు గ్రామములు అర్పించవలెనని సనదును తయారు చేయించెను.

బ్రాహ్మణులందరకును తగిన దక్షిణలు ఇచ్చి సాగనంపు సమయమున తనకు కూడ ఏదియో ఇచ్చునని తుకారాముకు తోచెను. ఆయన చల్లగా వెళ్ళిపోయెను. శివాజీ రామదాసు స్వామి గారి వద్దకు వెళ్ళి ఎంతయో విచారముతో ఈవిషయమును వెల్లడించెను. ఆయన శివాజీకి ఇట్లు సమాధానము చెప్పెను:- "సంతులు మూడు లోకముల సామ్రాజ్యమును కూడ తుచ్ఛముగా తలచెదరు. వారికి నీ నాలుగు గ్రామములనిన లెక్క ఏమి?"

హిరణ్యకశిపుని వధించిన పిదప భగవానుడు ప్రహ్లాదుని వరమును కోరుకొనమని చెప్పగా ప్రహ్లాదుడు ఇట్లన్నట్లు భాగవతమున 7వ స్కంధమున చెప్ప బడినది:-

***మా మాం ప్రలో భయోత్పత్త్యాసక్తం కామేషు తైర్వరైః|***
***తత్సఙ్గభీతో నిర్విణ్ణో ముముక్షుస్త్వాము పాశ్రితః||***

"ఓ ప్రభూ, నేను పుట్టుక చేతనే విషయాసక్తుడను. ఇప్పుడు వరమిచ్చెదను అను లోభమును చూపించి నాకు ఇంకా దురాశ కలిగించకుడు. విషయాసక్తి యందలి భీతిచే నేను వానిని త్యజించి ముముక్షువునయి తమ శరణుకు వచ్చితిని."

ఇదేవిధముగ భగవానుడు సాక్షాత్కరించి, వరములను కోరమని చెప్పినపుడు ధ్రువుడు కూడ చెప్పెను:-

***స్థానాభిలాషీ తపసి స్థితోఽహం త్వాం ప్రాప్తవాన్దేవ మునీన్ద్ర గుహ్యామ్ /***
***కాచం విచిన్వన్నపి దివ్యరత్నం స్వామిన్ కృతార్థోఽస్మి వరంన యాచే //***

"ఓ భగవానుడా! నేను రాజ్యమును పొందుటకే ఇంతవరకు తమకొరకు తపము చేసితిని. కాని ఇప్పుడు నాకు యోగులకును, మునులకును దుర్లభమగు సచ్చిదానంద

స్వరూపము లభించినది. గాజు ముక్కను వెతుకువానికి దివ్యమణి లభ్యమైనచో నాతడు ఇంకను గాజుముక్కను వెతుకునా? ఓ నాథా! ఇప్పుడు నాకు ఏ వరమును అక్కర లేదు. నేను తమ దర్శనము చేతనే కృతార్థుడను అయితిని."

ఈవిషయమున భాగవతమున భగవానుడు కూడ చెప్పెను:-

**మత్సేవయా ప్రతీతం చ సాలోక్యాది చతుష్టయమ్ /**
**నేచ్ఛన్తి సేవయా పూర్ణాః కతోఽన్యత్కాలవిద్రుతమ్//**

"నా సేవచే నా భక్తులకు సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యములనబడు నాలుగురకములగు ముక్తులను పొందవలెనని కూడ కోరిక యుండదు. సేవచే పూర్ణత్వమును పొందవలెనను కోరిక కూడ ఉండదు. ఇక వారు కాల, దిశా పరిచ్ఛిన్నములగు భోగ విలాసములను కోరునా! అనగా కోరనే కోరరు."

# బుద్ధిమంతుడగు ధర్మాత్మునికి ధనము ఉన్నచో శుభగుణములు వికసించును

దామజీ భాయి:- నవవిధ భక్తులలోను ఒకటియగు ఆత్మనివేదనమునందు ప్రభువునకు శరీరము, మనస్సు, ధనము- వీనిని అర్పించ వలెనని తెలుపబడినది. తనకొరకు ఏమియును నిలువ చేయరాదు అని ఆదేశించబడినది. కాని నీతితో ధనమును సంపాదించి ఆ సంపాదనతో రోజు గడుపుకొనుచు, కొద్దియో, గొప్పయో మిగిలినచో దానిని బీదలకు ఇచ్చినచో తప్పు ఏమి?

స్వా.ప్ర.:- ఆత్మనివేదనమును గురించి చెప్పబడిన "**నిర్వాహాయ చ శూన్యత్వమ్**" అనునది పూర్ణ వైరాగ్య వంతుని గురించి మాత్రమే. మంద వైరాగ్యవంతుడు నీతిగా ధనమును సంపాదించుకొని, దానిని సన్మార్గమున

ఉపయోగించుకొనినచో అందు తప్పు ఏమియును లేదు. ఈవిషయమున పారస భాగమున వ్రాయబడినది:--

ధనము నింద్యము అయినను దానియందు శుభ గుణములు కలవు. బుద్ధిమంతునియొద్ద కాని, ధర్మాత్ముని యొద్ద కాని ధనము ఉన్నచో ఆ సద్గుణములు వికసించును. గర్భ దరిద్రుడు దైవ విముఖుడగును. అందు సందేహము లేదు. ఏలనన తన కుటుంబీకుల ఆకలిచే ఆతని చిత్తము వికలమగును. భగవానుడు ఆతనికి అన్యాయము చేయునట్లు తోచును.

సర్పము వద్ద విషమును, మణియును రెండు ఉండును. అటులనే ధనమునందు గుణమును దోషమును రెండును ఉండును.

ధర్మమార్గమున ఉండువానికి ధనముచే మూడు రకములగు లాభములు కలుగును :- 1. నీతిగా సంపాదించబడిన ధనము పరిశుద్ధమగు వృత్తిచే సంపాదించబడినదగుటచే మానవుని

నిశ్చింతుని చేయును. 2. సాత్త్విక పురుషులకును, కుటుంబీకులకును, యాచకులకును, సేవకులకును ధనముచే సంతోషము కలిగించి పుణ్యమును సంపాదించ వచ్చును 3. ధనముచే నూతులు, బావులు, చెరువులు, మార్గములు, వంతెనలు, ధర్మ సత్రములు, దేవాలయములు నిర్మించుట మొదలగు పరోపకార కార్యములు చేయ వీలు పడును.

## ఔదార్యముచే కలుగు లాభములు

పారస భాగమునందు ఇంకను ఇట్లున్నది:-

పరమపదము జపము చేతను, తపము చేతను, మతము చేతను లభించదు. అది పరిశుద్ధమగు హృదయము చేతను, దయ, ఔదార్యము-వీనిచేతను పొందనగును.

అలీ అను సంతు చెప్పెను:- నీకు సంపద కలిగిన దానిని ఔదార్యముగా ఖర్చు చేయుము. దానముచే సంపద తగ్గదు, పెరిగిపోవును. ఎట్లనిన :-

ఒక వ్యక్తి తన మనోరథమును కాగితముపై

వ్రాసి హసను అను సంతుని వద్దకు వచ్చెను. హసను ఆ కాగితమును చదువకుండ నిట్లనెను. "నీకు కావలిసినది అడిగి తీసికొనుము. అంతట ఒకడు ఆయనను ప్రశ్నించెను:- "మీరు కాగితము ఏల చదువ లేదు?"

ఆయన జవాబు చెప్పెను: – " నేను ఆలస్యము చేసినచో ఆ యాచకుని కోరికలను తీర్చుటలో విలంబము ఎందుకు చేసితివి?" అని భగవానుడు అడుగును. అప్పుడు నేను ఏమి సమాధానము చెప్పగలను?

ధనముచే అతిథి, అభ్యాగతులను సేవించు భాగ్యము లభించును. అది ఏమియు తక్కువ లాభము కాదు. ఒకప్పుడు అలీ సంతు ఏడ్చుచుండెను, "మీరు ఎందుకు ఏడ్చుచున్నారని" ఒకడు అతనిని అడిగెను. అలీ జవాబు చెప్పెను:- నేను ఎంతో దురదృష్టవంతుడను. ఏడు రోజులనుండి నా ఇంటికి అభ్యాగతుడు ఎవడును రాలేదు. అందుకే

నేను ఏడ్చుచున్నాను.”

తన కోర్కెలు ఈడేరుటకు అవసరమగు ధనమును కూడ ఖర్చు చేయకుండ తన కోరికలను తీర్చు భారము ఇతరులపై నుంచి, ధనమును దాచుకొనువాడు పిసినిగొట్టువాడు. తాను కోరు దానిని ఒక యాచకునకు భగవదర్పితముగా సమర్పించినచో యథార్థమగు ఔదార్యముగా పరిగణించబడును.

ఒక భక్తుడు మాయను (సైతానును) ప్రశ్నించెను:-

“నీకు ప్రియమైన వాడు ఎవడు?”

సైతాను సమాధానము చెప్పెను:— “పిసినిగొట్టువాడు నాకు ఎంతయో ఇష్టుడు. అతడు తపస్సు, పరిశ్రమ చేసి ఎంతయో కష్టించును. అయినను లుబ్దత్వముచే నాతని ఫలము నశించును. రజోగుణము కలవాడైనను ఉదారుడైన ఆతడు నా శత్రువు. ఆతడు ఐహిక సుఖములను అనుభవించును. అయినను ఆతని

ఔదార్యముచే భగవానుడు ఆతని అపరాధములను క్షమించును. ప్రభువు యొక్క దయచే నాతనికి వైరాగ్యము కలుగును అని నాకు భయము.” కావున ఎల్లప్పుడు ఔదార్యమును కలిగియుండుట యుక్తము.

మహాత్ముడగు మూసాకు ఆకాశవాణి విన వచ్చెను:- “ఎవడైనను తన జీవితమంతటి యందును ఒకమారైనను స్వార్థమును విడనాడి పరునికొరకు పాటుపడినచో అతడు నాకు అత్యంత సంతోషమును కలుగజేయును.”

బశరుహాఫీ అను సంతు మహోదారుడు. ఆతడు కాలము చేయు సమయము సమీపించెను. ఆ సమయమున ఒక యాచకుడు సమీపించి ప్రార్థించెను. అప్పుడు ఆతనివద్ద ఏమియును లేదు. ఆ కారణముచే తాను కట్టుకొనిన బట్టలిప్పి అతనికి ఇచ్చెను. తరువాత నొక ముహూర్తములో నాతని ప్రాణము పోయెను. ఆ సమయమున ఒక బుద్ధిమంతుడు పలికెను:- “బశరుహాఫీ నగ్నముగానే ఇచ్చటకువచ్చి నగ్నముగానే

పరలోకమునకు వెళ్లెను.

## కృపణత్వమునకు కారణములు, వానిని పోగొట్టు నుపాయములు

భోగాసక్తి, చాల కాలము జీవించాలని కోరిక, పుత్రులపై మోహము- కృపణత్వమునకు కారణములు. అవి పోగొట్టుటకు పురుషుడు సంతోషముగా జీవితమును గడపవలెను. ఎట్టి కష్టములనైనను సహించుటకు అభ్యసించవలెను.

"మానవ జీవితమును నమ్మవలసిన పని ఏమి? బలిష్ఠమగు శరీరము కలవాడుకూడ ఒక నిముషములో శరీరమును విడచి వెళ్ళిపోవును. ఒక నావంటి దుర్బలుని సంగతి ఏమి చెప్పవలెను? కుమారులు తమ ప్రారబ్ధమునుకూడ తీసికొనియే వచ్చిరి. తండ్రి అమితమగు సంపదను ఇచ్చినను కుమారులు దానిని వ్యయము చేసిన ఉదాహరణలను, తండ్రి నిర్ధనుడైనను కుమారులు ధనవంతులైన

దృష్టాంతములును లేక పోలేదు.” అని తలచి పిసినిగొట్టుతనమును విడనాడి తన ధనమును పరోపకారము కొరకు ఉపయోగించి, ధర్మమును ఆచరించవలెను. ధనము దానము చేయనిదే పిసినిగొట్టుతనము పోదు. ప్రియునకు దూరము కానిదే ఆతని యందలి మోహము పోదుకదా! అటులనే ఇది కూడ.

## ధనము అను సర్పమును ఆడించుటకు5 మంత్రములు

ధర్మ కార్యములు చేయుటకు కూడ ధనము సంపాదించవలె ననునది మరువరాదు. దానిచే మదము, మోహము అను విషము ఎక్కదు. పాముల వానికి సర్ప విద్య తెలియును. కావున ఆతనికి సర్పము ఏ మాత్రమును హాని కలిగించ లేదు. ఇతరుడెవడైన పాముతో ఆడుకొనుట తన మృత్యువుతో ఆడుకొనుటయే. అటులనే ధనము సంగతి కూడ. ధనము అను సర్పమును

పెంచుటకు ఈ 5 మంత్రములను నేర్చు కొనవలెను:-

1. శరీర నిర్వహణార్థమే ధనమును సంపాదించవలెనను. శరీరము ఇంద్రియములకు నివాస స్థానము, బుద్ధి యొక్క నౌకరులు. బుద్ధి యొక్క పని భగవానుని పరిచయము చేయుట. ఇది సరిగా తెలిసికొని అందుకు తగు ధనమును దగ్గరనుంచుకొనుము.

2. పాపము చేయకుండా నిష్కపటముగా ధనమును సంపాదించవలెను.

3. శరీర కార్యమునకు మించిన ధనమును సంపాదించ రాదు. అందు కూడ ఔదార్యముగా తగినంత దానము చేయబడునట్లు చూడుము.

4. జీవితము సంయమముతో గడపుము. ధనమును భోగములలో ఖర్చు పెట్టకుము.

5. చిత్త వృత్తులను ఎల్లప్పుడును ధర్మమార్గమున జాగ్రత్తగ నుంచుము.

ఈ 5 మంత్రములను సరిగ నేర్చుకొనినచో

భూమండలమందలి ధవమునంతను సంపాదించినను ఆతనికి హాని కలుగదు అని అలీసంతు చెప్పెను.

ఈ విధముగా ధనమును సంపాదించుటచే లాభములు కలుగును. కాని అధికమగు వైరాగ్యముకలవాడు ధనమును సంపాదింపరాదు. అది ఆతని చిత్త విక్షేపమునకు కారణమగును. ఆతడు ధనమును పూర్తిగా త్యజించవలెను. ధనము, దైవభక్తి రెండును ఒకచోట నుండవు.

అటు తరువాత స్వామి శ్రీ ప్రకాశానందులవారు మొదలగు వారు అందరును రాజకోట వెళ్ళిరి.

ఓం

# ముప్పది మూడవ ప్రసంగము

శ్రీ ప్రకాశానంద స్వామి వారు ఒకప్పుడు జేతపురము వెళ్ళిరి. అచ్చటినుండి వారిని వీరపురము తీసికొని వెళ్ళుటకు జగ్ జీవన భాయి వచ్చియుండెను. స్వామివారు చెప్పిరి:- పీఠడియా గుండా వెళ్ళెదము. అచ్చట శ్రీ నిత్యానంద స్వామి వారితో కలసి వీరపురము వచ్చెదము. తరువాత అక్కడినుండి డా. లల్లుభాయి, మాష్టరు ప్రభాశంకర భాయి, కాళాభాయి మొదలగువారు నాలుగు గంటలకు పీఠడియా వచ్చి కలసికొనిరి. శ్రీ నిత్యానంద స్వామి వారు శ్రీ ప్రకాశానంద స్వామివారిని ప్రశ్నించిరి:—

"తమ శరీరము ఆరోగ్యవంతముగా నున్నదా?"

స్వా. ప్ర.:-

**సుజ్ఞః పృచ్ఛతి సద్వార్తాం శరీరే కుశలం తవ /**

**కుతః కుశలమస్మాకం ఆయుర్యాతి దినే దినే //**

"విజ్ఞుడు కుశలమా అని అడుగును. కాని రోజురోజుకు ఆయుర్దాయము తగ్గిపోవువానికి కుశలము ఎక్కడ?"

తరువాత శ్రీ నిత్యానంద స్వామి వారు ఎల్లరికుశలమును అడిగి కాళాభాయితో నిట్లనిరి:- ఇంత వార్ధక్యమున కూడ దుకాణముపై కూర్చొనెదరని నేను వింటిని అది నిజమా?

కాళా:- ఏమి చేయుదును? పిల్లలు నన్ను వదలలేదు. అందుచే కూర్చొనవలసివచ్చును.

స్వా. ప్ర. :- ఈయన మనుమనికి నౌకరీ చేయుచున్నాడు. కాళాభాయి! అతడు మీకు ఎంత జీతము ఇచ్చును?

కాళా:- తినుటకు భోజనము పెట్టును.

అదియే జీతము.

స్వా. ప్ర.:- మీరు వ్యాపారములో అబద్ద మాడుట మానితిరా?

కాళా:- అబద్ధ మాడుట నేను మానివేసితిని.

స్వా. ప్ర:- అబ్బే! మీరు అట్లు చెప్పిన నేను ఒప్పుకొనను. లోకులు కాళాభాయి ఏనాడు అబద్ధము ఆడడు అని చెప్పినచో ఒప్పుకొనెదను. ఒక దృష్టాంతము వినుడు.

## లోక ప్రమాణము

ఒక మిఠాయి వర్తకుడు తినుబండారముల దుకాణమును కలిగియుండెను. ఇంటికి ముందు భాగము దుకాణమునకును వెనుక భాగము నిద్రించుటకును ఉపయోగించుచుండెను. ఒకరోజున ఆ ఇంటిలోనికి ఒక దొంగ ప్రవేశించెను. మిఠాయిలు మొదలగువానిని ఒక మూల నుంచి డబ్బు పెట్టిలో నుండి ధనమును తీసి మరియొక మూల నుంచెను. ఇది గ్రహించి వర్తకుడు తలచెను. దొంగ ఎదుటికి వెళ్ళినచో

నన్ను కత్తితోనో, మరియొక దానితోనో గాయపరచును. ఇట్లనుకొని ఆతడు ఒక యుక్తిని పన్నెను. "పిల్లీ, పొమ్ము, ప్రతిరోజున ఈ విధముగా బాధించుచున్నావు పొమ్ము" అనుచు దొంగ దగ్గరకు వచ్చెను. యజమాని తనను చూచెనని దొంగ అనుకొనెను. ఆతడు సమీపమున ఉన్న బోషాణములో దూరి తలుపులు మూసుకొనెను. వణిజుడు దగ్గరకు వెళ్లి బోషాణమునకు తాళము వేసి నిశ్చింతగా తన గదిలో కూర్చొనెను. కొంచెము సేపైన తరువాత పెట్టి తలుపు తీసికొనలేక దొంగ మ్యావు మ్యావు అనదొడగెను. మ్యావుమ్యావు అనుటచే వర్తకుడు తనను పిల్లి అనుకొని మూతతీసి విడచినచో పారిపోవచ్చునని అతడు తలచెను. కాని వర్తకుడు బోషాణము వద్దకు వచ్చి పలికెను:-"నీవు ఎంత మ్యావు మ్యావు మనినను నిన్ను నేను పిల్లి అనుకొనను. ఉదయము జనులు అందరును వచ్చి పెట్టి తెరచిన పిదప నీవు పిల్లి అని చెప్పినచో నిన్ను

విడచెదను.” ఈవిధముగనే జగమునందలి జనులు కాళాభాయి అబద్ధము ఆడడు అని చెప్పినచో అంగీకరించెదను. అంతవరకును అంగీకరించను.

## లోసమాన్యుడగు భక్తుడు

జామనగరమునందున రామజీ భాయి అను ఒక మహారాష్ట్రుడగు పోలీసు శిరస్తాదారుఁడు ఉండెను. ఆతడు చినిగిన బట్టలు కట్టెడి వాడు. ఎంతయో బుద్ధిమంతుడు. అతనికి ఇంగ్లీషు బాగుగా తెలియును. ఆతని ఇంట నాలుగైదు బొంతలు మాత్రమే ఉండెను. భిక్షుకుడెవడైన అడుగుటకు వచ్చిన అతడేమి అడిగిన అది ఇచ్చి వేసెడివాడు. కుటుంబీకుడైనను రేపు ఏది జరుగునను చింత ఆతనికి ఉండెడిది కాదు. చనిపోవుటకు మూడునాలుగేండ్లు ముందు జీతముకూడ నాతడు ఉంచెడివాడు కాడు. జీతము పుచ్చుకొనిన వెంటనే త్రోవలో ఎవడడిగినను ఇచ్చివేసెడి వాడు. ఇంటికి వచ్చుసరికి జీతము

పూర్తి అయిపోయెడిది. ఒకమారు ఆయనకు ఇట్లు చెప్పితిని:- రామజీ బాయీ! నీవద్దకు అనేక రకములుగు మనుష్యులు వచ్చుచున్నారు. వారు మీ వద్ద నుండి వస్త్రములు, చెంబులు, గిన్నెలు, ధనము మొదలగునవి తీసికొనిపోవు చున్నారు. తరువాత వారు ఆ వస్తువులను అమ్మి డబ్బు చేసికొనుచున్నారు. పాత్రత, అపాత్రత వివేచించి దానము చేయుట మంచిది. అంతట ఆయన ఇట్లు సమాధానము చెప్పెను:- “ నేను పాత్రాపాత్ర వివేకము చేయవలెనా! అట్లు చేయుటకంటె అడుగుటకు వచ్చిన వారందరును పాత్రులే అని తలచి వారు అడిగినది ఇచ్చుచున్నాను.” ఈ మాటలను విని నేను చెప్పితిని. “ధన్యుడవు. నీవు సంసార జీవితము నందుండికూడ ఇట్టి దృష్టి కలిగియున్నావు.”

ఈ రామజీ భాయి స్థితి నరసింహ మెహతా, తుకారాముల వంటిది. జామనగర వాసులందరూ అతనిని భక్తునిగ గుర్తించిరి. అటులే జేతపురము

నందెల్లరు మీరు భక్తులని చెప్పినచో నేను విశ్వసించెదను. అంతవరకును నమ్మను.

# సత్యమే ధర్మము

డాక్టరు లల్లూభాయి (వేళాకోళముగా)... కాళాభాయి ఇంటిలో అబద్ధము మాట్లాడకపోయినను వ్యాపారము నందు అబద్ధము ఆడవలసి వచ్చును.

స్వా. ప్ర:- అసత్యమాడిన గాని వ్యాపారము సాగదనుట తగదు. ఆరంభమున కొంచెము కష్టముయినను, నమ్మకము కలిగి నంతనే వ్యాపారమున ఎక్కువ లాభమే వచ్చును. జనులు కూడ ఆతడే నమ్మకస్తుడని తలచి ఆతనివద్దనే సామానులు కొనెదరు. శ్రుతి కూడ చెప్పుచున్నది. 'సత్యం వద ధర్మం చర' కావున సత్యమును పలుకుము. ధర్మముగా సంచరించుము. ఇందు ఒక సందే హమునకు అవకాశము కలదు. మనువు ధృతి, క్షమ మొదలగు పదివిధములగు ధర్మములను చెప్పెను.

అందులో సత్యము సమావేశమైనదికదా? పై శ్రుతియందు సత్యం వద అని మొదట సత్యమును నిరూపించిన పిమ్మటనే ధర్మం చర అని ధర్మమును వేరుగా తెలిపెను. దీనికి కారణ మేమి? ఈ ప్రశ్నలకు సమాధానము ఇది:-

సత్యము ధర్మమునకు పునాది ***సత్యేన రక్ష్యతే ధర్మః*** అని శ్రుతి కూడా చెప్పుచున్నది. సత్యము చేతనే ధర్మము రక్షించబడును. రాజగు హరిశ్చంద్రుడు సత్యము కొఱకు కొంచెమును జంకకుండ రాజ్యమునంతను త్యజించెను. సత్యము కొరకే విశ్వామిత్ర మహర్షి ఋణమును తీర్చుటకు రాజ వైభవమును త్యజించెను. ఉదయ సూర్యునికూడ చూచి యెరగని కోమలాంగియగు భార్యను, పుత్రుని ఒక బ్రాహ్మణుని కడ దాసీతనము చేయుటకు అమ్మివేసెను. తాను చక్రవర్తియగు రాజయినను చండాలుని నౌకరీ చేసి శ్మశానమునకు వచ్చిన శవములనుండి పన్ను వసూలు చేయు నీచవృత్తిని

అవలంబించెను.

దశ విధ ధర్మములయందును ముఖ్య ధర్మము సత్యమే. సత్యము లేకుండ మిగిలిన ధర్మములన్నియును ధర్మాభాసములు మాత్రమే.

***సత్య ప్రతిష్ఠాయాం క్రియా ఫలాऽऽశ్రయత్వమ్।***

"సత్యమునందు స్థిరత్వమును కనిగియుండుటచే ధార్మిక క్రియా కలాపముల ఫలము ప్రాప్తించును."

మానవుడు కాయిక, వాచిక, మానసిక విధుల సత్యమును పాలించినచో అతనికి యజ్ఞము, దానము, తపము మొదలగు ధార్మిక కార్యములను ఆచరించుటచే స్వర్గాధిఫలములును, నిష్కామ కర్మము, ఉపాసన, జ్ఞానము మొదలగు ధార్మిక క్రియలచే మలవిక్షేపదోష నివృత్తితో పాటు అంతఃకరణ శుద్ధి ద్వారా ఆవరణ భంగమను ఫలమును ప్రాప్తించును. సత్యమును పాలించనిదే

సకామకర్మలను కాని నిష్కామకర్మలను కాని ఆచరించుటచే కలుగు ఫలము కలుగదు.

కాళా:- “నేను ఎరిగియుండి అసత్యమును పలుకను. అయినను నా సత్య వాక్పరిపాలనము నందు ఏదైన లోపము ఉన్నచో తమవంటి వారి కృపచే నిరంతర సత్య వాక్పరిపాలనము నాకు అలవడును.

పిదప రాత్రి భోజనానంతరము ఎల్లరును కూర్చొనిరి. మోక్ష ప్రాప్తికి సాధనము ఏమిటి అని కాళాభాయి ప్రశ్నించెను.

సా. ప్ర:- మోక్ష సాధనమును గురించి చెప్పుటకు తగిన అనుభవము నాకు లేదు. వినుట వినిపించుట- ఈ రెండు మాత్రమే ఈ రోజుల్లో జరుగు పనులు. వైరాగ్యము లేకుండ ప్రశ్నలు అడిగెదరు. జవాబు చెప్పువారు తెలిసికొనకుండగనే జవాబు చెప్పెదరు.

# ముప్పది మూడవ ప్రసంగము

**శ్రవణాయాపి బహుభిర్యో నలభ్యః శృణ్వన్తోఽపి బహవో యం స విద్యుః/ ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా ఆశ్చర్యో జ్ఞాతా కుశా లానుశిష్టః//**

" ఈ ఆత్మను గురించి చాలామంది విన లేదు. చాలామంది విని కూడ తెలిసికొన లేదు. ఆత్మ తత్త్వముగురించి ఉపదేశించు వాడు దొరకుట ఆశ్చర్యకరమైన సంగతి. అనగా అట్టివారు దొరకుట దుర్లభము. చతురుడగువాడు ఎవ్వడో మాత్రమే దానిని పొందగలడు. కుశలుని వద్దనుండి (బ్రహ్మ జ్ఞాని వద్దనుండి) ఉపదేశమును పొందిన జ్ఞాత కాని వక్త కాని దొరకుటకూడ కూడా దుర్లభము."

శ్రుతి వక్త దొరకుట కూడ ఆశ్చర్యమని చెప్పుచున్నది. తాను స్వయముగా అనుభవము పొంది నిజమును చెప్పు వక్త ఈనాడు దుర్లభము. ఛాందోగ్యోపనిషత్తు నందు సనత్కుమారుడు నారదునకు చెప్పెను:-

***యదా వై విజానాత్యథ సత్యం వదతి నాఽవిజానన్ సత్యం వదతి విజానన్నేవ సత్యం వదతి //***

"బ్రహ్మమును తెలిసికొనిన వాడే నిజమును చెప్పును. తెలిసి కొననివాడు నిజమును చెప్పడు. సవిశేషముగా తెలిసికొనిన వాడు అనగా పూర్ణానుభూతిని పొందిన వాడు మాత్రమే నిజము చెప్పును.

## శ్రోతలలో భేదములు

తెలిసికొనువారుకూడ చెప్పెడివారివలెనే దొరకుట దుర్లభము. శ్రోతలు చాలమంది ఉందురు. కాని వస్తువును గ్రహించు తీవ్ర వైరాగ్యవంతుడు దొరకుట దుర్లభము.

***మృచ్చాలినీ మహిషహంసశుకాశ్వభావా***
***మార్జారకాక మశ కౌఘుజలౌక తుల్యాః/***
***నచ్ఛిద్ర కుమ్భపశుసర్పశిలో పమానాస్తే***
***శ్రావకా భువి చతుర్దశధా భవన్తి//***

"మట్టి, జల్లెడ, ఎనుబోతు, హంస, చిలుక ,

గుఱ్ఱము, పిల్లి, కాకి, దోమ, జలగ, చిల్లి కుండ, పశువు, సర్పము, రాయిలవలె 14 రకముల శ్రోతలు భూమిమీద కలరు.”

1. మట్టి :- మట్టిలో నీరు పడినంతనే మెత్తబడును. కాని కొంచెము సేపు అయినతోడనే ఎండిపోయి గట్టిపడును. అటులనే ఈ రకమునకు చెందిన శ్రోతకూడ ఉపదేశమును వినినంతనే ద్రవించి పోవును. కాని కొలదిక్షణములలోనే యథా ప్రకారమగు జీవితమును గడుపును.

2. జల్లెడ:- జల్లెడలో ధాన్యము ఉన్నంతవరకును బాగుగనే ఉండును. జల్లించిన కొలదియు అందు చెత్త పెరుగును. జల్లెడ చెత్తనే గ్రహించును. అటులనే కొందరు శ్రోతలు మానసిక అస్థిరత్వముచే వినిన ఉపదేశమునందలి సారమును విడనాడి అందలి స్థూల విషయములను మాత్రమే గ్రహించెదరు.

3. మహిషము. :-మహిషము నీటిలో నున్నంత సేపు శాంతముగా నుండును. కాని

బైటికి వచ్చినంతనే పూర్వావస్థను పొందును. శాంతినిచ్చు నీటిని కూడ అపరిశుద్ధము చేయును. అటులనే వినినంత సేపును సక్రమముగ నుండి తమ వ్యవహారమునందు పడిన వెంటనే పూర్వావస్థను పొందువారును, వినిన ఉపదేశములను తమ జడబుద్ధితో కశ్మలము చేయువారును మహిష శ్రోతలని అనబడుదురు.

4. హంస :-హంస నీటిని, పాలును వేరుచేయును. అటులనే సత్యాసత్యములను వేరుచేయు వివేకవంతులు హంస శ్రోతలు.

5. చిలుక :.- చిలుక వలె నామోచ్చరణ చేయుచు దాని అర్థమును తెలిసికొనని వారు.

6. గుర్రము:- తన వీపుపై రౌతు ఉన్నంత సేపు గుర్రము కళ్ళెమునకు లోబడి నడుచును. కళ్లెము తీసివేసి నతంనే తన ఇష్టము వచ్చినట్లు నడుచును. అటులనే గురువుగారి అధీనములో నున్నంత కాలము ఉపదేశములను అనుసరించి వారికి దూరము అయిన వెంటనే మారు త్రోవను

పట్టువారు.

7. పిల్లి :- పిల్లి ఎంత శాంతముగ కూర్చొనియున్నను తన వేట జంతువగు ఎలుక కనిపించినంతనే జాగ్రత్త పడును. అటులనే ఉపదేశమును విని శాంతి పొందినను పైకి ఏకాగ్రతతో నున్నట్లు కన్పించినను స్వార్థమునకు సంబంధించిన ప్రశ్న వచ్చినప్పుడు తమ మామూలు నడక ప్రకారము జాగ్రత్త పడువారు.

8. కాకి:- ఉత్తమమగు పదార్థమును తినిన వెంటనే నీచమగు మలము వంటి పదార్థముపై కూర్చొనును. అటులనే ఉత్తమ ఉపదేశమును పొందిన వెంటనే దురాచారమునకు సంబంధించిన విషయముల యందు నిమగ్నమగువారు.

9. దోమ :- దోమ తనకు తృప్తి కలుగక పోయినను ఇతరుల చెవి వద్దకు వెళ్లి అప్రియమగు శబ్దమును చేసి వారిని సుఖముగా కూర్చొననీయదు. అటులనే తనకు మేలు కలుగక

పోయినను ఇతరులు శ్రవణము చేసిన సద్వాక్యముల ప్రభావమును తమ పాడు మాటలచే ఖండించువారు.

10. జలగ:- జలగ ఇతరులకు బాధ కలుగ జేయును. తన జీర్ణశక్తికి మించిన రక్తమును పీల్చును. అటులనే కొందరు శ్రోతలు వక్తలను బాధించి తమ శక్తికి మించిన విషయములను గ్రహింప బూనెదరు.

11. చిల్లికుండ: - చిల్లికుండలో పోసిన నీరు కొలది సేపటిలో కాళీ అయిపోవును. అటులనే వినిన ఉపదేశములను కొందరు నెమ్మది నెమ్మదిగా మరచిపోయెదరు.

12. పశువు:- పశువులకు ఎంత నేర్పినను నిత్యాభ్యాసము లేనిచో మరచిపోవును. అటులనే కొందరు శ్రోతలు గురువులు శ్రమ పడి చెప్పిన ఉపదేశములను తమ స్వాభావికములగు కుసంస్కారములచే విడిచి వేయుదురు.

13. సర్పము:- సర్పమునకు పాలు

త్రాగించినను విషరూపమునే పొందును. అటులనే ఆ రకమునకు చెందిన శ్రోతలు సదుప దేశములను తప్పుడు అర్థములలో గ్రహించి ప్రపంచమునకు హాని చేయుదురు.

14. శిల:- కఠినమగు రాతిపై ఎంత నీరు పోసినను అది గట్టిగనే ఉండును. అటులనే దుర్జనులకు ఎంత బోధించినను తమ మూల ప్రకృతిని వారు విడనాడరు.

ఈ పదునాలుగు రకముల శ్రోతలలోను హంస శ్రోతయే ఉత్తముడు.

***విరక్త స్య హేయజ్ఞానముపాదేయోపాదానం హంసక్షీరవత్/ (సాంఖ్యసూత్రము)***

"హంస నీరమును విసర్జించి క్షీరమును మాత్రమే గ్రహించును. అటులనే వైరాగ్యవంతుడగు వివేకి త్యజించవలసిన మాయా తత్త్వములను త్యజించి గ్రహించదగిన సారమును బ్రహ్మ తత్త్వమును గ్రహించును."

# ఉపదేశములను వినుటలో నేడు కన్పించు గ్రుడ్డి నమ్మకము

ఇది అంతయును కృతయుగమునకు చెందిన సంగతి. ఇక కలి యుగమునందు ఇట్టి విషయమున ఆశ్చర్యము ఏమి? అందరును వైభవ విలాసములలో మునిగి తేలుచున్నారు. తులసీ రామాయణమున కలియుగవర్ణనమున కాకభుశుండి గరుడునితో చెప్పెను: -

***గురుశిష్య అంధ బధిర కర లేఖా,***
***ఏక న సునే ఏక నహి దేఖా.***

కలియుగమునందలి గురువులు గ్రుడ్డివారు. శిష్యులు చెమిటి వారు. గురువులు బ్రహ్మమును తెలిసికొనకుండ ప్రతిపాదించెదరు. వైరాగ్యమును పొందనిదే శిష్యులు శ్రవణము చేయుదురు.

'***జీవన్ముక్తశ్చ***' సాంఖ్య సూత్రములు.

"జీవన్ముక్తుడే ఉపదేశించుటకు తగినవాడు." ఎవడు బ్రహ్మానుభవమును పొంది

జీవించియుండగనే ముక్తిని పొందెనో ఆతడే సత్యమును చెప్పును.”

‘**'ఇతరతః అన్ధ పరమ్పరా|**’ సాంఖ్య సూత్రములు.

జీవన్ముక్తుడు తప్ప మిగిలిన వారి వద్ద నుండి ఉపదేశములను గ్రహించుట గ్రుడ్డి నమ్మకము మాత్రమే.

ఈ రోజులలో శాస్త్రములను చదివి, అనుభవమును పొందకుండ చేయు ఉపదేశములు అన్నియు గ్రుడ్డి నమ్మకమునకు చెందినవే.

ఒక గ్రామమున ఒక గ్రుడ్డివాడు ఉండెను. చాల కాలమునుండి అభ్యాసము ఉండుటచే అతడు తన గ్రామములో ఇతరుల సహాయము అక్కర లేకుండ తిరుగగలిగెడివాడు. ఒకనాడు ఆ గ్రామము నందలి నలుగు రైదుగురు గ్రుడ్డి వాండ్రకు యాత్ర చేయవలెనని వేడుక పుట్టెను. వారు పలికిరి:-

“మేము గ్రుడ్డివారము. అందుచే ఇతరుల

సహాయము లేనిదే వెళ్ళలేము. మొదటి గ్రుడ్డివాడు ధనలోభముచే నిట్లనెను:-

“అదేమిటి. రండు, నేను మీచే యాత్ర చేయించుదును. నేను అన్ని చోట్లకు వెళ్ళగలను. కాని ఒక సంగతి. ఎవరైన నన్ను గ్రుడ్డివాడని వేళాకోళము చేసినచో మీరు నమ్మ వద్దు. నేను చూడగలను.”

వారు ఒప్పుకొనిరి. ఒకని చేతులు మరియొకడు పట్టుకొనెను. మొదటి గ్రుడ్డివాడు ముందు నడవ సాగెను. గ్రామీణులు ఇది చూసి పలికిరి:-

“ఓరీ గ్రుడ్డివాడా! నీవు ఈ గ్రుడ్డివాళ్ళను అందరిని తీసికొని ఎక్కడకు వెళ్ళుచున్నావు?”

గ్రుడ్డివాడు పలికెను:. “నేను గ్రుడ్డివాడను కాను. మీరే గ్రుడ్డివారు.”

ఇట్లని వాడు అందరికంటే ముందు నడచెను. అట్లు నడచుచుండగా మార్గమునందు ఒక పెద్దగొయ్యి వచ్చెను. గ్రుడ్డివాడు దానిని

చూడలేక పోయెను. కాలుజారి ఆతడు ఆ గోతిలో పడెను. ఆతని చేయి పట్టుకొని వచ్చుచున్న మిగిలిన గ్రుడ్డివారు కూడ ఆ గోతిలో పడిరి.

ఇదే విధముగా చాలా చోట్ల సామాన్యమగు శాస్త్రాభ్యాసము చేసి " నేను మహావిద్వాంసుడను, పండితుడను, జ్ఞానిని అను గర్వముతో చదువు రాని పామరులను తప్పుడు మార్గమున నడిపించి దుఃఖమను గోతిలో పడ వేయుదురు.

ఈ విషయమున కఠోపనిషత్తు నందు యమధర్మరాజు నచికేతునకు చేసిన ఉపదేశమును పరికించుడు:-

***అవిద్యాయామన్తరే వర్తమానాః స్వయం ధీరాః పణ్డితంమన్యమానాః।***
***దన్ద్రమ్యమాణాః పరియన్తి మూఢా అన్ధేనైవ నీయమానా యథాన్ధాః॥***

"అవిద్యాగతులగు మూఢులు తాము ధీరులము, పండితులము అనుకొని అనేకములగు తప్పుడు త్రోవలను పట్టుదురు. గ్రుడ్డివాడు

గ్రుడ్డివారిని తప్పుడు త్రోవను పట్టించునట్లు అజ్ఞులను మారు త్రోవను పట్టించెదరు. అట్లుభ్రాంతి చిత్తులయి భ్రమించు చుందురు.”

అవిద్య అను ఘోరమగు అంధకారమునందు ఉండు మూఢులు ధనాది మాయిక పదార్థములను అనుభవించుచు అనేక విధములగు ఆశలను పాశములచే బద్ధులయి తాము బుద్ధిశీలురము, శాస్త్రజ్ఞులము అనుకొనుచు అనేక విధములుగా అత్యంతము కుటిలమగు నడవడికలతో అంధునిచే నడుపబడిన వారు సరియగు మార్గమును విడచి తప్పుడు త్రోవను పట్టునట్లు మోక్ష మార్గమునుండి తప్పి జన్మ, మరణ, రోగాది దుఃఖములలో పడి తిరుగుచునుందురు.

ఇట్టి గ్రుడ్డివారు ఇతరులకు ఎట్లు మార్గము చూపుదురు?

స్వా. ని:- మనకు అనుభవము లేక పోయినను సత్పురుషుల అనుభవము

వినుటలోను, చెప్పుటలోను దోషము లేదు.

స్వా. ప్ర :- చిలుకను పెంచి మాటలు నేర్పి అది మాట్లాడుచుండగా విని సంతోషించునట్లు తమరు నేను మాట్లాడుచుండగా సంతోషించు చున్నారు.

## అనాదియగు సంస్కారము- విషయ వాంఛల ప్రాబల్యము

కాళా : - అయిన బ్రహ్మ విద్య విను అధికారం ఎప్పుడు కలుగును?

స్వా. ప్ర:-

***విషయాసక్తి నాశేన వినా నో శ్రవణం భవేత్ /***
***తాభ్యామృతే న మననం న ధ్యానం తైర్వినా భవేత్ //***

"విషయములయందు ఆసక్తిని పోగొట్టుకొనకుండ శ్రవణము సాధ్యము కాదు. విషయాసక్తి త్యాగము, శ్రవణము- ఈ రెండును లేనిదే మననము చేయు శక్తి కలుగదు. పై

మూడును కుదురనిదే ధ్యానము జరుగదు."

అధికారము లేనిదే శ్రవణము జరుగదు. ఇక మనన నిదిధ్యాసనముల సంగతి చెప్ప నేల.

కాళా:-నేను వృద్ధుడను అయితిని. కావున ఇక విషయాసక్తి కలుగుటకూడ సంభవము కాదు.

స్వా. ప :-

***నవే వయసి యః శాన్తః స శాన్త ఇతి మే మతిః/***
***ధాతుష క్షీయమాణేషు శాన్తిః కస్య న జాయతే//***

"యౌవన వయస్సు నందు శాంతి నొందినవాడే శాంతుడు. వార్ధక్యమున ధాతువులు క్షయమును పొందిన తరువాత ఎవడు శాంతిని పొందదు?"

యౌవనమునందే ఇంద్రియములను అదుపులో నుంచి, వానిని ప్రభువునకు సమర్పించి శాంతిని పొందినచో అదియే నిజమగు శాంతి

అనబడును. దేవునకు అప్పటికప్పుడు వికసించిన పుష్పములతో పూజ చేయవలెను. కాని వాడిపోయిన పువ్వులతో పూజించరాదు. కాబట్టి ఇప్పుడు మీకు శాంతికి సంబంధించిన మాట చెప్పు అవకాశము ఏది? పైగా విషయ వాంఛలు ఒక రకముగ నుండవు. వృద్ధులయందు అన్న పానాదులయందు ఎక్కువ ఆసక్తి కాన నగును. శరీరము వార్ధక్యమును పొందినను మనస్సు మాత్రము యౌవనమునందే యుండును.

కాళా:-తమ దయచే మనస్సు కూడ వార్ధక్యమును పొందినది.

స్వా.ప్ర:-మోక్షమును గురించి మీరు ప్రశ్నించిరి. మోక్షము అనగా నేమియో ఎరిగియుండి ప్రశ్నించిరా? కేవలము ఆ మాట మాత్రము విని ప్రశ్నించిరా?

స్వా. ని: - ఈయన ఆత్మపురాణము, యోగ వాశిష్టము మొదలగు పుస్తకములను అధ్యయనము చేసిరి. ఆ మాత్రము తెలియ కుండ

అడుగుదురా?

స్వా. ప్ర :- ఎరిగిన వారు అడగవలసిన పని లేదు. మాటి మాటికి అడిగి ఇతరులను బాధించినచో తనకు వచ్చిన ప్రయోజనము లేదు.

స్వా.ని.:- ఈయన తెలిసికొనిన విషయమును నిర్ధారణ చేసికొనుటకు అడిగిరి. స్థూణానిఖనన న్యాయమున వీరు ప్రశ్నించుచున్నారు.

కాళా:- అవిద్య నుండి ముక్తిని పొందుట మోక్షము అని నా అభిప్రాయము. ఇందు తప్పు ఏమైన ఉన్నచో తమరు సరిచేయుడు.

## అవిద్యా భేదములు

స్వా.ప్ర:- అవిద్య రెండు రకములు :- 1. మూలావిద్య 2. తూలావిద్య. విషయావిచ్ఛిన్నమగు చైతన్యమును ఆశ్రయించినది మూలావిద్య. మూలా విద్య యొక్క బంధనము నుండి ముక్తిని పొందుట

మోక్షము. దానికి సరియగు కారణము జ్ఞానము.

**జ్ఞానాదేవ తు కైవల్యమ్.**

"జ్ఞానము చేతనే మోక్షము కలుగును." జ్ఞానము భక్తియును, వైరాగ్యమును లేనిదే కలుగదు. పదార్థములయందలి మోహ బుద్ధి ఉన్నంత కాలము వైరాగ్యము కలుగదు. వివేకము ద్వారా పదార్థములయందలి మోహము పోయి వస్తువు యొక్క యథార్థ స్వరూపము తెలిసినప్పుడు వ్యక్తికి వైరాగ్యము కలుగును.

## మోహము ప్రబలమగు శత్రువు

***యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతి తరిష్యతి /***
***తదా గన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ// (గీత)***

"ఓ అర్జునా నీ అంతఃకరణము మోహము అను మాలిన్యమును త్యజించిననే శ్రవణము చేయదగిన కర్మయొక్క ఫలితమును, శ్రవణము చేయబడిన కర్మ ఫలము యొక్క వైరాగ్యమును

నీకు కలుగును.”

మోహము సాధకునకు ప్రబల శత్రువు. మోహ ప్రాబల్యముననే పురుషుడు వివిధములగు విషయ పదార్థముల భోగమును కోరును. భోగమునందు అనేక విధములగు కష్టములు కలవని తెలిసికొనని వారును, వానిని అనుభవించిన వారు కూడ మోహగ్రస్తులయి మాటిమాటికి విషయ భోగ పరాయణులగుదురు. మోహ మహిమను భర్తృహరి ఇట్లు వర్ణించెను.

***అజానన్ మాహాత్మ్యం పతతు తలభో దీపదహనే***
***స మీనోఽప్యజ్ఞానాద్బడిశ యుత మశ్నాతు పిశితమ్ |***
***విజానన్తో ప్యేతే వయమిహ విపజ్జాలజటిలా***
***న్న ముఞ్చామః కామాన హహ గహనో మోహమహి మా||***

“అగ్ని యొక్క గొప్పతనము తెలియని మిడుత ఒడలు తెలియక అగ్నియందు పడినచో

పడవచ్చును. మత్స్యము కూడ అజ్ఞానము చేతనే కర్రకు కట్టిన మాంసమును భక్షించును. కాని ప్రపంచమునందలి విషయములు విజ్ఞాపముచే ఆవృతములై యున్నవి అని మీకు తెలియును. అయినను వానిని విడచుట లేదు. మోహము యొక్క మహిమ ఆహా! ఎంత గొప్పది?”

మిడుతలు, చేపలు, పశువులు, పక్షులు మొదలగునవి మోహ పాశ బద్ధులే. అదే విధముగ సామాన్యులగు ప్రాకృత జనులు కూడ మోహ బంధము నుండి ముక్తులు కారు. ఇది బాగుగనే ఉన్నది. కాని గొప్ప గొప్ప శాస్త్రములు చదివిన విద్వాంసులును, పండితులును కూడ మోహజాలమున చిక్కు పడి వేద శాస్త్రముల ఆజ్ఞలను ఉల్లంఘించి విషయ పదార్థములను పొందుటకు గోల చేయుచుందురు. ప్రబోధ చంద్రోదయమున చార్వాకుడు మహా మోహ ప్రభువుల వారి మహిమను వర్ణించుచు ఇట్లు పలికెను.

***వ్యతీత వేదార్థపథః ప్రథీయసీం యథేష్టచేష్టాం గమితో మహాజనః/ తదత్ర హేతుర్న కలిర్న చాప్యహం ప్రభు ప్రసాదో హి తనోతి పౌరుషమ్//***

"విద్వాంసులు, బ్రాహ్మణులు, సన్యాసులు, గురువులు, ఆచార్యులు మొదలగు ధర్మపరాయణులగు మహానుభావులు కూడ వేద శాస్త్రములు చెప్పు మార్గమును ఉల్లంఘించి ఇష్టము వచ్చినట్లు సంచరించుచున్నారు. అందుకు కలియుగము కారణము కాదు. నేను(చార్వాకుడు) కారణము కాదు. తమ యొక్క (మోహము యొక్క) కృపా కటాక్షములే ఇందుకు కారణములు."

## మోహమును జయించిన వైరాగ్యము జనించును

మోహము అను శత్రువు ఇంత ప్రబలుడు. ఆ శత్రువును జయించిననే కాని మోక్షము

లభించదు. ఏలనన అంతవరకు పురుషునకు దేహమునందు అహం బుద్ధి యుండును. ఎన్నియో కోరికలను అనుభవించుచు విషయ పదార్థములను వెంటాడు చుండును.

అంతఃకరణము నుండి మోహము పోయినప్పుడే వైరాగ్యము ద్వారా అధికారి శ్రవణ, మననాదుల ఫలితము శీఘ్రముగా పొందును. ఇహ, పర లోకములు కర్మ ఫలములు మాత్రమే అగుటచే అనిత్యములు. కావున ముముక్షువులు వానియందు వైరాగ్యమును పొందవలెను.

శ్రుతి చెప్పుచున్నది:-

"***పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్య కృతః కృతేన***"

"లోకములు అన్నియును కర్మచేత లభించును అనే విషయమును పరీక్షించి తెలిసికొని కర్మద్వారా లభించు లోకములు అనిత్యములు. వానిచే నిత్యపదార్థమగు ఆత్మతత్త్వమును పొందలేము అని

నిశ్చయించుకొని బ్రాహ్మణుడు వైరాగ్యమును పొందును."

# వైరాగ్య భేదములు

వైరాగ్యము రెండు రకములు, 1. అపర వైరాగ్యము 2. పర వైరాగ్యము. అపర వైరాగ్యము మరల నాలుగు రకములు:- 1. యతమానము 2. వ్యతిరేకము 3. ఏకేంద్రియము 4. వశీకారము

1. యతమాన వైరాగ్యము:— ప్రపంచము నందు "ఇది సారము కల పదార్ధము, ఇది సారము లేని పదార్థము" అను సారాసార వివేకము యతమాన వైరాగ్యము.

2. వ్యతిరేక వైరాగ్యము:- చిత్తమున రాగ ద్వేషాది దోషములు కలవు. అందు ఫలాన దోషములు నివృత్తిని పొందినవి. ఫలాన దోషములు మిగిలినవి అని విచారము చేసి మిగిలిన దోషములను నివృత్తిని పొందించుటకు ప్రయత్నించుట వ్యతిరేక వైరాగ్యము.

3. ఏకేంద్రియ వైరాగ్యము:- మనస్సునందు విషయేచ్ఛలున్నను ఇంద్రియ నిరోధమునకు ప్రయత్నించుట ఏకేంద్రియ వైరాగ్యము.

4. వశీకార వైరాగ్యము:- ఇహలోక పరలోకముల యందలి విషయములు నశ్వరములు అని తెలిసికొని వానిని త్యజించ గోరుట వశీకార వైరాగ్యము.

వశీకార వైరాగ్యము మూడు రకములు :- మంద, తీవ్ర, తీవ్రతరములు.

1. మంద వైరాగ్యము :- దార పుత్ర ధనాదుల వియోగముచే ప్రపంచమును త్యజించవలెనను కోరిక కలుగుట.

2. తీవ్రవైరాగ్యము:— ఈ జన్మమున దార, పుత్ర, ధనాదులు నాకు లభించరాదు అను స్థిర బుద్ధితో సంసారమును త్యజించుట.

3. తీవ్రతర వైరాగ్యము :- ఇహలోక పరలోకముల యందలి ఎల్ల విషయముల యందలి

కోరికలను పరిత్యజించ వలెనను తలంపు కలుగుట.

ఈ వైరాగ్యములన్నిటికంటెను ఉత్కృష్టమగునది పర వైరాగ్యము, యోగ సూత్రములు చూడుడు:-

**"తత్పరం పురుషఖ్యాతే రుణ వైతృష్ణ్యం"**

"పురుష సాక్షాత్కారముచే సకల గుణముల యందును ఉద్భవించిన వైతృష్ణ్యము (తృష్ణాఽభావము) శ్రేష్ఠమగు పర వైరాగ్యము."

నిష్కామకర్మచే అంతఃకరణమునందలి మలదోషము నివృత్తిని పొందిన తరువాత వైరాగ్యము కలుగును. అప్పుడే సమాధిని అభ్యసించుటకు అధికారము కలుగును. మల, విక్షేపదోషములు నివృత్తిని పొందుటచే అంతఃకరణమునందలి రజస్తమోగుణములు అణచబడి సత్త్వగుణమను దైవసంపద లభించును.

# సత్త్వ గుణ భేదములు

సత్త్వగుణము రెండు రకములు 1. మిశ్రమ సత్త్వము. 2. శుద్ధ సత్త్వము. మిశ్రమసత్త్వమనగా దైవ సంపద. శుద్ధ సత్త్వమనగా ఆత్మసాక్షాత్కారము. చిత్తమునందు దైవసంపద కలిగి నప్పుడు సమాధిని అభ్యసించుటకు సామర్థ్యము వచ్చును. భగవానుడు గీత యందు చెప్పెను :-

## యోగ ప్రాప్తి

***శ్రుతి విప్రతి పన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా/***
***సమాధావచలా బుద్ధిస్తదా యోగ మవాప్స్యసి//( గీత)***

"అర్జునా! నానావిధములగు స్వర్గాది సౌఖ్యములను ప్రతిపాదించు శ్రుతిని విని సంశయమును పొందిన నీ బుద్ధి పరమాత్ముని యందు స్థిరపడిన నీకు యోగము సిద్ధించును."

సారాసార వివేకము చేయు సామర్థ్యము లేని బుద్ధి గాలి కల చోట నున్న దీపశిఖవలె చంచలముగ నుండును. ఇహ లోకమునుండి బ్రహ్మ లోకము వరకును ఉన్న అన్ని విధములగు సుఖముల యందును తుచ్ఛత్వభావము కలుగనంతవరకు చిత్త వృత్తి చాంచల్య రహితము కాదు. ఆత్మనిష్ఠ కలుగదు. చాంచల్యమును పోగొట్టుకొనుటకును, ఆత్మ తత్త్వమునందు చిత్తమును స్థిరపరచుటకును మాత్రమే సాధకుడు యోగాభ్యాసమును చేయవలెను.

## అహం గ్రహోపాసన

యోగము అను శబ్దమును ఇచ్చట భగవానుడు ధ్యాన యోగమును ఉద్దేశించి చెప్పెను. ధ్యానమును గురించి అపరోక్షానుభూతి యందు శంకరభగవత్పాదులు ఈ విధముగ తెలిపిరి:-

***బ్రహ్మైవాస్మీతి సద్వృత్త్యా నిరాలంబతయా స్థితిః/***

# ముప్పది మూడవ ప్రసంగము

***ధ్యాన శబ్దేన విఖ్యాతా పరమానన్దదాయినీ//***

"నేనే బ్రహ్మమును అను బాధా రహితమగు వృత్తి ద్వారా ఆలంబన రహితమగు ఆనందమును కలుగ జేయుస్థితి ధ్యానము అని ప్రఖ్యాతమయి యున్నది."

ఇది అహంగ్రహోపాసన అనబడును.

ఉపాస్య వస్తువు భిన్నమైనది అని ఉపాసించుట భేదోపాసన. అందు ఆ భావనను అనుసరించే బ్రహ్మ లోకము లభించును. అభేదోపాసనచే ఈ శరీరమునందు జ్ఞానము కలిగి ముక్తిని పొందును. కావున భేదోపాసనము మముక్షువులకు నిషిద్ధము.

***"అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽ న్యాఽ సావన్యోఽ హమస్మీతి న స వేద"***

"ఉపాస్యము నాకు భిన్నమైనది; ఉపాస్యమునకు నేను భిన్నుడను అను భేద భావముతో భిన్న దేవోపాసన చేసినవాడు ఉపాసనా స్వరూపమును అర్థము చేసికొనలేదు."

# సమాధి భేదములు

ఈ విధముగ అభేదోపాసన చేయగా అధికారికి సమాధి కలుగును. సమాధి రెండు రకములు. 1. సవికల్పము 2. నిర్వికల్పము. సవికల్ప సమాధి నాలుగు రకాలు: -

1. బాహ్య శబ్దానువిద్ధము, బాహ్య శబ్దాననువిద్ధము.

2. బాహ్య దృశ్యానువిద్ధము, బాహ్య దృశ్యాననువిద్ధము.

3. ఆన్తరిక శబ్దానువిద్ధము, ఆన్తరిక శబ్దాననువిద్ధము.

4. ఆన్తరిక దృశ్యానువిద్ధము, ఆన్తరిక దృశ్యాననువిద్ధము.

నిర్వికల్ప సమాధి రెండు రకములు :- 1. బాహ్య నిర్వికల్ప సమాధి 2. ఆన్తర నిర్వికల్ప సమాధి.

సవికల్ప సమాధి యొక్క పరిపక్వావస్థ

నిర్వికల్ప సమాధి.

***నిర్వికార తయా వృత్త్యా బ్రహ్మాకారతయా పునః,***
***వృత్తి విస్మరణం సమ్యక్ సమాధిర్జ్ఞాన సంజ్ఞకః.***

"నిర్వికార వృత్తియను బ్రహ్మా కారవృత్తిచే ఆత్మ వృత్తి విస్మరణము జ్ఞానము అను ఉత్తమ సమాధి."

ఆవరణభంగము అయిన పిదప ధ్యేయాకారమగు వృత్తి జ్ఞేయాకారమగుటచే ఈ సమాధి జ్ఞాన సమాధి అనబడును.

నిర్వికల్ప సమాధి రెండు రకములు:- 1. అద్వైత భావన అద్వైతావస్థ. అందు ధ్యాత, ధ్యానము, ధ్యేయము అను త్రిపుటి ఉండదు. కావున వృత్తి, బ్రహ్మా కారము అగును. అది అద్వైత భావన నిర్వికల్ప సమాధి. ఈ అద్వైత భావన అను వృత్తి స్వరూపమున లయమును పొందినప్పుడు అద్వైతావస్థ అను నిర్వికల్ప సమాధి సిద్ధించును.

# యోగమును సాధించుటలో అభ్యంతరకరములగు 8 విఘ్నములు

సమాధి అను ప్రయత్నముచే ఆత్మజ్ఞానము అను సిద్ధి కలుగుటకు ముందు సాధకుడు మార్గమధ్యమున అనేక విఘ్నములను ఎదుర్కొనవలసి వచ్చును.

అపరోక్షానుభూతి యందు శంకర భగవత్పాదులు చెప్పిరి:-

***సమాధౌ క్రియమాణే తు విఘ్నా ఆయాన్తివై బలాత్/***
***అనుసన్ధాన రాహిత్యమాలస్యం భోగలాలసా //***
***లయస్త మశ్చ విక్షేపో రసాస్వాదశ్చ శూన్యతా/***
***ఏవం యద్విఘ్న బాహుల్యం త్యాజ్యం యోగ విదా శనైః//***

"సమాధిని పొందుటకు ఈ విఘ్నములను

ఎదుర్కొనవలసి వచ్చును. 1 అనుసంధాన రాహిత్యము 2. ఆలస్యము 3. భోగలాలస 4. లయము 5. తమము (కార్యాకార్య అవివేకము) 6. విక్షేపము 7. రసాస్వాదము 8. శూన్యత్వము. ఇట్టి విఘ్నములను యోగమును తెలిసికొనిన వాడు మెల్ల మెల్లగా తప్పించు కొనగలుగును."

1. అనుసంధాన రాహిత్యమ్ :- ధ్యేయాకార వృత్తి యొక్క స్థిరత్వము భంగమగుట. విషయముల ద్వారా అనుసంధానము భగ్న మగును. ఆ విఘ్నము బ్రహ్మైక్య భావమును అభ్యసించుట చేతను, వైరాగ్యము చేతను పోవును.

2. ఆలస్యమ్:- శరీరేంద్రియముల భారముచే-సోమరితనముచే ఉద్భవించు ఉత్సాహ రాహిత్యము. తగిన ఆహార విహారములచే కఫాదులు నివారించబడి ఈ విఘ్నము పోవును.

3. భోగలాలసా: – సుగంధాది అష్టవిధ భోగములను అనుభవించవలెనను కోరిక.

గృహస్థులు యోగ ప్రవృత్తులయిన వారికి కూడా భోగలాలస కలుగును. ఇక మంద వైరాగ్యము కల సన్యాసులు భోగలాలసను ఎదుర్కొనవలసి వచ్చుటలో ఆశ్చర్యము లేదు. విషయ పదార్థములన్నిటి యందును దోష దృష్టిని కలిగియుండుటచే, తన శ్రేయస్సును గురించి ఆలోచించుటచే ఈ విఘ్నము తొలగును.

4. లయః :- అజీర్ణము, నిద్ర లేమి, పరిశ్రమ మొదలగు వానిచే బ్రహ్మాకార వృత్తి కలుగదు. అది లయము. ఈ విఘ్నమును పోగొట్టుకొనుటకు లఘువగు పథ్య భోజనమును చేయవలెను. ఉత్థాన ప్రయత్నముచే చిత్తమును మేల్కొల్పవలెను.

5. తమః :- సాధనమును అసాధనముగను, అసాధనమును సాధనముగను తలచు భ్రాంతి తమము. యోగ సాధకుడు స్త్రీ ధనాదులకు దూరముగ నుండి ఏకాంతమున యోగమును అభ్యసించవలెను. అట్లు చేయక,

దారపుత్రాదులు అవసరమయినవి అని భావించి వారిని దగ్గరనుంచుకొని యోగమును అభ్యసించుట అసాధనము సాధనముగా భావించుట అనబడును. ఈ విఘ్నము పూర్వ జన్మ పుణ్యము చేతను యోగ్యులగు గురువుల ఉపదేశమునను సరించి ఆచరించుటవలనను, సమాధి ప్రతిపాదకములగు శాస్త్రములను అభ్యసించుటవలనను తొలగిపోవును.

6. విక్షేపః :- రాజస వృత్తిచే ఉత్పన్నమైన కామాదులచే కలుగు మనశ్చాంచల్యము. ఈ విఘ్నము విషయ పదార్థముల యందు దోష దృష్టిని పొందుటచే పోవును.

7. రసాస్వాదః : – విషయ సుఖముకంటె బ్రహ్మసుఖము యోగులకు లభించును. ఆ రసమును ఆస్వాదించుటకు ధ్యానము చేయుచుండగా కలుగు ఏకాగ్రత యందు జీవ బ్రహ్మముల మధ్య అజ్ఞానము అను తెర ఉండును. ఆ తెరకు దగ్గరగా వెళ్ళునప్పుడు ఒక విధమగు ఆనంద వృత్తి కలుగును. కొందరు

అదియే బ్రహ్మము అని అచ్చట విరమించెదరు. కాని నిజమునకు అది మాయిక మగు సుఖము. బ్రహ్మ సుఖము కాదు. ఉదాహరణకు ఎవడైన చెరువు నందలి నీటిని స్పృశించుచుండగా కలుగు చల్లదనము నీరు అని భావించుట ఎట్లు భ్రాంతి అగునో అటులనే అది కూడ భ్రాంతియే. ఈ విఘ్నము బ్రహ్మసుఖము సర్వోత్కృష్టము అను భావముచే తొలగును.

8. శూన్యతా:- వృత్తి మూఢాకారమును పొందుట. దీనిని స్తబ్ధ వృత్తి అనెదరు. స్తబ్ధవృత్తి విషయ రూపమును కాదు, సుషుప్తియును కాదు, ధ్యానాకారమును కాదు. అయినను నేను ధ్యానము చేయుచున్నానని సాధకుడు తలచును. కాని వృత్తి ధ్యానాకారముగా నుండక మూఢాకారముగా నుండును. ఇది స్తబ్ధవృత్తి. ఈ విఘ్నములు పోగొట్టుకొనుటకు అనుభవముకల గురువు నొద్ద నేర్చుకొనిన ధ్యానాదిక్రియలలో ప్రవృత్తిని పొందుట ఆవశ్యకము.

ఈ ఎనిమిది విఘ్నములు యోగ మార్గమునందలి అంతరాయములు. వీని అన్నిటిని సాధకుడు మెల్ల మెల్లగా దాటవలెను. అందుకు సాధకుడు చిత్త వృత్తిని ఏకాగ్రమునొందుటకు నిరంతరము చాల కాలము శ్రద్ధగా ప్రయత్నించవలెను.

## యోగాభ్యాసము నిరంతరము చేయవలెను

యోగాభ్యాసము రోజును నియమిత సమయమున చేయవలెను. చాల కాలము వరకు అభ్యసించక కొంతకాలము అయిన తరువాత యోగమును మాని వేసిన యోగికి పూర్తి ఫలితము కలుగదు. యోగమును ప్రతి దినమును నియమానుసారము ఆచరించకపోయినచో ఏకాగ్రవృత్తి యొక్క సాతత్యము - అఖండత్వము సిద్ధించదు. ఫలము కలుగదు.

శంకరులు చెప్పిరి :-

***నిమేషార్ధం న తిష్ఠన్తి వృత్తిం బ్రహ్మమయీం వినా/***
***యథా శిష్ఠన్తి బ్రహ్మాద్యాః సనకార్యాఃశుకాదయః//***

"యోగులు అర్ధ క్షణము కూడ బ్రహ్మాకార వృత్తి లేని స్థితి యందు ఉండరు. బ్రహ్మాది దేవతలును, సనకాది ఋషులును, శుకాదిమునులును ఉదాహరణము. నిరంతరము, దీర్ఘ కాలము వరకును యోగాభ్యాసము చేయుచున్నను సాధకుని చిత్తము నందు శ్రద్ధ కలుగనిచో యోగ ఫలము లభించదు.

"***స తు దీర్ఘకాల నై రన్త ర్యసత్కార సేవితో దృఢ భూమిః***"

పతం|| యోగ|| సూ||

"చాల కాలము వరకు, నిరంతరము శ్రద్దగా సమాధిని అభ్యసించుటచే అది స్థిరపడును."

భగవానుడు గీతలో చెప్పెను:-

# ముప్పది మూడవ ప్రసంగము

స్వర్గాది లోకముల ఫలమును ప్రతిపాదించు శాస్త్రములను శ్రవణము చేయుటచే విక్షేపమును పొందిన నీ బుద్ధి నిశ్చలత్వమును పొంది (అసంభావన, విపరీత భావన ఈ రెంటికిని అతీతమయి) సమాధి యందు స్థిరముగా నుండును. అనగా అనుసంధాన రాహిత్యము మొదలగు 8 యోగ విఘ్నములను అధిగమించును. అంతట నీవు యోగమును పొందగలవు. అనగా నీవు ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికము లనెడు మూడు రకములగు దుఃఖములు పూర్ణ నివృత్తిని పొందుట అను యోగమును పొందగలవు. నీకు జీవబ్రహ్మాభేద సాక్షాత్కారము కలుగును.

## సగుణ నిర్గుణ బ్రహ్మ ధ్యానము

కాళా:- సగుణ బ్రహ్మమును ధ్యానించవలెనా? నిర్గుణ బ్రహ్మమును ధ్యానించవలెనా?

స్వా. ప్ర. :- సగుణ బ్రహ్మమును

ధ్యానించుటచే బ్రహ్మాది లోకములు లభించును. నిర్గుణ బ్రహ్మ ధ్యానముచే బ్రహ్మ సాక్షాత్కారము కలుగును.

కాళా:- నిర్గుణ బ్రహ్మము మనస్సు యొక్క విషయము కాదు. ఆ బ్రహ్మమును ధ్యానించుట ఎట్లు?

స్వా. ప్ర. :- "**సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ, ఆనన్దో బ్రహ్మ**" అని బ్రహ్మ లక్షణమును శ్రుతులు వర్ణించినవి. సత్యము అనగా మూడు కాలముల యందును బాధించబడని తత్త్వము, జ్ఞానము అనగా ప్రకాశ స్వరూపము. అనంతము అనగా వ్యాపక స్వరూపము. ఆనందము అనగా సుఖ రూపము. ఇవి అన్నియును సామాన్యముగా బుద్ధి గోచరములే కదా!

కాళా:— అవును. ఇది బుద్ధి గోచరములే.

స్వా.ప్ర.:-ఇదేవిధంగా బ్రహ్మము సచ్చిదానంద స్వరూపము అని ధ్యానించవలెను.

రామ గీత చెప్పుచున్నది:-

***యద్ బ్రహ్మ నిర్గుణం ప్రోక్తం ద్వివిధం తత్ప్రవక్ష్యతే/***
***సలక్షణమితి ధ్యేయం ధ్యేయాతీత మలక్షణమ్ //***

"నిర్గుణ బ్రహ్మము రెండు రకములు. సచ్చిదానందరూపమున ధ్యానించబడునది సలక్షణము. ధ్యేయాతీతమగునది అలక్షణము."

కావున శాస్త్రముల యందు సచ్చిదానంద స్వరూపము అని చెప్పబడిన బ్రహ్మమును ధ్యానించవలెను.

# సరియగు అభ్యాస పద్ధతి

పూర్వము జిజ్ఞాసువులు అనుభవముకల జ్ఞాని వద్దకు వెళ్ళి ప్రశ్నించెడి వారు. వక్తకు అనుభవము ఉండుటచేతను, శ్రోత యందు వైరాగ్యము ఉండుటచేతను శ్రోత ఏకాంత

ప్రదేశమునకు వెళ్ళి అభ్యసించి సిద్ధిని పొందెడి వాడు. ఇప్పుడు ఎవరును ఇట్లు అభ్యసించుట లేదు. ఒక వేళ ఎవరైన అభ్యాసము చేసినను ఒకరోజు చేసిన పది రోజులు మాని వేయుదురు. ఇది అభ్యాసము అనిపించు కొనదు. అభ్యాసము ప్రతి దినము నియమిత సమయమున చిరకాలము శ్రద్ధగా నాచరించవలెను.

***"ఆరమ్భశూరాః ఖలు భారతీయాః"***

భారతీయులు ఆరంభశూరులు అని ప్రసిద్ధి. ఆరంభ శూరులు మొదటి పది రోజులు బాగుగా ప్రయత్నించెదరు. తరువాత విసుగెత్తి అభ్యాసము పేరైనను ఎత్తరు. ఇట్టి సోమరులు వైరాగ్యమను ఖడ్గముచే రాగ ద్వేషాది శత్రువులను పరిమార్చి మోక్షమను కోటను వశపరచుకొన లేరు.

## మోక్షమను కోటను జయించు పద్ధతి

కామక్రోధాది శత్రువులు మానవుని మోక్షపు కోట దగ్గరకు కూడ చేరనీయవు. కాని,

***ఆరూఢస్య వివేకాశ్వం తీవ్ర వైరాగ్య ఖడ్గినః|***

# ముప్పది మూడవ ప్రసంగము

***తితిక్షా వర్మ యుక్త స్య ప్రతి యోగీ న విద్యతే //***

"వివేకము అను అశ్వము పై కూర్చొని, తీవ్ర వైరాగ్యము అను ఖడ్గమును ధరించి, తితిక్ష (సర్వ దుఃఖములను సహించుట) అను కవచమును ధరించిన వానిని ఎవరును ఆపలేరు."

మామూలుగా మహాభారతము నందు యుద్ధ కథ వినువారు ఎంతో ఉత్సాహముతో శ్రవణము చేయుదురు. కాని కత్తులు ధళధళలాడుచు యోధుల శిరములు మొండెములనుండి వేరయి భూమి మీద పడుచు, జనుల రక్తము ప్రవహించుచు రణ కోలాహలముతో కూడి యున్న యుద్ధ మైదానములోనికి అట్టి వారిని తీసికొనివచ్చి నిలబెట్టినచో ఆ దృశ్యమును చూచి వారి హృదయము దడదడలాడును. వారు అచ్చటినుండి పారిపోవుదురు. ఇంక వారు చేతితో కత్తి పట్టి యుద్ధము ఎక్కడనుండి చేయుదురు?

ఉత్తరకుమారుని దృష్టాంతము ఇట్టిదే. కౌరవులు విరాటరాజు గోవులను తీసికొనిపోయిరి. వారిని ఎదిరించవలెనను ప్రసంగమున ఉత్తర కుమారుడు కౌరవులను ఓడించి ఆవులను వెనుకకు మరల్చు కొనివచ్చుట చాల సులభము అని గర్వోక్తులను నిండు రాజసభలో పలికెను. కాని కౌరవ సైన్యమును చూచినంతనే ఆ పరాక్రమము అణగిపోయి దాని స్థానమునకు పిరికితనము చేరుకొనెను. యుద్ధ మైదానము నుండి పారిపోవుటకు రథమును వెనుకకు త్రిప్పమని బృహన్నలకు (అర్జునునకు) ఆదేశించెను. బృహన్నల రథమును మరల్చుటకు అంగీకరించలేదు. ధైర్యముగా రథము పై కూర్చొనమని చెప్పెను. ఉత్తరకుమారుడు క్రిందికి ఉరికి పరుగెత్త దొడగెను. బృహన్నల ఉత్తరుని పట్టుకొని రథమునకు కట్టివేసెను. అంతట ఏడ్చుచు ఉత్తరుడు బృహన్నలతో నిట్లనెను:-

"నేను చిత్రములలో మాత్రమే యుద్ధమును చూచితిని. యథార్థమగు యుద్ధము నాకు తెలియదు. నిజమైన యుద్ధమున మహా వీరులతో

పోరాడవలెను. వారి ఆయుధముల దెబ్బలకు తట్టు కొనవలెను. వారిని జయించుటయును, జీవించుటయును చాల కష్టము అను సంగతి ఇప్పుడు నాకు తెలిసినది. ఈ ఆలోచన మొదట తట్టినచో ఇట్టి దుష్కరమగు కార్యము నిర్వహించుటకు సిద్ధపడెడివాడను కాను. ఇంటినుండి బైటికి వచ్చుటకు కూడ సాహసించెడివాడను కాను."

ఇదే విధముగ శాస్త్రాదులయందలి కథలలో వివేక వైరాగ్యములను గురించి వినినంతనే వాని యందు అభిలాషను పొందుదురు. కాని వివేక వైరాగ్యాదుల ద్వారా చిత్త వృత్తి నిరోధమునకు ప్రయత్నించ వలెనను సంగతి తెలిసినంతనే అది ఎంత దుష్కరమైనదో వారికి బోధపడును. చిత్త వృత్తిని స్థిరపరచుట ఏమియు అంత సామాన్య విషయము కాదు. మనోనిగ్రహము శూర వీరులు చేయగల పని.

శ్రుతి చెప్పుచున్నది:-

***యది వీరో అనుష్యాదగ్ని మిన్ధీత మర్త్యః।***

**ఆజుహద్ద్వమానుషక్ శర్మమక్షీత దైవమ్॥**

"వీరుడు ప్రభు ప్రాప్తి కొరకు ప్రబలమగు కోరిక అను అగ్నిని ప్రజ్వలింప జేయవలెను. నిత్యము కామ క్రోధాది వృత్తులను అందు హోమము చేయవలెను. అప్పుడే ఆతడు దివ్య సుఖమును పొందును."

ఈ లోకమునందు రాజ్యమును పొందుటకు ఎన్ని త్యాగములైనా చేయవలసి వచ్చును. మృత్యు భయము మొదలగునవి కలిగియుండని సతత పురుషార్థ శీలుడగు వానికే నశ్వరమగు తుచ్ఛ రాజ్యము చేజిక్కును. పిరికివాళ్ళను సామాన్య శత్రువులే దూరమునుండి నశింపు చేయుదురు. ఇటులనే వివేకము అను అశ్వము పై ఆరోహించి, వైరాగ్యము అను ఖడ్గమును చేతితో ధరించి, తితిక్ష అను కవచమును ధరించిన వానిని ఓడించు సామర్థ్యము ఏ శత్రువునకును లేదు ఆతనికి మోక్షము అను కోట తప్పక వశ పడును.

# ముప్పది మూడవ ప్రసంగము

శ్రీ ప్రకాశానంద స్వామి వారు ఇంకను ఇట్లు పలికిరి:- నేను ఏ శాస్త్రములను చదువ లేదు. అనుభవము కూడ నాకు లేదు. అయినను స్వామి వారు మాట్లాడకుండ కూర్చుని ఉన్నారు. నేను మాత్రమే మాటాడుచున్నాను.

***నిస్సార స్య పదార్థ స్య ప్రాయేణాడమ్బరో మహాన్/***
***న సువర్ణే ధ్వనిస్తాదృక్ యాదృక్కాంస్యే ప్రజాయతే //***

"సారము లేని తుచ్ఛ పదార్థమునకు ఆడంబరము ఎక్కువ ఉండును. బంగారము నుండి ధ్వని రాదు. కంచునుండియే పెద్ద ధ్వని వచ్చును కదా!"

నిత్యానంద స్వామి వారు శాస్త్రములను అభ్యసించి ఏకాంతమున కూర్చొని నిదిధ్యాసనము ద్వారా ఆత్మ సాక్షాత్కారమును పొందిరి. నేను మాత్రము చదువు సంధ్య లేకుండ లపోడ శంఖము వలె వాగుచున్నాను.

స్వా.ని.:- నా యందు పెద్దతనమును ఆరోపించి తమను చిన్న వారినిగా చెప్పుకొనుచున్నారు. ఇట్టి శబ్దముల ద్వారా తమను తక్కువ వారినిగా ఋజువు చేసికొనుట నాకు నచ్చలేదు.

కాళా:- లపోడ శంఖము అను మాట వింటిని. కాని దాని భావము మాత్రము తెలియదు,

స్వా.ప్ర.:—ఒక బీద బ్రాహ్మణుడు ఉండెను. అతనికి ధర్మము నందు చాల భక్తి శ్రద్ధలు ఉండెను. అతని భార్యయును ఏక మాత్రుడగు పుత్రుడును చనిపోయిరి. ఆయన మహాత్ముడగు ఒక యోగి చెంతకు వెళ్లి చెప్పెను.

నేను యోగాభ్యాసము చేయదలచి యున్నాను. కాని నాకు జీవిత నిర్వహణమునకు వలయు సాధన సంపత్తి లేదు. నా జీవికకు కఠిన పరిశ్రమయు, యోగాభ్యాసమును రెండును ఎట్లు జరుగును? మహాత్ముడు దయా సముద్రుడు,

ఆయన ఆ బ్రాహ్మణునకు ఒక మంత్రమును ఇచ్చి చెప్పెను. "వెళ్ళుము, నీవు సముద్రపు ఒడ్డున కూర్చొని పాలు మాత్రమే ఆహారముగా తీసికొనుచు 40 రోజులు ఈ మంత్రమును జపము చేసినచో నీకు శరీర పోషణమునకు అవసరమగు పదార్థములు లభించును."

బ్రాహ్మణుడు సముద్ర తీరమునకు వెళ్ళెను. యోగి ఇచ్చిన మంత్రమును పాలు మాత్రమే ఆహారముగా తీసికొనుచు శ్రద్ధగా జపించ మొదలిడెను. నలుబది రోజులు పూర్తి అయిన తరువాత సముద్ర దేవుడు ప్రత్యక్షమయి అడిగెను:-

"నీకు ఏమి కావాలి?"

బ్రాహ్మ:- "యోగాభ్యాసము చేయవలెనని నా కోరిక. కాని నాకు శరీర పోషణమునకు వలయు ఆధారము లేదు. అది దయ చేయుడు."

సముద్రుడు ఒక శంఖమును ఇచ్చి చెప్పెను:- ఈ శంఖమును నీవు రోజు

పూజించుము. ఇది రోజును నీకు అణా కాని యెత్తు బంగారము ఇచ్చును.

ఇట్లు చెప్పి సముద్రుడు అంతర్ధానము అయ్యెను.

బ్రాహ్మణుడు శంఖమును తీసికొని ఇంటికి బయలు దేరెను. త్రోవలో ఒక మోసగాడు కలిసెను. "స్వామీ! ఎక్కడ నుండి వచ్చుచున్నారు?" అని అతడు బ్రాహ్మణుని అడిగెను. బ్రాహ్మణుడు అమాయకుడు. ఆతడు పలికెను.

"ఒక మహాత్ముడగు యోగి ప్రసన్నుడయి ఒక మంత్రమును ఇచ్చెను. దానిని జపించుటచే సముద్ర దేవుడు ప్రసన్న డయ్యెను. ఆయన ప్రతిరోజున అణా కాణీ యెత్తు బంగారమును ఇచ్చు శంఖమును ఇచ్చెను."

మోసగాడు దానిని కాజేయవలెనను తలంపుతో బ్రతిమాలెను.

స్వామి! సాయం కాలము అయినది. చాలా

అలసిపోయిరి. ఈ రాత్రి మా యింట విశ్రమించి రేపు ఉదయముననే నిశ్చింతగా ఇంటికి వెళ్ళుడు.

బ్రాహ్మణుడు ఆ అభిప్రాయమును అంగీకరించెను. ఆతని ఇంట సాయంకాల భోజనమును కావించి తన సంచీని చిలుక కొయ్య తగిలించి నిశ్చింతగా నిద్రించెను. మోసగాడు బ్రాహ్మణుడు గాఢ నిద్రలో నున్న సంగతిని గ్రహించి ఆయన సంచిని తెరచి దేవతార్చన పెట్టెలోని శంఖమును సంగ్రహించెను.

తరువాతి రోజు ఉదయము ప్రాతః కాల కృత్యములను నిర్వహించుకొని మోసగాని దగ్గర సెలవు తీసుకుని ఇంటికి వచ్చెను. స్నానము చేసి దేవతార్చన పెట్టెను తెరచెను. అందు శంఖము కన్పించ లేదు. అంతట బ్రాహ్మణుడు చాలా దుఃఖముతో యోగి పుంగవుని దగ్గరకు వెళ్ళెను. తాను చేసిన జపము, అది సిద్ధి పొందుట, శంఖము దొంగిలింపబడుట ఇవి అన్నియును ఆయనకు సవివరముగా విన్నవించెను. మహాత్మునకు ఆతని అమాయకత్వము పై

దయగలిగి అతనికి మరియొక మంత్రము నిచ్చెను. ఆ మంత్రమునకు యథాప్రకారము అనుష్ఠానము నిర్వహించినంతనే సముద్ర దేవుడు ప్రత్యక్షమయి అడిగెను:-

నేను నీకు కొలదిదినములకు పూర్వము శంఖమును ఇచ్చితిని. మరల నీవు ఎందుకు వచ్చితివి?

బ్రాహ్మణుడు తనను మోసగాడు మోసగించిన వివరమును చెప్పెను.

సముద్ర దేవుడు పలికెను:- ఇప్పుడు నేను నీకు ఒక శంఖమును ఇచ్చుచున్నాను. అది 1¼ లక్ష తులములు అంత కంటె ఎక్కువ కూడ బంగారము ఇచ్చెదనని చెప్పును, కానీ ఇవ్వదు. నీవు దొంగ వద్దకు వెళ్ళి ఒకటింపావు లక్ష తులముల బంగారము ఇచ్చు శంఖమును తెచ్చితిని అని చెప్పుము. ఆతడు ఈ శంఖమును తీసికొని నీ శంఖమును ఇచ్చును.

బ్రాహ్మణుడు శంఖమును తీసుకొని ఇంటికి

బయలు దేరెను. దొంగ త్రోవలో కన్పడెను. బ్రాహ్మణుడు అతనికి కొత్త శంఖము సంగతి చెప్పెను. దొంగ శంఖము నందలి దురాశచే బ్రాహ్మణుని ఎంతయో ప్రార్థించి తన ఇంటికి తీసుకొని పోయెను. ఆయనకు ఫలహారాదులు సమర్పించి మిక్కిలి సేవ చేసెను. బ్రాహ్మణుడు గాఢనిద్రను అభినయించెను. అంతట మోసగాడు బ్రాహ్మణుని సంచిలో నుండి శంఖమును తీసికొని వెనుక తాను అపహరించిన శంఖమును అందుంచెను.

రెండవ రోజున బ్రాహ్మణుడు ఇంటికి బయలుదేరెను. దొంగ ఒకటింపావు లక్షల తులముల బంగారు లభించునను ఆశతో త్వరత్వరగా స్నానాది క్రియలను నిర్వహించి శంఖమును పూజించి పలికెను-

"శంఖమా! బంగారమును ఇమ్ము."

శంఖము చెప్పెను:-

ఇదిగో తీసికొనుము. ఒకటింపావు లక్షల

తులముల బంగారము.

మోసగాడు:--ఇమ్ము! ఒకటింపావు లక్ష తులముల బంగారమును ఇమ్ము!

శం:- ఒకటిన్నర లక్ష తులముల బంగారము తీసికొనుము.

మో:- ఇమ్ము. ఒకటిన్నర లక్ష తులముల బంగారము ఇమ్ము.

శం:--ఇదిగో, రెండు లక్షల తులముల బంగారమును తీసికొనుము.

ఇట్లు దొంగ అడిగిన కొలదియు శంఖము అంతకంతకు ఎక్కువ బంగారమును ఇచ్చెదనని చెప్పుచుండెను. చివరకు దొంగ విసుగెత్తి పలికెను.

"ఇచ్చుట లేదేమి?"

అంతట శంఖము పలికెను:-

***శఙ్ఖలీ కాఞ్చనం దద్యాత్ అహం శఙ్ఖలపోడకః|***

**వదామి బహువాక్యాని న దదామి కపర్ది కామ్//**

"ఆ చిన్న శంఖము బంగారమును ఇచ్చును. నేను లపోడ శంఖమును (పెద్ద శంఖమును). కబుర్లు ఎన్ని అయినను చెప్పెదను, కాని ఏమియును ఇవ్వను."

ఇంత వరకు సంభాషణ జరిగిన పిదప చాల రాత్రి అయినందున అందరును నిద్రించుటకు వెళ్ళిపోయిరి.

ॐ

# ముప్పది నాలుగవ ప్రసంగము

## వ్యసనము – బానిసత్వము

తరువాతి రోజున స్వామివారు మొదలగువారు అందరును కూర్చొని ఉండగా అక్కడకు టీ, పాలు మొదలైనవి తీసుకొని సేవకులు వచ్చిరి. శ్రీ నిత్యానంద స్వామి వారు టీ త్రాగరు. కావున వారికి పాలు ఇచ్చిరి. అటులనే శ్రీ ప్రకాశానంద స్వామి వారికి కూడ పాలు ఇచ్చిరి.

స్వా.ప్ర.:- నేను పాలు త్రాగను. నేను టీ దాసుడను.

స్వా.ని.:- అయిన నేను పాలదాసుడను.

స్వా.ని.:-పాలు త్రాగువారిని పాల దాసుడనరాదు. వ్యసనరూపమున ఏదైన వస్తువు సేవించిననే అట్టి వానిని ఆ వస్తువునకు

దాసుడనెదరు.

***కామకిఙ్కరతాం ప్రాప్య సకామః సర్వకిఙ్కరః/***
***కామే నైవ పరిత్యక్తో నిష్కామ కస్య కిఙ్కరః//***

"కోరికకు దాసుడయి సకాముడుగా నుండువాడు మాయిక పదార్థములకు అన్నిటికిని దాసుడే. కోరికలను త్యజించిన వాడు నిష్కామి. అతడు ఎవరికి దాసుడు? అనగా ఎవరికిని దాసుడు కాడు."

# అసుర గుణములు

టీ మొదలగునవి సాధారణ వస్తువులు కాని వాస్తవమనకు మాయిక పదార్థములయందు కోరికను కలిగియుండుటయే బానిసత్వమునకు లక్షణము. ఇది అసుర గుణము. ఒక అసురగుణము ప్రవేశించిన వెంటనే మిగిలిన అసురగుణములు అన్నియు ఒక దాని వెంట మరి యొకటి ప్రవేశించును. గీత 16వ అధ్యాయమున అసుర సంపదను వర్ణించుచు భగవానుడు ఇట్లు

చెప్పెను:-

***కామమాశ్రిత్య దుష్పూరం దమ్భమాన మదాన్వితాః/***
***మోహాద్గృహీత్వాఽసద్గ్రాహాన్ ప్రవర్తన్తేఽశుచివ్రతాః//***

"దుష్పూర్వమగు కామమును ఆశ్రయించినందున దంభము, మానము, మదము అను గుణములను పొంది పరిశుద్ధులుకాని అసురులు అవివేకముచే అశుభకరములగు నిర్ణయములను చేయుదురు. వారు వేద విరుద్ధములగు కార్యములయందు ప్రవృత్తులగుదురు."

దుష్పూరము:- జీవితమంతయు విషయములను అనుభవించినను విషయాభిలాష పూర్తి అవ్వదు. అట్టిది కామము.

***న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి /***
***హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే //***

# ముప్పది నాలుగవ ప్రసంగము

"ఎన్ని పదార్థములను అనుభవించినను కామము శాంతించదు. నేయి, కట్టెలు మొదలగునవి వేయుటచే అగ్ని వృద్ధి పొందునట్లు పదార్థములను అనుభవించుటచే కామము రోజురోజుకు వృద్ధి పొందును."

ధర్మమునందు నమ్మకము లేక పోయినను బైటి జనులకు చెప్పుటకు కర్మ, ఉపాసనాదులు చేయుట దంభము. యథార్థముగా పూజ్యత్వమును పొందుటకు అయోగ్యుడయినను జనులు ఎదుట తన పూజ్యత్వమును ప్రకటింపదలచుట మానము, తనయందు గొప్ప లేక పోయినను ఇతరులను నిందించి ప్రజల ఎదుట తన గొప్పను ప్రకటించు మనస్తత్త్వము మదము.

మోహము అనగా అవివేకము. దంభము, మానము, మదము ఈ మూడు అసుర గుణములను కలిగియున్నవారు మోహ మాత్రముచే నిస్సార పదార్థములను గ్రహించెదరు.

ఇట్టి అసురపురుషులు దురాగ్రహరూపమగు అశుభ నిశ్చయమును అవివేకమను మోహముచే గ్రహించి అసుర, ప్రవర్తన పరాయణులగుదురు. ఇట్టి అసుర వ్రతస్థులు వర్ణాశ్రమ ధర్మ రహితమును, వేద విరుద్ధమును అగు కర్మమునందు ప్రవృత్తులగుదురు.

ఇట్లు ఒక అసుర గుణము ప్రవేశించినంతనే మిగిలిన అసుర గుణములు అన్నియును ఒక దాని వెంబడి మరియొకటి. వచ్చి వేయును.

## అసుర గుణ పరంపర

ఒక సన్యాసి మఠమున ఒక వంటవాడు ఉండెడివాడు. అతనికి ఒక కుమారుడు ఉండెను. ఆ బాలుడు చిన్నతనము నుండియు స్వాముల సేవ యందు శ్రద్ధ కలిగి యుండెడివాడు. వారి వద్ద చదువు కొనెడివాడు. ఇట్లు ఆతడు విద్వాంసుడయ్యెను.

మఠము నందు స్వాములను జనాలు

ఎక్కువగా పూజించుటయును, గౌరవించుటయును చూచి ఆతనికి తాను సన్యాసి అయినచో జగత్తు నందు చాలా గౌరవము కలుగుననియు, మఠాధిపత్యమునొంది పూజించ బడవచ్చుననియు తోచెను. ఆ విధముగా తలచి ఆతడు సన్యాసమును తీసికొనుటకు నిశ్చయించెను. ఈ సంగతి తెలిసికొని తండ్రి మిత్రుడొకడు తండ్రితో నిట్లు చెప్పెను:-

"నీకు ఒక్కడే కుమారుడు. అతడు ఇప్పుడే సన్యాసమును తీసికొనుట మంచిది కాదు. ఇంకను సంసార సుఖమును అనుభవించుట మంచిది. ఆతనికి వివాహము చేయుము."

వంటవాడు సమాధానము చెప్పెను:-

పెండ్లి చేసిన ఒకే రోజున ఊరేగింపు బయలు దేరును. సన్యాసము తీసికొనిన నా కుమారునకు రోజును ఊరేగింపులు ఉండును. స్వామివారు వెళ్లిన ప్రతి చోటికి అనేక మంది భక్తులు చేరెదరు. ఆ ఊరేగింపుల ముందు ఈ

పెండ్లి ఊరేగింపు ఎంత?

తరువాత ఆ వంట వాని కుమారుడు సన్యసించి దండ, కమండలములను స్వీకరించెను.

కాని కొలది రోజులలోనే గురువుగారు మరియొక శిష్యుని తన మఠమునకు అధిపతిని జేసిరి. అంతట ఆతనికి నిరాశ కలిగి గురువుగారి వద్దకు వచ్చి చెప్పెను. "సమయము వచ్చినప్పుడు నేను ఒకటి కాదు, పది మఠములకు అధిపతిని అగుదును." ఇట్లు పలికి తన సామగ్రులను తీసికొని దూర ప్రదేశమునకు పోయి ఒక గ్రామమునకు బైట తపశ్శాలివలె డబాయించుకుని కూర్చొనెను, వచ్చిపోవు వారు ఆతడు ఎవడో మహాతపశ్శాలి అనుకొని ఫలములు, పుష్పములు, పాలు మొదలగునవి తీసికొనివచ్చి ఇచ్చెడి వారు. ఆతడు నిరాహారినని చెప్పుకొనుచు ఏమియును తీసికొనెడివాడు కాదు. అనుకొనిన విధముగా ఆతని స్నేహితుడు రాత్రి

ఎవరును లేనప్పుడు ఆహారమును తెచ్చి ఇచ్చెడివాడు. ఇదే విధముగా తన నిత్య క్రియలన్నియును ఎవరికిని తెలియకుండ నెరవేర్చుకొనెడివాడు.

గ్రామము బైట ఉన్న మహాతపశ్శాలి నిరాహారి అను విషయము అంతకంతకు బాగుగా వ్యాపించెను. ఈ సంగతి తెలిసిన కొలదియు జనులు గుంపులుగా ఆతని వద్దకు వచ్చెడివారు. ఆతడు తపస్సు చేయుచున్నట్లు నటించెడి వాడు. ఇట్టి దాంభిక తపశ్శాలురను గురించి భగవానుడు గీతలో చెప్పెను.

***సత్కారమాన పూజార్థం తపో దమ్భేన చైవ యత్ /***
***క్రియతే తదిహ ప్రోక్తం రాజసం ఛలమధ్రువమ్.//***

"సత్కారము, మానము, పూజ పొందుటకు దంభముతో చేయు తపము రాజసతపము అని శిష్టులు చెప్పుదురు."

సారాసార వివేకము లేకుండ అవివేకులు "ఆయన గొప్ప తపో నిష్ఠుడు." "ఈయనతో సాటి మరి ఎవరు? ఈయన శ్రేష్ఠుడు" మొదలగు శబ్దములతో స్తుతించుట సత్కారము.

గ్రుడ్డి నమ్మకము వారు ఇట్టివానిని తపశ్శాలి అనుకొని లేచి నిలబడెదరు, స్వాగతము ఇచ్చెదరు, గౌరవించెదరు, నమస్కరించెదరు, స్వాగత పత్రములను ఇచ్చి వారి గుణములను వర్ణించెదరు. స్తుతించెదరు. ఇది మానము.

అవివేకులు శాస్త్రజ్ఞానము లేని అటువంటి వ్యక్తికి పాద ప్రక్షాళనము చేయుట, చరణోదకమును పానము చేయుట, పత్రపుష్పాదులచే షోడశోపచారపూజనము మొదలగునవి చేయుదురు. కానుకలను సమర్పించెదరు. హారతులు ఇచ్చెదరు. వారి ఆజ్ఞల ప్రకారము సంచరించెదరు. ఇది పూజ.

ఇట్లు తపశ్శాలి అంతరంగమున మాన ప్రతిష్ఠాదుల కోరిక అపారముగా నున్నను

అజ్ఞానులు ద్రవ్యాదులు అర్పణము చేసినప్పుడు పైపైన వైరాగ్యమును ప్రకటించుచు "మావంటి సన్యాసులు ద్రవ్యమును తీసికొనరాదు" అని చెప్పెను. శాస్త్ర ప్రమాణాలు చూపి సన్యాసి ద్రవ్యమును పుచ్చుకొనిన పతితుడగుననియు, ద్రవ్యము నరకములోనికి త్రోసివేయుననియు చెప్పెడివాడు. ఇట్లు వైరాగ్యమును చూపుటచే అతని యందు ప్రజలకు శ్రద్ధ పెరిగిపోయెను. ఇంతలో చాతుర్మాస్యలు సమీపించెను. గ్రామస్థులు అతనిని ప్రార్థించిరి:-

"స్వామి! తాము చెట్టు క్రింద ఎండకు నివసించుచున్నారు. కాని ఇక చాతుర్మాస్యలు వచ్చుచున్నవి. మాపై కృప జూపి మా గ్రామములోనికి విచ్చేయుడు. తమకు ప్రత్యేకముగా ఒక గృహమును ఏర్పాటు చేయుదుము.

ఆ మహాత్ముడు గ్రామము లోనికి వచ్చుటకు ఇష్టపడ లేదు. వారి కోరిక ప్రకారము గ్రామము బైట ఒక శిథిల గృహమున వారి నివాసము

ఏర్పరచుటకు నిశ్చయించబడెను. అంతట ప్రజలయందు కల కథా శ్రవణాభిలాషను చూచి ఆతడు తలచెను. సులభముగా జగత్ప్రసిద్ధిని పొందుటకు ఇది మంచి సాధనము. అయినను లోలోపల తనకు ఉన్న కోరికను పైకి ప్రకటించక జనులు కోరినప్పుడు దంభమును చూపుచు "అట్లు చేయను" అని చెప్పెడివాడు. ప్రజలు మిక్కిలి కోరినప్పుడు వారి యందలి కృపచే వారి కోరికను మన్నించెడి వాడు. పైకి మాత్రము "***న వ్యాఖ్యాముపయుఞ్జీత/***" అని చెప్పబడినది. మావంటి సన్యాసులు ప్రవచనము చేయ రాదు. కాని మీ అందరకు వినవలెనను కోరిక ఉన్నందున లోక కళ్యాణార్థము చెప్పుచున్నాను అనెడివాడు. ఇట్లు కపటోపాయముతో కూర్చొనిన బ్రహ్మవేత్తలు చేసిన బ్రహ్మోపదేశము వ్యర్థము. వారు స్వయముగా అజ్ఞానులే కదా! విద్వాంసులు అట్టి వారిని కుక్కతో పోల్చిరి.

## ముప్పది నాలుగవ ప్రసంగము

***అబధ్యకృత్రిమసటా జటిలాంసభిత్తి రారోపితో మృగపతేః పద వీం యది శ్వా।***
***మత్తేభ కుమ్భత టపాటన లమ్పటస్య నాదం కరిష్యతి కథం హరిణాధిపస్య ॥***

"సింహచర్మమును ధరించి కుక్క సింహము వలె కన్పట్టిన కన్పట్ట వచ్చును. కాని మదోన్మత్తమగు గజము యొక్క కుంభ స్థలమును బ్రద్దలు కొట్టు సింహము చేయు గర్జన ఎచ్చట నుంచి నేర్వగలదు?"

సింహచర్మమును ధరించిన కుక్కను చూచి పిల్లలు సింహము అని తలచి భయపడెదరు. కాని తెలివికల ప్రౌఢులు అది కపట సింహము అని తెలిసికొని మామూలు కుక్కగనే గణించి తోలి వేయుదురు. అటులనే దాంభికులగు ఉపదేశకులు బుద్ధి మంతులను మోసము చేయలేరు. చివరకు వారి కపట భిక్షుక స్వరూపము బైట పడిపోవును.

ఆ కపట సన్యాసి ఆ చాతుర్మాస్యలలో గీతా ప్రవచనము చేసి చాల మందిని ఆకర్షించెను.

ఆయన కీర్తి చుట్టుపక్కల నున్న అనేక గ్రామములలో వ్యాపించెను. అయినను అంతటితో ఆతడు సంతోషించలేదు. ఒక విద్వాంసునిలె కాక సిద్ధ పురుషునివలె ప్రజల పూజలను పొందవలెనను కోరిక ఆతని హృదయమున ప్రబలెను. అంతట తరువాతి చాతుర్మాస్యల యందు ఆతడు ప్రజలతో నిట్లు చెప్పెను:-

ఇక నేను ప్రవచనాది ప్రవృత్తులను పొందను. వానిచే మావంటి సన్యాసులు పరబ్రహ్మధ్యానమును చేసికొనుటకు విక్షేపము కలుగును. ఇచ్చుటకు కొలది దూరమున ఉన్న పర్వతము నందలి ప్రాచీన గుహ యందు ఏకాంత వాసము చేసి ధ్యానయోగమును అనుష్ఠించెదను.

జనులు ఈమాటలు విని ఖేదమును పొందిరి. భక్తితో స్వామి వారిని ప్రార్థించిరి:- ప్రభూ! తమ కోరిక అట్లు ఉన్నచో మావలన తమ

ధ్యానమునకు భంగము రానీయము. కాని అందరియందును దయయుంచి ప్రతి రోజును మాకు దర్శనము ఇండు.

మనస్సులో సంతోషించుచు ఆ దాంభికుడగు తపశ్శాలి గాంభీర్యమును ప్రకటించుచు పలికెను:-

“సరే, మీ అందరి కోరిక ప్రకారము నేను ప్రతి రోజును ఉదయము ఏడు గంటల నుండి ఎనిమిది గంటల వరకు ఒక గంట మాత్రము గుహనుండి బైటకి వచ్చెదను. అప్పుడు మీరు నా దర్శనము చేయ వచ్చును. అటు తరువాత నేను ధ్యానమున లీనమగుదును. మహాత్ముడు తమయందు చూపిన కృపకు జనులు ఎంతయో సంతసించిరి. అప్పటి నుండి ఆ మహాత్ముని దర్శనమునకు నిత్యము వేలకొలది జనులు వెళ్లు చుండిరి. మహాత్ముడు నిర్దిష్ట సమయమున మాత్రమే దర్శనమిచ్చు ననియు, మిగిలిన రోజంతయును ధ్యానమునందు నిమగ్నులయెదరనియును వినిన జనులకు చాల

ఉత్సాహము కలిగెను. గుహవైపు వెళ్లు త్రోవ అంతయు పూజాసామగ్రుల దుకాణములతో నిండిపోయెను. భావుకులగు జనులు స్వామివారికి ఏదియో ఒకటి సమర్పించి పరమ పుణ్యాత్ములము అయితిమి అని అనుకొనెడివారు. ఆ ధూర్త మహాపురుషుడు బైటికి ఉపేక్షాభావమును వ్యక్తము చేయుచున్నను లోలోపల అనేక విధములగు పూజల కొరకును, కీర్తిని పెంచుకొనుటకును ఆలోచించెడివాడు. మనస్సునందలి వాసనలు పోనంతవరకు ధ్యానము ఎక్కడ నుండి సిద్ధించును?

***కీర్తి పూజాభిమానార్థైః లోకయాత్రానురఞ్జితైః।***
***బోధచక్షుర్విలుప్తం యైః తేషాం జ్ఞానే న యోగ్యతా ॥***

"తన కీర్తి, ప్రతిష్ఠ, అభిమానము- వీని యందు ఆసక్తి కలిగి చాలమంది తన దర్శనమునకు రావలెననియు, అందరూ తనను కొలువ వలెననియు తలచి, అందు సంతోషమును

పొందువాని జ్ఞానమను కన్ను నశించును. ఆతనికి ధ్యానము చేయు యోగ్యత లేదు."

***లోకానురఞ్జకైః పాపైః కర్మభిర్గౌరవం శ్రితాః।***
***అరఞ్జితనిజస్వాన్తా అక్షార్థ గహనే రతాః ॥***
***అనుద్ధృత మనశ్శల్యా అకృతాధ్యాత్మ నిశ్చయాః ।***
***అభిన్నభావదుర్లేశ్యా నిషిద్ధా ధ్యాన సాధనే॥***

"జనులను సంతోషపరచు పాపకర్మలచే గొప్పతనమును పొందువారును, తమ చిత్తమునకు ఆత్మయందు ప్రసన్నత కలుగ జేయనివారును, ఇంద్రియ విషయములనెడు దుర్గమ మార్గమున ఉన్న వారును, మనశ్శల్యమును తీసివేయని వారును, ఆధ్యాత్మ నిశ్చయమును చేయని వారును, హృదయము నుండి దుర్భావములను బహిష్కరించని వారును ధ్యానము చేయ నర్హులు కారు."

***నర్మ కౌతుక కౌటిల్య పాపసూత్రోపదేశ కాః ।***
***అజ్ఞాన జ్వర జీర్ణాఙ్గా మోహనిద్రా స్తచేత నాః ॥***

***అనుద్యుక్తా స్తపః కర్తుం విషయగ్రాసలాలసాః।***
***సనంగాః శఙ్కితా భీతా మన్యేఽమీ దైవవఞ్చితాః॥***
***ఏతే తృణీకృత స్వార్థా ముక్తి శ్రీ సంగ నిఃస్పృహాః।***
***ప్రభవన్తి న సద్ధ్యాన మన్వేషితుమపి క్షణమ్ ॥***

"హాస్యము, కౌతుకము, కుటిలత్వము, హింస మొదలగు పాపముల యందు ప్రవృత్తిని కలుగ జేయు శాస్త్రములను బోధించు వారును, అజ్ఞాన జ్వరముచే బాధపడు వారును, మోహ నిద్ర యందుండి బుద్ధిని కోల్పోయిన వారును, తపమునందు సోమరులును, విషయలాలసులును, శంకా పరిగ్రహసహితులును, వస్తునిశ్చయము చేయనివారును, భయభీతులును, దురదృష్టవంతులు. వీరి దృష్టిలో తమ హితము గడ్డి పోచ వలె హీనమయినది వీరు మోక్షలక్ష్మి

సమాగమమునకు విముఖులు. పై విధముగ ఆచరణ కల క్షుద్రులు ఒక క్షణమైనను ధ్యానము చేయలేరు.

ఇట్లు ప్రజలను మోసపుచ్చుచున్న ఆ ధూర్తవిద్యా ప్రవీణుడగు మహాత్ముని రెండవ చాతుర్మాస్యకూడ గడచెను. అనంతరము ప్రజలు వారిని తమ నెలవుకు రమ్మని బ్రతిమాలు కొనిరి.

“ప్రభూ! ఈ ప్రదేశము గ్రామమునకు దూరము. ఇచ్చుటకు వచ్చుటకు ప్రజలకు కష్టముగా నున్నది. గ్రామవాసులమగు మా యందు దయ యుంచి గ్రామము బైట ఒక చిన్న కుటీరమును నిర్మించుకొని ఉండుడు.

ఆ మహాత్ముడు గొప్పకు “మాకు ఇంటితో పని ఏమి!” అని ప్రశ్నించెను.

సన్యాసికి గృహాదులు నిషిద్ధములు.

భాగవతము “**గృహం శరీరం మానుష్యమ్**” అని చెప్పబడినది. ఈ మనుష్య శరీరమే గృహము. దత్తాత్రేయులవారు 24

గురువులలోను సర్పమును కూడ గురువుగా భావించిరి.

***గృహారమ్భో హి దుఃఖాయ విఫలశ్చా ధ్రువాత్మనః |***
***సర్పః పరకృతం వేశ్మ ప్రవిశ్య సుఖమేధతే॥***

"అనిత్యమగు ఈ శరీరమునకు గృహాదులను నిర్మించపూనుకొనుట నిష్ఫలము. ఎలుకలు మొదలగు ఇతర జీవులు నిర్మించిన బిలమున ప్రవేశించి సర్పము సుఖముగ జీవించును."

ఇతరులు నిర్మించిన శిథిలగృహము ఏదైన ఉన్న యెడల సన్యాసి అందు ఉండవచ్చును అని శాస్త్రజ్ఞుల అభిప్రాయము. అది కూడా వర్ష కాలమునందును, శీత కాలమునందును మాత్రమే. వేసవికాలము నందు ఏదో ఒక చెట్టు క్రింద పడి ఉండవలెను. ఈ విషయమున లోమశమహాముని దృష్టాంతమును వినుడు:-

# ముప్పది నాలుగవ ప్రసంగము

లోమశ మహర్షి యొక్క ఆయుర్దాయము సుదీర్ఘమైనది. ఆయన ఒక గడ్డి చాప తయారుచేసి కొని సూర్యుని ఎండ తనపై బడకుండుటకు ఉదయమున తూర్పు వైపున ఉంచెడివాడు. ఎండనుబట్టి ఆ చాపను మార్చెడివాడు. సాయంకాలమునకు ఆ చాపను పశ్చిమమున ఉంచెడి వాడు. వారి దర్శనము చాల కష్టము. ఒకానొకప్పుడు కృష్ణ పరమాత్ముడు అర్జునునితో ఆయన దర్శనమునకు వెళ్ళెను. ప్రసంగవశమున కృష్ణుడు ఇట్లనెను:-

"ఈ గడ్డి చాప కంటె ఒక చిన్న కుటీరమును నిర్మించుకొని మీరు అందుండిన మంచిది."

లోమశ:- ఈ అనిత్య శరీరము కొలది కాలములో క్షయమును పొందును. దీని కొరకు నేను కుటీరము తయారు చేయు జంజాటములో ఏల పడవలెను?

త్యాగుల చరిత్ర ఈ విధముగా ఉండును.

# దంభముచే ధర్మము చెడును

వృక్షము క్రింద కాని, శూన్య ప్రదేశము నందు కాని ఉండుట మా ధర్మము” అని ఆ కపట సన్యాసి కుటీరమును నిర్మించనివ్వలేదు. తన వాదమును బలపరచుకొనుటకు సైతాను శాస్త్ర వచనములను సంపాదించగలడు (Devil Quoting scriptures.) అని ఇంగ్లీషులో చెప్పబడినది అక్షరాల నిజము.

కాని జనాలు వారిని పట్టుబట్టిరి- ప్రభూ! తమకు అన్ని ప్రదేశములును సమానములే. కాని చాతుర్మాస్యలలో దర్శనము చేయుటకు వచ్చిన వారు శ్రమ పడుచున్నారు. మా యందు దయ యుంచి గ్రామములోనికి దయచేయుడు.

అంతట ఆతడు చెప్పెను:— “నేను గ్రామములోనికి రాను. అందమగు ఇంటిలో నుండుట ఆశ్రమ ధర్మము కాదు. గ్రామము దగ్గర ఎవరును ఉండని మందిరము కాని ఏకాంత ప్రదేశము కాని ఉన్నచో అచ్చటకు వచ్చెదను.

అంతట జనులు అచ్చటనున్న ఒక పాడుపడిన ఇంటిలో ఆ సన్యాసికి ఏర్పాట్లు చేసిరి. అతడు అందు నివసించ మొదలిడెను.

## ధర్మ భంగముతోపాటు వ్రతభంగము

చాతుర్మాస్యలయందు కూడా ఉండు వారందరు ఆతని సేవకులైరి. వారందరును విన్నవించిరి. “ప్రభు కథా శ్రవణమునకు వచ్చు జనులకు కూర్చొనుటకు చాలా బాగుగా నున్నది, ఎవరితోను సంబంధము లేని ఒక మఠమును నిర్మించిన బాగుండును. సర్పము వలె ఇతరులు నిర్మించిన ఆశ్రయమున సన్యాసి నివసించవలెనని తమరే సెలవిచ్చిరికదా! మేము అందరమును కలసి మఠమును నిర్మించెదము. పిదప తాము దానియందు వేంచేయుడు. శ్రద్ధా భక్తి సమన్వితులగు జనులు అచ్చటకు వచ్చి కథా శ్రవణము చేయుదురు. కొంచెము విశ్రాంతి కూడ తీసికొనెదరు. ఇదంతయు జన కళ్యాణము కొరకే.

ఇందు తమకు ఇచ్చునది కాని, తీసుకొనునది కాని లేదు. ఇది తమకు ఉపాధిగా పరిణమించదు."

ఆతడు పలికెను:- సరే, మీ యిష్టము.

అంతటితో ఒక పెద్ద మఠము నిర్మించబడెను. సన్యాసి, అందు నివసించెను. తరువాత క్రమక్రమముగా జాగీర్లు, గుర్రములు, బండ్లు, మొదలగునవి కూడ వచ్చెను. ఆయన వద్ద పది పదిహేను మంది సన్యాసము తీసుకొనిన శిష్యులు కూడ బయలు దేరిరి.

## కలి కాలపు తత్త్వ వేత్తలు

కలియుగము నందలి తత్త్వ వేత్తలను గురించి సౌరపురాణమున వ్యాస భగవానుడు ఇట్లు చెప్పెను.

***మఠాధిపత్యం సేవా చ ధన సంగ్రహ ఏవ చ।***
***దాసీ గమన మీర్ష్యాచ షఢ్విధా తత్త్వవాదినః॥***

"మఠాధిపత్యము, సేవ, ధనసంపాదన, దాసీ గమనము, ఈర్ష్య, ఈ 5 గుణములు కల వారును కలియుగ మందలి అజ్ఞానులచే తత్త్వవేత్తలన బడుదురు."

"మేము మఠములను నిర్మించుట లోక కళ్యాణము కొరకు. సంసారులు మఠములోనికి వచ్చి సంసార దుఃఖములనుండి విముక్తిని పొందుటకు ప్రభువును స్మరించెదరు. సన్యాసులకు కూడ భిక్ష, నిలచుటకు నీడ ఉండును. కావున మఠములను నిర్మించుట మా ధర్మము." అని మఠ నిర్మాణమును ఈ తత్త్వవేత్తలు సమర్థించెదరు. మఠాధిపతులైన పిమ్మట సేవకులకు కూడ అనేక విధములగు గృహాదులను నిర్మింప జేయుదురు. ఏకాదశి, శివరాత్రి, గురు పూర్ణిమ మొదలగు పర్వదినముల యందు శిష్యులను పిలచెదరు. వారి నుండి వీలగు సేవలను పొందెదరు. పిమ్మట శిష్యులు జనులను మోసపుచ్చి, పాఠశాల, గోశాల, అన్న సత్రము మొదలగు వంకలతో ధనమును

సంపాదించెదరు. ఆ ధనముతో ఆదాయమునిచ్చు భూములు, జాగీర్లు, అద్దెనిచ్చు భవనములు మొదలగునవి కొనెదరు. ఇట్లు ధనసంగ్రహము చేయుటతో ఇట్టి ఐశ్వర్యము నందు ఆసక్తి కలుగును. తన కంటె ఏ సన్యాసైన ఎక్కువ ఐశ్వర్యమును కాని, గౌరవమును కాని పొందుచున్నచో అతనియందు ఈర్ష్య కలుగును. ఆతని కంటె ఎక్కువ ఐశ్వర్యమును, గౌరవ ప్రతిష్టలను పొందుటకును, ఆ గౌరవ ప్రతిష్ఠలు కలవానికి అగౌరవము కలుగుటకును వలయు ఉపాయములను ఆలోచించెదరు. ఇట్టి పతితులగు సన్యాసులు తమోగుణ విశిష్టులు.

“***అధర్మం ధర్మమితి యే మన్యన్తే తమసావృతాః***” అని గీతలో చెప్పినట్లు అధర్మమును ధర్మముగ భావించుచు తమోగుణ ప్రధానులగు ప్రాకృత జనులు వారు మహాతత్త్వవేత్తలు అనుకొనెదరు. ఆ సన్యాసికి తమ ధనాదులు అర్పితము చేసి తాము

కృతకృత్యులమయితిమి అనుకొనెదరు. వారు తమ సేవలను స్వీకరించుట తమ భాగ్యమను కొనెదరు. ఎంతయో శ్రమపడి సంపాదించబడిన ధనము సద్వ్యయమయ్యెనని సంతోషించెదరు.

వ్యాస భగవానుడు సౌర పురాణమున చెప్పెను:-

***జాత మాత్రం నరం కంచిత్ ముణ్డయిత్వా మఠాధిపమ్ /***
***కాషాయ వస్త్ర మాత్రేణ కరిష్యన్తి నరాధమాః॥***

అప్పటికప్పుడు పుట్టిన మనుష్యులను ఆతని శీలాదులను పరీక్షించ కుండనే, ముండనము చేసి, కాషాయ వస్త్రమును ధరింపజేసి నరాధములగు కలికాలపు సన్యాసులు మఠాధిపతినిగ చేయుదురు.

తులసీ రామాయణమున కలియుగపు సన్యాసులను గురించి కాకభుశుండి గరుడునితో చెప్పెను.

సన్యాసులు మహాధనవంతులయి పెద్ద పెద్ద

భవనములను కట్టించెదరు. వారు వైరాగ్యమును హరింతురు. తపశ్శాలురు ధనవంతులగుదురు. గృహస్థులు దరిద్రులగుదురు. కలియుగమునందలి కౌతుకము వర్ణించనలవి కాదు.

# వ్రత భంగము

అనంతరము గీతాప్రవచనము ఆరంభమయ్యెను. ఈ విధముగా నాలుగు దిశలకును, దేశ దేశాంతరములకును స్వామి వారి ప్రసిద్ధి వ్యాపించెను. ఇతర గ్రామముల నుండి జనులు వారి దర్శనమునకు వచ్చి తమ గ్రామమునకు దయచేసి మా గ్రామమును పావనము చేయుడని ప్రార్థించిరి. ఇతర గ్రామములయందు తాను పూజించబడవచ్చుని ఆ సన్యాసి అందుకు అంగీకరించెను. వారి సూచన ప్రకారము శిష్యులు ఆ గ్రామస్థులకు ఇట్లు చెప్పిరి. గురువు గారు మీ గ్రామమునకు వచ్చెదరు. మీరు వెళ్ళి వారి స్వాగతమునకు వలయు ఏర్పాట్లు చేయుడు. గ్రామమును

తోరణములతోను, జండాలతోను అలంకరించుట, గురువుగారిని గౌరవించుట మన ధర్మము. ఈ ఏర్పాట్లు చేయించి ఆతడు అచ్చటకు వెళ్ళుచు గొప్ప ఊరేగింపు లేవదీసెను. స్వాగతపు ఊరేగింపులో బాజాలు ముందు వాని తరువాత అనేక మంది శిష్యులు సేవకులు వరుసలో నడచిరి. వారి తరువాత, రెండు గుర్రముల బండిలో గురువుగారు. వారి అందరి వెనుక అనేకమంది స్త్రీలు, గుంపులు గుంపులుగా పాటలు పాడుచు నడచిరి. ఇట్లు ఎంతో గౌరవముగా ఆ గ్రామము ప్రవేశించెను. తరువాత శిష్యుల ద్వారా కానుకలు ఇచ్చు పద్ధతి తెలియ జేసెను. జనులు వారి ఆజ్ఞలను పాలించిరి. కాని కొందరు బీదలు తమ శక్తి ననుసరించి కానుకలు తెచ్చిరి. అది చూచి గురువుగారు ఇట్లనిరి. తమ కళ్యాణమును కోరు నరులు గురువునకు సేవ చేయుట యందు ధనాదులను వ్యయమును చేయుటకు ఏ మాత్రమును వెనుదీయరు. ఈ ధనమును గురువుగారు తమ కొరకు

వినియోగించరు. సాధువులకును, సన్యాసులకును భోజనము పెట్టుటకును, గోశాలలు, పాఠశాలలు మొదలగునవి నిర్మించుటకు మాత్రమే ఉపయోగించెదరు. ఈ విధముగా మీ ఐశ్వర్యము ఖర్చు అగును. కావున నిశ్శంకగా ధర్మార్థము విత్త శాఠ్యమును చూపకుండ ద్రవ్యమును అర్పించ వలెను.

ఈ విషయమున శివపురాణమున చెప్పబడినది.

***విత్త శాఠ్యం న కుర్వీత యదీచ్ఛేత్పరమాం గతిమ్।***

"పరమగతిని పొంద గోరువారు విత్త శాఠ్యమును కలిగియుండ రాదు." ఇట్టి ఉపదేశములచే ప్రేరేపించి జనుల ద్వారా నానావిధ సామగ్రులను సంపాదించెను. అది స్వీకరించి ఆతడు తన గ్రామమునకు తిరిగి వెళ్ళుటకు తయారయ్యెను. గ్రామస్థులు కొలది కాలము ఆగి తమను ఉపదేశములతో తరింప

జేయుడని ఆతనిని ప్రార్థించిరి. శ్రోత్రియులును, బ్రహ్మనిష్ఠులును అగు గురు శ్రీవారు దయచేసి ఒక మాసము ఆగుటకు నిశ్చయించిరి. "ప్రతి దినము ఉదయము 8 గంటల నుండి 9 గంటల వరకు, సాయంకాలం 6 గంటల నుండి 7 గంటల వరకును బ్రహ్మవిద్యా ప్రవచనము జరుగును. అందరును దయచేసి అమృత వాక్కులను విని ధన్యులుకండు" అని దండోరా వేయించిరి. దానితో పాటు "పూజ్యశ్రీ చరణ దర్శన సౌభాగ్యము కూడ లభించును. ఇట్టి సదవకాశము మాటిమాటికి దొరకదు." అనికూడా చాటించిరి. ఉదయమున సాయంకాలమున, ప్రవచనము జరిగెడిది. స్వామివారు శిష్యుల ద్వారా తెలిపిరి. " మీ భక్తి స్వామి వారికి ఇబ్బంది అయినను ఇచ్చుట ఆపినది. సరియగు భవనము లేనందున గురువుగారికి కష్టముగా నున్నది."

గ్రామవాసులు ఇట్లనిరి:- "అయిన వారికి సదుపాయముగా నుండుటకు ఒక భవనమును

నిర్మించెదము. గురువు గారు తరుచు వచ్చుటకు వీలుపడును.”

ఈ విధముగ అచ్చట ఒక మఠము నిర్మించబడెను. అటులనే ఆయన వెళ్ళిన ప్రతి ప్రదేశమును మఠములు నిర్మించబడెను. తరువాత తన వద్ద శాస్త్రమును అభ్యసించిన శిష్యులను మఠాధిపతులనుగా అచ్చట నియమించెను. శిష్యులు కూడ ఉదయ సాయంకాలము లందు ఉపన్యాసములు ఇచ్చి, పర దేశములకు వెళ్ళి ప్రవచనములు చేసి ధనమును పుష్కలముగా సంపాదించిరి. ఈ విధముగా కొలది కాలముననే ఆతడు మహా సమృద్ధి మంతుడయ్యెను. కాశీ, ప్రయాగ మొదలగు పుణ్య క్షేత్రముల యందు కూడ పది, పదిహేను మఠములను కట్టించి తన ప్రతిష్టను పూర్తి చేసికొనెను. ఈ శిష్యులును, సేవకులును ఎల్లరును గురువుగారిని ఎంతయో గౌరవించుచుండిరి. అజ్ఞానుల ద్వారా లభించిన

ఈ గౌరవముచే అతనికి మదము వృద్ధి పొందెను. అంతట ఆతడు "శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య 108, బ్రహ్మ విద్వరిష్ఠ" అను బిరుదమును స్వీకరించెను.

## మదాంధుని ప్రవర్తన

గురుశ్రీవారు. వెళ్ళిన ప్రతి చోటికి వారికొరకు ప్రత్యేకముగా నిర్మించబడిన సువర్ణ పీఠమును తీసికొని వెళ్లెడివారు. దానిపై కూర్చొని వారు ఉపన్యసించెడివారు. పొరబాటున ఏ జ్ఞాని అయినను, సన్యాసి అయినను వారి దర్శనమునకు వచ్చిన తాను మఠాధిపతిననియును, సమృద్ధిమంతుడగు ఆచార్యుడను అనియును అనుకొని, ఆ వచ్చినవాడు తుచ్ఛుడగు భిక్షుకుడని భావించి తాను పీఠముపైననే కూర్చొనెడి వాడు. వచ్చిన వానిని క్రింద కూర్చుండబెట్టెడివాడు. ఎక్కువ చాతుర్మాస్యలు చేసిన వాడును, విద్వాంసుడును, వైరాగ్యవంతుడును అయినను

శంఖముద్రాదులతో సహితముగా ఆతని నమస్కారములను పొందెడివాడు. గృహస్థుడెవడైన నిలబడి నమస్కరించిన, ఇది మూర్ఖ నమస్కారము అని పలికి సాష్టాంగ నమస్కారము చేయించుకొనెడి వాడు. తాను ఎవరికిని నమస్కరించెడి వాడు కాడు. ఒకనాడు ఒక అవధూత అచ్చటికి వచ్చి ఇదంతయును చూచుచు నిలబడి యుండెను.

శిష్యులు అతనితో ఇట్లనిరి:-“ "వచ్చిన వాడవు అట్లు జడ పదార్థమువలె కదలక నిలబడియున్నా వేమి? భగవత్స్వరూపులగు ఆచార్యులవారికి నమస్కరించుము.”

అవధూత:- ఈతడు సర్వవిధముల పతితుడు. ఇతనిని చూచినందున నేను ప్రేతస్నానము చేయవలెను. ఇతనికి నమస్కారము చేయుటకూడనా?

శిష్యులు:— పూజ్యపాదుల శ్రీ సమృద్ధులను చూచి నీకు అసూయ కలిగినది.

ఇది విని అవధూత నవ్వెను:- "కుక్క కక్కిన కూడును తినును. అది చూసి అసూయపడు వాడు ఎవడు? మీరందరు కక్కిన కూడును తినువారు."

అంతట ఇతర శిష్యులు పలికిరి:— "నీవు సన్యాసిని నిందించుచున్నావా?"

అవధూత:- ఈ జగమున సన్యాసియగువాడు నిందించ బడడు. ఇటువంటి వారు వైరాగ్యము లేకుండ వేషము మాత్రము వేసికొని నింద్య కార్యములను ఆచరించి నిందితులగుదురు. ఇంతియే కాదు. ఇట్టివారు యమదండన పాల్పడుదురు.

ఇట్లని అవధూత వెళ్లిపోయెను.

శుక్రనీతి చెప్పుచున్నది:-

***మాన మత్తో మన్యతే స్మ తృణవచ్చాఖిలం జగత్ |***
***అనర్హోఽపి చ సర్వేభ్యః పాద్యార్ఘ్యాసన మిచ్ఛతి ||***

"మానమత్తులు మానవ ప్రపంచము

తృణమువంటిది అని అనుకొనెదరు. అర్హత లేక పోయినను అందరివద్ద నుండియు అర్ఘ్య, పాద్య, ఆసనాదిపూజలను కాంక్షించెదరు."

ఇట్లు ఆ మదాంధుడు సత్పురుషులను అవమానించెడివాడు. ధనవంతు లెవరైన వచ్చినచో వారిని దగ్గర కూర్చుండబెట్టుకొని ప్రేమతో కుశలప్రశ్నలను అడిగెడివాడు. వారిని ఆదరించెడివాడు.

## అసుర సంపద

జగమునందలి ఇట్టి అసుర సంపచ్చాలురను చూచి శ్రీధరస్వామి అను మహాపురుషుడు తనపై నిడికొని ఇట్టి వారిని వర్ణించెను:-

**దమ్భన్యాసమిషేణ వఞ్చిత జనం భోగైక చిన్తాతురం**
**సంముహ్యాన్త మహర్నిశం విరచితో ద్యోగక్లమైరా కులమ్ /**

# ముప్పది నాలుగవ ప్రసంగము

***ఆజ్ఞాలఙ్ఘన మజ్జమజ్జ జనతా సమ్మాననాత్సంమదం***
***దీనం నాథ దయానిధాన పరమానన్ద ప్రభో పాహి మామ్॥***

"నేను కపట సన్యాసము అను మిషతో జనులను మోసము చేయుచున్నాను. విషయ భోగములను మాత్రమే చింతించుచు తహతహలాడుచున్నాను. లభించిన వస్తువుల యందలి మోహముతో ఒడలు తెలియకుండ ఉన్నాను. శ్రుతిస్మృతుల ఆజ్ఞలను ఉల్లంఘించుచున్నాను. అజ్ఞాని జనులు చూపు గౌరవముచే మదోన్మత్తుడనయితిని. నీవు దీనజన పరిపాలకుడవు. కృపాసముద్రడవు. పరమానంద స్వరూపుడవు. ఓ పరమాత్మా! పైన చెప్పిన నరక మూలములగు పాపకృత్యములనుండి నన్ను రక్షించుము."

డా॥ లల్లూ:- ఈనాడు విధివిహితముగా కాషాయ దండాదులను ధరించువారిని సన్యాసులు అనవచ్చునా? అన రాదా?

స్వా. ప్ర.:-వైరాగ్యము లేని సన్యాసము విధివిహితముగా అయినను సన్యాసము కాదు.

**సత్కారమాన పూజార్థం దణ్డకాషాయధారీ యః।**
**స సన్యాసీ న వక్తవ్యః సన్యాసీ జ్ఞానతత్పరః॥**

"సత్కారము, మానము, పూజ పొందుటకు దండమును, కాషాయమును ధరించిన వాడు సన్యాసి అనబడడు. జ్ఞానతత్పరుడే సన్యాసి అనబడును."

ఈ విషయమున తుకారాము గారి వాక్యములు కూడ గమనించదగినవి:-

"ప్రపంచమున గౌరవమును పొందుటకే నీవు సన్యాసివి అయితివి. అందు కొరకే గ్రంథములను చదివితివి. అందుచే అసలు రహస్యము నీకు తెలియ లేదు. నీ చిత్తము నందు పశ్చాత్తాపమునకు తావు లేదు. నీవు పైపైన కాషాయములను ధరించితివి. నీవు అసత్య ప్రసంగములు చేసి నీ జిహ్వాను శ్రమింప

చేయుచున్నావు.

ఈ జన్మము నందు భగవానుని పొందవలెననియే సన్యాసము తీసికొనవలెను. సన్యసించిన తరువాత ఏకాంతమున కూర్చొని బ్రహ్మ విద్యాభ్యాసమున నిమగ్నుడవవలెను. జ్ఞానము కలిగిన తరువాత నిర్ద్వంద్వుడయి శుక , వామ దేవాదుల వలె సంచరించవలెను.”

“**కామమాశ్రిత్యదుష్పూరమ్**।” అని గీతలో చెప్పినట్లు ఒక కోరిక నుండి వేరొక కోరికకు వెంబడించి అసురగుణములగు దంభ మానాదులకు వశీభూతుడగును.

## కామ త్యాగముచే బ్రహ్మ సిద్ధి

స్వా.ని.:- నిజము. కామ త్యాగము చేయనంతవరకు ఎవరికిని సిద్ధి కలుగదు. ఆత్మ పురాణము నందలి కథ వినుడు. దేవతలు దధ్యజ్ ఋషి దగ్గరకు వెళ్ళి తమకు ఇంద్రుని జయించవలెనని కోరిక కలదని చెప్పిరి.

వారికి దధ్యజ్ ఋషి ఇట్లు చెప్పెను:-

"మీరు శత్రువులను అందరిని జయించగలరు. కాని కామమను ఆంతరంగిక శత్రువును జయించు శక్తి మీకు లేదు. సర్వదేవతలకును పూజ్యుడగు ఇంద్రుని జయించవలెనను కోరిక మీకు కలిగినది. ఆ కామమునకు మీరు లోబడితిరి. కామము లేనిదే నిషిద్ధ కర్మము నందు బుద్ధిమంతుడు ప్రవర్తించడు. పూర్వము మీకు ఇంద్రుని జయించ వలెనను కోరిక లేదు. ఇప్పుడు కలిగినది. కావున కామము మీ ప్రబల శత్రువు. మీరు పూర్వజన్మమున కామ క్రోధాది రాజులను, ఇంద్రియములను కింకరులను జయించిరి. అందుచే మీకు దేవ శరీరములు వచ్చినవి, దేవ సభలో ఇంద్రుడు తన వాగ్బాణములచే మిమ్ము హింసించెను. కావుననే ఇట్టి కోరిక కలిగింది. ఈ కామము అను శత్రువునకు లోబడితిరి. కామికి ఎల్ల చోటులయందును నిరాదరణ కలుగును. ఇంద్రుడు పూర్వము కాని, ఇప్పుడు కాని మిమ్ము

ఎందుకు నిందించెను అనునది మీరు ఆలోచించుట లేదు. మీ యందు కామము లేనంత వరకు ఇంద్రుడు మిమ్ము గౌరవించెను. మీకు కామము కలిగిన వెంటనే ఇంద్రుడు మిమ్ము నిందించెను. కామమును జయించు సామర్థ్యము మీకు లేదు. ఇక ఇంద్రుని ఎట్లు జయించగలరు? కామము అను శత్రువు దేవతల సభలో మిమ్ము అగౌరవపరచెను. ఆ శత్రువును జయించలేని మీరు ఇంద్రుని ఎట్లు జయించగలరు? మొదట కామము అను శత్రువు మిమ్ము అవమానించెను. ఇప్పుడు అతనికి కుమారుడగు క్రోధము కూడా తోడు కలదు. ఆతడు మీకు చేయలేని అపకారము ఏది కలదు? కామ క్రోధములను పరమ శత్రువులను ఉపేక్షించి బాహ్య శత్రువులగు రాజాదులను జయించదలచు జీవి పరమ మూర్ఖుడు.

మహా దేవుడు కూడ కామమును తృజించెను. ఒకప్పుడు ఆయన గంగాతీరమున ఉగ్రతపము చేయుచుండగా దేవతలు చూచి

కంగారు పడిరి. ఈ తపమునకు కలుగు పరిణామము ఏమి? దేవతలు పట్టు బట్టి కామునిచే శంకరుని తపమునకు విఘ్నము కలిగించదలచిరి. ఇది చూచి కాముని భార్య శంకరుని కుమార్తె అగు రతీదేవి యిట్లు పలికెను. “నా తండ్రి గారు సామాన్యులు కారు. మీరు నశించెదరు.” అట్లు చెప్పినను ఒప్పుకొనక కాముడు పుష్ప బాణము అను మోహాస్త్రము శంకరునిపై ప్రయోగించెను. శంకరుడు తన తృతీయ నేత్రమును తెరచి చూచెను. అంతట కాముడు భస్మమయ్యెను.

శంకరుడు యోగాభ్యాసముచే జ్ఞానము ద్వారా కామములను అన్నిటిని నశింప జేసెను. అటు తరువాత ఆయనకు బ్రహ్మ స్థితి కలిగెను. పురాణములయందు కల ఈ కథకు అంతరార్థము ఇదియే. కామ రహితుడు అయిన మీదటే బ్రహ్మానుభవము కలుగును. ఈ విషయమున శ్రుతిని గమనించుడు:-

***యదా సర్వే ప్రముచ్యన్తే కామ యేఽస్య హృది స్థితాః।***
***అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే ॥***

"ముముక్షువు హృదయమునందలి కామములు నివృత్తిని పొందినప్పుడే అతడు జ్ఞాని అవును. మోక్షమును పొంది ఈ శరీరమునందే బ్రహ్మానుభవము పొందును."

## కామమును నశింపజేయు ఉపాయము

డా.లల్లూ:- కామములను జయించు ఉపాయమేమి?

స్వా. ప్ర. :—

***అవేక్ష్య విషయే దోషం బుద్ధియుక్తా విచక్షణాః ।***
***కామపాశేన యో ముక్తః స ముక్తేః పథి గోచరః ॥***

"బుద్ధిమంతుడును, విచక్షణా పరుడును అగు వాడు విషయముల యందు దోషములను చూచి కామపాశము నుండి ముక్తుడగును. ఆతడే ముక్తిమార్గమును చూడగలడు."

పదార్థముల యందు యందు రమణీయ బుద్ధి యున్నంత కాలము కామములనబడు వందలకొలది పాశములచే బద్ధుడగును. అది నశించి పదార్థముల యందు దోషదృష్టి కలిగినచో కామముల నుండి ముక్తుడగును. ఆతడు ముక్తిమార్గమున ముందుకు వెళ్ళగలడు.

శంకరాచార్యుల వాక్యములు పరికించుడు.

# పదార్థముల యందలి రమణీయ బుద్ధిని త్యజించుట

***శ్రుతే దృష్టేఽపి వా భోగ్యే యస్మిన్ కస్మింశ్చ వస్తుని।***
***సమీచీనత్వధీ త్యాగాత్ కామో నోదేతి కర్హిచిత్॥***

# ముప్పది నాలుగవ ప్రసంగము

"వినినట్టి కాని, చూచినట్టి కాని భోగ్యపదార్థము నందు 'ఈ వస్తువు మంచిది.' అను రమణీయ బుద్ధిని త్యజించినచో కామములు కలుగవు."

ఉదాహరణకు ఒక స్త్రీని తీసికొనుడు. ఆమె కురూపి అయినను ముక్కు, కళ్లు సరిగా లేక మహా భయంకరముగా నున్నను అందమైన బట్టలు కట్టుకొని, రత్న ఖచిత భూషణములు ధరించి, ముఖమునకు సౌందర్య ప్రసాదకములగు వస్తువులను పూసుకొన్నచో ఆమె భయంకరత్వము కానరాదు. ఆమె యువకులగు కాముకులను ఆకర్షించును. కాని ఆమె వికరాళ స్వరూపమును చూచిన వాడు మాత్రము ఆమెకు లోబడడు. అటులనే మాయ కూడ మహా భయంకర స్వరూపిణి. కాని ఆమె తన వివిధములగు సుందర కార్యముల ద్వారా జనులను మోహములో ముంచి వేయును. ఆమె యొక్క యథార్థమగు భయంకర స్వరూపమును చూచిన వ్యక్తులు ఆ మాయిక పదార్థములయందు

అనురక్తిని పొందరు. అజ్ఞానములో నున్నంత కాలము మాత్రమే ఆ మాయిక పదార్థములయందు రమణీయ బుద్ధిని పొంది వానిని కోరుదురు, జ్ఞానము కలిగిన వెంటనే మాయిక పదార్థముల యందు రమణీయ బుద్ధి కలుగదు. నరుడు వానిని కోరడు. కామ నాశనమునకు ఉపాయములను శంకరులు ఇట్లు వర్ణించిరి:-

## విషయ పదార్థములు అనర్థమును కలుగజేయును

## అను యథార్థ పరిజ్ఞానము

***యథార్థ దర్శనం వస్తున్యనర్థస్యాపి చిన్తనమ్।***
***సంకల్పస్యాపి కామస్య తద్వధోపాయ ఇష్యతే ॥***

"మాయిక పదార్థముల యదార్థమును తెలిసికొనుట, వానిచే కలుగు అనర్థములను గురించి విచారించుట- ఇవియే కామములను

వధించు ఉపాయములు.”

ఒక రాజు వద్దకు ఒక వ్యక్తి, బంగారు పళ్ళెములో అత్యంత సుందరముగా కన్పించు బంగారు రేకులలో విషమిశ్రితములగు మిఠాయిలు మొదలగు ఖాద్య పదార్థములను పంపెననుకొనుడు. “ఇవి శత్రువు పంపినవి. వీనిచే అనర్థము మృత్యువు కలుగును” అని రాజు తలచును. అది యథార్థమో కాదో తెలిసికొనుటకు కుక్కలచే వాటిని తినిపించును. వెంటనే కుక్కలు చనిపోవును. ఇట్లు పదార్థములు విషమిశ్రితిములు అని గ్రహించినచో వానిని తినవలెనను కోరిక కాని, సంకల్పము కాని రాజుకు కలుగదు. ఇదే విధముగ పైకి సుందరముగ కన్పట్టు మాయిక పదార్థములు పరిణామమున అనర్థమును కలుగ జేయును అని తలచువాడు సంకల్పములను, కామములను నశింపు జేయ సమర్థుడగును.

## శాస్త్రవిధి నిషేధములను అనుసరించి ప్రవర్తించవలెను

సంకల్పముచే కామము జన్మించును. కామప్రాప్తికి శాస్త్ర మర్యాదలను ఉల్లంఘించి వ్యక్తి ఇష్టము వచ్చినట్లు సంచరించును. శాస్త్రానుసారము సంచరించ నంతవరకు వ్యక్తికి సిద్ధి కలుగదు. సుఖము కలుగదు. పరమగతి కలుగదు. గీత 16వ అధ్యాయము చివర భగవానుడు చెప్పెను:-

***యఃశాస్త్ర విధి ముత్సృజ్య వర్తతే కామ కారతః।***
***న స సిద్ధి మవాప్నోతి న సుఖం నపరాం గతిమ్ ॥***

"శాస్త్ర విధిని పరిత్యజించి తన ఇష్టము వచ్చినట్లు సంచరించు వాడు యోగ సిద్ధిని పొంద లేడు. బ్రహ్మ సుఖమును పొంద లేడు. విదేహముక్తి అను పరమగతిని పొంద లేడు.

అధికారియగు నరునకు అపూర్వార్థమును బోధించునది శాస్త్రము. అధికారి శ్రేయస్సుకే శాస్త్రములు నిర్మించబడెను. చతుర్వేదములు,

సూత్రములు, స్మృతులు పురాణములు, ఇతిహాసములు మొదలగునవి శాస్త్రములు.

ఈ శాస్త్రములయందు ఈ పనిచేయవలెను, ఈ పనిచేయరాదు అని విధినిషేధ వాక్యములు ఉండును. ఈవిధి నిషేధ వాక్యములు. కర్తవ్య, అకర్తవ్య జ్ఞానమునకు హేతుభూతములయి ప్రవర్తకములుగను, నివర్తకములుగను ఉండును. విధులను పాలించుటచే అధికారికి శ్రేయస్సు కలుగును, వేనిని ఆచరించుటచే తాను పతితుడగునో వానికి దూరముగా నుండుటకు శాస్త్రముల యందు నిషేధ వాక్యములు కలవు. శాస్త్రాభ్యాసము చేసి తదనుసారము ప్రవర్తించువాడే తన చిత్త నిగ్రహమును సాధించి కామములను జయించగలడు. అట్లు చేయలేనివాడు శాస్త్ర విధులను ఉల్లంఘించి స్వేచ్ఛాప్రవర్తనను పొందును. అట్టివానికి యోగసిద్ధి కలుగదు. ఉదాహరణకు అంతఃకరణ శుద్ధికి శాస్త్రముల యందు విధించబడిన నిష్కామకర్మను ఆచరించనిచో అంతఃకరణశుద్ధిని

పొందలేము. ఉపాసనాదులు ఆచరించనివాడు విక్షేప దోషమును నివారించ లేడు.

కావున శాస్త్రవచనముల యందు శ్రద్ధకలిగి, కామములను నిషేధించి, శాస్త్రానుసారము ప్రవర్తించవలెను. వస్తుస్థితి ఇట్లుండుట చేతనే తరువాతి శ్లోకమున కృష్ణ భగవానుడు కార్యాకార్య నిర్ణయము నందు శాస్త్ర విధినే ప్రమాణముగా తీసికొని ఆ విధముగా సంచరించుము అని చెప్పెను.

***తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్యవ్యవస్థితౌ|***
***జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి||***

కామనా ప్రేరితులయి స్వేచ్ఛా ప్రవర్తనను కలిగియున్న వారు సిద్ధిని, బ్రహ్మ సుఖమును పొందలేరు. శాస్త్రోక్తములగు నిధి నిషేధములను అనుసరించి తన కార్యాకార్యములను నిర్ణయించు కొనవలెను. శాస్త్రములే ప్రమాణములు. తన బుద్ధి ప్రమాణము అనుకొనరాదు. కార్యాకార్య

నిర్ణయము గంభీర విషయము. దానిని శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాదులు బోధించును. శాస్త్రముల యందలి ప్రవర్తక నివర్తక వాక్యములను అనుసరించి కర్మలను ఆచరించుచు, అకర్మల నుండి నివృత్తిని పొందుచు ఉండు వారలే అంతఃకరణ సిద్ధి ద్వారా యోగ సిద్ధిని, బ్రహ్మసుఖమును పొందగలరు.

## శ్రేయః ప్రేయములు

కార్యము అనగా చేయదగినది. అది శ్రేయము. అకార్యము ఆచరించరానిది. అది ప్రేయము. దీనిని గురించి శ్రుతి ఇట్లు చెప్పుచున్నది.

***అన్య చ్ఛ్రేయోఽన్యదుతైవ ప్రేయః తే ఉభే నానార్థే పురుషం సినీతః/***
***తయోః శ్రేయ ఆదదాన స్య సాధుర్భవతిహీయతేఽర్థాద్య ఉ ప్రేయోవృణీతే //***

"శ్రేయము వేరు, ప్రేయము వేరు. వాని

అర్థము కూడా వేరు. ఈ రెండును మనుష్యుని పొందును. వీనిలో శ్రేయమును గ్రహించు వాడు శుభమును పొందును. ప్రేయమును కోరువాడు కళ్యాణ ప్రాప్తి అనెడు అర్థమును పొందలేడు."

***శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః తౌ సంపరీత్య వివినక్తి ధీరః|***
***శ్రేయో హి ధీరోఽభి ప్రేయసోవృణీతే ప్రేయోమన్దోయోగ క్షేమాద్వృణీతే||***

ప్రేయమును, ప్రేమయును మానవుని సమీపించును. వివేకి రెంటిని పరీక్షించి శ్రేయమును కోరును. అవివేకి యోగ క్షేమముల కొరకు (అప్రాప్యమును పొందుటకును, ప్రాప్తమును రక్షించుకొనుటకును) ప్రేయమును కోరును.

ఉదాహరణమునకు త్రిదోషములు కలిగినప్పుడు రోగికి పెరుగు త్రాగవలెనను కోరిక కలుగును. ఆతనికి పెరుగు త్రాగుట ప్రియమే. కాని అతనికి అందు శ్రేయము లేదు. చేదు

మందు ఆతనికి ప్రియము కాదు. కాని ఆ మందును సేవించినచో ఆతని బాధ నివృత్తి అగును. అటులనే భవరోగముచే బాధపడు మానవునకు విషయోపభోగము ప్రియముగా నుండును. కాని అందు ఆతని శ్రేయము లేదు. విషయాదుల నుండి చిత్త వృత్తులను నిరోధించుట ఆతనికి ప్రియము కాదు. కాని అవి భవ రోగమునకు ఔషధములు. వానిచే అతనికి కళ్యాణము కలుగును. శాస్త్ర సమ్మతమగు పురుషార్థము పరమార్థమును అనగా కళ్యాణమును కలుగ జేయును. శాస్త్ర విరుద్ధమగు పురుషార్థము అకళ్యాణమును కలుగ జేయును అని యోగ వాశిష్టము చెప్పుచున్నది:-

**ఉచ్ఛాస్త్రం శాస్త్రితం చేతి పౌరుషం ద్వివిధం స్మృతమ్ /**
**తత్రోచ్ఛాస్త్రమనర్థాయ పరమార్థాయ శాస్త్రితమ్ //**

అనంతరము స్వామి శ్రీ ప్రకాశానందుల వారు డా. లల్లూ భాయితో ఇట్లనిరి:- "మీరు

అన్ని వ్యవహారముల నుండియు నివృత్తిని చెందియున్నారు. మీ ఉద్యోగము నుండి కూడ విరమణ పొంది ఉన్నారు. ఇప్పుడు మీరు తలచినది చేయగలరు. కావున ఏకాంతమున కూర్చొని యోగాభ్యాసము చేసి సుఖమును పొందుడు. లేనిచో అవిద్యా బంధమున చిక్కు పడుదురు."

బృహదారణ్యకము చెప్పునది వినుడు:-

***ఇహైవ సన్తోఽథ విద్మః తద్వయం న చేదవే దీర్మహతీ వినష్టిః|***
***యే తద్విదుర మృతాస్తే భవన్త్యథేతరే దుఃఖమేవాపి యన్తి||***

"ఈ లోకము నందుండగనే బ్రహ్మమును తెలిసికొనగలము. అట్లు తెలిసి కొనకపోయినచో మీకు మహాపకారము కలుగును. బ్రహ్మమును తెలిసికొనినవారు అమృతులగుదురు. తెలిసికొననివారు దుఃఖమును పొందుదురు."

తరువాత స్వామి శ్రీ నిత్యానందుల వారి

అనుమతితో కాళాభాయి మొదలగు వారు జేతపురమును, స్వామి శ్రీ ప్రకాశానందుల వారు వీరపురమును వెళ్లిరి.

ఓం

# ముప్పది ఐదవ ప్రసంగము

శ్రీ నిత్యానంద స్వామి వారి అనారోగ్యము సంగతి శ్రీ ప్రకాశానంద స్వామివారికి అందెను. వారు వెంటనే పీఠడియా వెళ్ళిరి. వారిని చూచుటతోడనే శ్రీ నిత్యానంద స్వామివారు హర్షాశ్రువులను వెలువరించిరి.

వారి అనారోగ్యము తీవ్రముగా నుండెను. మాట్లాడు శక్తి లేదు. వారు చెప్పిరి.

“ఈ శరీరము క్షణభంగురము. ఇది పతనమగునను విచారము నాకేమి లేదు. ఈ శరీరము ఉన్నచో స్వామిని భజించగలను. లేనిచో గోవింద గోవింద.”

ఆ సమయమున ప్రాణజీవన భాయి, మూళశంకరభాయి మొదలగు భక్తులు స్వామివారి సేవకు వేచియుండిరి. ఇది చూసి

## ముప్పది ఐదవ ప్రసంగము

స్వామి వారు ఇట్లనిరి:- "మీరు అందరు ఎందుకు నా కొరకు ఇంత బాధ పడుచున్నారు? రాత్రింపగళ్లు వేచియే యున్నారు."

స్వా. ప్ర.:- పరమాత్ముడు వీరికి తమ సేవ చేయు అవకాశమును ఇచ్చెను. అది వారు తమ అదృష్టముగా తలచుచున్నారు.

ఈ విధముగా రెండుమూడు రోజులు గడిచిన వారు తరువాత శ్రీ ప్రకాశానందుల వారిని తమ దగ్గరకు పిలచి చెప్పిరి.

"తమ యందు నాకు పూజ్య భావము కలదు. ఒక విషయము నివేదించుకొనుచున్నాను. అనారోగ్యము తీవ్రతరమగుచున్నందున ఈ శరీరము ఇక నిలబడదు అని తోచుచున్నది. ఎప్పుడో ఒకప్పుడు కూలిపోవును. అందుకు నేనేమియు బాధపడుట లేదు. కాని ఈ శరీరమును హరిద్వారమున త్యజించవలెనని నా ఉద్దేశ్యము."

ఈ మాటలు విని ప్రకాశానందులవారు

అడిగిరి:-

స్వామి! ఇదేమిటి?

ధర్మరాజు భక్తవరుడగు విదురునితో చెప్పెను:-

***భవద్విధా భాగవతాస్తీర్థీభూతాః స్వయం ప్రభో /***
***తీర్థీకుర్వన్తి తీర్థాని స్వాన్తః స్థేన గదాభృతా//***

తమవంటి భగవద్భక్తులు తీర్థస్వరూపులు. పాపాత్ములచే కలుషితములగు తీర్థములను తమరు తమ హృదయము నందున్న గదాధరుని ప్రభావముచే మరల పవిత్రము చేసి తీర్థత్వమును కలుగ జేయ చున్నారు. గంగాది పుణ్య తీర్థములు తమ చరణముల యందు కలవు. తమరు ఈ కోర్కెను విరమించుకొనుడు.

# జీవన్ముక్తుని విదేహముక్తి

అంతట వారు హరిద్వారము వెళ్ళవలెనను

సంకల్పమును విడనాడిరి. ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ రోజున ఆయన అష్టపురీ పరిత్యాగము చేసి స్వరూపము నందు లీనులైరి. వారు పూర్వము నుండియు జీవన్ముక్తావస్థ యందే యుండిరి. ఇప్పుడు విదేహముక్తులైరి.

***స్వరూపోఽసౌ మనో నాశో జీవన్ముక్త స్య విద్యతే /***
***అరూపస్తు మనోనాశో వైదేహీముక్తిగో భవేత్ //***

“జీవన్ముక్తుని మనోనాశము సరూపనాశము. విదేహముక్తి అను మనోనాశము అరూపమనోనాశము.

చిత్తనాశము రెండు రకములు. 1. సరూపము 2. అరూపము. జీవన్ముక్తి యందు సరూప నాశము కలదు. విదేహముక్తి యందు అరూప నాశము కలదు. ఎట్లనిన - ధాన్యమును నిలువ చేయుటచే అందలి బీజ శక్తి నశించును. అది సరూపనాశము. ఆ ధాన్యమునే భుజించుటచే కలుగు రూపాంతరము

అరూపనాశము.

సరూప మనోనాశము నందు జీవన్ముక్తుడగును. స్వస్వరూపమగు అఖండ బ్రహ్మము యొక్క జ్ఞానము ద్వారా బ్రహ్మ ప్రాప్త్యావరణములగు అజ్ఞానము, దాని కార్యములగు సంచితకర్మలు, సంశయవిపర్యయాదులును బాధితములగుటచే స్వస్వరూపాఖండ బ్రహ్మ సాక్షాత్కారము జరిగి అవిద్యా బంధముల యొక్క, దాని కార్యముల యొక్కయు రాహిత్యమును పొందుట జీవన్ముక్తత్వము.

గురువు ద్వారా, శ్రుత్యుపదేశముద్వారా, స్వానుభవము ద్వారా, జీవ బ్రహ్మల ఏకత్వ-అభేదజ్ఞానము కలుగుటచే జీవుని ఆశ్రయమున ఉన్న మూలావిద్యయు, దాని అజ్ఞాన కార్యములగు సంచిత కర్మలు, సంశయాదులును బాధించబడుటచే సర్వబంధ రహితుడగుట జీవన్ముక్తావస్థ.

ఈ విషయమున శ్రుతిని వినుడు:-

***భిద్యతే హృదయగ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః|***
***క్షియన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే||***

పరావరము అనగా సర్వోత్కృష్టము, సర్వోపాధిరహితము అగు వ్యాపక బ్రహ్మము. అది తెలియుటచే జీవన్ముక్త పురుషుని హృదయము నందలి అవిద్యాగ్రంధి (ముడి) విడువడును. సకల సంశయములును, సంచితాది సర్వకర్మములును బ్రహ్మసాక్షాత్కారము అగుటచే లయమును పొందును.

పరావర శబ్దమునకు సర్వాత్మక బ్రహ్మము అని అర్థము. అంత కంటె పై వాడు లేనివాడు అని అర్థము. హిరణ్యగర్భుడు కూడ ఎవని కంటె న్యూనమో అట్టి సర్వవ్యాపకమగు బ్రహ్మ సాక్షాత్కారము జరుగుటచే జీవన్ముక్తుని కర్మలు అన్నియు లయమును పొందును.

అరూపమనోనాశముచే విదేహముక్తి

కలుగును. అరూపనాశము అనగా కార్యము నందు కారణము లయమగుట.

ముక్తి అనగా సకల దుఃఖముల నుండియును విడుదల పొంది పరమానందమును పొందుట. ప్రతి ప్రాణికిని గొప్ప దుఃఖము మృత్యువు. దానినుండి విడుదల పొందమని శ్రుతి చెప్పుచున్నది:-

***అరా ఇవ రథనాభౌ కలా యస్మిన్ ప్రతిష్ఠితాః/***
***తం వేద్యం పురుష వేద యథా మా వో మృత్యుః పరివ్యథా ఇతి //***

రథనాభి యందు రథ చక్రపు ఆకులు చేరియున్నట్లు పురుషుని ఉత్పత్తి, స్థితి, లయ కాలముల యందు ప్రాణములు ప్రతిష్ఠించ బడియుండును. ఓ శిష్యా, ఆ కళాధారుడగు పురుషుని నా వచనములచే తెలిసికొనుము. అట్లు చేయుటచే మృత్యువు- అనగా విపరీత జ్ఞానము నిన్ను బాధించదు. స్వరూప జ్ఞానము నందు ఆవరణము కాదు.

# ముప్పది ఐదవ ప్రసంగము

ప్రాణాది షోడశ కళల గురించియు ప్రశ్నోపనిషత్తు నందు చెప్ప బడినది: -

**స ప్రాణమసృజత ప్రాణాచ్ఛ్రద్ధాం ఖం వాయురోజ్యోతిరాపః పృధివీన్ద్రియం మనః/ అన్న మన్నాద్వీర్యం తపో మన్త్రాః కర్మ లోకాః లోకేషు చ నామ చ //**

ఆ ఆత్మ షోడశ కళలకు ప్రధానమగు ప్రాణమును మొదట సృష్టించెను, ప్రాణము నుండి శ్రద్ధ, ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి, దశేంద్రియములు, మనస్సు అన్నము, అన్న భక్షణముచే సర్వకర్మల యందును ప్రవృత్తిని కలిగించు బలము—సామర్థ్యము వీర్యము వీనిలో ఉత్పత్తి చేసెను. అటులనే తపము, మంత్రరూపములగు వేదములు, కర్మలు, కర్మఫలములగు లోకములు లోకములందలి ప్రాణుల నామములు, మనుష్యులు, పశువులు, పక్షులు మొదలగు వానిని ఉద్భవింప జేసెను. ఈ విధమున 16

కళలను సృష్టించెను.

షోడశ కళలను గురించియును శ్వేతాశ్వతర ఉపనిషత్తు కూడా చెప్పుచున్నది. అందు పృథివ్యాది పంచభూతములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, మనస్సు కలిసి 16 కళలని వ్యష్టి రూపమున చెప్పబడినవి. వేరొక విధమున విరాట్టు, సూత్రాత్మ అను భేదములచే, సమష్ఠి రూపమున 16 కళలును, భూరాది 14 లోకముల భేదముచే వ్యష్టి రూపమున 16 కళలును చెప్పబడినవి.

పురుషుడు ఈ పదహారు కళలకును భిన్నుడు. ఆతనిని తెలిసికొనినవాడు మృత్యుపీడనుండి ముక్తుడగును. ఈ పురుషుని పరికించవలసిన సాధనములను గురించి శ్రుతి చెప్పుచున్నది.

***అరా ఇవ రథ నాభౌ సంహతా యత్ర నాడ్యః***
***స ఏషోఽన్తశ్చరతే బహుధా జాయమానః|***

***ఓమిత్యేవం ధ్యాయథ ఆత్మానం స్వస్తి వః పారాయ తమసః పరాస్తాత్ //***

రథనాభియందు చక్రపు ఆకులు కలసియున్నట్లు హృదయమున వేలకొలది నాడులు కలిసియుండును. ఆ హృదయ మధ్యభాగమున ప్రకృతమగు ఆత్మకూడ ఉండును. అది అనేక విధములుగ క్రోధ హర్షాదిరూపమున ప్రతీయమానమగును. ఎట్లనిన ఘటము యొక్క ఉత్పత్తి ద్వారా ఘటా కాశము ఘటరూపమగు ఉత్పత్తిచే జన్మించును. 'ఓ శిష్య! నీవు ఈ నశ్వరము కాని ఆత్మను ప్రణవము ద్వారా, ప్రణవరూపమున ధ్యానము చేయుము.' నా ఆశీర్వాదముచే మృత్యు జన్యమగు దుఃఖమునకు కారణమగు అవిద్య నుండి విడువడుటకు నీకు నిర్విఘ్నముగా కళ్యాణమగుగాక !

ఈ విధముగా అన్ని కళల నుండి ముక్తులయిన విదేహముక్తి యందు పరమాత్మునితో అభేదమును పొందనగును.

ఈ విషయమున శ్రుతిని పరికింపుడు.

***గతాః కలాః పఞ్చదశ ప్రతిష్టా దేవాశ్చ సర్వే ప్రతిదేవతాసు |***
***కర్మాణి విజ్ఞాన మయశ్చ ఆత్మా పరేఽవ్యయే సర్వ ఏకీ భవన్తి||***

మోక్ష కాలమున దేహమును ఉద్భవింపజేయు కళలన్నియును తమతమ కారణమున లయమును పొందును. దేహాశ్రితములగు చక్షురాదుల యందు ఉన్న దేవులు ఆదిత్యాది దేవతల యందు లయమును పొందును. అటులనే కర్మలును, విజ్ఞానమయ ఆత్మయును, వ్యాపకమును, అనంతమును, అవ్యయమును, అజరమును అమృత రూపమును అగు బ్రహ్మమునందు లయమును పొందును.

ఈ విధముగా జ్ఞాని పుర్యష్టకమును పరిత్యజించి బ్రహ్మైక్యమును పొందును. ముండకోపనిషత్తు చూడుడు:-

## ముప్పది ఐదవ ప్రసంగము

***యథా నద్యః స్యన్దమానాః సముద్రేఽస్తం గచ్ఛన్తినా మరూపే విహాయ/***
***తథా విద్వాన్నామరూపాద్విక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్//***

గంగాది నదులు ప్రవహించి, ప్రవహించి తమ నామరూపములను విసర్జించి సముద్రమున లయమును పొందును. అటులనే విద్వాంసుడు అనగా జ్ఞాని నామరూప విముక్తుడయి ఉత్కృష్టము, దివ్య ప్రకాశరూపము పూర్ణ పురుషుడును అగు బ్రహ్మము అగును. అనగా బ్రహ్మము నందు లయమును పొందును.

సూర్యుడు కిరణముల ద్వారా సముద్రజలమును ఆకర్షించును. ఆ జలము మేఘరూపమున వర్షించి భూమిపై పడును. అది గంగా యమునాది నదీరూపములను పొంది సముద్రముతో మరల ఏకత్వమును పొందును. అటులనే మాయా సంబంధముతో నున్న జీవాత్మ వెనుకటి స్వరూపము యొక్క జ్ఞానమును పొంది మాయాపరుడగు మూలపురుషుడగు

పరబ్రహ్మమును పొందును.

బృహదారణ్యకము చెప్పుచున్నది.

***(‘న తస్య ప్రాణా ఉత్క్రామన్తి’ ‘బ్రహ్మైవ సన్ బ్రహ్మ ప్యేతి/’)***

ఆ బ్రహ్మవేత్త యొక్క ప్రాణములు పైకిపోవు. అవి బ్రహ్మము అయి బ్రహ్మము నందు లీనమగును.

**(ఓం శాన్తిః, శాన్తిః, శాన్తిః)**

ఓం

# ఉప సంహారము

తెలిసియో తెలియకయో అన్ని ప్రాణుల చేతను మోక్ష ప్రాప్తికి ప్రయత్నము చేయబడునను సంగతి మనకు తెలియును. ఈ విషయమున కొంచెము చర్చించెదము.

ఆద్యశంకరాచార్యుల వారి శిష్యపరంపరలో సర్వజ్ఞముని అను ఒక యోగ్యుడును, విద్వాంసుడును అగు ఆచార్యుడు ఉండెను. ఆయన ముముక్షువులకు అత్యంత మనోరంజకమగు బ్రహ్మానందానుభవము కలుగ జేయుటకు అద్వితీయ సాధనముగా "సంక్షేప శారీరకము" అను రమ్యమగు శ్లోక బద్ధ గ్రంథము నొకదానిని రచించెను. దాని ఉపోద్ఘాతము నందిట్లున్నది.

***ఇహ జగతి హి సర్వ జన్తుః నిరతిశయం సుఖముత్తమం మమాస్తు/***

***వ్యపర మతు తథోపఘాత రూపం విషయజదుఃఖమితి స్పృహాం కరోతి॥***

ఈ జగమున ప్రతిపాణియును తనకు నిరతిశయమగు ఉత్తమ సుఖము కలుగవలెననియు ఖేదమును కలిగించు విషయజన్య దుఃఖము నశించవలెననియు కోరును.

కొందరు ఇట్లు ప్రశ్నించవచ్చును. ఈ సుఖము స్వర్గమే. అన్ని ప్రాణులను స్వర్గమునే కోరును. మోక్షమును కాదు. స్వర్గ సుఖమును పొందుటను గురించి శ్రుతులు కూడ ఉన్నవి.

***"దర్శపూర్ణమాసాభ్యాం స్వర్గకామో యజేత।"***
***"అపామ సో మమమృతా అభూమ॥"***

ఈ సందేహమును లేకుండ చేయుటకు సర్వజ్ఞముని నిరతిశయము ఉత్తమము అను రెండు విశేషణములు సుఖమునకు చేర్చెను. స్వర్గ సుఖము క్షయ, సాతిశయ దోషములతో కూడియున్నది.

***దృష్టవదానుశ్రవికః సహ్యా విశుద్ధిః క్షయాతిశయయుక్తః|***
***తద్విపరీతః శ్రేయాన్ వ్యక్తావ్యక్తజ్ఞ విజ్ఞానాత్||***

ఈ లోకము, వీని భోగములు దుఃఖ మిశ్రితములు, క్షయములు, సాతిశయముల దోషములతో కూడినవి. అదే విధముగా స్వర్గలోకమును, అందలి భోగములును కూడ దోషభూయిష్టములే. కావున ఈ రెండింటికంటెను మోక్షమే శ్రేష్ఠము. మోక్షము వ్యక్త- భూతాదులు, అవ్యక్త-మాయ, జ్ఞ-పురుషుడు వీని జ్ఞానముచే కలుగును.

***తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి|***

స్వర్గమునకు వెళ్ళినవారు తమ పుణ్యము ఉన్నంత కాలము స్వర్గ సుఖములు అనుభవించి పుణ్య క్షయము అగుటతోడనే మరల మర్త్య లోకమునకు వచ్చెదరు. శ్రుతి కూడా చెప్పుచున్నది.

***యావత్సంపాత ముషిత్వా.........***

***......తతో హీనం హీనతరం వా విశన్తి॥***

పుణ్యము ఉన్నంతవరకు స్వర్గము నందు ఉండి మరల హీనమగు జన్మమును పొందెదరు. కావున స్వర్గ సుఖము క్షయకరము అనునది నిశ్చితము. అది సాతిశయ దోష రహితము కూడ కాదు. ఏలనన స్వర్గము నందు ఉండువారికి కూడ ఒకదాని కంటె మరియొకటి ఉత్తమమగు భోగము లభించును. ఈ సుఖ తారతమ్యమును గురించి శ్రుతి ప్రమాణము కలదు.

***తే యే శతం మానుషాః ఆనన్దాః స ఏకోమనుష్యగన్ధర్వాణామానన్దః।***

మనుష్య లోకమునందలి నూరు ఆనందములు మనుష్య గంధర్వుల ఒక ఆనందముతో సమానము. ఈ విధముగా ఆనందము ఉత్తరోత్తరము ఔన్నత్యము కలిగియుండుటచే సాతిశయము.

ఈ మనుష్యలోకమున బీదవానికంటె సామాన్య మానవుని జీవి కొంత వైభవోపేతముగా

నుండును. శ్రీమంతుని జీవితము వైభవోపేతముగా నుండును. మహారాజుల జీవితము ఇంతకంటే వైభవోపేతముగా నుండును. ఇది చూచి అవివేకులగు పామరులకు ఈర్ష్య కలుగును. వారు దుఃఖించెదరు. ఇదే విధముగ స్వర్గ సుఖము నందు కూడ సాతిశయత్వము ఉండుటచే ఒకరి సుఖమును చూచి మరియొకరు దుఃఖించుట జరుగును. కావుననే ఈశ్వరకృష్ణుడు తాను రచించిన కారిక యొక్క ఉత్తరార్ధమున "తద్విరీపతః శ్రేయాన్" అని వ్రాసెను.

అనగా సర్వజ్ఞముని చెప్పిన ప్రకారము నిరతిశయసుఖము స్వర్గము కాదు, "మోక్షమే" ఈ విషయమున సందేహములు ఉండకూడదని ఆయన తరువాతి కారికలో స్పష్టముగా చెప్పెను.

***నిరతిశయసుఖం చ దుఃఖజాత వ్యుపరమణం***
***తు వదన్తి మోక్షతత్త్వమ్***
***ఇతి భవతి వినా ప్రమాణమస్మిన్***
***స్ఫుటతరమస్య సదాస్తి మోక్షవాఞ్ఛా॥***

నిరతిశయసుఖము అనగా అన్ని విధములగు దుఃఖములును నశించుట. ఇట్టి సుఖము మోక్షమే, మరియొకటి కాదు. కావున ఇక ప్రమాణములు ఇవ్వనక్కర లేదు. ఈ ప్రపంచమున అన్ని ప్రాణులను మోక్షమునే కోరును అని రుజువగుచున్నది.

ఈ జగమునందలి అన్ని ప్రాణులకును ఈ కోరిక కలుగును అని పైన వ్రాయబడినది. ఈ ప్రాణి శబ్దము యొక్క యథార్థమగు అర్థమును విచారింతము. మనుష్యుని పరమేశ్వరుడు అన్ని ప్రాణులకంటెను ఎక్కువ బుద్ధిని ఇచ్చి సృష్టించెను. ఆతడు సాతిశయాది దోషములను విచారించి విషయజన్యసుఖము వైపునకు వెళ్ళకుండ మోక్ష సుఖము వైపునకు ప్రవృత్తుడగును అని అంగీకరించవచ్చునేమో! కాని ప్రతి ప్రాణియు మోక్షసుఖమును కోరి, దానికొరకు ప్రయత్నించునని అంగీకరించుట ఎట్లు? ఈ సందేహము మామూలే. దీనికి

సమాధానము చెప్పుటకు ముందు సుఖ దుఃఖములను వివరించెదము.

***సర్వం పరవశం దుఃఖం సర్వమాత్మవశం సుఖమ్ /***
***ఇతి వ్యాఖ్యా సమాసేన సర్వత్ర సుఖదుఃఖయోః//***

పరాధీనత కొంచెమైనను దుఃఖకరమే. స్వతంత్రము సుఖము. ఇదియే సుఖ దుఃఖముల సంక్షిప్త వ్యాఖ్య.

ఈ వ్యాఖ్యను సూక్ష్మ బుద్ధితో ఆలోచించినచో ఇది యథార్థము అని తప్పక తెలియును. దీని యాథార్థ్యమువలె పశుపక్షి కీటాది ప్రాణులన్నియును మోక్షాభిముఖములే అనునది యథార్థము అని నిశ్చయింపబడును. వానియందు అంత బుద్ధి వైశద్యము లేనందున తెలిసికొనలేక పోయియుండవచ్చును. కావుననే ఆదియందు 'తెలిసియో, తెలియకయో' అను పదములు వాడబడెను. ఎంతయో సుఖముగా పంజరములో నుంచి పెంచవలెనను తలంపుతో

పిట్టను పట్టు కొనబోయినచో ఆ పక్షి అరచును. ముక్కుతో పొడుచును. ఇట్లు ఎన్నియో చేయును. చివరకు తన కంటె ఎక్కువ శక్తి కల వాని చేతిలో లొంగిపోవును. “**జీవన్నరో భద్రశతాని పశ్యేత్**.” జీవించు నరుడు మంగళములను పొందును అని ఆలోచించి జీవించి ఉన్నచో వీలు దొరికినప్పుడు పారిపోగలనని బంధనమును అంగీకరించును. ఏ కొంచెము వీలు దొరకినను పారిపోవును. ఎంతయో కాలము పెంచిన తరువాత పశుపక్ష్యాదులకు పరాధీనతలో సుఖభ్రాంతి కలుగును. లేళ్ళ గుంపులో పెంచబడిన సింహపు పిల్ల కూడ నేను లేడి పిల్లను అను భ్రాంతి కలిగి నక్కకు కూడ బెదరును. యథార్థమునకు ఏ పశువు కాని, పక్షి కాని పరాధీనతలో సుఖము కలదని తలచదు. పశుపక్ష్యాదులు కూడ స్వాతంత్ర్యమునే కోరును. “**సర్వ ఏవ జన్తుః**” అను పదములు సక్రమముగనే ఉన్నవి. మనుష్యులే కాదు, పశుపక్ష్యాది

ప్రాణులన్నియును కూడ నిరతిశయ సుఖము కొరకును, దుఃఖ ధ్వంసము కొరకును ప్రయత్నించును. ఈ సుఖదుఃఖాభావమే మోక్షము. కావున ప్రతి ప్రాణియు మోక్షాభిముఖమే అనునది నిర్వివాదము. "తెలిసియో, తెలియకయో" అను పదములు మూలమునందు కలవు. మానవులలో కూడా పామరులను, అతి ప్రాకృతులును అగువారు కడుపు నింపుకొనుటయే పరమార్థము అని తలచెదరు. వారు అందరును తమంతట తాము మోక్షాభిముఖముగా పవర్తించెదరనునది అంగీకరించబడదు. ముముక్షువులు మాత్రమే మోక్షాభిముఖప్రవృత్తిని కలిగియుందురని తెలిసి కొనెదము.

ఈ విధముగా మోక్ష ప్రాప్తి కొరకు ప్రయత్నించు ప్రాణులన్నిటికిని పరమ కృపాపరుడగు పరమాత్ముడు సంసార సాగరమును దాటుటకు ధృఢమగు నౌక అనబడు మనుష్య శరీరమును, ఉపదేశకులగు

మహాత్ములను నావికులను, వేద శాస్త్రాది సాధనములను సృష్టించెను.

**నృదేహమాద్యం సులభం సుదుర్లభం ప్లవం సుకల్పం గురుకర్ణధారమ్ /**
**మయాను కూలేన నభస్వతేరితం పుమాన్భవాబ్ధిం న తరేత్స ఆత్మహా //**

ఇంతవరకు ప్రయత్నము సులభ సాధ్యము. కాని ఇటు తరువాత మరల మనుష్యశరీరము లభించుట చాలా కష్టము. ఈ మనుష్య శరీరము బలమైన పడవ వంటిది. దీని గురువు ఉపదేశకుడను నావికుడు కలడు. నేను (భగవానుడు) అనుకూల వాయువు. వేద శాస్త్రముల ద్వారా సన్మార్గమున నడిపించెదను. అయినను సంసార సాగరమును తరించని వాడు తన జాతిని నశింపుచేసికొనును. ఆత్మ హంతకుడు. ప్రాణులకు జీవన సమానమగు జల ప్రవాహమును కొనిపోవు గంగాది మహానదులకు ఒక వైపు నుండి మరియొక వైపునకు పోవుటకు

రెండు మూడు క్రోసుల దూరమున వంతెనలు కట్టబడి యుండును. మధ్యమధ్య నౌకలు ఉండును. అయినను తన సోమరితనముచే ఏ మానవుడైనను తన బాహుబలము నందు నమ్మకము కలిగి మిథ్యాహంకారముచే ప్రవాహమును ఈది దాటవలెను తలపుతో వానిలో మునిగి చనిపోయినచో జల ప్రవాహమును దూషించవచ్చునా? అదే విధముగా సృష్ట్యాది నుండియును మానవులకు పరమ కృపా సముద్రుడు సంసార సంతరణము కొరకు వేదాది శాస్త్రములను రచించెను. చదువుకున్న తల్లి తన కుమారుని ఎంతయో కష్టముతో పెంచి పెద్ద వానిని చేయును. చదువుకొన్న తండ్రి ఆతనికి వినయము, వివేకము, విద్య నేర్పుటకు ప్రయత్నించును. ఆతడు పూర్వ జన్మము నందలి మహాపాపములచే తండ్రిపై శ్రద్ధా భక్తులు కలిగియుండక ఆతని అధీనములో వినయ, వివేక, విద్యాదులు గ్రహించక పోయినచో తండ్రి ఏమి చేయును?

ఇదే విధముగ ఈశ్వర రచితములగు శాస్త్రములయందు అభిరుచి లేకపోవుట తన కర్మ దోషము.

ఈ శాస్త్రములే ఈశ్వర నిర్మితములగు వేదోపనిషత్తులు. అవి చాలా విశాలమైనవి. క్లిష్టమైనవి. అవి ఎల్లరకు సంపూర్తిగా లభించవు. కావున అనేక మంది ఆచార్యులు వారిపై భాష్యములు, టీకలు మొదలగునవి వ్రాసిరి. అవి మానవులను అందరిని శ్రేయోమార్గమునకు కొనిపోవును. కాని ప్రాకృత జనులే ఈ టీకలను భాష్యములను తెలిసికొన లేరు. ఇట్టి ప్రాకృత జనులే ఎక్కువమంది కలరు. వారి యందు కూడ ముముక్షుత్వము ఉండును కదా! వారికి కూడా ఏదో ఒక ఉపాయమును ఏర్పాటు చేయుట ఆ పరమ పిత కర్తవ్యము. అందు కొరకు ఆ పరమాత్ముడు మహాత్ములను అకారణ జగద్ధితైషులగు శాస్త్రానుకూల ఆచారపరులనుగా సృష్టించి యున్నాడు. అట్లు సర్వశాస్త్ర

సిద్ధాంతములను చదువుకొని వానిని ఆచరించు మహాత్ముల వద్దకు వెళ్ళి శ్రేయో మార్గమును గురించి చర్చించి వారి బోధనలను అనుసరించవలెను. మనువుకూడ చెప్పెను.

***"వేదోఽఖిలో ధర్మమూలం స్మృతిశీలే చ తద్విదామ్/"***

వేదములు, వేద వేత్తలు రచించిన స్మృతులను, వారి సదాచారములును ధర్మమునకు మూలము. కావున వేదములో చెప్పినట్లు ఆచరించవలెను. ఇతరులకు వేదమార్గచ్యుతులకు, వేదమార్గానుసరణమును ఆదేశించవలెను. మూలము ద్వారా వృక్షము రక్షించబడు నట్లు చ్యుతమగుచున్న ధర్మమును రక్షించునవి వేదములు, వేదానుకూలములగు ఉపదేశములును, అనుసరించు వేదవేత్తలును మాత్రమే. వీరు ధర్మమునకు మూలము. ఉత్తములగు మహాత్ములు దొరకుట దుర్లభము, నేడు జగత్తునందు పూజలను పొందుటకు మహాత్ముని స్వరూపములో ఆశ్రమములను

పాడుచేయు వారు చాలమంది కలరు. ఇది ఈ పుస్తకమునందు చాల చోట్ల వ్రాయబడినది. ఇక వివరించ నవసరము లేదు.

అదృష్టవశమున నరసింహ మెహతా వంటి మహాత్ములు ఉద్భవించుచుందురు. శ్రీకృష్ణ పరమాత్ముని విహార స్థానమగుటచే ఇతర దేశముల వారు కూడ ద్వారకాపురి యందు సహజమగు ఆకర్షణమును పొంది అనేకమంది మహాత్ములు ఇక్కడికి వచ్చెదరు. ఇట్టి మహాత్ములలోని వారే శ్రీ ప్రకాశానంద స్వామి వారును, శ్రీ నిత్యానంద స్వామి వారును. వారి ప్రసంగములు ఈ గ్రంథమున చేర్చబడినవి.

ఆవు యొక్క శరీరమంతటన పాలు ఉండును. కాని దూడ యందలి స్నేహముచే స్తనములలో వారిని కేంద్రీకరించును, కాని ఏ మూర్ఖుడైన స్తనములను కోసి పాలు తీసికొనదలచిన పాలకు బదులు రక్తము వచ్చును. మహాత్ములకు కూడ పక్షపాతము ఉండును

అనునది ఎవరు కాదనలేరు. భారవిని పరికింపుడు.

***నిరుత్సుకానామపి యోగభాజాం భవన్తి భవ్యేషు హి పక్షపాతాః/***

నిష్పక్షపాతులనబడెడు యోగులు కూడ ఉత్తమ జనులయందు పక్షపాతమును కలిగియుందురు. భాష్యకారులు కూడ చెప్పిరి.

***తత్త్వ పక్ష పాతో హి ధియా, స్వభావః /***

తత్త్వము అనగా సార పదార్థము, ఉత్తమ పదార్థము, దాని యందలి ఆకర్షణ ప్రేమ కలిగియుండుట ప్రకృతికి సంబంధించిన గుణము. పక్షపాతమనగా తన భక్తుల యందు వాత్సల్యము యుండుట. ఈ వాత్సల్యముచే గోమాత వాత్సల్యమువలె వారు అమృత సమములగు దుగ్ధములవంటి తమ జీవితాంతపు కఠిన తపః ఫలమగు శాస్త్ర సిద్ధాంతామృతమును భక్తులచే పానము చేయించెదరు. అధికారి భేదముచే అందు మార్పు కలుగును. భాగవతము నందు పృథుమహారాజు పృథ్వీదోహనము చేసిన

తరువాతి ప్రకరణమున వ్రాయబడినది. ఋషులు బృహస్పతిని దూడగా చేసి ఇంద్రియములనెడు పాత్రయందు పవిత్రమగు వేదరూపమగు దుగ్ధమును పితికిరి. దైత్యులు ప్రహ్లాదుని పాత్రగా చేసి ఇనుప పాత్రలో మద్యమును పితికిరి.

ఒకే భూమాతయను ఆవు నుండి దోహనకర్తలు పాత్రవత్స భేదముచే తమ తమ అభిరుచుల ననుసరించి పితికిరి అని పై వాక్యముల నుండి రుజువగుచున్నది. ఉత్తములగు సాధువులును, మహాత్ములును తమ భక్తులకు శాస్త్రసారములగు అమృత తత్త్వమును పానము చేయించుదురు. పాత్ర భేదముచే ఫలితమునందు భేదము వచ్చినచో భవభూతి వాక్కు సార్థకమగును.

***వితరతి గురు ప్రాజ్ఞే విద్యాం యథైవ తథా జడే***
***న తు ఖలు తయోః జ్ఞానే శక్తిం కరోత్యపహన్తి వా /***

***భవతి చ పునర్భూయాన్భేదః ఫలం ప్రతి తద్యథా***
***ప్రభవతి శుచిర్బిమ్బోద్గ్రాహే మణిర్న మృదాం చ యః॥***

సహాధ్యాయులగు మేధావియు, మూర్ఖుడును ఉపాధ్యాయుని వద్ద విద్యాభ్యాసము చేయుదురు. బుద్ధిమంతుని మేధా శక్తిని ఎవరును పెంచలేదు. బుద్ధిహీనునది ఎవరును తగ్గించలేదు. ఏ విధమగు పక్షపాతమును లేకుండ ఉపాధ్యాయుడు ఇరువురకును చదువు చెప్పును. అయినను ఇరువురును సమానముగా చదువుకొనలేరు. తమ ప్రాకృతికమగు శక్తిని అనుసరించి వైషమ్యములు ఉండును. ఒకే పార్థివ పరమాణువులతో తయారగు రత్నమునకును, మట్టి బెడ్డకును భేదము లేదు. అయినను రత్నమునందు ముఖ ప్రతిబింబము కన్పట్టును. మట్టి బెడ్డయందు కన్పించదు. అయినను గురు ముఖము నుండి చేయబడు ఉపదేశమును విను అధికారము అందరకును ఉన్నను తమతమ శక్తిని

అనుసరించి ఉత్కృష్ట కృష్ట గ్రాహకత్వములను ప్రదర్శించును.

శాస్త్ర సిద్ధాంతములు కూడ ఇట్టివే. ఈ సిద్ధాంతములు ఈ వార్తాలాపమునకు దృష్టాంతములతో ప్రాకృత జనులు కూడ తెలిసికొన గలిగినంత సులభముగా తెలుపుటకు ప్రయత్నించబడినవి. వీనిని చదివి, ఆలోచించి ఆచరించు భావుకులకు కళ్యాణమగును.

***ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః/ భద్రం పశ్యే మాక్షభిర్య జత్రా రైర జైస్తుష్టువాగ్ం సస్తనూభిర్వ్యశేమ దేవహితం యదా యుః// స్వస్తిన ఇన్ద్రో వృద్ధ శ్రవాః/ స్వస్తి నః పూషా విశ్వవేదాః/ స్వస్తి నార్యో అరిష్టనేమిః/ స్వస్తినో బృహస్పతిర్దధాతు//***

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః||**

యాజకుని-పూజించు వానిని రక్షించు దేవతలారా! తమ కృపచే మేము చెవులతో కళ్యాణమును వినెదము గాక! నేత్రములతో

# ఉపసంహారము

కళ్యాణమును చూచెదము గాక! స్థిరావయవములతో స్తుతించు మాకు పూజ, ధ్యానము, జ్ఞానము దానము మొదలగు యజ్ఞములతో దేవతలకు మేలు చేయు ఆయువు లభించు గాక! కీర్తిమంతుడగు ఇంద్రుడు మాకు కళ్యాణకరుడగుగాక! విశ్వప్రకాశకుడగు జ్ఞాత-సూర్యుడు మాకు కళ్యాణము చేయుగాక! కళ్యాణ పూర్ణుడగు గరుడుడు కళ్యాణము కలుగ జేయుగాక! దేవగురువగు బృహస్పతి మాకు కళ్యాణకరుడగుగాక!

**ఓం శాంతిః శాంతిః శాంతిః||**